సహకార వ్యవసాయం

అనువాదం

జాస్తి జగన్నాథం

కిసాన్ బుక్ ట్రస్ట్, తెనాలి

ప్రథమ ముద్రణ ఏప్రిల్ 1959
సాదా ప్రతి 3.50
మేలు ప్రతి 5.00

మా మా ట

ప్రజాస్వామ్యం జయప్రదంగా కొనసాగాలంటే పౌరులలో సామాజిక, ఆర్థిక, రాజకీయ చైతన్యం పెంపొందటం అవసరం. దీనికి ఆచార్యరంగాగారి గ్రంథాలు ఎంతైనా తోడ్పడుతవి. వివిధ రాజకీయ పక్ష లక్ష్యాల అంతరార్థాలను చక్కగా గ్రహించి ప్రజలు తమకు శ్రేయోదాయకాలైన మార్గాలను నిర్ణయించుకొనటానికి ఈగ్రంథాలు సోపానాలు. అందువల్ల వీటిని ప్రకటించ బూనుకొని ముందుగా 'సహకారవ్యవసాయం' అన్న ప్రకృత గ్రంథాన్ని పాఠకులకు అందిస్తున్నాము.

సహకార వ్యవసాయ విధానం ప్రవేశ పెట్టాలని కాంగ్రెసు మున్నైన రాజకీయ పక్షాలు సంకల్పించి ప్రచారిస్తున్న యీ కాలంలో ప్రకృత గ్రంథం యొక్క ప్రాముఖ్యాన్ని మేము ప్రత్యేకంగా వివరించ నక్కరలేదు.

తమ గ్రంథాన్ని తెలుగులో అనువదించటానికి ఆమోదించిన శ్రీ ఆచార్యరంగా, శ్రీ పి. ఆర్. పరుచూరిగార్లకూ, పారిభాషిక క్లేశాల కోర్చి ఇతర క్లేశాలను అధిగమించి ప్రకృత రూపంలో ఆంధ్రాను వాదాన్ని అందజేసిన శ్రీ జాస్తి జగన్నాథంగారికిని, ఈ గ్రంథ ముద్రణకు కావలసిన ద్రవ్యసహాయం చేసిన శ్రీ వెనిగళ్ళ సుబ్బయ్యగారికిని మా హృదయపూర్వక నమస్కారాలు. వీరిలో ఎవరి సహకారం లభించకపోయి ఉన్నా యీ పుస్తకం పాఠక లోకానికి అంది ఉండేది కాదు.

తన శ్రేయస్సును గుర్తించిన ప్రజానీకం మా యీ ప్రయత్నానికి ఎల్లవిధాల ప్రోత్సాహమిస్తుందని మా దృఢ విశ్వాసం.

కిసాన్ హౌమ్,
తెనాలి.

పబ్లిషర్సు

తొలిపలుకు

"కో ఆపరేటివ్ ఫార్మింగు" ప్రపంచమందెచ్చటా జయప్రదం కాలేదు. దాని ద్వారా ఉత్పత్తి పెరుగుటలేదు, పంటల గిట్టింపు ఖర్చులు తగ్గుటలేదు. రైతుల కింతవరకు అందుచున్న (స్వల్పంగానైనా!) స్వతంత్రము కుంటుపడుచున్నది, తగ్గిపోవడమేగాక అదృశ్యమగుచున్నది; పైగా, ఆర్థిక దాస్య పిశాచమునకు అర్పణ చేస్తున్నదని లోకంపోకడ కాకి గోల చేస్తున్నది. ఇది సత్యమని యీ గ్రంథ పారాయణం తెల్పును. ఇంకెంతో చెప్పుచున్నా, ఈ అభివృద్ధి నిరోధకమార్గాన్నే అవలంబించాలనే మొండి పట్టుదలకే అంకితులైన రాచకీయ పెత్తందారులు, ఇది పనికిరాకపోతే, మరేది పనికివస్తుందో (alternative)తెల్పండనుటకు సాహసిస్తున్నారు.

అసలు ఇంకేదో కావాలనుకోవడం దేనికి? స్వాతంత్ర్యము పనికిరాదనేనా? ఆర్థిక స్వాతంత్ర్యము నిరర్థకమనియా? స్వంత ఉద్యోగమే, స్వయం కల్పిత వృత్తే అభివృద్ధి కనువుగాదనా? అలాగైతే కమ్యూనిస్టులు, ఫాసిస్టులు, పార్లమెంటరీ డెమ్మాక్రసీ పనికిరాదంటూ నియంతృత్వమే కావాలంటూ ఉండిరే, వారు గూడా మరింకేమి కావాలో చూపెట్ట మనిరే, వారికంటె యీ పెత్తందారుల ఆహ్వానం, సవాలు ఏ విధంగా మంచిది, అనుచరణీయం?

రైతాంగ వ్యవసాయమే చారిత్రికంగా ఈనాటి ప్రపంచ అనుభవ ఫలితంగా, అభివృద్ధిదాయకమైనది, అధికపంటల నివ్వగల్గింది. అత్యధిక సంఖ్యాకులైన శ్రామికులకు, ఆర్థిక స్వాతంత్ర్యము, మానసిక వికాసము, సాంఘికస్థాయి, మానవత్వమునకు మూలకందమగు స్వత్వము, స్వరాజ్యము, సుఖము, సంతోషముల ప్రసాదించగలదు. ఇది నిర్వివాదాంశము.

ప్రజాస్వామిక దేశాలన్నిటిలో రైతాంగ కుటుంబ వ్యవసాయ విధానాన్ని గౌరవిస్తున్నారు, బలపరుస్తున్నారు. సహకారోద్యమమును దానికి తోడునీడగా, అదనంపు "దన్ను" గా పెంచుతున్నారు. అంతేగాని రైతాంగ వ్యవస్థనే తొలగించుటకు, రైతుకుటుంబాల ఆర్థికస్థాయి, స్వాతంత్ర్యమును అపహరించుటకు దాన్ని పోటీగా నిల్పుటలేదు. అట్టి అభివృద్ధి నిరోధకమైన, చరిత్ర గుణపాఠానికి వ్యతిరేకమైన, స్వతంత్రమును దిగమ్రింగగల్గు ఉద్యోగుల నిరంకుశ పెత్తనాల కాలవాలమైన ధోరణిని—సహకార వ్యవసాయమును—మన రాచకీయపార్టీలే ప్రచారం చేయ సాహసిస్తున్నవి. సోవియట్ రష్యా యీ దౌర్భాగ్యధోరణికి 1921 లోనే దారి తీసింది. ఐతే యీ 38 సంవత్సరాల పిమ్మట, రైతాంగ కుటుంబ వ్యవస్థను తిరిగి తల యెత్తనిచ్చినది. తన సహకార వ్యవసాయ ధోరణి నిల్చిఉండాలంటే, రైతాంగ వ్యవస్థను గుర్తించి, అంగీకరించి, యీడు జోడుగా (co - existence) వ్యవహ

రించుటకు తలయొగ్గక తప్పినదికాదు. అచ్చట ప్రతి రైతు కుటుంబానికి అర్థ యెక రము నుండి రెండెకరాల వరకు ప్రత్యేక భూవసతి తిరిగి యిచ్చినారు. రైతులకు తమ సొంత కమతాలలోని పంటలు, పశువులు అమ్ముకొనుటకు స్వతంత్రము యివ్వవలసివచ్చినది. నలభై సంవత్సరాల వర్యంతం కోట్ల జనాలకు చెప్పరాని బాధలు కల్గించి, వారి ఆర్థిక స్వాతంత్ర్యమును అపహరించి, తుదకు తమ "సహకార వ్యవసాయం" బ్రతికి ఉండాలంటే రైతాంగ వ్యవస్థను తిరిగి పెరుగ నివ్వవలసిందే నమకుంటున్న రష్యాను చూచియైనా మన రాచకీయ పార్టీలు గుణపాఠం పొందవద్దా ? మనకు దక్కుచున్న ఆర్థిక స్వరాజ్య కళికలను భద్రపరచుకో వలదా ? మనకు బుద్ధుని బోధ లెలాచరిత్ర దయవల్ల అందినవని ఆనంద పడుచున్నామో, అటుపై రైతాంగ వ్యవస్థను కొగలించుకొని పెంచుకోవలదా ? అందరు ఒప్పుకొనేదే రైతులకు ఎన్నో అవసరా లున్నవని; ప్రభుత్వ సాయం కావాలని; పెట్టుబడులు పెరగాలని, చౌకపరపతి అందాలని; ఎరువులు, మంచి విత్తనాలు, మూగాణి, మురుగుపోయే వసతులు పెరగా లని !! గిట్టింపు ధరలు అవసరం; అదనపు పంటల నిల్వచేయగల్గటం జరుగాలి ! ఇన్ని మరెన్నో వసతులను కల్గించవలసిన బాధ్యత ప్రభుత్వం, స్వయంగా సకలార్థ సహకార సంఘములద్వారా శిరసావహించాలి ! అట్టి అభివృద్ధిదాయక కార్య క్రమాలకై స్వరాజ్యావతరణ కోరితిమి. స్వరాజ్యం వచ్చినపిదప అందులకు మన ప్రభుత్వాలు పూనుకోగల్గుచున్నవా ? ఈ సమయాన విశ్వాసరాహిత్య తీర్మానం రైతాంగ వ్యవస్థపైకాదు; రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలమీద ప్రజలు ప్రయోగం చేయడం తగును. ప్రపంచమందలి ఇతర ప్రభుత్వాలకు పోల్చుకుంటే, మన ప్రభు త్వాలు కుంటికాలే వేస్తున్నవి. ఆ బలహీనతను కప్పిపుచ్చుకొనుటకా వీరంతా రైతాంగ వ్యవస్థపై దూకుడు చేస్తున్నారు ?

రైతులు తదితర సొంత వృత్తులవారి ఓటులపై రాజ్యాధికారం పొందిన యీ పెద్దలు, యీ అశేష జనాల ఆర్థిక స్వాతంత్ర్యాపహరణకై "ప్లాను" వేస్తూఉంటే, చూచి ఊరుకోగలమా ? జాయింట్ కో ఆపరేటివ్ ఫారమ్ పెట్టి, అందు భూముల చేర్చినవారందరికి పట్టాలిస్తారట ! నాల్గైదు సంవత్సరాలలో ఆ పట్టాలను గుర్తించుట మానరనగలమా ? శతాబ్దాలతరబడి స్థిరపడియున్న భూస్వామ్యము, స్వంతవృత్తి మనుగడనే ఇంతబాధ్యతా రహితంగా రద్దుచేయడానికి పూనుకోగల పార్టీలు, ప్రభు త్వాలు బైలుదేరినప్పుడు, తన సొంతమనే తత్పరతకు దూరమైన సర్టిఫికెట్లు (divorced from function) దారం తెగిన గాలిపటములుగా మారిపోవా ? తరతరాలుగా, అన్ని ఆస్తులకంటె స్థిరమైన, నమ్మకమైన, సులభంగా మార్చరాని అస్తిగా పట్టా భూములను కొన్నారు కోట్లకొలది రైతాంగం. తమ నిల్వ సొత్తును, శ్రమను, చెమటను, ఆశలను భూదేవి రూపేణా చేర్చుకొన్నారు, చూచుకొన్నారు,

పూజించుకొన్నారు. అట్టి అచంచలమైన ఆస్తులు తమ స్వాధీనంనుండి పోతుంటే, వాటికి బదులు రైతాంగముయొక్క హృదయాలు కుళ్ళిపోవా? అలాగా పదిహేను కోట్ల రైతులు దిగులుపడి, దిగాలునబడి, క్షీణించి పోవుట దేశారిష్టముకాదా? అది చూచి ఊరుకోగలమా? ఆ ఉపద్రవాన్నుండి రక్షించుట దేశాన్ని, ప్రజలను, మానవత్వాన్ని ప్రేమించువారందరి ధర్మము కాదా?

శ్రీ జవహర్‌లాల్, ప్లానర్లు యీదేశారిష్టమగు అభివృద్ధి నిరోధకమగు ధోరణిలో ఉంటున్నారని తెలియ వచ్చినప్పటినుండి మన దేశస్థుల హెచ్చరించుచునే యున్నాను. ప్రథమ పంచవర్ష ప్రణాళిక పార్లమెంటులో చర్చకువచ్చినప్పుడె, 1952 లోనే, దీన్ని నేను యెదిరించితిని. తిరిగి 1957 లో రెండవప్లాను రాచకీయ వాతావరణంలోకి వస్తున్నప్పుడే, పార్లమెంటులో పార్టీనాయకుల సభలో యెదిరించి నాను మస్సూరీలో 1955 లో సహకార మంత్రుల సమావేశములో, చైనాకు భారత సహకారుల రాయబారం పంపించాలనుకుంటున్నప్పుడే తిరిగి 'ఖబడ్దార్' అంటిని. ఆనాటి ప్లానింగు మంత్రి నందా ధోరణిద్వారా, జవహర్‌లాల్‌గారి తత్వం తిరిగి ప్రదర్శితమైతే, ఆ వెంటనే "అఖిలభారత సహకార యూనియను జర్నలు"లో ఆ సహకార వ్యవసాయంవల్ల కలుగగల్గు ఉపద్రవాలనుగురించి వ్యాసం వ్రాసితి ఆ పిమ్మట శ్రీ పి. ఆర్. పరుచూరియొక్క సహకారంతో సంవత్సరాలపర్యంతం, ఆ వ్యాసమందు ఉదహరించబడిన సూత్రాలు, ధర్మాలపై చదువులు, చర్చలు, పరిశోధనలుచేస్తూ ఉండుటవల్ల తయారైనదే యీ గ్రంథము.

ఈ గ్రంథము పాండిత్యముపై, ప్రపంచపు అనుభవాలపై, ప్రజాభ్యుదయం, సత్యాన్వేషణ కోరుచున్న తపస్సుపై ఆధారపడియున్నది. కనుకనే ప్రొఫెసరు షెనాయ్‌గారు ఇది చదివిన తరువాతైనా ప్లానర్లు తమ పిచ్చిసవాలును ఉపసంహరించుకొంటారేమో; రాచకీయ పెత్తందారులు తమ రైతాంగ వ్యతిరేక ధోరణిని మానుకొంటారేమోనని ఆశించిరి. అది నిరాశయైనది.

అఖిలభారత కాంగ్రెసువారి "ఆర్థిక బులెటిన్" వారు యీ గ్రంథపు ఆలోచనలను ఎదుర్కొనుట దుస్తరమని వ్రాసిరి. ప్రభుత్వపు "యోజనా" పత్రిక యీ గ్రంథపు పాండిత్యాన్ని, రంగా అనుభవాన్ని, ఆలోచనలను గమనించక తప్పదన్నది. ఆ పిమ్మటైనా, కాంగ్రెసుపెద్దలు తమ వైపరీత్యపు ధోరణిని వదలుకొందురేమోనన్న ఆశలు విఫలమైనవి.

తుదకొక రాజీపద్ధతిని మార్చి 7 వ తేదీన శ్రీ జవహర్‌లాల్‌ను, నేను ఢిల్లీలో కలుసుకొన్నప్పుడు సూచించినాను. మా ఇద్దరికి తీరరాని అభిప్రాయభేదాలీ వ్యవహారంగురించి ఉన్నప్పుడు, ఇటు యీ రైతాంగకుటుంబ వ్యవసాయ వ్యవస్థను,

అటు సహకారవ్యవసాయ వ్యవస్థను,ఒకదానితో ఒకటి పోటిపడుచూ, ఎవ్వరికెయ్యది యిష్టమో ఆ విధంగా రైతులు వాటిని ఉపయోగించుకొనగల రాజకీయ, ఆర్థిక, సాంఘిక వాతావరణం నిర్మించుకొందామని; అంటే Coexistence in healthy competition. దానికి ఆయన ఒప్పుకోలేకపోయిరి. అంటే మొండితనంగా రైతాంగవ్యతిరేక ధోరణిలోనే తమ పెత్తనాన్ని నడుపాలనే స్ఫురించుచుండెను. దానికి నేను సుతరాం అంగీకరించజాలనంటిని.

ఇంతకు, యీ పుస్తకాన్ని వ్రాసినవారు, తర్జుమాచేసినవారు, ప్రచురిస్తున్న వారు పండితులు, శాస్త్రపరిశోధకులే. కనుక రాచకీయ మొండితనాలను వదలి, వాస్తవమైన పరిశోధనలద్వారా (Experimental) సహకార వ్యవసాయం, రైతుల ఆర్థిక అభివృద్ధికి, స్వతంత్రానుభవానికి, కుటుంబస్థాయికి, దేశ సర్వతో ముఖాభివృద్ధికి వ్యతిరేకమని మా విశ్వాసం. కాదని ఋజువుచేసే బాధ్యత దాన్ని రాచకీయబలంద్వారా ప్రజలపై రుద్దాలనుకొనే వారిదే! దేశీయ ప్రజలకు రాచకీయ సంపాదనోద్యమంలో మా శక్తికొలది శ్రమించితిమి. ఇప్పుడో దేశీయరక్షణ, అభివృద్ధికి ఆధారమగు, అశేషజనాల స్వయంవృత్తి, ఆర్థిక స్వాతంత్ర్యము, నైతిక స్థాయినినిల్పి, పెంచి, రక్షించుటకై తిరిగి త్యాగధనాన్ని తెంపును ప్రదర్శించవలసి వస్తున్నది. సత్యముకొరకై నిలబడవలసిన సమయమిది. ఈ ఆర్థిక, సాంఘిక స్వాతంత్ర్యోద్యమమందు అందరం చేరుకుందాం! మహాత్ముని ఆశయాలను, దీన జనాల ఆశలను, స్వాధీన వృత్తి ప్రజల సుఖ, సంతోషములను రక్షించుకొందాం.

ఈ మా ఆంగ్ల గ్రంథాన్ని అధిక ప్రయాసలకోర్చి చక్కని తెలుగులోకి తర్జుమాచేసి యిచ్చిన పత్రికా రచయితలు శ్రీ జాస్తి జగన్నాథంగారికి, పుస్తక ప్రచురణ కర్తలు కిసాన్ బుక్ ట్రస్టు వారికి, ప్రచురణార్థము ద్రవ్యసహాయం చేసిన భారత రైతుఉద్యమాభిమానులు నా సహచరులు శ్రీ వెనిగళ్ళ సుబ్బయ్య గారికి, వారి కుటుంబానికి నేను కృతజ్ఞుడను.

నాగపూరు కాంగ్రెసుసభ (జనవరి 1959) నుండి చెలరేగుచున్న ఆందోళనలో రైతులు, రైతాంగ ఆర్థిక—సాంఘిక వ్యవస్థ. స్వాధీనవృత్తులు, స్వతంత్ర ఆర్థిక జీవిత రుచులనుండి కలకాలం అనుభవిస్తున్నవారు, ఈ గ్రంథపఠనంద్వారా, తమ రక్షణమార్గాన్ని చూచుకొని, స్వధర్మ, స్వతంత్రరక్షణకై కృషి చేయుదురుగాత!

విజయవాడ,
2–4–59.

రంగ

ముందుమాట

సహకార వ్యవసాయం గురించి ఇటీవల దేశంలో రేగినదుమారం, తర్జన భర్జనల దృష్ట్యా ఈ ముందుమాట చెప్పవలసి వచ్చింది. నాగపూరు కాంగ్రెసులో సహకారవ్యవసాయాన్ని గురించి తీర్మానం చేసినప్పటి నుంచి ఈ రగడ మరీ పెరిగింది. ఆలోచనపోయి ఆవేశం ఎక్కువయింది. పట్టుదలలు మితిమీరినవి. సమస్యాపరిష్కారానికి ఆవేశోద్రేకాలు మార్గం కాదని అందరకు తెలుసు; ఆచరించేవారు మాత్రమే కనిపించటం లేదు. సహకార వ్యవసాయం ఎందుకోసం కావాలంటున్నాం? ఏ ఆదర్శ సాధనకు దాన్ని రూపొందించ బోతున్నాం? దీనికి ఆచరణ విధానం ఏమిటి? ఎలాంటి ఫలితాలు వస్తాయి? ఇత్యాది ప్రశ్న లనేకం ఉన్నవి. సమాధానాలే దొరకటం లేదు.

'దేశం ముందుకు పోవటమో వెనకకు పోవటమో దీనితోనే తేలి పోవాలి. ఏది ఏమైనా, సహకారవ్యవసాయం అమలుజరిగి తీరవలసిందే' అని ఒకరు! 'అసలు కాంగ్రెసు భవిష్యత్తు ఏమిటో సోషలిస్టుసంస్థో లేక బూర్జువా సంస్థో ఈ ఆశయం మీదనే తేలాలి. దీనితో అంగీకరించలేని వారు కాంగ్రెసునుంచి వెళ్ళిపోవటం మంచి'దని మరొకరి ఉవాచ. 'ఇదికాకపోతే కమ్యూనిజమే' అని ఇంకొకరి బెదరింపు. 'ఇది ప్రవేశపెట్టటమె జరిగితే అంతర్విప్లవం, రక్తపాతం తప్పవని ఇటువైపునుంచి ఒక హెచ్చరిక. ఈ సమస్యపై ఇంతటి ఉద్రేక వాతావరణం పెరిగింది. దేశం రూపురేఖలు దీనిమీదనే ఆధారపడిఉన్నమాట వాస్తవమే. ఈ దేశంలో అత్యధిక సంఖ్యాకులైన వ్యవసాయజీవుల జీవిత విధానాన్నే మలిచివేసే సమస్య కావటంచేత ఈ ప్రాధాన్యం దీనికున్నది. కాని ఈ మలచటం ఎటువైపుకి మలవబోతున్నాం అన్నదగ్గరే భేదాభిప్రాయా లున్నవి.

ఈ ఆవేశాలవలన మాటాడే మాటలకు అర్థం కూడా లేకుండా పోతున్నది. సహకారవ్యవసాయాన్ని విమర్శించే వారంతా స్వార్థపరులని ఒక విసురు. మనం చెప్పినది కాదనేవారంతా స్వార్థప్రేరితులే! 'వెస్టెడ్ ఇంటరెస్ట్' తోనే అలాచేస్తున్నారు! సహకార వ్యవసాయంవలన ఇవిగో ఇన్ని నష్టాలు అనర్థకాలు రాగలవని వాస్తవస్థితిగతులను, అనుభవాలను,

చరిత్రను ఉదహరించి చూపుతున్నప్పటికి వీటికి సమాధానం చెప్పరు. ఆవేశంతో దీర్ఘోపన్యాసాలివ్వటం పైగా ప్రతివాదుల విమర్శలలో పదజాలం తప్ప పస లేదనటం, అదీ కాదంటే స్వార్థప్రేరితు లనటం మాత్రం జరుగుతున్నది. ఈ స్వార్థ ప్రేరితులన్న విమర్శలు తిరిగి అప్పగించటం ఏమంత కష్టంగాదు. స్వతంత్రంగా జీవిస్తున్న రైతుల మీద అధికారం చలాయించే అవకాశం ప్రభుత్వానికి ఆట్టే లేదు. ప్రభుత్వోద్యోగులవలె రైతులు అధికారులకు లోబడి వారి చెప్పుచేతులలో ఉండనవసరంలేదు. అందుచేత దేశంలో అత్యధిక సంఖ్యాకులు మనకు లోబడి ఉండటం లేదన్న అధికార దాహంతో ఈ విధానాన్ని రూపొందిస్తున్నారని, దీని ద్వారా ఆ వాంఛ నెరవేర్చుకొనటానికే దీనిని ప్రవేశ పెట్టుతున్నారని విమర్శించటం ఇవతలివారికి చేత కాకపోదు. దీనిలో వాస్తవం కూడ లేక పోలేదు. కనుక మనకు నచ్చని మాట చెప్పిన వారల్లా స్వార్థపరు లనటం తగదు. ఆ మాట అనటానికి అందరకు అవకాశం ఉంటుంది. చెప్పే విషయంలోని ఉచితానుచితాలను బట్టి విమర్శలు కొనసాగటం అవసరం.

ఇదికాకపోతే కమ్యూనిజమే అని మరొక బెడరింపు. అసలు ఇది కమ్యూనిజం కాదా అనేది ప్రశ్న. దేశంలోని ప్రతిదాన్ని జాతీయం చేస్తున్నది ప్రభుత్వం. పిల్లల చదువుల దగ్గరనుంచి, ఆలోచనల దగ్గరనుంచి జాతీయ కరణ ప్రారంభమైంది. కమ్యూనిజాన్ని నిరోధించవలసిందె. కాని కమ్యూనిస్టులు అధికారంలోకివస్తే చేసేపనులనన్నింటిని మనమే చేసి కమ్యూనిజాన్ని నివారించా మనుకోవటం ఆత్మవంచన.

ఇతర దేశాలలో — ముఖ్యంగా కమ్యూనిస్టు దేశాలలో ప్రవేశపెట్టిన సమిష్టి వ్యవసాయానికి ఇక్కడ రూపొందబోతున్న సహకార వ్యవసాయానికి అనంత వ్యత్యాసం ఉన్నదంటున్నారు. వీటి రెంటికిఉన్న భేదాలను గమనించలేనివారు, గమనించనివారు సహకార వ్యవసాయం నియంతృత్వానికి దారితీస్తుందని విమర్శిస్తున్నారు అని ఒక విసురు. సహకారసమిష్టి వ్యవసాయ విధానాల భేదాలుకూడ విమర్శకులకు అర్థంకాలేదనుకోవటం మనలోని అహంకారానికి గుర్తు. నాకు తప్ప మరెవరికి ఏమీ తెలియదన్న ధోరణి దీనిలో ద్యోతక మవుతున్నది.

'కమ్యూనిస్టుదేశాలు సహకారవ్యవసాయాన్ని ప్రవేశ పెట్టినంత మాత్రాన అది వారి సొంతసొమ్ముకాదు. దానిని మనం ప్రవేశపెట్ట టంలో భయపడ నవసరంలేదు. మన అవసరాలకు, ఆదర్శాలకు తగి నట్టుగా ఉన్నప్పుడు మనం మాత్రం ఎందుకు అనుసరించరాదు' అని మరొకవాదం చేస్తున్నారు. కమ్యూనిజానికి వెనుక ఒక తత్వశాస్త్రం ఉన్నది. ఆ తత్వాన్ని ఆచరణలో పెట్టటానికి ఒక నిర్దిష్ట జీవితవిధానం, సంఘం కావాలి. ఆ నిర్దిష్ట జీవితవిధానాన్ని సాధించటానికే వారు సహ కార వ్యవసాయం చేపట్టారు. మనం ఆశిస్తున్న జీవితవిధానం వేరని, సోషలిస్టు పద్ధతి సమాజ స్థాపన మన ఆదర్శం అని ప్రతి దినం పదేపదే ఉద్ఘాటిస్తున్నాం. మరి వారి మార్గమె మనకు కూడ మార్గమా? ఈ మార్గంతో కమ్యూనిస్టుదేశాలు తమ ఆదర్శాన్ని - అంటె శ్రామిక నియం తృత్వాన్ని-చేరుకొన్నవి. అదేమార్గం మనకు ప్రజాస్వామ్యాన్ని అందించ గల దనటం హాస్యాస్పదం. అందుచేత వారు చేశారు కనుక మనం చేయ రాదని ఎక్కడున్నది? అని విమర్శలకు దిగి లాభంలేదు. ఈ చేసేపని ఎక్కడకు పోతుందో దూరదృష్టితో చూడాలి.

ఈనాటి స్థితిగతులను, మనదేశ వ్యవసాయరంగాన్నిబట్టి చూచి నప్పుడు సహకారవ్యవసాయంతో తప్ప మరొక విధంగా వ్యవసాయాన్ని సంస్కరించటం సాధ్యంకాదని, వేరొకమార్గం లేదని కొన్ని ఉపన్యాసాలు వచ్చినవి. ప్రజాస్వామ్యానికి ఇలాంటి భావాలకు చుక్క ఎదురు. ఏ ఆద ర్శాన్ని సాధించటానికైనా అనేక మార్గాలుంటాయని ప్రజాస్వామ్యం విశ్వ సిస్తుంది. జ్ఞానం అనంతంకావటంచేత ఎన్నో మార్గాలకు, ఎంతో అభి వృద్ధికి అవకాశం ఉన్నదని ప్రజాస్వామ్య మూలసిద్ధాంతం. ఇది తప్ప మార్గంలేదు అనటం ఇంతకుమించి జ్ఞానం లేదనటమె అవుతుంది. పైగా మానవునిలోని సృజనశక్తికి, జ్ఞానాన్వేషణకు, పరిశోధనా శీలానికి అర్థం పోతుంది

సహకార వ్యవసాయాన్ని విమర్శించే వారందరు భూస్వామ్య సంస్క రణలకు వ్యతిరేకులని, భూస్వాముల ప్రతినిధులని మరొక విమర్శకూడ చేస్తున్నారు. భూస్వామ్య సంస్కరణలువద్దని ఎవరు అనటంలేదు. భూవస తులకు గరిష్ఠ పరిమితులు పెట్టవలసిందె. కాని ఒక్క వ్యవసాయాదాయా-

నికే ఎందుకు పరిమితి విధించాలో తెలియదు. ఇతర రంగాలలో దోపిడి లేదనా? అవన్నీ పవిత్రంగాఉండి వ్యవసాయరంగం మాత్రమే సంఘాన్ని కృంగదీస్తున్నదనా ? ఏకారణంచేత ఇతరరంగాలను వదలివేస్తున్నారు? కొందరు ఎంతైనా సంపాదించుకోవచ్చు, మరికొందరి చేతులకు సంకెళ్ళు వేయా లనటంలో అర్థం ఏమిటి? అందరి ఆదాయాలకు పరిమితిపెట్టండి; భూ వసతులకుకూడ గరిష్ఠపరిమితి విధించండి. ఇలా అన్నంతమాత్రాన భూస్వాముల ప్రతినిధులనటానికి ఆధారమేమిటో అర్థం కావటం లేదు.

ఇది ఇలా ఉండగా 'వ్యవసాయాదాయాలకు మేము పరిమితులు పెట్టబోవటంలేదు. భూమికిమాత్రమె పరిమితి విధించబోతున్నాం' అని ఒక వివరణ ఇచ్చారు. అయినప్పుడు ఇంత భూమి గరిష్ఠ పరిమితి అని నిర్ణయించటానికి ఆధారం ఏమిటి? ఆదాయాన్ని లెక్కకట్టి భూవసతికి పరిమితి పెట్టబోతున్నారు. వీటి రెంటికి పొత్తు ఎలా కుదురుతుంది. భూ విస్తీర్ణాన్ని ఆధారంగా తీసికొని గరిష్ఠ పరిమితి నిర్ణయిస్తే ఈ వివరణకు అర్థం కుదురుతుంది. అలా చేస్తారామరి ? దేశంలోని అన్నిప్రాంతాల లోను ఎక్కడైనా సరే ఒక పాతిక ఎకరాలో మరెంతో కొంత విస్తీర్ణంకల భూమి గరిష్ఠ పరిమితి అని నిర్ణయిస్తారా ? అలాచేయరు. ఆదాయాలను లెక్కకట్టి 3600 రూపాయలు నికరాదాయమా లేక 5000 రూపాయలు నికరాదాయమా అన్నచర్చలు సాగుతుండటమే దీనికి తార్కాణం. కాబట్టి ఈ వాదంలో బలంలేదు; యథార్థంకూడ లేదు. అన్నిరకాల ఆదాయాలకు పరిమితులుపెట్టే ధైర్యం లేకపోగా విమర్శకులు అభ్యుదయ నిరోధకులని గుక్కతిరగని ఉపన్యాసాలా ?

అధికోత్పత్తి సాధన సహకార వ్యవసాయ ప్రధానాశయం అంటున్నారు. కాని ఇది ఎలా సాధించగలరో చెప్పలేరు. వ్యక్తికంగా కుటుంబ వ్యవసాయం చేసికొన్నప్పటికంటె సహకార వ్యవసాయంలో పంటలు ఎక్కువ పండుతాయనటానికి ఆధారం ఏమిటో బోధపడదు. పెద్ద పెద్ద క్షేత్రాలను ఏర్పాటుచేసి వ్యవసాయాన్ని యాంత్రికీకరణ చేస్తారా ? చేయవచ్చు. కాని ఈ విధానంవల్ల ఎంతోమంది నిరుద్యోగులు కాక తప్పదు. ఉన్న నిరుద్యోగులకు పనిపాటలు చూపించలేక పోతు మరి కొంతమందిని

నిరుద్యోగులనుచేసి సాధించేదేమిటి? యాంత్రికీకరణ చేయం అంటే సహకారవ్యవసాయంతో వచ్చే అదనపు అవకాశాలు ఏమిటి?

ఇక్కడ మరొక విషయంకూడ ప్రధానంగా గమనించవలసిఉన్నది. ఈ ప్రణాళికలు, పనులు ఎవరికోసం, ఎందుకోసం చేస్తున్నాం? అనే ప్రశ్నకుముందు సమాధానం చెప్పుకోవాలి. దేశంలోని ప్రజలకోసం, వారి స్వేచ్ఛాస్వాతంత్ర్యాలకోసం, శాంతి సౌఖ్యాలకోసం ఇవన్నీ చేపట్టుతున్నాం గదా! సహకార వ్యవసాయంలో స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, వ్యక్తిత్వం అంతరించగల ప్రమాదం ఉన్నది. మానవత్వ విశిష్టలక్షణాలే అంతరించే అవకాశంకూడ ఉన్నది. ఇవన్నీ పోయిన తరువాత ఈ అధికోత్పత్తి దేనికి? ఎవరిని ఉద్ధరించటానికి? 'ఇతర దేశాలలో అలాంటి ప్రమాదాలు సంభవించి ఉండవచ్చు, మనకు మాత్రం అలాజరగదు, మన సహకార వ్యవసాయం ప్రజాస్వామికంగానే నడుస్తుంది' అనుకోవటం భ్రమ. చరిత్రలోని పాఠాలను జ్ఞానాన్ని నేర్చుకోవటానికి తిరస్కరించటం అవుతుంది. ఐతే అధికోత్పత్తి అవసరంలేదా? అని ప్రశ్నించవచ్చు. అవవరమే, కాని దానికి మార్గం ఇదికాదు; మానవత్వాన్ని, ప్రజాస్వామిక జీవిత విధానాన్ని అభివృద్ధి చేయగల విధానాలద్వారా అధికోత్పత్తి కృషి ప్రారంభం కావాలి.

మన రైతులకు వ్యవసాయం వ్యాపారమేకాదు; అదొక జీవితవిధానం. అందుచేత ఈ జీవితవిధానాన్నే మార్చివేయగల వ్యవసాయ సంస్కరణలను గురించి ముఖ్యంగా సహకారవ్యవసాయాన్నిగురించి - నిశితంగా పరిశీలించ వలసిన అవసరం ఉన్నది. దేశంలో అత్యధిక సంఖ్యాకులైన ప్రజలు వ్యవసాయరంగంలోనే ఉండటంచేత వారి జీవితవిధానం మారితే దేశస్వరూపమె మారుతుంది. దేశంలో ప్రజాస్వామ్యం ఉండటమో నియంతృత్వం నాట్యం చేయటమో వారి మీదనే ఆధారపడి ఉన్నది. అందుచేతనే ప్రతివారు దీనిని గురించి ఆలోచించవలసి ఉన్నది.

ఇది ప్రజాస్వామికయుగం. మనలను గురించి మరెవరో ఆలోచించి పెడతారని, మన సమస్యలను మరెవరో పరిష్కరిస్తారని అనుకొని బాధ్యత మరొకరిమీద వదిలివేయటం కుదరదు. రైతులు తమ విషయాలను గురించి తెలిసికొంటు చైతన్యంతో వ్యవహరించవలసిన సమయం

వచ్చింది. నిర్దాణంగా పట్టీ పట్టనట్లుగా ప్రవర్తించితే జీవితమే నిర్జీవమై, నిర్వీర్యమై పోతుంది. ఈ దృష్టితోనే సహకారవ్యవసాయ స్వరూప స్వభావాలను రైతులకు విదితం చేయాలన్న ఉద్దేశంతోనే ఈ అనువాదం చేయటం జరిగింది. ఆంధ్రరైతులు ఈ అనువాదాన్ని ఆదరించి ఉపయోగించుకొంటారని ఆశిస్తున్నాను.

ఒక్కొక్క ఉద్యమానికి ఒక్కొక్కవ్యక్తి నాయకుడై, కారకుడై నడిపించటం చరిత్రలో మనకు గోచరిస్తుంటుంది. అలాగే ఈ సహకారవ్యవసాయంలోని కష్టనష్టాలను ప్రజలకు విప్పిచెప్పి రానున్న మహోపద్రవాన్ని ప్రతిఘటించటానికి, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించటానికి ఆచార్య రంగాగారు చేసినకృషి, చేస్తున్న సేవ మహత్తరమైనవి. కాంగ్రెసుపార్టీ ఈ విధానానికి పూనుకొననున్నదని రంగాగారు నాగపూర్లు కాంగ్రెసుకుముందే గ్రహించి అప్పటినుంచి ఎన్నో గ్రంథాలు వ్రాస్తూ, ఉపన్యాసాలిస్తూ దేశాన్ని మేలుకొలిపారు. ఈ సహకారవ్యవసాయం అమలులోకివస్తే భారత రైతాంగం వెన్నెముక విరిగిపోతుందని ప్రబోధించారు. పార్టీ అధినేతల ఆజ్ఞలకు తల ఒగ్గక సిద్ధాంతబలంతో వ్యక్తిత్వాన్ని నిలుపుకొన్నారు. ఇందుకు భారతదేశం ఆచార్యరంగాగారికి కృతజ్ఞతా బద్ధమై ఉన్నది. ఈ గ్రంథ రచనలో ఆచార్య రంగాగారితోపాటు కృషిచేసిన శ్రీ. పి. ఆర్. పరుచూరికి ధన్యవాదాలు.


మద్రాసు,
1—4—1959.

జాస్తి జగన్నాథం

అంకితం

స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు ఔదార్యానికి రైతుజీవనం
ఆలంబనం అని నిరూపించిన

రైతు పెద్ద



శ్రీ వెనిగళ్ళ సుబ్బయ్యగారికి

విషయసూచిక

1. అవతారిక 1

2. సహకార వ్యవసాయం 26

3. సాంఘికన్యాయం – సహకార వ్యవసాయం 42

4. సహకారీకరణ – సహకార వ్యవసాయం 68

5. భారీవ్యవసాయపు ఆర్థికలాభాలు – సహకార వ్యవసాయం 93

6. యాంత్రికీకరణ – సహకార వ్యవసాయం 121

7. శ్రామిక వ్యవసాయం – సహకార వ్యవసాయం 149

8. సహకారసంఘాలు – సహకార వ్యవసాయం 191

9. ఆచరణీయత – రాగలపరిణామాలు 238

10. పునస్సమీక్ష 268

అధ్యాయం - 1

అవతారిక

పరిణామాత్మక ప్రపంచంలో మనం నివసిస్తున్నాం. మనం నివసిస్తున్న ఈ ప్రపంచాన్ని మానవుడు తన ఇచ్ఛతో తన అవసరాల కనుగుణంగా మలుచు కొంటున్నాడు. దీని నల్ల సంఘం స్వల్ప కాలంలో తీవ్రమైన మార్పులకు లోనవు తున్నది. అభ్యుదయ సాధనకు మార్పు అత్యావశ్యకమే. మార్పు లేని చలనరహితమైన దశ దిగజారుడును మాత్రమే ద్యోతకం చేస్తుంది. కాని మన కళ్ళ ముందు జరుగుతున్న ప్రతి పరిణామము అభ్యుదయ సాధనకు తోడ్పడక పోవచ్చు. చరిత్రలో ఇలాంటి సంఘటనలు అనేకం ఉన్నవి. ఈ మార్పుల కోసం పరితపించి ఆశించిన వారి ఆశయాలకు తిలోదకాలిచ్చి ఎట్టి అభివృద్ధిని ఏమాత్రం సాధించని సంఘటనలు, మార్పులు అనేకం జరిగాయి. వాస్తవానికి ఒక ప్రత్యేక కాలంలోని సంఘంలో ఉన్న మంచిని నూతన సంఘ వ్యవస్థ కందించకపోగా ఆయా సద్గుణాలను విచ్ఛిన్నం చేసిన పరిణామాలు కూడ చాల జరిగాయి. ఇలాంటి సంఘటనలు మానవుడు ఆశించినవి కావు, కోర తగ్గవీ కావు. కాబట్టి ఎలాంటి పరిణామాన్ని సాధించ దలచినా మనం ముందుగా ఒక విషయాన్ని మనసులో ఉంచుకోవాలి. మనం సాధిస్తున్న మార్పు మన సంఘంలోని చెడును వదలి మంచిని మాత్రం తప్పకుండ ఆ రానున్న నూతన సంఘ వ్యవస్థకు అందించేదిగా ఉండాలి. నేడు మనం భారత

దేశంలో క్రమబద్ధమైన పద్ధతుల ద్వారా, ప్రజాస్వామిక విధానాల ద్వారా సాంఘిక పరిణామాన్ని సాధించ వలసి ఉన్నది. ఎన్నో పెద్ద పెద్ద విషయాలను సాధించ తలంచి, వాటికి ప్రణాళికలను కూడ వేయటం జరిగింది. ఈ సందర్భంలో ఒక విషయాన్ని మాత్రం స్పష్టంగా గ్రహించటం అవసరం. ఈ ఆశయ సాధనకు మనం ఉపయోగించ దలచిన విధానాలలోను, ఆ విధానాలకు రూపురేఖలు దిద్దే వారిలోను నేటి మన సంఘంలోని మంచిని అభ్యుదయకర విధానాలను ఆ రానున్న నూతన సంఘానికి అందించటానికి అనుగుణమైన దృక్పథం ఉండటం అత్యావశ్యకం. ఇలా చేయటం వల్ల మనం ఆశిస్తున్న ఆ నూతన వ్యవస్థ శక్తివంతంగా నిలబడే అవకాశం లభిస్తుంది.

II

భారత దేశ ప్రజలు ఇదివరలోను ఇప్పుడు కూడ చాల వెనుక బడి ఉన్నా రనేది జగ మెరిగిన సత్యం. మన మెలా ఉన్నామో అలాగే మన దేశం కూడ అభివృద్ధి చెంద లేదు. ఇక్కడ దేశం అభివృద్ధి చెందలే దంటే దేశం లోని ప్రకృతి సంపదను మనం సరిగా వినియోగించు కోవటం లేదని గ్రహించాలి. కాని ఈ వ్యవస్థను ఇలాగే ఉంచాలని మనం అనుకోవటం లేదు. సాధ్య మైనంత త్వరలో క్రమబద్ధ మైన పద్ధతుల వల్ల, శాస్త్రీయ మైన విధానాల ద్వారా ఈ పరిస్థితులను మార్చి అభ్యుదయాన్ని సాధించా లని మన సంకల్పం. సోషలిస్టు సమాజ వ్యవస్థను, ప్రజాస్వామిక సంఘాన్ని, స్వేచ్ఛాసహకార పూరిత మైన నూతన సమాజ వ్యవస్థను స్థాపించా లని మన ఆశయం. ఈ ఆశయాన్ని సాధించటానికి కావలసిన లక్షణాలు కొన్ని ఉన్నాయి. ముందు వాటిని మన సంఘానికి అన్వయింప చేసికొంటేతప్ప మన ఆశయం నెరవేరదు. నేడు మన సంఘాలలో తాండవ మాడుతున్న ఎచ్చులొచ్చులను రూపుమాపటం, జీవన ప్రమాణాన్ని పెంచటం, అందరికీ అభివృద్ధి చెందటానికి సమాన మైన అధికమైన అవకాశాలను అందించటం, హీనస్థితిలో ఉన్న వర్గాలకు తమ అభ్యుదయానికి ఆవశ్యకమైన ఆత్మవిశ్వాసం ధైర్యసాహసాలు

కలిగించటం, సంఘంలోని ప్రతి వారు మన ఆర్థిక, సాంఘిక, రాజకీయ విషయాలలో ప్రజాస్వామిక విధానాల ద్వారా పాల్గొని తమ పాత్రను సరిగా నిర్వహించా లన్న భావాన్ని ప్రజల్లో కల్గించటం అవసరం.

వాస్తవంగా పరిశీలిస్తే నేడు మనం సంధియుగంలో ఉన్నాం. స్వాతంత్ర్య సిద్ధి వల్ల మనకు సంక్రమించిన రాజకీయ ప్రజాస్వామికంతో మన పరిణామ గమనం ఆరంభ మైంది. ఈ పరిణామం లోని మొదటి దశ, అంటే రాజకీయ ప్రజాస్వామ్యం చేరీచేరకముందే రెండవ పరిణామంలో, అంటే ఆర్థిక ప్రజాస్వామ్యాన్ని సాధించటంలో నిమగ్నమై ఉన్నాం. ఇక్కడే ముఖ్యమైన విషయా లున్నాయి. ఈ ఆర్థిక ప్రజాస్వామ్యాన్ని సాధించ వలసిందే కాని, తరతరాలుగా వస్తున్న మన రైతాంగ ఆర్థిక వ్యవస్థ వల్ల రైతులకు లభిస్తున్న ఆర్థిక స్వాతంత్ర్యాన్ని సాంఘిక భద్రతను విచ్ఛిన్నం చేయకుండ వాటిని కాపాడుకొంటు ఆర్థిక ప్రజాస్వామ్యాన్ని సాధించాలి. జమిందారీ విధానం పెట్టుబడిదారీ విధానం ఎంత పోరాడినా తట్టుకొని చరిత్రలో ఇప్పటి వరకు మన రైతాంగ ఆర్థిక విధానం నిలబడి ఉన్నది. అవేవీ దీనిని కదిలించలేక పోయాయి.

ఈ గ్రంథంలో మన ఆర్థిక విధానంలోను సంఘంలోను ఒక భాగమైన వ్యవసాయం-రైతులు అనే విషయాన్ని గూర్చి మాత్రమే మేము చర్చించ దలచాం. నేడు మన రైతులను, వ్యవసాయాన్ని కుంచిస్తున్న లోపాలను, కష్టనష్టాలను సవరించాలని మా ఆతురత. దీని వల్ల మన వ్యవసాయం, జాతికి కావలసిన ఆహారధాన్యాలను పుష్కలంగా ఉత్పత్తి చేయ గలదు. అటు రైతు స్థితి కూడ బాగుపడి నేటి కంటె సుఖంగా, స్వేచ్ఛగా జీవించే అవకాశం లభిస్తుంది. కనుక మన వ్యవసాయానికి, రైతాంగానికి ఉన్న ప్రత్యేక లక్షణా లేమిటో ముందుగా మనం జాగ్రత్తగా గమనించాలి. వేటి మన వ్యవసాయం లోను, రైతాంగంలోను ఉన్న లక్షణాలలో ఏయే లక్షణాలను నిలుపుకొని అభివృద్ధి చేసికోవాలో, వేటిని పూర్తిగా విసర్జించాలో గమనించే దృక్పథంలో మన రైతాంగాన్ని వ్యవసాయాన్ని పరిశీలించాలి.

III

మన జాతీయ ఆర్థిక విధానంలో వ్యవసాయం ప్రధానమైన స్థానం, గర్వించ దగినస్థానం ఆక్రమించింది. నేడు కూడ అదే స్థానం దానికి ఉన్నది. మన దేశంలోని పరిశ్రమలలో కెల్ల అదే అతి ప్రధాన మైన పెద్ద పరిశ్రమ. ఒక వృత్తిగా పరిశీలించి నపుడు మన వ్యవ సాయంతో పోల్చ తగినంత విస్తృతమైన వృత్తిని కల్పించేది మరొకటి మన దేశంలో లేదు. మన జాతీయ ఆర్థిక విధానంలోని ప్రధాన మైన ప్రత్యేక లక్షణం ఇదే. మన దేశంలోని ప్రజలలో ఐదింట మూడు వంతులమంది ఈ వ్యవసాయంలోనే కృషిచేస్తూ దాని వల్లనే తమ జీవితం గడుపుకొంటున్నారు. కొంత మంది ఆర్థిక వేత్తల అంచనా లను బట్టి 1971 వ సంవత్సరంనాటికి గూడ మన దేశంలోని ప్రజ లలో 100 కి 58 మంది వ్యవసాయంలోనే ఉంటారు. మనకు, మన దేశానికి సంబంధించి నంతవరకు వ్యవసాయం కేవలం ఒక వృత్తి మాత్రమే కాదు. అది ఒక సంప్రదాయం, మన కొక జీవిత విధానం. ఎన్నో శతాబ్దాల తరబడి అది మన ఆలోచనలను, సంప్రదాయాలను, ఆచారాలను రూపు దిద్దుతూ వస్తున్నది. మన గ్రామీణ ప్రజలలో దాదాపు 100 కి 90 మంది ప్రత్యక్షంగాగాని, పరోక్షంగాగాని, వ్యవ సాయం మీదనే ఆధారపడి ఉన్నారు.

మన జాతీయ ఆదాయానికి ప్రధానమైన మార్గం కూడ వ్యవ సాయమే. 1954,55 లో వ్యవసాయంద్వారా మన దేశానికి లభించిన ఆదాయం 4500 కోట్ల రూపాయలు. అంటే ఆ సంవత్సరంలోని మన జాతీయ ఆదాయంలో 100కి 46.2 పాళ్ళు. అంతేకాక మన దేశం ఎగు మతి చేసే వస్తుసముదాయం కూడ మన వ్యవసాయంద్వారానే లభిస్తున్నది. నూనెగింజలు, లక్క, టీ, జనపనార, ప్రత్తి మనం ఎగుమతి జేసే వాటిలో ముఖ్యమైనవి. వీటి ఎగుమతుల వల్లనే దేశాభి వృద్ధికి కావలసిన విదేశీమారక ద్రవ్యం చాల వరకు మనకు లభిస్తున్నది. మన దేశంలోని అనేక పరిశ్రమలకు వ్యాపారం, రవాణాలతో సహా వ్యవసాయమే ఆధారం. పంచదార పరిశ్రమ, వస్త్ర పరిశ్రమ వాటికి కావలసిన ముడి పదార్థాల కోసం, వ్యవసాయము మీదనే ఆధార

పడాలి. మన రైల్వేలు, ఇతరమైన రవాణాలు కూడ వ్యవసాయోత్పత్తులను మోయటం ద్వారానే లాభదాయకంగా వ్యాపార దృష్టితో పని చేయకలుగు తున్నవి. మన దేశంలో జరిగే వ్యాపారం చాల వరకు వ్యవసాయోత్పత్తులను ఇచ్చిపుచ్చు కోవటంతోనే నిర్వహించ బడుతున్నది. మనదేశంలో స్థిరరూపంలో ఉన్న సంపదలోని అధిక భాగం మన వ్యవసాయ కమతాలే. నీటి పారుదల సౌకర్యాల కొఱకైన కట్టడాలలోను, వ్యవసాయ పరికరాల ఉత్పత్తులలోను, పశుగ్రాసంలోను మనం వెచ్చిస్తున్న ధనం ఈ వ్యవసాయ పరిశ్రమలో మనం పెడుతున్న పెద్దపెద్ద పెట్టుబడులను సూచిస్తున్నవిగదా! మరొక ప్రధానాంశ మేమంటే మన దేశంలోని కోట్లాది ప్రజలకు ఆహారాన్నందించేది ఈ వ్యవసాయమే. దేశంలోఉన్న 17 కోట్ల 70 లక్షల పశువులను పోషించేది కూడ వ్యవసాయమే గదా!

ఏమైనా ప్రస్తుతం మనదేశంలోని వ్యవసాయ పరిశ్రమ స్థితి గతులను సాకల్యంగా అవలోడన చేసి దాని ప్రస్తుత స్థితిని గమనించిన డా. క్లోస్టన్ చెప్పిన ఈ క్రింది అభిప్రాయంతో ఏకీభవించక తప్పదు. "భారతదేశంలో పతితవర్ధాలు (అంటే అణిచి వేయబడిన) అనేక మున్నాయి. అలాగే అణిగి పోతున్న పరిశ్రమలు కూడ చాల ఉన్నవి. దురదృష్టవశాత్తు అలాంటి పరిశ్రమలలో వ్యవసాయం కూడ ఒకటి."*

మన వ్యవసాయంవల్ల మనకు వస్తున్న ఉత్పత్తులు చాలస్వల్పం. మన వ్యవసాయం ఎంతగా వెనుకబడి ఉన్నదో గ్రహించటానికి ఈ ఒక్క విషయం చాలు. ఇతర దేశాలలోని వారు ఎకరానికి ఎంత పంట పండిస్తున్నారో దానిలో మనం మూడవ వంతో, లేక నాల్గవ వంతో పండిస్తున్నట్లుగా అంచనాలనుబట్టి తెలుస్తున్నది. ఇంతకంటే ఘోరమేమంటే ఈ కొద్ది పంటకూడ వర్షాభావంతోను, కరువుల తోను కొన్నికొన్ని సంవత్సరాలలో మన చేతికి అందకుండ పోతున్నది. మన దేశంలో వర్షాభావం, వర్షాధిక్యం ఎంత ఎక్కువగా సంభవిస్తూ ఉంటాయో చెప్ప నవసరంలేదు గదా!

---

* Agricultural Commission Report, Minute of Evidence, Vol. 1.

సక్రమ వ్యవసాయానికి ఆవశ్యకమైన సాంఘిక, ఆర్థిక విధానాలు వాతావరణం లేకపోవటం వల్ల మన దేశంలో ఈ దైన్యస్థితి ఏర్పడు తున్నది. మన వ్యవసాయాన్ని కుంచించే విషయాలనేకం. మన వ్యవ సాయం ఇంచుమించు పూర్తిగా ప్రకృతిమీద ఆధారపడి ఉన్న విషయం జగద్విదితమే గదా! ఇక మనకున్న నీటిసౌకర్యాలు ఏపాటివో మనకు తెలియనివి కావు. వరదలు, వర్షాభావాలు కలిగినా, పంటలకు ఎలాంటి చీడ, తెగుళ్లు తగిలినా దానినుంచి బయట పడే మార్గాలు మనకు ఏమీ లేవు కదా! ఇక మనకున్న రవాణా సౌకర్యాలు ఎంత లోపభూయిష్ఠ మైనవో, ఎంత అసమగ్ర మైనవో వేరే చెప్ప నవసరం లేదు. భూమి మీద మనం పెడుతున్న పెట్టుబడులు గూడ స్వల్పాతి స్వల్పం. మన భూమిని మనం సక్రమంగా వినియోగించుకోవటం మన కింక చేతకాలేదు. వ్యావసాయక రంగంలో మనకు అనుశ్రుతంగా వస్తున్న సంస్కృతి, వ్యవసాయ విధానాలు శాస్త్రీయ మైనవి కావు. ఎలాంటి పంటలను ఎలా వేయాలో, పంటల మార్పిడి ఎలా చేసి కోవాలో మనకు శాస్త్రీయంగా తెలియదు. ఇవన్నీ కాక వీటికితోడు మనకు సరైన వ్యవసాయ పరికరాలు లేవు. మంచి విత్తనాలు, ఎరువులు లేవు. వ్యవసాయంలో పెట్టుబడి పెట్టటానికి ఋణసౌకర్యాలు లేవు. పంటలను రవాణా చేసేటందుకు సౌకర్యాలు లేవు; సక్రమంగా సరైన ధరలకు అమ్ముకోవాలంటే మార్కెటింగ్ సౌకర్యాలు లేవు. వీటన్నిటిని మించి రైతులకు వ్యవసాయ విద్యను కాని, అసలు అక్షర జ్ఞానాన్ని కాని కలిగించటానికి ఎలాంటి ప్రయత్నాలు లేవు.

భారతదేశంలోని వ్యవసాయదారుల దారిద్ర్యానికి వెనుకబడి ఉండటానికి కారణం మన దేశంలో వ్యవసాయం సక్రమ మైన విధానాల ద్వారా సరిగా అభివృద్ధి చెందక పోవటమే. అలాగే మన వ్యవసాయం సరిగా అభివృద్ధి చెందకుండా ఉండటానికి కారణం మన రైతుల దారిద్ర్యం, అజ్ఞానం. అంటే ఇవి రెండు పరస్పరాశ్రితాలు. మన దేశంలో సాగులో ఉన్న భూమి ఎంతమందిని పోషించ గలదో, ఎంత మందికి పని కల్పించగలదో దాని కంటె కొన్ని రెట్లుమంది జనం ప్రస్తుతం వ్యవసాయం మీద ఆధారపడి ఉన్నారు. దీని ఫలితంగా

వ్యవసాయ రంగంలోని వారికి చేతినిండ పనిలేక పోవటం (under employment), అసలు నిరుద్యోగ మేర్పడటం జరుగు తున్నది. తత్ఫలితంగా మన గ్రామీణ ప్రజలలో భూదాహం, (అనగా ఎంతైనా సరే సొంతభూమి సంపాదించా లన్న తాపత్రయం) వృత్తికోసం పోటీలు ఏర్పడు తున్నవి. ఈ భూదాహంతో మన భూములు పంచుకో వటాలు ఎక్కువై, అవి ముక్కలుచెక్కలై చెల్లాచెదురుగా ఉండటం సంభవిస్తున్నది. చాల కమతాలు ఆర్థిక దృష్ట్యా పరిశీలిస్తే గిట్టుబాటయ్యేవి కావు, లాభదాయకంగా లేవు; పైగా వాటి నిర్వహణ కూడ లోపభూయిష్ఠంగ జరుగుతున్నది. మన భూకమతాలు చిన్నచిన్నవిగా ఉండటం వల్ల అవికూడ చెల్లాచెదరుగా ఉండటం వల్ల, ఆ రాబడి చాల తక్కువ. రైతులకు సంఘాలు లేనందువల్ల మధ్యదళారులు, వ్యాపారస్థులు, ఋణదాతలు మొదలైన వారి దోపిడివల్ల రైతుల రాబడి వారి చేతి కందటం లేదు. దాని ఫలితంగా రైతులలో అధిక భాగానికి సాధారణ జీవన స్థితిగతులు కూడ లేకుండ పోయినవి. వారి జీవనంలో జవం లేదు. వీటన్నిటికి తోడు మన గ్రామాలను ఐక్యం చేసి ఈ దైన్య స్థితినుంచి బయట పడటానికి సామూహికంగా కృషి చేదా గుంటే మన సంఘంలో ఉన్న సాంఘిక రాజకీయ విషయాలలో ఒకరి ప్రయోజనాలకు ఆశలకు మరొకరి ప్రయోజనాలకు, ఆశలకు భేదం ఉండటంవల్ల అదీ కూడటంలేదు. ఈ భేదాలు విరుద్ధాభిప్రాయాలు – అంటే సంఘం లోని కులాల మధ్య స్వప్రయోజనాల నాశించి జరిగే కీచులాటలు, ఆర్థిక వర్గాలమధ్య-అంటే ఉన్నవారిమధ్య, లేనివారిమధ్య ఉన్న అఘాతం ఇంక మన సంఘాన్ని వదలకుండ పీడిస్తూనే ఉన్నాయి. ఈ కారణాల వల్ల, ఇలాంటి మరికొన్ని కారణాలవల్ల మన వ్యవసాయ రంగంలో దారిద్ర్యం, ఎదుగుబొదుగులు లేని గొత్తెలోకలాంటి వ్యవసాయం తప్పటంలేదు. ఇదొక దుశ్చక్రం. ఈ దారిద్ర్యం, ఎదుగు బొదుగులు లేకపోవటం ఒక దాని కొకటి కారణాలు, పరస్పరాశ్రితాలూను.

కాబట్టి మన రైతుల ఈ ఘోరదారిద్ర్యాన్ని, మన ఆర్థిక విధానాలను అభివృద్ధి చేయటం ద్వారాను, జాతీయ ఆర్థిక విధానాన్ని కేవలం వ్యవసాయం మీదనే ఆధార పడనీయక నానా విధా

లను సృష్టించు కోవటంవల్ల మాత్రమే రూపుమాపగలం. మరి ఇలాంటి ఆర్థికాభ్యుదయానికి వ్యవసాయమే సరైనపునాది. ఇక ఈ అభ్యుదయాన్ని ఎంత త్వరగా ఎంత ఎక్కువగా సాధించగలం అనే విషయం మన వ్యవసాయ రంగం ఎంత ఆదాయాన్ని మిగిల్చి మన కందివ్వగలదో దాన్నిబట్టి నిర్ణయింపబడుతుంది. వ్యవసాయా దాయం మీదనే దేశ ఆర్థికాభ్యుదయం ఆధారపడి ఉన్నదని చెపుతున్నారే, ఇది ఎలా అనే సందేహం రావచ్చు. ఎందునల్ల నంటే వ్యవసాయేతర రంగాలలోని ప్రజలందరకు సరిపోను ఆహార ధాన్యాలను ఉత్పత్తి చేయవలసిన భారం, ఆర్థిక విధానాన్ని నానావిధాల నూతన రంగాలను సృష్టించేందుకు అనుకూలంగా దిద్దు కోవటంతో క్రొత్తగా ఏర్పడిన అనేక పరిశ్రమలకు ముడిపదార్థాలను అందివ్వ వలసిన భారం కూడ వ్యవసాయ రంగం మీదనే పడుతున్నది కదా! మన ఆర్థికాభ్యుదయ గమనాన్ని నిర్ణయించే ప్రధాన పరిశ్రమ లకు కావలసిన పారిశ్రామిక యంత్రాలు, యంత్రపరికరాలు ఇత్యా దులు దిగుమతి చేసికోవాలంటే మన వ్యవసాయోత్పత్తిలోనే మిగుల్చుకొని దాన్ని మనం ఎగుమతి చేయాలి. కాబట్టి ఈ క్లిష్ట పరి స్థితులలో సాంఘిక అవసరాలదృష్ట్యా పరిశీలించినా, రైతుల బాగును కోరి పరిశీలించినా ముందు ఈ ఏర్పాట్లు జరగాలి. వ్యావసాయకోత్పత్తుల కోసం జరుగుతున్న కృషిలో చాలినంత పెట్టుబడులను పెట్టాలి, ప్రతి ఒక్క ఎకరాకు ఎంతపంట పండించే వీలున్నదో అంత పండించి తద్ద్వారా వ్యవసాయోత్పత్తిని అధికం చేయాలి; వ్యవసాయదారుల జీవన ప్రమాణాన్ని తద్ద్వారా శక్తిసామర్థ్యాలను పెంపొందించాలి. వ్యవసాయ రంగంలో రాబడులకు మార్గాలను వెతికి, ఎంత ఎక్కువ లాభం పొందే వీలున్నదో అంతప్రయోజనం పొందాలి. దీనిని సాధించాలంటే మన రైతుల శక్తిసామర్థ్యాలు పెరగాలి, శాస్త్రీయ వ్యవసాయ విధానాలు వారికి కరతలామలకం కావాలి. పైన చెప్పు కొన్న ఋణదాతల, వ్యాపారస్థుల లాంటివారి దోపిడినుండి రైతు రక్షింపబడాలి. ఇంతేకాక అతనిని కుంచిస్తున్న సాంఘిక, ఆర్థిక ఆచా రాలనుంచి రైతుని బయట పడవేయాలి. రైతుల సహకారంతో ఏర్పాటు చేయబడిన రైతుసంఘాల లాంటి వాటిలో రైతులను సంఘ

టిత పరచాలి. వీటన్నింటిని సాధించాలంటే మన వ్యవసాయ రంగాన్ని సంస్కరించాలి; పునర్నిర్మించాలి. దీనిలో ఎవరికి ఎలాంటి భేదాభిప్రాయం లేదు.

ఈ సంస్కరణలను మేడిపట్టి నాగలిదున్నే వారిని దృష్టిలో పెట్టుకొని వారి ద్వారానే సాధించవలసి ఉన్నది. మన దేశపు వ్యవసాయంలో ఈ మేడిపట్టి నాగలిదున్నే వారెవరో పరిశీలిద్దాం.

IV

మేడిపట్టి నాగలి దున్నే వారు భారత దేశంలో రైతులే. పెట్టుబడిదారీ విధానంలోని కేపిటలిస్టు వ్యవసాయదారులు కారు; లేక ఏ కేపిటలిస్టు వ్యవసాయదారుని (అంటే పెద్ద భూస్వామి) క్రిందనో, సమిష్టి సహకార వ్యవసాయక్షేత్రాలలోనో దినభత్యాలతో పనిచేసి బ్రతికే వారు కూడ కారు. మన దేశంలోని రైతు, తాను సాగు చేస్తున్న భూమికి తానే అధిపతి; తన భూమిని తానే సొంతంగా సాగు చేసి కొంటాడు. మన రైతుకి వ్యవసాయం ఒక వ్యాపారం. తనవృత్తికి ఆధారం కూడ అదే; తన సాంఘిక భద్రతకు మూలం కూడ అదే. దీనిలో ఎలాంటి సందేహము ఉండవలసిన అవసరం లేదు. కాని మన రైతుకి వ్యవసాయం ఇంతకంటె అధికమైన విలువగలది; అతని కది ఒక జీవిత విధానం. మన రైతు తన కుటుంబసహాయంతో సాగు చేస్తున్న భూమే అతని కొక ఇంటిని, జీవికను ప్రసాదిస్తుంది. మన దేశంలోని వ్యావసాయక వర్గాలు మొత్తం 24 కోట్ల 90 లక్షలలో ఇలాంటి రైతులు 100 కి 80 మంది ఉన్నారు. సొంత భూములమీద సేద్యం చేసికొనేవారు. కౌలుభూములమీద సేద్యం చేసేవారు కలిపితే ఈ లెక్క వస్తున్నది. మేము ఇక్కడ విచారణ సాగిస్తున్నది, సాగించవలసినది వీరినిగురించే కాని, ఎక్కడో కూర్చుని తమ భూములమీద వచ్చేకౌలును స్వీకరించే రైతులను గురించికాని, వ్యవసాయం లోని దినభత్యపు కూలీలను గురించిగాని, లేక సాంవత్సరిక జీతగాళ్ళను గురించిగాని మా గ్రంథానికి ప్రత్యక్షసంబంధం లేదు. సాధారణంగా

మనం అనుకొనేట్లు భూస్వామ్యం రైతు సంఘ లక్షణ మనటంలో సందేహం లేదు. కాని రైతాంగ లక్షణాలలో ఇదే ప్రధాన లక్షణంగా లేదు. ఇది కేవలం బయటకు కనిపించే లక్షణం, అనుశ్రుత ఆచారం మాత్రమే. రైతాంగ విశిష్టలక్షణం చాల దీర్ఘంగా లోతుగా ఆలోచిస్తేనే కాని అర్థం కాదు. ఈ విశిష్టత ఎలా ఏర్పడు తున్నది? ఈ ప్రశ్నకు మానవుని సంస్కార సంప్రదాయాది ఆత్మసంబంధమైన విశిష్టతను గమనించకుండ లెక్కలమీద సమాధానాలు చెప్పటం అసమగ్ర మవుతుంది. ఇది రైతాంగ సంప్రదాయాలకు మానవాత్మకు సంబంధించినది కావటమే దీనికి కారణం. ఈ రైతాంగ విశిష్టతను గమనించాలంటే నేటి ఆర్థిక విధానాలతో, దృష్టితో రైతుకి భూమిమీద లభిస్తున్న వృత్తిని గుణకారం చేయటం చాలదు. అంతకంటే లోతుగా ఆలోచించవలసిన విషయం ఇది. మనం నేడు ప్రభోధిస్తున్న సోషలిస్టు సమాజపద్ధతి వ్యవస్థకు, స్వేచ్ఛాపూరిత మైన వికేంద్రీకృత సంఘస్థాపనకు మన రైతు ప్రముఖచిహ్నం; ఈ ఆశయమే అతని జీవితాచరణలో వాస్తవత్వం పొందుతున్నది. ఈ ఆశయ ప్రవాహమే మన రైతు. కేవలం ఆర్థిక దృష్టితోనే మన రైతాంగ వ్యవస్థను, వృత్తిని వెలకట్ట బూనటం తగదు. ఇది సమస్యను గ్రహించటానికి తోడ్పడదు. తప్పుడు దృక్పథంతో సమస్యను పరిశీలించబూనుకోవటం అవుతుంది. భూమిని నేటి పారిశ్రామిక దృష్టితో కేవలం ఉత్పత్తిసాధనంగా పరిగణించి, దానినుంచి సాధ్యమైనంతఅధికోత్పత్తిని లాభాన్ని చేపట్టటమే ప్రధానాంశంగా పరిగణించే సంఘంలోను, అలాంటి వాతావరణంలోను రైతుకి, రైతాంగ వ్యవస్థకు ఎలాంటి ప్రాధాన్యత, విలువ ఉండదు. ఇలాంటి అభిప్రాయంతో సమస్యను పరిశీలింప బూనుకోవటం వల్లనే మన రైతాంగ వ్యవస్థను గూర్చి, దాని విలువనుగూర్చి అర్థరహితమైన తప్పుడు భావాలు వెలువడు తున్నవి.

మన రైతాంగవృత్తికి విలువ కట్టటంలో ఆ వృత్తిద్వారా రైతు ఎంత ఉత్పత్తిని సాధిస్తున్నా డనేదే కాక ఎలాంటి పద్ధతులతో ఏ జీవితవిధానంతో ఉత్పత్తి చేస్తున్నాడనే విషయం మరువరాదు. దీనినే మరొకవిధంగా వివరించాలంటే ఇలా చెప్పవలసి వస్తుంది.

ఇలాంటి కృషివల్ల సంఘానికి ఎలాంటి ప్రయోజనం కలుగుతున్నదో, ఈ కృషివల్ల దానిలో నివసిస్తున్న రైతులమీద ఎలాంటి ఫలితాలు ప్రసరిస్తున్నవో, తద్ద్వారా – అంటే ఈ రైతులద్వారా– ఆ ఫలితాలు సంఘంమీద ఎలా ప్రసరించి ఏ పరిణామాలను కలిగిస్తున్నవో గమనించటం కూడ అత్యావశ్యకం. ఎంత ఉత్పత్తి సాధిస్తున్నాం అనే కంటె ఆ ఉత్పత్తి కైన కృషివల్ల ఎలాంటి ఫలితాలను సంఘం పొందుతున్న దనే విషయాన్ని బహుశా ఎక్కువ గణనలోకి తీసికోవలసి ఉన్నది. ఈ ఉత్పత్తి కృషివల్ల లభిస్తున్న ఉత్పత్తి సంఘానికి ఆవశ్యకమైన ఆర్థికసంపదను అందిస్తున్నది. ఎలాంటి దోపిడికి ఆస్కారం లేని స్వేచ్ఛాయుతమైన ఈ వృత్తివల్ల లభిస్తున్న సాంఘిక మానసిక రంగాలకు సంబంధించిన విలువలు సంఘాభ్యుదయానికి ఆవశ్యకమైన ఆర్థికేతర సంపదలను ప్రసాదిస్తున్నవి. వీటిని విస్మరించటం ప్రమాదకరం. మానవుడు జీవికను సంపాదించుకొంటూనే తన వ్యక్తిత్వాన్ని పెంచుకోవాలి. మానవునికి తనలోతనకు సామరస్యం ఉండాలి. (అంటే తన ఆశయాలకు భావాలకు హృదయానికి ఆచరణవైరుధ్యం లేకుండ వ్రతికరణశుద్ధిగా ఉండట మన్నమాట. మరొకవిధంగా చెప్పాలంటే తన భావనలు ఒకరీతిగా ఉండి తనపైనున్న నిర్బంధాల కారణంగా తన ఆచరణ మరోవిధంగా ఉండకుండ ఉండటం. ఒక్కమాటలో చెప్పాలంటే అతని స్వేచ్ఛ అన్నమాట.) తన చుట్టుపట్ల వాతావరణానికి తనకు సామరస్యం ఉండాలి. ఏ సంఘంలో ప్రజలు ఆంతరంగికశాంతితో ఆత్మశాంతితో ఉంటారో, ఏ సమాజంలోని ఉత్పత్తిదారులు దోపిడికి ఆస్కారంలేని విధంగా, సృజనాత్మకంగా స్వేచ్ఛాయుతంగా తమ కృషిని కొనసాగిస్తుంటారో ఆలాంటి సంఘం మానవాళి కాంక్షిస్తున్న స్వేచ్ఛా ప్రపంచానికి, నాగరకమానవ జీవనానికి అత్యంతోపయుక్తమైన ఆశాకిరణాలను అందివ్వగల దనటంలో సందేహం లేదు.

ఈ క్రింద చెప్పబోతున్న సాంఘిక ప్రయోజనాలను, ఆర్థికేతర సంపదను వ్యవసాయం కాక చాల కొద్ది పృత్తులు మాత్రమే అందించగలవు. మన్నరైతు తన భూమివల్లనే జీవిస్తాడు; భూమి ద్వారానే అభివృద్ధి పొందుతాడు; ఆ భూమి అతనిది కనుక దాని ఆదాయం మీద

జీవిస్తాడనే శాసనం దృష్ట్యా మేమిూమాట చెప్పటంలేదు. అతనికది ఒక జీవితవిధానం. సజీవోత్సాహం. మన రైతు తన భూమిమీద వ్యావసాయ కోత్పత్తికోసం కృషిచేసేప్పుడు చాల ప్రధానమైన విలువగల నిర్ణయాలు తీసికోవలసి ఉంటుంది. ఇలా స్వయంగా కొన్ని నూత్రాలను కల్పించుకొని కొన్ని నిర్ణయాలు తీసికోవడం ద్వారా అతనిలోని సృజనాత్మకశక్తియుక్తులు ఎన్నో పరీక్షలకు తట్టుకొని నూతనశక్తిని పుంజీభవించు కొంటాయి. ఇలా ప్రతి సంవత్సరం పంటలు పండించటానికి తన శక్తియుక్తులను ఉపయోగించటంవల్ల అతని వ్యక్తిత్వం పెరుగుతుంది. అతని స్వేచ్ఛకు భద్రత ఏర్పడుతుంది. వ్యవసాయంతోపాటు అతడు దానికి సంబంధించిన ఇతర సహాయవృత్తులలో పాల్గొనటం జరుగుతుంది. ఈ ఉపకారాలు అతనికి ఆర్థికంగా తోడ్పడుతు మరొకప్రక్క వినోదాలుగా కూడ ఉపకరించి అతనికి మానసిక సంతృప్తిని ప్రసాదిస్తవి. రైతు తన ఉత్పత్తిని కొనసాగిస్తున్న విధానాలవల్ల ఈ జీవిత విధాన విలువలు సిద్ధిస్తున్నవి. ఈ ఆర్థికేతర సంపద దృష్ట్యా పరిశీలించినపుడు మన రైతువృత్తి చాల బలమైనది.

వ్యవసాయం సృజనాత్మక కృషి. రైతు కేవలం ఆర్థికప్రయోజనాలను సంఘాని కందించే ఉత్పత్తిదారుడే కాక ఈ సృష్టికిక ర్త. ఉత్పత్తి కోసం అతడు చేసేకృషి సజీవ ప్రకృతికలది. అతడు నిర్జీవ వస్తువులకు బానిసగా కృషిచేయడు; బుద్ధిబలంతో అవసరంలేని యంత్రంవలె చేయవలసిన పనులను అతడు గ్రహించడు. మన రైతు ప్రకృతితో కలిసి కృషిచేస్తాడు. వాస్తవానికి అతడు ప్రకృతి తన యిష్టం వచ్చినట్లు పెంచుతున్న మొక్కలను తనకు కావలసినట్లుగా పెంచే కళాకారుడు. ప్రకృతి సహజమైన కృషిచేస్తూనే అతడు ప్రకృతినే తన మానవావశ్యకాల కనుగుణంగా మలుచుకొంటాడు. ఈవిధంగా ప్రకృతి సహజమైన కృషిచేయటంతో అతనికి నిర్జీవమైన యంత్రపరిశ్రమలలో కృషిచేయటంవల్ల లభించని అనేక అవకాశాలు వస్తున్నవి. అతని పనిలో ఎల్లప్పుడు ఒకేపని చేయటంవల్ల కలిగే విసుగుదలలేదు. అనేక కార్యకలాపాలలో అతడు పాల్గొంటాడు. తన పనిలో తానై కొన్ని నిర్ణయాలు తీసికొనే అవకాశం లభించి తన వ్యక్తిత్వచ్ఛాయలలోనే

తన కార్యకలాపాలు నిర్ణయించుకోవటం అతనికే వీలవుతున్నది. ఇలాంటి పనిపాటలలోనే అతనికి ప్రకృతితో సహజ సంబంధం ఏర్పడుతున్నది. తద్వారా అతడు తన కృషివల్ల అమితానందం పొందగల్గుతున్నాడు. ఇలాంటి వృత్తి, పని, "వ్యవసాయదారునిలో నూతనసృష్టిని చేయాలన్న కోరికను, నూతన వస్తుజాలాన్ని పెంచి దానితోపాటు తానుగూడ పెరగాలన్న వాంఛను" * అభివృద్ధిచేస్తుంది.

ఈ సృజనాత్మకకృషి కేవలం ఉత్పత్తిదాయకమైన కృషితో పోల్చిచూద్దాం. కేవలం ఉత్పత్తిదాయకమైన పనిపాటలు చాల వరకు ఆ పనిపాటలలో పాల్గొనే వారికి ప్రయోజనరహితంగా ఉంటాయి. కనుక ఇలాంటికృషి కేవలం దానివల్ల వచ్చే ఆర్థికలాభానికి మాత్రమే సంబంధించి, అంతవరకే పరిమితమై ఉంటుంది. ఈ ఉత్పత్తికృషిలో పాల్గొనే వారికి తాము చేస్తున్న పనివల్ల తమ అవసరాలను గడుపుకొనడానికి కావలసిన ధనం లభిస్తుందన్న ఆశతప్ప ఆ పనిలో వారికెలాంటి శ్రద్ధ ఉండదు. ఒక పెద్ద కర్మాగారంలోని కార్మికునకుగాని పారిశ్రామికసంస్థలోని సాధారణ ఉద్యోగికి గాని, పురపాలక సంఘంలో పనిచేసే పాకీవానికిగాని తాను చేస్తున్న పనివల్ల తినటానికి తిండి దొరుకుతుందన్న భావంతప్ప ఆ పనిలో అర్థం కనిపించదు.

కాని వ్యవసాయదారుని విషయం దానికి భిన్నంగా ఉంటుంది. కళాకారునికి తాను సృజిస్తున్న కళ ఎలాకనిపిస్తుందో, పరిశోధకునికి తన పరిశోధన ఎంత ఆహ్లాదకరంగా తోస్తుందో వైతుకి తనకృషి అలా అనిపిస్తుంది. కళాకారుడు పరిశోధకుడు కూడ ఆర్థికలాభం పొందాలనే ఉద్దేశంలోనే ఉంటారు. కాని కర్మాగారంలోని కార్మికునివలె వారి శ్రద్ధ అంతటితో ఆగదు. ఈ ఆర్థికలాభం కంటెకూడ తమపనిలోనే వారికి శ్రద్ధ ఎక్కువ. వారి పని సృజనాత్మకకృషి కావటంవల్లనే ఈశ్రద్ధ ఏర్పడుతున్నది. మానవునికి ఇలాంటి నూతనసృజనల వల్ల లభించే ఆనందానికి మించిన ఆనందం మరొకటి లేదనే విషయం ప్రపంచమంతా అంగీకరించిన సత్యమే. శక్తివంతమైన వ్యక్తిత్వానికి స్థిరరూపం కలిగించటానికి సంతోషం చేసినపని మరొకటి చేయలేదు.

---

* George Henderson, "Farmer's Progress"—1949, P. 220.

సంతోషంవల్లనే మానవుడు తనవ్యక్తిత్వాన్ని స్థిరీకరించుకో గలడు. మనరైతాంగానికి తనకృషితోపాటు ఇవన్నీ సిద్ధిస్తున్నవి.

కాని సృజనకర్మ కూడ దానంతట అదే సాగదు. దానికికూడ ముందు కొన్ని ఏర్పాట్లు కావాలి. కళాకారుడు తన కృతిని చూచు కొని సంతోషించాలంటే ముందుగా ఆ కృతి నిర్మాణానికి కావలసిన స్వేచ్ఛ కావాలి; విచక్షణాజ్ఞానం ఉండాలి. తాను నిర్మించిన ఆ కృతిని లోకం తన సృజనగా గుర్తించాలి. లోకం ఆ కృతినుంచి తనను వేరు చేయకుండ—ఫలానాకృతి అంటే ఫలానాకళాకారుడు అని—చూడాలి. ప్రతి కళ విషయంలోను ఇంతే! వ్యవసాయదారుడు కూడ ఇలాంటి కళా కారుడే. ఇలాగే భావించి ఆనందం పొందుతాడు. ఇలాంటి విశిష్టమైన సృజనకర్మకు కావలసిన అవసరాలనుతీర్చి అవకాశాలను అందిస్తున్నది కాబట్టి మన రైతువృత్తి ఆర్థికేతర విషయాలదృష్ట్యా పరిశీలించినపుడు అత్యంత విలువగల వృత్తి అవుతున్నది.

రైతు ఎలాంటి నిర్బంధం లేకుండ తనకు తానై వృత్తిని, పనిని కల్పించుకొని ఎన్నుకొనటం మూలంగా సృజనకారుడుగా ఉండగలడు. ఆ వృత్తి ఇచ్ఛికమైనది కనుక దానిద్వారా తనలోని సృజనాత్మకశక్తి పెంపొందే అవకాశం కూడా ఉన్నది. తాను చేస్తున్నపనిలో తనకు పూర్తి స్వాతంత్ర్యం ఉండాలి. సృజనాత్మకమైన కృషికి ప్రధానావశ్యకం ఇదే. రైతులు తమతమ వృత్తులను ఎవరి ఆదేశం లేకుండ తమకుతామే ఎన్నుకొని తమ ఇష్టంతో పనిచేస్తుండటంవల్ల వారికి ఈ స్వాతంత్ర్యం ఉన్నది. కళాకారుడు తనపనిలో ఎంత స్వేచ్ఛను ఆనందాన్ని పొందగలడో రైతుకూడ అంతస్వేచ్ఛను ఆనందాన్ని అనుభవిస్తున్నాడు. చేసేపనిలో స్వేచ్ఛ ఉండటంవల్ల అతనికి ఆపనిలో తన వ్యక్తిత్వాన్ని ప్రదర్శించే అవకాశం లభిస్తున్నది. ఆ పనిలో ఐక్యమై దానిని తనసొంతం చేసికొని తనలోని సృజనశక్తుల ద్వారా ఆ పనికి ఒక విశిష్టతను చేకూర్చగల వీలు లభిస్తున్నది. ఎవ రెన్ని చెప్పినా ఈ ప్రపంచంలోని చాల విషయాలు మనమీదనే ఆధారపడి ఉన్నవని అనుకోవటం మనందరికి ఇష్టమే! మనం చేస్తున్న కృషి ఎలాంటి దైనప్పటికి దానిద్వారా మనం ప్రపంచానికేదో ఒక ప్రత్యేకసేవ

చేస్తున్నామని మనం అందరం భావిస్తూనే ఉంటాం. ఈ విషయాలు సాంఘికశాస్త్రం, మనస్తత్వశాస్త్రం అంగీకరించినవే కాని కొత్త వేమీకావు. ఈ సాంఘిక బాధ్యతలనుంచి తప్పుకొనిపోవలచిన వారు కూడ ఎంతో కొంత ప్రావీణ్యాన్ని ప్రదర్శించి తద్వారా ఆనందం పొందుతూనే ఉంటారు. ఇది ఎందువల్ల జరుగుతున్నది? బాధ్యతల నుంచి తప్పుకొనేవాడు తన పనిలోనే ఆనందం పొందటం ఎలా సంభవిస్తున్నది? ఇవి అంత పెద్దప్రశ్నలుకావు. మానవుడు తనకు ఇచ్చిక మైన కర్మలచ్చారానే, తన వ్యక్తిత్వాన్ని వ్యక్తంచేసి బలవత్తరం చేసి కోవటంలోనే ఆనందం పొందగలడు. దీనికి మించిన ఆనందం మనిషికి మరొకటి ఇవ్వలేదు. భౌతిక స్థితిగతులుకూడ ప్రధానంగా పరిశీలించ వలసిందే. దానిలో ఎవరికి సందేహం లేదు. కాని ఈ భౌతికస్థితిగతులే సర్వముకావు. కార్మికుడు ఎంత వేతనం సంపాదిస్తున్నాడనే విషయం ఎంతప్రధానమో, అతని మానసికశక్తుల వికాసానికి, ఆనందసాధనకు గల అవకాశాలు – వ్యక్తిత్వం సాహచర్యంలాంటి వాటి పరిశీలన – కూడ అంత ప్రధానం. ఇవన్నీకలిసి ఉంటేనే కాని మనజీవితానికి స్వేచ్ఛ, ప్రత్యేకవ్యక్తిత్వం ఉన్నవని మనం అనుకోలేము.

నేటి పారిశ్రామిక కూలీలకు తాము చేస్తున్నపనిలో ఎలాంటి స్వాతంత్ర్యము లేదు. దీనివల్ల ఎలాంటి ఫలితాలు పరిణామాలు వస్తున్నవో గమనించారా? కార్మికునికి తనపనిలో మార్పు లేకపోవటం వల్ల దానిమీద విసుగు పుడుతున్నది. చేసినపనే మళ్ళీమళ్ళీ చేయటం వల్ల ఆ పని నిర్జీవమై పోతున్నది. దానితో కార్మికునికి జీవితంలో అర్థం ఆనందం కనిపించకుండ పోతున్నవి. అతడు మానవత్వంనుండి దూరదూరంగా తప్పుకొని యంత్రప్రాయుడయ్యే స్థితి కలుగుతున్నది. తాను చేస్తున్నపనిలోని మెళకువలు అతనికి తెలిసినప్పటికి దానిని ఇలా అలా చేయాలని నిర్ణయించుకొనే అధికారం, చెప్పే అవకాశం అతనికి లేవు. ఆ పనికి తనకు సంబంధం లేకుండ పోతున్నది. అసలు తానాపనిని ఎందుకు చేస్తున్నాడో అతనికే తెలియదు. కాబట్టి నేటి పారిశ్రామిక కార్మికునికి తన ఉదరపోషణార్థం ఇది భరించక తప్పని సరిఅయి ఈ పనులను చేస్తున్నాడని స్పష్టమవుతున్నది. తనపనిలో

తనవ్యక్తిత్వం పెంపొందించుకొనే అవకాశాలు లేకపోవటం అలా ఉంచి ఆ పనివల్ల అతడు ఎలాంటి సంతోషము పొందలేకుండ ఉన్నాడు.

రైతు విషయం అలాకాదు. తన పనిలో అతనికి పూర్తి స్వేచ్ఛ ఉండటమే కాక ఎవరికి లొంగకుండ తనకుతానై తనవృత్తిని కల్పించుకొని స్వతంత్రజీవిగా బ్రతుకుతున్నాడు. రైతుకి ఎప్పుడు ఎక్కడ ఏవిధంగా ఎలాంటి పనిచేసికోవాలో తానే నిర్ణయించుకొనే స్వేచ్ఛ ఉన్నది. పెద్దపెద్ద యంత్రపరిశ్రమలలో సముద్రంలో నీటిబొట్టు వలె తాను లెక్క-లోనికి రాకపోవటం ఉన్నది. రైతు అలాంటి వాడు కాడు. రైతు తనకు, తన కుటుంబానికి మాత్రమే బాధ్యుడు. తనమీద పెత్తనం చెలాయిస్తూ ఈ పనిచెయ్యి, ఇలాచెయ్యి, అని చెప్పే అధికారు లెవ్వరులేరు. తనపైన మరొకరికి ఆ అధికారం లేదు. అలాగే మరి కొంతమందిని తనగుప్పెటలో ఉంచుకొని రైతు అధికారం చలాయించడు. అతడు ఎవరికీ అధికారికాదు; తనకుతానే అధికారి, తనకుతానై కొన్ని నిర్ణయాలు తీసికోవటం, వాటిని అచరణలో పెట్టటం, దానిద్వారా వచ్చిన ఫలితాలను పరిణామాలను స్వీకరించటం అతని వృత్తిధర్మం. అతడు వృక్షాదులను పెంచుతాడు; వాటితో పాటు తానుకూడ బాధ్యతాయుతంగా పెరుగుతాడు. తనలో ఉన్నప్రావీణ్యం కొద్దిదైనా గొప్పదైనా తనపనిలో దానిని పూర్తిగా వినియోగించుకొనే అవకాశం అతనికి ఉన్నది; తద్వారా తన వ్యక్తిత్వాన్ని తనపనిలో చూపించగల అవకాశం అతనికి లభిస్తున్నది. ఇదే కాక అతనికి ఇంకొక స్వేచ్ఛకూడ ఉన్నది. అనుదినం తనకృషిలో భాగస్వామ్యం పంచుకొంటున్న జంతువులు, వృక్షాదులు అతని మీదనే ఆధారపడి ఉంటున్నవి. తాను నివసిస్తున్న కృషిచేస్తున్న తన చుట్టు ఉన్న ప్రపంచానికి, ప్రపంచపరిస్థితులకు తా నెంతటి సేవ చేస్తున్నాడో అతనికి తెలుసు. వీటి అన్నిటికి మించి రైతుకు మరొక స్వేచ్ఛ ఉన్నది. తన వృత్తికోసం, పనికోసం అతడు ఎవరి దయాదాక్షిణ్యం మీద ఆధారపడవలసిన అవసరం లేదు. ఎవరి అడుగులకు మడుగులొత్తనలసిన అవసరం లేదు. అతడు తనకు తానై స్వయంగా తన వృత్తిని కల్పించుకొని శ్రమపడుతున్నాడు. ఎలాంటి పరిపాలనా నిర్వ

హణశాఖకు అతడు బానిస కాడు. ఏ అధికారికీ దాసుడు కాడు; పని అంటే ఏమిటో, దానిలోని మెళకువలేమిటో తెలియని అధికారుల ఆజ్ఞలను పాటించవలసిన అగత్యం అతనికి లేదు. ఇలాంటి అధికారుల ఆజ్ఞలవల్ల శ్రామికుడు తనకుతానై పనిలో శ్రద్ధతీసికొని ఉత్సాహంతో స్వేచ్ఛగా తనలోని సృజనాత్మక శక్తులతో కృషి చేసే అవకాశం మృగ్య మవుతుంది; అతని వ్యక్తిత్వం పెంచుకొనే అవకాశాలు సన్న గిల్లుతవి.

నైతు తనవృత్తిని తనంత తాను కల్పించుకోవటంవల్ల అతనికి మరికొన్ని ప్రయోజనాలుకూడ కలుగుతున్నవి. కాయకష్టం ఎంత విలువైనదో దాని ప్రాముఖ్యమేమిటో అతడే గ్రహించగలడు; పైగా వ్యవసాయపు పనులు మారుతూ ఉంటాయి. కనుక అతనికి తన వ్యవసాయంలో విసుగు కలగదు. ఆధునికకాలంలో సాంఘిక స్థితిగతులు జీవనవిధానాలు అనుదినం కేంద్రీకృత మవుతున్న కాలంలో ఇలా స్వయంగా వృత్తులను కల్పించుకొని తమకాళ్ళమీద తాము నిలబడగలమన్న విశ్వాసాన్ని ప్రజల కందించగల వృత్తివిధానం ఎలాంటి విలువ గలిగినదో వేరే చెప్పవలసిన అవసరం లేదు. దాని ప్రాముఖ్య తను గురించి ప్రొఫెసర్ జి. డి. కార్వే ఏమంటున్నాడో చూడండి.

"నా దృష్టిలో స్వయంపరిపాలన కంటె స్వయంవృత్తి (తనకు తాను వృత్తి కల్పించుకోవటం) అత్యంత ప్రధానమైనది. మరొకరి చెప్పుచేతలకు లోబడి వారికోసం పని చేయటంలో వ్యక్తి తాను అణచివేయబడుతున్నట్లుగా భావిస్తాడు. తనకు రావలసినంత తన యజమాని ఇవ్వటం లేదని బాధపడతాడు. ఆ యజమాని సంఘంలోని మేధస్సంపదనంత తన ప్రయోజనాలకే వినియోగించుకొని స్వార్థపూరితుడవుతున్నాడని భావిస్తాడు. కాబట్టి ఆర్థికవిధానాలను జీవితాన్ని రూపురేఖలు దిద్దేటప్పుడు ఇలా స్వయంగా వృత్తిని కల్పించుకొనే అవకాశం ఇచ్చేటట్లు చూడాలి. కనుక ఆధునిక శాస్త్ర విజ్ఞానంతో లభ్యమవుతున్న యంత్రాలనుపయోగించి, ఆర్థికరంగాన్ని సంస్కరించేటప్పుడుకూడ ఒక ముఖ్య విషయాన్ని మరువరాదు. మనం సృజింపనున్న నూతన యంత్రాలుకూడ ఒక వ్యక్తి, అతని కుటుంబం తమకు

తాముగా వాటిని ఉపయోగించు కొనేటట్లు ఉండాలి. ప్రతి కుటుంబానికి అవి అందుబాటులో ఉండాలి. ఆధునిక శాస్త్ర విజ్ఞానదృష్టితో పరిశీలించినపుడు కుటుంబానికి అందుబాటులోఉండే ఈ యంత్రాలు, వాటితో పనిచేస్తున్న విధానాలు అంతలాభదాయకంగా, విజ్ఞానపూరితంగా కనపడక పోవచ్చు. కాని మానవునికి కావలసింది కేవలం భౌతికసుఖాలు, ఆర్థిక లాభాలు మాత్రమే కావు. ఈ చిన్నచిన్న యంత్రాలద్వారా మానవజాతి తన వ్యక్తిత్వాన్ని వ్యక్తంచేస్తూ అభివృద్ధి చేసికొనే అవకాశాలు ఉన్నవి. మానవుడు ఎల్లప్పుడు ఆర్థికలాభదృష్టితోను, భౌతిక సుఖసంపాదన దృష్ట్యానే మాత్రమే పనిచేయాలని నియమం పెట్టుకొంటే మానవ జీవితానికి అర్థం కనిపించదు; మానవునిలోని తెలివితేటలకు, వ్యక్తిత్వానికి, సృజనశక్తికి ప్రయోజనం కనిపించదు. కాస్తో కూస్తో ఆర్థిక సంపదను సంపాదించటంకంటె ఈ సృజనశక్తిని పోషించుకొంటు వ్యక్తీకరించటం ముఖ్యం. మానవజాతి చరిత్రలోని అభ్యుదయం, నాగరికత మానవునిలోని అన్వేషణా తృష్ణవల్ల, "సృజనశక్తి వల్లనే కదా సాధ్యమైంది." *

మనరైతుకి కేవలం స్వయంవృత్తే కాక మరొక ప్రయోజనం కూడ ఉన్నది. తన ఉత్పత్తి విధానానికి అతడే యజమాని, అధిపతి. తన ఉత్పత్తి విధానాలమీద రైతుకిఉన్న ఈ ఆధిపత్యంవల్ల ఆ ఉత్పత్తి విధానంమీద రైతుకి కొన్ని శాశ్వతమైన హక్కు లేర్పడుతున్నవి. ఈ హక్కులను అతని నుంచి ఎవరుకూడ తేలికగా తీసికోలేరు. ఈ విధానం రైతులస్వేచ్ఛా స్వాతంత్ర్యాలను స్వయంవృత్తిని మరెవరుఅణచివేయకుండ పాటుపడుతుంది. అంటే మానవునికి ఈ రైతుస్వామ్యం వల్ల స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు స్వయంవృత్తి లభిస్తున్నవి. అంతేకాక ప్రతి వాడు తన శ్రమకు తగిన ఫలితం పొందాలన్న విశ్వధర్మ సూత్రానికి ఈ విధానమే భద్రతను కలిగిస్తున్నది. నేటి ప్రపంచంలోని పారిశ్రామిక కూలీలకు తమ ఉత్పత్తివిధానాలమీద ఆధిపత్యం, యాజమాన్యం లేనందువల్లనే వారు కమ్యూనిస్టు నాయకత్వం వైపుకి చూడటం సంభవిస్తున్నది. కమ్యూనిస్టునాయకత్వంలో వ్యక్తిగతంగా

* All India Co-operative Review vol. XXI (1955-56) pp. 310-311.

కాని, సహకారవిధానాలద్వారా గాని, సమిష్టి కృషితోగాని తమ ఉత్పత్తివిధానాలకు తామే అధిపతులం అవుతామన్న ఆశవల్లనే వారు కమ్యూనిజంవైపుకి చూస్తున్నారు.

తన ఉత్పత్తిమీద, ఉత్పత్తివిధానాలమీద రైతుకి ఆధిపత్య హక్కులు లేనిపక్షంలో అతని స్వేచ్ఛ కౌలుదారుకివలె తన పనివరకు మాత్రమే పరిమిత మవుతుంది. పనిలో స్వేచ్ఛతప్ప ఇతర అవకాశాలను రైతు కోల్పోవటం జరుగుతుంది. తాను సాగుచేస్తున్న భూమి తనసొంతం కాకపోవటంచేత, అది తన క్రింద కొంతకాలమే ఉండటంవల్ల కౌలుదారుకూడ వృత్తికోసం జీవికకోసం ఇతరులమీద ఆధారపడవలసి ఉన్నది. తన పనిలో తనకు స్వేచ్ఛను తనస్వయం వృత్తిని కలకాలం కొనసాగించుకోగల నమ్మకం లోపించినా, తనకృషి ఫలితం తన కందటం లేదనే భావం కలిగినా సృజనాత్మకకృషికి కావలసిన ఉత్సాహం, శ్రద్ధ లోపించే ప్రమాదమున్నది. యాజమాన్యపు హక్కులున్న మన రైతుకి కౌలుదారుకివలె స్వయంవృత్తి ఉండటమే కాదు; అతనికి అంతకంటె విశేషప్రయోజనాలు మరెన్నో లభిస్తున్నాయి. మన రైతుకి సర్వ స్వతంత్రవ్యక్తిత్వం ఉన్నది. తన చుట్టుపట్ల వాతావరణానికికూడ అతడే అధిపతి. తనకున్న ఈ స్వేచ్ఛ ఎప్పటికి అంతరించేది కాదని అతని విశ్వాసం. తన శ్రమవల్ల లభిస్తున్న ఫలితాలు అతనికే లభిస్తాయని అతనికి నమ్మక మున్నది. కాబట్టి రైతుకు భూస్వామ్య హక్కులుండటంవల్ల జీవనోపాధికి మాత్రమే భద్రత లభిస్తుందని ఆర్థిక దృష్టితో పరిశీలించేవారు భావిస్తున్నారు. కాని ఈ హక్కులవల్ల జీవనోపాధి భద్రత మాత్రమేకాక అంతకంటె విశిష్టమైన మానవ విలువలెన్నో మనరైతు పొందగలుగుతున్నాడు. తన స్వేచ్ఛాస్వాతంత్ర్యాలకు సాంఘికన్యాయానికి కూడ ఈ ఆధిపత్యపు హక్కులు భద్రతను కలిగిస్తున్నవి.

స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు నామమాత్రమై మరొకరిమీద ఆధారపడక వీలులేని స్థితిగతులు ఏర్పడిన ఆధునిక ప్రపంచంలో కూడ రైతు తనస్వేచ్ఛను, స్వాతంత్ర్యాన్ని నిలుపుకోగల శక్తిమంతుడు. ఇది ఎలా

సాధ్య మవుతున్నది? అనే సందేహం రావచ్చు. తన భూమిమీద తనకు పూర్తిహక్కు లుండటంవల్ల, తన సొంత భూమిమీద కాని కౌలుభూమిమీదకాని ఇతరులమీద అంతగా ఆధారపడవలసిన అవసరం లేకుండ తన కుటుంబంతో కలిసి కృషి చేసికోవటంవల్ల ఇది సాధ్య మవుతున్నది. కేవలం కూలికోసం పనిచేసే వారికి ఆ పని తమ సొంతం అని భావించి శ్రద్ధతీసికొనే అవకాశం ఉండదు. భూమిమీద తనకున్నహక్కు రైతుకి భుక్తిగడుపుతున్నది; అతనికిపని కల్పిస్తున్నది. ఉత్తమ జీవితవిధానాన్ని ప్రసాదిస్తున్నది. జీవితంలో తగిలే ఎదురుదెబ్బలను, ఒడుదుడుకులను తట్టుకొని సవరించుకొని నిలబడగల భద్రతను కలిగిస్తున్నది. అతని జీవికకు, వృత్తికి ఈ విధంగా భద్రత ఉండటంవల్లనే రైతు స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను నిలుపుకోగల వాతావరణాన్ని సృజించుకొని ఆనందించ గలుగుతున్నాడు. ఈ స్వేచ్ఛాస్వాతంత్ర్యాలవల్లనే రైతు అనుదినం కొన్ని నిర్ణయాలు తీసికొని, వాటిని ఆచరణలో పెట్టి వాటివల్ల వచ్చేఫలితాలను స్వీకరించటం నేర్చుకొంటున్నాడు. ఇలా నిర్ణయాలు తీసికోగల శక్తి, వాటి ఆచరణలో భాగం పంచుకోగల అవకాశం, అతని వ్యక్తిత్వాన్ని పెంచుకోవటానికి దోహదకారు లవుతున్నవి. రైతేకాదు; ఏవ్యక్తి అయినా తన వ్యక్తిత్వాన్ని పెంచుకోవాలంటే ఇంతకంటె సులువైన మరొక మార్గం లేదు. సాంఘిక అభ్యుదయానికి ఆ సంఘంలోని ప్రబలవ్యక్తిత్వం పెరగటం అత్యావశ్యకం. సొంతవ్యక్తిత్వంలేని ప్రజలతో బాధపడుతున్న ఆధునికసంఘంలో ఇంతకంటె కావలసిన దేమున్నది? ఈ వ్యక్తిత్వం మన రైతులకు తమ రైతుస్వామ్య ఆర్థికవిధానంవల్ల సునాయాసంగా లభిస్తున్నది. దానిని పెంపుచేసికొనే అవకాశాలు కూడ వారికి లభిస్తున్నవి. కాని దురదృష్టవశాత్తు ఆధునికకాలంలోని నియంతృత్వ సంఘాలలో—కార్మికనియంతృత్వంలోను అధికారకేంద్రీకరణతో తొణికిసలాడుతున్న నామమాత్రపు ప్రజాస్వామ్యంలోనుకూడ —మొట్టమొదటి బలిపశువు మనరైతు; రైతుస్వేచ్ఛ. తత్ఫలితంగారైతులు, రైతుస్వామ్యవిధానం సంఘానికి అందిస్తున్న అనేకప్రయోజనాలు అడుగంటిపోతున్నవి. సంఘంలో అధికసంఖ్యాకులుగా ఉన్న స్వేచ్ఛాజీవులైన రైతులు, ప్రజాస్వామ్యజీవితవిధానం, సాంఘికబాధ్యతలను తమనెత్తిని వేసికొని

తమ వ్యక్తిత్వాన్ని పెంచుకొంటు శ్రమిస్తున్న రైతాంగం ఈ నియం తృత్వాలలో బలిఅయి పోతున్నది. రైతులకు భూమిమీద ఉన్న హక్కులవల్ల ఇలాంటి ఆర్థికేతరప్రయోజనాలెన్నో సిద్ధిస్తున్నవి. ఈ ఆర్థికేతరప్రయోజనాలవల్ల రైతులలో సృజనశక్తి పెంపొంది, ఒకరిని దోపిడి చేయాలన్నవాంఛ పోయి, నూతనోత్సాహంతో కార్యరంగం లోకి దూకుతాడు. ఈ ఉత్సాహంతో భూమి రైతుతో తాదాత్మ్యం పొందుతుంది; రైతునుంచి విడదీసిచూడగల అవకాశం ఉండదు. అంటే రైతేభూమి, భూమేరైతు అన్న ఉత్సాహం సంప్రదాయం లభిస్తున్న వన్నమాట. "భూమిమీద రైతుకి హక్కులుండాలి. ఈ హక్కులుండటంవల్లనే రైతులో భూమికూడ ఒకభాగం. భూమిఅంటేనే రైతు అనే వాతావరణం కలిగించ వీలవుతుంది."*

రైతుల ఆధిపత్యం దానంతట అదే సక్రమంగా పనిచేస్తుం టుంది. వారి ఆధిపత్యానికి సక్రమకార్యనిర్వహణ సహజప్రకృతి. రైతుల వృత్తినుంచి కుటుంబ వ్యవసాయాన్ని విడదీసే వీలులేదు. పైగా వారి వృత్తికి ఈ కుటుంబ వ్యవసాయమే జవం జీవం సమకూరు స్తున్నది. రైతు తనస్వేచ్ఛకోసం ఇతరుల స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను హరించటం లేదు. ఇతరుల జీవితంమీద పెత్తనం చేయవలసిన అవ సరం అతనికి లేదు. పైగా ఇతరులతో ఎలాంటి సంబంధమూ లేకుండ తనకు తానే తనస్వేచ్ఛను సంపాదించుకొన్నాడు. స్పష్టంగా చెప్పా లంటే సృజించుకొంటున్నా డన్నమాట. ఇతరులను దోచుకోవలసిన అవసరం, వారిపై పెత్తనం చలాయించవలసిన అవసరం అతనికి లేదు; కుటుంబవ్యవసాయంలోని విశిష్టగుణం ఇదే. మంచి పనితరుణంలో ఏదో కొద్దిమంది కూలీలను పెట్టుకోవటం తప్ప సాధారణంగా కుటుంబ వ్యవ సాయ పద్ధతిలో మామూలు వ్యవసాయపు పనులన్నిటిని ఆ కుటుంబం లోనివారే చేసికొంటారు. కాబట్టి రైతుల కుటుంబవ్యవసాయ విధానా నికి యంత్రపరిశ్రమలలో వలె పెద్దఎత్తున కార్మికులను తన క్రింద ఉంచి నిర్వహించుకో వలసిన అవసరం లేదు. కనుక యజమాని, కార్మికుడు

*Lord Ernle : Quoted by G. T. wrench in "The Restoration of the Peasantry."

అన్న సంబంధాలుకాని సమస్యలుకాని ఈ విధానంవల్ల రావు; ఉంటా యనుకొన్నప్పటికి వారు కూలీలను చాల కొద్దిగా ఉపయోగించు కొంటారు కనుక దానివల్ల నేడు కనిపిస్తున్నన్ని సమస్యలు రావు. అంతేకాక ఈ విధానంలో యజమాని కార్మికుల సమస్యలు లేకపోవ టానికి మరొక కారణంకూడ ఉన్నది. రైతులు కూలీలను చాల కొద్దిగా అదీ అవసరమైన తరుణాలలో మాత్రమే పెడతారు. ఆ కొద్ది మంది కూలీలుకూడ రైతుల ఆజ్ఞను శిరసావహిస్తూ పర్యవేక్షణక్రింద పనిచేయరు. రైతుకుటుంబంతోపాటే వీరుకూడ పనిచేస్తారు.

కాబట్టి రైతు పెట్టుబడిదారుడు కాదు; భూస్వామికాదు; దిన భత్యపు శ్రామికుడూకాదు. అతడు తన కాళ్ళమీద తాను నిలబడి స్వతంత్రంగా నిలబడి ఉత్పత్తి చేస్తాడు. అలాంటి రైతుకి అందువల్లనే కావచ్చు – 'మార్క్స్' వర్గీకరణలో ఏ వర్గంలోను స్థానం దొరకలేదు.

సృజనాత్మక ఉత్పత్తివల్ల సిద్ధించే ఆర్థికేతరవిశిష్టగుణాలన్నీ రైతుల వృత్తివల్ల లభిస్తున్నవని తేలిందిగదా! ఆర్థికేతరవిశిష్టగుణా లంటే–ప్రకృతిలోకలిసి పనిచేయటం, స్వయంగా వృత్తిని కల్పించుకొని గౌరవస్థానాన్ని పొందటం, ఇతరులను దోపిడిచేయనవసరం లేకుండ తనకు భద్రతను ప్రసాదించేటటువంటి భూమిహక్కులు కలిగి ఉండటం లాంటివి. ఇవన్నీ రైతుల కుటుంబవృత్తిలోని విశిష్టలక్షణసముదాయం. ఈ ప్రత్యేక లక్షణాలన్నీ మానవజాతికి లాభకరాలని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదుగదా. వీటిలో ఏ ఒక్క లక్షణం కొరవడినా ఆ వృత్తి ఆమేరకు నష్టపడక తప్పదు. స్వయంగా వృత్తిని కల్పించుకొని శ్రమించనిదే సృజనక్రియలోని ఆనందం పొందటం వీలుకాదు. రైతుకు భూమిమీద సర్వహక్కులులేని పక్షంలో, కౌలుభూమి అయితే అది తనచేతిలో దీర్ఘకాలం ఉంటుందన్న నమ్మకంలేని పక్షంలో, ఈచెప్పిన సృజనక్రియలోని స్వయంగా వృత్తిని కల్పించుకోవటంలోని గౌరవం రైతుకి లభించే అవకాశం లేదు. భూమిమీద తానై కష్టించి పనిచేయని భూస్వాముల విషయంలో ఇవన్నీ తలక్రిందు లవుతాయి. రైతుపద్ధతి కుటుంబవ్యవసాయంవల్ల అతనికి సంఘానికి ఎన్ని లాభాలు కలుగుతున్నవో వ్యవసాయం చేయని భూస్వాములవల్ల అన్ని నష్టాలు

వస్తున్నాయనటంలో ఎలాంటి సందేహములేదు. భూస్వామి తన భూమిని తానై సాగుచేయకుండ ఆ భూమినుండి రాబట్టవలసినంత ఫలసాయాన్ని రాబట్టటానికి నిర్మాణాత్మక కృషి చేయకుండ ఉన్న పక్షంలో అతనిని రైతు అనటానికి వీలులేదు. అతడు ఇతరుల శ్రమ మీద సంఘశ్రమమీద ఆధారపడి జీవించే దోపిడీదారు డవుతాడు.

'భౌతిక కృషిని మానసిక ప్రయత్నాలను సరైన పాళ్ళలో ఉంచటం' [1] లో ఈ రైతు వృత్తి ప్రముఖపాత్ర వహిస్తున్నది. కనుక ఈ రైతువృత్తిని ఎలాంటి పరిస్థితులలోను అదృశ్యం కాకుండ కాపాడుకో వలసి ఉన్నది. మానసికంగాను, భౌతికంగాను కూడ చిందర వందరగా ఉన్న నేటిసమాజానికి మన రైతు వృత్తితో లభ్యమవు తున్న ఆర్థిక సాంఘిక భద్రతలు అత్యావశ్యకం. మానవుడు తన వ్యక్తి త్వాన్ని స్వేచ్ఛను వ్యక్తం చేస్తూ పరిపాలించుకొనే అవకాశాలను అందించగల రైతువృత్తి ఎలాంటి సమాజానికైనా ఎంతగా ఉప యోగకారి అవుతుందో చెప్పనవసరం లేదు. ఎన్ని కష్టాలు వచ్చినా ఎన్ని బాధలుపడి అయినాసరే అలాంటి రైతువృత్తిని కాపాడు కోవటం లాభదాయకమే అవుతుంది. కనుకనే రైతువృత్తిని త్రోసి వేయకుండ నిలబెట్టుకోవలసిన అవసరం ఉన్నది; ఆ వృత్తిని ఇంక అభి వృద్ధిచేసి భాగ్యనంతం చెసికోవలసి ఉన్నది. జోరియక్ జెంకిన్స్ మాట లలో చెప్పాలంటే "మన జీవిత విధానాలలో కుటుంబజీవనం చాల సహజమైన, ప్రకృతిసిద్ధమైన జీవితవిధానం. ప్రధానమైన సంపదను సంపాదించటానికి అదే ప్రత్యక్షవిధానం. ఈ సహజజీవిత విధానం ప్రత్యక్ష సంపాదనావిధానం నేటి మన ఆర్థిక సాంఘిక తత్త్వశాస్త్రాల లలో ఇమడక పోయినపక్షంలో తప్పు మనతత్త్వశాస్త్రంలోనే ఉన్న దన్నమాట. ఎందువల్లనంటే ప్రకృతి మారేదికాదు కదా! ప్రకృతి సూత్రాలను గురించిన మనవ్యాఖ్యానాలు, వాటినిగురించిన మన దృక్పథాలు మాత్రమే మారుతుంటవి. ప్రకృతికి సరిపడేటట్లు వీటిని సవరించుకొని సరిపెట్టుకోవాలి." [2]

---

1 George Henderson, "Farmer's Progress"—1949 P. 220.

2 "The Small Farmer"—Edited by H. J. Massingham.

రైతువృత్తివల్ల లభిస్తున్న ఆర్థికేతరసంపదలో ఇలాంటి విలువైన ప్రయోజనాలు లభిస్తున్నవి. ఇక ఈ వృత్తివల్ల వచ్చే ఆర్థికసంపద అంటే రైతు తన భూకమతంమీద తీస్తున్న నికరోత్పత్తి. రైతు తన వృత్తివల్ల వ్యావసాయకోత్పత్తుల రూపంలో సాధిస్తున్న ఆర్థికసంపద అతనికి సంఘానికికూడ చాల ప్రాధాన్యం కలదే అనటంలో ఎవరికి సందేహం లేదు. ఆ రాబడిని సాధ్యమైనంత ఎక్కువగా రాబట్టాలనటంలోకూడ ఎవరికీ పేచీ ఉండదు. కాని ఈ ఆర్థికసంపదకు ఎంత ప్రాధాన్యం ఇస్తున్నామో రైతువృత్తివల్ల లభించే ఆర్థికేతర సంపదకుకూడ అంతప్రాముఖ్యం ఇవ్వవలసి ఉన్నది. ఈ ఆర్థికేతర సంపదనుకూడ ప్రధానంగా పరిగణించి అభివృద్ధి చేయగల ప్రణాళికలుకూడ కావాలి. కనుక మన వ్యావసాయక రంగాన్ని సంస్కరించటానికి పునర్నిర్మించటానికి వేసే ప్రణాళికలు వీటి రెంటిని అభివృద్ధిపరచవలసిన బాధ్యతను స్వీకరించాలి; వీటిలో ఒక దానిని విస్మరించికాని, వదలివేసికాని రెండవదానిని సాధించ బూనటం అవివేకం. వ్యవసాయోత్పత్తులను సాధ్యమైనంత ఎక్కువ స్థాయికి తీసికొని పోవటమే లక్ష్యం అయినప్పటికి పైనచెప్పిన ఆర్థికేతరసంపదను విచ్ఛిన్నంచేసి ఈ లక్ష్యాన్ని సాధించగూడదు. అలాగే ఆర్థిక లాభాన్ని త్రోసివేసి ఆర్థికేతరసంపదను వృద్ధిచేసేయత్నం గూడ పనికిరాదు. వ్యవసాయరంగాన్ని సంస్కరించాలనే ఉద్దేశ్యంతో చేయబడుతున్న ప్రతిపాదనలను ప్రణాళికలను (ఈ విషయాన్ని స్పష్టంగా మనస్సులో పెట్టుకొని) పరిశీలించి సరైన అభిప్రాయాలకు రావలసి ఉన్నది.

ముందు చెప్పబోయే అధ్యాయంలో మనవ్యవసాయంలోను, రైతాంగంలోను ఉన్న ప్రత్యేక లక్షణాలను – మంచివాటిని చెడ్డ వాటిని గూడ గురించి మేము పరీక్షించటం జరిగింది. నేటి మన రైతాంగ వ్యవసాయ విధానంలో ఉన్న లక్షణాలలో వేటిని మనం నిలుపుకోవాలి వేటిని వదలివేయాలి అన్న దృష్టితో మా పరిశీలన సాగింది. మన వ్యవసాయంలో నేడు కనిపిస్తున్న దోషాలను సవరించి వ్యవసాయాన్ని అభివృద్ధికరమైన పరిశ్రమగా చేయాలని మేముకూడ

అంగీకరిస్తున్నాం. మన రైతాంగాన్ని అభ్యుదయమార్గంలో పెట్టి వారిని రైతులుగాను, మానవులుగాను నేటికంటె ఉచ్చదశకు తీసికొని పోవాలని మనఅందరి ఆకాంక్ష. దీనిని సాధించాలంటే సహకార వ్యవసాయ విధానాన్ని ప్రవేశపెట్టటమే సరైనమార్గమని నేటి మన రాజ్యపాలకులు చెపుతున్నారు. కనుక ఈ సహకార వ్యవసాయ మంటే ఏమిటో మనం పరిశీలిద్దాం.

—o—

అధ్యాయం - 2

సహకార వ్యవసాయం

'సహకారం'అనే విశాలసూత్రం దృష్ట్యా 'సహకారవ్యవసాయం' అనే మాటను అనేక విధాల వివరించి వ్యాఖ్యానించటానికి అవకాశ మున్నది. కనుకనే దీనిని ఇప్పటికే ఎంతోమంది తమతమ ఆశయాలకు అనుగుణంగా వ్యాఖ్యానించటం జరిగింది. సహకార వ్యవసాయం గూర్చి తెలిసికొనే ముందు అసలు సహకారసంఘ మంటే ఏమిటో, దాని ప్రధాన లక్షణాలేమిటో గ్రహించటం అవసరం. ప్రత్యేకవ్యక్తులు తమకందఱకు అంగీకారయోగ్యమైన ఆశయాన్ని సాధించటం కోసం తమ ఇష్టానుసారంగా ఒక సంఘంగా ఏర్పడి స్వయంసహాయంతోను పరస్పరసహాయంతోను ఆ ఆశయసిద్ధికి పాటుపడే సంఘాన్ని సహకార సంఘం అంటారు. సహకారసంఘ నిర్వహణలో ఎట్టిమార్పులకు లోను కాకుండ ఉండే ప్రధానసూత్రం ప్రతిఒక్క సభ్యునికి ఒక్క ఓటు మాత్రమే ఉంటుంది. సహకారసంఘంలో చేరటం చేరకపోవటం అనేది పూర్తిగా ఆయా వ్యక్తుల ఇష్టానిష్టాలమీదనే ఆధారపడి ఉండాలి. ఇందువల్లనే ఈ సహకార వ్యవసాయంలో అన్నిరకాల వ్యవ సాయ విధానాలను చేర్చి అవి అన్నీ సహకార వ్యవసాయాలేనని చెప్పటం జరుగుతున్నది. ఉదాహరణకు వ్యక్తికవ్యవసాయం, కౌలు దారీవ్యవసాయం, ఉమ్మడివ్యవసాయం, సమిష్టివ్యవసాయం ఇవన్నీ ఈ సహకారవ్యవసాయంలో ఇమిడి ఉన్నవి. సహకారవ్యవసాయాన్ని గురించి ఇంత విశాలభావంతో వివరించే నిర్వచనాన్ని, దానివిలువను గ్రహించాలంటే సహకారవ్యవసాయ మనేది ఒక ప్రత్యేక ప్రదేశంలో, ప్రత్యేక కాలంలో ఆయా పరిస్థితులకు సన్నివేశాలకు లోబడి ఒక ప్రత్యేక ప్రయోజనాన్ని సాధించటానికి ఆవశ్యకమైన ఉపకరణమని భావించవలసి ఉంటుంది. అలాకాక మన వ్యవసాయరంగం మొత్తానికి అదే ఉత్తమ విధానంగా భావించి, ప్రవేశపెట్ట దలచినపుడు ఈ సహ కార వ్యవసాయ లక్షణాలేమిటో, విధానాలేమిటో, అది ఎలా పని చేస్తుందో సక్రమంగా పరిశీలించుకోవటం అవసరం. ఈ పరిశీలనను

జాగ్రత్తగా నిర్వహించుకొని సరైన అభిప్రాయాలకు రావటం అవసరం. లేనిపక్షంలో ఈ సహకారవ్యవసాయాన్ని గురించి నేడున్న అనిశ్చితాభిప్రాయాలు ఇంకొంత పెరుగుతాయి. దానితో కొందరికి అదే సర్వస్వంగా కనిపిస్తుంది; మరికొందరికి ఎందుకు పనికిరాని కొఱ ముట్టుగా తోస్తుంది.

సహకార వ్యవసాయాన్ని గురించి ఇక్కడ మేము ఎలాంటి నిర్వచనాలను ఇవ్వబోవటంలేదు. మన దేశభవిష్యత్తును, స్వరూపాన్ని మూసలో పోసి క్రమబద్ధంగా మలుస్తున్న మన జాతీయ ప్రణాళికా సంఘం ప్రతిపాదించిన నిర్వచనాన్నివిడమరిచి పరిశీలించటం వరకే మా పని. కనుక మన ద్వితీయ పంచవర్ష ప్రణాళికలో ఈ సహకార వ్యవసాయం గురించి ఇచ్చిన నిర్వచనంవరకే మేము పరిమిత మవుతున్నాం. ఆ దృష్టితోనే సహకార వ్యవసాయ సమస్యను పరిశీలించనున్నాం.

I

"భూమిని ఒకచోటికి చేర్చటం (అంటే ఏకక్షేత్రంచేసి సాగు చేయటమన్నమాట) ఉమ్మడి పెత్తనం అనేవి సహకారవ్యవసాయంలో ప్రధానంగా ఇమిడి ఉన్నవి." * భూమిని ఒకచోట చేర్చటమంటే దానితో సరిపోదు. దానితోపాటు ఇతర ఆస్తులనుకూడ—అంటే వ్యవసాయపరికరాలు, వ్యావసాయకకృషి—ఒకచోట చేర్చక తప్పదు. ఇలా ఒకచోట చేర్చబడిన భూమి, ఇతర ఆస్తులు వ్యక్తుల కలయికతో ఏర్పడిన సహకార సంఘానికే చెందుతాయి. కాని సంఘంలోని వ్యక్తులకు చెందవు. అంటే వాటిమీద పెత్తనం సహకారవ్యవసాయ సంఘానిదే కాని సంఘంలో సొంతంగా జీవించే వ్యక్తులకు ఉండదు. ఈ సంఘంయొక్క కార్యకలాపాలకు ప్రణాళికలు వేయటంలోను వాటిని ఆచరణలో పెట్టటంలోను, ఆ సంఘం పనిచేసే ప్రజలకందరకు—వారికి భూమి ఉన్నా లేకపోయినా—సమానమైన హక్కులుంటాయి. ఒక్కొక్కనికి ఒక్కఓటు అనేది సహకారరంగంలో ప్రధానసూత్రం కనుక

---

* Government of India, Planning Commission : Second Five year Plan 1956—P. 201.

దానిని ఎవరూ తీసి వేయలేరు. ఈ సభ్యులందరు కలిసి ఒక నియమిత కాలం అధికారంలోఉండె ఒక కార్యనిర్వహణశాఖను ఎన్నుకొంటారు. ఈ కార్యనిర్వహణశాఖ సహకారసంఘంలోని అత్యధిక సంఖ్యాక ఆమోదంతో ఏర్పాటు చేయబడిన సూత్రాలకు, మార్గాలకు లోబడి తన నియమిత కాలంలో సంపూర్ణాధికారంతో పని చేస్తుంటుంది. ఈ విధంగా ఎన్నుకొనబడిన కార్యవర్గం వ్యావసాయక పనుల నన్నింటిని ముందుగానే నిర్ణయించి తన సభ్యులసహకారంతో వాటిని ఆచరణలో పెట్టుతుంది. ఏ యే పంటలను వేయవలసినదికూడ కార్యవర్గమే నిర్ణయిస్తుంది. తన సభ్యుల సాంస్కృతిక వ్యావసాయక సాంప్రదాయాలను రూపొందిస్తుంది. వ్యవసాయోత్పత్తికి కావలసిన సరంజామా నంత కొని వ్యాయసాయకోత్పత్తులను అమ్ముతుంది. సహకార వ్యవసాయ సంఘంలోని సభ్యులందరు ఈ కార్యవర్గపు సూచనల ప్రకారం, దాని ఆదేశాలకు తలవంచి, దాని పర్యవేక్షణ క్రింద పని చేయవలసి ఉన్నది. సహకార వ్యవసాయంలోని పనిని శారీరక శ్రమ, పర్యవేక్షక కృషి, ప్రణాళికలను రూపొందించి ఆధిపత్యం వహించే పని అన్న రీతిగా విభజిస్తుంది. ఈ యీ పనులను తన సభ్యులను కొన్ని వర్గాలుగా విభజించి ఒక్కొక్క వర్గానికి ఒక్కొక్క పనిని అప్ప చెప్పుతుంది. ఆ యా పనుల పద్ధతులను నిర్ణయించి వాటిలో ఆచరించవలసిన విషయాలను నిబంధనలను రూపొందిస్తుంది. తన సభ్యులలోని ఆ యా వర్గాలు చేస్తున్న పనికి విలువను నిర్ణయించి తదనుగుణంగా ఏ యే వర్గానికి ఎంత ప్రతిఫలం ఇవ్వాలో నిర్ణయించే అధికారం ఈ కార్యవర్గాని కున్నది. తన సభ్యులను క్రమశిక్షణలో పెట్టి వారందరు తన సూచన ప్రకారం పని చేసేటట్లు చూడవలసి ఉన్నది. ఈ సహకార వ్యవసాయం వల్ల ఆ సంఘానికి వచ్చిన నికరాదాయాన్ని—నికరాదాయమంటె వ్యవసాయంలో పెట్టిన పెట్టుబడులు, ఆ యా శ్రామికవర్గాలకు ప్రతిఫలంగా ఇచ్చిన ధనం, సంఘ నిర్వహణకైన ఖర్చులు, ఎప్పుడైన అవసరం వస్తే ఉపయోగ పడేట్లుగా నిల్వ చేసే రిజర్వుఫండుపోను మిగిలినరాబడి —ఆ సంఘంలోని సభ్యులకు వారువారు చేసిన పనిని లెక్కలోకి తీసికొని ఆ దామాషాప్రకారంగాని, లేక ఆ సంఘంలోని సభ్యులు సహకారవ్యవసాయసంఘానికి

ఇచ్చిన భూముల వాటాల నిష్పత్తిలోకాని, లేదా అందరు సభ్యులకు సమానంగాగాని పంచుతుంది. ఈ విధంగా ఈ విధానం ఆ సంఘంలోని సభ్యులందరిచేత వ్యాపారసరళిలో సహకారవ్యవసాయ పరిశ్రమగా నిర్వహింప బడుతుంటుంది. మన ప్రణాళికాకారులు రూపొందిస్తున్న సహకారవ్యవసాయపు ఆదర్శ విధానం స్పష్టంగా ఇంతే.

సహకారవ్యవసాయంలో ఆ సంఘంలోని సభ్యులందరు ఎలాంటి నిర్బంధాలకు లోనుగాకుండ ఇచ్ఛికంగా తమంతతామే సహకరించాలనేది ఆశయం. వారు తమ ఇష్టాన్ని బట్టే ఆ సంఘంలో చేరాలని, తనుకు ఇష్టం లేనపుడు ఆ సంఘంనుంచి తప్పుకొని బయటకుపోయే స్వేచ్ఛ వారికుంటుందని అనుకోవటం జరుగుతున్నది. కాని ఒక గ్రామంలోని లేదా ప్రదేశంలోని రైతులలో అధిక సంఖ్యాకులు సహకారవ్యవసాయానికి అంగీకరించినపుడు ఆ మిగిలిన రైతులందరు కూడ సహకారవ్యవసాయసంఘంలో విధిగా చేరితీరాలని శాసించే చట్టాన్ని చేయటానికి, సహకారవ్యవసాయంపై మోజుపడటానికి ప్రభుత్వానికి సర్వాధికారాలు ఉన్నవి. "ఒక గ్రామంలోని రైతులలో—సొంత భూములున్నవారు, కౌలుసేద్యం చేసికొనేవారు కూడ కలిపి—అధిక సంఖ్యాకులు గ్రామంలోని భూమినంతా సహకారవ్యవసాయాధిపత్యం క్రింద ఉంచాలని కోరినప్పుడు వారి తీర్మానానికి గ్రామస్థులు లొంగి ఉండేటట్లు చూడటం అవసరం" * ఇదే మన ప్రణాళికాసంఘం రూపొందించనున్న సహకార వ్యవసాయ స్వరూపం. అంతేకాక ఆ సంఘసభ్యులలో ఎవరైనా దానినుంచి బయటకు వచ్చేసే పక్షంలో అతని పూర్వపు భూమిని మళ్ళీ అతనికి ఇచ్చివేయటానికి అంగీకరించ కూడదట!

సిద్ధాంతరీత్యా సహకారవ్యవసాయంలో కూడ రైతుల భూస్వామ్య హక్కులు కొనసాగుతూనే ఉంటాయి. ఈ భూస్వామ్య హక్కులకుగాను కొంత ప్రతిఫలం ఆ యా యజమానులకు చెల్లించాలనికూడ సహకార వ్యవసాయ సిద్ధాంతం అంగీకరిస్తుంది. దీనిని బట్టి

* Government of India, Planning Commission : First Five year Plan. 1952—PP. 196—7.

సహకార వ్యవసాయమంటె జాయింట్ స్టాక్ కంపెనీల వంటి దని కొంత మంది అనుకోవచ్చు. కాని జాయింట్ స్టాక్ కంపెనీకి సహకారవ్యవసాయానికి ఉన్న భేదాన్ని గమనించి నేడు ఇతర రంగాలలో ప్రవేశపెట్టబడిన సహకారసంఘాలు పనిచేస్తున్నతీరును గమనించినప్పుడు పైన చెప్పిన భూస్వామ్యహక్కులు సహకారవ్యవసాయం కేవలం నామ మాత్రంగా సిద్ధాంతాలలోనేఉంటాయని తేలికగాగ్రహించవచ్చు. సహకారవ్యవసాయం జాయింట్ స్టాక్ కంపెనీలలోవలె కేవలంధనాన్ని ఒక చోట పోగుచేయటంకాదు; సహకారవ్యవసాయం సమానమైనహక్కులు బాధ్యతలు కలిగిన కొందరు వ్యక్తుల సమాఖ్య. భూములులేని వ్యవసాయ కూలీలందరు భూములున్న సభ్యులతో సమానమైన హక్కులు పొందుతూ సహకారవ్యవసాయ సంఘాలలో చేరిన తరువాత ఆ యా భూములమీద పనిచేసే సభ్యుల ప్రాబల్యం ఆ సంఘంలో ఎక్కువవుతుంది. సహకారవ్యవసాయంలోని ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించాలి. "గ్రామంలో ఉన్న మొత్తం భూములమీద ఆధిపత్యం వహించటం ఆ గ్రామస్థులందరి సహకార పూరిత బాధ్యత అయ్యేటంత వరకు" [1] సహకార రంగాన్ని విస్తృతం చేయటం మన పంచవర్ష ప్రణాళికా కారుల ఆశయం. అందువల్లనే భూమిలేని కూలీలందరికి భూమి ఉన్న రైతులతో సమానమైన హక్కులివ్వాలనే ఉద్దేశ్యంతోనే మన జాతీయ ప్రణాళికా సంఘం ఈ సహకార వ్యవసాయాన్ని ప్రతిపాదిస్తున్న దనటంలో సందేహంలేదు. "గ్రామంలోని భూములన్నింటిమీద గ్రామస్థుల కందరకు సహకారపూరితమైన ఆధిపత్యం వచ్చిన తరువాత గ్రామీణ ఆర్థికవిజ్ఞానంలో ప్రతివారికి చాలినంతపని దొరికే అవకాశాలు ఏర్పడిన తరువాత భూమి ఉన్నవారికి లేనివారికి మధ్య నేడు కనిపిస్తున్న తారతమ్యం చాలవరకు అంతరిస్తుంది. ఇక అప్పుడు ఆ యా రంగాలలో పనిచేస్తున్న శ్రామికులకు—వ్యావసాయక కూలీలలోను పారిశ్రామిక కూలీలలోను కూడ—ఉన్న ప్రావీణ్యంలోనే తారతమ్యం ఏర్పడుతుంది." [2] కనుక భూమిలేని ఈ కూలీలందరకు సహకార వ్యవసాయంలో భూమి ఉన్నవారితో సమానమైన హక్కులతో స్థానం

1. Government of India, Planning Commission : Second Five year Plan — 1956—P. 206 2. Ibid P. 207

లభించటంనల్ల వారే అధికసంఖ్యాకు లవుతారు. ఈ అధికసంఖ్యాకులు తమ స్వప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ఆ సంఘపు ఆదాయాన్ని భూముల వాటాల నిష్పత్తిలో కాక ఆయా సభ్యులు చేసిన పని యొక్క దామాషానుబట్టి పెంచాలని నిర్ణయించటం సహజంగా జరుగుతుంది. అలాంటి పరిస్థితులలో భూస్వామ్య హక్కు ఉన్నా అది నామమాత్రమే కాని సహకార వ్యవసాయంలో దానివల్ల సిద్ధించే ప్రయోజనం ఉండదు. భూస్వామ్య హక్కులకుగాను సహకార వ్యవసాయసంఘం చెల్లించే ధనంకూడ ఆ రైతుని ఓదార్చటానికి, కళ్ళ నీళ్ళు తుడవటానికి మాత్రమే ఉపయోగిస్తుంది. ఆ చెల్లించటం ఇలాంటి వాతావరణంలో ఎంతోకాలం నిలుస్తుందని ఆశించే అవకాశంలేదు. కొంతకాలం గడిచేటప్పటికి ఆ నామమాత్రపు ధనంకూడ ఇవ్వకపోవచ్చు. కాబట్టి జాతీయప్రణాళికాసంఘం తాము ఊహిస్తున్న సహకార వ్యవసాయంలో రైతులకు కొన్ని సౌకర్యాలు కలిగిస్తున్నామనిచెప్పినా అది రైతులను దానివంకతో ఆకర్షించాలన్న స్వార్థ దృక్పథంతోనే అలాచేస్తున్నారు.

సహకారవ్యవసాయాన్ని గురించి ఇంక స్పష్టంగా వివరంగా నిర్వచించాలంటే ఇతర విధాలైన సహకారసంఘాలతోను — ముఖ్యంగా — వ్యవసాయ సేవాసహకార సంఘాలతోను — సమిష్టి వ్యవసాయంతోను దీనినిపోల్చి పరిశీలిస్తే ఈ సహకార వ్యవసాయ స్వరూపం పూర్తిగా బయట పడుతుంది.

II

'వ్యవసాయసేవాసహకారసంఘాలు'—'సేవాసహకారసంఘాలు' అనే పదాలు ఇంచుమించు ఇక్కడ ఉపయోగింపబడుతున్నవి. వీటిలో దేనిని ఉపయోగించినా వాటి అర్థంమాత్రం ఒకటే. ఈ సహకార సంఘాలలో (అంటే వ్యవసాయసేవాసహకారసంఘాలలోను – సేవాసహకారసంఘాలలోను) భూమి రైతులకు వారికుటుంబాలకే చెందుతుంది. ఈ భూములమీద వారికి చట్టప్రకారం హక్కులుంటాయనే కాదు; తమ భూములను రైతుకుటుంబాలు తమ ఇష్టప్రకారం

ఉపయోగించుకోవచ్చు; ఈ భూములమీద వచ్చే ఫలసాయాన్నికూడ వారే తమ ఇష్టానుసారం అనుభవించవచ్చు. భూమి సహకారవ్యవసాయసంఘం ఆధిపత్యంలో లేక స్వతంత్రులైన రైతుల ఆధీనంలోను, రైతుకుటుంబాల అజమాయిషీలోను ఉండటంవల్ల దానిని ఉపయోగించుకోవటంలోను ఫలసాయం అనుభవించటంలోను రైతులకుపూర్తి స్వేచ్ఛ లభిస్తున్నది. ఈవిధానంలో వ్యావసాయకపనులను నిర్వహించేది ఆధిపత్యంవహించేది రైతుకుటుంబంలోనివారే. ఈ రైతులకు తమ తమ పొలాలు తమ ఇష్టంవచ్చిన రీతిగా ఉపయోగించుకోవటానికి, తమ ఇష్టంకలిగినపుడు తమకు నచ్చిన విధంగా ఆ పొలాలమీద పాటుపడటానికి స్వేచ్ఛ ఉన్నది; తమ వ్యావసాయకోత్పత్తులను తామే అమ్ముకొని, తమ శ్రమఫలితాన్ని తమ భూమిమీది ఆదాయన్ని తామే అనుభవించే వీలున్నది. ఇలా సొంతంగా తమకుతామే తమ పొలాలను సాగుచేసికొనే రైతులు తమ కార్యకలాపాలలో కొన్నిటిని—తమకు కావలసిన ఎరువులసేకరణ, విత్తనాలసంపాదన, తమ వ్యావసాయకోత్పత్తులను నిల్వచేయటం, అమ్మటం లాంటివాటిని—ఒక సేవాసహకార సంఘానికి అప్పచెప్పవచ్చు. ఇలాంటి సహకారసంఘాలవల్ల రైతులు తమ భూములు తమ ఇష్టానుసారం సాగుచేసికొనే హక్కుకు ఎలాంటి ప్రమాదమురాదు. వ్యవసాయసేవాసహకారసంఘాలకు, సహకారవ్యవసాయసంఘాలకు ఉన్న ప్రధానమైన తేడా ఏమంటే వీటిలో మొదటిది రైతు తన భూమి తానే వ్యక్తిగతంగా సాగుచేసికోవటానికి సహాయభూతంగా ఉంటుంది. ఇక రెండవదిఅయిన సహకారవ్యవసాయసంఘం రైతుల భూములలో సేద్యం చేసేహక్కును అతని నుంచి తీసికొని ఆ భూమిమీద తానే సామూహికంగా సేద్యంచేయిస్తుంది. సహకార వ్యవసాయంలో సేద్యం సహకారం రెండుకూడ సామూహికంగానే నిర్వహింపబడతాయి, వచ్చిన ఆదాయాన్ని ఆ యా సభ్యులుచేసిన పనిని బట్టి వారికి పంచిపెడుతుంది. సేవాసహకారసంఘంలోని రైతుకి సహకారవ్యవసాయ సంఘంలోని రైతుకి వచ్చే రాబడులలోని తేడాలను కూడ గమనించటం అవసరం. సేవాసహకార సంఘంలోని రైతుకి తన భూమిమీద తాను సాగుచేసికోవటంవల్ల వచ్చే ఆదాయం, సేవాసహకార సంఘానికి వచ్చిన లాభంలో తనవంతు లాభం

లభిస్తుంది. సహకారవ్యవసాయంలోని రైతుకి ఆ సంఘంలో తాను శ్రమించినదానికి ప్రతిఫలంగా ముట్టేకూలి, అన్నీపోను ఆ సంఘం ఏదైనా పంచిపెట్టితే ఆ లాభము; తన భూస్వామ్యహక్కులకు సహకారవ్యవసాయసంఘం కాస్తోకూస్తో — ఇవ్వటమంటు జరిగితే — ఆ ధనము లభిస్తవి.

III

ఇక సమిష్టివ్యవసాయానికి సహకారవ్యవసాయానికి చాల ప్రధానమైన భేదం ఉన్నది. సమిష్టివ్యవసాయంలో భూమి, ఇతర ఆస్తులు సర్వము ప్రభుత్వానివే — విశాలార్థంలో చెప్పాలంటే సంఘానివి. అంతేకాని దానిసభ్యులకు వీటిమీద ఎలాంటిహక్కులు ఉండవు. కాబట్టి సమిష్టివ్యవసాయంలోవలె భూస్వామ్యహక్కులకు ఆ నామ మాత్రపు ప్రతి ఫలం కూడ ఇవ్వనవసరంలేదు. సమిష్టి వ్యవసాయం వల్ల వచ్చే లాభాన్ని ఆ సంఘంలోని సభ్యులు చేసిన పనిని బట్టి పంచటం తప్ప మరొక విధంగా లాభాలను పంచటం జరగదు. ఇక రెండవ విషయమేమంటే సహకార వ్యవసాయంలోకంటె దీనిలో ప్రభుత్వాధికారం చాల అధికంగాఉంటుంది. ఈ సంఘంలోని సభ్యులు సహకారవ్యవసాయంలోవలె తమ ఇష్టానుసారం దీనిలో చేరటం, దీనినుంచి పోవటం జరగదు. ప్రధానమైన నిర్ణయాలు చేయటం, సమిష్టి వ్యవసాయక్షేత్రాధిపత్యం, ఆ యా నిర్ణయాలను అమలుచేసే విధానాలు సర్వంప్రభుత్వమే నిర్ణయిస్తుంది; దాని సభ్యులకు వాటిలో ఎలాంటి ప్రసక్తి ఉండదు. సమిష్టివ్యవసాయంలోను, సహకార వ్యవసాయంలోను ఉన్న వాస్తవమైన భేదం ఏమంటే సమిష్టి వ్యవసాయం సర్వ విషయాలమీద పెత్తనం వహించేది ప్రభుత్వం. ఆ యా విధానాలతో దాని సభ్యులకు సంబంధం ఉండదు. సహకార వ్యవసాయంలో ఆ సంఘసభ్యులే ముఖ్యమైన నిర్ణయాలను తీసికొని సహకార పూరిత వాతావరణంలో వాటిఆచరణకుకూడ వీరే ఐచ్ఛికంగాపాటుపడతారు. అంతేకాదు. సమిష్టి వ్యవసాయానికి ప్రజాస్వామిక పునాదులు లేక పోగా కేవలం నియంతృత్వ మార్గంలోనే సమిష్టి వ్యవసాయాన్ని

స్థాపించవలసి వస్తుంది. సమిష్టి వ్యవసాయంలో ఆశయ సాధనకు ఉపయోగించే ప్రయత్నాలకు నీతినియమాలతో సంబంధం ఉండదు. ఆశయం సిద్ధించటమే దానికి ప్రధానం. సహకారవ్యవసాయాన్ని ప్రజాస్వామిక విధానాల ద్వారా – అంటే ఆ యా రైతులకోరికలను ఇష్టాన్నిబట్టి – తీసికొని రావాలని చెప్పటం జరుగుతున్నది. అంటే రైతులను ఈ సహకారవ్యవసాయంలో చేర్చటానికి ఎలాంటి బలవంతం ఉండకూడదు; దౌర్జన్యం చేయకూడదు. అధికారాన్ని ఉపయోగించి శాసనాలుచేసి ఆ శాసనాల ద్వారా రైతులు సహకారవ్యవసాయంలో చేరేటట్లు ప్రయత్నించకూడదు. కాని ఒక గ్రామంలోని అధికసంఖ్యాక రైతులు సహకారవ్యవసాయానికి అంగీకరించినపుడు ఆ మిగిలిన అల్ప సంఖ్యాకులను కూడ తమకు ఇష్టం ఉన్నా లేకపోయినా ప్రభుత్వశాస నాలవల్ల సహకారవ్యవసాయంలో చేరేటట్లు నిర్బంధించవచ్చునని మనప్రణాళికాసంఘం అంటున్నది. రైతులు తమ తమ ఇష్టానిష్టాలను బట్టి సహకారవ్యవసాయంలో చేరవచ్చు, విడిపోవచ్చు అనే ప్రధాన సూత్రాన్ని త్యజించి అల్పసంఖ్యాకులను నిర్బంధపెట్టినా ఇబ్బందిలేదు అనేటంతవరకు వచ్చింది సహకారవ్యవసాయ స్వరూపం. ఇలా నిర్బంధం పెట్టటంలోని నీతినియమాలు ఏమిటో వారికే తెలియాలి. నిర్బంధంతో చేసే వ్యవసాయం సహకార వ్యవసాయం అని ఎలా అనబడుతుందో వారే చెప్పాలి. మనజాతీయప్రణాళికాసంఘం చెపుతున్న సహకారవ్యవసాయానికి, రష్యాలోని సమిష్టివ్యవసాయానికి సరిగా చెప్పాలంటే పెద్దతేడా ఏమీలేదు. మనవారి సహకారవ్యవసాయంలో అధికసంఖ్యాకులు అల్పసంఖ్యాకులను నిర్బంధంగా సహకార వ్యవసాయంలో చేరేటట్లు చేస్తారు. రష్యాలోని సమిష్టివ్యవసాయంలో అల్పసంఖ్యాక వర్గమే అధికసంఖ్యాకవర్గాన్ని సమిష్టి వ్యవసాయంలో పాల్గొనేటట్లు బలవంతం చేస్తుంది. క్లుప్తంగా చెప్పాలంటే రైతాంగ ఆర్థికవిధానానికి బదులుగా మనజాతీయ ప్రణాళికాసంఘం స్థాపించనున్న సహకార, సమిష్టి వ్యవసాయాలు రైతులపైన నిర్బంధాలు ఉపయోగించటంవల్లనే సాధించే వీలున్నది. అధికసంఖ్యాకుల ఆజ్ఞలకులోబడికాని లేక ప్రభుత్వాజ్ఞలకులోబడికాని అల్పసంఖ్యాకులు రైతులు ఆ యా సంఘాలలో చేరవలసి ఉంటుంది.

IV

నేటి భారతదేశ స్థితిగతులలో ఇలాంటి సహకారవ్యవసాయం ఎలా ఇమిడుతుందో, ఒకవేళ ప్రవేశపెట్టినా దానివల్ల వచ్చే పరిణామాలు ఎలా ఉంటవో పరిశీలిద్దాం. మన దేశంలో సాగుకు లాయకి అయిన భూమిలో దాదాపు మూడింట రెండువంతుల భూమి మన రైతాంగఆర్థిక విధానం ప్రకారం ఆయా రైతులక్రింద వారి కుటుంబాలక్రింద ఉన్నది. మనదేశ జనసంఖ్యలో వీరు 17 కోట్లు. ఈ భూములనన్నింటిని మనరైతులు కుటుంబవ్యవసాయ పద్ధతిలోనే కుటుంబంలోని వారందరు కలిసి సాగుచేసి కొంటున్నారు. వీరికి తమ భూకమతాన్ని తమ ఇష్టంవచ్చిన రీతిగా అజమాయిషీ చేసికొనే స్వాతంత్ర్యం ఉన్నది. ఆయా భూములమీద శ్రమించే వారిలోగూడ వీరే ప్రధానవర్గం. మనదేశంలో వ్యవసాయంమీద ఆధారపడి జీవిస్తున్న ప్రజలలో పైన చెప్పిన పద్ధతిలో తమ సొంత భూకమతాలను సాగుచేసికొనే రైతులు 100 కి 67 మంది ఉన్నారు; ఇలాగే కుటుంబ వ్యవసాయపద్ధతుల ననుసరించి కౌలుభూములను సాగుచేసికొనే వారు 100 కి 18 మంది ఉన్నారు. పెద్ద భూస్వాములు వ్యవసాయ కూలీలు కలిసి మిగిలిన 15 శాతం అవుతారు.

సహకార వ్యవసాయం భూములను సొంతంగా సాగుచేయని వారిని భూములనుంచి తొలగించగలదనటంలో సందేహంలేదు; అలాగే పెట్టుబడిదారులవంటి భూస్వాములను, కౌలుదారీ విధానాన్ని తీసివేయగలదనటంలోకూడ అనుమానంలేదు. కాని సహకార వ్యవసాయంలో అసలు ప్రమాదం ఒకటున్నది. మన దేశ వ్యవసాయ రంగంలో తమ తమ సొంతభూములను కౌలుభూములను కుటుంబ వ్యవసాయ విధానంతో తమ ఇష్టానిష్టాలనుబట్టి సాగుచేసికొనేవారు అధికసంఖ్యాకులు. ఈ సహకారవ్యవసాయం వారిని లేకుండాచేసి కుటుంబవ్యవసాయ విధానానికి మంగళం పాడుతుంది. సహకార వ్యవసాయ ఆర్థిక విధానం స్థాపించబడిన తరువాత ఆయా కుటుంబకమతాలన్నీ సహకార వ్యవసాయకమతం అనే పెద్ద క్షేత్రంలో కలిపివేయబడతాయి. ఆయా రైతులు అనుభవిస్తున్న భూస్వామ్య హక్కుల

వల్ల లభిస్తున్న సౌకర్యాలు లాభాలు స్వేచ్ఛ సహకారసంఘానికి లభిస్తవి కాని రైతుకి కాదు. అలాగే కౌలుదారులకు తమ కౌలు హక్కులవల్ల లభిస్తున్న సౌకర్యాలు, స్వేచ్ఛ వారికుండవు. సహకార వ్యవసాయంలోని భూముల మీద హక్కులు చట్టరీత్యా ఆ యా రైతులకే ఉన్నా, వారి భూస్వామ్యపు హక్కులకు ఆ సంఘం కాస్తో కూస్తో ప్రతిఫలం ముట్టచెప్పినా ఆ భూమి తమ క్రిందఉన్నపుడు లభించినంత స్వేచ్ఛ లాభం వారికి లభించవు.

V

ప్రస్తుతం అమలులోఉన్న రైతుల కుటుంబవ్యవసాయాన్ని రద్దుచేసి దానిస్థానంలో సహకారవ్యవసాయాన్ని కూర్చోబెట్టటంవల్ల వచ్చే ప్రయోజనా లేమిటి? ఈ లాభాలను ప్రధానంగా రెండుగా విభజించి చెపుతున్నారు. ఒకటి సాంఘికప్రయోజనాలు, రెండవది ఆర్థికలాభాలు. భిన్న భిన్న వ్యక్తులు భిన్న భిన్న ఆశయాలకోసం సహకార వ్యవసాయాన్ని ప్రతిపాదిస్తున్నారు. తదనుగుణంగానే వారి వారి వాదనలు వారు ఆశిస్తున్న సాంఘికప్రయోజనాలమీదకో, ఆర్థిక లాభాలమీదకో మొగ్గును చూపించుతున్నవి. వ్యావసాయక రంగంలో సహకారవ్యవసాయాన్ని ప్రవేశపెట్టటంవల్ల ప్రధానంగా ఈ క్రింది ప్రయోజనాలు ఉన్నవని చెప్పబడుతున్నది.

ప్రధానంగా సాంఘికన్యాయం సాధించటానికి ఈ సహకార వ్యవసాయం ప్రతిపాదిస్తున్నట్లు చెపుతున్నారు. ఆస్తులలో ఉన్న ఎచ్చుల్లొచ్చులను తీసివేయటానికి, వ్యవసాయరంగంలో దోపిడి లేకుండ చేయటానికి ఈ సహకారవ్యవసాయం ఉపకరిస్తుందని అంటున్నారు. ప్రజలలో సహకారభావాన్ని, స్వయంసహాయాన్ని, సమానత్వాన్ని పెంపొందించటమేకాక దానివల్ల ఆస్తిపాస్తులను కూడ సహకార పూరితం చేయవచ్చునంటారు.

ఇక రెండవది ఆర్థికలాభం. సహకార వ్యవసాయంవల్ల ఆర్థికంగా అనేక లాభాలు సిద్ధిస్తవని భావిస్తున్నారు.

(1) సహకారవ్యవసాయవిధానంలో పెద్దఎత్తున పెద్ద పెద్ద కమతాలతో సాగుచేయటం జరుగుతుంది కనుక దానివల్ల, భారీనిర్వహణ వల్ల కలిగే లాభాలన్నీ వ్యవసాయరంగంలో సిద్ధిస్తున్నవి. "ఉదాహరణకు వ్యవసాయఖర్చులు తగ్గుతవి. కొన్ని విషయాలపై ప్రత్యేకశ్రద్ధ తీసికొని పరిశీలనలు చేయటానికి అవకాశంలభిస్తుంది." [1] క్షేత్రాల నిర్వహణలో ప్రావీణ్యం పెరుగుతుంది. పెద్ద కమతాలమీద సాగు చేయటంవల్ల ప్రస్తుతంప్రతి ఎకరాకు అవుతున్న ఖర్చు చాలవరకు తగ్గుతుందని, కొన్ని పంటలపై పొలాలపై ప్రత్యేకపరిశీలనలు చేసే అవకాశం లభిస్తుందని అజమాయిషీచేయటంలో మంచి ప్రావీణ్యం పెరుగుతుంది కనుక దానిని ఉపయోగించుకోవచ్చు నని చెపుతున్నారు. "భూమిని క్రమబద్ధంగా ఉపయోగించుకొనేటట్లుగాను, మానవశక్తిని, ఆర్థికపెట్టుబడులను, నిర్వహణప్రావీణ్యాన్ని సక్రమంగా వినియోగించుకొనేటట్లుగాను వ్యావసాయక ఆర్థికవిధానాన్ని రూపొందించటాన్ని ఆలోచించాలి. దీనిని సాధించాలంటే చిన్న కమతాలను ఏకంచేసి భూమిని ఏకఖండం చేయాలి; అలాగే మానవశక్తిని ఆర్థికపుపెట్టుబడులనుకూడ కూడదీసి ఏకముఖం చేయాలి. ఇదంతా వారి సహకారంతోనే నిర్వర్తించాలి. ఇలా చేస్తే దేశంలో లభించే అన్నిరకాల సంపదను సంపూర్ణంగా వినియోగించుకోవటానికి వీలుపడుతుంది. భారీ ఉత్పత్తులవల్ల లభించే ఆర్థికలాభాలుకూడ పొందటానికి వీలుకలుగుతుంది. సహకారవ్యవసాయంలో పెద్ద పెద్ద కమతాలమీద పెట్టుబడులను బట్టి వాటిరాబడిని సాధించేటందుకు ఆలోచించాలి." [2] భారత దేశంలోని భూకమతాలలో చిన్న చిన్న కమతాలు అత్యధికంగా ఉన్నవి. ఈ చిన్నకమతాలు, మానవ శ్రమను ఆర్థికపుపెట్టుబడులను చాలినంతవరకు ఉపయోగించుకొనే అవకాశంలేదు. అందువల్ల దేశాభ్యుదయానికి అత్యావశ్యకాలైన మానవశక్తి, ధనం వృధా అవుతున్నవి. అప్పుడప్పుడు తప్ప అన్నిపనులకు ఉపకరించని వ్యావసాయకపశు

---

1 Government of India, Planning Commission Report of the Indian Deligation to China on Agrarian Co-operatives, 1957—P. 133.

2 Ibid P. 133.

వులకోసం, పరికరాలకోసం అధికంగా ధనం వెచ్చించటమే. "ఇంత ఎక్కువగా ఖర్చులు పెరగటానికి ప్రధానకారణం భారతదేశంలో భూమి తక్కువ. ఆర్థికసదుపాయాలు చాల పరిమితమైనవి. వీటినికూడ నేడు సక్రమంగా వినియోగించుకోవటం లేదు." * కాబట్టి మన దేశంలో వ్యవసాయాన్ని లాభకరంగా నిర్వహించాలంటే సహకార వ్యవసాయం అత్యావశ్యకమని చెపుతున్నారు.

(2) మన దేశవ్యవసాయరంగంలో సహకారవ్యవసాయం ప్రవేశ పెట్టినందువల్ల వ్యవసాయకోత్పత్తులను ప్రస్తుతంకంటె చాలఎక్కువ పెంచవచ్చునంటున్నారు. ఉత్తమమైన ఉత్పత్తివిధానాలను ఉపయోగించటంవల్ల వ్యవసాయాన్ని అనేకంగా విభజించటంద్వారాను ఎక్కువ ఉత్పత్తిని అందించేటట్లుగా భూసారాన్ని అభివృద్ధి చేయటంద్వారాను, శాస్త్రీయమైన ఎరువులను ఉపయోగించటంద్వారాను అధికోత్పత్తిని సాధించవచ్చునంటున్నారు. అమాయకులైన వ్యక్తులు ఈ విషయాలపై నిర్ణయాలు తీసికొన్నంతకాలం వారు వీటిని ఆచరణలోపెట్టే అవకాశంలేదని చెపుతున్నారు. సహకారవ్యవసాయసంఘాలె ప్రత్యేక నిపుణులను, శాస్త్రవేత్తలను భరించగలవు. కనుక వ్యవసాయంలో పై విషయాలను ప్రవేశపెట్టటానికి, ప్రయోజనంపొందటానికి వీలుకలుగ టమేకాక రైతులుకూడ అభివృద్ధికరమార్గాలను నేర్చుకొంటారని అంటున్నారు. చిన్న చిన్న కమతాలను సాగుచేసికొనె 'రైతులయితె' ఈ నిపుణులను, శాస్త్రవేత్తలను భరించ లేరని చెపుతున్నారు. "చేతి నిండ తగినంత పని దొరకని ప్రజలనేకులు భూమిమీదనే బ్రతుకు తున్నపుడు, ఎన్ని పనులనైనా చేయటానికి తగినంతటి మానవశ్రమ దానినంటిపెట్టుకొని ఉంటుంది."

ఉపవృత్తులను పరిశ్రమలను అభివృద్ధి చేయటంద్వారా వ్యవ సాయాన్ని అనేకవిధాలుగా విశదీకరించవచ్చునని చెప్పుచున్నారు. కొత్తగా బావులను, చెరువులను, సరస్సులను ఏర్పాటుచేసికొని నీటి సౌకర్యాలను పెంచుకోవటంద్వారాను, భూమి ఎత్తుపడిపోకుండ, మీటలు వేయకుండ కృషి చేసికోవటంద్వారాను, మోటతోలేపద్ధతులు

* Ibid P. 132.

తొలగించి కాలువలను ఏర్పాటు చేసికోవటంద్వారాను భూమిని అనేకవిధాల అభివృద్ధి చేసికోవటానికి ఎన్నో అవకాశాలున్నవి. భూమిని అభివృద్ధి చేయటానికి ఇలాంటి శాశ్వతపు ఏర్పాట్లకు పూనుకోవటంవల్ల వ్యవసాయాన్ని పలువిధాలుగా విభజించటంవల్ల వ్యవసాయరంగంలో ఎక్కువమందికి చేతినిండా పని దొరుకుతుంది. వ్యావసాయకోత్పత్తులు పెరుగుతాయి. తద్ద్వారా లాభాలు రాబడి పెరిగి వారు బాగుపడతారు. ఈ పై ప్రయత్నాలలో పెద్దపెద్ద మొత్తాలను పెట్టుబడి పెట్టవలసి ఉన్నందువల్ల మన చిన్నచిన్న లాభాలు వ్యక్తిగతంగా వాటిని నిర్వహించటానికి ఎలాంటి అవకాశము లేదనిచెప్పటం జరుగుతున్నది.

(3) క్రమ (ప్రణాళికా) బద్ధమైన ఆర్థికవిధానంద్వారా ఆర్థికాభ్యుదయాన్ని సాధించటానికి పూనుకొన్న దేశంలో సహకార వ్యవసాయం మాత్రమే వ్యవసాయరంగాన్ని ప్రజాస్వామికంగా నిర్వహించగలదని అంటున్నారు. సరిగా అభివృద్ధిపొందని మనదేశంలో ఆర్థికసంపదను పెంపొందించుకోవాలంటే వ్యవసాయంమీద ఆధారపడటంకంటె గత్యంతరంలేదు. వ్యవసాయరంగంలోని మిగులు ఉత్పత్తుల ద్వారానే మన ఆర్థికసంపద పెరిగే అవకాశం ఉన్నది. కనుక మనదేశపు ఆర్థికాభ్యుదయంలో వ్యవసాయం చాల ప్రముఖమైన ప్రధానపాత్రను నిర్వహించవలసి ఉన్నది. ఇంత ప్రధానరంగమైన వ్యవసాయరంగాన్ని సంఘటితంగా పనిచేయని వ్యక్తుల చేతులలోకి వదిలివేయటానికి వీలులేదు. అలా వదలివేస్తే ఆయా వ్యక్తుల సాంఘికావశ్యకాలను గమనించకుండ తన చిత్తం వచ్చినట్లు నడిచే ప్రమాదం ఉన్నది. సహకార వ్యవసాయం దేశాభివృద్ధి కావశ్యకమైన ఆర్థికసంపదను సమకూర్చి పెట్టటమే కాక సాంఘికావశ్యకాలను గమనించి తదనుగుణంగా వ్యవసాయాన్ని నిర్వహిస్తుంది. "జాతీయసంపదను సంఘటిత పరచటానికి వ్యవసాయసహకార సంఘాలు సరైనమార్గం చూపిస్తవి. వీటిలో మానవశక్తి అత్యంత ప్రధానపాత్ర వహిస్తుంది. మన అవసరాల దృష్ట్యా నేడు మనకది (మానవశక్తి) చారిత్రక ఆవశ్యకం అనిపిస్తున్నది." "భారతదేశంలో పారిశ్రామికరంగాభివృద్ధికి రవాణాసాకర్యాల

ఏర్పాటుకు కొన్ని కార్యక్రమాలను రూపొందించి వాటికి పూను కొన్నాం. అందువల్ల మనసాధనసంపత్తికి వీటినిర్వహణే భారంగా కనిపిస్తున్నది. లోటుబడ్జెటులుకూడ ఎంతవరకు వేయవచ్చో అంతవరకు వేసికోవటం జరిగింది. ఇక దానికిమించి లోటు బడ్జెటులను కూడ రూపొందించలేము. కాబట్టి వ్యవసాయరంగాభివృద్ధికి కావలసిన సాధన సంపత్తి వ్యవసాయరంగంలోనే లభించేటట్లు చూచుకోవాలి. చిన్న చిన్న కుటుంబ కమతాల వ్యవసాయంమీద ఆధారపడిన వ్యవసాయ ఆర్థికవిధానంలో రాబడిని మిగిల్చి ఆర్థికసంపదను పెంపొందించే అవకాశాలు చాల తక్కువ. అసలు ఉండవనే చెప్పవచ్చు." "ఉత్పత్తి దారుల సహకారసంఘాలు లేనిపక్షంలో వ్యవసాయరంగంలో ఉన్న 5 కోట్ల రైతుకుటుంబాలకు ప్రతి ఒక్క కుటుంబానికిఉన్న అవసరాలు గమనించి మళ్ళీ ప్రతి ఒక్క కుటుంబంయొక్క అవసరాలను తీర్చవలసి ఉంటుంది. (అంటే ప్రభుత్వం ఈ 5 కోట్ల కుటుంబాలలో ప్రతి ఒక్క కుటుంబ స్థితిగతులను గమనించవలసి ఉంటుంది.) ఉత్పత్తి దారుల సహకారసంఘాలు ఉన్న పక్షంలో ప్రభుత్వం ఒక అర లక్ష సహకార సంఘాల స్థితిగతులను గమనించి వాటి అవసరాలను తీరిస్తే సరిపోతుంది. ప్రభుత్వం రూపొందించే అభివృద్ధి ప్రణాళికలను ఈ సహకార సంఘాలద్వారా ఆచరణలో పెట్టుతుంది."

4. ప్రస్తుత కుటుంబ వ్యవసాయ విధానంలో ఉన్న ప్రధానమైన పరిమితులను తీసివేయటానికి సహకారవ్యవసాయం ఉపకరిస్తుంది. ఈ పరిమితులు వ్యవసాయరంగంలో రావలసిన అభివృద్ధిని కుంచిస్తున్నాయని చెపుతున్నారు. " కుటుంబవ్యవసాయ విధానంలో అంతర్గతంగా ఉన్న పరిమితులవల్ల అనేకమైన చిక్కులు వస్తున్నాయని మేము భావిస్తున్నాం. ఈ కుటుంబవ్యవసాయం తానెంతధనాన్ని భూమిమీద పెచ్చిస్తున్నాను, ప్రతిఫలంగా తనకెంత లాభంవస్తున్నది అని ఆలోచిస్తుంది కాని సాంఘికదృష్టితో యోచించదు. ఇది కుటుంబవ్యవసాయానికి ప్రధాన లక్షణం." "రైతు తనకు లాభదాయకంగా ఉండే అభివృద్ధి కార్యక్రమాలకు మాత్రమే పూనుకొంటాడు. తన ఋణబాధనుంచి విముక్తిపొందటానికి తగినంత రాబడిని అందించలేని

అభివృద్ధి కార్యక్రమాలకు అతడు పూనుకోక పోవచ్చు. ప్రస్తుత స్థితిలో నేటిధరలను, కూలి వేతనాలను బట్టిచూస్తే వ్యవసాయరంగం లోని అనేక అభివృద్ధి కార్యక్రమాలు తగినంత రాబడిని ఇచ్చేవిగా లేవు. కనుక వీటిని సాధించాలంటే రైతుకు కొంతవరకు సాధన సంపత్తిని అందించి సహాయపడినప్పటికి అతడు కూలీలకు వేతనాలు చెల్లిస్తూ ఈ అభివృద్ధికార్యక్రమాలను పూర్తిగా కొనసాగించటం జరగని పని." ఈ కుటుంబవ్యవసాయానికి బదులుగా సాంఘిక ప్రయోజనాల దృష్టితో ఏర్పడి సంఘటిత కృషితో పనిచేసే సంఘాలను ఏర్పాటు చేయవలసి ఉన్నది.

కుటుంబవ్యవసాయంలోకంటె సహకారవ్యవసాయంలో ఈ ప్రయోజనాలు సిద్ధిస్తవని జాతీయప్రణాళికాసంఘము, సహకారవ్యవసాయాన్ని అంగీకరించే ఇతరవ్యక్తులు చెపుతున్నారు. ఈ వాదాలలో ఉన్న సత్యం ఎంతో తరువాత అధ్యాయంలో వివరంగా ప్రతిదాన్ని తీసికొని పరిశీలిద్దాం.

అధ్యాయం - 3

సాంఘిక న్యాయం - సహకార వ్యవసాయం

సాంఘిక ఆర్థిక ప్రయోజనాల కోసం నేటి మన వ్యవసాయాన్ని సంస్కరించటం, పునర్నిర్మించటం అవసరమే. దీనికెవరు కాదనటం లేదు. మన వ్యవసాయ పునర్నిర్మాణం అనే దానిలో మన రైతాంగ పునర్నిర్మాణం కూడ ఉన్నది. మన దేశంలోని వ్యావసాయకులలో అత్యధిక సంఖ్యాకులైన రైతుల పునర్నిర్మాణం కూడ దానిలో ఉన్నదని గ్రహించాలి. మొదటి అధ్యాయంలో చెప్పిన రీతిగా మన రైతాంగవ్యవస్థ ఆర్థిక సాంఘిక విషయాలకు సామరస్యం కుదిర్చి తన మనుగడను సాగిస్తున్నది. అంటే రైతాంగం వ్యవసాయోత్పత్తి దారులతో కూడిన కేవల ఆర్థిక వర్గం మాత్రమే కాదు. రైతాంగం ప్రత్యేక లక్షణాలతో అభ్యుదయ విధానాలతో కూడిన సాంఘిక వర్గం. ఈ చెప్పబడుతున్న సహకారవ్యవసాయరంగంలో ప్రవేశపెట్టినపుడు అది మన వ్యవసాయాన్ని పునర్నిర్మించటంతోనే ఆగదు. నేటి మన రైతాంగ ప్రత్యేక లక్షణమైన కుటుంబవ్యవసాయ విధానాన్ని తారుమారు చేస్తుంది. ఇలా కుటుంబవ్యవసాయ విధానాన్ని తారుమారు చేయటం సాంఘికన్యాయం దృష్ట్యా ఆర్థికావశ్యకాల దృష్ట్యా న్యాయసమ్మతమేనని జాతీయప్రణాళికాసంఘం అంటున్నది.

ఈ అధ్యాయంలో సాంఘిక విషయాలను గూర్చి మేము చర్చిస్తాం. వ్యావసాయక రంగానికి అనువర్తింప చేయవలసిన సాంఘిక న్యాయ విషయాలు ఏమిటి? సంఘంలో అత్యంత ప్రధాన వర్గమైన మన రైతాంగ వ్యవస్థను మారిస్తేనే తప్ప ఈ సాంఘికన్యాయ విషయాలు సాధించే వీలు లేదా?

I

మనం ఆశిస్తున్న సాంఘిక న్యాయ స్వరూపం మనం స్థాపించ దలచిన సంఘస్వరూపాన్ని బట్టి నిర్ణయించ బడుతుంది. కాబట్టి మనం

ప్రచారం చేసికొంటున్న సోషలిస్టు పద్ధతి సమాజ వ్యవస్థా స్వరూపాన్ని బట్టి వ్యవసాయరంగంలో మనం సాధించనున్న సాంఘిక న్యాయం ఎలాంటిదో తేలుతుంది. అందువల్ల సోషలిస్టుపద్ధతి సమాజ వ్యవస్థ అంటే మన ఉద్దేశంలో ఏమిటో, ఆ వ్యవస్థలో రైతాంగాని కున్న స్థానం ఏమిటో పరిశీలించుకోవటం ఆవశ్యకం.

ఇరవయ్యో శతాబ్దపు భారతీయులకు సోషలిజం అంతకుముందే సిద్ధమై లభిస్తున్న పారమార్థిక సిద్ధాంతం కాదు. అనుశ్రుతంగా వస్తున్న సోషలిజం సమాజస్వరూపాన్ని మార్చవలసిన అవసరంలేదు, ఉన్న పద్ధతే ఉత్తమమైనదని బోధించే కేపిటలిజానికి ప్రతిగా తల ఎత్తింది కాని ఈ కేపిటలిజం తనవాదానికి తానే అంటిపెట్టుకొని ఉండలేక పోయింది. గత రెండు శతాబ్దాల నుండి ఈ కేపిటలిజంలో అనేక మార్పులు వచ్చాయి. దాని పూర్వస్వరూపానికి నేటి స్థితికి చాల తేడాలున్నవి. కేపిటలిజంలో అంతర్గతంగా ఉన్న శక్తులవల్ల బాహ్య ప్రపంచపు ఒత్తిడివల్ల దీనిలో ఇలాంటి మార్పులు రాక తప్ప లేదు. కాని ఇది మారినా దీనికి ప్రతిగా లేచిన అనుశ్రుత సోషలిజంలో మాత్రం ఎలాంటి మార్పులు కలుగలేదు. దీనికొక ప్రబల కారణం ఉన్నది. "దీని సిద్ధాంతకారులు ఏదో ఒక ప్రత్యేక సమస్యా పరిష్కారాని కుపయోగించే విధానాలనే సాధించవలసిన విధానాలుగా నిర్వచించారు." * దీని ఫలితం సుస్పష్టం. ఉత్పత్తి విధానాలను జాతీయం చేయటం మొదలైన మార్గాలవల్ల వారు ఆశించిన సోషలిస్టు సమాజ వ్యవస్థ నెలకొనలేకపోయింది; ఇది ఆచరణలో బుజువైన సత్యం. పైగా ఈ మార్గాలవల్ల నియంతృత్వం ఏర్పడింది. ప్రజాస్వామిక సాంప్రదాయాలు, సంస్థలు అదృశ్యమయ్యాయి; వ్యక్తి స్వేచ్ఛ స్వాతంత్రం రూపుమాసి పోయాయి. దినదిన ప్రవర్ధమానమైన పరిపాలనా యంత్రాంగంలో ప్రజలు అనామకులై పోయారు. ఆ సోవియట్ యూనియన్‌లోను, ఇతర కమ్యూనిస్టు దేశాలలోను మార్క్సిజం దాని తార్కికపరిణామస్థితికి తీసికొనిపోబడింది. ఆర్థికాధికారం సర్వం రాజ్యపరంచేయటం జరిగింది. కాని దీనిఫలితం మాత్రం 'మార్క్స్'

* Socialist Union, "Twentieh century Socialism." 1956 P. 17.

అశించిన స్వేచ్ఛాపూరితమై సమానహక్కులు కలిగిన సంఘం కాదు; సర్వాధికారపూరితమైన నియంతృత్వం. వీటిల్లో రాజకీయాధికారాలు సర్వం ప్రభుత్వానివే! కనుక ప్రభుత్వాన్ని అదుపులో పెట్టమన్న మాటే లేకపోయింది. వ్యక్తిగతమైన కేపిటలిస్టులకంటె ఈ ప్రభుత్వం సర్వవ్యాపి, సర్వాధికారి. అందువల్ల అంతకుముందున్న కేపిటలిస్టుల క్రింద అనుభవించిన దయనీయస్థితి కంటె ఈ ప్రభుత్వాలక్రింద కార్మికుడు మరింత శోచనీయ స్థితిలో పడి పోయాడు. కేపిటలిజం వ్యక్తుల ఇష్టానిష్టాలతో స్వారిచేయటమయితే కమ్యూనిజం సామూహికంగా స్వారిచేయటమైంది. ఆరోగంకంటె ఈ వైద్యం ఏవిధంగ చూచిన మంచిది కాకుండపోయింది." * కాబట్టి ఈ అనుశృతంగా వస్తున్న సోషలిస్టులు తాము అధికారంలోకి వచ్చినచోటల్లా సోషలిజాన్ని స్థాపించలేక విఫలులయ్యారు. పైపెచ్చు అంతకు ముందునుంచి ఉన్న ప్రజాస్వామిక విలువలను కూడ ధ్వంసం చేశారు.

అనుశృతంగా వస్తున్న ఈ అనుశ్రుత సోషలిజం, కేపిటలిజం అనే పరస్పర విరుద్ధాలైన మూసలు ఎలా విఫలమయ్యాయో చూదాం. దీనినుంచి మనం ఒక గుణపాఠం నేర్చుకొని తాత్కికబలం మీద నిలబడిన సోషలిస్టు సిద్ధాంతాలను పునర్నిర్మించుకోవాలి. మనం నివసిస్తున్న ఇరవయ్యో శతాబ్దపు మధ్యకాలానికి అనుగుణమై సక్రమము, సమగ్రము అయిన సోషలిస్టు ఆర్థికవిధానాన్ని రూపొందించుకోవాలి. ఈ సిద్ధాంతములో మనం ఆశిస్తున్న సంఘస్వరూపం యొక్క ఆదర్శాలతో పాటు దానిని ఆచరణసాధ్యం చేయగల వాస్తవికత కూడ ఉండాలి.

అందువల్ల సోషలిజం అంటే ఒక మూస కాదు. దానిలోను అనేక ఆదర్శాలుండవచ్చు. ఆ యా పరిస్థితులనుబట్టి అనేక మార్గాల వల్ల సోషలిజాన్ని రూపొందించుకోవచ్చు. సోషలిజం మార్పులేకుండా సిరంగా ఉండే ప్రధానసూత్రం ఒక్కటే. ఒక మనిషిని మరొక మనిషి దోచుకొనే స్థితిని తొలగించటం, స్వేచ్ఛ, సమానత్వం, సుహృద్భావాలతో కూడిన నూతన సంఘ సంస్థాపన సోషలిస్టు ఆదర్శం. సంఘంలో

*Ibid P. 124.

సామరస్యాన్ని నెలకొల్పాలంటే రాజకీయ ప్రజాస్వామ్యాన్ని సంఘ పరం చేయటం ఎంత అవసరమో సోషలిస్టు ఆర్థిక వ్యవస్థను ప్రజా స్వామ్యపూరితం చేయటం కూడ అంత అవసరమని నేడు మన కళ్ళ ముందు జరుగుతున్న సంఘటనలే నొక్కి చెప్పుతున్నవి. ప్రథమ సాధనమైన రాజకీయ ప్రజాస్వామ్యాన్ని మనం సాధించుకొన్నాం. ఆర్థిక ప్రజాస్వామ్యాన్ని స్థాపించటమె ఇప్పటి మన సమస్య. ఈ ఆర్థిక ప్రజాస్వామ్యాన్ని కూడ మనం సాధించుకొన్న రాజకీయ ప్రజా స్వామ్యానికి ఎలాంటి దెబ్బ తగులకుండ దానిని కూడ ఇంక అభివృద్ధి చేసికొనే విధంగా సాధించుకోవలసి ఉన్నది. అంటే ఆర్థిక ప్రజా స్వామ్యసాధనకు మనం ఉపయోగించే విధానాలు తప్పకుండ ప్రజా స్వామికంగా ఉండితీరాలి.

వ్యవసాయరంగంలోని భూమిని జాతీయంచేయటం లేదా సంఘ పరం చేయటమే సోషలిజమని మార్క్సిస్టు సోషలిస్టుల ఆచరణ తెలుపు తున్నది. "శ్రమను బట్టి విలువ" అనే సిద్ధాంతాని కను గుణంగా సంఘాన్ని మలచటానికి ఇలా చేయటం వారికి తప్పనిసరి అయింది. దీనిని బట్టి వ్యవసాయాన్ని సంఘపరం చేయటం రైతులను కూలీలుగా మార్చటం ఈ మార్క్సిస్టుసోషలిస్టుల ఆశయాలుగా తేలు తున్నవి. ఎలాంటి విధానాలను అవలంబించినా వీరికి ఇబ్బంది లేదు; వాటి కెలాంటి ప్రాధాన్యము ఇవ్వవలసిన అవసరం లేదు. ఇలాంటి ప్రయత్నాలవల్ల ఎటువంటి ఫలితాలు కలుగుతున్నవో చరిత్రను స్థూలదృష్టితో పరిశీలిస్తున్న వారికి కూడ బోధపడక పోదు. ఆశయ సాధనకు విచక్షణరహితంగా దౌర్జన్యం ఉపయోగించటం వారి సాధారణాయుధం. "నానాజాతిసమితి కోసం తయారుచేయబడిన రష్యా జనసంఖ్య అంకెలను పరిశీలించి, 1930 సంవత్సరం ప్రాంతా లలో 50 లక్షల అసాధారణమరణాలు రష్యాలో సంభవిస్తున్నవని డాక్టర్ లోరిమన్ విశదీకరిస్తున్నాడు. ఈ 50 లక్షలలో సగానికిపైగా వ్యవసాయాన్ని సమిష్టిపరం చేసేప్రయత్నంలో మరణించారు. అంతకు ముందెన్నడు కనివిని ఎరుగనంత పెద్దఎత్తున పరిశ్రమలను స్థాపించటం

వల్ల రాజకీయ కారణాలవల్ల మిగిలినవారు మరణించారు." [1] వ్యక్తులకు భూరూపంలో ఆస్థి లేకుండ చేశారు. సాంఘికన్యాయం పేరుతో స్వతంత్రులైన రైతులందరిని దినభత్యపు కార్మికులుగా మార్చి వేశారు. ఈ విధానంవల్ల రైతాంగం తన స్వేచ్ఛను పూర్తిగా కోల్పోయింది. చివరికి మరొకరి మీద ఆధారపడి బ్రతుకు తున్నది. ఇక ఈ సమిష్టిక్షేత్రాల నిర్వహణ సర్వం పరిపాలనాయంత్రంగా మార్చబడింది. ఇలాంటి సమిష్టి క్షేత్రాల ఏర్పాటుతో మరొకవిధమైన సాంఘిక అన్యాయం సృష్టింప బడింది.

ఈ కమ్యూనిస్టురాజ్యాలు అనుసరించిన సహకారవ్యవసాయ విధానాలు కేవలం వ్యవసాయాన్ని సమిష్టిపరం చేయటం కోసం మొదటి మెట్టుగా ప్రవేశపెట్టబడ్డాయని గ్రహించాలి. రైతుల ప్రాబల్యం, పలుకుబడి అధికంగా ఉన్నచోట కమ్యూనిస్టులు వ్యవసాయాన్ని సమిష్టిపరం చేయటానికి ముందు సహకారవ్యవసాయాన్ని అంగీకరించి తమ ఆశయసిద్ధికి ప్రథమసోపానంగా దానిని ప్రవేశపెట్ట వలసి వచ్చింది. ఈ విషయం మనం అనటంకాదు; వారే దానిని స్పష్టంగా అంగీకరించి చెప్పారు. "కార్మికవర్గ రాజకీయ నాయకత్వం, ప్రభుత్వమె ఆర్థికవిషయాలను నిర్వహించటం, కార్మికులచే నిర్వహింప బడే సహకారవ్యవసాయక్షేత్రాలు సోషలిజానికి మార్గాలు..... ఏమైనా మన భవిష్యత్కార్యక్రమం సైనాను సోషలిజం వైపుకి కమ్యూనిజానికి నడపటమె ననటంలో సందేహంలేదు." [2]

"వేలసంవత్సరాలనుండి వ్యక్తిగతంగా ఉత్పత్తిచేసే ఒక విధానం రైతాంగంలో ప్రబలంగా ఉంటు వచ్చింది. ఈ విధానంలో కుటుంబమె ఉత్పత్తిసంఘం. జమీందారీ విధానానికి ఇలా చెల్లా చెదరుగ ఉన్న వ్యక్తిగత విధానమె పునాది. దీనివల్లనే రైతులు నిరంతరం దారిద్ర్యంలో ఉంటు వచ్చారు. ఈ పరిస్థితిని తప్పించాలంటే వ్యవసాయాన్ని క్రమంగా సమిష్టిపరం చేయటం ఒక్కటే మార్గం.

---

[1] Arthur Lewis "Economic survey" P. 132.

[2] Selected works of Mao Tse Tung, Vol. 4, P. 274.

ఈ వ్యవసాయాన్ని ఇలా క్రమానుగతంగా సమిష్టి పరం చేయాలంటే లెనిన్ ప్రకారం సహకారవ్యవసాయమె మార్గం."*

సోషలిజాన్ని గురించిన ఈ రాజకీయ తత్వశాస్త్రానికి మనం ఎలాంటి గౌరవం ఇవ్వం. కారణమేమంటే నేటి మన వ్యవసాయం, వారు చెప్పినట్లు జమీందారీ విధానాలమీద ఆధారపడి లేదు. ఇటు కేపిటలిస్టు విధానాలమీద ఆధారపడి లేదు. అతి ప్రాచీనకాలపు కమ్యూనిజాన్ని పోలిన గ్రామ సంఘాలనుంచి క్రమంగా పరిణామం చెందిన రైతాంగ కుటుంబవ్యవసాయ విధానంమీదనే మన వ్యవసాయరంగం ఆధారపడి ఉన్నది. అసలు మనకు వారు చెపుతున్న పారమార్థిక సిద్ధాంతాలలాంటి వాటిలో విశ్వాసమే లేదు. వ్యవసాయాన్ని సమిష్టిపరం చేయటం మనం ప్రతిఘటిస్తాం. సమిష్టిపరం చేయటంవల్ల ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, ఉత్సాహం మంటకలిసి పోతాయి. ఆ విధానంవల్ల ప్రజలు కార్మికసంఘాలుగా తయారై పరిపాలనా యంత్రాంగానికి ఛాయలుగా మారిపోతారు. కాబట్టి దానిని మనం అంగీకరించం.

సోషలిజం పరమం అని చెప్పే సిద్ధాంతంలో కాక కాలాను గుణంగ దానిని మనం మలుచుకోవాలనే విషయంలో మనందరకు సాధారణాంగీకారం ఉన్నది. కాని సోషలిజం ఇలా ఉండాలి అని నిర్వచించటం ఎలాఉన్నా మన పరిస్థితులనుబట్టి మనం నెలకొల్పనున్న సోషలిస్టు పద్ధతి సమాజవ్యవస్థలో ఏవేవి ఉండరాదు అనే విషయంలోను, మనం భావిస్తున్న సోషలిస్టు సిద్ధాంతంలో ఉండరాని భావాలను గురించి మనకు అంగీకారం ఉన్నది. సోషలిజం అంటే ఇలా ఉండాలని చెప్పే వాటిలో కూడ విశాలమైన ప్రధానమైన విషయాలపై – మన అంగీకారమున్నది. అంటే సంపద సర్వులకు సమంగా విభజించ బడాలి, దోపిడిని రూపుమాపాలి, ప్రజాస్వామిక స్థితిగతులను కల్పించాలి అనే వాటిలో మనకు అంగీకారం ఉన్నది. ఇలాంటి విశాల సూత్రాలలోను సాధారణ లాభాలనుతప్ప–వీటిని అనేక విధాల అనే కార్థాలతో వ్యాఖ్యానించుకోవటానికి అవకాశం ఉన్నది–సమగ్రమైన

* Ibid P. 274.

సోషలిస్టు భావాలను, సిద్ధాంతాలను ఇంక మనం రూపొందించుకోవలసి ఉన్నాం. మన ఆచరణనుబట్టి అలాంటి సిద్ధాంతాన్ని రూపొందించుకోవటానికి మనం యత్నం చేస్తున్నాం. కాబట్టి సంప్రదాయక సోషలిస్టు రాజ్యాలకు మనకు ఇక్కడ ప్రధాన భేదం ఒకటున్నది. వారు ముందుగానే సోషలిస్టు సిద్ధాంతాన్ని తయారుచేసి దానికనుగుణమైన సాంఘికవ్యవస్థను—ఎలాంటి నికృష్ట విధానాలద్వారా నైనాసరే—స్థాపించ యత్నిస్తున్నారు. మనం అలాకాక ఆచరణకు ప్రాధాన్యం ఇస్తున్నాం. మన ఆచరణని అనుభవాన్ని దృష్టిలోకి తీసికొని వీటి సహాయంతోనే మనం మన సిద్ధాంతానికి రూపం కల్పించనున్నాం. కనుక మనకు ముందు ఆచరణ, వారికి ప్రధానం సిద్ధాంతం.

కాని మనం ఆచరణకు ప్రాముఖ్యం ఇచ్చినా ఒక విషయాన్ని మనస్సులో ఉంచుకోక తప్పదు. మన ఆచరణ లేక మనం అనుసరించనున్న సోషలిజపు విశాలసూత్రాలు—పైన మనం చెప్పుకొన్న సాధారణ సూత్రాలకు—అనుగుణంగా సాగుతున్నవో లేవో ప్రతి దశలోను పరామర్శించు కోవలసిన అవసరం ఉన్నది.

II

ఇలాంటి ఆచరణలలో సహకారవ్యవసాయం కూడ ఒకటి. వ్యవసాయరంగంలో సాంఘికన్యాయ సాధనకు ఈ ఆచరణను ప్రవేశపెట్టాలని అంటున్నారు. వ్యవసాయరంగంలో ఈ సహకారవ్యవసాయం ఆవశ్యకం కావటానికి ఆ సాంఘికన్యాయం ఏమిటో, దాని స్వరూప స్వభావాలేమిటో పరిశీలిద్దాం. మనవారు చెపుతున్న ఈ సహకార వ్యవసాయ నిర్వహణ మనం అనుకొంటున్న సోషలిజపు విశాలభావాలకు, సాధారణ సూత్రాలకు ఎంతవరకు అనుగుణంగా ఉన్నదో కూడ పరిశీలిద్దాం.

మనవారు చెపుతున్న సాంఘికన్యాయ విషయాలు స్థూలంగా ఈ క్రిందివి. భూ రూపంలో వ్యక్తిగత ఆస్తులుండటంవల్ల ఒక మనిషిని మరొక మనిషి దోచుకోవటానికి అవకాశం కలుగుతున్నదని,

తద్వారా భూమి ఉన్నవారికి లేనివారికి మధ్య వర్గద్వేషం తయారవు తున్నదని చెప్పబడు తున్నది. ఇలాంటి వ్యక్తిగత ఆస్తి ఇంక ఇంక భూమిని తమ క్రిందికి తెచ్చుకోవాలన్న వాంఛను అభివృద్ధి చేస్తుంది. వ్యక్తులలో వ్యక్తికవాదులుగా మారే తత్వాన్ని పెంచుతుంది. స్వార్థ పూరిత ఆలోచనలు రేకెత్తిస్తుంది. వారి ఆచరణ సంఘశ్రేయస్సు దృష్ట్యా నడిచే అవకాశం లేకుండ చేస్తుంది. కాబట్టి భూరూపంలో వ్యక్తిగత ఆస్తిని బహిష్కరించాలి. కాని కమ్యూనిస్టు భావాల ప్రకారం భూ రూపంలోని ఆస్తిని జాతీయం చేయటంకూడ మంచిదికాదు. ఆ భూమిమీద శ్రమించే ప్రజల వ్యక్తిత్వాన్ని, ఉత్సాహాన్ని, శ్రద్ధను నశింపచేస్తుంది కనుక కమ్యూనిస్టులవలె జాతీయంచేయటం కూడ ప్రమాదకరమే, కనుక ఈ భూమి మీద కష్టపడే ప్రజల వ్యక్తిత్వాన్ని, ఉత్సాహాన్ని, శ్రద్ధను చంపకుండ వాటిని మరింత అధికం చేసే విధానం చూచి, భూ రూపంలో ఆస్తిని అలాంటి సంస్థల పరం చేయాలి. ప్రజలు ఇచ్ఛిక సహకారంతో తమంతతాము ప్రజాస్వామిక విధానాల ద్వారా ఏకమై స్వయం సహాయంతోను, పరస్పరసహకారంతోను సాంఘికప్రయోజనాల సాధనకై ఏర్పాటు చేసికొనే సహకారసంఘమె అలాంటి ఉత్తమ సంస్థ. ఇలాంటి సహకారసంస్థ వ్యక్తిగత ఆస్తి విధానంలోను, ఆస్తిని జాతీయం చేయటంలోను కలుగుతున్న సంఘ ప్రయోజనానికి వ్యతిరేకమైన పరిణామాలను నివారించటమే కాక దాని సభ్యులలో ప్రజాస్వామిక దృక్పథాన్ని, సాంఘిక దృష్టిని విలువలను పెంపొందించటానికి సహాయపడుతుంది. ఈ సహకారసంస్థ ప్రజలకందరకు సమానావకాశాలను కల్పించి, వారి వారి వ్యక్తిత్వాలను, నైపుణ్యాలను పెంపొందించుకోవటానికి వీలుకల్పించి వారిలో ప్రజాస్వామిక ఆచరణను కలిగిస్తుంది. వారిని ప్రజాస్వామ్యంలో తరిఫీదు చేస్తుంది. కాబట్టి కేపిటలిజానికి, కమ్యూనిజానికి మేము వ్యతిరేకులమని చెప్పుకుంటున్నవారు వ్యవసాయాన్ని సహకారపూరితం చేయాలన్న ఈ వాదాన్ని ప్రతిపాదిస్తున్నారు.

కాని ఈ సహకారవ్యవసాయంలోని చిక్కులను దానిలో అంతర్గతంగా ఉన్న విషయాలను సుస్పష్టంగా పరిశీలించి అవగాహన చేసికోవాలి.

ఆస్తిని బహిష్కరించాలనటంలో – దానంతటదాన్ని పరిశీలిస్తే ఏమి అర్థం కనిపించదు. రోమన్‌లాలో చెప్పిన ప్రకారం చూస్తే ఆస్తి అంటే దాని ఉపయోగం, దానిని అనుభవించటం, ఇతరులకు ఇచ్చి వేయటమో, అమ్మివేయటమో తప్ప అంతకంటె మరొక ఆస్తి లేదు. ఇప్పుడు మన సందర్భం భూమి గదా. కాబట్టి భూ రూపంలోని ఆస్తిని బహిష్కరించటం అంటే భూమిని బహిష్కరించటం కాదు; దాని ఉపయోగాన్ని, అనుభవాన్ని, భూమిమీద ఉన్న హక్కులను బహిష్కరించటం అవుతుంది. కాని ఈ హక్కులను లేకుండ బహిష్కరించటం కుదరదు. వాటిని ఒకరినుంచి మరొకరికి మార్చటం మాత్రమే చేయవీలున్నది. అసలు ఈ హక్కులు కూడ అసంఖ్యాకం. ఒక దాని నుంచి మరొకదానిని విడగొట్టే వీలుకూడ ఉన్నది. ఈ విషయాలను మనస్సులో పెట్టుకొని పరిశీలించినపుడు ఇంతవరకు సైతాంగ కుటుంబాలు అనుభవిస్తున్న ఉపయోగం అనుభవం హక్కులు అనేవి ఇక ముందు ఆ సహకారసంఘసభ్యులలో అధికసంఖ్యాకులు ప్రజాస్వామిక విధానాలద్వారా – ఎన్నుకొన్న సభ్యులకు చెందటమే సహకారవ్యవసాయ విధానం అని తేలికగా బోధపడుతున్నది గదా! అంటే దీని భావం ఏమిటి? సైతాంగం చిన్నాభిన్నమై పోతుందని తేలికగా తెలుస్తున్నది కదా! సైతాంగం ఈ విధంగా తనహక్కులను సహకార సంఘానికి అప్పచెప్పటం వల్ల (1) దోపిడికి ఎలాంటి అవకాశము లేకుండపోయి, సైతాంగ విధానంలో కంటె ఎక్కువ సాంఘిక న్యాయాన్ని సమకూర్చటానికి ఎంత వీలున్నదో (2) ప్రజలలో సహకారభావాన్ని ప్రజాస్వామిక దృష్టిని ఎంతవరకు కలిగించవచ్చునో ఈ క్రింద పరిశీలిద్దాం.

III

మరొకరిని దోచుకొనటానికి తగిన శక్తి సామర్థ్యాలు అలా దోచుకోవాలనే వాంఛ ఉన్నపుడే దోపిడికి అవకాశం ఉంటుంది. వీటి రెంటికి పరస్పరసంబంధం ఉన్నది. ఇతరులను దోచుకోగల శక్తి సామర్థ్యాలు ఉంటే దోచుకోవాలన్న వాంఛనుకూడ అవే రేకెత్తి

స్తవి. అలాగే దోచుకోవాలన్న వాంఛ ఉంటే అందుకు కావలసిన శక్తి సామర్థ్యాలను కూడ అదే పెంపొందిస్తుంది. కాబట్టి ఎలాంటి సాంఘిక వ్యవస్థలోనైనా ప్రజల భావాలలో, ఆలోచనలలో సక్రమమైన దృష్టి లేనంతకాలం ప్రజలలో కొందరికి మిగిలినవారిని దోచుకోగల శక్తి సామర్థ్యాలు ఉన్నంతకాలం ఈ దోపిడి ఉండి తీరుతుంది. దోపిడికి అవకాశం లేకుండ పోవాలంటే దోపిడి చేయటానికి కావలసిన శక్తి సామర్థ్యాలు ఎవరికి లేకుండ ఉండే పరిస్థితులను కల్పించాలి. అంటే ఏవ్యక్తి కూడ దోపిడి చేయబడేటంత బలహీనుడుగా ఉండ కూడదు; మనుష్యులలో మరొకరిని దోచుకోవాలన్న కోరిక పుట్టని వాతావరణం కలిగించాలి. కాబట్టి దోపిడిని అంతంచేయాలంటే మానవుని కోరికలను హేతుబద్ధం చేయటం దోపిడి చేయగల శక్తి సామర్థ్యాలు లేకుండ చేయటం జరిగాలి. అప్పుడే దోపిడి అంతరించే వీలుంటుంది.

భూ ఆస్తి ఎప్పుడు ఎక్కడ ఎలా దోపిడికి అవకాశం కలిగిస్తున్నది? వ్యక్తిగత భూ ఆస్తులు మాత్రమే దోపిడికి అవకాశాలను కలిగిస్తున్నవా? ఇలాంటి వ్యక్తిగత ఆస్తినుంచి దోపిడి అనేది విడదీయరాని ప్రత్యేక లక్షణమా?

వ్యక్తిగత భూ ఆస్తికి దోపిడికి చరిత్రలో ఒక కాలం ఏర్పడిన సంబంధం దురదృష్టకరమైనది. వీటికెంటికి ఎప్పుడు ఎలాంటి సంబంధము లేదని మేము చెప్పటం లేదు. జమీందారీవిధానం, కేపిటలిజం ఉచ్ఛ దశలోఉండి పెత్తనం సాగించుకొనే రోజుల్లో వ్యక్తిగత ఆస్తివల్ల దోపిడిజరుగుతుందనే భావం ఉదయించింది. ఆ విధానాలు ప్రజలను దోపిడిచేసిన మాట నిజమే. ఆ పరిస్థితులలో వ్యక్తిగతఆస్తి ఎన్ని అవలక్షణాలు, చెడుగుణాలకు దారితీయగలదో అన్నిటికి దారితీసి ప్రజలను పీడించిన మాట వాస్తవమే. పశ్చిమదేశాలలో దేశంలోని సకలసంపదలు ధనికులచేతుల క్రింద ఉన్న రోజులలో వారు ఆస్తిలేని ప్రజలను వ్యవసాయంలో, వ్యాపారంలో, పరిశ్రమలో అన్నిరంగాలలోను దోపిడి చేశారనడం కూడ సత్యదూరం కాదు. కాని ఒకవిషయం మరచిపోకూడదు. 19వ శతాబ్దంలో యూరప్ దేశాలలో, అమెరికాలో వ్యక్తి

గత ఆస్తివల్ల దోపిడిజరిగింది గనుక అదే పరమసత్యం అనుకోరాదు. చరిత్రలో ఒకప్పుడు వ్యక్తిగత ఆస్తివల్ల దోపిడి జరిగింది గనుక ఇక ఎల్లప్పుడు దాని లక్షణం అంతే అనుకోకూడదు. ఆ యా కాలాలలో ఆ యా సంఘాలలో దోపిడిజరిగింది. కాని అదే సర్వకాలాలకు, సర్వ సంఘాలకు అనువర్తించే పరమసత్యం మాత్రం కాదు.

అసలు ఆస్తి ఉన్నవాడు లేనివాడు కూడ ఆ యా కాలాలలో తమకు అనుకూలంగా ఉన్న పరిస్థితులను బట్టి ఒకరి నొకరు దోపిడి చేసే అవకాశం ఉన్నది. ఆధునికకాలంలోని పెద్దపెద్ద పరిశ్రమలను పరిశీలించండి. ఆ పరిశ్రమలకు పెట్టుబడులుపెట్టే అనేకులకు వాటినిర్వహణతో సంబంధం లేదు. ఆ యా పరిశ్రమల విధానాలను, భవిష్యత్కార్యక్రమాలను, దానిపరిశ్రమల మనుగడలను తయారుచేసే ఉద్యోగులు ఆ పెట్టుబడిదారులను దోచుకోవటం లేదా?

మరొక విషయం కూడ ఉన్నది. ఈ దోపిడి అనేది కేవలం ఆర్థికంగానే ఉండనక్కర్లేదు; అలాగే భూ ఆస్తికి మాత్రమే సంబందించిఉండదు. సాంఘికమైన దోపిడికూడ జరిగే వీలున్నది. వర్ణవ్యవస్థ వలసరాజ్యవిధానాలు మొదలైన వాటిరూపంలో సాంఘికంగాకూడ దోపిడి జరుగుతుంది. అలాగే దోపిడి వైజ్ఞానికంగా కూడ ఉండవచ్చు. అధికారం చలాయించే అవకాశంగల కీలకస్థానాలలో ఉన్న ఆస్తిలేని ప్రజలు కూడ దోపిడిచేసే అవకాశం ఉన్నది. ఇప్పటికే ప్రపంచం అనేక విధాలదోపిడులను రుచిచూచింది. జమీందారీ విధానపు దోపిడిని, మతాలదోపిడిని, కేపిటలిజం దోపిడిని చూచింది. కమ్యూనిస్టు దేశాల దోపిడిని కూడ అనుభవించింది. ఇదేవిషయాన్ని యుగోస్లావ్ కమ్యూనిస్టు నాయకులలో ఒకరైన మిలోవన్ జిలాస్ తన 'న్యూక్లాస్' అనే గ్రంథంలో ఎంత చక్కగా చెప్పాడో చూడండి.

"రోమన్ లాలో చెప్పినట్లు ఉపయోగం అనుభవించటం, ఇతరులకు ఇచ్చివేయటం అమ్మివేయటం అనేవే ఆస్తిలక్షణాలు. కమ్యూనిస్టు రాజకీయ పరిపాలనాయంత్రాగం ఆస్తిని ఉపయోగించుకొంటుంది, అనుభవిస్తుంది, జాతీయం చేయబడిన ఆస్తుల మీద దానికి హక్కులు కూడ ఉన్నవి. ఈ కొత్తవర్గం తన అధికారాన్ని

అవకాశాలను, సిద్ధాంతాన్ని ఒక ప్రత్యేకమైన ఆస్తి విధానం ద్వారా పొందుతున్నది. ఆ ప్రత్యేక ఆస్తి విధానమే సమిష్టియాజమాన్య విధానం. జాతిపేరుతో, సంఘంపేరుతో ఈ పరిపాలనా యంత్రాంగమే ఆ ఆస్తిని అజమాయిషీచేసి పంచిపెడుతుంది." ఈ వర్గం కొత్తరకం దోపిడిదారుల వర్గం. "చరిత్రకు తెలిసినంతవరకు మానవుని మీద సంపూర్ణాధికారాలను చలాయించే వర్గం ఇది." [1]

కాబట్టి సంఘంలో దోపిడికి అవకాశం లేకుండా చేయాలని అనుకొంటే వ్యక్తిగత ఆస్తివల్ల జరుగుతున్న దోపిడులను గురించి మాత్రమే కాక ఇతరవిధాలుగా జరుగుతున్న దోపిడులను, జరగటానికి అవకాశం ఉన్న దోపిడులను గురించి కూడ ఆలోచించవలసి ఉన్నది. కాబట్టి ఈ ఇతరవిధాలదోపిడులను విస్మరించి కేవలం ఒకరకమైన దోపిడి మీద మాత్రమే మనసు లగ్నంచేసి దానిని నివారించటానికి యత్నంచేస్తే ఆ ఇతరవిధాలైన దోపిడులు మనం ఖాళీ చేసిన రంగాన్ని ఆక్రమించుకొని కూర్చునే ప్రమాదం ఉన్నది. కాబట్టి మన కృషినల్ల వచ్చే ఫలితం ఏమిటి? ఇప్పుడు కొనసాగుతున్న దోపిడి విధానాలకు బదులు ఇంతకంటె ఘోరమైన దారుణమైన దోపిడి విధానాలు వచ్చి కూర్చుంటవి.

అసలు దోపిడికి మూలం రాజకీయ అధికారం, ఆర్థికాధికార మూను. అవి ఏ రూపంలోనైనా ఉండవచ్చు. కాని దురదృష్టవశాత్తు నేటి కాలంలో మానవప్రకృతి అధికారాన్ని మాత్రమే ప్రేమిస్తున్నది. ప్రఖ్యాత తత్వశాస్త్రజ్ఞుడు బెర్ట్రండ్ రస్సెల్ పరిశీలనను పరికించండి. "సాంఘిక విషయాలలోని ప్రధాన ఆచరణకు అధికారవాంఛయే కారణమని గ్రహిస్తేనే కాని చరిత్రను – ప్రాచీన చరిత్రనుకాని ఆధునిక కాలపు చరిత్రను కాని – సరిగా వ్యాఖ్యానించటానికి వీలులేదు." [2] "పదార్థవిజ్ఞానశాస్త్రంలో శక్తి ఎంతటి ప్రధానభావనో, సాంఘిక శాస్త్రంలో అధికారం కూడ అంతటి ప్రధాన విషయం." [3] కాబట్టి దోపిడికి అవకాశం లేకుండ చేయాలంటే అధికార కేంద్రీకరణకు

1 Milovan Djilas — "The New Class"

2, 3 Bertrand Russell — 'Power' - a new social analysis.

అంగీకరించకూడదు. అధికారాన్ని వికేంద్రీకరించటం ఆవశ్యకం. అధికార వికేంద్రీకరణలో అధికారం అవకాశాలు సాధ్యమైనంత ఎక్కువగా సాధ్యమైనంత ఎక్కువమందికి అందుబాటులో ఉండేటట్లు చేయాలని అంతర్గతంగా ఉన్నది గదా! ఇలాచేసిన పక్షంలో ఒకరిని దోచుకొనే అవకాశం మరొకరికి ఉండదు. ఒకరిచేత దోపిడిచేయబడేటంత బలహీనత ఎవరికి ఉండదు. అందువల్లనే భూ ఆస్తికి ఇతర ఆస్తులకు, అధికారాలకు కూడ గరిష్ఠ పరిమితులను పెట్టాలనే ప్రతిపాదన చేస్తున్నాం.

ఇక ఇప్పుడు మనం రైతాంగ ఆర్థిక విధానంలో వ్యక్తిగత భూ ఆస్తులు ఉండటం సర్వులకు సమానావకాశాలు ఉండాలనే సూత్రానికి విరుద్ధంగా ఉన్నదేమో పరిశీలించాలి. దీనినే మరొక విధంగా చెప్పాలంటే వ్యక్తిగత భూఆస్తి విధానానికి దోపిడి అసమానావకాశాలు అనేవి దానినుంచి విడదీయరాని ప్రత్యేకలక్షణాలా?

అసలు ఆస్తి అనే ఈ పదాలలో చాల అర్థాలున్నవని గ్రహించటం అవసరం. అన్నిరకాల ఆస్తులకు ఒకేరకమైన హక్కులు లేవు. వీటికి భిన్న భిన్నమైన హక్కులున్నవి. వీటి అన్నింటికి సాధారణ లక్షణం ఒక్కటే—అదేమంటే ఆ ఉన్నహక్కులను ఆ యా వ్యక్తులు అనుభవిస్తుంటారు; సంఘం ఆ హక్కులను గౌరవించేలాగ ప్రభుత్వం చూస్తుంటుంది. ఈ సాధారణసూత్రంలోతప్ప ఆ యా ఆస్తులలో భిన్నత్వమే ఎక్కువగా ఉన్నది. వాటి వాటి ఆర్థిక లక్షణాలలో, సాంఘికపరిణామాలలో, నైతిక విషయాలలో వీటిలో అనంతమైన భేదాలున్నవి. తమ యజమానులు ఇంక ఎక్కువ ఆస్తులను సంపాదించుకోవటానికి, అధికారం పొందటానికి, దోపిడి చేయటానికి అవకాశం ఇచ్చే ఆస్తులు కొన్ని ఉన్నవి. ఆ యా యజమానులు నిరంతరం ఉపయోగించుకుంటూ దానివల్లనే తమ వృత్తిని, జీవికను సంపాదించుకొంటూ తద్ద్వారా తమ వ్యక్తిత్వాన్ని, స్వేచ్ఛను వ్యక్తం చేస్తూ అభివృద్ధి చేసికొనే అవకాశం కలిగించే ఆస్తులు కొన్ని ఉన్నవి. వీటి రెంటిలో మొదటి తరగతి ఆస్తులు — ఉదాహరణకు పెద్ద పెద్ద పరిశ్రమలు, బ్యాంకులు, వ్యాపారసంస్థలు, పెద్ద పెద్ద వ్యవసాయ సంస్థా

నాలు మొదలైనవి – అధికార కేంద్రీకరణకు, అసమానావకాశాలకు దారితీసి తద్ద్వారా దోపిడి అవకాశం కలిగిస్తవి. అంతేకాక ఇలాంటి ఆస్తులలో యాజమాన్యం ఒకరిది; వాటిలో పనిచేసేది మరొకరు. వాటిలో శ్రమించేది వాటి యజమానులు కాదు. దానికి ఉదాహరణగా పెద్ద పెద్ద పరిశ్రమలలోని వాటాదారులను గ్రహించవచ్చు. కాబట్టి జాతి మత వర్గాలతో నిమిత్తం లేకుండ ప్రజలందరకు సాంఘిక న్యాయం కలుగచేయాలంటే బహిష్కరించవలసినది అలాంటిఆస్తులనే.

కాని రెండవ రకం ఆస్తి ఇలాంటిది కాదు. ఈ ఆస్తి నిరంతర కృషికిమూలం. యజమానులకు ఈ ఆస్తి తమ ఉత్పత్తి కృషిలో సాధనగా ఉపకరిస్తుంది. దీనివిషయంలో ఆస్తినుంచి పనిని వేరుచేయటానికి వీలులేదు. ఈ ఆస్తిమీద యజమానే తన సాధనసంపత్తితో కృషిచేసి తన శ్రమఫలితాన్ని పూర్తిగా గాని పాక్షికంగా గాని తానే అనుభవిస్తాడు. ఈ ఆస్తివల్ల దోపిడికి ఎలాంటి అవకాశాలు ఉండవు. ఇతరులకు వారి వారి అవకాశాలను, అవసరాలను లేకుండ చేయటానికి కూడ ఈ ఆస్తి ఉపకరించదు. రైతుల కుటుంబకమతాలు, చేనేత పారిశ్రామికుల మగ్గం మొదలైన సాధనాలు, వడ్రంగుల ఉలి, బాడిశ మొదలైన సాధనాలు, కమ్మరుల కొలిమి, సుత్తి మొదలైనసాధనాలు, కుమ్మరుల చక్రం, ఆవం మొదలైన సాధనాలు, ఇలాగే అనేక చేతి వృత్తుల వారి సాధనాలు, వారి వారి శ్రమతో, వారికుటుంబకృషితో పనిచేసి కోవటానికి వీలునిచ్చేదోపిడికి చోటులేని వ్యక్తిగత ఆస్తులు. ఇలాంటి ఆస్తులవల్ల ఆయా యజమానులు వారికుటుంబాలు సొంతంగా కృషిచేసికొని ఒక వృత్తిని సంపాదించుకోవటం తప్ప దోపిడికి వీలుండదు. ఆస్ట్రియన్ సోషలిజానికి జనకుడైన అట్టోబోవర్ ఏమంటున్నాడో చూడండి. "కేపిటలిస్టుకి ఆస్తి తన ధనాన్ని పెట్టుబడి పెట్టటానికి సాధనం; శ్రామికునికి, చేతివృత్తులవారికి, చిన్నరైతుకి ఆస్తి తాను శ్రమచేసి కోవటానికి సాధనం."* కాబట్టి అన్నిరకాల వ్యక్తిగత ఆస్తులను ఒకే గాటను కట్టివేసి ఒకేవర్గంగా చేసి వాటిఉనికి న్యాయసమ్మతం కాదు గనుకనే వీటిని బహిష్కరించాలనటం తప్ప,

* M. R. Masani in his speech in parliament of 30th July, 1957.

"పారిశ్రామిక సూత్రాలను ధ్వంసం చేస్తున్నది వ్యక్తిగత ఆస్తి కాదు; సొంతంగా పనిచేయని వ్యక్తిగత ఆధిపత్యం మాత్రమే దానిని ధ్వంసం చేస్తున్నది. భూ ఆస్తులమీద, ఆర్థిక ఆస్తులమీద వ్యక్తిగత యాజమాన్యం ఉండటం తప్పక దోషభూయిష్ఠమని కొందరు సోషలిస్టులు విశ్వసించటం కేవలం అనాలోచితం; వారి విశ్వాసానికి కేవలం ఆచరణకు సంబంధంలేని గ్రంథస్థ సిద్ధాంతాలే మూలం. వ్యక్తిగత ఆస్తులుండటం న్యాయమా అన్యాయమా అనేది అవి ఏరకం ఆస్తులు, ఎలాంటి ప్రయోజనాలకోసం ఆ ఆస్తులు ఉపయోగింపబడుతున్నవి అనే అంశాలను బట్టి నిర్ణయింపబడుతుంది." [1]

వ్యక్తిగత ఆస్తి విధానంలో గుర్తుంచుకోవలసిన మరొక విషయం కూడ ఉన్నది. ఆయా ఆస్తులమీద వ్యక్తులహక్కులు సర్వస్వతంత్రాలు సంపూర్ణాలుకావు. ఈ హక్కులు సంఘంయొక్క ఆమోదంమీద ఆధారపడి ఉంటాయి. సంఘంలో వ్యక్తుల మధ్య వాటిని విభజించి కూడ అనుభవించవచ్చు. ప్రధానమైన విషయమల్లా ఆస్తులమీద ఎవరికి హక్కులుండాలి, ఎలాంటి హక్కులుండాలి అనేదే. దీనిని గురించి చెపుతూ బ్రిటీష్ సోషలిస్టు యూనియన్ ఎంత చక్కగా వివరించిందో పరికించండి. "వాస్తవానికి ఆధిపత్యం అంటే అనేకమైన హక్కుల సమూహారమే. ఈ హక్కులు పవిత్రమైనవేమీ కావు. సంఘము ప్రభుత్వము ఈహక్కులను రూపొందిస్తవి. ఈహక్కులు సర్వకాలాలకు కొనసాగేవి కూడకావు; మార్పులు చేయటానికి వీలు పడనివి కావు. సంఘము, ప్రభుత్వము కావాలనుకొంటే వీటిని ఎంతగానైన మార్చవచ్చు. వాస్తవచరిత్రలో ఇవి ఇలాగే మారుతున్నవి. ఇవి విడదీయరాని హక్కులుకూడ కావు. ప్రతి ప్రత్యేక హక్కును విడగొట్టి అనేక పద్ధతులతో దానికి పరిమితులను ఏర్పరచవచ్చు; ఈ హక్కులలో కొన్నిటిని వ్యక్తులకు మరికొన్నిటిని రాజ్యానికి ఇచ్చే వీలుకూడ ఉన్నది." [2]

---

1. R. H. Tawney, The Acquisitive Society, P. 87.

2. Socialist Union, Twentieth Century Socialism, 1956, P. 156.

IV

ఈ పరిశీలనదృష్ట్యా పరికిస్తే రైతాంగయాజమాన్యం సోషలిస్టు మార్గాలకు వ్యతిరేకమా? అలా ఎన్నటికి కాదు. తమ తమ కుటుంబకమతాలమీద రైతాంగానికున్న ఆధిపత్యాన్ని కేవలం వ్యక్తిగత ఆస్తి అనటం న్యాయం కాదు. రైతుల కుటుంబకమతాలు ప్రధానంగా కేవలం ఆస్తిమాత్రమే కాదు; వారి కుటుంబ కమతాలే వారి నృత్తి. అదే వారి జీవనం. ఈనాటి పరిస్థితులలో వారి కుటుంబ కమతాలకు మార్కెట్‌లో రేటుపలకవచ్చు; నేటి పరిస్థితులలో వెంటనే సొమ్ముచేసికొనటానికి వీలైన వస్తువులుగా, ఆస్తిగా వారి కుటుంబకమతాలు అయితే కావచ్చు. కాని వాటివల్ల లభిస్తున్న పనిని, వృత్తిని దృష్టిలో పెట్టుకొంటె వాటికి ఈ చెప్పుకొనే ఆస్తి విలువల కంటె ప్రాధాన్యం ఉన్నది. ఈ వృత్తివల్ల సాధ్యమవుతున్న జీవితంలో ఎవరికి లొంగకుండ ఎలాంటి యజమానులకు తలఒగ్గకుండ స్వేచ్ఛగా జీవించే అవకాశాలు లభిస్తున్నాయి. ఆర్థికస్వాతంత్ర్యం లభిస్తున్నది. తద్ద్వారా గౌరవం, స్వయంశక్తి మీద నిలబడగల మన్న విశ్వాసం, నిలబడాలన్న భావం ఏర్పడుతున్నవి. ఒక్కమాటలో చెప్పాలంటే స్వయంవృత్తివల్ల లభించే ప్రయోజనాలన్నీ సిద్ధిస్తున్నవి. ఇలాంటి ఉత్తమ విధానాలను ఆశయాలను సాధిస్తున్న ఆస్తి 19వ శతాబ్దంలోను, 20వ శతాబ్దం మధ్యలోను వచ్చిన ఆస్తిని గురించిన భావాల కంటె చాల ఉన్నతమైనది. ఈ యుద్ధానంతర కాలంలో రైతుకమతాల ఉన్నత ఆశయాలను విలువలను ఇంచుమించు అందరు గుర్తిస్తున్నారు. ఈ విలువలతో సరితూగగల విలువలను ఆశయాలను పారిశ్రామికరంగంలో చూడలేము. పరిశ్రమలలోని 'గుడ్‌విల్' అనేది మాత్రం మహాఅయితే ఈ రైతుకమతాల విలువలకు సమీపంగావస్తే రావచ్చు. ఎరనుచూపించి చేపను లాగినట్లుగా ప్రజలకు పనిచూపించి సంఘాన్ని దోచుకోనే వ్యక్తిగత ఆస్తి కాదిది. మార్క్స్, మార్క్స్‌లు వ్యక్తిగత ఆస్తి అంటేనే దోపిడి అన్నారు. కాని ఈ వ్యక్తిగత ఆస్తి వారు భావించినట్టిది కాదు. ఇది కేవలం వ్యక్తిగత ఆస్తిమాత్రమే కాదు. ఈ విషయం మార్క్స్ కూడ గమనించి

దానిని తనదూషణకు పాల్పడకుంట చేశాడు. అందువల్ల ఈ ఆస్తి ఆకుటుంబపు అవసరాలను తీర్చటమె కాక రైతులు సాంఘికస్వేచ్ఛను, ఆర్థికస్వాతంత్ర్యాన్ని నిలుపుకోవటానికి ఇది సహాయపడుతుంది. కాబట్టి రైతు కమతాలను మామూలు వ్యక్తిగత ఆస్తిగా పరిగణించి చూపించటం మొదలు పెట్టటంకంటె సంఘానికి చేయగలిగిన ద్రోహం మరొకటి ఉండదు. అలా భావించటమే కాక ఈ కుటుంబకమతాలను తీసివేసి వాటిస్థానే సహకారవ్యవసాయమో, సమిష్టివ్యవసాయమో నెలకొల్పి, ఈ కుటుంబకమతాలనుండి సంఘాన్ని విడదీయాలని దేశ వ్యాప్తంగా ఒక ఉద్యమాన్ని ప్రారంభించటం సంఘ ద్రోహం.

రైతు కుటుంబకమతంలోని ప్రధాన విశిష్ట లక్షణం ఏమంటే దానిలో దోపిడికి ఎలాంటి అవకాశము లేదు. ఆ యా కమతాలమీద పనినంత రైతు, అతని కుటుంబము నిర్వహించు కొంటుంది. వారి కృషికి న్యాయసమ్మతంగా రావలసిన ప్రతిఫలమే ఆ కమతం నుంచి ఫలసాయం రూపంలో వారికి లభిస్తున్నది. రైతుల యాజమాన్యం దోపిడికి అవకాశం లేని విధానం మాత్రమే కాక, ఆ యాజమాన్యం వల్ల వారికి వస్తున్న హక్కులు కూడ వారి కృషికి తోడ్పడి సాంఘిక ావశ్యకాలకు తోడ్పడేవిగా ఉంటవి.

అడవులుగా, గుట్టలుగా, బీళ్ళుగా, నిస్సారంగా ఉన్న భూములను వ్యవసాయ యోగ్యంగా సారవంతంగా చేయటానికి ఎన్నో తరాలనుంచి అనేక కష్టనష్టాలకు గురిఅవుతు తాము కూడబెట్టుకొన్న నాలుగురాళ్ళను కూడ మళ్ళీ ఆ భూమిమీదనే పెట్టుబడి పెడుతూ తినటానికి సరిగా తిండి లేకపోయినా, ఒంటినిండ బట్ట లేకపోయినా సహించి శ్రమించి తమ జీవితాలనే ఈ భూములకు అంకితం చేశారు. ఈ నాటికి కూడ రైతులు తమ భూములను పంటలను వరదలనుంచి తెగుళ్ళనుంచి రక్షించు కోవటానికి శ్రమరూపంలో, ధనరూపంలో, వ్యక్తిగత శ్రద్ధరూపంలో ఎంతటి మూల్యం చెల్లించ వలసి ఉన్నదో గమనించారా? ఈ నాడు వారి కమతాలకు ధర పలుకుతున్నదంటే దాని అర్థం ఏమిటో తెలుసా? ఇన్ని తరాలనుంచి ఆ భూముల మీద వారు చేసిన శ్రమకు పెట్టిన పెట్టుబడులకు, తీసికొన్న వ్యక్తిగత శ్రద్ధకు

ఈ రేటు పలుకుతున్నదన్న మాట. భారతప్రభుత్వం – భూములను బుల్డోజర్లు మొదలైన యంత్రాల సహాయంతో వ్యవసాయయోగ్యం చేయాలని ప్రయత్నించి ప్రతిఒక్క ఎకరానికి కొన్ని వేలరూపాయలను వెచ్చించింది. మరి మన రైతులు తమ కమతాలను సారవంతమైన క్షేత్రాలుగా చేయటానికి ఎంతగా శ్రమించారో, ఎన్ని తరాలనుంచి తమ జీవితాలనే ఆ భూములకు అర్పిస్తే ఈ నాటికి ఆ భూములకు ఈ రేట్లు పలుకుతున్నవో ఊహించారా? ఇంత విశిష్టమైన ఈ రైతాంగ యాజమాన్యాన్ని కుటుంబకమతాలను నిర్జీవమైన వ్యక్తిగత ఆస్తిగా పరిగణించి స్వార్థదృష్టితో, దోపిడితో ధనార్జనచేసే జాయింట్ స్టాక్ కంపెనీల వాటాలకు, కేపిటలిస్టుల పరిశ్రమలకు ఈ కుటుంబ కమతాలకు భేదం లేదనటంకంటె సంకుచితత్వం ఊహించగలరా? పైగా ఈ కుటుంబకమతాలు సంఘప్రయోజనాలకు గుదిబండలై సంఘాన్ని కుంచిస్తున్న యనటం కంటె సంఘ్రదోహం మరేముండగలదు? ఇంగ్లీషు సోషలిస్టు తత్వశాస్త్రజ్ఞుడు అయిన ఆర్. హెచ్. టానే కూడ ఏ సత్యాన్ని వెల్లడిస్తున్నాడో చూడండి. "భవిష్యత్కాలంలో ఏమి జరుగుతున్నప్పటికి తాము దున్నుకొనే కమతాలమీద, తాము ఉపయోగించుకొనే పరికరాల మీద ప్రజలు తామే యాజమాన్యం వహించిన స్థితికంటె ఉత్తమ సాంఘిక వ్యవస్థగత చరిత్రలో మరొకటి కనిపించదు. తన శక్తిమీద, ఆస్తిమీద తాను జీవించటం, తన వారసుణ్ణి తాను గుర్తెరగటం మానవుని మానసిక శాంతికి మూలమని ఆధునికకాలపు ఆంగ్లేయ స్వేచ్ఛావాదులతో ఆనాటి రైతు పోటీపడి చెప్పగలడు." *

వ్యక్తిగతంగా భూ ఆస్తి ఉండటమే ఒక పాపం అని వినోబా భావే అన్నారు. కాని ఈ భావంతో మేము అంగీకరించ లేకుండ ఉన్నాం. కాబట్టి దీనికి మేము 'పంచాయితీ భూస్వామ్యం – రైతు స్వామ్యం' అనే చిన్నపుస్తకంలో ఇచ్చిన సమాధానాన్నే ఇక్కడ పునరుట్టంకిస్తున్నాం.

* R. H. Tawney, The Acquisitive Society, 1955, P. 56.

ఒక వ్యక్తికున్న భూకమతాన్నుంచే అతనికి అతని కుటుంబానికి సరిపోయేవృత్తిని కల్పించటమనేది అతని ఆర్థిక స్వాతంత్ర్యాన్ని విస్తృతంచేయటమేకాని పాపకృత్యమేమీ కాదు. దిన భృత్యానికి సేవచేసే స్థితినుంచి తప్పించుకొని ఆర్థిక స్వాతంత్ర్యాన్ని కాంక్షించటమనేది మానవుడు తనలోని దివ్యత్వంతో తత్పరిరక్షణకు చేసే ఉత్తమోత్తమకృషి; అంతేకాని అదేమీ పాపంకాదే! తరతరాలుగా హక్కు-భుక్తాలతో సంక్రమిస్తున్న భూమిమీద నిర్మాణాత్మకంగా ఉత్పత్తిదాయకమైన కృషిచేసి ఒక గింజకు పది గింజలను పండించి పది మందినీ పోషించి స్వాతంత్ర్యభిక్ష పెట్టేది పాప పంకిలమైన జీవితమేనా? దేవుడిచ్చిన భూముల మీద ఇంతకంటే, చేయదగిన ఉత్తమకృషి మరేమిటో ఎవరైనా చెప్పగలరా? అతనికున్న కొద్ది పాటి భూమిని కనిపెట్టుకొని తనకు తన కుటుంబానికి తగిన వృత్తిని సంపాదించుకోవటమే కాక తన విధానంద్వారా తా నింత తిని పరుల కింత పెట్టి స్వేచ్ఛాస్వాతంత్ర్యాలతో తన కాళ్ళమీద తాను నిలబడుతున్న మనరైతంటే వీరికింత చిన్నచూపు ఎందుకో? మనరైతుపద్ధతి పనిచెయకుండ కూర్చుని ఇతరులను దోపిడిచేసే విధానంకాదు; ఈవిధానమే ఉత్తమస్వాతంత్రసాధనిర్మాణానికి ఉపకరించే మహోన్నత శిల్ప ప్రక్రియ. వీరి చేతుల్లోనే భూదేవి ఫలవంతమై పదిమందినీ పోషిస్తూ ఉన్నది. వీరి చేతుల్లోనే బీడుపడి నిరుపయోగం కాకుండ పోషింప బడుతూ ఉన్నది. అలాంటి భూదేవి ఈ చిన్నచిన్న రైతుల చేతులలో నిర్బంధింపబడి నలిగిపోతూఉన్న దనటం భూమాత తత్త్వాన్ని అర్థంచేసికో లేనివారు అనేమాట. భూదేవికి చిన్న రైతుకి ఉన్న ఈ సంబంధాన్ని తెగతెంపులు చేయటమంటే భూదేవిని తన సహజ పరిరక్షకుణ్ణించి పోషకుణ్ణించి వేరు చేయటమే.

అంతేకాక ప్రజలందరకు సమానావకాశాలు కలిగించటానికి ఈ రైతుల యాజమాన్యం అడ్డం రాదు. అసలు సమానావకాశాలు కలిగించాలనే దానికి భూమి చిన్నచిన్న కమతాలుగా రైతుల చేతులలో ఉండటం బలం చేకూరుస్తుంది. అంతేకాని సమానావకాశాలు కలిగించటం అంటే ప్రజల భూ ఆస్తులను బహిష్కరించటం కాదు.

భూమిని అందరికి సమంగా విభజించాలంటే భూకమతాలపై రైతుల కున్న యాజమాన్యాన్ని తలక్రిందులు చేయవలసిన అవసరం కూడ లేదు. ఎందువల్లనంటే భారత దేశంలో భూ ఆస్తులున్న 5 కోట్ల రైతులలో 10 ఎకరాలకంటె తక్కువ భూములున్న వారు 100 కి 75 మందికంటె ఎక్కువ ఉన్నారు. భూ వసతికి గరిష్ఠ పరిమితులను కూడ నిర్ణయిస్తున్నాము గనుక భూ ఆస్తులతో ఇక అసమానతలు ఉంటాయనికాని తలలెత్తుతాయని కాని అనుకోవలసిన అవసరంలేదు; చిన్నచిన్న రైతుల ఆర్థిక వసతులను ధ్వంసం చేస్తుందని కాని, లేక పెద్దపెద్ద భూస్వాముల దోపిడికి అవకాశం ఉంటుందని కాని అనుకోవలసిన పని లేదు. అసలు ఇంతవరకైనా సమంగా విభజించబడిన ఆస్తి మరొకటి ఉన్నదా? ఒక్క భూ ఆస్తులు మాత్రమే ఇలా సమానత్వ సిద్ధాంతాన్ని ఆచరణలో పెట్టుతున్నవి. సంఘంలోని ఇంతమంది అత్యధిక సంఖ్యాకులకు ఆర్థికస్వేచ్ఛను లభింపచేసే ఆస్తి, ఇంతమంది చేతులలో ఉన్న ఆస్తి మరొకటి లేదు. కాబట్టే 1955 వ సంవత్సరం జనవరిలో రంగూన్‌లో జరిగిన ఆసియా సోషలిస్టు మహాసభ ఈ క్రింది విధంగా తీర్మానించటంలో ఆశ్చర్యపడవలసిన అవసరం లేదు. "భూమిని దున్నే వానికే సమంగా పంచాలనేది సోషలిజానికి ప్రాథమిక సూత్రం. రైతులకు సంఘం, ప్రభుత్వం కూడ తప్పక సాయపడవలసి ఉన్నదని సోషలిజం భావిస్తున్నది."

సెంట్రల్ ఈస్టరన్ యూరప్ దేశాల సోషలిస్టుయూనియన్ 1951వ సంవత్సరంలో ఫ్రాంక్‌ఫర్ట్‌లో 5 వ కాంగ్రెస్ జరిపినపుడు "వ్యావసాయక విధానాన్ని రైతుల వ్యక్తిగత యాజమాన్యం మీదనే ఆధారపడి ఉండేటట్లు చూడాలి" అని ప్రకటించింది.

భూములపై రైతుల యాజమాన్యంవల్ల వారికి శాసనబద్ధమైన హక్కులు లభించటం కాక వారికి స్వేచ్ఛను ప్రసాదించే స్వయంవృత్తి గౌరవం లభించటమే దాని వాస్తవమైన విశిష్టలక్షణమని మనం మరొకసారి గుర్తుచేసికోవాలి. సంఘప్రయోజనాలదృష్ట్యా అవసరమనుకొన్నప్పుడు సాంఘిక న్యాయందృష్ట్యా సమ్మతమైనప్పుడు రైతుల హక్కులమీద కొన్ని నిర్బంధాలు విధించవచ్చు. భూమిమీద రైతు

లకు సర్వతంత్రస్వతంత్రమైన సంపూర్ణహక్కులు ఎప్పుడూ ఉండవు కనుక సాంఘికావశ్యకాలదృష్ట్యా రైతాంగవ్యవస్థకు దెబ్బతగలని విధంగా కొన్నికొన్ని హక్కులను రైతులనుంచి తీసికోవచ్చు. భూ ఆస్తులను సాధ్యమైనంత ఎక్కువ మందికి పంచినప్పటికీ కౌలు దారులకు తమ తమ కౌలుభూములను నిర్భయంగా సాగుచేసికొనే టందుకు అవసరమైన రక్షణలు కల్పించినప్పటికి కూడ దేశప్రజలలో కొంతమందికి స్వయంవృత్తిని సంపాదించుకొనటానికి వీలైన భూమి లభ్యం కాక పోవచ్చు. అలా వారికి భూమిలభ్యం కాకపోవటానికి కారణం రైతుల వ్యక్తిగత యాజమాన్య విధానమే ననుకోవటం పొరపాటు; అందరకు కావలసినంత భూమి దేశంలో లేకపోవటంవల్ల వారికి ఇతరవృత్తులు లభించక పోవటంవల్ల భూమిమీద ఆధారపడు తున్న వారిసంఖ్య ఒత్తిడి అధికం కానటంవల్ల వారికి భూములు లభించటం లేదు. అంతేకాని వ్యక్తిగత యాజమాన్య విధానమే దానికి కారణం అనుకోరాదు. కాబట్టి భూమి దొరకక నిరుద్యోగు లైన గ్రామీణ కూలీలకు వ్యవసాయేతర రంగాలలో వీరికి పని దొరికే టట్లు చేయటానికి ప్రభుత్వము సంఘము సర్వప్రయత్నాలు చేయాలి. దేశంలోని వ్యావసాయక ప్రజలలో మూడోవంతు మందికి వారి వృత్తులకు జీవనానికి ఎలాంటి భద్రత లేదు. కనుక మొత్తం 20 కోట్ల రైతులను కూడ వారి వారి కమతాలనుంచి తొలగించి స్వయంవృత్తి వల్ల వారికి లభిస్తున్న గౌరవాన్ని, ప్రయోజనాలను ధ్వంసం చేసి ఈ రైతులనుకూడ ఆ వ్యవసాయ కూలీల దైన్యస్థితికి భద్రతలేని నిస్స హాయస్థితికి తీసికొని రావటం ఎలాంటి సాంఘిక న్యాయమో చెప్ప గలరా? తిండిలేనివారు, వృత్తిలేనివారు కొంతమంది ఉన్నారు గనుక అసలు సంఘంలో అందరికి కూడ తిండిలేకుండ, వృత్తిలేకుండ చేసి సర్వులను సమం చేయటమనేది నాగరక మానవుని సాంఘిక న్యాయ మేనా అని అడుగు తున్నాం.

V

రైతాంగ యాజమాన్యం చేసే పని మరొకటుంది. ఇలాంటి ఆస్తి దోపిడికి అవకాశం లేకుండ చేయటమే కాక ఆ ఆస్తులకు అధి

పతులైన రైతులలో, కళాకారులలో మరొకరిచేత దోపిడి చేయబడ నలసిన బలహీనతను లేకుండ చేస్తుంది. అంటే ఇలాంటి ఆస్తులవల్ల వారు దోపిడి చేసే అవకాశం కాని, దోపిడి చేయబడే వీలుకాని ఉండదు. మనరైతాంగం సాంఘికస్వేచ్ఛను, ఆర్థికస్వాతంత్ర్యాన్ని అనుభవించటానికి వారి చిన్నచిన్న భూకమతాలే ఆధారం. అవే వారిపునాదులు. "ఆరోగ్యవంతమైన, ఆత్మగౌరవపూరితమైన జీవనానికి ఈ చిన్న కమతాలు అవసరం." తమ భూములమీద యాజమాన్యపు హక్కులున్నరైతులు, కౌలుభూములకు రక్షణఉన్న కౌలుదారులు మరొకరిమీద ఆధారపడవలసిన అవసరం లేకుండ స్వతంత్రంగ ఉండ గలరు. కాబట్టి వీరిని మరొకరు దోచుకోవటం సాధ్యం కాదు. కుటుంబ కమతాలకు సంబంధించిన రైతాంగయాజమాన్యాన్ని రద్దుచేసినంత మాత్రాన స్వయంగ సేద్యంచేయని పెద్దపెద్ద భూకామందులలో ఉన్న దోపిడిని రూపుమాపటం అసంభవం. ఉన్నదోపిడిని తీసివేయలేకపోగా రైతాంగయాజమాన్యాన్ని రద్దుచేయటంవల్ల కొన్నిలక్షల రైతుల స్వాతంత్ర్య శక్తియుక్తులు ధ్వంసమై పోతాయి. భూములున్న రైతులకు ఉన్నహక్కులను అన్నిటిని సమిష్టివ్యవసాయ క్షేత్రానికో, సహకారవ్యవసాయసంఘానికో అప్పగింత పెట్టటంవల్ల భూములమీద శ్రమపడే రైతులందరు తమ కాళ్ళమీద తాము నిలబడలేక మరొకరి మీద ఆధారపడి బ్రతుకవలసిన స్థితి ఏర్పడుతుంది. దీనితో దోపిడి మరొక రూపంలో మరింత అధికం అయ్యే ప్రమాదం ఉన్నది. ఎందువల్లనంటే అనేకమంది రైతులకు పంచబడిఉన్న ఆర్థికాధికారం ఒక్కచోటే చేరుతుంది: ఆ యూ సంఘాల మేనేజర్లకు, డైరక్టర్లకు, వారి ఇష్టులకు ఆ అధికారంవల్ల ఎంతటి దోపిడినైనా చేయటానికి వీలుకలుగుతుంది. మానవునిలో దోషాలున్నంతవరకు "అధికారం చెడగొడుతుంది, సంపూర్ణాధికారం సంపూర్ణంగ చెడగొడుతుం" దనేది సత్యం. కమ్యూనిస్టు దేశాలలో జరిగిన దానిని బట్టి ప్రస్తుతం జరుగుతున్న దానిని బట్టి ఈ విషయాన్ని మనం స్పష్టంగా చూస్తున్నాం. ఆ యూ దేశాలలో ప్రస్తుతం ప్రచారంలోకి వస్తున్న సమిష్టిక్షేత్రాలవిచ్ఛిత్తి సహజమైనదే. ఇదివరలో వారు రైతాంగాన్ని వారివారి భూముల

నుంచి విడగొట్టి సమిష్టిక్షేత్రాలను ఏర్పాటుచేశారు. ప్రస్తుతం ఆ సమిష్టిక్షేత్రాలను మళ్ళీ విచ్ఛిన్నం చేయాలనే అభిప్రాయం పలుకుబడి సంపాదించుకోవటంలో ఆశ్చర్యం ఏమీ లేదు. "జెకోస్లవేకియాలోని సమిష్టిక్షేత్రాలలో 100 కి 40 క్షేత్రాలు సరిగ పనిచేయటం లేదు; వీటిల్లో అధికభాగం మళ్ళీ విడివిడి కమతాలుగా విడిపోవటానికి 1953 వ సంవత్సరం చివరలో అంగీకరించటం జరిగింది. యుగోస్లావియాలో 1951 వ సంవత్సరం తరువాత నూతన విధాన రైతులు తమ భూము లను సమిష్టిక్షేత్రాలనుంచి మళ్ళీ విడగొట్టు కోవటానికి అంగీకరించిరి. మొత్తం దేశంలోని సమిష్టి క్షేత్రాలలో సగానికిపైగా రద్దు చేయబడినవి." "1951వ సంవత్సరంలో ఉన్న 7000 సమిష్టిక్షేత్రాలలో 1953 సంవత్సరం సెప్టెంబరునాటికి 2500 క్షేత్రాలు మాత్రమే మిగిలి నవి. 1957వ సంవత్సరం ఏప్రిల్ 27వ తేదీన యుగోస్లావియా ప్రభుత్వం సమిష్టిక్షేత్రవిధానాన్ని పూర్తిగా రద్దుచేస్తూ ఒక తీర్మానం చేసింది. సమిష్టివ్యవసాయంవల్ల విరుద్ధఫలితాలు కలిగినవని, రైతులలో వ్యక్తి గత శ్రద్ధ లోపించినదని, ఉత్పత్తులు కూడ పడిపోయినవని ఆ శాసనం పేర్కొన్నది." * ఈ నూతన విధానంలో కమ్యూనిస్టు నాయకులు రైతులను శత్రువులుగా పరిగణించటం తప్పని, అలాచేయవద్దని తమ పరిపాలనా యంత్రాంగాలను ఆదేశిస్తున్నారు. బల్గేరియాలో తప్ప మిగిలిన కమ్యూనిస్టు దేశాలలో దేశానికి కావలసిన వ్యవసా యోత్పత్తులలో అధికభాగానికి స్వతంత్రమైన రైతాంగమీద ఆధారపడవచ్చునని ప్రకటించటం కూడ జరిగింది. కనుక సంఘంలో ఒక మనిషిని మరొక మనిషి నోచుకోకుండా ఉండాలంటే అధికారాన్ని వికేంద్రీకృతం చేయటం ఆవశ్యకమవుతున్నది.

ఇట్టి అధికార వికేంద్రీకరణను రైతాంగవ్యవస్థ సాధించ గలదు. దోపిడిని అంతంచేసే దృష్టితో పరికిస్తే నేడు చూపించబడుతున్న ప్రత్యామ్నాయ మార్గాలకంటె రైతాంగపు కుటుంబవ్యవసాయ విధా నమే చాల ఉత్తమమైనది. ఇలా అంటున్నామంటే దీనికి కారణం లేక పోలేదు. పెద్దపెద్ద భూస్వాముల చేతులలో భూమి కేంద్రీకృతం

* M. R. Masani's speech in Parliament of July 1957.

కావటంవల్ల నేడు జరుగుతున్న దోపిడికి ఈ కుటుంబవ్యవసాయవిధానంలో చోటు లేదు. ఈ కుటుంబకమతాలు ఆ యా చిన్నరైతులకు ఇతరుల దోపిడికి తలఒగ్గ వలసిన అవసరం లేకుండచేసి వారికి భద్రత తను చేకూరుస్తవి.

వికేంద్రీకృత ప్రజాస్వామ్యసాధనకు ఈ కుటుంబవ్యవసాయ విధానమే తోడ్పడుతుంది. పరుల దయాధర్మాలతో నిమిత్తం లేకుండ తమ కాళ్ళమీద నిలబడగలశక్తి, తగినసాధనసంపత్తికి తోడు ఈ రైతాంగానికి విద్యాగంధంకూడ లభిస్తే ప్రజాస్వామ్య సాధనకు, పరిరక్షణకు మనరైతులవలె తోడ్పడగల వర్గం మరొకటి ఉంటుందా ? జాతీయాభివృద్ధిదృష్ట్యా తమ సొంతభూములను కుటుంబకమతాలను సాగుచేసికొనే రైతాంగం యొక్క ప్రాముఖ్యం గురించి చెపుతూ ప్రొఫెసర్ సి. వాడీజ్ కూడ ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. కేవలం వ్యక్తిగత స్వార్థదృష్టితో కాక కుటుంబావశ్యకాలను, సాంఘిక ప్రయోజనాలను గుర్తించే స్వేచ్ఛగా సామర్థ్యంతో కృషిచేసే ఈ రైతాంగమే క్రమక్రమంగ పతనమై విచ్ఛిన్నం కానున్న నేటి సమాజాన్ని రక్షించగలదు. ఆధునికకాలంలో పారిశ్రామికయుగంలో దేశాలకు దేశాలే పట్టణ సంప్రదాయాలకు లోనై సామరస్యపూరిత మైన సహజీవనం, సంఘజీవనం ప్రమాద స్థితిలో పడుతున్నవి. వీటిని మళ్ళీ నిలబెట్టాలంటె కుటుంబవ్యవసాయంలో పయినిస్తున్న రైతాంగమే శరణ్యం. ఈ రైతాంగవిధానం అతిప్రాచీనకాలపు కమ్యూనిజానికి చిహ్నం; భవిష్యత్తులో సమిష్టివాదానికి నమూనా. మార్క్సిజపు గతితార్కిక సిద్ధాంతం దృష్ట్యా చూచినా మనదేశపు సాంఘిక విప్లవానికి ఈ రైతాంగమే రాజకీయంగా ఆయువుపట్టు. కాబట్టి రాజకీయంగా పరిశీలించినా ఈ రైతాంగం ఉత్తమపాత్రనే వహిస్తున్నది. కేపిటలిస్టువ్యవస్థలలో శ్రామికవర్గం ఎలాంటి విప్లవపాత్ర వహిస్తుందని మార్క్సు చెప్పాడో అలాగే మనదేశపు ప్రస్తుత స్థితిగతులను బట్టి ఈ రైతాంగమే ఆ విప్లవపాత్రను నిర్వహిస్తున్నదనటం న్యాయవిరుద్ధమేమీ కాదు. కాబట్టి మనం స్థాపించాలని కలలుకంటున్న సోషలిస్టు

పద్ధతి సమాజవ్యవస్థకు కుటుంబకమతాల మీద ఆధారపడి ఉన్న రైతాంగం అత్యావశ్యకవర్గం అవుతున్నది.

కనుక సాంఘికన్యాయం దృష్ట్యా మనం చేయవలసి ఉన్న దేమిటి రైతాంగపు కుటుంబవ్యవసాయాన్ని రద్దుచేయటం కాదు; ఆ విధానాన్ని ఇంక బలపరచి మనవ్యవసాయరంగంలో సాధ్యమైనంత ఎక్కువ మంది కుటుంబవ్యవసాయంలో రైతులు ఉండేటట్లు చూడవలసి ఉన్నది. నేడు మన వ్యవసాయరంగంలోని భూకామందులందరు కుటుంబవ్యవసాయంతోనే దోపిడిచేయకుండ వ్యవసాయం చేసికోవటం లేదని మనకు తెలుసు. ప్రస్తుతస్థితిగతులలో దోషాలు అన్యాయాలు ఉన్నవనటంలో కూడ సందేహం లేదు. ప్రస్తుతం భూమిపంపిణీలో అనేక విధాలైన అసమానతలు ఉన్నాయనటం కూడ వాస్తవమే. కొంతకొంతమంది భూమిని తాము సాగుచేయక కేవలం శాసనరీత్యా లభించిన హక్కులవల్లనే రైతులుగా పరిగణింపబడుతున్నారనటం కూడ నిజమే. నేడు మనదేశంలో తమ భూములను కౌలుకిచ్చి కౌలు దారుల శ్రమతో జీవిస్తున్నవారు 50 లక్షలమంది ఉన్నారు. ఈ దోషాలన్నిటిని పరిహరించటానికి మార్గం వ్యక్తిగత ఆస్తులను రద్దుచేయటం కాదు; ఇప్పుడున్న అసమానతలను పూర్తిగా వీలుగాకపోయినా సాధ్యమైనంతవరకు తగ్గించటానికి యత్నం చేయాలి. భూమిమీద శ్రమచేసేవారికి సాధ్యమైనంతవరకు ఆ భూమిపై హక్కులుండేటట్లు చూడాలి. వీటిని ఎలా సాధిస్తాం అనేది పెద్ద సమస్య కాదు. భూవసతులకు గరిష్ఠపరిమితులను నిర్ణయించి కౌలుదారులకు తగినంతరుణాలు కలిగించేటట్లు శాసనాలను చేస్తే పైన కనిపించిన దోషాలను అసమానతలను సరిదిద్దుకొనే వీలు లభిస్తుంది. భూమిపై యాజమాన్యపు హక్కులు వారసత్వంగా సంక్రమించే విధానాన్ని కూడ సరిదిద్దాలి. ఆ యా రైతులను భూములపై సర్వతంత్ర స్వతంత్ర హక్కులివ్వకుండ సొంతసేద్యం చేసికోవటం మీద ఆ హక్కులు ఆధారపడి ఉండేటట్లుగా శాసనాలు రూపొందాలి. ఇవన్నీ చేసిన తరువాత కూడ తమ జీవికకోసం సంఘాలమీదనే ఆధారపడి ఉండే వ్యవసాయకూలీలు అనేకులుంటారు. సాంఘిక

న్యాయాన్ని వీరికి కూడ వర్తింపచేసి శతాబ్దాల తరబడి అడుగునబడి నలిగిపోతూ ఇప్పటివరకు కూడ విస్మరింపబడిన ఈ వ్యవసాయకూలీలకు న్యాయం కలుగచేసి తీరాలి. సాగులోలేని ప్రభుత్వభూములను భూదానంద్వారా లభిస్తున్న భూములను వీరిని మాత్రమే పంచిపెట్టే ఏర్పాట్లు చేయాలి. భూములమీద పరోక్ష యాజమాన్యం ఉండే అవకాశం ఉండదు. కనుక వీరిని దోచుకొనే ఆచారాలుకూడ తగ్గిపోతాయి. వీరికి కనీసపు కూలిరేట్లను నిర్ణయించి అవి అమలు అయ్యేట్లు చూడాలి. సంఘంలోని ఇతరవర్గాలస్థాయికి వీరిని కూడ తీసికొనిరావటం కోసం వ్యవసాయేతరవృత్తులలో వీరికి అవకాశం లభించేటట్లుగా మన జాతీయ ప్రణాళికలను నిర్మించుకోవాలి. వీరి స్థితిని బాగుచేసి జాతీయ ప్రణాళికలను విజయవంతం చేయటంలో రైతాంగం నిర్వహించ వలసిన కర్తవ్యాలు చాల ఉన్నవనటం నిస్సందేహం. ?ఇలాంటి ఏర్పాట్లనుచేసి అనువైన పరిస్థితులను కల్పించినపుడు వ్యవసాయరంగంలో నేడు కనపడుతున్న లోపాలు, అసమానతలు తగ్గిపోయి ఆర్థికసమానత్వం సాంఘికన్యాయం మూడుపూవులు ఆరుకాయలుగా వికసించగలవు. సహకార వ్యవసాయ విధానంలో వీటిని ఎంతగా సాధించవచ్చునని అంటున్నారో అంతకంటె ఎక్కువగానే రైతాంగపు కుటుంబవ్యవసాయవిధానంలో సాధించే అవకాశాలున్నవి.

అధ్యాయం - 4

సహకారీకరణ - సహకార వ్యవసాయం

సాంఘిక న్యాయ దృష్టితో వైతాంగ యాజమాన్యాన్ని రద్దు చేయటం, గుర్తింపక పోవటం అనేవి జరగ రాదని, ఆ వాదాలు విమర్శకు, హేతు పరిశీలనకు నిలబడ లేవని మనము తేల్చుకొన్నాం. ప్రజాస్వామిక విధానాల మీద, ఆచరణ మీద ఆధారపడిన సోషలిస్టు పద్ధతి సమాజ వ్యవస్థలో స్వేచ్ఛా యుతమైన ఈ వైతాంగానికి అత్యధిక ప్రాముఖ్యం ఉన్నదనికూడ గ్రహించాం. కాబట్టి సాంఘిక న్యాయంకోసం వైతాంగాన్ని తలక్రిందులు చేయవలసిన అవసరంలేదు. సహకార వ్యవసాయ స్థాపన కావాలనే వారు దానిని బలపరుస్తు మరొక వాదం కూడ చేస్తున్నారు. సహకార వ్యవసాయ విధానంలో కూడ ఆస్తులపై వైతులహక్కులు ఉంటాయని చెపుతున్నారు; ఉంటాయి, కాని కొత్త రకంగా ఉత్పత్తి సంబంధాలను బట్టి ఉంటాయి. వ్యవసాయాన్ని సహకార పూరితం చేయటంవల్ల దోపిడికి అస్కారం లేకపోవటం, సాంఘిక న్యాయం సిద్ధించటం మాత్రమే కాక ప్రజలలో ఒక నూతన దృక్పథం ఏర్పడుతుందని చెప్పబడు తున్నది. ఈ విధానం ప్రజలను ప్రజాస్వామిక ఆచరణలో తరిఫీదు చేస్తుందని, ప్రజల మనసులలో సహకార దృక్పథాన్ని కలిగించి సాంఘిక దృష్టిని కలిగిస్తుందని తద్ద్వారా ప్రజలు స్వార్థపూరితులైన వ్యక్తిక వాదులు కాకుండ కాపాడు తుందని అంటున్నారు. "ఉత్పత్తి దారుల సహకార సంఘాలు సంఘంలోని అనేక వర్గాల ప్రజలు, భిన్నభిన్న కులాల వారు కలిసి పని చేయటానికి అవకాశాలు కలిగిస్తాయి. దీని మూలంగా ప్రజలలో అవిచ్ఛిన్నమైన ఐక్యత ఏర్పడి వాస్తవ రూపం పొందుతుంది." * సహకార వ్యవస్థవల్ల ఇంతటి ఉత్కృష్టమైన ప్రయోజనాలు తప్పక కలుగు తున్నపుడు దానిని అన్ని

* Government of India, planning Commission, "Report of the Indian Delegation to China on Agrarian Co-operatives" 1957, P. 134.

రంగాలలోని ప్రజలకు ఎందుకు అన్వయింపచేయరు ? కేవలం కొన్ని కొన్ని వృత్తులకు మాత్రమే దానిని ఎందుకు పరిమితంచేయాలి ? నేటి యుగంలో తీవ్ర పరిణామాలను కలుగ చేస్తున్న కమ్యూనిజానికి, కేపిటలిజానికి ఈ సహకార వ్యవసాయమే ఉత్తమమైన మధ్యే మార్గాన్ని కలిగిస్తుందని మన ప్రణాళికాకారులు ప్రకటిస్తున్నారు.

వీరు చెపుతున్న వాదానికి విలువ కట్టే ముందు సహకార తత్వశాస్త్రం లోని ప్రాథమిక సూత్రాలను స్పష్టంగా అర్థం చేసి కోవటం మంచిది. సహకార నిర్వహణ అనేది కొన్ని ఆశయాలను సాధించటానికి ఒక విధానం మాత్రమే కాని అదే ఒక ఆశయంకాదు. ఆ యా సంస్థల లోని ప్రజలకు సుఖంగా జీవనం అందించటం, వారి వారి వ్యక్తిత్వాలను పెంచు కోవటానికి అవకాశాలు కల్పించటం మాత్రమే ఇలాంటి సంఘాల ఆశయం. సహకార నిర్వహణ వల్ల ఈ ఆశయాన్ని తేలికగా ఉత్తమంగా సాధించ వచ్చునని అనుకో బడు తున్నది. కాని సహకారోద్యమాన్ని అభివృద్ధిచేసే మార్గంలో ఆశయ సిద్ధి కొర కైన విధానాన్నే దైవత్వంగా భావించి ఆశయంగా చేయరాదు. ఈ సహకారోద్యమం అనేది దానిలో పాల్గొనే ప్రజలకు సంఘానికి కొన్ని ప్రయోజనాలను అవకాశాలను కలిగించటం కోసం మాత్రమే ఉద్దేశింప బడిన దని మరచి పోరాదు. ఎలాంటి సంస్థను కాని సహకార సంఘాన్ని కాని కేవలం దానికోసమే దానిని నిర్వ హించవలసిన అవసరం మనకు లేదు. మన కోసం మన ఆశయ సిద్ధి కోసం మాత్రమే వాటిని మనం నిర్వహించు కొంటాం. ఈ సంఘాల వల్ల మనం ఆశించే ప్రయోజనాలు రెండు రకాలుగా ఉంటవి. (1) భౌతిక ప్రయోజనాలు (2) నైతిక ప్రయోజనాలు. సహకార సంఘాలు ఈ రెండు ప్రయోజనాలను సమంగా గుర్తిస్తవి. వీటిలో ఒకదాని కోసం రెండవ దానిని బలి చేయటం సహకార తత్వ సూత్రాలకే విరుద్ధం. ఆ యా సంఘాల కార్యక్రమాలలో వాటి సభ్యులు ఎట్టి నిర్బంధాలతోను నిమిత్తం లేకుండ కేవలం ఐచ్ఛికంగా పాల్గొనే పక్షంలో ఈ రెండు రకాల ప్రయోజనాలు పొందవచ్చు. కాబట్టి ప్రజల కార్యకలాపా లన్నింటిలోను ఈ సహకార సంఘాలు

ప్రవేశింపవచ్చు. కాని ఈ సహకారసంఘాలకు కూడకొన్ని పరిమితులు లేకపోలేదు. ఈ సహకార సంఘాలనల్ల ఈ రెండు రకాల ప్రయోజనాలు సిద్ధింపకపోయి నప్పుడు ఆ యా సభ్యులు తమంత తాము ఐచ్ఛికంగా ఆ సంఘ కార్యకలాపాలలో పాల్గొన నప్పుడు వీటిని ఆచరణలో పెట్ట రాదు.

ఈ విషయాలను మనస్సులో పెట్టుకొని మనవారు చెప్పుతున్న సహకార వ్యవసాయం ఎంత వరకు సహకార తత్త్వ శాస్త్ర ప్రాథమిక సూత్రాలకు అనుగుణంగా ఉన్నదో పరిశీలిద్దాం.

ప్రజలు కేవలం తమంత తాము ఐచ్ఛికంగా పాల్గొనా లనేది సహకారానికి ప్రధాన ప్రాథమిక సూత్రం. ప్రజలు ఇలా ఐచ్ఛికంగా పాల్గొనటం అంటే సాంఘిక ప్రయోజనాలను వ్యక్తిగత ప్రయోజనాలను సాధించటంకోసం ఆ యా సంఘాలలో వారు స్వేచ్ఛ గల వ్యక్తులుగా ఉండి, ఐచ్ఛికంగా ఆ యా కార్య కలాపాలలో పాల్గొంటు మనస్ఫూర్తిగా సహకరించటం అన్నమాట. ఐచ్ఛికంగా పాల్గొనటం అనే విషయాన్ని దాని సమగ్రార్థంలో, నిజార్థంలో గ్రహించటం అవసరం. భౌతికమైన ఒత్తిడి లేనంత మాత్రాన ఆ యా వ్యక్తుల నిర్ణయాలను ఐచ్ఛిక నిర్ణయాలని భావించ వలసిన అవసరం లేదు. ఏవ్యక్తి కైనా సహకార సంఘంలో పాల్గొనటం కంటే మరొక దారి లేని స్థితిని కల్పించి అతడు సహకరించేటట్లు చేస్తే ఐచ్ఛిక సహకారమనే మాటకే అర్థం ఉండదు. సహకార సంఘాలలో చేరకపోయినా ఎలాంటి ఇబ్బంది రాదు అని భావించగల స్వాతంత్ర్యం, ఆ సంఘాలలో చేరకుండానే ఇతర మార్గాలను అవలంబించగల అవకాశాలు స్వేచ్ఛ భద్రత ఉన్న మానవుడు సహకార సంఘంలో చేరితే అది మాత్రమే ఐచ్ఛిక సహకారం అన బడుతుంది. అంతే కాని అన్ని మార్గాలను మూసివేసి సహకార మన్న ఒక్క మార్గాన్ని మాత్రం తెరిపించి నపుడు మానవుడు ఆ సహకార మార్గంలో నడిచినా దానిని ఐచ్ఛిక సహకారం అనటానికి వీలు లేదు. కనుక సహకారానికి ప్రాతిపదిక స్వేచ్ఛ గల వ్యక్తి. "సహకార సంస్థ కేవలం వ్యక్తులతో నిమిత్తం లేకుండ ధనాన్ని మాత్రమే ఒకచోట చేర్చటం వంటిది కాదు; దానిని

సమగ్రార్థంలో గ్రహించాలంటే సహకార సంస్థ అనేది వ్యక్తుల సమాహారం." [1] "సహకార సంస్థ అంటే కేవలం ఒక వర్గం కాదు; అందరికి సంబంధించిన పని మాత్రమే కాదు; తమ సంపూర్ణ స్వేచ్ఛతో, వ్యక్తిత్వంతో, అధికారంతో, ఐచ్ఛికంగా ఒక చోట కూడిన బాధ్యతా యుతమైన వ్యక్తులు ఉంటేనే సహకార సంఘం ఉంటుంది. తమకు తామే అధికారులైన వ్యక్తులు, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో ప్రవర్తించ గల వ్యక్తులు ఉండాలనేదే ఈ సాధారణ కృషికి ఆశయం." [2] ఎ. పినెట్ అనే ఆయన ఏమంటు న్నాడో చూడండి. "మానవుడు తనంత తాను సంపూర్ణమైన వ్యక్తిగా ఉండాలి. అలా ఉన్నప్పుడే అతడు సంఘ ప్రయోజనాలను ఆశయాలను గమనించి వాటి కోసం కృషి చేస్తాడు. మానవుడు తనకు తానే అధికారిగా ఉండాలి. అప్పుడే అతడు సర్వ ప్రజలకు సేవ చేసే ప్రజా సేవకు డవుతాడు." [3]

కాబట్టి సహకార సంఘం యొక్క నిర్మాణ విధానానికి సంయుక్త కృషి మూలం. చిన్న చిన్న ఆర్థిక విషయాలపై కృషిపై తనకు తానుగా తనకుటుంబ సభ్యులతోపాటు పాల్గొనటం దాని ప్రధాన లక్షణం.

"సంపూర్ణ స్వయం పాలనాధికారం గల వ్యక్తులను తనలో లీనం చేసి కొనకుండ కేవలం వారిని కలిపి సయోధ్యత మాత్రమే నెఱపుతుంది. మొదటి నుంచి కూడ అందలి సభ్యుల ప్రతి ఒక్కరి స్వాతంత్ర్యాన్ని బాధ్యతలను అది (సహకార సంఘం) గౌరవించి వాటిని బలపరచ టానికి పూనుకొంటుంది."

సంయుక్త నిర్వహణకు కావలసిన సంఘానికి ఉండ వలసిన లక్షణా లన్నీ కూడ సొంత కమతాలను సాగు చేసికొనే మన రైతు కుటుంబానికి ఉన్నాయని మొదటి అధ్యాయంలో చెప్పు కొన్నాం

---

1 Dr. G. Fauquet, "The Co-operative Sector" 1951, P. 21.

2 Ibid, P. 43.

3 As quoted by Dr. G Fauquet in his book "The Co-operative-Sector" 1951, P. 44.

గదా. రైతు స్వేచ్ఛగల వ్యక్తి; తన మనుగడ కోసం అతడు ఇతరుల మీద ఆధార పడ వలసినపని లేదు. ఎలాంటి నిర్బంధాలకు లోనై తన ఇష్టానికి వ్యతిరేక మైన నిర్ణయాలను చేసి కొనవలసిన స్థితి రైతుకి లేదు. కనుక సహకార సంఘం చెపుతున్న ఐచ్ఛిక నిర్ణయం అతడు మాత్రమే తీసికొన గలడు. ఇది ఎలా సాధ్య మవుతుం దనే సంశయం రావచ్చు. ఎందువల్ల నంటే అతని సంయుక్త సంఘం సహజమైన కుటుంబం; ఈ కుటుంబం తనకు తానై వృత్తిని కల్పించు కొంటుంది; జీవికకు ఇతరులపై ఆధార పడవలసిన అవసరం లేకుండ చేస్తున్న వారి ఉత్పత్తి సాధనం (భూమి) వారి సొంతమె. దాని మీద కూడ ఎవరికీ పెత్తనం లేదు. అందువల్ల సహకార నిర్వహణకు ఇలాంటి రైతాంగమే తగిన సంయుక్త సంఘాలు. ఈ విషయాన్నెవరూ కాదన లేరు.

II

ఇలాంటి సంయుక్త సంఘాలను (రైతు కుటుంబా లని అర్థం) సహకార సంఘాలలోకి తీసికొని వచ్చిన తరువాత ఆ యా సంఘాల కార్యకలాపాలలో వీటిని ఎంతవరకు సహకార పూరితం చేస్తారు? ఈ సహకార సంఘాల యాజమాన్యానికి ఎక్కడ హద్దులు పెడతారు? వాస్తవంగా పరిశీలిస్తే ప్రతి కార్య కలాపాన్ని సహకార పూరితం చేయాలంటే దానికి సంబంధించిన కొన్ని హక్కులు, అధికారాలు, వారి చేతులలో ఉండే అవకాశం ఉండదు. వారు ఎన్ను కొన్న సహకార సంఘానికి—ప్రజాస్వామిక విధానాల ద్వారా ఎన్ను కోబడ్డ సంఘమే కావచ్చు గాక—తమ హక్కులను అధికారాలను దత్తం చేయక తప్పదు. కాని నేటి స్వతంత్ర వ్యక్తులు ఎంత వరకు తమ హక్కులను అధికారాలను వదలుకొని సహకార సంఘానికి వాటిని దత్తం చేయ గలరు? ఈ స్వతంత్ర వ్యక్తులందరు తమ అధికారాలను హక్కులను తమ ఇష్ట పూర్వకంగా వదలు కొని సహకార సంఘానికి అప్పచెపుతా రనుకోవటం భ్రమ, లేదా కేవలం ఆశ. దీనిలో స్వయం పాలనాధికారం గల వ్యక్తియా, లేక సమిష్టి కృషా, ఏది మంచిది, మన కేది కావాలి అనే సమస్య మనకు ఎదురవుతున్నది.

అసలు ఈ సహకార పూరిత కృషి అనే భావం ఆమధ్య కాలాల్లో వచ్చిన తీవ్ర వ్యక్తిక వాదానికి ఉన్న స్థితి గతులలో మార్పు అవసరం లేదని బోధించే వాదానికి ప్రతిగా వాటి ఫలితంగా వచ్చిం దని గుర్తుంచు కోవాలి. ఉత్పత్తి శక్తుల నన్నిటిని పూర్తిగా జాతీయం చేయాలని బోధించే మార్క్సిస్టు సోషలిజం ఆ కాలపు సంప్రదాయపు కేపిటలిజానికి ప్రతిగా ఎలా వచ్చిందో మనకు తెలుసు. అలాగే వ్యక్తుల కార్య కలాపాలను సహకారపూరితం చేయాలన్న వాదం కూడ ఆరోజులలో యూరప్‌లో ప్రబలి పోయిన తీవ్ర వ్యక్తిక వాదానికి ప్రతిగా వచ్చింది. కాని ఆ నాటి సంఘం ఇప్పుడు ఎక్కడ లేదు. ఆధునిక యంత్రాల వల్ల సాంఘిక జీవనంలో వ్యక్తుల మధ్య పరస్పర సహాయం తప్పనిసరి అవు తున్నది. అంతే కాక సిద్ధాంత రీత్యా చూచి నప్పటికి వ్యక్తుల మధ్య ఆరోగ్యకర మైన పోటీ ఉండటం సహకార తత్త్వ శాస్త్ర సూత్రాలకు విరుద్ధం కాదు; (అసలు ఆరోగ్యవంతమైన పోటీ అనేది) సరైన అభ్యుదయ సాధనకు అత్యావశ్యకం.

కాబట్టి సహకారాన్ని వ్యక్తిక తత్త్వ శాస్త్రానికి విరుద్ధ మైన దని కాని, అంత కంటె ఉత్తమ మైన దని కాని భావించి నిర్నిబంధంగా ఎలాంటి పరిమితులు లేకుండ సహకారాన్ని సర్వ రంగాలకు, అన్ని కార్య కలాపాలకు అనువర్తింప చేయ వచ్చు నని భావించరాదు. ఆదిమ కాలాల లోని ప్రాచీన మానవులకు ఇలా సర్వ రంగాలకు వ్యాపించిన సహకార సంఘాలు ఉండేవే! కాని కాల పరిణామంలో మానవుని విజ్ఞానం పెరుగుతు వచ్చిన కొద్ది ఈ సంఘాలు తమంతట తామే అదృశ్య మవటం ఆరంభించాయి. ఈ పరిణామం క్రమంగా కుటుంబాధిపత్యం ఏర్పడే టంత వరకు సాగింది. ఇలాంటి పరిణామం ఎందుకు వచ్చింది? ఉన్న సంఘా లన్నింటి లోకి కుటుంబం ప్రకృతి సహజమైన సంయుక్త కూడలి కనుక, మానవుడు కృషిచేసి కోవ టానికి కుటుంబమే ఒక సంఘంగా అయ్యే టంత వరకు పరిణామం సాగింది. ఈ పరిణామం అభ్యుదయ పూరిత మని మన అభిప్రాయం.

కుటుంబం కూడ మళ్ళీ విడివడి ప్రత్యేక సంయుక్త కూడలులను ఏర్పాటు చేసికోవటానికి కూడ మనం అవకాశం కల్పిస్తున్నాం.

రష్యాలో 'కార్టెల్స్' అనే పేరుతో ఉన్న సహకార సంఘం యొక్క పుట్టు పూర్వోత్తరాలను పరిశీలిస్తూ 'పాల్ ఎపోజల్' అనే ఆయన వీటిపుట్టుకకు రెండు ప్రధానలక్షణాలు న్నాయని చెపుతున్నాడు.

"ఇటీవల వచ్చిన సహకారసంఘాలు వైయక్తిక ఆర్థిక విధానానికి ప్రత్యర్థులుగా ఉద్భవించాయి. ఈ సంఘాలను స్థాపించాలన్న భావ మేర్పడి కార్యరూపం పొందటానికి గల కారణాలను తెలుసుకోవా లంటే వ్యక్తికవాద సంపూర్ణవిజయ చరిత్రను పరిశీలించాలి... నాగరికతా పూర్వదశకు చెందిన ఈ సహకారసంఘాలు ఆదిమ కమ్యూనిస్టు వ్యవస్థనుంచి ఉద్భవించాయి. కుటుంబాల విచ్ఛిత్తితో విడివడిపోయిన వ్యక్తులు సమిష్టిగా (అంటే పారిశ్రామికసంఘాలుగా ఏర్పడి (grouped in cartels) వివిధ ఆర్థికోత్పత్తిశాఖలలో కృషి చేయవలసివచ్చింది. ఈ పారిశ్రామికసంఘాల అభ్యుదయం తరచుగా వ్యక్తికవాద పురోగమనానికి చిహ్నంగాఉంది," * ఎపోజల్ చూపిన ఈ విభేదం సహకారసంఘాల సంశ్లిష్టలక్షణాన్ని, అంటే వ్యక్తుల స్వాతంత్ర్యంతోను సమిష్టికార్యాచరణతోను కూడిన సమ్మేళనాన్ని స్పష్టంగా చాటుతున్నది.

"వ్యక్తిక వాదానికి ప్రతిగా సహకార కృషి పుట్టి నప్పుడు, ఈ సహకార కృషి వ్యక్తుల కృషిని అణిచి వేయకుండ అభివృద్ధి చేస్తూనే-సమిష్టి కృషిని స్థాపిస్తుంది. ప్రాచీన కాలపు సామూహిక సంస్థల యొక్క పరిణామం కూడ ఇదే ఫలితాలకు పరిణామాలకు దారి తీసింది. ఇది కూడ వ్యక్తిక మైన వాటిని చంపివేయకుండ సామూహిక కృషిలో కలుపు కొన్నది. ఈ కాలపు వాటిలో కూడ సమిష్టి కృషి ఉంటూనే ఉన్నది. కాని ఈ సమిష్టి కృషి స్వేచ్ఛాయుత మైన వ్యక్తుల అభిమతాల ననుసరించి ఉంటున్నది."

---

* Quoted by Dr. G. Fauquet in "The Co-operative Sector" 1951, P. 42.

III

ఆదర్శవంత మైన సంఘాన్ని స్థాపించాలనే ఆశతో ఏర్పాటు చేయ బడిన అనేక సహకార సంఘాలలో ఇలాంటి పరిమితులు అనేకం మన అనుభవంలో గోచర మయినవి.

అమెరికా కెనడా దేశాలలో స్థాపించ బడిన "హటరైట్ సెటిల్ మెంట్"లు దీనికి చక్కని ఉదాహరణగా పనికి నస్తవి. ఈ హట్‌రైట్ ప్రజలు వారిలో వారు కలిసి మెలిసి ఉండటానికి అనేక కారణాలు అవకాశాలు ఉన్నవి. వీరిలో ప్రతి ఒక్క కూడలికి-కూడ లికి-కూడలికిమధ్యకూడ రక్తసంబంధాలు, ఆధ్యాత్మిక కాచారాదులలో సంబంధాలు ఉండేవి. యూరప్‌లో వీరిని వీరి సిద్ధాంతాల కారణంగా వేధించటం చంపటం జరిగింది. అందువల్ల వారు ప్రాణాలను రక్షించు కోనటానికి, తిండి తిప్పలు సంపాదించు కోవటానికి ఒక చోట నుండి మరి యొక చోటికి పారిపోయి చివరికి అమెరికా కెనడాలలో తమ నివాస స్థానాలు ఏర్పరచు కొని స్థిర పడ్డారు. 'నాది అయిన సర్వము నీదే' అనేది ఆ సూత్రాలలో ప్రధాన మైనది. వారి మతాధి పతే వారికి సర్వస్వం. వారి సాంఘికపు కట్టుబాట్లు మానవ ప్రవర్తనా నియమాలను బట్టి గాక ఎంతో కాలం నుండి రూపొందుతూ వస్తున్న ఆచారాలను అలవాట్లను బట్టి ఉంటాయి. వారి మత విశ్వాసాల వల్ల రక్షణ కోసం అందరు ఏకమై అనేక కాలాలపాటు దేశాలు తిరిగి కష్టాలు పడి తుదకు ఒక చోట స్థిర నివాసం ఏర్పాటు చేసి కోవటం చేత సర్వ రంగాలకు కార్య కలాపాలకు అనువర్తించే సహ కార పూరిత కృషిని వారు ఆచరింప గలిగారు. వారికి వ్యక్తి గత ఆస్తి అంటూ ఏమి లేదు. ఆహారం వండుకొని తినటం నుంచి, నివాసం చేసే ఇండ్ల వరకు కూడ వారి ఆస్తులు సంఘానికే కాని వ్యక్తుల సొంతం కాదు. అలాంటి సంఘంలో పెద్ద ఎత్తున కొనసాగిన సహ కార వ్యవసాయం విజయవంతం కావటంలో ఆశ్చర్యం లేదు. కాని ఈ విజయాలు ఎంతో కాలం నిలబడ లేదు. వారి నివాసాలు స్థిర నివాసాలనే భద్రత చిక్కిన తరువాత ఈ సంఘాలు సహకార కృషిని కేవలం కొన్ని కొన్ని రంగాలకు కొన్ని కొన్ని కార్య కలాపా

లకు మాత్రమే పరిమితం చేయ సాగాయి. చివరకు సహకార సంఘాలనే రద్దుచేసి వ్యక్తిక భూ కమతాలుగా ఇవి కూడా విడిపోయినవి. "డీట్స్ చెప్పతున్న దాన్ని బట్టి 1939 సంవత్సరం జనవరిలో ఇలాంటి వలసలు 49 మాత్రమే మిగిలి ఉన్నవి. ఈ 49 కాలనీల మొత్తం సభ్యులు 5000 మంది మాత్రమే."* ఈ మిగిలిన సహకార పూరిత మైన కాలనీలు ఆ విడిపోయిన కుటుంబ కమతాల వారి కంటె అధికంగ ఏమన్నా సాధిస్తున్నాయా అనేదే ప్రశ్న. ఈ మిగిలిన సంఘాలలో సహకార వ్యవసాయం సక్రమంగా సాగుతున్నప్పటికి వాటి చుట్టు ఉన్న అదేజాతి ప్రజల కుటుంబ కమతాల కంటె సామర్థ్యంతో నిర్వహింప బడుతున్నా యని ఎవరు అనలేరు. కాబట్టి ఈ ప్రయోగం వల్ల స్థిర నివాసం లేని ఆ ప్రజలకు కొన్ని సాంఘిక ప్రయోజనాలు సిద్ధించినవి కాని, ఆర్థిక ప్రయోజనాలు మాత్రం మామూలు కుటుంబ వ్యవసాయం కంటె ఎక్కు వేమీ సాధ్యం కాలేదు.

పాలస్తీనాలోని 'క్వుట్జా' అనబడే సంఘాల ప్రయోగాలు కూడ ఈ హట్టరైట్ల ప్రయోగాలకు సన్నిహితంగానే ఉంటాయి. ఈ క్వుట్జాలను 'జియొనిస్టు ఆర్గనైజేషన్' వారు స్థాపించారు. స్థిర నివాసంలేని యూదులకు స్థిరత్వం కల్పించా లనే ఆశయంతో ప్రపంచం లోని అన్ని దేశాల యూదులు కలిసి వీటిని స్థాపించారు. దానికోసం వారు పాలస్తీనాలో భూమి సంపాదించారు. ఆ భూమిని సాగుకు యోగ్యం చేయటం కోసం తమ సంఘనిధి నుంచి ధనం ఖర్చు పెట్టారు. ఆ భూమిని కొన్ని కొన్ని ముఠాలుగా కలిసి అక్కడ 'స్థిర' పడి సామూహిక జీవనం చేయటానికి ఇష్టపడని వారికి మాత్రమె కౌలుగా ఇచ్చారు. ఈ ప్రయోగాన్ని గురించి పాలస్తీనా భూమి అభ్యుదయ సంఘాధిపతి అయిన ఆర్థర్ రిప్పన్ ఏమి చెపుతున్నాడో పరిశీలించండి. "అక్కడ ఉన్న ప్రజలకు వాస్తవానికి అటు చేరమాట ఇటుచేరటమా అని నిర్ణయించుకొనే అవకాశం లేనేలేదు. వ్యక్తిక స్థిరనివాసం కంటె సామూహిక స్థిర నివాసమే తప్ప మరొక విధంగా స్థిర నివాసం ఏర్పరచు కొనే అవకాశాలు వారికి లేవు; దానికి అంగీక

*Henrik F. Inficd "Co-operative communities at work" 1947,P10.

రించక పోతే అసలు స్థిర నివాస మనేదే వారికి ఉండదు" [1] "కాని ఈ సాముదాయక స్థిరనివాసం ఏర్పడటం తోటే 'క్వుట్జాలు' రూపొంద లేదు. క్వుట్జాలలో కనిపిస్తున్న సాంఘిక ఆర్థిక నిర్వహణ విధానం క్రమ క్రమంగా పరిస్థితుల ప్రాబల్యం చేత వాటి కనుగుణంగా రూపొందింది." [2] సహకార రంగంలో ఎంతపెద్దఎత్తున ఎంతఉత్తమ మైన సహకారం సాగించటానికి వీలున్నదో అంతగా ఈ క్వుట్జాలు సహకారాన్ని ఆచరణలో పెట్టు తున్నవి. ఆ సంఘం లోని సర్వ వస్తు వులు సంఘానివే. అన్నిటి మీద యాజమాన్యం సంఘానిదే. వ్యక్తు లకు తమ తమ పనికి గాను ప్రత్యేకంగా ఏమి ముట్ట చెప్పరు. కూడ ఆ సంఘ లోని వాడు ఇతరత్ర కష్టపడి సంపాదించుకొన్న ధనం సంఘం ప్రయోజనాల కోసం చేసే సమిష్టి కృషికే అర్పించాలి. ఏ వ్యక్తి ఎంత పని చేశాడని చూడరు. వారి పనికి ప్రతిఫలం వ్యక్తి కంగా చెల్లించరు. లాభాలను పంచటం కూడ ఉండదు. అందులోని ప్రతి ఒక్కనికి కూడ అతని శక్తి సామర్థ్యాలు నైపుణ్యం ప్రసక్తి లేకుండ అతనికి సరిపోను ధన రూపంలోగాని వస్తు రూపంలో గాని క్వుట్జా ప్రతి ఫలం ముట్ట చెపు తుంది. వారికి బట్టలు కూడ సొంతంగా ఉండవు. ఆ మధ్య కొంతకాలం చెప్పులు, పళ్లు తోముకొనే బ్రష్‌లు మాత్రం వ్యక్తికంగా సొంతంగా ఉండేవి. ఇదంతా ఎలా సాధ్యమైంది అంటే ఆ యా స్థిర నివాస సంఘాల ప్రత్యేక లక్షణాల వల్లనే అని చెప్పవలసి ఉన్నది. వారి అందరిది ఒకే ఆదర్శం కావటం వల్ల తామేదో చారిత్రకావశ్యకత కోసం శ్రమిస్తున్నా మన్న భావం ఆ సభ్యులలో ఉండటం వల్ల, వీటి అన్నిటిని మించి క్వుట్జా జీవితంవల్ల తమ ఆధ్యాత్మిక వాంఛలు తీరుతున్న వని వారు భావించటం చేత ఇది సాధ్యమైంది. 1940 సంవత్సరంలో పాలస్తీనాలో ఇటువంటి క్వుట్జాలు 79 ఉండేవి. జాగ్రత్తగా పరిశీలించి చూస్తే ఈ క్వుట్జాలు సామూహిక సాంఘిక ఆర్థిక ప్రయోగాలే కాని సహకార వ్యవసాయ ప్రయోగాలు కావని తేట తెల్ల మవుతుంది.

1. Arthur Rippin, "The Agricultural Colonization of the Lionist Organization in Palestine" Translated by R. J. Feiwel (London 1926)
2. Hensik F. Infield — op. cit. P. 118.

అమెరికాలో మరొక రకమైన సహకార స్థిర నివాస సంఘాలను న్యూలానో, సన్‌రైజ్ కమ్యూనిటీ మొదలైన వాటిని కూడ స్థాపించి ప్రయోగాలు చేయటం జరిగింది. మత ఆదర్శాలతో స్థాపించిన హట్‌రైట్ సంఘాల వలె కాక వీటిని సాంఘిక, సంస్కార ఆదర్శాలతో స్థాపించారు. జాబ్ హారిమన్ ఈ నూతన ప్రయోగాల ఆదర్శాలను గురించి ఏమి వ్రాస్తున్నాడో చూడండి. ఈజాబ్ హారిమన్ మార్క్సిస్టు; న్యూలానో సంఘాలను స్థాపించింది కూడ ఇతడే.

"గత 23 సంవత్సరాలుగా సోషలిస్టుగా ఉన్నాను. ఆర్థిక నియతివాద సిద్ధాంతాలలోను, మార్క్స్ బోధించిన అదనపు విలువ సిద్ధాంత తత్త్వ శాస్త్రంలోను, జీవితాన్ని గురించిన భౌతిక వాద దృక్పథం లోను పూర్తి విశ్వాసం ఉన్నవాణ్ణి. అందుచేత అందరికి సమానమైన అవకాశాలు, సాంఘికావకాశాలు కలిగించే వాతావరణం ఏర్పడేటట్లుగా ఒక సహకార సంఘాన్ని గనుక నిర్వహించ గలిగితే చాల కొద్ది కాలంలోనే ఆ సంఘ సభ్యులందరు ఆ వాతావరణంలో సామరస్య పూరితంగా పాల్గొంటూ రని కేపిటలిస్టు సమాజంలోను పరస్పర విరుద్ధాశయాలు ఉన్న మనుష్యులుంటున్న నేటి సమాజంలోను కనిపిస్తున్న స్వార్థపరత్వం దురాశ అంతరింప చేయ వచ్చునని నేను అనుకొన్నాను."

"అంతేకాక సాంఘిక సంబంధాలు అత్యంత ప్రధాన మని కూడ నేను భావించాను. మా సంఘ సభ్యుల వైజ్ఞానిక, సాంస్కృతిక, ఆర్థిక అభ్యున్నతికి మాకు సాధ్యమైన అన్ని సాంఘిక విధానాలను ఉపయోగించాలని అనుకొన్నాను. దీని కంతకు ఆశయం ఒకటున్నది. ఇలాంటి సంఘంలో ప్రజలు సామరస్యంతో జీవించ గలరని ఆ సంఘం వారికి జీవనోపాధిని కలిగించ గలదని, వారికి మార్గం చూపగలదని ఇదంతా కూడ ఇప్పటి కంటె చాల తక్కువ శ్రమతోనే సాధ్యమవుతుందని ప్రపంచానికి చూపించటమే ఆ ఆశయం".

"ఇవన్నీ కనుక చేయ కలిగితే యావత్తు సంఘాన్ని మా సంఘం వలెనే నిర్మించటానికి మా ప్రయత్నం ఉపయోగ పడుతుం

దని కూడ నేను భావించాను." * హేతుబద్ధ మైన దృష్టి మీద ఆధారపడిన ఇలాంటి ఉత్తమ ఆదర్శాలతో ఈ నూతన సంఘాలను స్థాపించి ప్రయోగాలు చేయటం జరిగింది. పైగా ఈ భావాలలో ఆదర్శాలలో పూర్తి విశ్వాసం ఉన్న వారిని మాత్రమె ఈ సంఘంలో సభ్యులుగా చేర్చుకొన్నారు. దీనిలో వ్యక్తిగత ఆస్తి నిషేధింప బడింది. తిండి తినే విషయాలలో తప్ప అన్ని కార్య కలాపాలలోను సహకార కృషిని ప్రవేశ పెట్టటం జరిగింది. కాని దురదృష్ట వశాత్తు ఈ ప్రయోగాలు కూడ ఆశించిన ఆశయాలకు నిలబడ లేకపోయాయి. వీటిని స్థాపించిన మొదటి దశలలో విజయవంతంగా కొనసాగినా క్రమంగా వీటిలో కూడ భేదాభిప్రాయాలు కలహాలు పొడసూపినవి. ఈ భేదాభిప్రాయాలను పరిష్కరించుకొని సామరస్యంతో కృషిచేయ లేక పోయాయి. దీని వల్ల అప్పు డప్పుడు రాజీపడటం, శాంతి పడటం అవసరాన్ని బట్టి సర్దుకు పోవటం మొదలైనవి ప్రారంభించినవి. బాబ్ బ్రౌన్ దృష్టిలో ఈ 'న్యూలానో'ల ఆధిపత్యం మరేమైనా కావచ్చుకాని ప్రజాస్వామికం మాత్రం కాదు. ఈ విధంగా ఈ సంఘం కాలక్రమంగా కేవలం ఉత్పత్తిదారుల సహకార సంఘంగా మారింది. కేవలం ఆర్థిక ప్రయోజనాలు సాధించేటంతవరకు మాత్రమె సహకార కృషిని పరిమితం చేసి నూతన జీవిత విధానం సాధించా లన్న ఆశయాన్ని వదులు కొన్నది. చివరకు ఈ సంఘ సభ్యులలో ఆర్థికంగా మంచి పునాదులున్న శక్తివంతమైన సంఘాన్ని నిర్మించే సామర్థ్యం లేకపోవటం ఒక పెద్ద చిక్కు అయింది. అందువల్ల ఈ సంఘాలనె రద్దు చేయవలసి వచ్చింది. కనుక చార్లెస్ గైడ్ చెప్పిన, "వ్యక్తిగత ఆస్తి విధానం వల్ల వైషమ్యాలు కలిగితే సామూహిక ఆస్తివిధానంలో కూడ ఈ వైషమ్యాలు తప్పవు. పైగా ఈ వైష మ్యాలు ఇంక ఎక్కువ కూడ అవుతాయి." అన్న సూక్తిని రుజువు చేయటానికి మాత్రమే ఈ ప్రయోగాలు ఉపయోగించాయి. ఈ న్యూలానోలను స్థాపించిన హారిమన్ కూడ చివరకు "సిద్ధాంతాలు మన వైజ్ఞానిక భావనలు మన ఆచరణ విధానాలలో చాల చిన్న

* Ernest S. Wooster, "commnnities of past and present"1924-P.119

పాత్రను మాత్రమే వహించగలవు" అని "సంఘజీవనంలో నైతిక విలువలు, ఆధ్యాత్మిక విలువలు మాత్రమె ప్రధాన ప్రాముఖ్యం వహిస్తాయి" అని అంగీకరించ వలసి వచ్చింది.

సంపూర్ణ సహకారాన్ని ఆచరణలో పెట్టే ప్రయత్నంలో ఈ సంఘాలన్నీ ఎందువల్ల విఫల మయ్యాయి? ఎందువల్ల నంచె మాన వునిలోనుంచి తీసి వేయటానికి తగ్గించ టానికి వీలులేని కనీసపు వ్యక్తిత్వం అతనిలో ఉన్నది. ఈ కనీసపు వ్యక్తిత్వం మీద అధికారం చలాయించి ఇతరుల ఇష్టాల ప్రకారం దానిని మార్చటానికి వీలులేదు. అందరు కలిసే పెళ్ళి చేసి కోవాలని, అందరకు ఒకే వంట ఇల్లు, ఒకే నివాస గృహము, ఒకే పడకమంచం సామూహికంగానె ఉండాలనీ, ఈ మొదలైన వాటి కోసం మనం ఎందువల్ల ఆందోళన చేయటం లేదు? సహకారాన్ని ప్రాణ ప్రదంగా చూచుకొంటు ఆదర్శ వంతంగా చిత్రించు కొనే సహకార వాదులు కూడ పై వాటిని ప్రచారం చేసి విజయం పొందలేరు అనేది గట్టిగా చెప్ప వచ్చు. ఎందువల్ల? సహకారాన్ని అత్యుత్సాహంతో ప్రతిపాదించే వారు కూడ వ్యక్తిక ఆస్తి ఉండాలనే అంగీకరిస్తారు. ఎందుచేతనో తెలుసా? పైన చెప్పిన లాంటి వన్ని మానవునిలోని కనీసపు వ్యక్తిత్వానికి భద్రత చేకూరు స్తవి. థామస్ కార్లైల్ ఎంత చక్కగా చెప్పాడో చూడండి. "ఎప్పుడో ఒక నాడు మనం బుద్ధిహీనతకు లోక జ్ఞానానికి(Nonsense and common-senese) మధ్య ఉన్న గీతను దాటి పోక తప్పదు. మనం అలా చేసిన నాడు వ్యక్తిక వాదం లోని పోటీని దాటి వ్యక్తితం త్రకల సహకారానికి చేరుకోగలం."

సహకారానికి పరిమితులు ఉండాలని సిద్ధాంత రీత్యా అంగీకరించిన తరువాత ఆ యా కాలాలలోని పరిస్థితులలో సహకారానికి ఎలాంటి పరిమితులు ఉండాలి ఎంతవరకు వచ్చినాక సహకారం మీద ఆ పరిమితిని ఎలా పెట్టాలి అనే సమస్యవస్తుంది. వ్యక్తి యొక్క హక్కులను మరొకరికి అప్పగింత పెట్టటంలో అతడు తన వ్యక్తి స్వాతంత్ర్యాన్ని కొంత కోల్పోక తప్పదు. దీనికి వ్యక్తులు ఎలా అంగీకరిస్తారు? ఎప్పుడు అంగీకరిస్తారు? తమ హక్కులను దత్తం చేయటం

వల్ల కోల్పోతున్న వ్యక్తి స్వాతంత్ర్యానికి సరిపోయేటంత విలువగల నైతిక ప్రయోజనాలు, భౌతిక ప్రయోజనాలు లభిస్తాయన్న విశ్వాసం ఉన్నప్పుడు మాత్రమె వ్యక్తులు తమ హక్కులను మరొకరికి దత్తం చేయటానికి అంగీకరిస్తారు. ఆర్థిక ప్రకృతిగల కార్యకలాపాలలో ఒక దాని తరువాత మరొక దానిలో సహకారాన్ని ప్రవేశపెట్టుతు పోయిన కొందికి దానివల్ల వచ్చే ప్రయోజనాలు తగ్గిపోతూ ఉండటం సహజం; ఇలా పోగా పోగా ఈ సహకారం ప్రవేశపెట్టి నందువల్ల వచ్చే ప్రయోజనాలు, నష్టాలు సమంగా కనిపించే దశ ఒకటి కనిపిస్తుంది. ఇక ఆ తరువాత సహకారాన్ని మరే ఇతర పనిలోను ప్రవేశ పెట్ట కూడదు. అదే సహకారానికి పరిమితి.

IV

ఈ విషయా లన్నింటిని మనసులో పెట్టుకొని సహకార వ్యవ సాయం వల్ల స్వేచ్ఛాపూరితమైన రైతాంగం మీద ఎలాంటి ఫలి తాలు కలుగుతాయో పరిశీలిద్దాం; ఈ సహకార వ్యవసాయం రైతు కుటుంబాల స్వాతంత్ర్యాన్ని అభివృద్ధి చేయగలదో కుంచింప గలదో చూద్దాం.

సహకార సంఘాలు విజయవంతం కావటానికి వాటి మనుగడకు స్వేచ్ఛాయుత మైన రైతాంగం ఉండటం అవసరం. అలాగే స్వేచ్ఛా యుత మైన రైతాంగం యొక్క మనుగడకు సహకార సంఘాలు అత్యావశ్యకాలు. సహకారం అంటే కేవలం సహకార వ్యవసాయమే అని అర్థం చేసికో కూడదు; సహకార వ్యవసాయం కాక అనేక విధాల సహకార సంఘా లున్నవి. ఉదాహరణకు సహకార సేవా సంఘాలే తీసికోండి; పొలాలను సాగుచేసికొనే కృషిలో కాక ఇతర విషయాలలో ఇవి రైతులకు ఎంతో సేవ చేస్తున్నవి. జపాన్, డెన్మార్క్, స్కాండినేవియా దేశాలలో ఈ సహకార సేవా సంఘా లను అభివృద్ధి చేసికొని ఉపయోగించు కోవటం వల్లనే రైతుల స్థితి గతులను బాగుపరచి, వారిలో సహకార గుణాలను దృక్పథాల్ని కలి

గించటం సాధ్య మైంది. స్వాతంత్ర్యం అంటే ఇతరుల సంబంధం లేకుండ ఏకాంతంగ ఉండటం అనుకోరాదు; స్వాతంత్ర్యం అంటే ఇతరుల మీద ఆధారపడ కుండటం, నియంతృత్వాధికారా లనో లేక సహకార సంఘాధికారాలనో ఛలాయించే వారికి లోబడ కుండ ఉండటం. సంఘంలోని స్వేచ్ఛాయుతమైన కూడలులకు ఒక నానితో ఒకటి పోటీ పడేటట్లయితే ఎలాంటి ఘోరపరిస్థితులు కలుగుతాయో మనం చెప్ప నవసరం లేకుండ చరిత్రలో అనేక మారులు సాక్ష్యం పోగుపడి ఉన్నది. అలాంటి పరిస్థితి కనుక కలిగితే దాని వల్ల సంఘంలోని అనేకులు బహు కొద్దిమంది మీద ఆధారపడి బ్రతకవలసిన గతి పడుతుంది. ఇంచు మించు సంఘం లోని ప్రజ లందరు నోరుగల వారికి బానిసలు కావలసి వస్తుంది. అనేక సమస్య లతో పెరిగి పోతు ఒకరి మీద ఒకరు ఆధారపడి ఉన్న నేటి సమా జంలో స్వాతంత్ర్యం గల ఈ చిన్న చిన్న ఉత్పత్తి కూడలులకు – అంటే రైతు కుటుంబాలు – మధ్య తమ తమ స్వాతంత్ర్యాన్ని నిలుపు కొనేందుకు పరస్పర సహకారం లేకపోతే వీటి స్వేచ్ఛా జీవనం కొనసాగటం కష్ట మవుతుంది. కనుక రైతు కుటుంబాలు తమ కున్న నిజమైన స్వేచ్ఛను కాపాడుకోవాలంటే తమ స్వేచ్ఛకు అనుగుణంగా ఉన్నంత వరకు సాధ్యమైనన్ని ఎక్కువ రంగాలలో పరస్పరం హృదయ పూర్వక సహకారం చేసికొంటూ, ఉత్పత్తిని, తమ స్వయంవృత్తిని, ఆర్థిక ప్రయోజనాలను పెంచుకొని బలపరచుకొన వలసి ఉన్నది. కాబట్టి సహకార సంఘాలు ఇలాంటి చిన్న చిన్న రైతు కుటుంబాల స్వాతంత్ర్యాన్ని అభివృద్ధి చేయటానికి యత్నిం చాలి. ఇలాంటి సహకార సంఘాలను ప్రోత్సహించ వలసినదే. సాంఘిక సామరస్యం దృష్ట్యా సంపూర్ణమైన ఆర్థిక ప్రజా స్వామ్యం దృష్ట్యా కూడ ఇవి అవసరమే. అందువల్లనే మేము సహకారసేవా సంఘాలను బలపరుస్తున్నాము. ఇలాంటి సహకార సంఘాలవల్ల రైతులు మాటలలోకాక ప్రజాస్వామ్యాన్ని ఆచరణలో అనుభవించ గలరు; ఈ సహకారసంఘాలే రైతులలో ప్రజాస్వామికదృష్టిని, సహ

కారభావాన్ని పెంపొందించ గలవు. కాని ఒక్క- మరతుమాత్రం మరిచి పోకూడదు. తమ తమ వ్యవసాయ కమతాలను రైతులు తమ ఇష్టం వచ్చిన విధానాలతో ఇష్టం ఉన్న విధానాలతో సాగు చేసికొనే ప్రాథమిక స్వాతంత్ర్యం మాత్రం వారికి ఉండితీరాలి. వారి ఈ స్వాతంత్ర్యాన్ని లాగివేయ కూడదు. వారికి కేవలం నామ మాత్రాధికారం ఉండే సంఘాలకు వారి స్వాతంత్ర్యాన్ని దత్తం చేయకూడదు.

సహకారం అంతవరకే ఉండాలి! ఈ మాద్దులు మీరి సహకా రాన్ని ప్రవేశపెట్టటం జరిగితే ఈ సహకారం ఆ సంఘసభ్యుల స్వాతం త్ర్యాన్నే కుంచింప చేస్తుంది. ఈ సహకారసంఘాలు వాటి సభ్యుల యొక్క ఉత్పత్తికార్యకలాపాలలో వారికి సహాయభూతంగా ఉన్నంత కాలం అవి ఆ సభ్యుల సేవకులుగా ఉంటాయి; ఆ సభ్యుల వ్యక్తి త్వాన్ని పెంపొందించటానికి బలపఱచటానికి ఉపకరిస్తాయి. కాని ఆ సభ్యుల దినకృత్యాలను ఆ సంఘాలే నిర్ణయించి శాసించ మొదలు పెట్టాయో అంతటితో ఆ సభ్యులమీద పెత్తందారులై అధికారం చలాయించటం ప్రారంభిస్తాయి; రైతాంగ వ్యవస్థకు జీవగఱ్ఱగా ఉంటూ తరాలతరబడి వారు అనుభవిస్తున్న అనేక స్వేచ్ఛలను ధ్వంసంచేసి ఆ సభ్యులను రోజువారీ కూలీలనుగా చేస్తాయి. దానితో సహకార సంఘాల సభ్యులు తమస్వేచ్ఛా స్వాతంత్ర్యాలను కోల్పోయి వృత్తికోసం తిండికోసం ఆ సంఘంమీద ఆధారపడి బ్రతుకవలసిన గతి పడుతుంది. ఈ విధంగా పరులమీద ఆధారపడి శ్రమించి బ్రతికేవారు ఉత్సాహాన్ని, సాహసాన్ని, స్వాతంత్ర్యాన్ని, విమర్శనాదృష్టిని, సృజ నాత్మక కృషిని పెంపొందించు కోవటంకాని, వ్యక్తం చేయటంకాని కల్ల. ఇవన్ని చచ్చిపోతవి.

రైతులు స్వేచ్ఛగా, వ్యక్తిగతంగా తమతమ ఉత్పత్తి కార్య కలాపాలకు సహాయ పడటానికిగాను ఏర్పాటు చేసికొనే సహకార సంఘాలవల్ల ఇలాంటి ప్రమాదాలు రావు. ఇవి ఆ సభ్యుల వ్యక్తిగత ప్రకృతిని, వ్యక్తిత్వాన్ని అభివృద్ధి చేయటానికి దోహదకారులుగా

ఉంటవి. కాని సహకార వ్యవసాయం ఇలాంటిది కాదు. సహకార వ్యవసాయం తన సభ్యుల దినకృత్యాలకు ఉత్పత్తి కార్యకలాపాలకు తోడ్పటటం కాక, ఆ యా సభ్యులు ఏ యే పనులు చేయాలో ఎలా చేయాలో నిర్ణయించి ఆ నిర్ణయాలను వారిమీద రుద్దుతుంది. దానితో సహకారవ్యవసాయసంఘ సభ్యులు వ్యక్తిగత బాధ్యత లతో పనిపాటులలో పాల్గొనటానికి అవకాశం ఉండదు. రైతాం గానికి ప్రధాన లక్షణంగా ఉంటున్న స్వాతంత్ర్య ప్రకృతికి స్థానం లేకుండ చేస్తుంది. చివరకు రైతులు బాధ్యతా రహితులై శక్తిహీనులై ఉత్సాహం సృజనశక్తి ఉడిగి పోయిన వారుగా తయారవుతారు. ఈ నాడు ఋణదాతలు వ్యాపారస్థులు మొదలైనవారు కీలకస్థానాలు ఆక్రమించి రైతులకు కావలసిన రవాణా మార్కెటింగ్ సౌకర్యాలను కలిగిస్తు ఆ నెపంతో వారిని దోచుకొంటున్నారు. వీరిని తీసివేసి, వీరి కీలకస్థానాల నాక్ర మించి ఇంతకంటె చక్కగా చౌకగా ఈ సౌకర్యాలను రైతులకు కలిగించగల సహకారసంఘాలు కావాలి. వాటిని రైతులుకూడ ఉత్సాహంగా ఆహ్వానిస్తారు. ఇలాంటి సహకారసంఘాల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు; వీటివల్ల వచ్చే స్వాతంత్ర్య హాని కంటె లాభాలే ఎక్కువగా ఉండటమే దీనికి కారణం.

అనేక సాంఘిక కార్యకలాపాలలో మనకు సహకారం కావాలి. దానితో మనం బలపడి ఇంక సంతోషంగా సాంఘిక జీవనం చేయ గలం; మంచి సంఘజీవులుగా తయారు కాగలం. అందరికి ఒకే వసతి గృహం, ఒకే భోజనశాల నిర్మించుకోవటానికి సహకార సంఘాలు స్థాపించాలని మనం అడగం. ఎందుచేత? ఇవన్నీ మన వ్యక్తి స్వాతంత్ర్యానికి సంబంధించినవి కనుక అలా అడగం. భారత దేశపు రైతుకి భూమి దున్నుకొని సేద్యం చేసికోవటం ఇటువంటిదె. ఒక వ్యక్తికి తన ఇల్లు సంసారజీవితం ఎటువంటివో మనరైతుకి సేద్యం అటువంటిది. ఇతరదేశాలలో సేద్యం కేవలం వ్యాపారంగా నిర్వ హింపబడుతున్న సందర్భాలు ఎక్కడైనా ఉంటే ఉండవచ్చు; ఆలాంటి చోట్ల వ్యక్తి స్వాతంత్ర్యానికి సేద్యానికి సంబంధం ఉండక

పోవటం కూడ వాస్తవమే. అలాంటి సందర్భాలలో సేద్యం రైతు వ్యక్తిగతంగా నిర్వహించుకొన్న సహకారంతో చేసికొన్నా లేక సమిష్టిగా సాగుచేసినా ఆ రైతు స్వాతంత్ర్యానికి సంబంధించినంత వరకు దీనివల్ల ఎలాంటి మార్పులు రావు. కాని భారతదేశంలోని పరిస్థితులు మాత్రం ఇలాంటివి కావు. వీటికి పూర్తిగా భిన్నంగా ఉన్నవి. మొదటి అధ్యాయంలో చెప్పినట్లుగా కుటుంబకమత మంటే రైతుకి అదే ఇల్లు, అదే అతని కర్మక్షేత్రం, అదే అతని వృత్తి. చివరకు తన వ్యక్తిత్వానికి రూపురేఖలు దిద్దుకొంటు వ్యక్తం చేసికొనేది కూడ ఆ కర్మక్షేత్రంలోనే. క్రూరమైన ప్రకృతితో పోరాడటానికి అతనికున్న ముఖ్యమైన ఆయుధం అదే. తన వ్యక్తిత్వాన్ని తన కుటుంబ ప్రత్యేకతను అభివృద్ధి చేసికోవటానికి, అభివ్యక్తం చేయటానికి అది అతని పరిశోధనాశాల. కాని సహకారవ్యవసాయంలో ఇవన్నీ ఇలాగేఉండవు, ఉండే వీలుకూడ లేదు గదా! సహకారవ్యవసాయంలో రైతులు తమ తమ భూకమతాలమీద, కార్యకలాపాలమీద తమకున్న హక్కులను స్వేచ్ఛను అధికారాలను సామూహికసంఘానికి — అనగా సహకారవ్యవసాయ సంఘానికి — అప్పగింత పెట్టవలసిందే. ఆ యా క్షేత్రాలలో ఏ యే పంట వేయవలసింది, ఏ యే సభ్యులు ఏ యే పనులు ఎలా చేయవలసింది నిర్ణయించి వారికి జీవనభృతి ఇచ్చేది సహకారవ్యవసాయ సంఘమే. ఆ సంఘపు ఆదేశాలకు దాని సభ్యులందరు లోబడి ఉండాలి. కనుక సంఘం వారికి యజమాని అవుతుంది. ఆ సంఘంలోని సభ్యునికి ఆ గుంపులో తానూ ఒకడుగా ఉండటంతప్ప ప్రత్యేకత, వ్యక్తిత్వం ఉండవు. మానవుని బానిసగాచేసి పరులను ఆశ్రయింప చేయగలశక్తి దారిద్ర్యానికి ఉన్నది. ఇలాంటి దారిద్ర్యానికి అధికారదార్ఢ్యం కూడ తోడైతే ఇక మానవుని పారతంత్ర్యం సంపూర్ణస్థాయికి చేసుకొంటుంది. మన వ్యవసాయరంగాన్ని ఎంత సహకార పూరితం చేసినా, ఎలా సమిష్టి క్షేత్రాలుగా మార్చినా ప్రస్తుతం భూమిమీద జీవిస్తున్న ప్రజలలో 100 కి 75 మందికి మాత్రమే చేతినిండ పని దొరుకుతుంది కాని మిగిలిన వారికి వ్యవసాయంలోనే వృత్తిని చూపించటం అసాధ్యం. ఈ సందర్భం ఇలా ఉండగా రైతులు

తమ వృత్తులకోసం జీవిక కోసం సహకారవ్యవసాయ సంఘాల మేనే జర్ల దయాదాక్షిణ్యాలమీద ఆధారపడవలసివస్తే రైతులు నైతికంగా ఎంత దిగజారిపోతారో, ఎంత అమర్యాదకరమైన పరిస్థితులలో పడి పోతారో ఊహించుకోలేమా! దీనివల్ల రైతులకు మిగిలేది ఆర్థిక సాంఘికరంగాలలో బానిసతనం రాజకీయంగా ఆత్మహత్య. ఇదంతా ఎందుకు చెపుతున్నామంటే ఎలాంటి సహకార వ్యవసాయ సంఘంలో నైనా అధికారం అనేది కొద్దిమంది చేతులలోనే ఉండక తప్పదు. కాలక్రమంగా వారిలో అధికారదాహం పెరగకుండ ఉండటానికి వారేమీ మానవాతీతులు కారు. ఇక మిగిలినవారందరు వారి మీద ఆధారపడి బ్రతకవలసి వస్తుంది. అందరకు సరిపడే పని ఉండదు కనుక పనిని సంపాదించుకొనే పోటీలో రైతులు ఈ విధంగా అధికారులమీద ఆధారపడక తప్పదు. ఉన్నపని కొద్ది కావటంచేత సభ్యులమధ్య ఆ పని సంపాదించుకోవటం కోసం అధికారంలో ఉన్నవారి ఆశ్రయం సంపాదించటానికి పోటీతప్పదు. ఇలాంటి పరిస్థితులలో ఏ వ్యక్తికికూడ ఏదో ఒక విధంగా బ్రతుకు తెరువు చూచుకోవాలి కనుక — వ్యక్తిత్వంతో స్వతంత్రంగా బ్రతకటానికి అవకాశాలు దొరకవు; ఒకవేళ ఎవరయినా తమ స్వాతంత్ర్యానికి అంటిపెట్టుకొని ఉన్నా అది ఎంతోకాలం సాగదు. దీనివల్ల వచ్చే ఫలితం ఏమిటి? అంతవరకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో సుఖజీవనంచేస్తున్న రైతులు బలహీనులై పరుల ఆశ్రయానికి దాసోహం అనటంతప్ప మరేమన్నా ఉన్నదా? కాబట్టి రైతులకు తమ కుటుంబకమతాలు తప్ప తగినంతపని సాంఘికభద్రతలు మరితర మైన ఆధారము లేని మనదేశపరిస్థితులలో మన ప్రణాళికా కారులు నిర్వచించిన సహకారవ్యవసాయాన్ని ప్రవేశపెడితే దానివల్ల సహకార తత్త్వశాస్త్రానికే విరుద్ధమైన ఘోర పరిణామాలు రాకతప్పవు.

V

ఈ సహకార వ్యవసాయ సమస్యను మరొక దృక్పథంతో కూడ పరిశీలింప వలసి ఉన్నది; అది ఆచరణకు సంబంధించిన దృష్టి. సహకార నిర్వహణ అనేది ప్రధానంగా ఆయా వ్యక్తులు ఐచ్ఛికంగా నిర్వ

హించవలసినది. సంఘంలో సహకారభావం ఎడల ఉన్న ఉత్సాహాన్ని బట్టి ప్రజలలో ఒకరిమీద ఒకరికి ఉన్న విశ్వాసాన్నిబట్టి ఈ సహకారాన్ని అభివృద్ధి చేయటం ఆధారపడి ఉంటుందని వేరుగా చెప్పనవసరం లేదు కదా! "సహకారం సంయుక్తంగా ఉంటుంది. కనుక ముందుగానె కొన్ని ప్రణాళికలను వేసి కొని వాటికి అనుగుణంగా మాత్రమె నడవాలనటం సహకారానికి గిట్టదు. సహకారం క్రమబద్ధమైన నిర్మాణం కాదు. ఇది రక్తమాంసాలున్న మానవుని అభివృద్ధి వంటిది. సహకారకృషిలో ఉద్భవించే నూతన సృష్టులను, నూతన దశలను సహకారం గుర్తిస్తుంది. తన కార్యకలాపాలలో వీటిని ఉపయోగించుకొంటుంది. ఇలాంటి నూతన సృష్టులు, దశలు పరిశోధనాకృషిని కొనసాగించటం వల్లనే లభిస్తాయని కూడ సహకారం గమనిస్తుంది."* రోజురోజుకి అధికంగా సాంఘిక ఆర్థిక కార్యకలాపాలలో సహకారాన్ని ప్రవేశపెట్టాలంటే క్రమంగా దశలుదశలుగా మాత్రమె చేయటానికి, సాధ్యమవుతుంది. సహకారంఅనేది చానిత త్వరీత్యా చూస్తేక్రమపరిణామం వల్లనె అభివృద్ధిచెందే అవకాశం ఉన్నది. కనుక ఈ సహకారాన్ని ఏదైనా నూతన రంగంలో మరికొన్ని కార్యకలాపాలలో ప్రవేశపెట్టవలెనంటే అంతకుముందు ప్రవేశపెట్టిన రంగాలలో, కార్యకలాపాలలో అది విజయవంతం అయి ఉండాలి. అత్యావశ్యక రంగాలలో దానిని ప్రవేశపెట్టి ఎలా పనిచేసిందో గమనించాలి. వీటిల్లో కనుక సహకారం విజయవంతంగా పనిచేయని పక్షంలో మరి ఇక దానిని కొత్తరంగాలలో ప్రవేశపెట్ట బూనటం వివేకం కాజాలదు. కాబట్టి మన దేశ పరిస్థితులలో సహకారవ్యవసాయం లాభసాటిగా విజయవంతం అవుతుందా కాదా అనే ప్రశ్నకు సమాధానం చెప్పాలంటె సహకారసేద్యం కంటె ముందు అవసరమైన వ్యావసాయక ఋణం, పంటలనిల్వలు, మార్కెటింగ్ సౌకర్యాలు మొదలైన వాటిలో సహకారాన్ని ప్రవేశపెట్టి ఎలా పనిచేస్తున్నది గమనించాలి. ఇక్కడ విజయవంతంగా నడవని పక్షంలో సహకారవ్యవసాయంకూడ విఫలం గాక తప్పదని గట్టిగా చెప్పవచ్చు. గ్రామీణ ఋణపరిశీలన

* Dr. G. Fauquet, "The Co-operative Sector" 1951, P. 48.

సంఘం (Rural credit survey committee) వంటి ప్రముఖ సంఘం మన దేశంలోని వ్యావసాయక సహకార ఋణసంఘాలు పనిచేస్తున్న తీరును నిశితంగా పరిశీలించి ఏ నిర్ణయానికి వచ్చిందో అందరకు తెలిసే ఉంటుంది. మన దేశంలోని వ్యావసాయక సహకార ఋణసంఘాలు సంపూర్ణంగా విఫలమై పోయిన వని వారు చెప్పనే చెప్పారు. నేటి పరిస్థితులలో మన వ్యవసాయరంగానికి అత్యంతావశ్యక మైన సహకార ఋణసంఘాలు కూడ సరిగ్గా పనిచేయలేక విఫలమైపోయిన వనేది ప్రధానంగా గమనించవలసిన విషయం. వ్యవసాయదారులలో సహకారం చాల నెమ్మదిగా కొనసాగుతూ ఉండటానికి గల ప్రధాన కారణాలను వారి నివేదిక వివరించింది. వాటిలో ప్రధాన కారణం మన సంఘంలో ఆర్థికప్రయోజనాలను గురించి ఉన్న వైమనస్యాలు సాంఘిక వైషమ్యాలు.

మన దేశంలో సహకారాన్ని అభివృద్ధి చేయాలంటే ఉన్న అన్ని రంగాలలోను వెంట వెంటనే సహకారాన్ని ప్రవేశపెట్టటం మార్గం కాదు; సహకారభావాన్ని పెరగనీయకుండ ప్రేళ్ళంట పెకల్చివేస్తూ ఉన్న అడ్డంకులను తొలగించటానికి ముందుగా కృషి చేయాలి. ప్రజలలో వైమనస్యాలు వైషమ్యాలు ఉన్నవంటె ఒకరికొకరికి సహకారం, పరస్పర విశ్వాసం లేదని అర్థం చేసికోవాలి. ఇలాంటి పరిస్థితులలో ఈ వైమనస్యాలు వైషమ్యాలు తొలగించి సరైన స్థితిగతులను వాతావరణాన్ని కలిగించకుండ అనేక చిక్కు లున్న రంగాలలో, అంతగా అవసరం లేని కార్యకలాపాలలో సహకారాన్ని ప్రవేశపెట్టితే ఆ ప్రయత్నం విఫలంకాక తప్పదు. ఇలాంటి అసహజమైన ప్రయత్నం మీదనె మన దృష్టిని కేంద్రీకరించి దానిని చేసి తీరవలసిందే నని పట్టుదల చూపితే ఉన్న సహకార రంగాలనడక కూడ కుంటుపడి మూలపడే ప్రమాదం వస్తుంది. అందువల్లనే సహకార తత్త్వశాస్త్రి చరణకు సహకారవ్యవసాయం ప్రధానమార్గం అనే అభిప్రాయంలో మాకు న్యాయం కనిపించటం లేదు.

VI

సహకారవ్యవసాయం స్వేచ్ఛగా వ్యక్తిత్వం తో జీవిస్తున్న రైతుల ఆర్థికజీవితాన్ని ధ్వంసం చేయటంతో ఆగదు. అది రైతాంగపు సాంఘిక వ్యవస్థనే తలక్రిందులు చేయకమానదు. ఇదివరకే వివరించినట్లుగా రైతువృత్తియొక్క నిజమైన విలువ ఆ వృత్తివల్ల రైతుకి లభిస్తున్న ఆర్థికసంపదలో లేదు. ఆ వృత్తివల్ల అతనికి లభిస్తున్న ఆర్థికేతర సంపదలలోనె దాని విలువ, విశిష్టత ఉన్నవి. ఈ ఆర్థికేతర సంపదను గురించి కూడ ఇదివరకె వివరించటం జరిగింది. రైతుకు స్వయంవృత్తివల్ల లభిస్తున్న గౌరవస్థానం, తన ఉత్పత్తి సాధనాల మీద తనకున్న యాజమాన్యం — సొంత భూములున్న రైతులకైతే ఈ యాజమాన్యం ఎల్లకాలం ఉంటుంది. కౌలుదారులకైతే పరిమిత కాలంవరకు ఉంటుంది — ఈ ఆర్థికేతర సంపదకు పునాదులు. అవి అమూల్యమైనవి. ఏ దేశంలో నైనా సాంఘికాభ్యుదయాన్ని సాధించటానికి ఇవే మార్గాలుగా ఉపకరిస్తవి. కనుక స్వయంవృత్తితో జీవిస్తు ఆర్థిక దాస్యానికి, వృత్తిదాస్యానికి లొంగకుండ స్వేచ్ఛగా బ్రతుకుతున్న ఈ కోట్లాది రైతుల స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు పదికాలాలపాటు నొనసాగి సంఘం సర్వతోముఖ వికాసాన్ని సాధించేటట్లు చూడటం స్వాతంత్ర్యపిపాస ఉన్న సోషలిస్టులకు ప్రధాన ఆశయంగా ఉండాలి. ఈ మన రైతులు తమ వృత్తులకోసం ఎలాంటి అధికారులకుకూడ — కేపిటలిస్టులకు, కమ్యూనిస్టులకు, సహకారసంఘాలకు కూడ—లొంగి ఉండవలసిన అవసరంలేదు. సహకార వ్యవసాయాన్ని రైతుకి తన భూములమీదఉండే యాజమాన్యపుహక్కు—లదృష్ట్యా మాత్రమె కాక నేటి రైతాంగ వ్యవస్థవల్ల రైతుకి-సొంతభూమి ఉన్న రైతుకి, కౌలు భూమి ఉన్న రైతుకికూడ — లభిస్తున్న స్వయంవృత్తి గౌరవందృష్ట్యా కూడ పరిశీలించవలసి ఉన్నది. సోషలిజం, కమ్యూనిజంకూడ ఉత్పత్తి సాధనాలమీద ఆ ఉత్పత్తి కృషినిచేస్తున్న కార్మికులకు యాజమాన్యం ఉండాలని చెపుతున్నవి గదా! కాకపోతే వారు అది వ్యక్తియాజమాన్యం కాకపోయినా ఆ శ్రామికులందరికి ఉమ్మడి పెత్తనం ఉండాలంటున్నారు. సోషలిస్టులకు కమ్యూనిస్టులకు ప్రధానమైన ఆశయం

కూడ ఇదే. నేటి ప్రపంచంలో ఉత్పత్తిసాధనాలమీద ఆ యా ఉత్పత్తులను సాగిస్తున్న శ్రామికుల యాజమాన్యం – సామూహికంగానే అనుకోండి – సంపాదించటమే వారి ప్రధాన ఆశయం. కాని రైతాంగ ఆర్థిక వ్యవస్థలో ప్రతికాలంలో ప్రతిచోట ఆయా ఉత్పత్తి సాధనాలమీద – భూమిమీద – కృషీవలులకు యాజమాన్యం ఉంటూనే ఉన్నది. ఈ నాడు మన దేశంలో కోట్లాది రైతులకు – మన కృషితో నిమిత్తం లేకుండానే – ఈ యాజమాన్యపు హక్కులున్నవి.

మన వ్యవసాయంలోని సేద్యానికి సంబంధించిన ఏ పనులలోను ఈ సహకార సంఘాలకు స్థానం ఇయ్యకూడదు. అలాకాక మన వ్యవసాయ సేద్యంలో ఏ పనిమీద వీనిని ప్రవేశ పెట్టినా వ్యతిరేకించటానికి మనం భయం పడకుండా సిద్ధంగా ఉండాలి. సర్వ కలాపాలమీద ఆధిపత్యం వహించే ఈ సహకార వ్యవసాయం మన సేద్యాన్ని మనను సొంతంగా చేయనివ్వకపోవటమే కాక రైతుల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను హరించి వేస్తుందని గట్టిగా విశ్వసిస్తున్నాము; కనుక దానిని వ్యతిరేకించటంలో ఎలాంటి భయాలు ఉండకూడదని చెపుతున్నాం. ఈ సహకార వ్యవసాయంవల్ల లభించే ప్రయోజనాల కంటె కష్టనష్టాలే చాల అధికంగా వస్తాయని ఇప్పటికే మేము సూచించి ఉన్నాం. సహకారసేవాసంఘాలవల్ల నష్టాలకంటె లాభాలు చాల అధికంగా వస్తాయని ప్రపంచ మంతట రుజువైంది; కనుక ఈ సహకార సేవా సంఘాలు మాత్రమే మనకు కావాలి. వీటిని స్థాపించి నిర్వహించటంలో మన కెట్టి అభ్యంతరము లేదు. ఈ సహకార సేవా సంఘాలవల్ల ఎంతో విలువైన ప్రయోజనాలు అనేకం లభిస్తవి.

సహకారవ్యవసాయంలో భూమిని ఒకరిచేతులలోకి – అంటే సహకారవ్యవసాయ సంఘంయొక్క ఆధిపత్యం క్రిందికి – చేర్చటం జరగక తప్పదు. ఈ క్రింద చెప్పబోతున్న రైతాంగపు ప్రధానమైన ప్రత్యేక లక్షణాలను రెంటిని కూడ ఈ విధానం తారుమారు చేస్తుంది. సహకారవ్యవసాయంవల్ల భూమిమీద ఉండే యాజమాన్యంలో ఉత్సాహం, శ్రద్ధ ఉండవు. ఇది నాసొంతం; కనుక నేను ఎంతైనా శ్రమపడాలన్న శ్రద్ధ లోపిస్తుంది. భూమిమీద సహకార వ్యవసాయ

సంఘానికి ఆధిపత్యం ఉంటే రైతుల స్వేచ్ఛాస్వాతంత్రాలకు భంగం కలుగుతున్నపుడు దానివల్ల వీరికి లభించేడి భద్రత ఏమీ ఉండదు. ఎందువల్ల అనే సందేహం రావచ్చు. రైతులకు తమ భూములమీద యాజమాన్యం లేకపోవటంవల్ల వారి వృత్తికి సంబంధించిన ప్రధాన నిర్ణయాలుచేసే అధికారం వారి కుండదు; ఆ సహకార వ్యవసాయ సంఘంలోని అనేకులలో ఇతడు ఒక్కడు మాత్రమే. అలాంటి సంఘం ప్రధాననిర్ణయాలను చేస్తుంది. ఆ నిర్ణయాలను తీసికొనే సహకార వ్యవసాయ సంఘంయొక్క కార్యవర్గం ఇతని పలుకుబడికి అందు బాటులో ఉండదు. ఒకవేళ సంఘమే తన స్వేచ్ఛస్వాతంత్ర్యాల మీద దాడిచేయటం ప్రారంభించినప్పటికి రైతుకి భద్రత లేదు. ఈ విధంగా తన భూమిమీద తనకు యాజమాన్యం లేకపోవటంవల్ల— ఒకవేళ నామమాత్రపు యాజమాన్యం ఉన్నప్పటికి ఉపయోగపడక పోవటంవల్ల—అతనికి అండగా నిలబడగల ఎలాంటి భద్రత ఉండదని చరిత్ర ఎన్నో సందర్భాలలో రుజువు చేసింది. ఇక రెండవది; రైతుకి స్వయంవృత్తివల్ల లభిస్తున్న స్థానం గౌరవం సహకార వ్యవసాయంలో ఉండదు. ప్రస్తుతం రైతు దినకృత్యాలలో పనులలో అనుభవిస్తున్న స్వేచ్ఛ, తనకు తానై తన కార్యకలాపాలకు ప్రణాళికలను రూపొందించుకొని తన ఇష్టం వచ్చిన విధానాలతో వాటిని స్థాపించుకొనే స్వేచ్ఛ సహకారవ్యవసాయంలో ఉండవు. ప్రస్తుతం అతనికి ఉన్న ఇలాంటి స్వేచ్ఛలు సహకారవ్యవసాయంలో ఆ యా ఉపసంఘాలకు మాత్రం ఉంటాయి. ఆ సంఘంలోని అనేకులలో ఒకడుగా ఉండి ఆ సంఘం చెప్పినట్లు పాటుపడటమో, పర్యవేక్షణ చేయటమో మాత్రమే రైతుకి మిగులుతవి. ఆ యా స్వేచ్ఛలను అవకాశాలను అనుభవించే ఉపసంఘాలలో సాధారణంగా ఇతనికి స్థానం ఉండదు. ఇతడు ఏ పనిని చేయాలో, ఎలాచేయాలో ఎప్పుడు చేయాలో, ఎంత కూలికిచేయాలో, చేయకపోతే ఎలాంటిప్రమాదంవస్తుందో ఇవన్ని నిర్ణయించి ఆదేశించేది ఆ యా ఉపసంఘాలు. సహకారవ్యవసాయంవల్ల వచ్చే మొట్టమొదటి ప్రమాదం ఏమిటి? రైతుకి తానుచేసే పనిలో స్వాతంత్ర్యం లేకపోవటం. పనిచేసేవ్యక్తికి ఆ పనిలో స్వాతంత్ర్యం

లేకపోవటంవల్ల ప్రస్తుతం రైతాంగవ్యవస్థవల్ల రైతులు పొందుతున్న సృజన కర్మలోని ఆనందం; వ్యక్తిత్వాన్ని అభివృద్ధి చేసికొంటు వ్యక్తం చేయటం, స్వాతంత్ర్యం అనుభవిస్తు ఉత్సాహం పొందటం మొదలైన విశిష్టమైన ఆర్థికేతర ప్రయోజనాలు సర్వము పూర్ణాను స్వారంగా తయారవుతవి.

కనుక సహకారవ్యవసాయంవల్ల రైతులకు ఎంతటి ఆర్థిక ప్రయోజనాలు సిద్ధించినా సిద్ధించవచ్చు; కాని ప్రస్తుతం రైతాంగానికి లభిస్తున్న ఈ ఆర్థికేతరసంపదను మాత్రం సహకారవ్యవసాయం ధ్వంసంచేసి తీరుతుంది.

కాని ఈఆర్థికేతర ప్రయోజనాలను వదలుకొని, ధ్వసంచేసికొన వలసి నంతటి ఆర్థిక ప్రయోజనాలు ఈ సహకారవ్యవసాయంవల్ల లభిస్తున్నవా ? సహకారవ్యవసాయం ఉండె తప్ప ఆర్థికాభివృద్ధి జరగ దని చెప్పటానికి తగిన ఆర్థికకారణాలు ఏమైనా ఉన్నవా అనే విష యాన్ని గురించి, మనం చెపుతున్న సహకార సేవాసంఘాలకంటె ఈ సహకారవ్యవసాయంవల్ల అధికంగా వచ్చే ఆర్థిక ప్రయోజనాలు ఏమైనా ఉన్నవా అనే విషయం గురించి ముందు రానున్న అధ్యా యాలలో కూలంకషంగా పరిశీలిస్తాం.

—∞—

అధ్యాయం - 5

భారీవ్యవసాయపు ఆర్థిక లాభాలు - సహకార వ్యవసాయం

సాంఘిక విషయాల దృష్ట్యా మన రైతాంగపు కుటుంబ వ్యవసాయాన్ని తీసివేసి దాని స్థానంలో సహకార వ్యవసాయాన్ని ప్రవేశపెట్టవలసిన అవసరంలేదని; ఈ సాంఘికన్యాయం ముసుగుతో సహకార వ్యవసాయాన్ని స్థాపించాలనటం హేతుపరిశీలనకు నిలిచే వాదం కాదని ముందటి అధ్యాయాలలో తేల్చుకొన్నాం. పైగా ఈ సాంఘిక విషయాల దృష్ట్యా మన రైతాంగపు కుటుంబ వ్యవసాయ విధానాన్ని నిలుపుకొని అభివృద్ధి చేసికొంటేనేతప్ప సామరస్య పూరితమైన సరైన సమాజవ్యవస్థను స్థాపించ లేమని కూడ చూచాం. కాని అంతటితో సమస్యా పరిష్కారం కాదు; ఆర్థిక విషయాలను కూడ పరిశీలించాలి. మన రైతాంగంలో సాంఘిక విషయాలు, ఆర్థిక విషయాలు సరైన పాళ్ళల్లో మిళితమై ఉన్నాయని మనకు తెలుసు. ఈ సాంఘిక ఆర్థిక విషయాలు పరస్పరాశితాలు కనుక వీటిలో ఒకదానిలో ఏలాంటి మార్పు వచ్చినా ఆ మార్పువల్ల రెండవదానిలోకూడ కొన్ని మార్పులు రాక తప్పదు. భూకమతాలకు గరిష్ఠ పరిమితులను నిర్ణయించి, అంచే రైతుల ఆదాయాలకు గరిష్ఠ పరిమితులను నిర్ణయించి— భూఆస్తులను సక్రమంగా పంపిణీ చేస్తున్నాం. ఇవి ఎందువల్ల చేస్తున్నాము, దీనికి ఆదర్శమేమిటి? వ్యవసాయ రంగంలో సాంఘిక న్యాయం సాధించాలనే సాంఘిక విషయ దృక్పథంతోనే మనం ఈ పనికి పూనుకొన్నాం. ఇలా చేయటం వల్ల వ్యావసాయక ఆర్థిక విధానం కొంతవరకు దెబ్బతింటుందని తెలిసికూడ దానికంటె ఉత్తమమైన సాంఘికన్యాయం దృష్టితో మనం ఈ పని చేస్తున్నాం; వ్యవసాయరంగం ఈ నూతన పరిణామానికి అనుగుణంగా సర్దుబాటు కావలిసిందే. అంచే సాంఘిక విషయాలదృష్ట్యా ఆర్థికరంగాన్ని సవరించు కొంటున్నాం. అదే విధంగా సాంఘిక రంగంకూడ నూతన ఆర్థిక వ్యవస్థకు అనుగుణంగా మారాలి. రైతాంగం సజీవంగా ప్రబలకాలంటె ఇలా ఆర్థికావశ్యకాల కనుగుణంగా రైతాంగపు సాంఘిక విష

యాలను కూడ మలుచుకోక తప్పదు. వ్యావసాయ కోత్పత్తుల విషయంలో ఈ నాటి శాస్త్రజ్ఞానం అనేక శాస్త్రీయ విధానాలను కనుగొన్నది. మన రైతాంగపు సాంఘిక వ్యవస్థలో ఎన్ని విశిష్టగుణాలున్నప్పటికి ఈ నూతన స్థితిగతులకు అనుగుణంగా మారవలసిందే కాని ఈ శాస్త్ర విధానాలకు, విజ్ఞానానికి దూరంగా మడికట్టుకొని కూర్చుంటే లాభంలేదు. ఈ నాటి ప్రపంచ గమనాన్ని గుర్తించ కుండ ఇలాగే ఉంటాం అంటె మనుగడ దుర్భర మవుతుంది. ఈ అధ్యాయంలో మేము మన రైతాంగవ్యవస్థ మారితేనేతప్ప ఆర్థిక అభ్యుదయం సాధ్యంకాదని చెప్పే ఆర్థిక విషయాలేమైనా ఉన్నవేమో చర్చిస్తాం. అంటె ఆర్థిక విషయాలదృష్ట్యా మన రైతాంగ వ్యవస్థ నిజంగా మారితీరవలసిన అవసరం ఉన్నదా ? అన్న ప్రశ్న ఈ అధ్యాయంలో చర్చించ బడుతుంది. ఒకవేళ రైతాంగ వ్యవస్థ మారవలసి ఉంటె ఈ నూతన పరిస్థితుల కనుగుణంగా రైతాంగం ఎలామారాలి, ఎలా మారగలదు, అనేవి కూడ ఇక్కడే పరిశీలింపబడుతవి.

I

ఈ నాడు మన దేశంలోని ప్రధానమైన ఆర్థికావశ్యకత మన వ్యవసాయోత్పత్తులను పెంచటం. దీనిని సాధించాలంటె మన దేశంలోని ప్రతి ఎకరానుంచి ఇప్పటి కంటె అధికోత్పత్తిని సాధించాలి. ఇలా అధికోత్పత్తిని సాధించాలంటే వ్యవసాయ కమతాల విస్తీర్ణాన్ని పెంచటం అవసరమని మన జాతీయ ప్రణాళికాసంఘం విశ్వసిస్తున్నది. మన ప్రణాళికాకారులు, కొంతమంది ఆర్థిక శాస్త్రవేత్తలు వ్యవసాయ కమతాల విస్తీర్ణాన్ని పెంచి పెద్దపెద్ద ఖండాలమీద సాగుచేస్తే వ్యవసాయోత్పత్తులు పెరుగుతా యని చెపుతున్నారు. దానికి వీరు ఈ క్రింది రెండు కారణాలను చూపుతున్నారు. 1 పెద్ద పెద్ద ఖండాల మీద పెద్ద ఎత్తున వ్యవసాయం చేయటంవల్ల అధిక లాభాలు వస్తవి. 2 ఇప్పటికంటె మంచి ఆధిపత్యము చక్కగా నిర్వహించటము వీలు పడుతుంది. వ్యవసాయ కమతాల విస్తీర్ణం పెంచి పెద్ద ఖండాలను

ఏర్పాటు చేసి నందువల్ల ఆర్థిక లాభాలు అధికంగా వస్తాయి కనుక సహకార వ్యవసాయం ప్రవేశ పెట్టాలి అనేదే ఆర్థిక విషయాలదృష్ట్యా చేస్తున్న ప్రధాన వాదం. సహకార వ్యవసాయాన్ని సమర్థిస్తున్నవారు దానికోసం చూపిస్తున్న ఆర్థిక కారణాలలో ఇదే ప్రధానమైనది. కాబట్టి ఈ అభిప్రాయాన్ని కూలంకషంగా పరిశీలించి ఇందులో ఉన్న వాస్తవం ఎంతో చూపుతాం.

వ్యవసాయ రంగంలో పెద్ద ఖండాలవల్ల లభించే ఆర్థిక లాభాలను వివరించటంలో సేద్యానికి సంబంధించిన కార్యకలాపాలకు, సేద్యానికి సంబంధించని కార్యకలాపాలకు ఉన్న భేదాన్ని గమనించటం అవసరం. సేద్యానికి సంబంధించని కార్యకలాపాలంటే భూమి దున్నటం దగ్గరనుంచి పంట నూర్చుకొనే వరకు పొలంమీద చేసే కార్యకలాపాలు ఇక సేద్యానికి సంబంధించని కార్యకలాపాలు కూడ చాల ఉన్నవి. ఋణసౌకర్యం, పంటలు నిల్వచేసికోవటం, పంటలు అమ్ముకోవటాన్నికైన మార్కెటింగ్ సౌకర్యాలు ఈ మొదలైన కార్యకలాపాలు సేద్యానికి సంబంధించనవి. ఇవే కాక నీటి సౌకర్యాలు పెద్ద చిన్న అన్ని రకాల ప్రాజెక్టులు కూడ దానిలోనికే వస్తవి. రవాణా విషయాలు, వ్యవసాయ పరిశోధన ఈ మొదలైనవి కూడ సేద్యానికి సంబంధించని కార్యకలాపాలే. ఈ క్రింద చెప్ప బోతున్న రెండు కారణాలవల్ల వ్యావసాయక కార్యకలాపాలను ఇలా విభజించుకోవటం అవసరం అవుతున్నది. మొదటి దేమంటే సేద్యానికి సంబంధించని కార్యకలాపాలలో సహకారాన్ని ప్రవేశ పెట్టి నందువల్ల రైతాంగానికి నష్టాలేమి కలగవు; పైగా అనేక ప్రయోజనాలు సిద్ధించ గలవు. ఈ రంగంలో సహకార సంఘాలను ప్రవేశ పెట్టి నందువల్ల రైతులు బలపడ గలరు. కాని సేద్యానికి సంబంధించిన కార్యకలాపాలలో సహకారం ప్రవేశపెట్టితే దానివల్ల భూములను ఒకచోట ఒకరి ఆధిపత్యంలో ఉండేటట్లు చేయవలసి వస్తుంది. దానితో రైతులు అనేక నష్టాలకు గురిఅవుతారు. సేద్యానికి సంబంధించిన కార్యకలాపాలను పెద్ద ఖండాలలో నిర్వహించినందువల్ల వచ్చే

అధికలాభాలను సేద్యానికి సంబంధించని కార్యకలాపాలనుంచి విడదీసే వీలు ఉండటం రెండవ కారణం. సేద్యానికి సంబంధించని కార్యకలాపాలలో ఈ పెద్ద ఖండాలవల్ల వస్తాయని చెప్పబడుతున్న లాభాలను సహకార వ్యవసాయం అవసరం లేకుండ సహకార సేవా సంఘాలవల్లనే పొందటానికి వీలున్నది. కనుక ఈ పెద్ద ఖండాలవల్ల వస్తాయని చెప్ప బడుతున్న లాభాలను సాధించటం కోసమె సహకార వ్యవసాయాన్ని సేద్యానికి సంబంధించిన కార్యకలాపాలలో ప్రవేశ పెట్టాలని చెపుతున్నారు. పెద్ద ఖండాలవల్ల వస్తాయని చెప్పబడుతున్న ప్రయోజనాలు కేవలం సహకార వ్యవసాయం ప్రవేశపెట్టినంత మాత్రం చేతనే వచ్చేవి కావు. వాటిని సాధించాలంటె సహకార వ్యవసాయ సంఘాలు పెద్ద పెద్ద వ్యవసాయ ఖండాలను ఏర్పాటు చేయవలసి ఉంటుంది. కాబట్టి సహకార వ్యవసాయంవల్ల ప్రయోజనాలు ఉన్నవా, లాభాలు రాగలవా అనే విషయం తేల్చుకోటానికి సేద్యానికి సంబంధించిన కార్యకలాపాలకు మాత్రమే పెద్ద ఖండాల సేద్యంవల్ల లాభాలు వస్తాయనే వాదనను పరిమితం చేసి పరిశీలించుకొంటే చాలు.

II

(మొత్తం ఉత్పత్తి అంటె భూమినుంచి పండిన మొత్తం పంట అని నికరోత్పత్తి అంటె ఆ ఉత్పత్తికి పెట్టిన పెట్టుబడులకైన ఖర్చులకు సరిపోయే పంట తీసివేయగా మిగిలిన ఉత్పత్తి అని అర్థం చేసికోవాలి.) ఆ చరణ సాధ్యమా, ఖర్చుల సంగతేమిటి అనే వాటిని విచారించకుండ ప్రతి ఎకరానుంచి మొత్తం ఉత్పత్తిని సాధ్యమైనంత అధికం చేయటం ఒక్కటే కనుక ప్రమాణం అయిన పక్షంలో వ్యవసాయ ఖండాల విస్తీర్ణానికి ఉత్పత్తికి సంబంధం ఉండవలసిన అవసరం లేదు. ఎందువల్లనంటె ఎవరైనా సరే—తన వ్యవసాయ ఖండం చిన్నదైనా పెద్దదైనా సరే—శ్రమను, ధనాన్ని తగువిధంగా తగినపాళ్ళలో భూమిమీద పెచ్చిస్తూపోతే ఉత్పత్తిని అధికం చేయవచ్చు. ఇలా శ్రమను ధనాన్ని భూమినుంచి ఎంతపంట పండటానికి వీలున్నదో

అంత పండించేటంత వరకు భారమోస్తు పోవచ్చు. కాని ఇలాపోగా పోగా ఇక మనం ఎంత ఖర్చుపెట్టినా అధికోత్పత్తి రాని దశ ఒకటి తగులుతుంది. భూసారాన్ని బట్టి మనకు తెలిసిన శాస్త్రవిజ్ఞానాన్ని అంతా ఉపయోగించి నప్పటికి ఆ భూమినుంచి ఇక అధికంగా పండించే వీలుండదు. ఆ దశను అందుకొనేటంతవరకు మనం శ్రమను ధనాన్ని సరైనపాళ్ళల్లో వినియోగించ గలిగితే 'మొత్తం ఉత్పత్తిని' సాధ్యమైనంతవరకు అధికం చేయవచ్చు. కాని ఉత్పత్తి కృషికి అవసరమైన సాధన సంపత్తి చేతినిండ పుష్కలంగా ఉన్నప్పుడు మాత్రమే ఇలా చేయ వీలవుతుంది.

కాని ఈ ఉత్పత్తి కృషికి అవసరమయ్యే సాధనసంపత్తులు వాస్తవ ప్రపంచంలో అంత తేలికగా పుష్కలంగా లభించవు. పైగా ఈ సాధనసంపత్తులు మనకున్న అపరిమితమైన అవసరాలకే చాలీ చాలకుండ ఉంటాయి. కాబట్టి ఉత్పత్తి కృషిలో మనం వినియోగించ వలసిన సాధన సంపత్తులమీద పెట్టే పెట్టుబడులకు, ఆ పెట్టుబడులవల్ల వచ్చే ఉత్పత్తికి ఉచితమైన సంబంధం ఉండక తప్పదు. అధికోత్పత్తిని సాధించటమే సంతోషం కాదు. ఆ అధికోత్పత్తిని సాధించటానికి అదనంగా పెట్టిన పెట్టుబడులదృష్ట్యా దాని విలువను నిర్ణయించాలి. మనం ఎంతవరకు పెట్టుబడిని పెట్టగలమో దానికి సంబంధించి నంత వరకే ఉత్పత్తిని సాధించగలం; ఎంతవరకు పెట్టుబడి పెడితే మనకు లాభం ఉండేటట్లు ఉత్పత్తిని సాధించగలమో అంతవరకే మనం పెట్టు బడి పెడతాం. మనం పెట్టిన మొత్తం పెట్టుబడులకు మనకు వచ్చిన మొత్తం ఉత్పత్తి సమానమైనప్పుడు ఉత్పత్తి తూనికను అందుకొన్న ట్లవుతుంది.

వ్యవసాయోత్పత్తిదారులు 'ఉత్పత్తిదారుల మిగులు' ను వీలైనంత అధికం చేసికొన్నప్పుడే 'మొత్తం ఉత్పత్తి' ని వీలైనంత అధికం చేస్తారు. రైతులు ఈ 'ఉత్పత్తి దారుల మిగులు' ను ఏ పరిస్థితులలో నైనా రెండు విధాలుగా పెంచుకొనే అవకాశం ఉన్నది. ఖర్చును పెంచకుండ ఉత్పత్తిని అధికంగా సాధించటంవల్ల రైతులు తమ 'ఉత్పత్తిదారుల మిగులు' ను పెంచుకోవచ్చు.

పెట్టుబడులకు ఉత్పత్తులకు ఉన్న నిష్పత్తిని పరిశ్రమలలో ఇబ్బంది లేకుండ అన్వయించ వచ్చు. కాని వ్యవసాయ రంగంలోకి వచ్చేటప్పటికి ఉత్పత్తులు తప్పకుండ పెట్టుబడుల ననుసరించే ఉంటా యని చెప్పలేము. కనుక వ్యవసాయ రంగంలో దీన్ని ఒక్కదానినే పరిగణించి వ్యవసాయోత్పత్తుల విషయం చర్చించ కూడదు.

వ్యవసాయంలో పరిశ్రమలలో వలె ఉత్పత్తులు పెట్టుబడుల కనుగుణంగా రావు. మన వ్యవసాయం ఋతుపవనాలమీద ప్రకృతి దయాదాక్షిణ్యాలమీద ఆధారపడి ఉన్న దనే విషయం అందరకు తెలిసిందె. వ్యవసాయోత్పత్తులకు వ్యవసాయపు పెట్టుబడులు, సరైన ఆధిపత్యం ఎంత అవసరమొ, ప్రకృతి శక్తుల ఆనుకూల్యం కూడ అంత అవసరం. పెట్టుబడులలోను, ఆధిపత్యంలోను మార్పు లేకపోయినా వర్షాభావంవల్ల, వర్షాధిక్యం, తెగుళ్ళు మొదలైన వాటివల్ల మన ఉత్పత్తులు మాత్రం సంవత్సర సంవత్సరానికి మారుతుండటం మనం కళ్ళతో చూస్తున్న విషయమే. అంతేకాదు; ప్రకృతి అనుకూలంగా ఉన్నప్పుడు కూడ వ్యవసాయంలో పెట్టుబడులకు తగిన ఉత్పత్తులు లభిస్తూనే ఉంటాయని చెప్పలేము. కాబట్టి పరిశ్రమలలోకంటె వ్యవ సాయంలో చాల చిక్కులను ఎదుర్కొవటానికి వైతు సిద్ధంగా ఉండాలి.

వ్యవసాయోత్పత్తులలో మరొక ప్రధాన విషయాన్ని కూడ గమనించక తప్పదు. పరిశ్రమలలోవలె పెట్టుబడులను పెంచిన కొలదీ ఉత్పత్తిని పెంచుతూపోవటం వ్యవసాయంలో సాధ్యం కాదు. పెట్టు బడులను ఎంత పెంచుకొంటు పోయినప్పటికి ఒక దశకు వెళ్ళేటప్పటికి ఇక అంతకు మించి ఉత్పత్తిని సాధించలేము. ఆదశకు వచ్చిన తరువాత ఇక మనం ఎంత పెట్టుబడి పెట్టినప్పటికి ఉత్పత్తి మాత్రం పెరగదు. దీనికి కారణం లేకపోలేదు. ఆ భూసారాన్నిబట్టి ఆ భూమి అంతకంటె ఎక్కువ పంటను ఇవ్వలేదు; అలాగే మనకు తెలిసిన శాస్త్రజ్ఞానాన్ని సర్వము వినియోగించుకొన్న తరువాత ఇక మన ఉత్పత్తులు పెరగవు. ఈ కారణాలవల్ల వ్యవసాయోత్పత్తులు ఒక దశకువచ్చి ఆగిపోక తప్పదు. ఆ పైన మనం ఎంత పెట్టుబడి పెట్టినా ఆదశను దాటి

ఉత్పత్తిని సాధించలేము. పరిశ్రమలలో కూడ ఇంతే; మనం పెట్టుబడులతో ఆ యంత్రం ఉత్పత్తి చేయగల చరమస్థాయి వరకు పెళ్ళి ఉత్పత్తిని సాధించగలం. ఇక ఆపైన పెట్టుబడి పెట్టినా అధికోత్పత్తి రాదు. కాని పరిశ్రమలలో ఒక అవకాశం ఉన్నది. ఆ యంత్రాన్ని మార్చి కొత్తయంత్రాన్నో, లేక పెద్దయంత్రాన్నో నెలకొల్పుకొంటు పోతే ఉత్పత్తిని కూడ అధికంచేసికొంటు పోవచ్చు. మన వ్యవసాయంలో దీనికి వీలులేదు గదా ! ఉన్న భూమిని మార్చి కొత్తభూమిని పెట్టలేము. అందువల్లనే పరిశ్రమల ఉత్పత్తులలో చరమస్థాయిని అందుకోవటం మనకు కష్టం. కాని వ్యవసాయోత్పత్తులలో చరమస్థాయిని తేలికగానే చేరుకోగలం.

మనదేశపు ఆర్థికవ్యవస్థ ఇంతవరకు కూడ సరిగా, సంపూర్ణంగా అభివృద్ధి చెందలేదు. కాబట్టి మన రైతులు తమకు వస్తున్న ఉత్పత్తులు తమ పెట్టుబడులకు చాలకపోయి నప్పటికి సేద్యం చేస్తూనే ఉంటారు. అదే ఉత్పత్తిని తీస్తూనే ఉంటారు. పెట్టుబడులు అంటె ఏమిటో ఇక్కడ ఒకమాట చెప్పాలి! పెట్టుబడులంటె రైతు ధనరూపంలో పెడుతున్న పెట్టుబడులేకాక తన శ్రమ, తన కుటుంబశ్రమ, తన పశువుల శ్రమ, తన పశువుల వలన వస్తున్న ఎరువుల విలువ, ఇలాంటి వాటికికూడ విలువకట్టి పెట్టుబడులక్రిందనే చేర్చాలి. వీటిని ఉపయోగించటంలో రైతుకి అదనంగా ధనవ్యయంమాత్రం ఉండదు. రైతుకి తన భూకమతంనుంచి వస్తున్న ఉత్పత్తి ఇలాంటి అన్ని రకాల పెట్టుబడులకు సరిపోయేది కనుక అయితే ఆ భూకమతాన్ని 'తగుమాత్రపు భూకమతం' (Marginal Holding) అని ఆ భూకమతంనుంచి వస్తున్న ఆదాయాన్ని 'తగుమాత్రపు ఆదాయం' అని అనవచ్చునని జె. ఆర్. బెల్లర్బీ గారి అభిప్రాయం. కాని మనదేశపు వాస్తవ పరిస్థితులను పరికిస్తే మనకు ఇలాంటి 'తగు మాత్రపు భూకమతాలు' లేవు. మనకు ఉన్న భూకమతాలు 'జీవనాధార కమతాలు' (Subsistance Holding) మాత్రమె. మనకున్న ఈ భూకమతాల వల్ల మన రైతాంగానికి 'జీవనాధారాదాయాలు' మాత్రమె వస్తున్నవి కాని 'తగుమాత్రపు ఆదాయాలు' రావటం లేదు. మన రైతు

లకు తాము చేయగల శ్రమమాత్రం పుష్కలంగా లభిస్తున్నది కాని ఇతర సాధనసంపత్తులు అందుబాటులో లేకపోవటంవల్ల ఇలా జరుగుతున్నది. అందువల్లనే మన రైతాంగంలో అత్యధిక సంఖ్యాకులు తమ 'జీవనాధార కమతాల' నుల్ల తాము ధనరూపంలో పెట్టిన పెట్టుబడులకు సరిపోయే 'జీవనాధారాదాయం' మాత్రమే వస్తున్నప్పటికి కూడ వ్యవసాయాన్ని వదలకుండ వ్యవసాయోత్పత్తిని సాగిస్తున్నారు. ఈ స్థితి ఇలా ఉండటానికి మన ఆర్థిక వ్యవస్థలో ఇతరవృత్తులు లభించక పోవటం ఒక్కటే కారణం కాదు. తమ ఉత్పత్తులను భూములను అభివృద్ధి చేసికోవటానికి రైతులకు ఋణసౌకర్యాలు, తగిన జ్ఞానం మొదలైన అవకాశాలు లేకపోవటంకూడ దీనికి ప్రబల కారణమే. ఈ ప్రత్యేక పరిస్థితులవల్ల రైతు ధనరూపంలో కాకుండ తనకుటుంబంచేస్తున్న శ్రమనంతటిని కూడ ఈ 'జీవనాధారాదాయానికి' సరిపెట్టు కొంటాడు. రైతు భూమిని వదలుకొంటె అంతకంటె ఎక్కువ సంపాదించగల అవకాశాలు మృగ్యం కనుక తన వ్యవసాయంలో 'తగుమాత్రపు ఆదాయం' వస్తుందని కలలోకూడ అనుకోలేక పోతున్నాడు.

పెట్టుబడులకు ఉత్పత్తికి ఉన్న సంబంధాన్ని వ్యవసాయరంగానికి అనువర్తింప చేసే ముందు ఆ సూత్రానికి సంబంధించిన ఈ ప్రధాన పరిమితులను మనసులో పెట్టుకోవటం అవసరం.

III

ఈ పరిశీలనను దృష్టిలో పెట్టుకొని చూస్తే అధికోత్పత్తిని సాధించటానికి పెద్ద ఖండాల వ్యవసాయం ఎలా ఎప్పుడు దోహదకారి అవుతున్నది? వ్యవసాయంలో మిగులు ఉత్పత్తిని రెండు విధాలుగా పెంచవచ్చు నని ఇదివరకె చూచాం; ఆ రెండు విధాలు 1 ఖర్చులు పెంచకుండ పూర్వపు ఖర్చులనే పెడుతు ఉత్పత్తిని పెంచటం 2 ఉత్పత్తి మాత్రం తగ్గకుండ ఖర్చులను తగ్గించు కోవటం అని కూడ చెప్పుకొన్నాం. వీటిలో ఖర్చులు పెరగకుండ ఉత్పత్తులు పెంచుకోవ

టానికి సామర్థ్యం గల ఆధిపత్యం, వ్యావసాయక కృషిలో శాస్త్రీయ విధానాలు ప్రవేశపెట్టటం మార్గాలు. సామర్థ్యంగల ఆధిపత్యంతో వ్యవసాయాన్ని గురించిన శాస్త్రజ్ఞానాన్ని పద్ధతులను ప్రవేశపెట్టి చరమదశను చేరుకొనే టంతవరకు వ్యావసాయకోత్పత్తిని సాధించవచ్చు. కాబట్టి ఆధిపత్యాన్నిబట్టి ఉత్పత్తిని సాధించగలం కనుక ఆధిపత్యం పెరిగితే ఉత్పత్తి పెరిగే సంబంధం వీటి రెంటికి ఉంటున్నది. ఉత్పత్తి మాత్రం తగ్గకుండ ఖర్చును తగ్గించటం అనేది మన వ్యావసాయక సాధన సంపత్తులను పూర్తిగా వినియోగించుకోవటంవల్ల అంటే సగటు ఖర్చులను తగ్గించుకోవటంవల్ల సాధ్య మవుతుంది. ఇక్కడ పెట్టుబడులనుబట్టి ఉత్పత్తి కూడ పెరుగుతుందని చెప్పగల సంబంధం వీటి రెంటికి – ఖర్చులకు ఉత్పత్తికి – లేదు. ఎందువల్లనంటే ఖర్చులు తగ్గించినందువల్ల రైతుకి వచ్చే ఆదాయం తగ్గకపోగా పెరుగుతున్నది. ఆదాయం పెరగటంవల్ల రైతు తన ఉత్పత్తిని ఇంక పెంచటానికి తగిన అవకాశాలు లభిస్తున్నవి.

పరిశీలనార్థం ఈ రెంటిని ఇలా విడదీసి చూపుతున్నప్పటికి వాస్తవంగా ఆచరణలో ఇవి రెండు పరస్పరాశ్రితాలు. ఎలాగో చూడండి: సామర్థ్యంగల ఆధిపత్యం ఉంటేనే వ్యావసాయక సాధన సంపత్తులను సమగ్రంగా సంపూర్ణంగా వినియోగించుకోవటం జరుగుతుంది. అలాగే వ్యావసాయక సాధనసంపత్తులు ఉత్తమమైనవిగా ఉన్నప్పుడే సామర్థ్యంగల ఆధిపత్యం ఉంటుంది. కనుక వీటిని రెంటిని విడదీసి స్వతంత్రాలుగా చిత్రించటానికి వీలులేదు.

ఇక మనం వ్యవసాయ ఖండాల విస్తీర్ణం పెరిగినందువల్ల సగటు ఖర్చు ఎలా తగ్గుతుందో పరిశీలిద్దాం. వ్యవసాయదారులు తమ భూములకు కావలసిన పెట్టుబడులను కొనుక్కోవటం తమ భూముల నుంచి వస్తున్న ఉత్పత్తులను అమ్ముకోవటం వారి సహకార సంఘాలద్వారా నిర్వహించు కొంటున్నారని అనుకొందాం. ఈ కొనుక్కోవటం అమ్ముకోవటం అనే వాటిలో సంపూర్ణలాభం పొందాలంటే భూకమతాలు ఎంత పెద్దవైనప్పటికి అంత కంటె పెద్ద ఎత్తున వాటిని నిర్వహించుకోక తప్పదు.

రైతులు ఈ అమ్ముకోవటాలు కొనుక్కోవటాలు సహకార సంఘాలద్వారా చేశారని అనుకొందాం. ఇక మిగిలిన వ్యవసాయపు ఖర్చులు కేవలం సేద్యానికి సంబంధించిన కార్యకలాపాలనే కదా! ఈ సేద్యానికి సంబంధించిన ఖర్చులను రెండుగా విభజించ వచ్చు. ఒకటి కనపడే ఖర్చులు; రెండవది కనపడని ఖర్చులు. ఎరువులు, విత్తనాలు, విద్యుచ్ఛక్తి ఈ మొదలైనవి కనపడే ఖర్చులు. భూకమతాల విస్తీర్ణం పెంచటంవల్ల ఈ ఖర్చులను తగ్గించటం జరగదు. భూవిస్తీర్ణం పెరిగిన కొందికి అదే నిష్పత్తిలో ఈ ఖర్చులుకూడ పెరుగుతవి. కనుక పెద్దకమతాల సేద్యంవల్ల వీటిలో సగటు ఖర్చులను తగ్గించటం వీలయ్యే పనికాదు. ఇక రెండవదైన కనపడని ఖర్చులకు భూకమతాల విస్తీర్ణానికి మాత్రం సంబంధం ఉన్నది. ఎందువల్లనంటె ఈ కనపడని ఖర్చుకు సంబంధించిన సాధన సంపత్తులను ఎంత వరకు వినియోగించుకోవచ్చునో అంతవరకు పూర్తిగా వినియోగించుకొన్న పక్షంలో సగటు ఖర్చులు తగ్గిపోతవి. కాబట్టి సగటు ఖర్చును తగ్గించాలంటె ఈ సాధన సంపత్తులను సమగ్రంగా వినియోగించుకోవటానికి తగినంత విస్తీర్ణం గల భూకమతాలు ఉండాలి. మన వ్యవసాయ పద్ధతులను బట్టి ఈ కనబడని ఖర్చుల స్వరూపం నిర్ణయింప బడుతుంది. ఉదాహరణకు మనసంప్రదాయక వ్యవసాయాన్ని తీసికొందాం. దానిలో మన రైతుకి ఉండే ఎడ్లజత, బండి, నాగలి వ్యవసాయపు పనిముట్లు, కుటుంబశ్రమ ఈ మొదలైనవి మన సంప్రదాయక వ్యవసాయంలోని కనపడని ఖర్చుల క్రిందకు వస్తవి. వీటిని సమగ్రంగా సంపూర్ణంగా వినియోగించుకోవాలంటె అందుకు తగిన విస్తీర్ణం గల భూకమతం రైతుకి ఉండాలి. యంత్రాలతో సాగు చేసికొనే విధానంలో అయితె ఆ యా యంత్రాలు ఈ కనపడని ఖర్చుల క్రిందకు వస్తవి. ఈయంత్రాలకున్న శక్తినంతటిని సంపూర్ణంగా వినియోగించుకోవాలంటే వాటికి తగిన విస్తీర్ణంగల భూకమతం ఉండాలి. ఈ యంత్రాలలో కూడ రెండు రకాలున్నవి. మన వ్యావసాయక సామర్థ్యాన్ని ఉత్పత్తులను అధికం చేయటానికి తోడ్పడే ఉత్తను పరికరాలు యంత్రాలు ఒక రకం. మిగిలినవి భూమి మీద మానవుల శ్రమకు జంతువుల శ్రమకు మారుగా వినియోగించుకోవటానికి మాత్రమే తోడ్పడతవి. ట్రాక్టర్లు

విద్యుచ్ఛక్తి యంత్రాలు ఈ రెండవరకానికి సంబంధించినవే. వ్యావసాయక ఇంజనీర్లలో కొంతమందికి విద్యుచ్ఛక్తి యంత్రాల వల్ల సామర్థ్యం, ఉత్పత్తులు పెరుగుతా యనే అభిప్రాయం ఉన్నా ప్రవీణులందరు అంగీకరించిన అభిప్రాయం కాదిది. కనుక ఈ అభిప్రాయాన్ని మనం నమ్మలేము. "ఎన్ సైక్లోపీడియా ఆఫ్ సోషల్ సైన్సెస్" అనే గ్రంథంలో వ్యావసాయక యంత్రసామాగ్రిని గురించి వ్రాస్తూ లూయిస్. సి. గ్రీరీ అనే సాంకేతిక ప్రవీణుడు ఇలా అన్నాడు. "సమర్థంగా భూమిని దున్నే యంత్రాలవల్ల ప్రతి ఎకరాకు సగటు ఉత్పత్తి పెరిగేటట్లు వ్యవసాయం చేయవచ్చు." కాని యస్. జె. రిట్ అనే సాంకేతిక ప్రవీణుడు ఈ అభిప్రాయంతో ఏకీభవించక ఏ మంటున్నాడో చూడండి. "ట్రాక్టర్లు కాని, ఇంజన్లు కాని వ్యవసాయ కార్యకలాపాలలో ప్రవేశ పెట్టినందువల్ల గుఱ్ఱాలను (మన సందర్భంలో ఎడ్లను) ఉపయోగించిన దాని కంటె అధికంగా సాధించే దేమైనా ఉన్నదా అని ప్రశ్నించే అవకాశం ఉన్నది. (అనగా గుఱ్ఱాలను ఉపయోగించే కంటె ఈ ట్రాక్టర్లను, ఇంజన్లను ఉపయోగించి నందు వల్ల అదనంగా వచ్చిన ఉత్పత్తి ప్రయోజనము లేదని భావం.) ఆర్థిక దృష్ట్యా లాభదాయకంగా ఉండేటట్లు భూమిని దున్నటంలో ఆస్ట్రేలియా దేశంలో 7 లేక 8 గుఱ్ఱాలను ఉపయోగించి భూమిని దున్నుతున్న పద్ధతే ఇంత వరకు వచ్చిన విధానా లన్నింటిలోకి లాభదాయకంగా ఉన్నది". * కాబట్టి యంత్రాలతో వ్యవసాయం చేస్తున్నందు వల్ల లభిస్తున్న అధికోత్పత్తికి కారణం విద్యుచ్ఛక్తి యంత్రాలుకాదని ఉత్తమ వ్యావసాయక పరికరాలు, ట్రాక్టర్లకు ఇంజనీర్లకు సహకారంగా ఉన్న పరికరాలు మాత్రమే ఈ అధికోత్పత్తికి కారణా లన్న గౌరవం పొందుతున్న వని అనేక ప్రవీణులు అభిప్రాయ పడుతున్నారు.

విద్యుచ్ఛక్తి యంత్రాలవల్ల అధికోత్పత్తి సాధ్య మవుతుందా కాదా అనే ఈ వాదోపవాదాలు ఎలా ఉన్నా మానవశ్రమ, జంతుశ్రమ ఇపుడు లభిస్తున్నంత తేలికగా లభించని స్థితి ఏర్పడి నపుడు ప్రతి

* "Farming and Mechanised Agriculture" 1944-45. P. 95—Edited by J. F. Easterbrook.

వారు విద్యుచ్ఛక్తి యంత్రాలను వినియోగించుకోక తప్పదు. పారిశ్రామికంగా దేశం అభివృద్ధి పొందటం ప్రారంభించిన తరువాత వ్యవసాయేతర రంగాలు ఎక్కువమంది శ్రామికులను తమ క్రింద ఉంచుకొంటాయి; ఉత్పత్తులను అధికం చేయటం శ్రామికుల వేతనాలను పెంచటం ఇవన్నీ జరుగుతాయి. వ్యవసాయ రంగాభివృద్ధికి ధనం చిక్కక ఉన్న ఆర్థిక సంపదంత పారిశ్రామిక రంగంలోకే పోతుంది. పారిశ్రామికరంగం ఆకర్షనంతంగా ఉండటంచేత అధిక వేతనాలను ఇస్తుండటంచేత అధికసంఖ్యాకులు ఆ రంగంలోకి పోతారు. దానితో వేతనాలు అధికం కావటంవల్ల వ్యవసాయపు ఖర్చులు పెరుగుతాయి. ఇలా అభివృద్ధి పొందుతున్న ఆర్థిక వ్యవస్థలోని ప్రజలను పోషించాలంటె వ్యవసాయదారుల మిగులు ఉత్పత్తి పెరగాలి. అందుచేత వేతనాలు అధికం కావటంవల్ల, వ్యవసాయరంగానికి కావలసినంత మానవశ్రమ, ధనం దొరకటం కష్టం కావటంవల్ల వ్యవసాయదారులకు యంత్రాలను వినియోగించుకోవటమె లాభదాయకంగాను సుఖంగాను ఉంటుంది. అప్పుడైనా అందరు యంత్రాలను ఉపయోగించుకోక తప్పదు.

కనుక తేలిన సారాంశ మేమంటె కనపడని ఖర్చులకు భూకమతాల విస్తీర్ణానికి మాత్రమె సంబంధం ఉంటుంది. ఇదికూడ ఎంత వరకు? ఆయా కనపడని ఖర్చులకు సంబంధించిన పరికరాలను సమగ్రంగా సంపూర్ణంగా వినియోగించు కొనటానికి తగిన విస్తీర్ణంగల భూకమతాలు ఉంటె చాలు. అంతకుమించి పెద్ద కమతాలను స్థాపించినందువల్ల సగటు ఖర్చులను తగ్గించగల అవకాశాలుకూడ ఏమిఉండవు.

IV

ఇక ఉత్పత్తి విషయం ఆలోచిద్దాం. ఖర్చు పెరగకుండ ఉత్పత్తిని మాత్రం అధికం చేయాలంటె సామర్థ్యంగల ఆధిపత్యం అవసరమని తెలిసికొన్నాంగదా! భూకమతాల విస్తీర్ణానికి ఈ సామర్థ్యంగల ఆధిపత్యానికి ఏమి సంబంధం ఉన్నది? సేద్యానికి సంబంధించిన నవీన

శాస్త్రీయ పద్ధతులు తెలిసి తెలివితేటలుండి కష్టించి పనిచేసే రైతు అజ్ఞానంతో సోమరితనంతో తిరిగే రైతుకంటె ఎక్కువ పంట పండించి మంచి ఫలితాలను సంపాదించగల డనేది వాస్తవమే. అందువల్లనే సామర్థ్యంగల ఆధిపత్యం కూడ వ్యవసాయంలో అత్యావశ్యకమైన పెట్టుబడి అని, దీనిమీదనే పంట కూడ ఆధారపడి ఉంటుందని మేము గుర్తిస్తున్నాము.

కాని వ్యవసాయంలోని ఆధిపత్యానికి పరిశ్రమలలోని అధిపత్యానికి (Management) నికి భేదం లేదనే అభిప్రాయం ఏర్పరచుకొని, తద్వారా భారీపరిశ్రమలలో పెద్దఎత్తున ఆధిపత్యాన్ని నిర్వహించి నందువల్ల లభించే లాభాలు, ప్రయోజనాలు వ్యవసాయంలో కూడ సిద్ధించగలవని అనుకోవటం మాత్రం పొరపాటు. ఈ రెండు రంగాలలోని ఆధిపత్యానికి భేదం ఉన్నది. ఈ రెండు రంగాలలోను నిర్వహించ వలసిన కార్యకలాపాల స్వరూపస్వభావాలలో భేదం ఉండటమే దీనికి కారణం.

పరిశ్రమలలో ఒకే వ్యక్తి పెద్ద ఎత్తున ఆధిపత్యం వహించటం వల్ల లభించే ప్రయోజనాలు వ్యవసాయంలో సాధ్యంకావు. పరిశ్రమలలోని మేనేజర్ల కార్యకలాపాలు ఈ క్రింది విధంగా ఉంటాయి. తమ ఉత్పత్తులకు మార్కెట్‌లో ఉన్న పలుకుబడినిబట్టి డిమాండును బట్టి ధరలు నిర్ణయించటం, ఉత్పత్తులను ఎంతవరకు మార్కెట్‌లోకి పంపటమో నిర్ణయించటం తమ ఉత్పత్తులమీద ప్రజలకు అభిమానం కలిగేటట్లుచూడటం; తమ వస్తువులకు పోటీగా మార్కెట్‌లోకివస్తున్న వస్తువుల నుంచి తమ వస్తువులను వేరుచేసి తమ వాటిమీదనే ప్రజలు మక్కువ పడేటట్లు చేయటం; తమ పరిశ్రమకు కావలసిన వస్తుసముదాయాన్ని పెద్ద ఎత్తున కొని దాని వల్ల లాభం పొందేటట్లు చూడటం; అలాగే తమ వస్తువులను తమ లాభం పెరిగేటట్లుగా పెద్ద ఎత్తున అమ్మటం ఈ మొదలైనవి పరిశ్రమలలోని మేనేజర్ల ప్రధాన కర్తవ్యాలు. అందువల్ల పెట్టుబడులను ఉత్పత్తులుగా మార్చే కృషిలో, కార్యకలాపాలలో పరిశ్రమలలోని మేనేజర్లకు చెప్పుకోతగ్గంత సంబంధం ఉండదు. పరిశ్రమలలో పెట్టు

బడులను ఉత్పత్తులుగా మార్చటం కేవలం యంత్రాల పని, లేదా యంత్రాలవలె చేసే పని మాత్రమే. కాని వ్యవసాయ విషయం అలా కాదు. మార్కెట్‌లో తనవస్తువులకు ఉన్న డిమాండ్‌కి అనుగుణంగా తన ఉత్పత్తిని సరఫరాచేయటం ఒక రైతుకి ప్రధాన సమస్య కానేకాదు. అంతేకాక రైతుల ఉత్పత్తులకు మార్కెట్‌లో డిమాండ్ పెంచడం పారిశ్రామిక రంగంలోనివారు చేసినట్లు కృత్రిమ ప్రయత్నాలుచేసి సాధించటం వీలయ్యే పనికాదు. పరిశ్రమలలోవలె కాక వ్యవసాయంలో కావలసిన పెట్టుబడులను మార్కెట్టులో నుంచి కొనవలసినవి చాలకొద్ది మాత్రమే. మిగిలిన అన్ని పెట్టుబడులు ఆ భూకమతం నుంచే సంపాదించవలసి ఉంటుంది. దీనికే జోరియన్ జెంక్స్ ఇలా చెప్పాడు. "ఉన్న ముడిపదార్థాలను విద్యుచ్ఛక్తి సహాయంతో క్రొత్త రూపానికి తెస్తూ పరిశ్రమలు పనిచేస్తుంటవి. కాని వ్యవసాయం అలాకాదు, తనకు కావలసిన ముడిపదార్థాలను శక్తిని కూడ అదే పెంపొందించు కోవాలి." * వ్యవసాయ దారుల ఉత్పత్తులలో కూడ కొంతభాగం మాత్రమె అమ్మటం జరుగుతుంది. కాబట్టి వ్యవసాయానికి కావలసిన పెట్టుబడులను, అమ్మకోవలసిన ఉత్పత్తులను బహుళార్థ సాధక సంఘాలద్వారానో లేక సహకార సేవా సంఘాలద్వారానో నిర్వహించుకొనే పక్షంలో పెద్దఖండాల సేద్యంకంటె ఎక్కువ ప్రయోజనాలు లభించ గలవు. కాబట్టి పెద్దఖండాల సేద్యంవల్ల తప్ప లభ్యం కాని ప్రయోజనాలు కొన్ని ఉన్న పక్షంలో అవి పెద్దఖండాల సేద్యానికి సంబంధించిన కృషిలో కనిపించవలసిందే కాని ఈపైన చెప్పుకొన్న ఇతర కార్యకలాపాలలో పెద్ద ఖండాలను తయారుచేసి సాగుచేసి నందువల్ల అదనంగా వచ్చే లాభా లేమీ ఉండవు.

ఇక వ్యవసాయంలోని ఆధిపత్యానికి పరిశ్రమలలోని ఆధిపత్యానికి ఉన్న వ్యత్యాసం పరిశీలిద్దాం. పరిశ్రమలలో ఆధిపత్యం అంటె పరిశ్రమలను వాటిలోని కార్మికులను సరిగా పనిచేసేటట్లు నిర్వహించ

* "The Homestead Economy" in "The small Farmer"— Edited by H. J. Massingham.

టమే. ఎందువల్లనంటె పరిశ్రమలు యాంత్రికంగా సాగిపోతుంటాయి; వాటిలో మార్పులేమి ఉండవు. వీటిని యజమాని తన ఇష్టం వచ్చినట్లు చేతికింద ఉంచుకొని పనిచేయించుకోవచ్చు. కాని వ్యవసాయం లోని ఆధిపత్యం ఇలాంటిది కాదు. వ్యవసాయంలోని ఆధిపత్యం చాల వరకు "ప్రకృతిసామ్రాజ్యానికి మానవునికి ఉండే సహజమైన సంబంధమే." ఇది ఎందువల్ల నంటె వ్యవసాయ కార్యకలాపాల ఆధిపత్యం జీవం ఉన్న పంటలతో మొక్కలతో సంబంధించినది. వీటిని యాంత్రికం చేయాలంటె కొన్ని కార్యకలాపాలు మాత్రమె యాంత్రికం చేసే వీలు ఉంటుంది. కనుక మనకు వ్యవసాయంలో కావలసినది సాంకేతికాధిపత్యం కాదు. 'ప్రేమ పూర్వకాధిపత్యం' పంటలకు మొక్కలకు జంతువులకు ఉన్న అవసరాలను సానుభూతితో అర్థం చేసికొనగల ప్రేమపూర్వకాధిపత్యం కావాలి. మంచి శ్రద్ధతో సజావుగా వ్యవసాయం చేయాలంటె భూమిలోని ప్రతి అంగుళం మేరమీద, పంటమీద శ్రద్ధతీసికోవటం అవసరమని మన కందరకు తెలిసిన విషయమే. కూలీలకు పనులు అప్పగించటంలో తెలివితేటలు ఉపయోగించినంత మాత్రాన సరైన ఫలితాలు రావు. పొలంలో అక్కడక్కడ అంతట-చెల్లాచెదరుగాఉండి పనిచేసే కూలీలలో కొద్దిమందిమీద మాత్రమే సరైన శ్రద్ధ తీసికొని పర్యవేక్షణ చేయటానికి వీలుఁటుంది. ఈ పర్యవేక్షణకూడ ఆ కూలీలతో పాటు కలిసిమెలిసి పనిచేస్తు ఉన్నప్పుడు మాత్రమె సరిగా సమర్థవంతంగా సాగుతుంది. నాటులు వేయటం, కోసి నూర్చుకోవటం కాక మిగిలిన అన్ని సమయాలలోను రైతు చేసేపని ఏమిటి? ఆ మిగిలిన కాలాన్ని రైతు తన మొక్కలను పంటలను జాగ్రత్తగా వ్యక్తిగతంగా గమనిస్తూ వాటి అవసరాలను గ్రహిస్తు, వాటిలోని పరిణామాలను తెలిసికొంటు పంటలను బిడ్డలవలె ఎంతో ప్రేమతో చూచుకొంటు పెంచుకొంటూ ఉంటాడు. ఇంతటి వ్యక్తిగత శ్రద్ధ తీసికొని పంటలను, భూములను, పశువులను వాటి అవసరాలు గ్రహించి అభివృద్ధి చేయాలంటె రైతుకి సొంతభూమి ఉండవలసిందే. కాబట్టి పరిశ్రమలలోనలెకాక వ్యవసాయంలో పెట్టుబడులు, ఆధిపత్యం, శ్రమ, సర్వము కలిసె ఉంటాయికాని ఒకదానిలో నుంచి ఒకదానిని

విడదీయటానికి వీలుండదు. ఒకవేళ వీటిని విభజించాలని ప్రయత్నం చేసి విడదీయటం జరిగిందో వ్యావసాయక సామర్థ్యం దెబ్బతినటం తప్పకపోవచ్చు. ఎందువల్లనంటే ఆ భూములు తన సొంతం కాక పోవటంచేత భూములమీద ఆధిపత్యం చేసే వ్యక్తికాని, భూముల మీద తానై ఆధిపత్యం వహించని భూకామందు కాని భూములకు పంటలకు అవసరమైన వ్యక్తిగత శ్రద్ధ తీసికొనే వీలుఉండదు. కాబట్టి తేలిన దేమంటే భూకమతాల విస్తీర్ణం పెరిగినకొద్ది వ్యవసాయాధిపత్యంలో కూడ కష్టాలు నష్టాలు పెరిగిపోతూనే ఉంటాయి. అందువల్ల వ్యవసాయంలో మనకు సామర్థ్యంగల రైతులు ఎక్కువమంది కావాలి కాని, కొద్దిమంది సాంకేతికాధిపతులు, పలువురు దినభత్యపు శ్రామికులుఉంటే ప్రయోజనం లేదు.

కనుక వ్యావసాయ కాధిపత్యంలోను పారిశ్రామికాధిపత్యంలోను వాటి నిర్వహణలోనే ప్రధాన భేదాలు ఉన్నవి. అందుచేతనే ఒక వ్యక్తి పెద్ద ఎత్తున ఆధిపత్యం నిర్వహించినందువల్ల పరిశ్రమలలో లభించినన్ని ఎక్కువ ప్రయోజనాలు విలువగల ప్రయోజనాలు వ్యవసాయ రంగంలో లభించవు. అంతే కాక ఆధిపత్య నిర్వహణలో ఉన్న భేదాలను బట్టి వ్యవసాయరంగంలో వ్యక్తిగత శ్రద్ధ పెరగటం కూడ అవసరమని తేలికగానే గ్రహించవచ్చు. వ్యవసాయంలో ప్రధానావశ్యకము ప్రకృతిసహజమైన ఆవశ్యకము భూమి కనుక ఈ రంగం వికేంద్రీకృతం కావటం అవసరం. పరిశ్రమలలో ప్రధానావశ్యకం ధనం కనుక అది ఎంతగా కేంద్రీకృత మైతే అన్ని లాభాలు వస్తాయి. పైగా ఈ పరిశ్రమలలో వ్యక్తిగత శ్రద్ధతో అవసరం కూడ లేదు. ఈ సూత్రం కొన్ని తాత్కాలిక సూత్రాలకు వర్తించక పోవచ్చు. ఉదాహరణకు గుట్లతో చెట్లతో అయోమయంగా ఉన్న భూములను సాగుకు యోగ్యమయ్యేటట్లు మార్చే కృషిని తీసికొందాం. ఈ పని చాల ధనవ్యయంతో కూడినది; పైగా పంటలను పెంచే అవసరం లేదు కనుక వ్యక్తిగత శ్రద్ధతో కూడ అవసరం ఉండదు; అంతేకాక ఈ పనులను రైతులు చిన్న చిన్న ఖండాలమీద వ్యక్తిగతంగా నిర్వహించుకొనేకంటె పెద్ద ఖండాలమీద అందరు కలిసి సహకార

సంఘాలద్వారా నిర్వహించు కోవటం తేలిక. పాలస్తీనాలోని యూదుల సంఘాలు దీనికి చక్కని ఉదాహరణ. కాని ఇది కేవలం తాత్కాలిక దశ మాత్రమె. ఆ భూములను సాగుకి యోగ్యమైన స్థితికి తీసికొనివచ్చిన తరువాత మామూలు సేద్యంలోవలె పంటలను పెంచటం మొదలైన సర్వకార్యకలాపాలు ఉండేవే! వాటిని వ్యక్తిగత వ్యవసాయం ద్వారానే వ్యక్తిగత శ్రద్ధతో నిర్వహించు కోవటమె లాభంగా ఉంటుంది. కనుక ఈ దశను దాటగానే వ్యక్తిగత వ్యవసాయం అవసరం గాక తప్పదు.

V

అయితే వ్యవసాయంలోని కనపడని ఖర్చులలో ఆధిపత్యంకూడ ఒకటి కాదా? అని ప్రశ్నించ వచ్చు. నిస్సందేహంగా ఆధిపత్యంకూడ వాటిలో ఒకటి; కాని భేదం ఉన్నది. పరిశ్రమలలో ఈ ఆధిపత్యాన్ని సరిగా వినియోగించుకొని తగిన లాభాలు పొందాలంటె ఈ ఆధిపత్య నిర్వహణ వస్తూత్పత్తికి సంబంధించిన కార్యకలాపాలలో కాక ఇతరమైన పనులలోనే ఉంటుంది; అనగా పరిశ్రమను నిర్వహించటంలో ఉంటున్న దన్నమాట. పారిశ్రామిక సంస్థను పెద్దఎత్తున పెంచిన కొందికి ఈ ఆధిపత్యం యొక్క ప్రయోజనాలు పెరుగుతుఉంటవి. కాని వ్యవసాయంలో ఇలా కాదు. వ్యవసాయంలోని ఆధిపత్యం ఉత్పత్తి కృషిలోనే ఉంటుంది; అలా ఉన్నప్పుడే దాని లాభాలు హేతుకి లభిస్తవి. కనుక ఈ ఆధిపత్యం ఎంత పెద్దఎత్తున నిర్వహించవచ్చు ననే విషయం ఆ యా వ్యవసాయ విధానాలమీద సాగుచేసే పద్ధతులమీద ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం మనం సాగుచేసే పద్ధతినే తీసికోండి; దానిలో ఆధిపత్యాన్ని సమగ్రంగా సంపూర్ణంగా వినియోగించు కోవాలంటె కొంత కనీసపు భూకమతం కావాలి. ఆ దశకు మించి భూకమతం పెరిగినప్పుడు ఈ ఆధిపత్యం కూడ అలా పెరిగి సామర్థ్యంతో కార్యకలాపాలను నిర్వహించలేదు. కాబట్టి ఆధిపత్యాన్ని సంపూర్ణంగా వినియోగించు కోవటానికి కూడ కొంత పరిమిత భూకమతాలు చాలు. ఆ పరిమిత భూకమతం ఎంత అనే విషయం మన వ్యవసాయ పద్ధతు

లనుబట్టి ఉంటుంది. మన వ్యావసాయక పద్ధతులలో మార్పులు వస్తే ఈ పరిమిత భూకమతాలలో కూడ మార్పులువచ్చి దాని కనుగుణంగా వీటి విస్తీర్ణం మారవలసి ఉంటుంది. అసలు కొన్ని సందర్భాలలో ఈ ఆధిపత్యాన్ని బట్టి భూకమతాల విస్తీర్ణం ఒక దశకు మించి పెంచటానికి వీలుకాని స్థితిగతులు కూడ ఉంటాయి. ప్రతి ఎకరాకు ఉత్పత్తిని అధికంచేయటం గురించి మనం ఆలోచిస్తున్నాం. కాని భూమిమీద ఇంతమంది శ్రమిస్తున్నారు. కాబట్టి ఇంత అధికోత్పత్తి సాధించాలనే విషయం గురించి మనం ఆలోచించటం లేదనే విషయం ఈ సందర్భంలో గుర్తుంచుకోవాలి.

ప్రస్తుతం మన వ్యవసాయం యంత్రాలతో నిమిత్తం లేకుండ ప్రాచీన పరికరాలతోను, పశువుల సహాయంతోను సంప్రదాయక పద్ధతులలో సాగుతున్నది గదా! ఇలాంటి పరిస్థితులలో ఎంతవిస్తీర్ణం కల భూమిని తగుమాత్రపు భూకమతంగా పరిగణించాలి? మన దేశంలోని సాధారణ కుటుంబాలలో ఒక కుటుంబం తన శ్రమనంతను పూర్తిగా వినియోగించటానికి ఆయా తరుణాలలో మాత్రం కూలీల సహాయం పొందుతు – తగినంత విస్తీర్ణంగల భూకమతాన్ని తగు మాత్రపు కమతంగా పరిగణించాలి. ప్రస్తుతం మన వ్యవసాయం ఎక్కువ భాగం మన కృషితోనే జరుగుతున్నది. మన దేశ పరిస్థితులనుబట్టి వ్యావసాయక పెట్టుబడులు కూడ భూమినుంచే రావలసి ఉన్నది; భూమిమీద చేసే సేద్యపు కృషి అంత ఇంచుమించు భూకామందు, (అనగా అధిపతి) అతని కుటుంబము మాత్రమె చేయవలసి ఉన్నది. కనుక ఈ పరిస్థితులలో పెద్దఖండాల మీద పెద్దఎత్తున సేద్యం నిర్వహించటం, ఆధిపత్యం వహించటం జరిగె అవకాశాలు లేవు. కాబట్టి కుటుంబకమతాన్నే తగుమాత్రపు కమతంగా పరిగణించవలసి ఉన్నది. ఈ కుటుంబ కమతాల ద్వారానే ప్రతి ఎకరాకు సాధ్యమైనంత అధికోత్పత్తిని రాబట్టగల అవకాశం ఉన్నది. ఈ అధికోత్పత్తి ఆయా ప్రాంతాల భూసారాన్నిబట్టి, పంటలనుబట్టి వ్యవసాయ పరికరాలనుబట్టి ఒకప్రాంతానికి మరొక ప్రాంతానికి మారుతుఉండటం కూడ సహజమే. కాబట్టి మనపరిస్థితులదృష్ట్యా, పద్ధతులదృష్ట్యాచూస్తే చిన్న

కమతాలలోనే-అంటే కుటుంబ కమతాలలో-ఆధిపత్యం సమగ్రంగా, సామర్థ్యంగా, లాభదాయకంగా ఉండగలదు.

కాని యాంత్రిక వ్యవసాయంలోని పరిస్థితులు వేరు. దానిలో మానవశ్రమకు పశువుల శ్రమకు బదులుగా యంత్రాలు ఉపయోగపడతాయి. అందువల్ల ఆధిపత్యంలో ఎలాంటి అసమగ్రత అసంపూర్ణత లేకుండానే కుటుంబ కమతాల కంటె పెద్ద కమతాలను నిర్వహించవచ్చు. దీనిని బట్టి యాంత్రిక సేద్యంలో భూకమతాల విస్తీర్ణాన్ని నిర్ణయించటానికి యంత్రాలే ప్రమాణం అని భావించరాదు. యంత్రాలనే ప్రమాణంగా గ్రహించి భూకమతాల విస్తీర్ణం పెంచాలంటె ఈ పెంచటానికి అంతు అంటు ఉండదు. పెద్ద పెద్ద యంత్రాలను ఉపయోగించిన కొందికి భూవిస్తీర్ణం పెరుగుతుపోవాలి కదా! కాని ఉత్పత్తి దృష్ట్యా ఆలోచించి నప్పుడు ఇలా యంత్రాలను బట్టి భూవిస్తీర్ణాన్ని నిర్ణయించటం కూడ ఒక దశకు వచ్చి ఆగిపోవలసింది. ఎందువల్ల నంటె ఉత్పత్తిదృష్ట్యా యంత్రాల పెరుగుదలను కూడ ఒక స్థితిలో అరికట్టవలసి ఉన్నది. ఆ దశను దాటి యంత్రాలను పెరగనివ్వకూడదు. ఇక అప్పుడు ఆ భూకమతాలకు అనుగుణమైన యంత్రాలను నిర్మించుకోవలసిందె కాని యంత్రాల కనుగుణంగా భూకమతాలను పెంచటం జరగదు. వ్యవసాయరంగంలో యంత్రాలు కొన్ని రకాల పనులకు మాత్రమే వ్యవసాయ కృషిలో ఉపకరిస్తవి. ఇక మిగిలిన కార్యకలాపాలను వ్యక్తిగత శ్రద్ధ తీసికొని జాగ్రత్తగా చేసికొనవలసిన పనులను వ్యక్తిగత ఆధిపత్యంతోనే రైతుగాని, అతని కుటుంబంకాని నిర్వహించుకోక తప్పదు. "బ్రిటిష్ వ్యవసాయ క్షేత్రాలలో ట్రాక్టర్లు సగటున 500 గంటలకు మించి ఉపయోగించ బడటం లేద" * ని చెపుతున్నారు. వ్యక్తిగతాధిపత్యాని కంటె ఈ యంత్రాలకు అధికప్రాధాన్యం ఇచ్చామో ఉత్పత్తి దెబ్బతినే ప్రమాదం ఉన్నది. రైతులు వ్యక్తిగత శ్రద్ధతో నిర్వహించ

* Enid M. Owen "Co-operative Mechanisation of the Small Farm" in the "year Book of Agricultural Co-operation—1949" Edited by the Horace Plunkett Foundation.

వలసిన కార్యకలాపాలలో తగినంత శ్రద్ధను, జాగ్రత్తను, ఉత్సాహాన్ని కనబరచక పోవటంవల్ల ఉత్పత్తులు పడిపోక తప్పదు. వాస్తవ ప్రపంచంలో కూడ ఇది మనం కళ్ళతో చూస్తున్నదే. యంత్రాలకు ఇవ్వగూడనంత ప్రాధాన్యం ఇచ్చిన దేశాలలో ఉత్పత్తులు కూడ దెబ్బతిన్నవి. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో ప్రొఫెసర్‌గా ఉండి, భూసారవినియోగం గురించిన విషయాలలో ప్రపంచ ప్రామాణికుడుగా గుర్తింప బడుతున్న డాక్టర్ యల్. డడ్లీ స్టాంప్ అనే ప్రవీణుడు పెద్దఖండాల సేద్యాన్ని గురించి వ్రాస్తూ, "అనేక యుగాల నుంచి నిల్వ అవుతు పరిరక్షింప బడిన భూసారాన్నంత మన పెద్ద ఖండాల సేద్యపు విధానాలు ఒక్క శతాబ్దంలోనే ధ్వంసం చేసి వేశాయి" అని అన్నాడు. భిన్నభిన్న దేశాలలోని భిన్నభిన్న సంవత్సరాలలోని ఉత్పత్తుల లెక్కల ఆధారంతో చిన్నకమతాల వ్యవసాయం వల్లనే ఉత్పత్తులు అధికంగా లభించాయని ఆయన రుజువు చేశాడు. యాంత్రిక వ్యవసాయానికి 100 ఎకరాల విస్తీర్ణంగల భూకమతం పరిమిత భూకమతం అని ఆయన అభిప్రాయం. ఆయనిలా వ్రాస్తున్నాడు. "(ఇతర విషయాలెలా ఉన్నా) సాధ్యమైనంత త్వరగా భాగ్యవంతులం కావాలన్న సూత్రాని కనుగుణంగా నేటి వ్యవసాయక యంత్రాలు నిర్మింప బడినవి. కాని కేవలం యంత్ర వ్యవసాయం కాక చిన్న కమతాలను సాగుచేసికొనే విధంగా మిశ్రమ వ్యవసాయం కావాలని నా అభిప్రాయం. ప్రపంచం మెల్లమెల్లగా ఈ దారిలోకే నస్తున్నదని నేను అనుకొంటున్నాను. ఈ నా అభిప్రాయం కనుక సరైనదైతే చిన్నకమతాలలో మంచి ఆధిపత్యంతో మిశ్రమ వ్యవసాయం చేసికోవటానికి అనుగుణంగా నేటి వ్యావసాయక యంత్రాలను సరిదిద్దుకొని నిర్మించుకోవాలి. అంతే కాని భారీయంత్రాలను సృష్టించుకొని వాటి కనుగుణంగా భారీక్షేత్రాలను తయారుచేసికోవటంవల్ల ప్రయోజనం ఉండదు. సరిగా అభివృద్ధి చెందని దేశాలలో యంత్రాలను ప్రవేశపెట్టేటప్పుడు ఈ సూత్రాన్ని ముఖ్యంగా అనుసరించవలసిన అవసరం ఉన్నది". వ్యావసాయక ఆర్థికవేత్త అయిన జోరియన్ జెంక్స్ కూడ ఇలాగే భావిస్తున్నాడు. అత

డేమంటాడో చూడండి. "శ్రద్ధగా సేద్యం చేయాలంటే చిన్న భూకమతాలే చాల సహజమైనవి, అనువైనవీను. మానవుని పరిమితులను ఆర్థిక వసతులను, ఇతర సాధన సంపత్తులను దృష్టిలో పెట్టుకొని చూచినప్పుడు పెద్దకమతాల కంటె చిన్నకమతాలే ప్రయోజనదాయకంగా ఉంటాయి. నేను ఈ అభిప్రాయానికి రావటానికి కారణం లేక పోలేదు. గడ్డి గాదం మొదలైన వాటినిల్ల జంతువుల మలమూత్రాల వల్ల లభించే ఎరువులు, ప్రేమపూర్వకాధిపత్యం వ్యవసాయానికి అత్యావశ్యకాలు. చిన్నచిన్న కమతాలు ఉన్నప్పుడే ఇవి సమృద్ధిగా లభించగలవు. అప్పుడే భూసారం పరిరక్షించ బడగలదు. భూకమతాల విస్తీర్ణం చిన్నదైనకొద్ది ఆ భూముల సారాన్ని సమగ్రంగా, జాగ్రత్తగా ఉపయోగించు కోవటం సాధ్యమవుతుంది" * ఇక మన దేశపరిస్థితులలో ఈ భూకమతాలు అంతకంటె చిన్నవిగా ఉండటమె మంచిదని చెప్ప నవసరం లేదుగదా! ఎందువల్లనంటె మనదేశంలో జనసంఖ్య అధికం, ధనవసతి మిక్కిలి తక్కువ; అందువల్ల మనదేశంలోని యాంత్రికవ్యవసాయంలో పైన చెప్పిన విదేశాలలో ఉన్నంత పెద్ద కమతాలు కూడ ఉండటానికి వీలులేదు. ఏమైనప్పటికి ఈ యాంత్రిక సేద్యం యొక్క భూకమతం మామూలు కుటుంబకమతం కంటె చాల రెట్లు పెద్దదిగానే ఉంటుంది. యంత్రాలు నచ్చినంతమాత్రాన అవి రైతులను తీసివేయలేవని, రైతులేకుండ వ్యవసాయం సాగదని దీనిని బట్టి తేలుతున్నది కదా! అంతేకాదు. ఒకదశను చేరుకొన్న తరువాత రైతుఅభివృద్ధికి, మనుగడకు అనుగుణంగా ఈ యంత్రాలను పునర్నిర్మించుకోక తప్పదు.

కాబట్టి తేలిన దేమిటి? ఆధిపత్యం అనేది వ్యవసాయంలోని కనపడని ఖర్చులలో ఒకటి. దానిని సమగ్రంగా వినియోగించుకోవాలంటె పరిమితమైన భూకమతం ఉండాలి, కాని ఈ పరిమిత భూకమతం యొక్క విస్తీర్ణం అప్పటికి ఉన్న వ్యవసాయపద్ధతులను ఆ పద్ధతులలో ఉపయోగింపబడుతున్న ఇతర పరికరాలనుబట్టి మాత్రమె నిర్ణయింప

* "The Homestead Economy" in "The small farmer" Edited by H. J. Massingham.

బడుతుంది. కాబట్టి పెద్దపెద్ద ఖండాల వ్యవసాయం కావాలనటానికి పెద్ద ఎత్తున ఆధిపత్యం వహించినందువల్ల ప్రయోజనాలు సిద్ధించ గలనటం కారణం కానేరదు. పైగా పెద్దపెద్ద యంత్రాలవల్ల పెద్దపెద్ద భూకమతాలు అవసరమవుతున్నవి. ఈ పెద్ద ఎత్తున సాగే వ్యవసాయం వల్లనే పెద్దఎత్తున ఆధిపత్యంకూడ అవసరమవుతున్నది. కాబట్టి భూకమతాల విస్తీర్ణానికి ఉత్పత్తికి ఉన్నదని చెప్పబడుతున్న సంబంధం వ్యవసాయపద్ధతులలో ఉపయోగిస్తున్న పరికరాలనుబట్టి మాత్రమే ఉంటున్న దన్నమాట. అంచె ఉత్పత్తి అధికం కావటానికి కారణం పెద్ద భూకమతాలు కాదు; వ్యవసాయంలో కూడ ఉపయోగించే పరికరాలనుబట్టి మాత్రమే ఉత్పత్తి పెరుగుతుందని గదా దీనిసారాంశం.

IV

సహకారసంఘాల ఆధిపత్యంలో ఉండే పరికరాల సాయంతో కొనసాగింపబడే సహకార వ్యవసాయంలో భూముల నన్నింటిని ఒకచోట చేర్చి ఏకం చేయటము, ఏకాధిపత్యము తప్పని సరిగా జరగవలసిందేనా? జాయింట్ స్టాక్ కంపెనీలు అనుసరించే సూత్రాల ప్రకారమే ఈ సహకార వ్యవసాయ సంఘాలను కూడ నిర్వహించవలసి ఉన్నదా?

ఈ సమస్యను గురించి ఒక అభిప్రాయానికి వచ్చే ముందు రెండు ప్రధాన విషయాలను గురించి ఆలోచించటం అవసరం.

(1) సహకార వ్యవసాయ సంఘంలో చేరిన సభ్యులు తమవంతు క్రింద తమకు ఉన్న భూములనే కాక తమ శ్రమను కూడ ఆ సంఘానికియ్యవలసి ఉంటుంది. భూమి రైతుకి కేవలం ఆదాయానికి మార్గం మాత్రమే కాక, వృత్తికి, ఆ వృత్తివల్ల లభించే స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు, భద్రతకు కూడ సాధనం. కనుక మనకు ఉన్న పరిస్థితులలో సహకార వ్యవసాయ సంఘంలో వాటా అంచె రైతుకి ఉన్న కుటుంబ కమతము, స్వతంత్రమైన రైతు, అతని కుటుంబము కూడ ఆ వాటాలో ఉన్నాయని గ్రహించాలి. మన దేశంలో రైతుని

భూమిని విడదీయగల అవకాశం లేదు. కాబట్టి మన సహకార వ్యవసాయసంఘం ఈ చిన్న చిన్న భూకమతాలను తనలో కలుపుకోవటమే కాక ఈ స్వతంత్రమైన రైతులను వారి వ్యక్తిగత శ్రద్ధను ఉత్సాహాన్ని కూడ తనలో చేర్చుకోగలిగేదిగా ఉండాలి. కాని మన ఆర్థిక వేత్తలు ఆర్థికేతర విషయాల ప్రాముఖ్యాన్ని ఆవశ్యకాన్ని పూర్తిగా విస్మరిస్తున్నారు. ప్రతివ్యక్తిని రోజువారి కూలిగా చేయవచ్చు నని సొంతసేద్యంచేసే రైతు వలెనే ప్రతి కూలివ్యక్తి ప్రతి పనిని చేయగలడని భావిస్తున్నాడు. ఈ అభిప్రాయం వాస్తవానికి దూరమైన కేవలం అపోహ మాత్రమే. సొంతసేద్యంవల్ల లభిస్తున్న అనేక ఆర్థికేతర ప్రయోజనాలను, స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను ధ్వంసం చేయకుండ రైతులను కూలీలుగా మార్చటం అసంభవం; అలాగే సొంతసేద్యంలో రైతు తీసికొనే జాగ్రత్త శ్రద్ధ ఉత్సాహం కూలీలుగూడ తీసికోగలరనుకోవటం కేవలం అనుకోవటం గానె ఉంటుంది కాని ఆచరణలోకి వచ్చేది కాదు. కాబట్టి పెద్దపెద్ద ఖండాల సేద్యాన్ని కూలీల నుపయోగిస్తు ఏకాధిపత్యంతో నిర్వహించ గలమా లేదా అనేది మన సమస్య కాదు. ఈ చెప్పబడుతున్న యంత్రాలను ప్రవేశపెట్టటానికి ముందు రైతులను కూలీలుగా మార్చటం అవసరమా అనేదే మన ప్రధాన సమస్య.

(2) ఇదినరకే చెప్పినట్లుగా వ్యవసాయరంగం పారిశ్రామిక రంగం వంటిది కాదు. వ్యవసాయంలో యంత్రాలను ప్రవేశపెట్టినప్పటికి వ్యవసాయంలోని సర్వకార్యాలను యంత్రాలు నిర్వహించలేవు. చాల కొద్దిపనులకు మాత్రమె యంత్రాలు ఉపకరిస్తవి. అదికూడ సంవత్సరంలో కొన్నిరోజులు మాత్రమె ఈ యంత్రాల అవసరం ఉంటుంది. కాబట్టి వ్యవసాయంలో రెండురకాలైన కార్యకలాపాలు ఉండటానికి స్పష్టమైన అవకాశాలు ఉన్నవి. ఇవి రైతులు నిర్వహించే కార్యకలాపాలు, యంత్రాలు చేయగల పనులు. వ్యవసాయ సామర్థ్యాన్ని చరమదశకు చేరేటంతవరకు పెంచుకోవాలంటే వీటి రెంటిని అభివృద్ధి చేసికోవలసిందె. ఒక దానిని వదలి రెండవ దానిని పెంచుకొన్నందువల్ల ప్రయోజం లేదు.

మన వారు చెపుతున్న నూతన సహకార వ్యవసాయ సంఘాలను ఈ రెండు అంశాలకు సమాన ప్రాధాన్య మిచ్చి రెంటి పెంపుదలకు అవకాశాన్ని కలిగించేటట్లుగా నిర్మించాలి. మన భూములను శ్రద్ధగా జాగ్రత్తగా సేద్యం చేయటం ప్రారంభించిన తరువాత మన దేశంలోని యాంత్రిక వ్యవసాయానికి కావలసిన పరిమిత భూకమతం యొక్క విస్తీర్ణం ఇతర దేశాలలోని యాంత్రిక భూకమతాల విస్తీర్ణం కంటె చాల ఎక్కువగానే ఉంటుంది. అమెరికాలో యాంత్రిక వ్యవసాయ కమతాల కంటె, రష్యాలోని 'కోల్‌ఖోజ్'ల కంటె మన దేశపు యాంత్రిక భూకమతం చిన్నదిగా ఉండక తప్పదు.

మన పరిస్థితులను అవసరాలను బట్టి ఈ యాంత్రిక భూకమతాల ఆర్థికవిధాన నిర్మాణం రెండు విధాలుగా చేయటానికి వీలున్నది.

మొదటిది : సహకార వ్యవసాయ సంఘంలో చిన్న చిన్న భూకమతాల రైతులు ఎక్కువ మంది ఉన్నప్పుడు ఆ యా యంత్రాలను రైతులు ఒక్కొక్కరు వ్యక్తిగతంగా కొని భరించలేనప్పుడు అసలు ఆ యంత్రాలు సంవత్సరంలో కొన్ని రోజులే కొన్ని పనులకు మాత్రమె ఉపయోగించేవి అయినప్పుడు ఆ యా వ్యవసాయ కార్యకలాపాలను రెండుగా విభజించ వచ్చు. ఈ పెద్ద యంత్రాలవల్ల చేసికొనే పనులు ఒకరకం, రైతులు తమ కుటుంబ కృషితో చేసి కొనే పనులు మరొక రకం. ఈ రెంటిలోను ఆ పెద్ద యంత్రాలను కొనటం, ఉపయోగించుకోవటం వరకు మాత్రమే సహకార వ్యవసాయసంఘ కార్యకలాపాలను పరిమితం చేయవచ్చు. ఇలా చేస్తే సొంత కమతాలు సొంతంగానే రైతుల యాజమాన్యంలోనే ఉంచుకోవచ్చు. సహకార వ్యవసాయసంఘం ఆ యంత్రాలకు సంబంధించిన పనుల వరకే పరిమితమై పని చేయవచ్చు. పెద్ద పెద్ద కమతాల సేద్యానికి సంబంధించిన అన్ని కార్యకలాపాలను ఏకాధిపత్యం నిర్వహించగలదా లేదా అనేది మనకు సమస్యకాదు. భిన్న భిన్న వ్యక్తులుగా సొంత సేద్యం చేసికొనే చిన్న చిన్న రైతులు తమ కార్యకలాపాలలో కొన్నింటిని సహకారపూరితంగా నిర్వహించుకోగల అవకాశాలు ఉన్నవా లేవా అనేదే మన సమస్య. రైతులు సొంతసేద్యంతో వ్యక్తి

గతంగా సామర్థ్యంతో నిర్వహించుకొనగల అనేక కార్య కలాపాలను జాయింటుగా నిర్వహించు కోవలసిన బహుకొద్ది కార్య కలాపాలతో ముడిపెట్ట వలసిన అవసరం ఏమిటి? యంత్రాలతో చేసికొన వలసిన ఈ కొద్ది కార్య కలాపాలను నిర్వహించు కోవటానికి భూములను ఒకచో చేర్చి పెద్ద పెద్ద ఖండాలను ఏర్పాటుచేసి ఏకాధిపత్యం స్థాపించవలసిన అవసరం సాంకేతికంగా ఏమీ కనిపించదు. ఈ కొద్ది కార్యకలాపాలను సహకారపూరితంగా నిర్వహించుకోవటానికి మాత్రం కలసి సంఘంగా ఉండవచ్చు. మిగతా పనులను నిర్వహించు కోవటానికి సహకార వ్యవసాయ సంఘంతో అవసరమే లేదు. రైతులు సహకార వ్యవసాయసంఘంయొక్క నియమాలకు, సంప్రదాయాలకు, చట్టాలకు ఆ కొద్ది కార్యకలాపాలకు సంబంధించినంతవరకు మాత్రమె లోబడిఉండాలి. అంతవరకు మాత్రమె సహకార వ్యవసాయసంఘ ఆజ్ఞలను అంగీకరించాలి. మిగిలిన పనులను రైతులు రైతులుగానే ఉంటు ఇరుగుపొరుగు రైతులతో కలిసిమెలిసి మామూలు సంప్రదాయక విధానాలతో, స్వేచ్ఛాస్వాతంత్రాలతో తమ భూములను తామె సాగుచేసికోవచ్చు. ఈ పెద్ద పెద్ద యంత్రాలను ఉపయోగించుకొనే టందుకు అనేకమైన చిక్కులలో పడవలసిన అవసరం లేదు. ఈ యంత్రాల ఉపయోగాన్ని ఆకాంక్షించి ఇన్ని చిక్కులు తెచ్చిపెట్టవలసిన అవసరం లేకుండానే వాటిని ఉపయోగించుకొనే అవకాశం ఉండగా దీనికోసం ఇంత రభస దేనికి? ఈ యంత్రాలను ఉపయోగించుకొనే విధానం గురించి ఒక ఉదాహరణను చూడండి : ఒక పట్టణంలో అనేకమంది వైద్యులున్నారనుకోండి. వారి వృత్తిలో వారికి అప్పుడప్పుడు అవసరమయ్యే ఒక పరికరం ఉన్నదనుకోండి. ఆ పరికరం ఖరీదు అత్యధికంగా ఉండటంవల్ల వైద్యులు దానిని సొంతంగా కొనలేరు. ఆ పరిస్థితులలో వారంతా కలిసి ఆ పరికరాన్ని కొనుక్కొని ఎవరికి అవసరం వచ్చినప్పుడు వారు దానిని జాగ్రత్తగా ఉపయోగించు కోనటం కోసం ఒక సంఘంగా ఏర్పడ్డారనుకోండి. సొంతంగా ప్రతి ఒక్కరు ఏర్పాటు చేసికోలేని ఆ ఒక్క పరికరం కోసమే వారు సంఘంగా ఏర్పడ్డారు. కాని అంతమాత్రంచేత వారు తమ వృత్తిని ఎవరికి వారుగా సొంతంగా చేసికోకుండ ఉమ్మడిగా

ఉండవలసిన అవసరం ఏమున్నది? ఒక మేనేజింగ్ డైరెక్టర్‌కి అతడు వైద్యం తెలిసినవాడు కావచ్చు, తెలియనివాడు కావచ్చు – లొంగి తమ వృత్తిని సాగించుకోవలసిన కర్మం ఎందుకు కలుగుతుంది? వ్యవసాయంలో కూడ ఇంతే! దీనికి రెండు కారణాలు ఉన్నవి.

మొదటి దేమంటే కొన్ని పంటలలోను, కొన్ని ప్రాంతాలలోను చాల కొద్ది పనులలో తప్ప యంత్రాలను ఉపయోగించే వీలు ఉండదు. ఉదాహరణకు తోటలు, కాల్వల క్రింద వరి పండించే ప్రాంతాలు చూడండి. ఈ రెండు ప్రాంతాలలోను ప్రస్తుత ఆర్థిక నిర్వహణ విధానాన్నే శాశ్వతంగా కొనసాగించవచ్చు. ఎందువల్ల నంటే వీటిలో ఎలాంటి అభ్యుదయకర విధానాలు వచ్చినా అవి రైతు యొక్క శక్తిసామర్థ్యాలు పెంచటానికి మాత్రమే ఉపకరిస్తవి కాని రైతు శ్రమను, యాజమాన్యాన్ని పూర్తిగా తీసివేయ లేవు. అంటే రైతు లేకుండ ఈ పనులను నిర్వహించటం అన్నది జరగదు. ఏ వైనా నూతన విధానాలు వచ్చినా అవి రైతుకి సహాయ పడేవి మాత్రమే కాని రైతును తొలిగించేవి కావు. కాబట్టి ఇలాంటి కార్యకలాపాలకు కుటుంబ వ్యవసాయం అత్యావశ్యకంగా ఉండి తీరవలసిందే.

ఇక రెండవ విషయం: వ్యవసాయ రంగంలో యంత్రాలను ప్రవేశపెట్టటం అంటే కూలీల అవసరాన్ని, పశువుల అవసరాన్ని తగ్గించివేయటమే. ఇందువల్ల నిరుద్యోగు లవుతున్న కూలీలను, వృథా అవుతున్న పశువులను, మన ఆర్థికవ్యవస్థ వ్యవసాయేతర రంగాలలో ఎంతవరకు ఇముడ్చగలదో అంతవరకే యంత్రాలను వ్యవసాయ రంగంలో ప్రవేశపెట్టాలి. నిరుద్యోగులైన కూలీలను, వృథాఅయిన పశుశక్తిని ఇతర రంగాలలో క్రమంగా వినియోగించుకోవటం క్రమంగా జరగవలసిన పని; ఒక్క రాత్రిలో తెల్లవారేసరికి దీనిని సాధించ లేము గదా! కనుక వ్యవసాయాన్ని కూడ దీనికి అనుగుణంగా క్రమంగా యాంత్రికీకరణ చేయవలసి ఉంటుంది. కాబట్టి వ్యవసాయంలోని పనులను క్రమంగా ఒకదాని తరువాత ఒకటి యంత్రాలతో చేయటానికి వీలవుతుంది కాని మొత్తం వ్యవసాయరంగాన్ని ఒకేసారి

యంత్రమయం చేయటం కూడని పని. అందువల్ల రైతువారీ ప్రాంతాలలో ఆ ప్రాంతాలు ఏ పంటలను పండించేవి అయినప్పటికి ఈ విధంగా క్రమ వికాసం పొందేసహకార వ్యవస్థను మనంనిర్మాణం చేసికోవచ్చు.

వాస్తవానికి ఈ విధానమె ఆచరణ సాధ్యంగా ఉంటున్నది. దీనిని అనేక దేశాలు ప్రయోగాత్మకంగా పరిశీలించి రుజువు చేశాయి. వ్యవసాయపు కార్యకలాపాలలో ఉపయోగించే యంత్రాలను వినియోగించుకోవటం కోసం ఏర్పడిన సంఘాలు కెనడా, స్విట్జర్లెండు, ఫ్రాన్సు, నెదర్లెండ్స్, గ్రీస్, సైప్రస్, ఆస్ట్రేలియా, ఇంగ్లండు, వేల్స్ దేశాలలో ఉన్నవి. పాలస్తీనాలోని చిన్నరైతుల సంఘాలు; స్వీడన్, బల్గేరియా, హంగరీ, యుగోస్లావియా, జెకోస్లవేకియా దేశాలలోని జాయింట్ సేద్యపు సంఘాలు; ఫిన్లెండులో వ్యావసాయక పరికరాలను జాయింటుగా కొని ఉపయోగించుకోవటం కోసం ఏర్పడిన సంఘాలు; చైనాలోని తాత్కాలికపు పరస్పరసంఘాలు; ఇవన్నీకూడ మేము చెపుతున్న సూత్రాల కనుగుణంగా నడుస్తున్న వాటిలో కొన్ని. ఈ సంఘాలన్నీ కూడ ప్రతి ఎకరంమీద అధికోత్పత్తిని సాధించటంలోను మిగులు ఉత్పత్తిని అధికంగా పెంచటంలోను ఇతర విధానాల కంటె మంచి మంచి ఫలితాలను ఇస్తున్నవి.

ఈ విధానం కానిపక్షంలో దీనికి ప్రత్యామ్నాయంగా ఉపయోగించదగు రెండవ మార్గం ఇది. సహకార వ్యవసాయ సంఘంలో చాల కొద్దిమంది రైతులు మాత్రమే ఉంటారనుకోండి. అప్పుడు సేద్యాలకు సంబంధించిన కార్యకలాపాలను యంత్రాలతో నిర్వహించవలసిన అవసరం కలుగుతుంది. అలా యంత్రాలతో సాగుచేయాలంటె ఆయా భూములను ఒకచోట చేర్చి పెద్దపెద్ద ఖండాలను ఏర్పాటు చేయవలసిన సాంకేతిక ఆవశ్యకత ఏర్పడిన ప్రాంతాలలోను, సందర్భాలలోను ఆ కొద్దిమంది రైతులు తమభూములను ఏకఖండంగా చేసి సర్వ కార్యకలాపాలను సహకారపూరితంగా నిర్వహించుకోవచ్చు. యంత్రాలను ఉపయోగించి నందువల్ల భూమిమీద ఆధారపడి జీవిస్తున్నవారిలో అధిక సంఖ్యాకులు నిరుద్యోగులవుతారు. కాని ఈ సందర్భంలో అసలు ఉన్న రైతులే కొద్దిమంది కనుక

యంత్రాలను ప్రవేశపెట్టటం ఈ సంబర్భానికి అనుగుణంగానే ఉంటుంది. కాని దీనివల్ల విషపరిణామాలు రావు. ఆ స్థితిలో వ్యవసాయంలో ఉండె కుటుంబాల సంఖ్య తగ్గిపోతుంది. కుటుంబ కమతాల విస్తీర్ణం పెరుగుతుంది. ఆ సంఘంలోని ఇతర సభ్యులు సాంకేతిక ప్రవీణులవుతారు. సహకార వ్యవసాయసంఘపు కమతంలోని కార్యకలాపాలను నిర్వహించే సభ్యులు కొద్దిమంది మాత్రమె అవటం చేత, ఆ సంఘసభ్యులు కొన్ని పనులను మాత్రమె కాక అన్నిపనులను సహకారంతో చేసికోవటం ప్రయోజనకారిగా, లాభదాయకంగా ఉంటుందని గ్రహిస్తారు. కేవలం యంత్రాల ఉపయోగం కొరకే స్థాపించ బడిన సహకార సంఘాలలో కొన్నిటికి ఇది రెండవదశగా ఉంటుంది. వ్యక్తిగత శ్రద్ధతో జాగ్రత్తతో అవసరం లేని పంటలకు, ఈ రెండవ విధానం ఉపకరిస్తుంది. ప్రతి ఎకరానికి ఎంత ఉత్పత్తిని సాధిస్తున్నా మనేది కాక, శ్రమిస్తున్న ప్రతి మనిషివల్ల ఎంత ఉత్పత్తిని రాబట్టుతున్నామనే దృష్టి నచ్చినప్పుడు కూడ ఈ రెండవ విధానం పనికివస్తుంది.

కాబట్టి సిద్ధాంతరీత్యా, ఆచరణదృష్ట్యా కూడ ఈ సమస్యను పరిశీలించి ఈ నిర్ణయానికి నచ్చాం. పెద్దఖండాల సేద్యము, శాస్త్రీయమైన ఆధిపత్యము 'మొత్తం ఉత్పత్తి'కి, ఉత్పత్తిదారుల మిగులు ఉత్పత్తిని అభివృద్ధిచేసినప్పటికి శాస్త్రీయమైన ఆధిపత్యం ఉండాలంటె పెద్దపెద్ద భూకమతాలు ఉండ నవసరం లేదు. పెద్దఎత్తున సేద్యం చేయటంవల్ల కలిగే లాభాలను పొందాలంటె భూములను ఒకచోట చేర్చి ఏక ఖండంగా చేయవలసిన అవసరం లేదు; ఏకాధిపత్యం కూడ అవసరం లేదు.

అధ్యాయం - 6

యాంత్రికీకరణ - సహకార వ్యవసాయం

ఇంతవరకు మన పరిశీలన వలన తేలిన విషయాలివి : పరిమిత భూకమతం యొక్క విస్తీర్ణం ఎంత ఉండాలి అనే విషయం చాల వరకు వ్యవసాయ పద్ధతులలోని పరికరాలను బట్టి నిర్ణయింప బడుతుంది. యాంత్రిక వ్యవసాయ విధానంలోనే ఈ వ్యవసాయ పరికరాలు సాధ్యమైనంత పెద్ద స్థాయిలో ఉంటాయి. కాబట్టి వ్యవసాయాన్ని యాంత్రికం చేయటం కోసమె పెద్దపెద్ద భూకమతాలు అవసరం అవుతున్నవి.

I

అయితే మన వ్యవసాయాన్ని యాంత్రికం చేయాలన్న ఉద్దేశంతోనే మన ప్రణాళికాకారులు సహకార వ్యవసాయాన్ని ప్రతిపాదిస్తున్నారా? అలా అయిన పక్షంలో మన ఆర్థిక విధానంలో మన వ్యవసాయాన్ని యాంత్రికం చేసి తీరవలసినంత తప్పనిసరి అవసరం కలిపించే విషయాలేమైనా ఉన్నవా? ఈ యాంత్రికీకరణ చేసినందువల్ల వచ్చే ఫలితాలను ప్రస్తుత స్థితిలో మనం ఎదుర్కొన గలమా?

యాంత్రికీకరణ అంటే సాధ్యమైనంత వరకు మన పొలాల మీద మానవుల శ్రమను, జంతువుల శక్తిను తీసివేసి ఆ పనులను యంత్రాలచేత చేయటం. ఇలా వ్యవసాయపు పనులకు తగినన్ని యంత్రాలు కావాలంటే ఈ యంత్రాలకు పెట్టుబడి పెట్టగల ధనం మన జాతీయ ఆర్థికవ్యవస్థనుంచి లభించాలి. ఇతర రంగాలలోని యంత్రాలకు వినియోగించేటంత ధనాన్ని వ్యావసాయక యంత్రాలకు కూడ వినియోగించటానికి వీలు కలగాలి. ఈ యంత్రాల ప్రవేశానంతరం నిరుద్యోగులయ్యే కార్మికులను, వృథా అయ్యే పశుశక్తిని ఇతర రంగాలు ఉపయోగించుకొనే పరిస్థితులు ఉండాలి. అంతేకాక

వీరివల్ల ప్రస్తుతం వస్తున్న ఉత్పత్తులకంటె ఎక్కువ ఉత్పత్తులను రాబట్టే విధంగా ఈ నిరుద్యోగులను, పశుసంపదను వినియోగించుకో గలిగి ఉండాలి. మన దేశ స్థితిగతులలో ఇది సాధ్యమా ? మన దేశం సరిగా అభివృద్ధిచెందిన దేశంకాదు; మనది ప్రజాస్వామిక రాజకీయ జీవితం; నియంతృత్వ విధానాలకు దూరంగా ఉండటమే మన ఆశయం. ఇలాంటి స్థితిగతులలో వ్యావసాయక పరిజలు తమ వ్యవసాయంకంటె ఆ ఇతరరంగాలలో మంచి వేతనాలు, లాభాలు, ప్రయోజనాలు వచ్చే అవకాశం ఉన్నప్పుడు మాత్రమే ఇతర రంగాలలోకి పోతారు. అలాగే వ్యవసాయంలో యంత్రాలకు పెట్టుబడులు పెట్టాలంటే ఆ పెట్టుబడి వల్ల ఇతర రంగాలకంటె ఎక్కువగాని కనీసం ఇతర రంగాలలో వచ్చి నన్ని లాభాలు, ప్రయోజనాలుగాని ఉంటేనే ధనం పెట్టుబడిపెడతారు. మన ఆర్థిక వ్యవస్థలో దీనికి తగిన అవకాశాలు లేని పక్షంలో వ్యవ సాయాన్ని యాంత్రికీకరణ చేయటం సాధ్యంకాదు. ఒకవేళ యంత్రా లను ప్రవేశపెట్టించినాఅందువల్ల తయారయ్యే నిరుద్యోగులను, వృథా అయ్యే పశుశక్తిని ఇతర రంగాలలో ఉత్పత్తి దాయకంగా వినియో గించుకోలేము. దానితో మన జాతీయ సంపదకు పెద్ద నష్టం వాటిల్లు తుంది.

II

ప్రస్తుత భారతదేశ వ్యవసాయ స్థితిని మనసులో పెట్టుకొని చూచే వారికి ఈ యాంత్రికీకరణవల్ల ఏర్పడే చిక్కులు తేలికగా అర్థం అవుతవి. మన భూముల మీద బ్రతక గలిగిన జనసంఖ్య కంటె ఎంతో ఎక్కువమంది ఇప్పుడు భూములమీద ఉన్నారు ; ఉండవలసిన దానికంటే ఎక్కువ ఒత్తిడి ఉన్నది. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాలతో మన దేశాన్ని పోల్చి చూచినప్పుడు మన దేశంలో భూములమీద ఎంత ఎక్కువ ఒత్తిడి ఉన్నదో తేలికగా బోధ పడుతుంది.

దేశం	మొత్తం జనసంఖ్యలో వ్యవసాయంలో ఉన్న శాతం	వ్యవసాయంలో ఉన్న ప్రజలలో తల ఒకటికి ఉన్న భూమి
గ్రేట్ బ్రిటన్	5.7	25.13 ఎకరాలు
అమెరికా	19.9	35.00 ,,
ఇండియా	69.8	1.18 ,,

మన భూమి మీద ఇంత అధికమైన ఒత్తిడి ఉండటంవల్లనే మన వ్యవసాయరంగంలోని ప్రజలకు చేతినిండ పని దొరకక సగం పని మాత్రమే లభిస్తున్నది. భారతదేశంలో ఐదుగురు సభ్యులుగల కుటుంబానికి సరిగా పని దొరకటానికి, కుటుంబాన్ని తగుమాత్రపు ప్రమాణంతో పోషించటానికి 10 ఎకరాల కనీసకమతం ఉండాలి అనుకొందాం. దీని ప్రకారం 1941 వ సంవత్సరపు జనాభా లెక్కలను అనుసరించి చూస్తే వ్యవసాయంలో ఉన్న ప్రజలకు 36.8% భూమి తక్కువవుతుంది. లేదా వ్యవసాయరంగంలో ఉన్న ప్రజలలో నూటికి 35 మంది అంటే భారతదేశపు మొత్తం జనసంఖ్యలో నూటికి 25 మంది భూకమతాలు లేని వారవుతారు. వీరి నందరిని ఇతరరంగాలు ఇముడ్చుకోవలసి వస్తుంది.

మన వ్యవసాయం మీద ప్రజలు అధికంగా ఉండటమె కాక పశువులు కూడ చాల అధికంగానె ఉన్నాయి. ఇలా అదనంగా ఉన్న పశువులను వ్యావసాయకోత్పత్తులతోనె పోషింప వలసి ఉన్నది. మన దేశంలో వలెనె వ్యవసాయంలో పశువులను విరివిగా ఉపయోగించె ఇతర దేశాలలోని పశుసంపదతో మన కున్న పశుసంపదను పోల్చి చూస్తే మన దేశంలో ఎన్ని ఎక్కువ పశువులు ఉన్నవో తేట తెల్ల మవుతుంది. భారతదేశంలో సాగులో ఉన్న ప్రతి 100 ఎకరాలకు పశుసాంద్రత సగటున 67, అదే భూమిమీద ఈజిప్టులో 25, చైనాలో 15, జపాన్‌లో 6 మాత్రమే ఉన్నది. 1951 వ సంవత్సరపు లెక్కల ననుసరించి మన దేశంలోని పశువులు సుమారు 36 కోట్ల 58 లక్షలు. వీటిలో మన వ్యవసాయాని కుపయోగించు కొంటున్నవి గేదెలు,

దున్నలు కలిసి 6 కోట్ల 73 లక్షలు మాత్రమే. ఈ అంకెలవల్ల మనకు ఎంత విస్తారమైన పశుసంపద ఉన్నదో తెలుస్తున్నది. అంతే కాక వ్యవసాయ కార్యకలాపాలకు ఎట్టి అవరోధాలు కలగకుండానే ఎంతటి పశుశక్తిని ఇతర రంగాలలో వినియోగించుకోవటానికి మనకు అవకాశాలున్నాయో కూడ బోధపడుతున్నది.

మన వ్యవసాయంలో మనిషి ఒక్కంటికి చాల తక్కువ ఉత్పత్తి జరగటానికి వ్యవసాయరంగంలో మిగులుగా ఉన్న జనులు, పశువులే కారణం. ఈ మిగులు ఉన్న మనుష్యులను, జంతువులను వ్యవసాయరంగంలోనుంచి తీసివేసినా వ్యవసాయోత్పత్తులలో ఎలాంటి మార్పులు ఉండవు; వ్యవసాయసామర్థ్యం దెబ్బతినటం కూడ జరగదు. దీని అర్థం ఏమిటి? ఈ మిగులు మనుష్యులు పశువులు ఉత్పత్తి చేసేదేమీ లేదని; పైగా వ్యవసాయంలో తిరిగి పెట్టుబడులు పెట్టి అభివృద్ధి చేసికోవటానికి వినియోగపడగల ఉత్పత్తి దానుల మిగులు వీరి పోషణకే హరించుకొని పోతున్న దని స్పష్టమవుతున్నది గదా! భూమిమీద ఒత్తిడి అధికం కావటంవల్ల భూమిని చిన్నచిన్న ముక్కలుగా చేసి పంచుకోవటంకూడ ఎక్కువవుతున్నది. మన దేశంలోని భూకమతాల సగటువిస్తీర్ణం 5 ఎకరాలు; ఇదే అమెరికాలో 174 ఎకరాలు, గ్రేట్ బ్రిటన్‌లో 83 ఎకరాలు ఉన్నది. ఈ చిన్న భూకమతం మీద ఆధారపడి ఉండే ప్రజలసంఖ్య ఎక్కువ. అందుచేత ఒక్కొక్క మనిషివల్ల ఎంత ఉత్పత్తి వస్తున్న దని పరిశీలిస్తే అత్యంత స్వల్పంగా కనిపిస్తుంది; అలాగే ఆదాయము లేదు. ధనం కూడబెట్టటం వీలు పడటం లేదు. కాబట్టి వ్యవసాయంలో తగినన్ని పెట్టుబడులను పెట్టే స్థితి కూడ వీరికి లేదు. వ్యవసాయానికి కావలసిన పెట్టుబడులను కావలసిన విధంగా పెట్టలేకుండ ఉండటం చేతనే ప్రాచీన పద్ధతులలోనే వ్యవసాయం చేయటం, ఎరువులను సక్రమంగా వినియోగించుకోక పోవటం జరుగుతున్నవి. వీటివల్ల చివరకు భూమినే సక్రమంగా వినియోగించుకోని పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రజలకు చేతినిండ పని చూపకుండ ఉండటంవల్ల భూమిని కూడ సరిగా పూర్తిగా వినియోగించుకోలేకుండ ఉన్నాం. ఇలా ప్రజలకు, భూమికి కూడ సరైన పని

చూపి సక్రమంగా వినియోగించుకొనలేక పోవటానికి వ్యవసాయంలో మనం పెట్టుబడులు పెట్టలేక పోవటం, వ్యవసాయం నుంచి ధనం రాబట్టి కూడబెట్టలేక పోవటము కారణం. కాబట్టి భూమిమీద అనవసరానికి మించి మిగులు ఉన్న ప్రజలను, పశువులను మరొక చోటికి తరలించాలి. అలా చేస్తే తప్ప వ్యవసాయరంగానికి వీరిని పోషించే భారం వదలదు; వ్యవసాయరంగంలో ధనం కూడబెట్టటానికి ఇది జరిగితే తప్ప అవకాశాలు లేవు. భూమిని అధికోత్పత్తి దాయకంగా చేయటానికి అవసరమైన కార్యకలాపాలలో పెట్టుబడులు పెట్టటం కోసం ధనం కూడబెట్టాలి; అంతేకాని వ్యవసాయ రంగంలోని మానవశ్రమకు జంతుశక్తికి మారుగా యంత్రాలను ప్రవేశపెట్టటానికి కాదు. కాబట్టి మన వ్యవసాయాన్ని యాంత్రికీకరణ చేసేముందు ఈ క్రింది రెండు విధానాలు అమలు జరగాలి.

మొదటిది, వ్యవసాయరంగంలో మిగులుఉన్న ప్రజలను, పశువులను ఇతర రంగాలు వినియోగించు కొనగలిగి ఉండాలి. ఇది జరగాలంటె మన జాతీయ ఆర్థికవ్యవస్థ బహుముఖా అభివృద్ధి పొందాలి; వ్యవసాయేతర రంగాలు బాగా పెరగాలి. వ్యవసాయంలో తగు మాత్రపు ప్రజలు ఉంటె ధనాన్ని ఎక్కువగా పెట్టుబడిపెట్టి భూమిని సక్రమంగా వినియోగించుకోవటం చాల వరకు చేతినిండ పని దొరుకుతుందనటం సత్యమే. కాని ఆ పెట్టుబడులకు కావలసిన ధనం ఎక్కడ నుంచి వస్తుంది? ఈ మిగులు మనుష్యులు, పశువులు భూములమీద, ఉత్పత్తిదారులమీద జీవించవలసినంత కాలం ఆ ధనం వ్యవసాయం వల్ల మాత్రం రానేరదు. కాబట్టి వ్యవసాయరంగంలో మంచి పెట్టుబడులను పెట్టాలంటె దానికి కావలసిన ధనం వ్యవసాయేతర రంగాల నుంచి రావలసి వస్తున్నది. వ్యవసాయేతర రంగాలనుంచి లభించగల ఈ ధనాన్ని, ఉత్పత్తులను పెంచి వ్యవసాయదారులకు సరిగా పని చూపించగల కార్యకలాపాలలో గాని, వ్యవసాయంలో మిగులు ఉన్న మనుష్యులను, పశువులను సరిగా ఉపయోగించుకొనగల వ్యవసాయేతర రంగాలలోకాని వినియోగించితే బాగా సద్వినియోగం అవుతుంది.

రెండవది, భూమిని సమగ్రంగా ఉపయోగించుకొని ప్రతి ఎకరాకు మొత్తం ఉత్పత్తిని అధికం చేయటానికి మనకున్న పెట్టుబడులను, అవకాశాలను పూర్తిగా వినియోగించుకోవాలి.

ఈ రెండు పనులను చేసిన తరువాత మాత్రమే మన వ్యవసాయాన్ని యాంత్రికీకరణ చేయటం గురించి ఆలోచించే అవకాశం ఉంటుంది. కనుక యాంత్రికీకరణ చేయటం అంత తేలికకాదు; యాంత్రికీకరణ చేయటంలో పెద్దపెద్ద భూకమతాలను ఏర్పాటు చేయవలసిన సమస్య, నిరుద్యోగసమస్య, పెట్టుబడుల సమస్య – ఇవన్నీ ఉన్నాయి. మన వ్యవసాయరంగంలో మిగులుగా ఉన్న ప్రజలను ఏమి చేయాలనే సమస్యను, వ్యవసాయ రంగాభివృద్ధికి కావలసిన పెట్టుబడులను ఎలా సమకూర్చుకోవాలి అనే సమస్యను గనుక మనం పరిష్కరించుకోగలిగితే–పెద్ద భూఖండాల సమస్యనుకూడ పరిష్కరించుకోగలం. వ్యవసాయ సేవాసహకారసంఘాలను నిర్మించుకొని వాటివల్ల పెద్ద భూఖండాల సమస్యను పరిష్కరించుకోవచ్చు.

వ్యవసాయాన్ని యాంత్రికీకరణ చేయటంవల్ల మన సంఘంలో ఎలాంటి కష్టనష్టాలు కలుగుతాయో గమనించటంకోసం ఇలా అనుకొని పరిశీలిద్దాం. అత్యంత అధునాతన వ్యావసాయకయంత్రాలు మనకు ఉచితంగా ఎలాంటి పెట్టుబడులు లేకుండానే లభించాయనుకొందాం. వాటితో వ్యవసాయాన్ని యాంత్రీకరణ చేశామే అనుకొందాం. దీనివల్ల మన శ్రామికులమీద ఎలాంటి ఫలితాలు కలుగుతాయి? వారిస్థితి ఎలా ఉంటుంది? మన ప్రణాళికాసంఘ సహాయ కార్యదర్శిగా ఉన్న శ్రీ తార్‌లోక్ సింగ్ గారు 1941 వ సంవత్సరపు జనాభా లెక్కల అంకెల ఆధారంతో – మన వ్యవసాయాన్ని యాంత్రికీకరణ చేసిన పక్షంలో ఒకకోటి 55 లక్షల మంది శ్రామికులు – అంటే గ్రామీణ జనసంఖ్యలో నూటికి 28 మందికి వ్యవసాయంలో పని లభించక వ్యవసాయం వదిలి మరొక చోటకు పోవటం తప్పనిసరి అవుతుందని అంచనా వేశారు. అమెరికాలో 100 బుషెల్స్ గోధుమను పండించటానికి 1830 వ సంవత్సరంలో 320 గంటల మానవశ్రమ అవసర మయ్యేది. 1900 సంవత్సరంలో అదే పరిమాణం

గల గోధుమను ఉత్పత్తి చేయటానికి 108 గంటల మానవశ్రమ అవసర మయింది; అదే పరిమాణంగల గోధుమను ఉత్పత్తి చేయటానికి 1950 సంవత్సరంలో 47 గంటల మానవశ్రమ సరిపోయింది. అంటే యాంత్రికీకరణ చేయటంవల్ల 110 సంవత్సరాలలో ఒక పరిమాణంగల గోధుమను ఉత్పత్తి చేయటంలో నూటికి 85.6 పాళ్ళవరకు మానవ శ్రమ మిగిలింది. సమష్టి వ్యవసాయం ప్రవేశపెట్టిన తరువాత రష్యాలో, గ్రామంలో అంతకుముందు ఉన్న 5 వేల కుటుంబాలకు ఆ తరువాత 674 కుటుంబాలు మాత్రమే ఉన్నవి. "యాంత్రిక వ్యవసాయంవల్ల పాశ్చాత్యదేశాలలో ప్రతిఒక్క యాంత్రిక కార్మికునివల్ల సగటున అయిదారుగురు వ్యవసాయకూలీలు వ్యవసాయరంగంనుంచి చెదిరి పోవలసి వచ్చింది. మన దేశంలో యాంత్రిక వ్యవసాయం ప్రవేశపెట్టినందువల్ల ప్రతిఒక్క యాంత్రిక కార్మికునివల్ల 4 గురు వ్యవసాయ కూలీలు వ్యవసాయరంగం నుంచి వెళ్ళిపోవలసి వస్తుం దనుకొన్నప్పటికి మొత్తం వ్యవసాయ శ్రామికులలో నూటికి 77.5 మంది ఇతర రంగాలలో పనిపాటలు సంపాదించుకో వలసి ఉంటుంది." *

ఇలా కాక మరొక విధంగా కూడ పరిశీలించి చూద్దాం. ఈనిరుద్యోగులైన కార్మికులకు ఇతరరంగాలలో పనిపాటలు చూపించ గలమే అనుకొందాం. కాని వ్యవసాయాన్ని యాంత్రికీకరణ చేయటానికి ఎంతో ధనం కావాలి కదా! దాని సంగతేమిటి? మనం ప్రస్తుతం వ్యవసాయాన్ని నిర్వహించుకోవటానికి పెడుతున్న పెట్టుబడి కంటె అనేక రెట్లు అధికంగా ధనరూపంలో వెచ్చిస్తేతప్ప ఈ యాంత్రికీకరణ చేయలేము. ఇది సర్వులకు తెలిసిన విషయమే! "భారతదేశంలోని వ్యవసాయ క్షేత్రాలను అమెరికా దేశంలోని క్షేత్రాల స్థాయికి తేవాలంటే ప్రస్తుతం భారతదేశంలో వ్యవసాయ నిర్వహణకు వెచ్చిస్తున్న ధనం కంటె ఎంత హీనంగా చూచినా ఐదురెట్లు అధికంగా వెచ్చించవలసి ఉంటుంది."

అందుచేత వ్యవసాయాన్ని యాంత్రికీకరణ చేయటానికి ప్రథమావశ్యకాలైన విద్య, సాంకేతిక పరిజ్ఞానం, ప్రవీణులు, గ్రామ

* G. D. Agrawal—Ibid.

ప్రాంతాలకు పుష్కలంగా విద్యుచ్ఛక్తి సరఫరా—ఇవి అన్నీ మనకు ఉన్నవనే అనుకొందాం! అయినప్పటికి యాంత్రికీకరణ చేయటానికి కావలసిన పెద్దపెద్ద పెట్టుబడుల విషయం, ఈ యాంత్రీకీకరణవల్ల తయారయ్యే నిరుద్యోగుల సంగతి ముందుగా ఆలోచించ వలసి ఉన్నది.

III

ఈ విషమ సమస్యకు పరిష్కార మార్గాలు ఏమైనా ఉన్న వేమో పరిశీలించే ముందు భిన్న భిన్న ఆర్థిక విధానాలు గల కొన్ని ఇతర దేశాలు ఈ మార్పును సాధించటంలో పొందిన అనుభవాలను గమనించటం మంచిది.

అప్పటిలో అమలులో ఉన్న స్థితిగతుల మీద వారసత్వపు హక్కుల మీద ఆధారపడి అభివృద్ధి చెందే కేపిటలిస్టు దేశాలలో భూఆస్తులలో విపరీతమైన ఎచ్చుతగ్గులు ఉండటం చేత ఈ పరిణామం తలెత్తక అయినది. ఈ దేశాలలోని చిన్న చిన్న రైతులు పెద్ద పెద్ద కేపిటలిస్టుల క్షేత్రాలకు తమ భూకమతాలను అప్పగించ వలసి వచ్చింది. అందుచేత పెద్ద పెద్ద క్షేత్రాలను ఏర్పాటు చేసి తద్వారా యాంత్రికీకరణ చేయటం సాధ్యమైనది. ఈ కేపిటలిస్టు దేశాలలో చిన్న చిన్న రైతులకంటె పెద్ద భూస్వాములకు ఆదాయం అధికంగా మిగిలేది. పెద్ద భూస్వాములకు తమ కుటుంబ ఖర్చులకుపోను అధికంగా ధనం మిగలటమే దీనికి కారణం. ఈ భూస్వాములు ఈ విధంగా మిగుల్చుకొన్న ధనాన్ని చిన్న రైతుల భూములను కొని తమభూకమతాల విస్తీర్ణం పెంచుకొనటానికి వినియోగించారు. చిన్న రైతులు ఉన్నంత కాలము వీరు ఇలాగే వారి భూములనుకొని వేశారు. ఇలా చేయటం వల్ల వీరికి ఒక లాభం ఉన్నది. అదేమంటే వ్యవసాయ రంగంలో యాంత్రిక విధానాలను ప్రవేశపెట్టి పెద్ద క్షేత్రాలను ఏర్పరచి సేద్యం చేయటం వల్ల వీరికి లాభాలు అధికంగా వచ్చేవి. కాబట్టి తమ వ్యవసాయాన్ని యాంత్రికీకరణ చేయటం వల్ల అధికంగా లాభాలు వస్తా

యన్న విశ్వాసం కలిగేటప్పటికే వారికి అందుకు అనువైన అవసర మైన పెద్ద పెద్ద క్షేత్రాలు, పెట్టుబడులకు కావలసిన ధనం వారి చేతులలో ఉన్నవి. ఆదాయం అధికంగా ఉండటం చేత ఈ పెట్టుబడు లకు కావలసిన ధనం కూడ వారికి సమకూడింది.

ఈ పాశ్చాత్య దేశాలలో వ్యవసాయాన్ని యాంత్రికీకరణ చేయటానికి అనువైన పరిస్థితులు అవసరాలు కూడ వారికి ఆ నాడు ఉన్నవి. ఆ యూ దేశాల ఆర్థిక చరిత్రలను పరిశీలించి నప్పుడు ఈ విషయం మనకు చక్కగా బోధపడుతుంది. ఆ దేశాలలో భూమి మీద ప్రజల ఒత్తిడి అంతగా లేదు. ఈ ఒత్తిడి లేకపోవటం వల్ల వ్యావసాయక నేద్యానికి కావలసిన శ్రమ కూడ తేలికగా లభ్యం కాలేదు. వ్యవసాయం మీద ఒత్తిడి లేకపోవటం చేత కాని లేక వ్యవ సాయ రంగంలో కంటె పారిశ్రామిక రంగంలో అధిక వేతనాలు లభించటం చేత కాని ఎక్కువ మంది భూములను వదిలి ఇతర రంగాలలో ఇమిడి పోయారు. అందుచేతనే ప్రథమ ద్వితీయ ప్రపంచ సంగ్రామాల మధ్య కాలంలో పాశ్చాత్య దేశా లలో వ్యవసాయ రంగాన్ని శీఘ్రంగా యాంత్రికీకరణ చేయటం జరిగింది. ఆ దేశాలలోని ఈ సామాజిక పరిస్థితులవల్లనే వారు ఇలా యాంత్రికీకరణ చేసినప్పటికి దాని వల్ల వారి ఆర్థిక సామాజిక రంగాలలో ఎట్టి విష పరిణామాలు, పరిస్థితులు కలగటానికి అవకాశం లేకుండ పోయింది. ఆ దేశాలు యాంత్రికీకరణ విధానాన్ని ప్రవేశపెట్టటానికి ఇదే కాక మరికొన్ని ప్రధాన కారణాలుకూడ సహాయ పడ్డాయి. ఆ దేశాలలోని పరిశ్రమలు తయారు చేసే వస్తు వుల వాడకం బాగా పెరిగింది; అనేక దేశాలలో వారి వారి పారి శ్రామిక వస్తువులు బాగా అమ్ముడు పోతున్నవి. ఇలా లాభం వస్తూ ఉండటం చేత ఆ ప్రధాన వస్తువుల ఉత్పత్తిని పెంచి అధిక లాభాలు పొందటానికి అవకాశాలు ఏర్పడినవి. తత్ఫలితంగా పరిశ్రమలు పెరిగి నవి. ఇలా పెరిగిన పరిశ్రమలలో పని చేయటానికి శ్రామికులు కావలసి వచ్చారు. అప్పటివరకు వ్యవసాయ రంగంలో ఉన్న శ్రామికులకు అధిక వేతనాలు ఇచ్చి వారిని ఆకర్షించగల ఆర్థిక స్తోమత ఈ పరిశ్రమ

లకు ఉన్నది. అందుచేత పరిశ్రమలు శ్రామికులకు అధిక వేతనాలు ఇచ్చి వ్యవసాయరంగంలోని పనివారిని పరిశ్రమల లోనికి తీసికొన్నవి. ఈ పరిస్థితులలో వ్యవసాయ రంగంలో తగినంతమంది పనివారు లేరు. పనివారిని సంపాదించాలంటే పారిశ్రామిక రంగంలో కంటె అధిక వేతనాలు ఇచ్చి వారిని ఆకర్షించక తప్పదు. అలా అధిక వేతనాలు ఇవ్వలేనప్పుడు యాంత్రిక విధానాలను ప్రవేశ పెట్టుకొని సేద్యం కొనసాగించు కొనటం తప్ప గత్యంతరం లేదు గదా! ఇక్కడ మరొక విషయం కూడ గమనించటం అవసరం. ఆ దేశాలు ఇలా యాంత్రికీకరణ విధానాన్ని ప్రవేశపెట్టుతున్న రోజులలోకూడ వారికి నిరుద్యోగ సమస్య అనేది లేనే లేదు. ఎందుచేతనంటే ఆ దేశాలు ఉత్పత్తిచేసే పారిశ్రామిక వస్తుజాలాన్ని అమ్ముకోవటానికి వారికి వలస రాజ్యాలు ఉన్నవి. ఈ వలస రాజ్యాలలో వారి వస్తుసామగ్రి అమ్ముకొనే అవకాశం ఉండటంచేత పారిశ్రామిక రంగం దినదినాభివృద్ధి పొందుతు ఎంతమంది శ్రామికులనైనా ఇముడ్చుకొన గలిగింది. వలస రాజ్యాలలో వారి వస్తువుల వాడకం పెరిగినకొద్ది దేశంలోని శ్రామికులకు పనిపాటలకు కొదవ లేకుండ దేశాల ఆర్థిక విధానం, పరిశ్రమలు పెరిగినవి. కాబట్టి ఈ పాశ్చాత్య దేశాలలో నిరుద్యోగ సమస్య అనేది అప్పట్లో లేకపోగా తమకు ఉన్న ప్రకృతి సహజమైన శక్తులను సంపదలను పూర్తిగా వినియోగించుకొని వ్యాపారం చేసి కొనటానికి శ్రామికులే తరుగు అయ్యారు. కాబట్టి ఆ దేశాలలో యాంత్రికీకరణ విధానాలు ప్రవేశ పెట్టటంలో ఆర్థికంగా ఎలాంటి బాధలు వారికి కలగ లేదు. సాంఘికంగాకూడ విషమ పరిస్థితులు ఏర్పడలేదు. ఆ దేశాలు ఈ యాంత్రికీకరణను ఇష్ట పూర్వకంగా గాక బాహ్యశక్తుల వల్ల ప్రవేశ పెట్టినప్పటికి పై కారణాల వల్ల ఆ దేశాలలో చిక్కులు కలగటానికి అవకాశం లేకపోయింది.

ఇక కమ్యూనిస్టు దేశాలను – ముఖ్యంగా రష్యాను చూద్దాం. రష్యాలో ఆర్థిక రంగం మొత్తం – భూమితో సహా – సమిష్టి పరం చేయటం వల్ల పెద్ద క్షేత్రాల నిర్మాణ సమస్యే ఆ దేశానికి లేదు. దేశంలోని భూములను మొత్తం సమిష్టి పరం చేయటం చేత ఎంత

విస్తీర్ణం గల క్షేత్రాలను ఏర్పరచు కొన దలిస్తే అంత క్షేత్రాలను ఏర్పాటు చేసికొనటం వారి కొక సమస్య కాదు గదా! అంతేకాక వారు అభ్యుదయ కృషికి ఆరంభించిన ప్రథమ దశలో వ్యవసాయ రంగంలో నిరుద్యోగం ఏర్పడటం కూడ వారికి సమస్య కాలేదు. ప్రజావసరాలకు కావలసిన వస్తుజాలాన్ని సృష్టించే పరిశ్రమల నిర్వహణకు, సాగుకు యోగ్యం గాకుండ ఉన్న భూములను సేద్యానికి యోగ్యం చేసే కృషిలో వినియోగించు కొనటానికి శ్రామికులు కావలసి వచ్చారు. వ్యవసాయ రంగంలోని శ్రామికులను తీసికొనివచ్చి ఈ అవసరాలకు ఉపయోగించు కొనటం ఎలాగా అనేదే వారికి సమస్య అయినది. వ్యవసాయ రంగాన్ని యాంత్రీకీకరణ చేయటానికి కావలసిన పెట్టుబడుల ధనం సేకరించటంలో కూడ వారికి చిక్కులు లేవు. బలవంతంగా పంటలను ప్రభుత్వం గ్రహించటం, ధరలను నిర్ణయించటం మొదలైన కార్యాల ద్వారా – రైతులకు కేవలం బ్రతకటానికి తగిన కనీసపు వసతులను మాత్రం కల్పించి వారి ఆదాయాన్ని మిగులును ప్రభుత్వం గ్రహించింది. ఇలా రైతులను మొట్టి సేకరించిన ధనాన్ని పెట్టుబడిగా వినియోగించి యాంత్రికీకరణ చేయటం జరిగింది. దేశంలోని ప్రధాన పరిశ్రమలు బలపడి ఫలవంతమై దేశ ఆర్థిక వ్యవస్థ యాంత్రిక వ్యవసాయాన్ని ప్రవేశ పెట్టినందువల్ల పనులు పోయిన శ్రామికులను ఇతర రంగాలలో ఇముడ్చు కొనగల స్థితి వచ్చే వరకు కూడ ఇలా రైతులను పీడించటం వారు మాన లేదు. రష్యా ఆర్థికాభ్యుదయాన్ని సూక్ష్మంగా పరిశీలించి నపుడు మనకు మరొక విషయం కూడ బోధ పడుతుంది. ఆ దేశంలోని పారిశ్రామిక రంగం శీఘ్రగతిని అభివృద్ధి పొందుతున్న రోజులలోను, కరువు కాటకాలకు, రాజకీయ విప్లవాలకు గురిఅయి ప్రజలు పల్లెలు వదిలి పట్టణాలకు నివాసాలు మారుస్తున్న కాలంలోను రష్యావారు వ్యవసాయంలో యంత్రాలను ప్రవేశపెట్టటం జరిగింది. క్రమ బద్ధమైన నిర్ణీత విధానాల ద్వారా వారు యాంత్రీకీకరణ విధానాన్ని ప్రవేశ పెట్టారు. ఆ దేశంలోని నియంతృత్వ విధానాల వల్ల, అధికార కేంద్రీకరణ మార్గాల వల్ల ఆ నిర్ణీత విధానాలను క్రమబద్ధంగా ఆచరణలో పెట్టటం వారికి సాధ్య మైంది.

కాని మన దేశం, మన పరిస్థితులు వేరు; అందుచేత ఆ దేశం యొక్క అనుభవాలు, పరిష్కార మార్గాలు మనకు అంతగా ఉపయోగ పడవు. వారు ఏ పరిస్థితులలో వ్యవసాయాన్ని యాంత్రికీకరణ చేశారో ఆ పరిస్థితులు మనకు లేవు. పైగా ఆ దేశంలో యాంత్రికీకరణను సుసాధ్యం చేసిన సంప్రదాయాలు విధానాలు కూడ మనకు లేవు. మన దేశంలో భూమి మీద ఆధారపడి జీవిస్తున్న వారి సంఖ్య అత్యధికం; ఇలాంటి సమస్య సందర్భం వారికి లేదు. అంటే అసలే లేదని కాదు. కాని మనకు భూమి మీద అధికంగా ఉన్నంత మంది వారికి లేరు. పైగా వారి సమస్య మన సమస్యకు పూర్తిగా విరుద్ధ మైనది; వ్యవసాయ రంగం లోని వారిని దిన దిన ప్రవర్ధమాన మవుతున్న పారిశ్రామిక రంగ అవసరాలను తీర్చటం కోసం మళ్ళించటం ఎలాగా అనేది వారికి సమస్య అయింది. పారిశ్రామిక రంగం ఒక దశ వరకు అభివృద్ధి చెంది వ్యవసాయ రంగంలో తగినంత మంది పని వారు లేని స్థితి ఏర్పడి నప్పుడే వారు యాంత్రికీకరణ విధానాన్ని ప్రవేశ పెట్టటానికి పూనుకొన్నారు. అంతే కాని వ్యావసాయకోత్పత్తులను అధికం చేయాలనే ఉద్దేశంతో మాత్రం వారు యాంత్రికీకరణకు పూనుకొన లేదు. మన దేశంలో వ్యవసాయ రంగంలో అవసరానికి మించి ఎంత ఎక్కువ మంది ఉన్నారో మనకు తెలుసు; ఈ అధికంగా ఉన్న వారికి వృత్తులను చూపించ గలట్లుగా మన పారిశ్రామిక రంగం పెంపొంద లేదు. ఈ పరిస్థితులలో మన వ్యవసాయాన్ని యాంత్రికీకరణ చేయవలసిన ఆవశ్యకత గాని, చేసినా వచ్చే ప్రయోజనం గాని లేదని దీనిని బట్టి బోధ పడుతున్నది గదా! అంతే కాక కేపిటలిస్టు దేశాలకు ఉన్నట్లు మనకు వలస రాజ్యాలు లేవు; మన ఉత్పత్తులకు విదేశాల మార్కెట్లలో వసతులు లేవు. అందుచేత మనకు ఇష్టం ఉన్నా లేకపోయినా యాంత్రికీకరణకు పూనుకొన వలసిన బాహ్య కారణాలు కూడ మనకు లేవు. ఇక రష్యాలోవలె మన దేశంలో నియంతృత్వ విధానాలు లేవు. వారి వలె మనది సంకుచిత ఆర్థిక వ్యవస్థ కాదు. కనుక రష్యాలో వలె కూడ మనం యాంత్రికీకరణకు పూనుకొన లేము.

సాంఘిక న్యాయం సంగతి అలా వదిలి మన దేశంలోని సంప్రదాయాలు సంస్థలు కూడ ఉన్న వ్యవస్థ ఉన్నట్లే ఉంచి అభివృద్ధి పొందటానికి అంగీకరించవు. పైగా మనము ప్రణాళికాబద్ధ మైన ఆర్థిక వ్యవస్థా స్థాపనకు పూనుకొన్నాం. ఈ క్రమబద్ధమైన ఆర్థిక వ్యవస్థను ఏర్పరచు కోవటం కోసం మన ప్రభుత్వానికి నిర్ణీతమైన కార్యక్రమాన్ని, మన ఆర్థిక వ్యవస్థపై అందుకు అవసరమైన అధికారాలను ఇచ్చాం. అయినప్పటికి కేవలం ఆర్థికాభ్యుదయం కోసం మన వ్యావసాయక ఆర్థిక వ్యవస్థను నియంత్రృత్వ విధానాల ద్వారా మనం సమిష్టి పరం చేయబోవటం లేదు. మన ఆర్థిక వ్యవస్థ ప్రజాస్వామిక విధానాలకు, సంప్రదాయాలకు లోబడి ఉండే మిశ్రమ ఆర్థిక వ్యవస్థ. కాబట్టి ప్రజాస్వామిక సంప్రదాయాలకు విధానాలకు అనుగుణంగా మాత్రమే మన ఆర్థికాభ్యుదయం జరగవలసి ఉన్నది. ఆ కారణం చేతనే మన వ్యవసాయాన్ని యాంత్రికీకరణ చేసే యత్నంలో మనం ఉపయోగించే విధానాలు కేపిటలిస్టు, కమ్యూనిస్టు దేశాల విధానాలకు పూర్తిగా భిన్నంగా ఉండవలసి ఉన్నది.

IV

మన పరిస్థితులకు, ఆశయాలకు తగి ఉండాలని మన ప్రణాళికా కారులు మన అభివృద్ధికి కొత్త రకమైన ప్రణాళికను తయారుచేశారు. మన ప్రణాళికాకారులు రూపొందించిన విధానాలను దృష్టిలో పెట్టుకొని మాత్రమే మనం ఈ యాంత్రికీకరణ ఎంతవరకు ఆచరణ సాధ్యమో ఎంతవరకు న్యాయ సమ్మతమో విచారించవలసి ఉన్నది.

మన ప్రణాళికా సంఘం వారు పారిశ్రామిక రంగంలో ప్రధానంగా ధనంపెట్టుబడి పెట్టి ఆర్థిక లాభాలు గడించ గల పరిశ్రమలకు ప్రాధాన్యం ఇచ్చారు. ఈ పరిశ్రమలు మన అభివృద్ధి త్వరితం కావటానికి సహాయ పడతాయి తప్ప ప్రజావసరాలకు వినియోగపడే వస్తూత్పత్తులను సాగించే పరిశ్రమల వలె ఎక్కువ మందికి పనిని కల్పించలేవు. మన ప్రణాళికాసంఘం వారు ప్రాధాన్యం ఇస్తున్న ఆర్థిక

లాభాలను గడించగల పరిశ్రమల వల్ల వెంటనే ఎక్కువ మందికి పనులు దొరకవు; ఈ పరిశ్రమలు దీర్ఘ కాలం సాగిన తరువాత మన ఆర్థిక వ్యవస్థలోని ఇతర రంగాలకు ప్రజలకు పనులను చూపించగలవు. మన దేశంలో దినదినం పెరిగి పోతున్న నిరుద్యోగ సమస్యను పరిష్కరించటానికి మన ప్రణాళికా సంఘం వేరొక మార్గాన్ని సూచించింది. శ్రామికులకు బాగా పని చూపించ గల వికేంద్రీకృత లఘు పరిశ్రమలకు కూడ ప్రణాళికా సంఘం పై పెద్ద పరిశ్రమలతో సమానమైన ప్రాధాన్యం ఇచ్చింది. అంతటితో ఆగక ప్రజలు డైనందిన జీవితంలో ఎక్కువగా వాడుకొనే వస్తువులను ఉత్పత్తి చేసే పెద్ద పరిశ్రమలకు తాత్కాలికంగా గరిష్ఠ పరిమితులను నిర్ణయించి, అంతకు మించి ఈ భారీ పరిశ్రమలు పెరగకుండ చూడాలని ప్రతిపాదించింది. ఇలా ఈ రెండు రంగాలలోను మన ధనాన్ని పూర్తిగా వినియోగించటం చేత...దీర్ఘ కాలిక లాభాల కోసం ఒక రంగంలోను, సాంఘిక న్యాయసాధన కోసం ఒక రంగంలోను—వెంటనే మనకు ఫలితాన్ని అందించగల పరిశ్రమల అభివృద్ధి దెబ్బ తినక తప్పదు. అంటే మన వారు చెపుతున్న ఈపారిశ్రామిక విధానం వల్ల మన దేశంలోని వస్త్ర పరిశ్రమలు మొదలైన యంత్ర పరిశ్రమలలో మన నిరుద్యోగులకు పనులు దొరకటానికి చాల కాలం పడుతుంది. శ్రామికులకు పని చూపించటమే ప్రధాన ఆశయంగాగల లఘుపరిశ్రమలు దేశంలోని నిరుద్యోగులకు వృత్తులు చూపించటమే ప్రధానాశయంగా ఉంచుకొని ప్రతిపాదింప బడినవి. గ్రామాలలోని వ్యానసాయ కేతర ప్రజలకు, పట్టణాలలోని వారికి ఈ లఘుపరిశ్రమలలో ముందుగా పనులు కల్పించాలని వారి ఆశయం. దేశంలోని ఒక కోటి 53 లక్షల నిరుద్యోగుల లోను 80 లక్షల మందికి మాత్రమే మన ద్వితీయ ప్రణాళిక పనులను చూపించగల దని అంటున్నారు. ఈ 80 లక్షలలో కూడ గ్రామీణ ప్రజల సంఖ్య 20, 24 లక్షల మధ్య మాత్రమె ఉంటున్నది. కాని మన గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం—చాలీచాలని పనులు ఉన్న వారిని సదలగా—90 లక్షల మంది నిరుద్యోగులను పోషించ వలసి ఉన్నది. ఈ 90 లక్షల మందిలోను 24 లక్షల మందికి ద్వితీయ ప్రణాళిక అదీ వ్యవసాయేతర వృత్తులలో—అంటే చేనేతవారు,

ఇతర చేతి వృత్తుల వారు—ఎక్కువ మందికి వృత్తులను కల్పించ గలదు. ఈ లఘుపరిశ్రమలు దేశంలోని నిరుద్యోగు లందరకు పనిని కల్పించ గల స్థితికి పెరిగేసరికి దేశంలోని ప్రధాన యంత్ర పరిశ్రమలు ఫల ప్రదాలై ఇక ఈ లఘుపరిశ్రమలు అంతకు మించి పెరగలేని స్థితిగతులు ఏర్పడ వచ్చు. ప్రధాన యంత్ర పరిశ్రమలు ఇలా పెరిగిన తరువాత మరొక సమస్య నస్తుంది. అదేమంటే ఆ స్థితి వచ్చిన తరువాత దేశంలోని లఘుపరిశ్రమలు దెబ్బతిని ఆ లఘుపరిశ్రమలలోని వారికి పనులు పోయి నిరుద్యోగులు అవుతారు. ఇక అప్పుడు ప్రజల అవసరాల కొరకైన వస్తువులను ఉత్పత్తి చేసే యంత్ర పరిశ్రమలే ఈ నిరుద్యోగులను ఇముడ్చు కొన వలసి ఉంటుంది. కాబట్టి మన ప్రణాళికా సంఘం వారి పారిశ్రామిక విధానాలన్నల్ల ప్రస్తుతం వ్యవసాయంలో ఉన్న మిగులు మనుషులను యంత్రపరిశ్రమలు అద్యతన భావిలో ఇముడ్చుకొనే అవకాశం లేదు. ఈ విధానం వల్ల మహా అయితే ఇప్పుడు చాలీ చాలని పనులున్న వారికి తగినంత పనిని చూపించ గలగ వచ్చు. ఇక వ్యవసాయేతర రంగాలు వ్యవసాయాభివృద్ధికి కావలసిన పెట్టుబడులను అందించ గలవా అంటే ఆదీ సాధ్యం కాదు. వ్యవసాయ రంగంలో పెట్టబడులకు ఎంత కటకటగా ఉన్నదో వాటిలో కూడ అలాగే డబ్బు కొఱత ఉన్నది. పైగా ఈ యంత్రపరిశ్రమలకు ప్రథమ దశలలో వ్యవసాయ రంగమె ధనం కూడ బెట్టి పెట్టుబడులను పెట్టవలసి ఉన్నది. కాబట్టి ఈ పరిశీలన వలన తేలిన దేమిటి? వ్యవసాయ రంగంలోని మిగులు మనుషులను తీసికొని వారికి పనులు కల్పించటంగాని, వ్యవసాయాభివృద్ధికి కావలసిన పెట్టుబడులను అందియ్యటం గాని పారిశ్రామిక రంగానికి అద్యతన భావిలో సాధ్యం అయ్యే పనులు గావు.

ఇక వ్యవసాయ రంగానికి సంబంధించిన మన విధానం ఒకటి ఉన్నది గదా! మనకు లభ్యమయ్యే సాధన సంపత్తులను భూములకు నీటి వనరులను కలిగించె ప్రాజెక్టులకు, చిన్న చిన్న నీటి వనరులకు, భూసార పరిరక్షణ కొఱకైన కృషిలోను వినియోగించాలని మన ప్రణాళికా కారుల విధానం. అంతేకాక ప్రస్తుతం సాగులోలేని భూము

లను సాగుకి యోగ్యం చేసి మన వ్యవసాయ భూముల విస్తీర్ణాన్ని పెంచుకోవాలని కూడ మన విధానం చెపుతున్నది. మనకు ఉన్న ధనాన్ని ఇలా వినియోగించకుండ పారిశ్రామిక రంగంలో వినియోగించే పక్షంలో మన పరిశ్రమలు తగినంత మందికి వృత్తులను కల్పించ గల విధంగా పెరుగుతాయి; కాని వెంటనే మాత్రం అందరకు పనులు చూపించలేవు. ప్రస్తుతం వ్యవసాయ రంగంలో ఉన్న నిరుద్యోగు లందరకు పనులు చూపించట మనేది పరిశ్రమలకు చాలకాలం వరకు కూడ సాధ్యంకాని పని. దేశంలోని ఈ నిరుద్యోగ సమస్యా నివారణకు మన ద్వితీయ పంచవర్ష ప్రణాళికను ప్రమాణంగా గ్రహించిన పక్షంలో వ్యవసాయరంగంలో ఇక అధికంగా పెరిగే జనాభాకు మాత్రమె మన ద్వితీయ పంచవర్ష ప్రణాళిక పనులను కల్పించ గలదు. ఈ విషయం గురించి మన ప్రణాళిక లోనే (68 వ పుటలో) ఇలా చెప్పారు. "భూమినుంచి ప్రజలను ఇతర రంగాలకు తరలించటం అనేది చాల దీర్ఘకాలం పట్టే విషయం. ద్వితీయ పంచవర్ష ప్రణాళికకు సంబంధించి నంతవరకు ఇప్పుడు భూమిమీద లభ్య మవుతున్న వృత్తులను ఇలాగే ఉంచ గలిగితే చాలు". మన వ్యవసాయంలో పెట్టుబడులు ప్రస్తుతం ఉన్న మిగులు మనుషులకు పనులను కల్పించే గాను, మన ఆదాయాన్ని పెంచేవి గాను ఉండవలసి ఉన్నది; కాబట్టి ఈ పరిస్థితి తప్పదు. మన వ్యవసాయ రంగంలో ఈ నిరుద్యోగ సమస్య నివురు గప్పిన నిప్పువలె ఉన్నంతకాలం మన ప్రభుత్వం యాంత్రికీకరణ విధానాలకు ధనం వెచ్చించి నందువల్ల ప్రయోజనం ఏమీ ఉండదు; అలా వెచ్చించిన ధనం ఉత్పత్తి దాయకమైన కృషికి తోడ్పడ లేదు; ఈ ధనాన్ని యాంత్రికీకరణకు కాక ఇతర విధాల ఉపయోగించి నప్పుడు ఇంత కంటె ఉత్పత్తి దాయకంగా వినియోగ పడుతుంది. ఈ పరిస్థితులను మనస్సులో ఉంచుకొని చూచినప్పుడు ఒక విషయం తేలికగా బోధ పడుతుంది; మన వ్యవసాయ రంగాన్ని యాంత్రికీకరణ చేయటానికి మన వ్యవసాయేతర రంగాలు కాని, ప్రభుత్వ సాధన సంపత్తులు కాని చాల వరకు అవకాశాలను కలిగించ లేకుండఉన్నవి. అంటే ప్రభుత్వ సంపదను, వ్యవసాయేతర రంగాలను బట్టి పరిశీలించి

నప్పుడు ఈ యాంత్రికీకరణ విధానం సాధ్యం కాదని, సాధ్య పడేటట్లు చేసినా ప్రయోజనకారి కాదని తేలుతున్నది గదా!

V

కాబట్టి వ్యవసాయ రంగంలో యాంత్రికీకరణ జరగాలన్న పక్షంలో వ్యవసాయదారులు వ్యవసాయం నుంచే అందుకు కావలసిన ధనాన్ని కూడబెట్టే ఉపాయాలను చూచుకోవలసి ఉంటుంది. ఈ యాంత్రికీకరణకు అయ్యే ఖర్చులను రైతులే తమ ఆదాయాల నుంచి వెచ్చించాలి; ఈ యాంత్రికీకరణ వల్ల నిరుద్యోగు లయ్యే వారికి పనులు కూడ తిరిగి వారే కల్పించాలి. మన క్షేత్రాల సాగును సహకార వ్యవసాయ విధానం క్రిందకు తెచ్చిన పక్షంలో ఈ రెండుపనులు కూడ చేయటం చాల సులువే అని మన ప్రణాళికా కారులు బయటకు ఆమాట అనకుండానే – విశ్వసిస్తున్నారు. వ్యక్తిగత సేద్యము, కుటుంబ వ్యవసాయము ఈ యాంత్రికీకరణ విధానాన్ని అమలుచేయలేవని అనుకొంటున్నారు. కాబట్టి వ్యవసాయాన్ని యాంత్రికీకరణ చేయటానికి సహకార వ్యవసాయమె ప్రథమ సోపాన మని భావిస్తున్నారు. కాని ఇక్కడ ఒక విషయాన్ని గమనించాలి. భూమిని కుటుంబ వ్యవసాయ విధానంతో సాగుచేసినా, ఉత్పత్తి దారుల మిగులు పెరగనిదే వ్యవసాయాదాయం పెరగదు గదా! పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే మన దేశ వ్యవసాయ రంగంలో ఈ ఉత్పత్తి దారుల మిగులు చాల స్వల్పం అని మనకు తెలిసిన విషయమె. మన దేశంలో అవసరానికి మించిన మిగులు మనుషులు వ్యవసాయంమీద ఆధారపడి ఉండటమె దీనికి కారణం. మన వ్యవసాయోత్పత్తులలో ఎలాంటి తగ్గు లేకుండానే ఎంతో మంది ప్రజలను మన వ్యవసాయంనుంచి మరొక చోటికి తరలించ వచ్చు. మన రైతుల ఉత్పత్తిదారుల మిగులు ఈ మిగులు మనుషులను పోషించటానికి ఎంత వ్యయం అవుతున్నదో ఈ విషయాన్ని బట్టి తేలికగా బోధపడుతున్నది గదా! న్యాయానికి ఈ మిగులు మనుషులను పోషించ వలసిన బాధ్యత ప్రభుత్వం వహించాలి.

మన వ్యవసాయంలో తగినంత పెట్టుబడులను పెట్టలేక పోవటానికి కారణం వ్యవసాయ దారులకు ధనం కూడబెట్టుకొనే అవకాశం లేకపోవటమే. గ్రామీణ ఋణ విచారణ నివేదికలో మన వ్యవసాయ రంగానికి 750 కోట్ల రూపాయిల ఋణం అవసరం అని అంచనా కట్టారు. కాని మా అంచనా ప్రకారం 2000 కోట్ల రూపాయిలు ఋణం కావాలి.

ఇక కాస్తో కూస్తో ధనం లభ్యం అయినప్పటికి ఆ ధనాన్ని వ్యవసాయంలో కంటె పరిశ్రమలలో వినియోగించి నప్పుడు అధిక లాభాలు కనిపిస్తున్నవి. కనుక పెట్టుబడి పెట్టగల వారు కూడ వ్యవసాయ రంగాన్ని వదిలి పట్టణాలకు చేరుతున్నారు. ఈ మధ్య కొంత కాలం నుంచి జరుగు తున్న విషయాలను చూస్తే గ్రామాలలో కూడబెట్టిన ధనం అనేక కార్యాల కోసం పట్టణాలకు చేరు తున్నట్లుగా గమనించ వచ్చు. ఈ ఉన్న ధనాన్ని కూడ వ్యవసాయం లోని మానవశ్రమకు బదులు యంత్ర శక్తిని ఉపయోగించటానికి వినియోగించె కంటె వెంటనే ఉత్పత్తిని అధికం చేయగల పనులకు వినియోగించి నందు వల్లనే ఆ ధనం ఫలప్రద మవుతుంది. పంటలకు కావలసిన నీరు, ఎరువులు మొదలైన ప్రధా నావశ్యకాలు తీరకుండానే ఉన్న ధనాన్ని మనుషులను తీసివేసే యంత్రాల కొనుగోలుకు వినియోగించటం ఎంత తెలివైన విధానమో ఆలోచించండి. పంటలకు కావలసిన అవసరాలను తీర్చుకోటానికి యంత్రాలను కొనుక్కొనటానికి సరిపడే ధనం లభించే ప్రాంతాలు ఎక్కడైనా ఉంటే ఉండ వచ్చు; కాని ఆ లాభం ఉన్నప్పుడు కూడ ఈ యంత్రాల కొనుగోలుకు పెట్టుబడి పెట్టటం వల్ల ఆర్థిక లాభాలు ఏమీ లేవు. ప్రస్తుతం మన దేశంలో మానవశ్రమ – అంటే కూలీలు – చౌకగా లభ్యమవు తున్నది. యంత్రాలను తెచ్చుకోవాలంటె దిగుమతి పన్నులు దేశంలో అధికంగా ఉండటం చేత ఎంతో ధనం పెట్టి యంత్రాలు కొనాలి. ఈ పరిస్థితులలో మానవ శ్రమతో సేద్యం చేసినా, యంత్రాలతో సాగు చేసినా వ్యవసాయ ఖర్చులలో మాత్రం

అట్టే భేదం ఉండదు. కాబట్టి యాంత్రికీకరణ విధానాన్ని ప్రవేశపెట్టి నందువల్ల మన వ్యవసాయ రంగానికి ఒరిగేది ఏమీ ఉండదు.

కాని మనకు ఇష్టం లేక పోయినా యంత్రాలపై ఉన్న మోజుని ఉత్సాహాన్ని పురస్కరించుకొని యాంత్రికీకరణ చేసినప్పటికి ప్రయోజనం మాత్రం పూజ్యమె! ఇందువల్ల మన మొత్తం ఉత్పత్తి కాని, నికరోత్పత్తి కాని ఏమీ పెరగదు. యాంత్రికీకరణ చేసినంత మాత్రం చేత మన వ్యవసాయపు ఖర్చులు మారేది లేదు గనుక ఉత్పత్తుల రూపంలో కూడ లాభం ఉండదు. నిరుద్యోగ సమస్య పెరగటం మాత్రమె దానివల్ల వచ్చే ఫలితం. అంటే ఇంత వరకు మనం వ్యవసాయ రంగంలోని శ్రామికులకు ధనం వెచ్చిస్తున్నాం. ఈ యాంత్రికీకరణ వల్ల ఈ ధనాన్ని శ్రామికులకు కాక ఆ యంత్రాల ఉత్పత్తి దారులకు చెల్లిస్తాం; ఫలితంగా అనేక ప్రజలకు వ్యవసాయ రంగంలో చోటు లేకుండ చేస్తాం.

ఏదైనా కొన్ని ప్రాంతాలలో యాంత్రికీకరణ వల్ల వ్యవసాయపు ఖర్చులు తగ్గే అవకాశం ఉండవచ్చు; అలాంటి సందర్భాలలో కూడ ఈ యాంత్రికీకరణ వల్ల నిరుద్యోగులు అయ్యేవారికి ప్రత్యామ్నాయంగా మరొక వృత్తి లభించే అవకాశం ఉన్నప్పుడు మాత్రమె ప్రభుత్వం ఈ యాంత్రికీకరణకు అంగీకరించాలి; లేనిపక్షంలో యాంత్రికీకరణపై ఆంక్ష పెట్టవలసి ఉన్నది. సాంఘిక దృక్పథంతో పరిశీలించి నప్పుడు వ్యవసాయపు ఖర్చులు తగ్గటం కంటె నిరుద్యోగులకు పనులు చూపించటమె ప్రధానం. దీనికి మన ప్రభుత్వ విధానాలలో ఒక ఉదాహరణ కూడ ఉన్నది. చేనేతవారి వృత్తులను రక్షించటం కోసం వస్త్రాలు తయారుచేసే కర్మాగారాలలో నూలును ఉత్పత్తి చేసే యంత్రాలను కొత్తగా ప్రవేశ పెట్టరాదని నియమం చేసింది. ఒక ప్రక్క చేనేతవారి వృత్తుల కోసం ఇలా చేస్తూ మరొక ప్రక్క భూమి లేని మన వ్యవసాయ కూలీల విషయమై అలాంటి శ్రద్ధ తీసికొనక పోవటానికి వీలులేదు.

ఈ పరిశీలన వల్ల నేటి స్థితిగతులలో మన వ్యవసాయాన్ని యాంత్రికీకరణ చేయటం నష్టదాయకం అని తేలినది గదా! కాబట్టి

నేటి స్థితిగతులలో మన జాతీయ సంపదను వృథా పరచగల యాంత్రికీకరణ విధానాన్ని ప్రోత్సహించి ఉత్సాహపరచటం న్యాయ సమ్మతం కాదు. ఈ యాంత్రికీకరణ విధానాన్ని ప్రవేశపెట్ట వలసిన స్థితి మన దేశానికి ఇంక రాలేదు. దేశంలో నిరుద్యోగ సమస్య నివారణ అయినప్పుడు మానవ శ్రమకు విలువ పెరిగి అధిక వేతనాలు చెల్లింప వలసిన స్థితి ఏర్పడి నప్పుడు యంత్రాల కొనుగోలుకు కావలసిన ధనం దేశంలో పుష్కలంగా లభించే వ్యవస్థ వచ్చినప్పుడు మనం ఈ యాంత్రికీకరణ విధానాన్ని ప్రోత్సహించ వచ్చు. కమ్యూనిస్టు చైనా కూడ ఈ విషయాలను విస్మరించలేక పోయినది. అందువల్లనే వారు తమ వ్యవసాయాన్ని ప్రస్తుతానికి యాంత్రికీకరణ చేయరాదని నిర్ణయం తీసి కొన్నారు.

VI

ఏమైనప్పటికి ఈ పై పరిశీలన వల్ల కొన్ని ప్రాంతాలలో యాంత్రికశక్తిని ఉపయోగించుకొనగల అవకాశాలకు తావు లేకుండ పోలేదు. మొట్టమొదటి దశలో పెట్టుబడులను పెట్టి వ్యవసాయం చేయించ వలసిన ప్రాంతాలు కొన్ని ఉన్నవి. ఆలాంటి చోట్ల ధనం అధికంగా వినియోగించ వలసి ఉన్నది. కాబట్టి ఈ యాంత్రికీకరణ సాంకేతికంగా అవసరం అవుతుంది.

వ్యవసాయానికి వినియోగపడ గల బంజరు భూములు భారత దేశం మొత్తంలో 17 కోట్ల ఎకరాలవరకు ఉన్నట్లు లెక్కలు తెలుపుతున్నవి. దీనిలో చాల భాగాన్ని తగిన ఏర్పాట్లు చేసికొన్న పక్షంలో సాగుకి యోగ్యం చేసికొన వచ్చు. ఇలా వృథాగా ఉన్న ఈ భూములను బుల్‌డోజర్లను ఉపయోగించి బాగుచేసికోవాలి; ట్రాక్టర్లను ఉపయోగించి చెట్లను గుట్లను తొలగించి కొద్దిపాటి ధనవ్యయంతో సాధ్యమైనంత తక్కువ కాలంలో సమతల భూములుగా చేసికోవాలి. ప్రతి సంవత్సరము బీటలు వేసి నిస్సారమై పోయే భూములు కూడ మనకు ఉన్నవి. ఈ భూములను పంటలకు యోగ్యమయ్యేట్లు రక్షించు కోవాలి. అధికవర్షాలవల్ల, భూమి ఏటవాలుగా ఉండటం

చేత, భూతత్వాన్ని బట్టి ఈ భూములు బీటలు వేయటం నిస్సారం కావటం జరుగుతూ ఉంటుంది. కరకట్టల వంటి మంచి కట్టలను వేయటం వల్ల భూసారాన్ని, నీటిని సంరక్షించుకొనవచ్చునని రుజువు అయింది. ఏటవాలుగా ఉన్న భూములను ఎక్కడి కక్కడ సమతల ప్రదేశం ఉన్నంత వరకు చిన్న చిన్న మళ్లుగా చేసికొని ఆ ఏటవాలుకి తగినట్లుగా పై కట్టలను నిర్మించుకోవాలి. ఇలా పెద్ద ఎత్తున కట్టలను పోసి కోవటం, కప్పలను నిర్మించుకోవటం వాటికి తగిన యంత్రాలను ఉపయోగించుకొన్న పక్షంలో మానవ శ్రమకంటె చౌకగా చేసి కొనవచ్చు.

ఇప్పుడు చెప్పిన ఈ పనులను మానవ శ్రమతోను, జంతువుల శక్తితోను నిర్వహించటం సాధ్యం కాదు; పైగా ఈ పనులకు పెద్ద ఎత్తున పెట్టుబడులను పెట్ట వలసి ఉన్నది కనుక వ్యక్తిగత వ్యవసాయదారులు చేయగలవి కూడ కాదు. ఈ పనులను విద్యుచ్ఛక్తి యంత్రాలవల్ల మాత్రమే చేసికొన వలసి ఉన్నది. మానవ శ్రమకంటె ఆ యంత్రాలే ఈ పనులను చౌకగాను త్వరగాను నిర్వహించ గలవు.

రెండవ విషయం ఏమంటె ప్రస్తుతం మన దేశంలో పంటలు పండని పొలాలు చాల ఉన్నవి. మనం మొదలు పెట్టిన నీటి వనరుల పథకాలు, ప్రాజెక్టులు కట్టటం పూర్తి అయిన తరువాత ఈ పొలాలలో మంచి పంటలే రావచ్చు. ప్రస్తుతం తగిన నీటి సదుపాయాలు లేని కారణం చేత ఈ పొలాలలో ఇంచుమించు పండేదేమీ కనిపించటం లేదు. ఇలాంటి పొలాలు వ్యక్తుల చేతులలో ఒక్కొక్క వ్యక్తికి వందలు వేలు ఎకరాలు ఉన్నవి. ఈ పొలాల వల్ల ఇన్ని వేల ఎకరాల యజమాని అనిపించుకోవటం తప్ప ఆ యజమానులకు రాబడి మాత్రం లేదు. ఇలాంటి భూముల మీద ఆధారపడి నివసిస్తున్న కుటుంబాలు చాలీచాలని జీవనభృతితో బాధ పడుతున్నవి. తగిన నీటి వనరులు కలిగించి ఇతర ఏర్పాట్లు కూడ కావించుకొన్న పక్షంలో ఈ భూములను సారవంతమైన క్షేత్రాలుగా చేసికొనవచ్చు. కాని ఈ కార్యక్రమం అంత పెద్ద పెట్టుబడుల మీద ధన వ్యయం మీద ఆధారపడి ఉన్నది. అందుచేత వ్యక్తిగత వ్యవసాయ

దాగులు ఈ పనులను చేపట్ట లేరు; చేపట్టరు. ప్రస్తుతం మనం ప్రారంభించిన బహుళార్థ సాధక నదీలోయ ప్రణాళికలు పూర్తి అయినప్పుడు 1 కోటి 90 లక్షల ఎకరాల భూమి అదనంగా సాగులోకి వస్తుందని అనుకొంటున్నాము.

ఈ పై చెప్పిన రకాలకు చెందిన భూములలో అత్యధిక భాగం ప్రభుత్వ భూములే. నేటి స్థితిగతులలోని సాధక బాధకాల కారణంగా ఈ భూముల మీద సుఖజీవనానికి సరిపడె రాబడి రాకపోవటం చేత చాల కొద్ది కుటుంబాలు మాత్రమె ఈ భూముల మీద ఉన్నవి. ఈ క్షేత్రాల సాగును యాంత్రికీకరణ చేసినందువల్ల మన నిరుద్యోగ సమస్య అదనంగా పెరిగేది ఎమీ లేదు. కనుక నీటి వనరుల ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి అయిన తరువాత ఇలాంటి భూములమీద యాంత్రికీకరణ విధానం అమలు చేయవచ్చు. ఇందువల్ల నిరుద్యోగం పెరగలేక పోగా అనేక వ్యవసాయ కుటుంబాలకు అదనంగా పనిపాటలు దొరికే అవకాశం ఏర్పడుతుంది.

కాబట్టి ఇలాంటి క్షేత్రాలను యాంత్రికీకరణ చేయవచ్చు; వీటిని యాంత్రికీకరణ చేయటంలో పెట్టుబడి ఎలా ఎక్కడనుంచి వస్తుంది అనేది ఒక్కటి మాత్రమే సమస్య. ఇంత పెద్దపెద్ద ముత్తాలను పెట్టుబడి పెట్టే దెవరు? ఈ పెట్టుబడుల వల్ల తమకు ఒక్కరికే కాక ప్రజలందరకు ప్రయోజనాలు వచ్చే టప్పుడు పెట్టుబడి ఎవరు పెడతారు? దీనికితోడు అసలు ఈ పెట్టుబడులు చాల పెద్దవిగా ఉండాలి కనుక వ్యక్తిగత వ్యవసాయదారులు పెట్టుబడి పెట్టగలిగే అవకాశం లేనే లేదు. కాబట్టి ఈ కార్యభారాన్ని ప్రభుత్వం మాత్రమే మోయగలదు; అంతకు తప్ప ఇతర వ్యక్తులు దీనిని సాధించలేరు. కాని మన ప్రభుత్వం అందుకు సిద్ధంగా ఉన్నదా? ప్రభుత్వం కూడ ఇతర రంగాలలో సంపాదించిన ధనాన్ని ఈ యాంత్రికీకరణకు ఇంత పెద్దఎత్తున వ్యయం చేయటానికి తగిన స్థితిలో లేకపోవచ్చు. ఈ యాంత్రికీకరణకు గాను ప్రభుత్వం వినియోగించిన పెట్టుబడులు ఈ భూముల నుంచి వెంటనే తిరిగి తన చేతికి వచ్చే అవకాశం ఉన్నప్పుడు మాత్రం ప్రభుత్వం పెట్టుబడి పెట్టగలదు. కాబట్టి ప్రస్తుతపు నీటి వనరుల పథ

కాలు పూర్తియై భూమిని సాగుకియోగ్యం చేసే పని పూర్తి కాగానే ప్రభుత్వం పెట్టిన పెట్టుబడులు తిరిగి చేతికి వచ్చే అవకాశం ఉంటే మాత్రం ప్రభుత్వం ఎంత పెద్ద పెట్టుబడుల కైనా సిద్ధం అవుతుంది. శ్రీ జె. యం. కేన్స్ కావించిన అద్భుత పరిశీలనల వల్ల పెట్టుబడులకు సరిపడే ఆదాయం ముందుగా ఉండవలసిన అవసరం లేదని ఆర్థిక శాస్త్రజ్ఞు లందరు ఇప్పుడు అంగీకరించారు; కేన్స్ కృషికి మా ధన్యవాదాలు. మొట్టమొదటలో పెట్టిన కొద్దిపాటి పెట్టుబడుల వల్ల సాధింప బడిన ఆధికోత్పత్తి కారణంగా మన ఆదాయం పెరుగుతుంది. ఇలా పెరిగిన ఈ ఆదాయాన్ని తిరిగి పెట్టుబడులకు గాను వినియోగింప చేయగల విధానం ఉన్నపక్షంలో ఆదాయం కంటె పెట్టుబడులే ముందుగా ఉండే అవకాశం ఉన్నది. కాని ఇలా చేయాలంటే క్రమబద్ధమైన విధానాలు ఉండాలి; వ్యక్తుల స్వేచ్ఛ కొంత వరకు తగ్గిపోవటం కూడ తప్పదు; వస్తువుల వినియోగంలోను ఆదాయంలోను ప్రజల స్వేచ్ఛ కుంచింప బడక తప్పదు. సమిష్టి ఆర్థిక వ్యవస్థ విధానాన్ని అంగీకరించిన దేశాలలో అన్ని రంగాలకు సంబంధించిన ఆర్థిక కార్య కలాపాలలోను ఈ సూత్రాన్నే వారు అనుసరిస్తున్నారు. మనం కూడ ఈ విధానాన్ని కొంత పరిమితం చేసికొని పైన వివరించిన సందర్భాలకు తాత్కాలికమైన ఏర్పాటుగా ఉపయోగించు కొనవచ్చు.

కాబట్టి ఈ ప్రభుత్వ క్షేత్రాల వ్యవసాయ నిర్వహణ ఆ భూముల అభివృద్ధికి సరిపడేటట్లుగా ఉండాలి; ఈ భూములలో ప్రవేశపెట్టే వ్యవసాయ పద్ధతులు ఈ సూత్రానికి అనువుగా ఉండాలి. ఈ భూములవల్ల వచ్చే ఉత్పత్తుల మీద, దాని వినియోగం మీద, ఆదాయం మీద ప్రభుత్వానికి అధికారం ఉండే విధంగా నిర్వహణ సాగాలి; వ్యవసాయ దారులకు కావలసిన ప్రకృతిసహజమైన ఉత్సాహం వారిలో ఉండే విధంగా వ్యవసాయ నిర్వహణ కొనసాగాలి. సహకార వ్యవసాయ సంఘాలను ఏర్పరచి ప్రభుత్వం ఈ పనులను నిర్వహించ గలదు. భూములు లేని వ్యవసాయ కూలీలు, చిన్నచిన్న భూఖండాల రైతులు ఇలా కొత్తగా సేద్యానికి తీసికొని వచ్చే భూముల మీద స్థిరపడే

టట్లుగా ప్రభుత్వం వారిని ప్రోత్సహించాలి; ఇలా ఈ భూముల మీద స్థిరపడటానికి వచ్చిన వాగికి ఈ భూములను సమానంగా పంచి ఇయ్యాలి. సహకార వ్యవసాయ సంఘాన్ని ఏర్పరచక ముందే వీరికి ఆ యా భూములకు సొంత పట్టాలు ఇయ్యాలి. ఆ యా కుటుంబాల వారికి ఇలా సొంత పట్టా లిచ్చి భూమిని సమంగా పంచిపెట్టటం వల్ల ఆ సభ్యులలో ఐక్యత, సమాన భావం ఏర్పడి సామరస్య వాతావరణం నెలకొంటుంది. వీరి సహకార వ్యవసాయ సంఘ ప్రథమ దశలలో ప్రభుత్వం పాల్గొని, అవసరమైన మూలధనాన్ని పెట్టుబడి పెట్టటంలో ప్రభుత్వం కూడ పాలు పంచుకొనవచ్చు; ఆ సహకారవ్యవసాయ సంఘ నిర్వహణకు సంబంధించిన అధికారాలను కూడ ప్రభుత్వమె తన చేతులలో ఉంచుకొనవచ్చు. ఆ భూములు సంపూర్ణంగా అభివృద్ధి చెంది మామూలు వ్యవసాయ భూముల స్థాయికి వచ్చే వరకు ఆ సంఘ సభ్యులకు కేవలం జీవన భృతికి సరిపోయే ఆదాయాన్ని మాత్రమే ఇయ్యాలి; అంతేకాక ఆ భూముల అభివృద్ధి ప్రణాళికల కోసం వినియోగించిన పెట్టుబడులు ఆ సహకారవ్యవసాయ సంఘానికి ఇచ్చిన ఋణాలు తిరిగి చేతికి వచ్చేటంతవరకు కూడ ఆ సభ్యులకు జీవన భృతికి మించిన ఆదాయాన్ని అంగీకరించరాదు. ఆ భూములు ఆ దశకు వచ్చి వాటి మీద పెట్టిన ఋణాలు తీరేవరకు ప్రభుత్వం ఆ సహకార వ్యవసాయ సంఘాల మీద పూర్తి అధికారం ఉంచుకోవటంలో అన్యాయం ఏమీలేదు; అంతవరకు ఆ సభ్యుల స్వాతంత్ర్యాన్ని ప్రభుత్వం నియమబద్ధం చేసినా తప్పు లేదు. ఈ పద్ధతి వల్ల ఆ సహకార వ్యవసాయ సంఘాలు భారీవ్యవసాయ నిర్వహణలో ఉండే కిటుకులు, సాంకేతిక పరిజ్ఞానం సంపాదించుకొనటానికి కూడ అవకాశం కలుగుతుంది. ప్రభుత్వం వీరి స్వేచ్ఛాస్వాతంత్ర్యాలపై ఇలా నిబంధనలు పెట్టినప్పటికి ఆ సభ్యులు దానివల్ల బాధపడేది ఏమీ ఉండదు. దానికి కారణం ఉన్నది. వీరందరు ఈ సంఘంలో చేరకముందు కూడ తమతమ యజమానుల ఆజ్ఞలకు లోబడి, వారి ఇష్టానిష్టాలను బట్టి వారి క్రింద దినభృత్యానికి పనిచేసే కార్మికులే; అంతకు ముందు కూడ వీరికి జీవనభృతికి మించిన ఆదాయం లేనేలేదు కదా! కనుక ప్రభుత్వ పర్యవేక్షణ వల్ల వీరు బాధపడి మానసికోత్సాహం కోల్పోయే అవ

కాశం లేదు. పైగా వీరు ఈ విధానంలో అత్యుత్సాహంతో పాల్గొని ఆ భూములను సాధ్యమైనంత త్వరలో అభివృద్ధి చేయటానికి తాపత్రయ పడతారు. ఆ భూములు అనతి కాలంలోనే — ఋణాలు తీరిన వెంటనే—తమ సొంత భూములు అవుతాయని, తాము సర్వ తంత్ర స్వతంత్ర జీవనులు కాగలరని వారికి విశ్వాసం ఉండటం వల్ల ఈ ఉత్సాహం సాధ్య మవుతుంది. ఇలాంటి ఏర్పాటు కనుక మనంచేసి కొన్న పక్షంలో దీని వలన మన వ్యవసాయ రంగానికి కావలసిన రెండు విధాలైన ప్రయోజనాలు కూడ కలుగుతాయి; ఒక వైపున సహకార వ్యవసాయ విధానంలోని ప్రయోజనాలు సిద్ధిస్తవి. మరొక వైపున రైతుస్వామ్యంలో ఉండే సహజమైన ఉత్సాహం, ప్రోత్సాహం ఆ సభ్యులకు లభిస్తవి. ఇలా కొంతకాలం సాగిన తరువాత ఆ భూములు స్వయంపోషకాలు అవుతాయి. ఆ దశ వచ్చిన తరువాత సహకార వ్యవసాయ సంఘం నుంచి ప్రభుత్వం క్రమంగా తప్పుకొన వచ్చు; ఆ సంఘ సభ్యులే దాని వ్యవహారాలను నిర్ణయించుకొని కృషి చేసికొన గల స్వాతంత్ర్యం వారికి ఇచ్చివేయ వచ్చు. అంతటితో ఆగక ఆ యా కుటుంబాలు ఇష్టం ఉన్న పక్షంలో తమ భూముల మీద తామే సొంత సేద్యం చేసి కొనటానికి కూడ అవకాశం కలిగించ వచ్చు. అలా సొంత సేద్యం చేసికొన దలచిన వారు యంత్రాల కోసము, ఇతర పెద్దపెద్ద పరికరాల కోసము, వ్యావసాయ కోత్పత్తుల అమ్మకానికి, తమకు కావలసిన ఎరువులు మొదలైన వాటి కొను గోలుకు సంబంధించిన వ్యవహారాలలో సహకార వ్యవసాయ సంఘాన్ని వినియోగించు కొంటు తమ భూములను తామే సేద్యం చేసికొన వచ్చు. అంటే ఆ ఉన్న సహకార వ్యవసాయ సంఘాన్ని సహకార సేవా సంఘంగా మార్చుకొని సేద్యం మాత్రం సొంతంగానే చేసికొన టానికి కూడ ప్రభుత్వం అభ్యంతరం పెట్టగూడదు. సహకార వ్యవసాయాన్ని ఈ విధంగా ఇలాంటి సందర్భాలలో మాత్రమె కొన్ని ప్రత్యేక ప్రయోజనాల కోసం తాత్కాలిక విధానంగా మనం వినియోగించు కొనవచ్చు. అంతేకాని ఆ విధానాన్ని వ్యవసాయ

రంగానికి మొత్తానికి అన్వయించి దానిని శాశ్వత విధానంగా చేయటం మాత్రం కూడని పని.

ఈ పైన చెప్పిన విధంగా సహకార వ్యవసాయాన్ని ప్రవేశపెట్టటానికి తగిన ప్రాంతాలు అధికంగా లభ్యం అయినప్పుడు అనేక దేశాల వారు ఆ యా సన్నివేశాలలో ప్రయోగాలు చేసి పొందిన భిన్నభిన్న అనుభవాలను మనం మన సమస్యా పరిష్కారానికి వినియోగించు కొనవచ్చు. అమెరికా దేశంలో ఇలాంటి ఉదాహరణ ఒకటి ఉన్నది. 1929–32 సంవత్సరాల మధ్య అమెరికాలో ఏర్పడిన ఆర్థిక మాంద్యంవల్ల కొద్ది కొద్ది ఆదాయాలు లభించే చిన్న చిన్న రైతులు అనేకులు కోలుకొనలేని దెబ్బతిన్నారు. అమెరికాలోని వ్యావసాయక భద్రతా పరిపాలక సంఘం (Farm Security Administration) దేశంలో చెల్లాచెదరుగా ఉన్న ఈ చిన్న రైతుల నందరను ఏకంచేసి వీరికోసం ప్రత్యేకంగా 22 సహకార వ్యవసాయ సంస్థలను పెట్టింది. ఈ సంస్థలు మామూలు రైతువారి వ్యవసాయంతో ఎలాంటి సంబంధం లేకుండ స్వతంత్రంగా ఏర్పరచ బడ్డాయి. కాస్తో కూస్తో భేదం ఉన్నప్పటికి ఇంచుమించు ఇలాంటి సందర్భాలలోనే ఇంగ్లండు, ఆర్జెంటీనా, చిలీ, కొలంబియాలలో కూడ అనేక ప్రయోగాలు కావింప బడ్డాయి. 1940 సంవత్సరంలో మెక్సికోలో సమిష్టి సూత్రాన్ని అనుసరించి 'ఎజిడోస్' అనే పేరుతో కొన్ని సంఘాలు ఏర్పరచటం జరిగింది. అప్పట్లో ఆ దేశంలో అమలులో ఉన్న జమీందారీ విధానం క్రింద నలుగుతు ఇంచుమించు దాస్యంలో మగ్గిపోతున్న చిన్న రైతులను సంరక్షించాలనే ఆశయంతో ఈ 'ఎజిడోలు' స్థాపింప బడినవి. 'వ్యావసాయక చట్టం' (Agrarian code) ప్రవేశపెట్టి జమీందారుల నుంచి లాక్కొన్న భూముల మీద ఈ ఎజిడోలను వారు స్థాపించారు. దేశంలోని నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలనే తలంపుతో ఇటలీలో జాయింట్ వ్యవసాయ సహకార సంఘాలను వారు స్థాపించుకొన్నారు. ఈ సంఘాలకు దేశంలోని కార్మికులకు వృత్తులను చూపించి నిరుద్యోగాన్ని రూపుమాపటమె ప్రధాన ఆశయం. అందుచేతనే ఈ సంఘాలు దేశంలోని బీడు భూములను సాగుకు యోగ్యం చేసే కార్యక్రమాన్ని

చేపట్టినవి; అంతటితో ఆగక ఆ సంఘ సభ్యులు తాము బాగుపరచిన భూములను ఆ తరువాత కూడ వారే సాగు చేసికొన్నారు. ఈ విధంగా అనేక దేశాలలో ఇలాంటి సంఘాలు ఏర్పరచు కొనటం జరిగింది. కాని ఈ సంఘా లన్నింటిలోను కూడ ప్రథమంలో వాటి నిర్వహణాధికారం ప్రభుత్వం చేతులలోనో లేక అందుకోసం ప్రభుత్వం ఏర్పరచిన సంఘాల చేతులలోనో మాత్రమే ఉంచుకోవటం జరిగింది. ఇలా అధికారాన్ని శాశ్వతంగా ప్రభుత్వమే ఉంచు కోవాలి అనేది మాత్రం వారి ఆశయం కాదు; ప్రాథమిక అవసరాలు తీరిన వెంటనే ఆ యా సభ్యులకు రైతులకు ఉండే సర్వహక్కులు ఇచ్చి వేసే తలంపుతోనే వారు ఇలా చేసికొన్నారు. ఆ యా అవసరాలు తీరి, క్లిష్టపరిస్థితులు తొలగి పోయిన వెంటనే ఈ పైన చెప్పిన దేశాలలోని సంఘాలను రద్దుచేసి ఆ భూములను ఆ సభ్యులకు పంచివేసి వారే వాటిని స్వయంగా సేద్యం చేసికొనటానికి సర్వతం త్రాధికారాలు వారికి ఇచ్చివేయటం జరిగింది.

మన దేశంలో కూడ ఇలాంటి భూములమీద ఇదే విధంగా ఏర్పాటు చేసిన సహకార వ్యవసాయ సంఘాలు అనేకం ఉన్నవి. కాని మన దేశంలోని సంఘాలు ఇంచుమించు అన్ని కూడ అనుకొన్న ఫలితాలను ఇవ్వలేక విఫలం అయినవి. దీనికి కారణం మన సహకార వ్యవసాయ సంఘాలలో ఈ పైన చెప్పిన ఇతర దేశాలవారి ఆశయాలు, దృక్పథం లేకపోవటమె. మన దేశంలోని చాల సంఘాల విషయంలో ప్రభుత్వం తగినంత బాధ్యతను నెత్తిని వేసికొని ఆ సంఘాలకు కావలసిన సహాయ సంపత్తులను అందించటం జరగలేదు; ప్రభుత్వం తన బాధ్యతను నిర్వహించిన సంఘాలు కొన్ని ఉన్నప్పటికి ఆ యా సభ్యులకు ఉత్సాహాన్ని కలిగించటానికి అవసరమై నట్లుగ వారికి ఆ భూముల మీద యాజమాన్యం ఇచ్చి సొంతపట్టాలు ఇవ్వటం జరగ లేదు. ఈ సొంతపట్టాలు లేనప్పుడు వ్యవసాయకులలో ప్రధానంగా కావలసిన వ్యక్తిగత ప్రోత్సాహం రాదు.

కాబట్టి ఈ దీర్ఘ పరిశీలన వలన ఒక విషయం స్పష్టంగా తేలి పోయింది మన ఆర్థిక వ్యవస్థలో ఉన్న ప్రత్యేకత వల్ల ఈ దేశంలో –

ఇప్పుడే కాక ఇక చాలకాలం వరకు కూడ – వ్యవసాయాన్ని యాంత్రికీకరణ చేయటం అనే విధానం ఆచరణ సాధ్యమైన విషయం కాదు. ఈ యాంత్రికీకరణ ప్రత్యేక సాంకేతి కావశ్యకం అయిన సందర్భాలలోను, ప్రాంతాలలోను సహకార వ్యవసాయాన్ని ప్రవేశపెట్టి పెద్ద పెద్ద క్షేత్రాలను ఏర్పాటు చేసికొనవచ్చు. కాని ఈ విధానం ఆ అవసరం తీరేటంత వరకు ఉండే తాత్కాలిక మైన ఏర్పాటు మాత్రమె. ఆ అవసరం తీరిన వెంటనే భూములను మళ్ళీ వ్యక్తిగత నేద్యం చేసికొనటానికి ఆయా సభ్యులకు ఇచ్చివేయ వలసిందే తప్ప దీన్నే శాశ్వత విధానంగా చేసి దీనికి అంటి పెట్టుకొని ఉండరాదు. ఆ సాంకేతిక అవసరాలు తీరగానే ఆ భూములను రైతులకు సొంత నేద్యానికి ఇచ్చివేసి సహకార వ్యవసాయ సంఘాన్ని సహకార నేవా సంఘంగా మార్చి దానివల్ల లభించే ప్రయోజనాలు రైతులు పొందేటట్లు చూడాలి.

—o—

అధ్యాయం - 7

శ్రామిక వ్యవసాయం - సహకార వ్యవసాయం

ప్రస్తుతం మన ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న విషమ సమస్యల వల్ల మన దేశంలో ఏదో కొన్ని సందర్భాలలో తప్ప వ్యవసాయాన్ని యాంత్రికీకరణ చేయటం సాధ్యం కాదని తెలిసి కొన్నాం. అయినప్పుడు యంత్రాలను ఉపయోగించకుండ మామూలు సంప్రదాయ పద్ధతులతో సాగే వ్యవసాయ క్షేత్రాలలో సహకార వ్యవసాయాన్ని నిర్వహించాలని మన ప్రణాళికాకారులు ఉద్దేశిస్తున్నారా? ఆలోచించగా అలాగే ఉన్నది. ద్వితీయ పంచవర్ష ప్రణాళిక 113 వ పుటలో ప్రణాళికా సంఘం వారే ఇలా వ్రాశారు. "ఏదో కొన్ని ప్రత్యేక పరిస్థితులలో తప్ప ప్రస్తుతం మన దేశంలో ఉన్న స్థితిగతులలో వ్యవసాయాన్ని యాంత్రికీకరణ చేయటం వల్ల వచ్చే ప్రయోజనాల కంటె నిరుద్యోగం వీర్పడి సాంఘికంగా నష్టాలే ఎక్కువ కలగ గలవు." ఇది ఇలా ఉండగా ప్రతి ఒక్క జాతీయవికాస కేంద్రంలోను ఒక సహకార వ్యవసాయ సంఘాన్ని ద్వితీయ పంచవర్ష ప్రణాళికా కాలంలో స్థాపించాలని ఈ ప్రణాళికా సంఘంవారే సూచించారు. అనతికాలంలోనే ఈ జాతీయవికాస కేంద్రాలు దేశం అంతట ఏర్పడనున్నవి. (ద్వితీయ పంచవర్ష ప్రణాళిక పూర్తి అయ్యేసరికి ఈ జాతీయ వికాస కేంద్రాలు దేశం అంతటికి విస్తరించాలని మొదటలో నిర్ణయించారు. కాని ఇటీవల ఈ గడువును మరికొంత పొడిగించటం జరిగింది.) అవి ఏర్పడేసరికి ఈ సహకార వ్యవసాయ సంఘాలు కూడ దేశం అంతట స్థాపించ బడతాయన్నమాట. యాంత్రికీకరణ లేకుండానే మామూలు సంప్రదాయక వ్యవసాయ పద్ధతులతోనే ఈ సహకార వ్యవసాయం వల్ల ఏవో గొప్ప ప్రయోజనాలు సిద్ధించ గలవన్న విశ్వాసంతో ప్రణాళికా కారులు ఈ విధానాన్ని సూచిస్తున్నట్లు అనుకోవాలి గదా!

యంత్రాలతో నిమిత్తం లేకుండ మానవశ్రమతో సాగుచేసే విధానంలో కూడ భారీవ్యవసాయం వల్ల ఆర్థిక లాభాలు వస్తాయని, సగటు ఖర్చులు తగ్గిపోతాయని వారు అంటున్నారు. దీనిని గురించి ప్రణాళికా కారులు ఈ విధంగా వాదిస్తున్నారు: సహకార వ్యవసాయం ఖర్చులను తగ్గిస్తుంది; శ్రామికులు (లేక రైతులు) ఒక్కొక్కరు ఒక్కొక్క పనిలో ప్రత్యేక ప్రావీణ్యం సంపాదిస్తారు గనుక మానవ శ్రమను పూర్తిగాను, ఫలప్రదంగాను వినియోగించుకొనటానికి వీలు పడుతుంది. పైగా తెలివితేటలతో కూడిన భారీవ్యవసాయ నిర్వహణకు కూడ అనకాశం కలుగుతుంది. తెలివితేటలతో వ్యవసాయాన్ని నిర్వహించటం ప్రధానంగా కానలసిన విషయం. చిన్నచిన్న కమతాల సేద్యంవల్ల ఈ ప్రయోజనాలు రావు; ఈ శక్తియుక్తులు చిన్న కమతాల సేద్యంలో చాల వరకు వృథా అయిపోతవి. తన చిన్న భూకమతాన్ని ఏమి చేయాలి అనే ఆలోచన వచ్చినప్పుడు ఆ రైతు తన భూకమతంపై తనకు కాగల ఖర్చు ఎంత, ఆ ఖర్చుల వల్ల తనకెంత ప్రయోజనం రాగలదు అని మాత్రమే ఆలోచిస్తాడు. కాని సాంఘిక దృక్పథంతో, సాంఘిక కావశ్యకాలను బట్టి ఆలోచించినప్పుడు రైతుల ఈ ఆలోచనా విధానం ఒక్కటే ప్రధానం కాదు; అదే సబబుకాదు. భూమిని సంపూర్ణంగా వినియోగించుకొని సాధ్యమైనంత అధికోత్పత్తిని సంపాదించటమే ప్రధానావశ్యకం. దీనిని సాధించాలని మనం కార్యక్రమం వేసికొని ప్రయత్నం ప్రారంభిస్తే ఈ చిన్న చిన్న కుటుంబ కమతాలు మన విధానానికి, ప్రయత్నానికి అడ్డువస్తవి. కాబట్టి వ్యవసాయాన్ని పెద్ద పెద్ద సహకార వ్యవసాయ సంఘాల పరం చేయటం అవసరం.

ఈ పెద్దపెద్ద క్షేత్రాల భారీవ్యవసాయంవల్ల ఏ ఆర్థిక ప్రయోజనాలు సిద్ధించ గలవో, అసలు ఈ చెప్పబడుతున్న ప్రయోజనాలు ఆచరణలో ఎంతవరకు సాధ్యం కాగలవో మేము ఈ అధ్యాయంలో పరిశీలిస్తాము.

I

మొట్టమొదటగా మన గ్రామీణ ప్రాంతాలలో బహుళార్ధ సాధక సహకార సంఘాలు ఉన్నాయని, చక్కగా నిర్వహింప బడుతున్నాయని అనుకొందాం. ఈ బహుళార్ధ సాధక సహకార సంఘాలు వ్యవసాయానికి సంబంధించిన కృషిలో కాక ఇతర విషయాలలో వ్యవసాయానికి ఉపయోగ పడతాయి; అంటే చౌకగా అవసరానికి సరిపోయేటంత ఋణం లభించటానికి, పంటలు అమ్ముకొనటానికి, మంచి విత్తనాలు సేకరించుకొనటానికి – ఈ మొదలైన పనులలో ఇవి రైతులకు సహాయ పడతాయి. మరొకటి ఏమంటే మన రైతులకు ప్రస్తుతపు వ్యవసాయ విధానాలలో మంచి సామర్థ్యం నేర్పు కూడ ఉన్నవని అనుకొందాం.

మన రైతులకు ఇవి రెండు – బహుళార్ధ సాధక సహకార సంఘాలు, వ్యవసాయ విధానాలలో సామర్థ్యం – ఉన్నప్పుడు ప్రతి ఎకరానికి సాధ్యమైనంత అధికోత్పత్తిని సాధించటానికి భూకమతం యొక్క విస్తీర్ణం ఎంత ఉంటే వీలుగా ఉంటుంది? మన వ్యవసాయక ఖర్చులకు పోను సాధ్యమైనంత మిగులు ఉత్పత్తి ఉండాలనేదే మనకు ప్రధాన ఆశయం. ఈ మిగులు ఉత్పత్తిని అధికం చేయటానికి రెండు విధానాలు ఉన్నవి. (1) మొత్తం ఉత్పత్తిలో మార్పు లేకుండ ఖర్చులను మాత్రం తగ్గించుకోవటంవల్ల ఈ మిగులు ఉత్పత్తి పెరుగుతుంది (2) లేదా వ్యవసాయపు ఖర్చులు ఏ మాత్రం పెంచకుండ మొత్తం ఉత్పత్తిని పెంచటంవల్ల మిగులు ఉత్పత్తి అధికం అవుతుంది.

ఈ రెంటిలోను మొదటి విధానమైన ఖర్చులను తగ్గించటం గురించి ఆలోచిద్దాం. ప్రస్తుత వ్యవసాయ విధానంలో మన మానవ శ్రమను, ఆర్థికపు పెట్టుబడులను సక్రమంగా సంపూర్ణంగా వినియోగించుకొనటం వల్ల ఈ ఖర్చులను తగ్గించుకొనవచ్చు. వీటిని మనం సరిగా వినియోగించుకొనటానికి మన వ్యవసాయంలో కనపడని ఖర్చులకు సంబంధించిన పరికరాలు కొన్ని ఉన్నవి. ఉదాహరణకు ఎడ్లజత, పనిచేసేకోజు ఈ మొదలైన వ్యావసాయక పరికరాలను సంపూర్ణంగా

వినియోగించు కొనగల పక్షంలో ఆ రైతు యొక్క వ్యవసాయపు ఖర్చులు కనీసపు ఖర్చుల స్థాయికి దిగిపోతాయి. ఈ వ్యవసాయ పరికరాలలో ప్రధాన మైనది ఎడ్లజత; 10, 15 ఎకరాల భూమి ఉంటే చాలు వీటిని సంపూర్ణంగా, — వీటి శ్రమ వృథా పోకుండ, — వినియోగించు కొన వచ్చు. ప్రస్తుత వ్యావసాయక పద్ధతులను ప్రవేశపెట్టి సహకార వ్యవసాయాన్ని ఏర్పాటు చేసినప్పటికి, ఈ పది, పదిహేను ఎకరాల భూకమతం మీద అయ్యేటంత కంటె తక్కువ ఖర్చుతో వ్యవసాయాన్ని నిర్వహించటం జరగదు; అయితే ఈ పది, పదిహేను ఎకరాల నిర్వహణ సామర్థ్యంతో కూడి ఉన్నప్పుడు మాత్రమే మేము ఈ పోటీ పెట్టే సామ్యం చూపుతున్నా మని మాత్రం మరచి పోకూడదు.

కాబట్టి తేలిన విషయం ఏమంటె భారీ ఎత్తున సహకార వ్యవసాయాన్ని నిర్వహించినప్పుడు అధికమైన లాభాలు వస్తాయని మనవారు చెపుతున్నా రే — ఆ అధిక లాభాలు సహకార వ్యవసాయంలోని వ్యావసాయక నిర్వహణ సామర్థ్యం వల్ల ఖర్చులు కనీసస్థాయికి దిగిపోవటం వల్ల మాత్రమె లభించు తున్నవి. వ్యావసాయక నిర్వహణలో సామర్థ్యం అధికంగా ఉన్నప్పుడు రైతుస్వామ్యంలోకూడ ఈ లాభాలు వస్తాయి కదా! ఈ వ్యావసాయక నిర్వహణ సామర్థ్యం అనేది సహకార వ్యవసాయం యొక్క గుత్తసొత్తేమి కాదు గదా! వ్యావసాయక సామర్థ్యం పెరిగితే — విధానం ఏమైనప్పటికి — అధిక లాభాలు వస్తాయని తేలింది. ఇక ఈ వ్యవసాయ సామర్థ్యం ఎలా పెరుగుతుంది? అనేది ప్రశ్న. ఏ విధమైన నిర్వహణ సమర్థవంతంగా ఉంటుంది? ఎంత విస్తీర్ణం గల భూకమతం మీద ఈ వ్యావసాయక నిర్వహణను సమర్థవంతంగా వినియోగించ గల అవకాశాలు ఉన్నవి?

II

పరిశ్రమలలోని నిర్వహణకు వ్యావసాయక నిర్వహణకు పోలికనుపెట్టి చూడటం వల్ల లాభం లేదు. వ్యావసాయక నిర్వహణలోని సమస్యలువేరు పరిశ్రమలలోని సమస్యలు వేరు. ఈ భేదానికి ప్రధాన

కారణం ఏమంటే వ్యవసాయం జీవగమన విధానం; జీవలక్షణాలను బట్టి ఋతువుల అదనును బట్టి ఈ పంటలు ఉంటాయి. భూమిని సాధ్యమైనంత కృషిచేసి సారవంతంగా ఉంచటమే వ్యవసాయంలోని నిర్వాహకుని ప్రథమ కర్తవ్యం. వ్యవసాయ నిర్వాహకుడు రసాయనిక ఎరువులను, పశువుల ఎరువులను సరిఅయిన పాళ్ళలో సరి అయిన తరుణంలో ఉపయోగిస్తూ భూమిని జాగ్రత్తగా పోషించాలి. ఆయా ఋతువులలో అదను తప్పిపోకుండ, భూమి పదును తప్పకుండ సమయా సమయాలను కనిపెడుతూ వ్యవసాయ నిర్వాహకుడు చేయవలసిన పనులు చాల ఉన్నవి; భూమిని దున్నటం, విత్తనాలు చల్లటం, నాట్లు వేయటం, కోతలు కోయటం మొదలైన పనులు ఇందుకు ఉదాహరణ. విత్తులు వేసి వేశాం కదా ఇక చాలునని అశ్రద్ధ చేయటానికి కూడ వీలులేదు; పెరుగుతున్న పంటల లక్షణాలను స్థితిగతులను గమనిస్తూ బిడ్డలను వలె సాకవలసి ఉన్నది. ఏ పంట తరువాత ఏ పంట వేయాలి, ఏ యేడు ఏ పంటలు వేస్తే ఫలప్రదంగా భూసారాన్ని పరిరక్షించుకొంటు ప్రయోజనం పొంద వచ్చునో యోచించి తగిన నిర్ణయానికి రావలసి ఉంటుంది. ఈ కార్యకలాపాలు ఇలా ఉండగా పశువుల పోషణ విషయమై అతడు చాల జాగ్రత్త తీసికొన వలసి ఉన్నది. భూమిని దున్నే ఎడ్లను గురించి, పంటలను పాడుచేసే చెడుగొడ్లను గురించి రాత్రింబవళ్లు శ్రద్ధ తీసికొనకపోతే పంటలు చేతికి అందవు. వ్యవసాయ క్షేత్రంలో ఏ మూల ఏ పని జరుగుతున్నప్పటికి అన్నింటిని అతడు ఒక కంటితో కనిపెడుతూ జాగ్రత్త వహించాలి. సరిఅయిన తరుణంలో పొలానికి నీరు పెట్టటట్లు అవసరం తీరిన వెంటనే నీటిని బైటికి పెట్టివేసేటట్లు చూడాలి. తెగుళ్ళనుంచి పంటలను కాపాడేటందుకు నిరంతరం జాగరూకత వహించాలి. పంటచేలను గొడ్లు మేసిపోకుండ, తొక్కి వేయకుండ చూచుకోవాలి. కాబట్టి వ్యవసాయంలో ఈ విధంగా నిర్వాహకుడు నిరంతరం తానై పర్యవేక్షణ చేస్తూ తగిన నిర్ణయాలు తీసికొని కార్యక్రమాలు వేసికొంటు ఉండాలి.

వ్యవసాయ నిర్వాహకుడు ఎంత భూమిమీద సమర్థవంతంగా పర్యవేక్షణ చేయగలడు? ఈ ప్రశ్నకు సమాధానం ఆయా వ్యవసాయ

పద్ధతుల మీద ఆధారపడి ఉంటుంది. అమలులో ఉన్న వ్యవసాయ విధానాలను బట్టి ఈ భూకమతాల విస్తీర్ణం నిర్ణయింప బడుతుంది. వ్యవసాయంలోని ప్రధాన కార్యాలను యంత్రాల ద్వారా నిర్వహించు కొంటు ఉన్నప్పుడు నిర్వాహకుడు సమర్థుడు కనుక అయితే పెద్ద భూకమతాన్ని చక్కగా నిర్వహించ గలడు. కాని మనం ప్రస్తుతం భారతదేశ వ్యవసాయాన్ని యాంత్రికీ కరణ చేయ దలచ లేదు; కాబట్టి యాంత్రిక వ్యవసాయాన్ని గురించిన విషయం మనకు సమస్య కాదు. మన దేశంలో యాంత్రిక వ్యవసాయం లేదు; దాన్ని స్థాపించా లని కూడ మనం అనుకోవటం లేదు. కనుక మన వ్యవసాయంలోని సర్వ కార్యకలాపాలను వ్యవసాయ నిర్వాహకుడే సంప్రదాయక పద్ధ తుల ద్వారా చేసికోవలసి ఉన్నది; మన రైతు తన కుటుంబ సహా కారంతో, పశువుల సహాయంతో ఆయా తరుణాలలో పిలుచుకొనే వ్యవసాయ కూలీల సహాయంతో తన వ్యవసాయాన్ని నిర్వహించు కొనవలసి ఉన్నది. మన వ్యవసాయంలోని పెద్ద పెద్ద పనులను అన్ని టిని పశువులతోనే మనం నిర్వహించు కొంటున్నాం.

ఈ విధానం వల్ల కొన్ని వాస్తవ ప్రయోజనాలు ఉన్నవి. మన పశువులను వ్యవసాయాన్ని విడదీయటానికి వీలులేదు; ఇవి రెండు పరస్ప రాధారాలు. వ్యవసాయానికి పశువుల మలమూత్రాలే సహజ మైన చక్కని ఎరువు; వ్యవసాయంలోని పంటపోగా మిగిలిన గడ్డి, గాదం మొదలైన కొన్ని వస్తువులు పశువులకు చక్కని ఆహారంగా ఉపయోగపడు తున్నవి. మనం పంటలు కోసికొన్న తరువాత పశువు లను చేలలో తోలి కట్టివేసి మేపుతూ ఉంటాం. ఈ పద్ధతివల్ల ఇటు పశువులకు ఆహారము లభిస్తున్నది; అటుచేలకు ఎరువులు లభిస్తున్నవి. ఈ విధంగా రెండు ప్రయోజనాలు కూడ నెరవేరుతున్నవి. పాడి పరిశ్రమ కూడ ఇలాగే మన రైతుకి రెండందాల ఉపయోగ పడు తున్నది. ఈ పాడిపరిశ్రమ వల్ల రైతు తన ఆదాయాన్ని పెంపొందించు కొంటున్నాడు; పైగా తనకు కావలసిన పుష్టికరమైన ఆహారాన్ని సంపాదించు కొనగలుగు తున్నాడు. పశువుల వల్ల ఎన్ని లాభాలు ఉన్నవో ఇప్పుడు బోధపడింది గదా! పాడిపరిశ్రమ కోసం పశువులను

తన చేలలో మేపుతు పొలాలను సారవంతం చేసికొంటున్నాడు. పొలాలలో వృథాగా పోయే గడ్డిగాదంతో పశువుల ఆహారం సమకూర్చు తున్నాడు. పశువులకు కావలసిన శ్రద్ధను, ఆహారాన్ని ఈ విధంగా అతడు నిర్వహిస్తున్నాడు. పైగా ఈ పశువులవల్ల ఆదాయాన్ని బలకరమైన ఆహారాన్ని సంపాదిస్తున్నాడు. ఈ విధంగా మన రైతు వ్యవసాయాన్ని, పశువులను కూడ సమాన దృష్టితో జాగ్రత్తగా పోషించుకొనవలసి ఉన్నది. ఈ వ్యవసాయము, పశువులు ఒకదాని కొకటి సంబంధించినవి, పరస్పరాశ్రితాలు. ఇవి రెండు పరస్పరం తమ ఉత్పత్తులను పెంచుకోవటానికి కారణ భూతాలు అవుతున్నవి. ఎంత విస్తీర్ణం గల భూకమతం చక్కగా సరిగా ఉంటుంది అని పరిశీలించేటప్పుడు వీటి రెంటిని – అంటే పశువులను, వ్యవసాయాన్ని – విడివిడిగా ఉంచి ఆలోచిస్తే కుదరదు. రూపాయికి రెండు వైపులు ఎలాగో అలాగే ఇవి రెండు కూడ ఒకే కార్యానికి సంబంధించిన విడదీయరాని రెండు అంశాలు.

III

యంత్రాలతో నిమిత్తంలేని మన సంప్రదాయక వ్యవసాయం మానవశ్రమపై కేంద్రీకృతమై ఉంటుంది. మానవశ్రమ ఈ విధానంలో అత్యంతావశ్యకం, అదే ప్రముఖస్థానంకూడ వహిస్తుంది. ఈ విధానంలో మానవశ్రమ, సంకల్పం లేకుండ దానంతట అది ఏ పనీ జరగదు. రైతు వ్యక్తిగతంగా ఎక్కువ శ్రద్ధ తీసికొన్నకొందికి ఎక్కువ శక్తియుక్తులను, ప్రావీణ్యాన్ని ప్రదర్శించి జాగ్రత్త వహించిన కొందికి ఫలితం అధికంగా వస్తూ ఉంటుంది. కాబట్టి మన వ్యవసాయంలో ప్రధానస్థానం వహించేది రైతుల శ్రద్ధ, జాగ్రత్త అని తేలుతున్నదిగదా! కాబట్టి ప్రతి ఎకరంనుంచి సాధ్యమైనంత అధిక లాభం సంపాదించాలంటే ఒక్క రైతు ఎంత భూమిపై తన శక్తి యుక్తులను శ్రద్ధను జాగ్రత్తను సనుద్ధవంతంగా, సంపూర్ణంగా వినియోగించగలడో ఆ భూకమతాన్నే మన పద్ధతికి తగిన ఉత్తమభూకమతంగా పరిగణించవలసి ఉన్నది.

ఈ క్రింది రెండు ప్రధాన విషయాలమీద ఇది ఆధారపడి ఉంటుంది. (1) మన వ్యవసాయంలోని పనులను విభజించటానికి కల అవకాశాలమీద, కొన్నికొన్ని ప్రత్యేక సౌకర్యాలమీద, కొందరు ప్రత్యేక శ్రద్ధతీసికొని ప్రావీణ్యం సంపాదించటానికిగల అవకాశాల మీద ఆధారపడి ఉంటుంది. (2) ఒక రైతు ఎంతమంది కూలీలను ఉపయోగించుకొని వారిని చక్కగా సంఘటితపరిచి, వారు చేస్తున్న కార్యకలాపాలన్నింటిని పర్యవేక్షిస్తూ సూచనలిస్తూ ఉండటానికి వీలు ఉన్నది అన్న విషయంపైన కూడ ఇది ఆధారపడి ఉంటుంది.

మన ప్రస్తుత వ్యవసాయ విధానంలోని కార్యకలాపాలను విభజించటానికి, వాటిలో ప్రత్యేకప్రావీణ్యం సంపాదించటానికి అవకాశం లేనేలేదని చెప్పటం తగదు; కాని భారీక్షేత్రాలలో సహకార వ్యవసాయం కావాలనేవాళ్ళు అనుకొంటున్నంతగా విభజించటానికి, ప్రత్యేక ప్రావీణ్యం సంపాదించటానికి మాత్రం వీలు లేదు.

యంత్రపరిశ్రమలలో ఆ యా పనులను ప్రత్యేకం చేసి కొంత కొంతమంది ఆ యా పనులలో ప్రత్యేక ప్రావీణ్యం సంపాదించవచ్చు. దానివల్ల లాభంకూడ అధికంగానే ఉంటుంది. కాని వ్యవసాయం అలాంటిది కాదు. వ్యవసాయంలో ఉన్న ప్రత్యేక పరిస్థితులవల్ల వ్యావసాయక కార్యకలాపాలను పరిశ్రమలలోవలె విభజించి ఆయా కార్యాలలో కొందరికి ప్రావీణ్యం సంపాదించుకోవటం వీలుకాదు. వ్యవసాయంలో ఈ విధానాన్ని అమలు చేయటానికి అనేకపరిమితులు ఉన్నవి. యాంత్రిక వ్యవసాయంలో ఈ విభాగానికి ప్రత్యేక ప్రావీణ్యానికి కాస్తో కూస్తో అవకాశం ఉండవచ్చు కాని మన పద్ధతి వ్యవసాయంలో ఈ ప్రత్యేక ప్రావీణ్యం పొందటానికి విభాగానికి అంతగా అవకాశాలు లేవు. తోటలు కూరగాయల పంటలు వేసే ప్రాంతాలలో ఈ విభాగం అసలు ఇంచుమించు సాధ్యం కాదు. పైగా వ్యవసాయంలోని కూలీలు—అనేక కారణాలవల్ల — వ్యవసాయంలోని అన్నిపనులను చేయటానికి తగినట్లుగా ఉండవలసి ఉన్నది. మనకు ఉన్న ఋతువులనుబట్టి ఒకొక్కఋతువులో ఒకొక్కవిధముగా పనులు వస్తూ ఉంటవి. పైగా ఈ ఋతువులు తరుణాలు అట్టే కాలం

నిలబడవుగదా! తరుణాన్నిబట్టి వెంటవెంటనే పనులు కావాలి. ఉదాహరణకు నరిపంటను తీసికొందాం. ఈ వరిసాగులో దున్నటం, నాటటం, కోయటం, నూర్చటం మొదలైన పనులు అన్నీ కలిసి ఒక నెల రోజుల పని. ఈ ఒక్క నెలరోజుల పనిలోనే ఎన్నిరకాల పనులు—ఆయా పనులనుబట్టి తరుణాలనుబట్టి—ఉన్నాయో గమనించాంగదా. ఈ వ్యవసాయ కార్యకలాపాలలో ఇలా వెంటవెంటనే మారుతూ ఉండటంవల్ల వ్యావసాయకులు ఆ యా పనులను విభజించుకొని వాటిలో ప్రత్యేక ప్రావీణ్యం సంపాదించటం కుదరదు. అయితే ఒక్కొక్క తరుణంలోని పనులలో ఒక్కొక్కరు ప్రత్యేకించి ప్రావీణ్యం పొంద వచ్చు గదా అని అడగవచ్చు. దానికికూడ అంత అవకాశం లేదు. ప్రతిఋతువులోనుకూడ ఒక్కొక్క పనిపై నీవు శ్రద్ధను కేంద్రీకరించి ఆ పరిమితకాలంలోనే ఆ పనిని త్వరగా నిర్వహించుకొనవలసి ఉంటుంది. కాబట్టి వ్యావసాయకులు ఒక్కొక్క తరుణంలోని నాలుగు పనులను నలుగురు తమకు ప్రత్యేకించుకొని ప్రావీణ్యం పొందటానికి అవకాశం ఉండదు. గోధుమ, పొగాకు, కూరగాయలు, షండ్లు మొదలైన వాటికి సంబంధించిన కృషికూడ నరిసాగు వలెనే కొనసాగవలసి ఉన్నది. మనవ్యావసాయకులకు సాధ్యమైనంత ఎక్కువ కాలంలో పనిపాటలు కలిగించాలని, ఈ ప్రత్యేక ప్రావీణ్యం వీలు అయినప్పటికి ఆ ప్రవీణులకు అధికకాలం పనులు ఉండవలసిన అవసరం ఉన్నదని కూడ మనం గమనించాలి. ఒక పనిలో ఒకడు ప్రవీణుడే అనుకొందాం; కాని ఆ పనిని సంవత్సరంలో నాలుగు రోజులు మాత్రమే ఉన్నప్పుడు దానినల్ల ప్రయోజనం ఏమిటి? అతనిని మనం సరిగా వినియోగించుకొనలేకపోవటం అలాఉంచి అతడు నిరుద్యోగంతో బాధపడవలసి వస్తుంది. కొన్నిదేశాలలో ఒకే క్షేత్రంలో అనేకమైన పంటలు వేయటం ఈ పంటలుకూడ ఒకే ఋతువులోని అనేకదినాలలో చేతికి అందే పంటలువేయటం – ఉన్నది. అలాంటిది మనకులేదు. ఇలా ఒకే క్షేత్రంలో చాల పంటలనువేసి సంవత్సరం అంత పనిని పొందుతు పైగా లాభంకూడ పొందగల అవకాశం ఉన్నది. కాని ఈ విధానంవల్ల ఆ యా పనులను విభజించటం ప్రత్యేకించుకొని ప్రావీణ్యం పొందటం వీలవుతుందని భావించటం మాత్రం

పొరపాటు. ఎందుచేతనంటె ఈ పనులు అనేకం. వీటిలో ఒక్కొక్క పనిలో కొందరు ప్రావీణ్యం సంపాదించినా ఆపని అట్టేకాలం ఉండదు; కొద్దిరోజులలోనే పూర్తి అవుతుంది. ఆ తరువాత ఆ ప్రవీణులు ఏమి చేయాలి? అన్ని పనులలో పాల్గొన గలిగినప్పుడు వారికి వృత్తులు లభిస్తాయి; లాభాలు వస్తాయి. కనుక పనుల విభజనకు ఇక్కడకూడ అవకాశం లేదు. మామూలుగా రైతులు వ్యవసాయపు పనులను రెండుగా మాతం విభజిస్తారు. శారీరకశ్రమ అంత ఎక్కువగా అవసరం లేకుండ, ఓర్పు, జాగ్రత్త ఎక్కువగా కావలసిన పనిపాటలను స్త్రీలకు అప్పచెపుతారు. శారీరకశ్రమతో నిర్వహించుకొన వలసిన మిగిలిన కార్యకలాపాలన్నింటిని పురుషులు చేస్తారు. ఇది ఇలా ఉంచుదాం; అసలు వ్యవసాయంలోని చాలపనులు పరస్పరం ఒకదాని మీద ఒకటి ఆధారపడి ఉంటాయి; ఒకే కాలంలో అనేక కార్యాలను ఒకే వ్యక్తి చేయవలసి ఉంటుంది. దీనికి ఒక ఉదాహరణ చూడండి : ఒక రైతు పంటను కోసికొనివెళ్ళిన తరువాత పొలాన్ని సారవంతం చేయాలనే సంకల్పంతో, పశువులను మేపుకొనాలనే ఉద్దేశంతో తన గొడ్లను చేలలోకట్టి వేస్తాడు. ఆ గొడ్లకు మరొకచోటనుంచి మేత తీసికొని రావలసి ఉంటే అదొక ప్రత్యేకమైన పని కనుక ఒక ప్రత్యేక వ్యక్తిచేత చేయించుకొనటం సాధ్యమా? అలాగే పశువులకు నిళ్ళు పెట్టుకోవాలి, వాటిని కడగాలి, చేలలో ఎరువులు చిమ్మాలి. పొలాలలోని ఎత్తు పల్లాలను సరిచేసి కోవాలి. చెడిపోయిన గట్లను సరిగా వేసికోవాలి, పంటకాల్వలను తీసికోవాలి. ఈ పనులన్నీ ప్రత్యేకమైనవే కనుక ఆయా ప్రత్యేకమైన పనులలో కొంతకొంత మంది ప్రత్యేక ప్రావీణ్యం పొందటం సాధ్యమా, అసలు సబబా? న్యాయానికి ఈ పనులను అన్నింటినీ ఈనాడు మన రైతు వేసవి కాలంలో తాను ఒక్కడుగానే నిర్వహించుకొనటం లేదా? అలాకాక వాటిని కొందరికి ప్రత్యేకించి వేయటంవల్ల లాభమేమైనా ఉన్నదా? అలా చేయటం ఆచరణలో ఎదిరే వ్యవహారమేనా? ప్రతిదినం, ప్రతిమాసం, ప్రతితరుణంలోను అనేకవిధాల కార్యకలాపాలలో పాల్గొనవలసి ఉన్నది. దీనికి కారణంకూడ ఉన్నది. వ్యవసాయం పరిశ్రమలవలె

యాంత్రికంగా ఏ కార్యసాధనకు మాత్రమే ఉద్దేశింపబడినది కాదు; వ్యవసాయం అనేక కార్యకలాపాలతో సమ్మిళితమైన బహుకార్య సాధనోద్దిష్టం. చాలవరకు రైతులు ఒకటో రెండో ప్రధానమైన పంటలను మాత్రమే దృష్టిలో పెట్టుకొని ఆ పంటల మీదనే ఆధార పడుతూ వాటికి కావలసిన శక్తియుక్తులను, సామర్థ్యాన్ని, ప్రత్యేక పరిజ్ఞానాన్ని సంపాదించు కొంటారు అనటంలో సందేహం లేదు. అంతవరకు—అంటే ఆప్రధానమైన పంటలకు సంబంధించినంతవరకు—వ్యావసాయక కార్యకలాపాలను విభజించి ప్రత్యేక ప్రావీణ్యం సంపాదించుకోవటం సాధ్యం కావచ్చు. కాబట్టి పరిశ్రమలవలె కాక వ్యవసాయం ఒక జీవితవిధానం. యంత్రపరిశ్రమలవలె జీవితరంగానికి సంబంధించిన ఇతర విషయాలతో సంబంధంలేని పరిశ్రమ కాదు. రైతు నందిన జీవితంలోని సర్వకార్యకలాపాలకు వ్యాప్తమై రూపురేఖలు దిద్దే జీవిత విధానం వ్యవసాయం. వ్యవసాయదారులు ఎండ వాన అనకుండ రాత్రి పగలు అనే భేదం లేకుండ గంటల తరబడి పని చేస్తున్నారు గదా! ఇది ఎలా సాధ్య మనుకొన్నారు. యంత్రాలలోవలె రైతు అస్త మానం ఒకే పని చేయడు. అలా ఒకే పని చేయటంవల్ల మానవుడు అలసి విసుగు చెందుతున్నాడు. ఇది మానవ సహజం. కాని వ్యవసాయదారునికి ఈ దారుణస్థితిలేదు. అతడు ప్రతిదినము చేసే పనులలో అనేకభేదాలు ఉన్నవి; అందుచేత అతనికి విసుగు, అలసట అంత తేలికగా కలగవు. ఆయా పనుల మార్పిడినిబట్టి అతని శ్రమకూడ మారుతు ఉంటుంది. ఆయా పనుల స్వభావాన్నిబట్టి అతనిలో ఉత్సాహం, సాహసం, స్వయం నిర్ణయాధికారం పెరుగుతు ఉంటాయి. ఈ అవకాశం పారిశ్రామిక కార్మికులకు లభించదు గదా!

కాబట్టి వ్యవసాయదారులకు ఆయా కార్యకలాపాలన్నింటిలోను పాల్గొని నిర్వహించగలిగి ఉండడమే అతని వ్యావసాయక నిర్వహణసామర్థ్యం పెరగడని ఈ పరిశీలన తేల్చుతున్నదిగదా! పొలంలో పనిచేసే వ్యక్తులుకూడ చిన్న సంఘంగా సంఘటితమై ఒకే నిర్వాహకునిక్రింద పనిచేసినప్పుడు ఆయా పనులను సమర్థవంతంగా నిర్వహించగలరు.

ఈ విషయంవల్ల – అంటే ఒకే రైతు వ్యవసాయ కూలీలపై తగిన నిర్వాహకుడుగా ఉండినప్పుడే పనులు బాగాజరుగుతాయి అన్న సూత్రంవల్ల – వ్యవసాయ కమతాల విస్తీర్ణాన్ని నిర్ణయించే రెండవ ప్రధానాంశం మనకు ఎదురవు తున్నది. వ్యవసాయ కార్యకలాపాలలో నిర్వాహకుని పర్యవేక్షణ, సూచనలు ఇవన్నీ అవసరంగదా! మరి ఒక రైతు ఎంతమంది కూలీలమీద ఈ పర్యవేక్షణను సూచనలను ఇవ్వ టాన్ని సమర్థవంతంగా నిర్వహించగలడు? అనేది ఈ రెండవ అంశం. దీన్ని బట్టి కూడ మన వ్యవసాయకమతాల విస్తీర్ణాన్ని నిర్ణయింప వలసి ఉంటుంది. వ్యవసాయదారుడు కూలీల పనులలో పాల్గొంటు పర్యవేక్షిస్తూ, సూచనలిస్తూ వీటికి తోడు తన పశువులనుకూడ జాగ్రత్తగా పోషించు కోవాలనీ, ఉపయోగించుకోవాలనీ, ఈ పశు వులను నేటి మన స్థితిని బట్టి వ్యవసాయంనుంచి విడ దీసి చూడగల అవకాశంలేదనీ పైన ఒక సందర్భంలో తెలిసికొని ఉన్నాంగదా! పైగా వ్యవసాయం యాంత్రికకర్మ కాదని అది జీవగమనవిధానం అని కూడ ఇంతకుముందే వివరించుకొన్నాం. మన వ్యవసాయ కమతాల విస్తీర్ణాన్ని నిర్ణయించే సందర్భంలో ఇవి అన్నీ దృష్టిలో పెట్టుకొనక తప్పదు గదా! ఒక రైతు ఎంతమంది కార్మికుల మీద తగిన పర్య వేక్షణచేస్తూ, తన పశువులను పోషించుకొంటు, పంటపొలాలను నిండు జీవాలవలె సంరక్షించుకొంటు ఎంత కమతాన్ని సాగుచేయ గలడో అదే మన భూకమతాల విస్తీర్ణాన్ని నిర్ణయించటంలో ప్రధా నాంశం అవుతుంది. ఈ పనులు సక్రమంగా నిర్వహించ గలిగితేనే వ్యవసాయక సామర్థ్యం పెరుగుతుంది. కాబట్టి వీటి అన్నింటిని దృష్టిలో పెట్టుకొని పరిశీలించి నప్పుడు వ్యవసాయ నిర్వాహకుడు కొద్ది మంది కూలీలమీద మాత్రమె తగిన పర్యవేక్షణ చేయగలడనేది సర్వులు అంగీకరించిన విషయమే. దీనికి కారణం ఉన్నది. మన వ్యవ సాయంలోని కార్యకలాపాలను యంత్రాలతో కాక మానవుల చేతనే చేయించుకొనవలసి ఉండటమే ఆ కారణం. ఈ కారణంచేతనే సమిష్టి వ్యవసాయ క్షేత్రాలలోకూడ వ్యవసాయపుపనిని ఇదిగో ఇంత పొలం మీరు, ఇంత పొలం మీరు అని పనిని విభజించి వ్యావసాయకులను కూడ చిన్నచిన్న సంఘాలుగా ఏర్పరచి ఒక్కొక్క సంఘానికి ఒక

నిర్వాహకుని వేసి ఒక్కొక్క సంఘానికి కొంతపనిని అప్పచెప్పి వ్యవసాయాన్ని నిర్వహించటం జరుగుతున్నది. వ్యవసాయ కార్యకలాపాలు నిర్వహించవలసిన ఈ సంఘాలు చిన్నవిగా ఉండవలసి ఉన్నది; పనుల విభాగానికి ప్రత్యేకతకు అవకాశం లేకుండ ఉన్నది; ఐనప్పుడు ఈ చిన్న సంఘాలు కృషి చేయవలసిన భూకమతాలు కూడ చిన్నవిగానే ఉండక తప్పని ఆవశ్యకత కలుగుతున్నది. అంతే కాని పెద్ద పెద్ద క్షేత్రాలను ఏర్పాటుచేసి పనులను నిర్వహించె ఈ చిన్నచిన్న సంఘాల సంఖ్యను పెంచి మళ్ళీ ఆ పెద్ద క్షేత్రాన్ని చిన్న చిన్న ఖండాలుగా చేసి చిన్న సంఘాలచేత పనులు చేయించినందువల్ల అదనంగా వచ్చే ప్రయోజనాలు ఏమీ ఉండవు గదా!

IV

ఇప్పటికి ఒక విషయం తేల్చుకొన్నాం. నేటి మన వ్యవసాయ విధానాలనుబట్టి చూచుకొన్నప్పుడు చిన్నచిన్న వ్యవసాయ సంఘాలు, అవి పనిచేసే చిన్నచిన్న భూకమతాలు మాత్రమే ఉండవలసి ఉన్నది అనే విషయాన్ని అంగీకరించిన తరువాత ఇక రెండవవిషయం ఉత్తమమైన నిర్వహణ. ఈ నిర్వహణ విషయం గురించి ప్రధానమైన ప్రశ్న ఒకటి ఉన్నది. వ్యవసాయ క్షేత్రాన్ని రైతు తన కుటుంబసహాయంతోను, అప్పుడప్పుడు అవసరమైన తరుణాలలో వ్యవసాయ కూలీల సహాయంతోను సొంతంగా సాగు చేసి కోవాలా, లేక జీతంమీద ఏర్పాటు చేయబడిన వ్యావసాయక నిర్వాహకుల రోజువారీ కూలీలను ఉపయోగించి వ్యవసాయక్షేత్రాన్ని సాగుచేయాలా? వీటి రెంటిలోను ఏది ఉత్తమంగా, ఫలప్రదంగా ఉంటుంది? వీటిలో దేనివల్ల సాంఘిక సంక్షేమం అధికంగా సాధింపబడుతుంది? ఇదే ప్రధానమైన ప్రశ్న. మా ఉద్దేశంలో వీటి రెంటిలోను రైతు సొంతంగా సేద్యం చేసి కొనటంవల్లనే వ్యవసాయం ఫలప్రదంగాను సాంఘిక సంక్షేమ దాయకంగాను ఉంటుంది.

వ్యవసాయం సమర్థవంతంగా సాగాలి అంటే వ్యవసాయదారులలో సేద్యంమీద వ్యక్తిగతశ్రద్ధ అత్యంతావశ్యకం అని ఇదివరకే తెలిసికొన్నాం. అయినప్పుడు వ్యవసాయదారులకు ఈ వ్యక్తిగత శ్రద్ధ ఎప్పుడు వస్తుంది? ఎలావస్తుంది? అనే విషయం చూడాలి. వ్యావసాయక కార్యకలాపాలలో ఉత్సాహం ఉండి ప్రోత్సాహం పొందటం ద్వారానే ఈ వ్యక్తిగతశ్రద్ధ లభిస్తుంది. సొంతసేద్యం చేసికొనే రైతులో ఈ ఉత్సాహం, ప్రోత్సాహం సహజంగా శాశ్వతంగా ఉంటాయనటంలో ఎవరికీ సందేహం లేదుగదా! అతనికి జీవితభద్రత ఉన్నది; ఎవరికో ఒక యజమానికి లొంగి దాసుడుగా పని చేయవలసిన పారతంత్ర్యం లేదు. పైగా నేను స్వతంత్ర జీవినన్న భావం, గౌరవం అతనికి ఉన్నవి. అందుచేత సొంతసేద్యం చేసికొనే రైతు తాను సాగు చేసే భూమిపై మమకారపడి కృషి చేయగలడు; తనంతట తాను నిర్ణయాలు తీసికొనటంలోను, కృషి చేసికొనటంలోను నేను స్వతంత్ర జీవినన్న ఉత్సాహం, గర్వం పొందగలడు. ఇలా స్వయంగా తన పనిని తానే ఏర్పాటు చేసికొనే రైతు తాను శ్రమపడుతున్న ప్రతి నిమిషానికి ఎంత డబ్బు ప్రతిఫలంగా వస్తున్నది అని గుణకారాలు వేసికొంటు కూర్చోడు. తన బాగుకోసం తనభూముల అభివృద్ధికోసం తన శక్తి యుక్తులను సర్వం వినియోగించి పాటుపడుతు ఉంటాడు. ఇక జీతం మీద పనిచేసే వ్యవసాయనిర్వాహకుల పని చూద్దాం. వీరు సహకార వ్యవసాయసంఘాలలో పనిచేసినా లేక మరొక విధానంలో పనిచేసినా వారికి వ్యవసాయంలో కృతకమైన ఉత్సాహం ప్రోత్సాహం ఉంటాయి తప్ప సహజంగా ఉండవు. ఈ కృతకమైన ఉత్సాహప్రోత్సాహాలను ఎప్పటికప్పుడు – వారిని సంతృప్తి పెడుతు–కొనసాగించుకొనవలసిందే కాని అవి శాశ్వతంగా ఉండేవి కావు. ఇలా పనిచేసే వారిలో చాల మందికి వారి జీతం ఒక్కటి మాత్రమే ఉత్సాహాన్ని ప్రోత్సాహాన్ని కలిగించే అవకాశంలేదు. డబ్బురూపంలో లేకుండ ఏవో బహుమతుల ద్వారా వారిని ఆకర్షించటం కష్టం; నేపుప్రతిష్టలమీద మోజుఉన్న కొద్దిమందినితప్ప ఈ బహుమతులు అధికసంఖ్యాకులను ఆకర్షించ లేవు. కాబట్టి వారి ఉత్సాహప్రోత్సాహాలను ఎప్పటికప్పుడు నిలబెట్టు కొని సాగించాలంటే ఎప్పటికప్పుడు వారి వేతనాలను అధికం చేస్తూ

ఉండటంతప్ప మరొక మార్గం లేదు. రష్యాలోని సమిష్టి వ్యవసాయ క్షేత్రాల ఆదాయంలో నూటికి 41 వంతులు ఆ సంఘాల పరిపాలకుల జీతాలక్రింద శ్రామికుల జీతాలక్రింద వ్యయం అయిన సందర్భాలు కూడ ఉన్నవని మనకు వస్తున్న సమాచారాన్నిబట్టి తెలుస్తున్నది.

ఇక సొంతసేద్యం చేసికొనే రైతుల విషయంకూడ చూద్దాం. ఈ రైతుల సేద్యంలో ఎప్పుడో అత్యంతావశ్యకమైన తరుణాలలో తప్ప కూలీలు అంతగా ఉండరు. రైతు తన కుటుంబ సభ్యులతోనే అన్ని పనులను చేసికొంటు ఉంటాడు. వ్యవసాయపు పనులలో ఈ కుటుంబ సభ్యులు తీసికొనే శ్రద్ధకు, చేసేశ్రమకు – సహకార వ్యవసాయసంఘంలోనో లేక సమిష్టి వ్యవసాయ క్షేత్రంలోనో దినభత్యపు కూలీలు తమ పనిలోతీసికొనే శ్రద్ధకు, చేసేయత్నానికి పోలిక పెట్టటం సబబు కాదుగదా! కుటుంబసభ్యులు తీసికొన్నంత శ్రమ, శ్రద్ధ వీరు తీసికోరుగదా! ఈ కుటుంబసభ్యులు తమకోసం, తమ కుటుంబంకోసం, తమ భూముల బాగుకోసం సమయాసమయాలు పాటించక నిరంతరం కృషి చేస్తూనే ఉంటారు కాని ఇంత శ్రమ పెడుతున్నామే మనకు ఎంతో డబ్బు రాపలసి ఉండి రావటం లేదని ఫిర్యాదులు చేయరు! కాని జీతంమీద పనిచేసే వ్యవసాయ నిర్వాహకులు ఇలా చేస్తారా? దీనిలో ప్రధానంగా ఒక విషయం ఉన్నది. ఒక అధికారికి లోబడి, నిరంతరం ఆ అధికారి ఆజ్ఞను సూచనలను పాటించి పాటుపడే మానవునికి తాను చేస్తున్న పనిలో శ్రద్ధ ఉండదు; ఇది మానవనైజం. అలాంటి కార్మికుడు తాను చేసేపనిలో తన తెలివి తేటలను, శారీరక శక్తిని కుటుంబసభ్యులవలె వినియోగించటంకూడ జరుగదు. రెండవ విషయం ఏమంటే సహకారవ్యవసాయవిధానంలో అధికంగా పనిచేసిన దినాలను, కాలాన్ని లెక్కకట్టి అలా చేసిన పనికి ప్రతిఫలం ఇయ్యక తప్పదు; కనుక ఆర్థికంగా ఖర్చులు పెరగకుండ శ్రద్ధతో సాగుచేయటం అనేది ఆవిధానంలో సాధ్యం కాదు. పైగా ఆపద్ధతివల్ల శ్రామికులలో వ్యవసాయం శ్రద్ధాసక్తులు ఉండే అవకాశం లేక పోవటంవల్ల అభివృద్ధికూడ కొన్ని పరిమితులకు లోబడి ఉండక తప్పదు.

కాబట్టి తనకు తానే యజమానిగ ఉండటంవల్ల లభించే ఉత్సాహ ప్రోత్సాహాలవల్ల మానవుడు తక్కువ వ్యయంతో ఎక్కువ పనిని చేయగలడని తేలుతున్నది. అంతేకాక మానవుడు మరొకరికి లొంగకుండ సొంతసేద్యం చేసికొనటంవల్ల స్వేచ్ఛాజీవి నన్న సంతృప్తి ఆర్థిక స్వాతంత్ర్యంకూడ రైతుకి లభిస్తున్నవి. కాబట్టి వ్యవసాయ రంగంలో సొంతంగా తన భూమిని సాగుచేసికొనే రైతే అందరికంటె ఉత్తమ వ్యవసాయ నిర్వాహకుడు. అతని తరువాత తగినంత రక్షణ ఉన్న కౌలుదారును చెప్పాలి. జీతభత్యాలమీద నియమించిన నిర్వాహకులు వీరితో ఎప్పటికీ సాటి రారు. ఇలాంటి రైతులను వ్యవసాయం నుంచి తొలగించి వారికి స్థానం లేకుండా చేశామో-తమ నిర్ణీతకాలానికి మించి అదనంగా పని చేసిన ప్రతినిమిషానికి అదనంగా ప్రతిఫలం కానాలని కాక పర్యవేక్షకులను, నిర్వాహకులను (Supervisors and Managers) అనంతంగా దిగుమతి చేసికొని పోషించ నలసి వస్తుంది. సొంత సేద్యం చేసికొనే రైతు వీరినలెకాక తనకు ఉన్న ఆత్మగౌరవం, స్వేచ్ఛాస్వాతంత్ర్యాలవల్ల ఉత్సాహప్రోత్సాహాలు పొంది వ్యావసాయకకార్యకలాపాలను వీరికంటె ఉత్తమంగా, సమర్థవంతంగా నిర్వహిస్తాడు. అలాంటి రైతులే సృజనాత్మకంగా, సమర్థవంతంగా వ్యవసాయానికి పాటుపడగలరు. కాబట్టి ఈ విధంగా సాంఘికసంక్షేమాన్ని కలిగిస్తు సంఘంలో కళాత్మక జీవితానికి కావలసిన వైవిధ్యానికి పట్టుగొమ్మగా ఉండి పాటుపడుతున్న రైతులను తొలగించటం తద్వారా సంఘానికి ఆ ప్రయోజనాలు లేకుండ చేయటం అవివేకం అవుతుంది. రైతులను ఇలా తొలగించిన పక్షంలో సంఘానికి అపచారం చేయటమేకాక దేశంలోని లక్షలాది రైతులకు ఘోరమైన అన్యాయం చేసినట్లు అవుతుంది. నిర్వాహకవర్గానికి లోబడి దాస్యంలో పని చేస్తూ దినభత్యపు కూలీల దైన్యస్థితికి దిగజారాలని ఈ రైతులు వాంఛించటం లేదు. సంఘశ్రేయస్సుకి అంత ఉత్తమకృషి చేస్తున్న ఈ స్వేచ్ఛాజీవులనేనా ఆ దుస్థితికి నెట్టవలసింది?

V

ఇదంతా కేవలం సిద్ధాంతాల గొడవేకాదు; ఆచరణలో జరుగు తున్న దానిని జరుగనున్న దానిని మాత్రమే మేము వివరిస్తున్నాము. ప్రపంచంలోని అనేకదేశాల ప్రయోగాలు అనుభవాలు ఈ అభి ప్రాయాన్నే రుజువు చేస్తున్నవి. పెద్దపెద్ద క్షేత్రాలకంటె చిన్నచిన్న భూకమతాలలోనే సగటు ఉత్పత్తి అధికంగా లభిస్తున్నది. ఇలా అధి కోత్పత్తిని అందిస్తున్నా భూకమతాల విస్తీర్ణంలోకూడ యాంత్రిక వ్యవసాయ విధానంలోని విస్తీర్ణంకంటె, మానవశ్రమతో పనిచేసే భూకమతాల విస్తీర్ణం ఎల్లప్పుడు తక్కువగానే ఉంటున్నది. అంతే కాక నేటి మన వ్యవసాయపద్ధతులతో సాగుచేస్తున్న భూకమతాలలో కూడ రైతుకుటుంబాలు సొంతంగా సేద్యం చేసికొని భూకమతాల లోనే కేపిటలిస్టు మార్గాల ద్వారా సహకార వ్యవసాయ విధానాల ద్వారా పరోక్షవ్యవసాయంద్వారా సాగు అవుతున్న భూకమతాల కంటె మంచి ఫలితాలు కనిపించినవి. సొంత రైతులతో సంబంధం లేకుండా అమెరికా, రష్యా దేశాలు పెద్దపెద్ద వ్యవసాయక్షేత్రాలను సాగు చేస్తున్నవి; పశ్చిమయూరప్‌లోని దేశాలలో, జపాన్‌లో, ఇండి యాలో సొంతసేద్యం చేసికొనే చిన్నచిన్న రైతులవల్ల భూములు సాగు అవుతున్నట్లు మనకు తెలుసు. ఉదాహరణకు చూడండి. జపానులో సొంతసేద్యం చేసికొంటున్న రైతుయొక్క సగటు భూ కమతం విస్తీర్ణం 2.5 ఎకరాలు; కాని అమెరికాలో 145 ఎకరాలు. ఈ దేశాలలోని ఉత్పత్తిని గురించి కూడ చూడండి. "అమెరికా, రష్యా దేశాలు బియ్యం, గోధుమల ఉత్పత్తికి సంబంధించినంత వరకు ఇతర దేశాలలోకంటె అధికంగా సగటు ఉత్పత్తిని సాధించి ప్రపంచంలో పెద్ద ఉత్పత్తి దారులుగా ఉంటాయని మేము అంచనా వేసికొన్నాం. కాని ఈ అంచనా ఆచరణలో తారుమారు అయ్యింది; తప్పుఅని తేలింది. ప్రతి ఒక్క హెక్టార్‌కివస్తున్న ఉత్పత్తి క్వింటాల్స్‌లో (కాలమానం) అమెరికాలో 12.2, రష్యాలో 9.3, చిన్న చిన్న రైతులున్న బ్రిటన్‌లో 28.5, చిన్న చిన్న భూకమతాలున్న డెన్మార్క్‌లో 34.4, ఫ్రాన్సులో 27.5, జర్మనీలో 26.1, స్విట్జర్లెండులో 34.2; బ్రిటనులోకంటె కూడ చిన్న చిన్న భూకమతాలు ఉన్న జపా

నులో – జపానులో ఒక్కొక్క కుటుంబానికి అరఎకరం భూమి మాత్రమే ఉన్నది–ప్రతి ఒక్క హెక్టార్‌కి 26.6 క్వింటాలుల గోధుమ ఉత్పత్తి అవుతున్నది. జపానులోని హెక్టార్‌కి వస్తున్న సగటుగోధుమ పంట అమెరికాలో కంటె 2 రెట్లు హెచ్చు; రష్యాలోకంటె $2\frac{1}{2}$ రెట్లు హెచ్చు. వరిపంట విషయంలోకూడా అంకెలు ఇలాగే కనపడుతున్నవి. వరిపంట అమెరికాలో ప్రతి ఒక్క హెక్టార్‌కి సగటున 28.3 క్వింటాలులు, రష్యాలో 21.5, చిన్న చిన్న రైతుల భూకమతాలు ఉన్న జపానులో 48.5 క్వింటాలులు ఉత్పత్తి అవుతున్నది.

($2\frac{1}{2}$ ఎకరాలు ఒక హెక్టార్. 100 పౌనులు ఒక క్వింటాల్ – అనువాదకుడు)

"ఈ అంకెలవల్ల గోధుమ పంట అమెరికా, రష్యా దేశాలలో కంటె డెన్మార్క్, స్విట్జర్లెండు దేశాలలో 3, 4 రెట్లు అధికం అని, జపానులో 2 రెట్లు అధికం అని తెలుస్తున్నది గదా! సోవియట్ రష్యాలో వ్యవసాయరంగంలో ఎంతపెద్ద యంత్రాలు ఉన్నప్పటికి రష్యాకంటె జపానులో వరిపంట సగటున రెండురెట్లు అధికంగా పండుతున్నది." *

అంతేకాక కాంగ్రెస్ వ్యావసాయకసంస్కరణ సంఘనివేదికలో (23 పుట) ఇచ్చిన ఈ క్రిందిలెక్కల పట్టికనుబట్టి చూచినప్పుడుకూడ ఇదే అభిప్రాయం ధృఢం అవుతుంది.

డెన్మార్క్

భూకమతం విస్తీర్ణం	ఎకరానికి మొత్తం ఉత్పత్తి			ఎకరానికి నికరోత్పత్తి		
	పౌ	షి	పె	పౌ.	షి.	పె
25 ఎకరాలలోపు	20	1	0	2	11	0
25 నుంచి 50 ఎకరాలవరకు	15	4	0	3	8	0
50 నుంచి 75 ఎకరాలవరకు	15	3	0	3	13	0
75 నుంచి 100	13	18	0	3	14	0
100 నుంచి 250	12	8	0	3	3	0
250 ఎకరాలపైన	12	4	0	3	0	0

* M. R. Masani's Speech in the Parliament on 30th July, 1957

అమెరికా

	40 ఎకరాల భూకమతం	80 ఎకరాల భూకమతం
ఎకరానికి ఉత్పత్తి	54 డాలర్లు	48 డాలర్లు

స్విట్జర్లెండు

భూకమతం విస్తీర్ణం	$7\frac{1}{2}$ - $12\frac{1}{2}$	$12\frac{1}{2}$ - 25	25 - $37\frac{1}{2}$	$37\frac{1}{2}$ - 75	75 ఎకరాలపైన
	పౌ. షి. పె	పౌ. షి. పె	పౌ. షి పె	పౌ. షి. పె	పౌ. షి. పె
ఎకరానికి మొత్తం ఉత్పత్తి	22-11-7	19- 0 3	17-17-2	16- 2-3	13-17-7
ఎకరానికి నికరోత్పత్తి	3-17-6	4-14-9	5- 8-3	5- 1-2	4- 5-9

ఇంగ్లండ్

భూవిస్తీర్ణం	ఎకరాకు ఉత్పత్తి		
	పౌ.	షి.	పె
1 నుంచి 50 ఎకరాలవరకు	11	19	9
50 నుంచి 100 ఎకరాలవరకు	9	19	2
100 నుంచి 150 ఎకరాలవరకు	7	19	1
150 నుంచి 250 ఎకరాలవరకు	7	5	8
250 ఎకరాలపైన	8	4	4

ఫిన్‌లాండ్ దేశంలో మంత్రిగాఉన్న డాక్టర్ జావానీస్‌విరోలినెన్ గారినిమేము 1956 సంవత్సరం నవంబరు 19వతేదీన వ్యక్తిగతంగా కలిసికొని మాటాడినప్పుడు ఆయనకూడ ఈ అభిప్రాయాన్నే ధృఢపరిచాడు. వారి పొరుగు దేశమైన రష్యాలోని సమిష్టి వ్యవసాయ క్షేత్రాలలో ప్రతి ఎకరానికి 2 టన్నుల గోధుమ పండిస్తే వారిదేశం (ఫిన్‌లాండ్) లోని నైఋతిస్వామ్యపు భూకమతాలలో ఎకరానికి 4 టన్నుల గోధుమ పండించినట్లుగా ఆయన మాతోచెప్పాడు. ఇప్పుడిప్పుడు ఈ వ్యత్యాసం కమ్యూనిస్టు దేశాలలోకూడ కనిపిస్తున్నది. పోలెండు దేశపు కమ్యూనిస్టు నాయకుడు గోముల్కాసైతం పోలెండ్‌లోని "వ్యక్తిక వ్యవసాయ

దారులు ప్రతిఒక హెక్టార్‌కి సహకారవ్యవసాయ క్షేత్రాలలోకంటె నూటికి 16.7 పాళ్ళు, ప్రభుత్వక్షేత్రాలలోకంటె నూటికి 37.2 పాళ్ళు అధికంగా పండించినట్లు"* అంగీకరించక తప్పలేదు. భారతదేశంలో కూడ కేంద్రప్రభుత్వ వ్యవసాయశాఖవారు వ్యవసాయక్షేత్రాల నిర్వహణ విషయమై అనేక ప్రదేశాలలో జరిపిన పరిశీలనలవల్ల ఇదే విషయం రుజువైనది. ఈ మంత్రిత్వశాఖ జరిపిన పరిశీలనలవలనకూడ చిన్న భూకమతాలలోనే పెద్దక్షేత్రాలలో కంటె ప్రతి ఎకరాకిని మొత్తం ఉత్పత్తి అధికంగా వస్తున్నట్లు తేలింది.

(భారత రైతాంగసంస్థ తరఫున కృష్ణాజిల్లాలోని దివి తాలూకాలో పది చదరపుమైళ్ళ విస్తీర్ణంగల వ్యవసాయభూములలో వ్యవసాయపు ఖర్చులు ఆదాయాలు ఉత్పత్తులు ఎలా ఉంటాయో, భూకమతాల విస్తీర్ణాన్నిబట్టి ఎలాంటి వ్యవసాయాలు ఉంటాయో తెలిసికొనేటందుకుగాను కావించబడిన పరిశీలనలను గురించి, ఆ పరిశీలన ఆశయాలను, విధానాలను, ఫలితాలను గురించి మూలగ్రంథంలో విపులంగా చర్చించి కొన్నిపట్టికలను చేర్చారు. ఈ అనువాదం తెలుగువారికే కనుక మనకు మనప్రాంతంలోని వ్యవసాయక విషయాలు తెలిసే ఉన్నవి కనుక ఆ భాగాన్ని అనువదించకుండ వదిలివేశాను. ఇప్పటికే గ్రంథం పెరుగుతూ ఉన్నందువల్ల ఈ స్వాతంత్ర్యం తీసికోవలసివచ్చింది. ఏమైనప్పటికి ఈ పరిశీలనవలన తేలిన సారాంశాన్ని మాత్రం క్రింద అనువదించాను—జగన్నాథం)

(1) భూకమతంయొక్క విస్తీర్ణం పెరిగిన కొందికి ప్రతి ఎకరానికి సగటున ఖర్చులు పెరుగుతు ఉన్నట్లు తేలింది. పెద్దక్షేత్రాలనాగున్నవల్ల కొన్నికొన్ని విషయాలలో చిన్నకమతాలలోకంటె సగటున తక్కువఖర్చులే అయినప్పటికి ఆ పెద్దక్షేత్రాలవల్ల మరికొన్ని విషయాలలో సగటున ఖర్చులు అధికంగా పెరిగి మొత్తంమీద ప్రతి ఎకరానికి పెద్దక్షేత్రాలలో సగటున ఖర్చులు పెరిగిపోయినవి.

* Gomulka's speech at the eigth Plenum of the PZPR centra Committee on Oct. 29, 1956.

(2) భూకమతంయొక్క విస్తీర్ణం పెరిగినకొందికి ప్రతి ఎకరం నుంచి వచ్చే మొత్తం ఉత్పత్తి సగటున తగ్గిపోతూ ఉన్నది.

(3) భూకమతాల విస్తీర్ణం తగ్గినకొందికి—అంటే చిన్నచిన్న కమతాలలో—ప్రతి ఎకరంనుంచి వచ్చే ఉత్పత్తిదారుల మిగులు సగటున పెరుగుతూ ఉన్నది. అనగా ఖర్చులుపోను మిగిలే నికరాదాయం చిన్నరైతులకు ఒకొక్కక్క ఎకరానికి వచ్చినంతగా పెద్ద రైతులకు రావటం లేదు.

(4) రైతుకి తన భూకమతంనుంచి లభించే నికరాదాయం భూకమతంయొక్క విస్తీర్ణం క్రమంగా పెరుగుతూ పరిమిత భూకమతం యొక్క విస్తీర్ణానికి వచ్చేవరకు భూమి ఏ నిష్పత్తిలో పెరిగిందో అదే నిష్పత్తిలో పెరుగుతూ వచ్చింది. కాని ఆ పరిమితభూకమతం విస్తీర్ణం దాటిన అంతకంటె పెద్ద భూకమతాలలో భూమి పెరిగిన నిష్పత్తిలో నికరాదాయం పెరగటం లేదు. ఈ విషయాన్ని ప్రధానంగా గ్రహించవలసిన అవసరం ఉన్నది. ఆర్థిక కార్యక్రమాలదృష్ట్యా, ప్రణాళికదృష్ట్యా దీనికి చాల ప్రాముఖ్యం ఉన్నది.

(క) పరిమిత భూకమతంలోనే సాధ్యమైనంత ఎక్కువ నికరాదాయం వస్తున్నదని పైన చెప్పాం. కాబట్టి ఈ పరిమిత భూకమతం విస్తీర్ణంకంటె పెద్దవిగాఉన్న భూకమతాలను చిన్నచిన్న కుటుంబ కమతాలుగా విభజించి సొంతసేద్యం చేసికొనే వారికి ఇచ్చిన పక్షంలో ఈ భూములమీద ఉత్పత్తి పెరుగుతుంది; నికరాదాయంకూడ చాల పెరుగుతుంది. ఇలా ఉత్పత్తి నికరాదాయం పెరగటమేకాక స్వయంగా వృత్తులను కల్పించుకొని స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో జీవించే రైతుల సంఖ్యకూడ పెరుగుతుంది. దీనివల్ల సంఘానికి ఎన్నిప్రయోజనాలు రాగలవో గమనించారా ? ఇవేకాక ధనరూపంలో వ్యవసాయానికి వినియోగించే ఖర్చులుకూడ తగ్గిపోతవి.

(గ) కాబట్టి సొంతసేద్యం చేసికొనే రైతుల కుటుంబ కమతాలను అభివృద్ధి పరచ ప్రోత్సహించే విధంగా మన వ్యవసాయం పునర్నిర్మాణం జరగాలి. ఈ కుటుంబ వ్యవసాయ విధానంవల్ల రైతులు

స్వప్రయోజనాలోచనలతో సాంఘిక ప్రయోజనాలను విస్మరించి ప్రవర్తిస్తున్నారని మన ప్రణాళికాకారులు భావిస్తున్నట్లుగా ఉన్నది. ఈ కుటుంబ వ్యవసాయంలోని రైతులు తాము ఎంత ధనాన్ని వ్యవసాయంమీద ఖర్చుపెట్టుతున్నాము, ప్రతిఫలంగా ఎంత రాబడి వస్తున్నది అని ఆలోచిస్తున్నారే కాని సాంఘికదృష్టితో యోచించి వ్యవసాయంలో పెడుతున్న ఖర్చు సాంఘికంగా ఎంత, అందువల్ల ఎంతటి ప్రయోజనాలు సిద్ధిస్తున్నవి అనే విషయంగురించి పట్టించుకొనటం లేదని ప్రణాళికాకారులు అంటున్నారు. కాని ఈ అభిప్రాయం హేతుపరిశీలనకు, వాస్తవస్థితిగతులకు నిలబడేది కాదు; ఎలాగో చూడండి : భూమిని అభివృద్ధి చేసేటందుకు మనం వేసే ప్రణాళికలు అన్ని ఇతర అవకాశాలు లేనందువల్ల మానవశ్రమమ్మీదనే ప్రధానంగా ఆధారపడి ఉంటున్నవిగదా! మన దేశంలోని రైతులకు వ్యవసాయం తప్ప మరొక ఆధారము పని లభించటం లేదని కూడ మనకు తెలుసు; పైగా వ్యవసాయంలో అవసరానికి మించికూడ ప్రజలు ఉన్నారని ఇది వరకే తెలిసికొన్నాం. వీరికి మరే ఇతరపనులు దొరకవు. వ్యవసాయంలోకూడ చాలీచాలని పనేకాని చేతినిండ పని లేదు. అందుచేత రైతులు, రైతుకుటుంబసభ్యులు నిరంతరం తమ పొలాలమీద—తమపనికి ప్రతిఫలంగా ఎంతధనం లభించగలదు అన్న గుణకారాలతో నిమిత్తం లేకుండ—శ్రమ పడుతున్నారు. అందుచేత వీరు ఇన్ని నిమిషాలు పనిచేస్తున్నామే ఎంతడబ్బు వస్తుంది అనే ఆలోచనతో పని చేస్తున్నారనటం వాస్తవం కాదు. ఈ సొంత సేద్యంలోనే ధన రూపంలో అంతెగా వ్యయం చేయవలసిన అవసరం లేకుండా వ్యవసాయం నిర్వహింపబడుతున్నది. అసలు వాస్తవానికి భారీఎత్తున సాగే కేపిటలిస్టు వ్యవసాయ విధానంలోను, సహకారవ్యవసాయ విధానంలోను మాత్రమే మన ప్రణాళికాకారులు ఆపాదిస్తున్న దోషాలు కనిపిస్తున్నవి. ఈ రెండుపద్ధతుల వ్యవసాయంలోను ఆయా సభ్యులుకాని, శ్రామికులుకాని, నిర్వాహకులుకాని నిర్ణీతకాలంకంటె ఎక్కువ పని చేయరు; నిర్ణీతకాలానికి మించి పనిచేసిన ప్రతినిమిషానికి వారికి అదనంగా ప్రతిఫలం ఇయ్యవలసి ఉంటుంది. ఇలా అదనంగా ప్రతిఫలం ఇచ్చినప్పటికి వీరు సొంత సేద్యంలోని రైతు తీసికొన్నంత

శ్రద్ధ, శ్రమ తీసికొనటం జరుగదు. కాబట్టి దినభత్యపు శ్రామికుల శ్రమమీద ఆధారపడి నిర్వహింపబడే కేపిటలిస్టు వ్యవసాయంలోను, సహకారవ్యవసాయ విధానంలోను మాత్రమే మన ప్రణాళికాకారులు చెపుతున్న స్వార్థపూరితాలోచన—అంటే ఇంత పెట్టుబడి పెడుతున్నాంగదా మరి దానికి ఎంత ప్రతిఫలం వస్తున్నది అనే ఆలోచన—ఉండటానికి అవకాశం ఉన్నది. కుటుంబవ్యవసాయంలో ఈ దోషం లేదు. కుటుంబవ్యవసాయం సాంఘిక దృక్పథంతోనే కొనసాగుతు ఉంటుంది. కుటుంబసభ్యులు నిర్వహించే పనుల స్వభావంవల్ల సొంత సేద్యంలో వారికి లభిస్తున్న సంతృప్తివల్ల స్వేచ్ఛవల్ల ఈ విధానం సాంఘికంగా ప్రయోజనకారి; సాంఘిక దృక్పథమె ప్రధానంగా కల విధానం. సొంత సేద్యంవలన లభించగల స్వయంవృత్తి, స్వేచ్ఛ, స్వాతంత్ర్యం సాంఘిక సామరస్యానికి, అభ్యుదయానికి తోడ్పడేవికావా? కుటుంబకమతాల వ్యవసాయానికి, భారీవ్యవసాయానికి ఉత్పత్తులలో అంత వ్యత్యాసం ఉండటానికి వ్యవసాయపు పనులలో వాసు తీసికొంటున్న ఉత్సాహము, శ్రద్ధ ప్రధానకారణాలు అని చెప్పక తప్పదు. చిన్నచిన్న కుటుంబకమతాల వాసు తమ పొలంమీద పని చేసినన్ని రోజులు భారీవ్యవసాయంలో చేయటం లేదు. కాబట్టి సొంతసేద్యం చేసికొనే చిన్న రైతులు ప్రతిఫలం గురించి గుణకారాలు వేసికొంటు ఉంటారనే వాదానికి ఆధారంలేదు. ఇక్కడ ఒక సందేహంరావచ్చు. చిన్నచిన్న కమతాలు ఎక్కువ రోజులు పనిచేసి అధికోత్పత్తిని, నికరాదాయాన్ని పొందుతున్నట్లయితే, భారీవ్యవసాయంలోని వాసు కూలీలను ఇంక ఎక్కువగా ఉపయోగించి ఆ అధికోత్పత్తిని, నికరాదాయాన్ని తాము ఎందుకు పొందటం లేదు? అని అడగవచ్చు. దీనికి కారణం ఉన్నది. భారీవ్యవసాయంలోని వారు తమ పొలాలమీద జరిగే ప్రతిపనికి వేతనాలు ఇచ్చుకొనవలసి ఉన్నది. ఒకవేళ వేతనాలు ఇచ్చి కూలీలను అధికంగా ఉపయోగించుకొన్నా, ఈ కూలీలు సొంత రైతు తీసికొన్నంత శ్రద్ధతో, ఉత్సాహంతో, 'ఇదినాది' అన్న మమకారంతో పనిచేయరు. పైగా ఇలా అదనంగా కూలీలను వినియోగించినందుకుగాను కనీసం వారికి ఇయ్యవలసిన వేతనాలకు సరిపోయేటంత అధికోత్పత్తి నికరాదాయం వచ్చినా ఈ పెద్దరైతులు అలా

చేస్తాము. కాని ఈ పరిశీలనవలన ఆ అధికోత్పత్తులకోసం నికరాదాయం కోసం వినియోగించవలసిన అదనపుశ్రమకు వ్యయానికి సరిపోయే రాబడికూడ అందువల్ల అధికంగా రాదని తేలింది.

ఈ పరిశీలనవలన తేలిన మరొక విషయాన్నికూడ ఇక్కడ చెప్పవలసి ఉన్నది. భారీవ్యవసాయం చేసే పెద్దరైతులకు సొంత సేద్యం చేసికొంటున్న చిన్న రైతులకంటె ఆర్థికంగా రాబడి ఎక్కువ వస్తుంది. దీనికి కారణం ఏమిటి? ఉత్పత్తి కాని, నికరాదాయంకాని పరిశీలించినప్పుడు చిన్నరైతులే అధికంగా పొందుతున్నట్లు మొదట్లో చెప్పాము. కాని డబ్బు రూపేణా చూచినపుడు పెద్ద భారీ వ్యవసాయదారులకే ధనం అధికంగా వస్తున్నది. వ్యవసాయ సేద్యానికి సంబంధించిన కృషికాక దానికి వెలుపలకూడ కొన్ని ప్రధాన విషయాలు ఉన్నవని ఇదివరలో వివరించే ఉన్నాం. పంటలు సరైన ధరలకు అమ్ముకోనటం, ఋణసౌకర్యం, ఎరువుల కొనుగోలు, వ్యవసాయపరికరాల కొనుగోలు మొదలైన అనేక విషయాలలో భారీవ్యవసాయదారులకు అనేక అవకాశాలు అధికంగా ఉన్నవి. సహకార సేవాసంఘాలు ఉన్న పక్షంలో ఈ అవకాశాలు చిన్న రైతులకు కూడ ఉండేవే. కాని మేము పరిశీలించిన ప్రాంతాలలో అలాంటి సంఘాలు లేవు. చిన్న రైతులు ఇలాంటి విషయాలలో చాల నష్టపోతున్నారు. అందువల్లనే డబ్బు రూపంలో చూచినప్పుడు భారీ వ్యవసాయదారులకు అధికాదాయం కనిపిస్తున్నది.

స్వయం నిర్ణయాధికారం లేని భూకమతాలు

భారీవ్యవసాయంకంటె చిన్న చిన్న కమతాల సొంత సేద్యమే ఆర్థికంగా లాభదాయకమని, సమర్థవంతంగా నిర్వహింపబడుతున్నదని పైన కావించిన పరిశీలనవలన తేలినదిగదా! ఈ పరిశీలన, దీనివలన గోచరమైన విశేషాలు ఇతర దేశాల విషయం ఎలా ఉన్నప్పటికి భారత దేశస్థితిగతులకు యథార్థపు ప్రతిబింబాలు. చిన్ని చిన్న భూకమతాలు వాటిని సొంతంగా సేద్యం చేసికొనే స్వతంత్రమైన రైతులు మన దేశవ్యవసాయరంగ ప్రధానలక్షణమని మనకు తెలిసిన విష

ుమే. మన శాసనసభలు భూమిని గురించి కొన్ని కొన్ని శాసనాలు చేస్తున్నవి; అనతికాలంలోనే భూకమతాలకు గరిష్ఠపరిమితులనుకూడ నిర్ణయించేటట్లు కనిపిస్తున్నది. ఈ గరిష్ఠపరిమితి నిర్ణయించిన తరువాత మన వ్యవసాయరంగంలోని ప్రధానలక్షణమైన చిన్నచిన్న కుటుంబ కమతాలు, చిన్న చిన్న రైతులు మరింత అధికంగా పెరిగే అవకాశం కనిపిస్తున్నది.

మన ప్రణాళికా సంఘం ఈ సందర్భాన్ని గురించి చెపుతున్న అభిప్రాయాలను సూక్ష్మంగా పరిశీలించటం అవసరం. వారి అభిప్రాయాన్ని స్థూలంగా ఇలా చెప్పవచ్చు. భారతదేశంలోని చిన్నచిన్న భూకమతాలు మరీ చిన్నవిగా ఉన్నవి. ఇవి ఎంత చిన్నవిగా ఉన్నవంటే మేము పరిశీలించిన చిన్న కుటుంబ కమతాలలో వస్తున్న ప్రయోజనాలను, లాభాలను కూడ పొందటానికి అవకాశం లేనంత చిన్నవిగా ఉన్నవి. ఇవి ఎంత చిన్నవిగా ఉన్నవో తెలిసికొనటానికి ఈ క్రింది వివరణ తోడ్పడుతుంది. మా పరిశీలనవలన పరిమిత భూకమతంయొక్క విస్తీర్ణం 30 ఎకరాల వరకు ఉండాలని తేలింది. (ఈ 30 ఎకరాలు పరిమిత భూకమతం విస్తీర్ణం మాత్రమే కాని దీనినొక పెద్ద భూకమతంగా పరిగణించ రాదు.) భారతదేశంలో సగటు భూకమతం విస్తీర్ణం $7\frac{1}{2}$ ఎకరాలు మాత్రమె. కాబట్టి దేశంలోఉన్న సగటు భూకమతానికి, పరిమిత భూకమతానికి ఎంత తేడా ఉన్నదో గమనించవచ్చు. ఈ తేడా ఇంత మాత్రమేకాదు; ఆ యా ప్రాంతాల భూసారాన్ని వ్యవసాయకోత్పత్తికి సంబంధించిన ఇతర విషయాలను పరిశీలించి నప్పుడు కొన్ని చోట్ల ఈ పరిమిత భూకమత విస్తీర్ణం ఇంతకంటె చాల పెరగవలసి ఉన్నది. (మేము పరిశీలించిన ప్రాంతం దేశంలో సారవంతమైన ప్రాంతాలలో ఒకటి. మన దేశాలలో సగటున ఒక ఎకరానికి పండిస్తున్న ధాన్యంకంటె ఈ ప్రాంతంలో నాలుగురెట్లు అధికంగా పండుతుంది.) ఇది వాస్తవస్థితి. తమ అభిప్రాయాన్ని బలపరుచుకోవటానికి ప్రణాళికా సంఘం వారు ఇలా అంటున్నారు. మన దేశంలోని ఈ చిన్నచిన్న భూకమతాలవల్ల ఎడ్లజత, నాగలి మొదలైన వ్యవసాయక పరికరాలను సమగ్రంగా సంపూర్ణంగా చిన్న రైతులు వినియోగించుకోలేరు. ఈ చిన్న భూకమతాలవల్ల ఎరువులు, మంచి విత్తనాలు, నీటిపారుదల సౌకర్యాలు, పశువులు, పశుసంపద మొదలైన వాటిని సమర్థవంతంగా ఉపయోగించుకోలేరు. ఈ చిన్న భూకమతాలవల్ల వ్యవసాయంలో ఉపయోగించే శ్రమ, పెట్టుబడి, యాజమాన్యం మొదలైన వాటిలో ఎంతో వృథా అవుతున్నది

యోగించుకొనలేక పోతున్నారు. అంతే కాక ఆ చిన్న రైతులు తమ కుటుంబంలోని వారి కందరకు తగినంత పనిని చూపించి మానవ శ్రమను సక్రమంగా వినియోగించుకొనలేక పోతున్నారు. ఆ కుటుంబ సభ్యులలో ఉన్న నిర్వాహక సామర్థ్యాన్ని సరిగా సమగ్రంగా ఉపయోగించుకొనలేక పోతున్నారు. ఈ పరిస్థితివల్ల, పరిమితులవల్ల దేశంలో లభ్యం అవుతున్న పశుశక్తిని, మానవశ్రమను సక్రమంగా సమగ్రంగా ఉపయోగించుకొనటం జరగలేదు. అందుచేత సంఘం ఆ మేరకు నష్టపడుతున్నది; సాంఘికసంపద వృథా అవుతున్నది. ఈ నిరుద్యోగాన్ని నివారించి వ్యవసాయకుటుంబ సభ్యులకు చాలినంత పని చూపించటానికి, పశుశక్తిని వ్యావసాయక పరికరాలను సక్రమంగా సమగ్రంగా ఉపయోగించుకొనటానికి ప్రస్తుతం మనకు ఉన్న భూములను సాధన సంపత్తులను ఒకచోటచేర్చి ఏకం చేసి సహకారవ్యవసాయ నిర్వహణకు అవకాశం కలిగించటం అవసరం అని వారు చెపుతున్నారు.

పరిమిత భూకమతంకంటె చాల చిన్నదిగా ఉండే భూకమతంలో అంతగా లాభాలు రావటం వాస్తవమే; అయినప్పటికి వీరు చెపుతున్నంత నష్టదాయకంగాను, అంత కొద్దిపాటి లాభదాయకంగాను మాత్రం లేవు. మన దేశంలోని ఈ చిన్నచిన్న కమతాలు లాభదాయకంగా ఉండక పోవటానికి కారణం భూవిస్తీర్ణం కాదు; ఇతర విషయాలవల్ల మాత్రమే ఈ చిన్నచిన్న కుటుంబ కమతాలు ఆర్థికంగా లాభదాయకంగా ఉండలేక పోతున్నవి.

దేశంలో ప్రతి చిన్న రైతుకి ఒక ఎడ్లజత, దానికి కావలసిన సరంజామా, వ్యావసాయక పరికరాలు ఉన్నాయనుకోవటం పొరపాటు. వీటిని ఆ చిన్న రైతులు సమగ్రంగా వినియోగించుకొన లేక వృథా చేస్తున్నారని వాదించటం అంతకంటె పొరపాటు. వాస్తవానికి చిన్న రైతులలో చాలమందికి ఎడ్లు ఉండవు. ఇతర వ్యావసాయక పరికరాలు కూడ పెద్దపెద్దవి—ఉండవు. తమ చిన్న కమతాలను సాగు చేసి కొనేటందుకు కావలసిన ఎడ్లు, వ్యవసాయ పరికరాలు సంపాదించుకొనటానికి వీరు అనేక మార్గాలు చూచుకొంటు ఉంటారు. ఉదాహరణకు చూడండి. ఎడ్లు, బండి లేని చిన్నచిన్న రైతులు తమ

ఇరుగుపొరుగున ఎడ్లు, బండ్లు ఉన్న రైతుల పనిపాటలలోకి పోతూ ఉంటారు. తాము మానవశ్రమ రూపంలో పొరుగువారికి సహాయం చేసి వారి ఎడ్లను, వ్యవసాయ పరికరాలను ఉపయోగించుకొని తమ భూములను సేద్యం చేసికొంటూ ఉంటారు. చిన్నచిన్న రైతులు అనేకులు పెద్దరైతుల పనిపాటలలో ఉంటు తమ పొలాలను సాగు చేసికొనటం మనం నిత్యం చూడటం లేదా ? మామూలుగా గ్రామంలోని రైతులలో ప్రతి ఇద్దరిలోను ఒకరికి మాత్రమె ఎడ్లు, బండ్లు, వ్యవసాయపరికరాలు ఉండటం తరచుగా చూస్తూ ఉంటాం. ఆ రెండవ రైతు ఈ బళ్ళున్న రైతుకి మానవశ్రమరూపంలో సహాయ పడుతున్నాడు, ప్రతిఫలంగా అతని ఎడ్లను సామగ్రిని తన అవసరాలకు ఉపయోగించుకొంటున్నాడు. ఈ విధానంవల్ల ఇద్దరికీ లాభం ఉన్నది. రెండురకాల ప్రయోజనాలు సిద్ధిస్తున్నవి. ఎడ్లు, బళ్ళుకొన్న రైతు తన పెట్టుబడికి తగినంత ప్రతిఫలాన్ని పొందగలుగుతున్నాడు ; తన ఎడ్లను, సామగ్రిని తన పొలంమీద వినియోగించుకొనటమే కాక వాటిని బదులుగా ఇచ్చి తనకు అవసరమైన మానవశ్రమను అదనపు వ్యయం లేకుండానే సేకరించుకొంటున్నాడు. అలాగే చిన్న రైతుకి కూడ లాభం ఉంటున్నది. ఈ చిన్న రైతు ఎడ్లు, బళ్లుకొని పెద్ద పెట్టుబడి పెట్టపలసిన అవసరం లేకుండా పని గడుపుకొంటున్నాడు. తన భూమిమీద తాను శ్రమించటమె కాక తనకు విరివిగా లభ్య మవుతున్న విరామ సమయాన్ని పొరుగువారి పనిలో ఉపయోగించి నిరుద్యోగంనుంచి తప్పుకొంటున్నాడు; తన పనికి ప్రతిఫలంగా వారి పరికరాలను ఉపయోగించుకొని ధనవ్యయం లేకుండ తన చిన్న కమతాన్ని సాగు చేసికొంటున్నాడు. మన దేశపు వ్యవసాయ రంగంలోని ప్రధాన విషయాన్ని ఒకదాన్ని ఈ ఆర్థికవేత్తలు గమ నించటం లేదు. చిన్న రైతులు ప్రతివారు ఎడ్లు, బళ్లు కొనరు ; విభాగాలైన అన్నదమ్ములు కలిసి ఉమ్మడిగా వీటిని కొని ఉపయో గించుకొనటం చూస్తున్నాం. వ్యావసాయకపరికరాలనుకూడ ఉమ్మడిగా కాని, సహకారభావంతో కాని వాడుకోవటం జరుగు తున్నది. ఇలాకాక మిత్రులు, బంధువులు, ఇరుగుపొరుగు వారు కలిసి వ్యవసాయానికి కావలసిన సామగ్రులను తలా ఒకటి కొని

అన్నింటిని కలిపి ఎవరికి అవసరం వచ్చినప్పుడు వారు వాడుకోవటం కూడ మనం చూస్తున్న సంగతే. ఈ వ్యావసాయక పరికరాలను గురించి వాస్తవం ఏమిటో తెలిసికొనవలెనని మేము ప్రత్యేకంగా కొన్ని గ్రామాలలో లెక్కలు సేకరించి పరిశీలన చేశాం. గ్రామంలోని చిన్నచిన్న కుటుంబకమతాలలో అంటే 20 ఎకరాలకు లోపు భూమి ఉన్నవారిలో—నూటికి 40 మందికి మాత్రమె ఒక ఎడ్లజత, బండి ఉన్నవి. ఇక మిగిలిన 60 మంది వాటిని కొనకుండానే తమ అవసరాలను పైన వివరించిన విధానాలతో తీర్చుకొంటున్నట్లు తేలింది.

ఇక ఈ వ్యావసాయకపరికరాలపై అవుతున్న ఖర్చుల సంగతిని గురించి ఒక విషయం చెప్పాలి. మన వ్యవసాయం మానవశ్రమ ప్రధానాంశంగా కొనసాగుతు ఉన్నది. ఇది మన సంప్రదాయపద్ధతి. యాంత్రికవ్యవసాయవిధానం వేరు. మన వ్యవసాయంలో కావలసిన పరికరాలకోసం యాంత్రికవ్యవసాయ పరికరాలపై వినియోగించేటంత పెట్టుబడి మాత్రమె కాదు. యాంత్రిక వ్యవసాయ విధానంలోని యంత్రాలు మొదలైన వాటిని వినియోగించు కోవటంలో కూడ నూనెలు, విద్యుచ్ఛక్తి మొదలైన వాటికింద వ్యయం చేసినంతగా మన వ్యవసాయ పరికరాల వాడకానికి ఖర్చు పెట్టవలసిన అవసరం లేదు. యాంత్రికవ్యవసాయంలో అయ్యే ఖర్చులో చాల భాగం ఈ పరికరాల కిందనే అవుతు ఉంటుంది. కాని పశుశక్తిపై ఆధారపడే వ్యవసాయవిధానంలో-అంటే మన వ్యవసాయపద్ధతిలో-ఇలాజరగదు. ఒక ఎడ్లజతను కొనటానికి ఒక యంత్రానికి పెట్టుబడి పెట్టినంత ధనం అవసరం లేదు; యంత్రాలను నడపటానికి అయ్యేటంత వ్యయం ఈ ఎడ్లపైన కాదు. ఈ వ్యవసాయానికి ఇతర కారణాలు అలా ఉండగా మన కంటికి కనిపిస్తున్న ఒక కారణం ఉన్నది. పొలంలోని గడ్డిగాదంలో ధనవ్యయం లేకుండ ఈ ఎడ్లను రైతు పోషించుకొంటున్నాడు; పైగా ఈ ఎడ్లను ధనంపెట్టి కొననవసరం లేకుండ తమ తమ దొడ్లలోని ఆవులకు పుట్టిన కోడెలనే రైతులు ఎక్కువగా సాకుకొంటున్న సంగతి మనకు తెలిసినదేగదా! కాని యాంత్రిక వ్యవసాయ విధానంలో ఎప్పటి కప్పుడు డబ్బుపెట్టి యంత్రాలను కొనక తప్పదు. యంత్రాలు

మన దొడ్లో ఉత్పత్తి అయ్యేవి కావుగదా! మొత్తం వ్యవసాయ ఖర్చులో నూటికి 7.5 పాళ్లు మాత్రమె ఈ ఎడ్లను పోషించటానికి న్యాయం అవుతున్నదని తేలింది; వ్యావసాయక పరికరాల విషయం కూడ ఇంతే. తాళ్ళు మొదలైన వ్యవసాయ పరికరాలను రైతులే తమ తీరికసమయాలలో సొంతంగా తయారు చేసి కొంటారు. ఇక మిగిలిన మొత్తం వ్యవసాయపరికరాల నిర్వహణకు గాని, తీసివేతకు (Depreciation) గాని అయ్యే వ్యయం ఎకరానికి 7 రూపాయలు అవుతున్నట్లు తేలింది. రైతులకు వారివారి గ్రామాలలోనే వడ్రంగులు వారికి అందుబాటులో ఉంటున్నారు. వ్యవసాయ పరికరాలకు కావలసిన కలపకూడ గ్రామాలలోనే లభ్యం అవుతున్నది. ఈ వడ్రంగులకుగాని, కొయ్యకుగాని రైతు ఎకరానికి అయ్యే మొత్తం ఖర్చులో నూటికి 10.25 పాళ్లు వినియోగిస్తున్నాడు. కనీస భూకమతంకంటె కూడ చిన్న చిన్న భూకమతాలు ఉన్నవారికి ఈ ఖర్చు ఇంత కంటె కొంచెం పెరగవచ్చు. కాని ఆ పెరుగుదల పెద్దలోనిది కాదు, చాల స్వల్పం.

పైన వివరించిన రెండు విషయాలదృష్ట్యా — అంటె చిన్నచిన్న రైతులలో చాలమంది ఎడ్లు బండి లేకుండానే సేద్యం చేసికొంటు ఉండటం పైగా ఈ అంశంమీద రైతులు ప్రస్తుతం పెడుతున్న ఖర్చు యాంత్రిక వ్యవసాయంలో ఉన్నంత అధికంగా కూడ ఉండటం చేత — మనం ఒక నిర్ణయానికి రావలసి ఉన్నది. ప్రస్తుతం మన చిన్న కమతాలమీద ఉన్న ఎడ్లు, దున్నలు మొదలైన పశువులశక్తి చాల వరకు వృథాఅవుతున్నది. అయినప్పటికి చిన్న కమతాలు ఈ కారణం చేతనే ఆర్థికంగా లాభదాయకంకాదని చెప్పటానికి మాత్రంవీలులేదు.

మేము పరిశీలించినంతలో మిక్కిలి అధికంగా నిరుపయోగంగా ఉన్నది మానవశక్తి మాత్రమె. అంతేకాని జంతుశక్తి అంతగా నిరుపయోగంగా ఉండటం కాని, అందువల్ల చిన్న కమతాలు ఆర్థికంగా లాభదాయకం కాకపోవటం గాని మాకు గోచరించలేదు. నిరుపయోగంగా ఉంటున్న మానవశక్తి మాత్రం చాల అధికంగా ఉన్నది. చిన్నచిన్న భూకమతాల సేద్యంపైన వస్తున్న ప్రధాన విమర్శ కూడ

ఇదె. చిన్న భూకమతంమీద ఆధారపడి సేద్యంలో పాల్గొంటున్న ప్రజలకు ఆ భూకమతం తగినంత పనిని చూపలేక పోతున్నదని' తత్ఫలి తంగా ప్రజలకు చేతినిండ పనిలేక చాలీచాలని పనులతో అర్థవృత్తులు మాత్రమే లభిస్తున్నవని అంటున్నారు. చిన్న కమతాలమీద ఆధార పడి ఉంటున్న ప్రజలకు చాలీచాలని పని మాత్రమే దొరకటంవల్ల ఆర్థికంగా నష్టం వస్తున్నది. ఈ ప్రజలు చేసిన శ్రమకు వారికి వస్తున్న ప్రతిఫలానికి పొంతన ఉండటం లేదు. వీరి శ్రమకు తగిన ఫలం వీరికి రావటంలేదు. ఈ చిన్న రైతుల కుటుంబాలు తమ శ్రమతో తాము జీవించటమే కష్టం అవుతున్నది. అట్టి పరిస్థితిలో వ్యవసాయంలో యంత్రాలను ప్రవేశపెట్టవలెననుకొంటె ఈ చిన్న రైతుల స్థితిగతులు అడ్డువస్తున్నవి; యంత్రాల కొనుగోలుకు వినియోగానికి వీరికి శక్తి లేకుండ ఉన్నది. కాబట్టి వ్యావసాయక క్షేత్రాల విస్తీర్ణాన్ని పెంచిన పక్షంలో వ్యవసాయంలో ఉండి చాలీచాలని పనితో బాధపడుతున్న వీరికి చేతినిండ పని లభించగలదని చెపుతున్నాను.

గ్రామీణ ప్రాంతాలలోని చాల కుటుంబాలు తమ జీవితానికే సరిగా చాలీచాలని ఆదాయం వస్తున్న చిన్న భూకమతాల మీద ఆధారపడి ఉన్నవి. ఈ విషయంలో ఎవరికీ భేదాభిప్రాయం లేదు. మేము కావించిన పరిశీలననుబట్టి 3–5 ఎకరాలమధ్య భూవసతి ఉన్న వారు ప్రతిఒక్క ఎకరానికి సగటున సంవత్సరంలో 241 పనిరోజులు వెచ్చిస్తున్నారని, 13–15 ఎకరాలమధ్య భూవసతి ఉన్నవారు 102 పని రోజులు మాత్రమె వెచ్చిస్తున్నా రని తేలింది. కాని ఈ రెండురకాల రైతులకు వస్తున్న సగటు ఆదాయంలో మాత్రం ఇంతపెద్ద భేదం కనిపించటం లేదు. 3-5 ఎకరాల మధ్య వారికి 391.50 రూ. 13–15 ఎకరాల మధ్యవారికి 380.25 రూ. వస్తున్నట్లు (డబ్బు రూపంలో లెక్కకట్టి నపుడు) తేలింది. దీని వలన ఈ రెండురకాల రైతులకు పెట్టుబడులలోను, ఆదాయాలలోను ఉన్న వ్యత్యాసం గోచరమవు తున్నది గదా! చిన్నరైతు పెద్దరైతుకంటె 140 శాతం అధికంగా పనిరోజులు వెచ్చిస్తున్నప్పటికి అందుకు ప్రతిఫలంగా అతనికి 4 శాతం మాత్రమే అధికోత్పత్తిని అతడు సాధించగలుగు తున్నాడు. దీనివలన

ఒక విషయం స్పష్టంగా బోధపడుతున్నది. చిన్న కమతాలలో ప్రతి ఒక్క పనిరోజుకి వస్తున్న ప్రతిఫలం పెద్దకమతాలలో వస్తున్న ప్రతి ఫలంకంటె ఎంతో తక్కువగా ఉండటానికి కారణం కూడ ఇదె. దీనికి కారణం ఏమిటి? ఉండవలసినసంఖ్యను మించి చాల అధికంగా ప్రజలు వ్యవసాయంమీద ఆధారపడవలసి రావటమే దీనికి ప్రధాన కారణం. ఇలా అధికంగా ప్రజలు వ్యవసాయం మీద ఆధారపడటం వల్ల మరొక నష్టం కూడ వాటిల్లు తున్నది. ఇంత అధికంగా ప్రజలు వ్యవసాయంలో ఉండటం చేతనే భూమి తరతరానికి చాల చిన్నచిన్న ఖండాలుగా విభజించుకొనబడు తున్నది. ఇలా చిన్నచిన్న ఖండాలు ఏర్పడటం మూలంగానే వ్యావసాయక పశువుల సంఖ్య కూడ నానాటికి పెరిగి వృథా అవుతున్నది.

మచ్చుకు కొన్ని గ్రామాలలో మేము కావించిన పరిశీలన పట్టికను ప్రక్కపుటలో ఇస్తున్నాము. జాగ్రత్తగా పరిశీలించినపుడు కూడ పై అభిప్రాయమే బుజువు అవుతున్నది.

ఈ గ్రామాలలోని పరిశీలనవలన ఈ క్రింది నిర్ణయాలు వస్తున్నవి. 1. ప్రతి ఒక్క గ్రామాన్ని ఒక వ్యవసాయకూడలిగా పరిగణించి, ఆ గ్రామంలో వ్యవసాయం మీద ఆధారపడి ఉన్న వారి కంద రకు సరిపోను పనిచూపించి ఇదివరలో మేము సూచించిన తగు మాత్రపు భూకమతాలను వీటి అంత సామర్థ్యంతోను నిర్వహించాలని అనుకొందాం. అలా చేయాలని అనుకొన్నప్పుడు ఈ గ్రామాలలో ప్రస్తుతం వ్యవసాయంమీద ఆధారపడిఉన్న వారిలో నూటికి 50 మంది నిరుద్యోగులు అవుతారు; లేదా వ్యవసాయానికి మిగులు ప్రజలు అవుతారు. ఇక ఎడ్లు, దున్నలు సంగతి చూస్తే 31 శాతం మిగులు పశువులు అవుతున్నవి. ప్రస్తుతం వ్యావసాయక ఆర్థిక వ్యవస్థలోని కుటుంబాలు తమతమ కుటుంబ సంబంధాలవల్ల, ఇతర వృత్తులు లభించకపోవటంవల్ల ఈ ఇంతమంది మిగులు మనుష్యులను, పశువులను పోషిస్తున్న వన్నమాట. ఈ మిగులు మనుష్యులవల్ల పశువులవల్ల వచ్చే ఉత్పత్తి ఏమీ లేక పోయినప్పటికి వీరిని పోషించే భారం వ్యవసాయ రంగానికి తప్పటం లేదు. ఈ మిగులు మనుష్యులకు మరొక విధంగా

అదనపు సంపదలు

గ్రామం	మొత్తం కుటుంబ కమతాలు	ఈ కుటుంబాలక్రింద ఉన్న మొత్తం భూమి (ఎకరాలు)	మొత్తం ఎడ్లజతలు	మిగులుగా ఉన్న ఎడ్లజతలు	మిగులు పశువుల శాతం	20 ఎకరాలలోపు కుటుంబ కమతాలు మొత్తం	20 ఎకరాలలోపు భూకమతాలలో ఉన్న మొత్తం ఎడ్లజతలు	పనిచేసే కుటుంబ సభ్యులు, పాలేరులు కలిసి మొత్తం	అమలులో ఉన్న రేటుకు వ్యవసాయ రంగంలో ఏడాదిపొడుగునా పనిచేయటానికి స్థానికంగా లభించే అదనపు మగకూలీల సంఖ్య	మిగులుగా ఉన్న మగకూలీలు	మిగులుగా ఉన్న మగకూలీల శాతం
1	2	3	4	5	6	7	8	9	10	11	12
ఎ. వక్కలగడ్డ	110	905	86	26	30	102	66	193	60	103	54
బి. చిట్టూర్పు	225	1030	108	39	36	221	98	449	39	281	57
సి. వేములపల్లి	92	417	44	16	37	89	38	155	40	111	60
డి. నరసింహపురం	120	713	68	20	30	116	61	215	Nil	71	33
ఇ. గుండుపాలెం	118	947	85	22	23	107	66	245	64	120	40

15 ఎకరాల భూమిని సాగుచేయటానికి, ఆయా తరుణాలలో వినియోగించుకొనే కూలీలు కాక, ఒక ఎడ్లజత, ఎల్లప్పుడు పనిచేసే ముగ్గురు మనుష్యులుంచె సాధారణంగా సరిపోతుంది. ఈ పట్టికలోని మిగులు ఎడ్లను, మిగులు మనుష్యులను నిర్ణయించటంలో ఈ సూత్రమే ఆధారంగా తీసికొనబడింది.

సాంఘిక భద్రత కూడ నేటి వ్యవస్థలో లేదు. సహకార వ్యవసాయాన్ని ప్రవేశపెట్టినప్పుడు ఈ మిగులు మనుష్యులు పశువులు ఈ రంగం నుంచి తరలి మరొకచోట తావుచూచుకోకతప్పదు. ఇంత మంది నిరుద్యోగులై జీవనాధారం కోల్పోతున్నప్పుడు ప్రభుత్వంగాని, సంఘంగాని తనకు పట్టనట్లు ఊరుకోవటానికి వీలులేదు. వారందరికి ప్రత్యామ్నాయవృత్తులు చూపించే బాధ్యత ప్రభుత్వము సంఘము వహించ వలసి ఉంటుంది.

2. ఇక ఈ గ్రామాలలో మిగులుగా ఉన్న ఎడ్లసంగతి చూద్దాం. మిగులుగా ఉన్న మనుష్యుల నిష్పత్తిలో ఎడ్లు మిగులుగా లేవు. అంటే పశువులు అంత ఎక్కువగా అదనంగా లేవని భావం. ఈ అదనంగా ఉన్న ఎడ్లుకూడ 15 నుంచి 30 ఎకరాల వరకు విస్తీర్ణం ఉన్న భూకమతాలలోనే అదనంగా కనిపిస్తున్నవి. మరొక విషయం ఏమంటె ఉన్న భూకమతాలలో అన్నింటికి తలా ఒక ఎడ్లజత లేవు. ఎడ్లు లేకుండ సాగు అవుతున్న భూకమతాలు కూడ ఉన్నవి. 20 ఎకరాలు కాని అంతకు తక్కువకాని భూవసతి ఉన్న కుటుంబాలలో ప్రతిమూడు కుటుంబాలలోను ఒక్క కుటుంబానికి మాత్రమె ఎడ్లు ఉన్నవి. మిగిలిన రైతులు పైన మేము వివరించిన మార్గాలలో ఏదో ఒక మార్గాన్ని ఆశ్రయించి తమ భూములను సాగుచేసికొంటున్నారు.

3. చాలీచాలని ఆదాయాలు వస్తున్న చిన్న చిన్న రైతులు తమకు ఎడ్లు ఉన్నప్పటికి వాటిని కేవలం వ్యవసాయ కృషికి మాత్రమె వినియోగించుకొని ఊరుకొనటం లేదు. ఇలాంటి చిన్న రైతులలో ఎడ్లు, బళ్లు ఉన్నవారు చాలమంది బాడుగ తోలుకొనటానికి వాటిని ఉపయోగించుకొంటున్నారు. అనేక వ్యవసాయేతర కార్యకలాపాలలో వాటిని ఉపయోగించి ఆదాయం రాబట్టుకొంటున్నారు. వేడినీళ్ళకు చన్నీళ్లు తోడు అన్నట్లుగా ఇలా సంపాదించుకొంటున్న ఆదాయాలను తమ వ్యవసాయాదారులకు జత చేసికొని జీవితం వెళ్ళబుచ్చుతున్నారు. పట్టణాలకు, సంతలకు చుట్టు పట్టులలో ఉన్న గ్రామాలలోని రైతులలో ఇలా బాడుగపై ఆధారపడటం విశేషంగా కనపడుతున్నది. ఉదాహరణకు మా పట్టికలోని 'గుండుపాలెం' చూడండి. ఈ గ్రామం

మచిలీపట్నానికి దగ్గరలో ఉన్నది. అందుచేత ఆ పట్నానికి సరుకులను చేరవేయటం, అక్కడ నుంచి తీసికొనిరావటం మొదలైన బాడుగలు వీరికి లభిస్తున్నవి. కొన్నికొన్ని సందర్భాలలో ఎడ్లజతను పోషించటానికి అయ్యే ఖర్చుకంటె ఎక్కువ ఆదాయం బాడుగల రూపంలో లభిస్తున్నదని ఈ గ్రామస్థులు మాతో అన్నారు.

కాబట్టి చిన్నచిన్న భూకమతాలు ఆర్థికంగా లాభదాయకంగా ఉండకపోవటానికి మిగులు పశువులు ప్రధానకారణం కాదని తేలుతున్నది గదా! వ్యవసాయరంగంలో మిగులుగాఉన్న మానవశక్తి వల్లనే ఈ భూకమతాలు ఆర్థికంగా లాభదాయకం కాలేక పోతున్నవి. ఈ మిగులు మనుష్యులే ఇందుకు ప్రధానకారణంకాని మిగులు పశువులు కాదు. అవసరానికి మించి అత్యధికంగా శ్రామికులు వ్యవసాయరంగంమీద ఆధారపడవలసి రావటంవల్లనే వ్యవసాయరంగంలో ఈ మిగులు మనుష్యులు కనిపిస్తున్నారు. కాబట్టి చిన్నచిన్న భూకమతాలు లాభదాయకం కాకపోవటానికి ప్రధానకారణం మన ఆర్థిక వ్యవస్థ. మన ఆర్థిక వ్యవస్థనుబట్టి కొద్ది భూములమీద అధిక సంఖ్యాకులు ఆధారపడవలసి ఉండటమే దీనికి కారణం. ఈ సమస్యను పరిష్కరించుకొని చిన్నకమతాలు లాభదాయకంగా ఉండేటట్లు చూడాలంటె ఈ మిగులు మనుష్యులకు ఇతర వృత్తులను చూపించగల విధంగా మన సంఘాన్ని, ఆర్థికవ్యవస్థను సరిదిద్దు కోవాలి. అంతేకాని సహకార వ్యవసాయం మాత్రం దీనికి పరిష్కారమార్గం కాదు. భూమిపై ఆధారపడి జీవిస్తున్న ప్రజలకు సాంఘికంగా, ఆర్థికంగా ఇతర వృత్తులు కల్పించటానికి ప్రయత్నం చేయాలి.

కాని నేటి స్థితిగతులనుబట్టి పరిశీలించి నప్పుడు ఈ మిగులు మనుష్యులకు ఇతర వృత్తులను కల్పించటం మనకు అంత త్వరలో సాధ్యం కాదని ఇదివరకే పరిశీలించి చూచుకొన్నాం. కాబట్టి మరికొంత కాలం వరకు ఈ మిగులు మనుష్యులను వ్యవసాయరంగమే భరించవలసి ఉన్నది. మన విధానాలు కూడ అందుకు అనువుగా ఉండక తప్పదు. పరిస్థితులు ఇలా ఉండగా పెద్దపెద్ద క్షేత్రాల పరోక్ష

వ్యవసాయ విధానం కంటె చిన్నచిన్న కుటుంబ కమతాలు ప్రయోజన కారులు కాదని ఎవరైనా అన గలరా? ఎంతోమంది మిగులు మనుష్యులను ఈ చిన్న చిన్న కుటుంబ కమతాలు ఇముడ్చుకొని, పోషిస్తూ, వారి శక్తియుక్తులను వృథా పోనీయకుండ కాపాడటం లేదా? మధ్యరకపు కమతాలలోను, పెద్దపెద్ద కమతాలలోను ఈ మిగులు మనుష్యులకు స్థానం లేదు. దీనికి కారణం లేకపోలేదు. ఈ మధ్యరకపు కమతాలలోను, పెద్దకమతాలలోను ఆయా కుటుంబ సభ్యులకు పూర్తిగా పని దొరికిన తరువాత మిగిలిన పనికి మాత్రమే వీరు కూలీలను వినియోగించు కొంటారు. ఈ వినియోగించుకోవటం కూడ ఈ కూలీలకు కూలి ఇవ్వగా ఏమైనా అధికంగా ఆదాయం మిగిలే అవకాశం ఉన్నంత వరకే వీరు శ్రామికులను వినియోగించు కొంటారు. లేదా కూలీలపై పెచ్చించే ధనానికి ఆ కూలీల శ్రమవల్ల వచ్చే ఫలితానికి సరిపోయే టంతవరకు మాత్రమే వీరు కూలీలకు పనులు కల్పిస్తూ ఉంటారు. అంతకు మించి కూలీలను వినియోగించు కొనరు. ఒకవేళ వినియోగించుకొన్నప్పటికి నష్టం వస్తుందిగదా! కాబట్టి ఈ రకం భూకమతాలలో చాలీచాలని పనులు మాత్రమె ఆ సభ్యులకు లభిస్తున్నా యనే సమస్య లేదు. ఇక ఈ చాలీచాలని పనులవల్ల జీవించ వలసి వచ్చిన అవసరం చిన్న చిన్న భూకమతాలలోనే ఉన్నది. అంటే వ్యవసాయంలోని మిగులు మనుష్యులను పోషిస్తున్నది వాస్తవానికి ఈ చిన్న భూకమతాల వ్యవసాయదారులు మాత్రమే! ఈ చిన్న చిన్న కమతాలకు ఈ మిగులు మనుష్యులను పోషించక తప్పదు. ఆ మిగులు మనుష్యులుకూడ ఆ కుటుంబసభ్యులే కావటంచేత, వారివారి వ్యావసాయక పరికరాలను సమగ్రంగా వినియోగించు కొనేఅవకాశాలు విస్తృత భూకమతాలు లేకపోవటంచేత వీటికీ బాధ్యత తప్పటం లేదు. ఈ చిన్నచిన్న భూకమతాలలో ఉన్న కుటుంబాలలోని వికలాంగులకు, పనిదొరకని వారికి ప్రభుత్వం ఎలాంటి రక్షణను కలిగించటం లేదు; సంఘం వీరిని గురించి ఏ బాధ్యతను స్వీకరించటం లేదు. ఈ పరిస్థితులలో మనకు సంప్రదాయసిద్ధంగా వస్తున్న కుటుంబ సంబంధాలవల్ల అనురాగవాత్సల్యాలచేత వీరి నందరిని ఆ కుటుంబం ఆ చిన్న సొంతభూకమతంతోనే పోషించుకొంటు

వస్తున్నది. ఆర్థిక దృష్టితో పరిశీలిస్తే మాత్రం ఈ వికలాంగులు, మిగులుమనుష్యులు సంపాదిస్తున్నది ఏమీ లేదు. అయినప్పటికి మన పవిత్రమైన కుటుంబసంప్రదాయాలు కారణంగా ఆ ఉన్న కొద్దిపని పాటలనే వీరందరు కలిసి నిర్వర్తించు కొంటున్నారు. ప్రతిఫలంగా లభిస్తున్న ఆదాయం చాల కొద్ది మాత్రమె అయినప్పటికి ఆ కొద్ది లోనే వీరందరు తమ జీవితం వెళ్ళబుచ్చుతున్నారు. ఈ వ్యవస్థ ఇలా కొనసాగటానికి కారణం మన కుటుంబసంప్రదాయాలు. కుటుంబంలోని సభ్యులకు ఒకరికొకరికి అనురాగవాత్సల్యాలు ఉండటంచేత తన పనిని మరొకడు కాజేస్తున్నా డన్న భావంగాని, తన ఆదాయాన్ని మరొకడు కాజేస్తున్నా డన్న తలంపుకాని ఆ కుటుంబసభ్యులలో రాదు. ఈ అనుబంధమే కనుక లేనిపక్షంలో మన సంఘం ఈపాటికి ఎక్కడ ఎలా ఉండేదో చెప్పలేము. అంతేకాక ఈ అనుబంధాలకు కుటుంబవ్యవసాయవిధానం తోడై ఈ సంఘాన్ని ఇలా నిలబెట్టుతూ ఉన్నది. మరొక వ్యవసాయ విధానం అయిన పక్షంలో ఈ మిగులుమనుష్యుల భారాన్ని తాను వదిలించుకొని సంఘం మీదనో, ప్రభుత్వంమీదనో ఆ భారం తోసివేసేదే. కాని ప్రస్తుతస్థితిలో సంఘానికి ఈ బాధ్యత లేదు. ఇతరత్రా వృత్తులు లభించగల అవకాశం లేకు కాబట్టి ఈ బాధాకరమైన బాధ్యతను ఆయా కుటుంబాలకు, కుటుంబ వ్యవసాయ విధానికి అప్పగింతపెట్టి సంఘం సంతృప్తి పడుతున్నది.

కుటుంబవ్యవసాయ విధానంలోనే ఈ మిగులు మనుష్యులు ఉండటంవల్ల మరొక విషయాన్ని కూడ గమనించ వలసి ఉన్నది. ఈ కుటుంబ వ్యవసాయ విధానంలో మానవశ్రమ పుష్కలంగా, తేలికగా లభ్యం అవుతున్నది. అందుచేత ఈ విధానంలో మానవ శ్రమ మాత్రమె ప్రధానంగా గల విధంగా వ్యవసాయం కొనసాగుతున్నది. మరొకపద్ధతిలో అయితే ఈ మిగులుమనుష్యులకు వ్యవసాయంలో స్థానం ఉండదు; అప్పుడు వ్యవసాయం మానవశ్రమయే ప్రధానంగా కొనసాగ గల అవకాశం కూడ ఉండదు. వ్యవసాయ కుటుంబంలోని సభ్యులు అందరు తమశ్రమకు ఎంతకొద్దిపాటి ప్రతిఫలం వస్తున్నప్పటికి వ్యవసాయంలోనే శ్రమిస్తూ ఉంటారు. వీరు ఇలా శ్రమించటంవల్ల అధికంగా అయ్యే ఖర్చు ఏమీ ఉండదు. ఇతరత్రా వారివారి సరదా

లలో పాల్గొన్నందువల్ల వారికెంత శారీరకశక్తి నృథా అవుతుందో అది మాత్రమె వారు ఈకృషిలో వెచ్చిస్తున్నారు తప్ప మరొక నష్టం ఏమీ లేదు వీరు ఇలా ఈ కాస్తపని చేసినా చేయకపోయినా మన సంఘవ్యవస్థలోని కుటుంబ ఆర్థికవిధానంవల్ల వీరి పోషణ భారం కుటుంబానికి ఏమీ తప్పేది గాదు. కాని ఈ పనిపాటలకు కూలి ఇచ్చి మరొకరిని వినియోగించుకోవటము లేదా వీరు మరొకరిక్రింద జీతభత్యాలకు పనిచేయటము అనేవి ఇలా ఉండవు. అప్పుడు వారికి కేవలం కొద్దిపాటి శారీరకశక్తి వృథాకావటమే కాక అనేక నష్టాలు వస్తవి. దీనికి ప్రధాన కారణం ఈ విధానంలో వీరు స్వయం కల్పిత నృత్తిదారులు; వారి సొంత భూముల మీదనే వారు తమ ఇష్టానిష్టాలనుబట్టి స్వేచ్ఛా స్వాతంత్ర్యలతో పనిచేసికొంటు ఉన్నారు. ఏ అధికారికి పర్యవేక్షకునికి లొంగి దాస్యభావంతో శ్రమించ వలసిన దుర్గతి వీరికి లేదు. వారు సాగుచేసికొనే వారి సొంత భూఖండాన్ని వారి నిత్య జీవితం నుంచి విడదీసి చూడటం కుదరని పని. అందుచేతనే ఆ సొంత భూకమంతలో కృషిచేసికొనటంవల్ల వారికి వచ్చే నష్టాలు ఏమీ లేవు. పైగా చాలమందికి ఈ స్వయంకల్పిత వృత్తులవల్లనే మానవజీవితానికి అత్యంతావశ్యకము, ప్రధానము అయిన ఆనందం లభ్యం అవుతున్నది. అందుచేతనే ఈ కుటుంబాల సభ్యులు తమ శ్రమకు ఎంత కొద్దిపాటి ప్రతిఫలం లభిస్తున్నప్పటికి – ఇతర వృత్తులు లభించనప్పుడు – ఈ కుటుంబకమతాలలో నిరంతరం పని చేయగలుగుతున్నారు. ఈ కుటుంబ వ్యవసాయవిధానంలో తప్ప ఇతర విధానాలలో వీరు ఇలా పనిచేయటం సాధ్యంకాదు. మరొక విధానంలో అయితే భూమిపై కుటుంబసభ్యులకు ఈ మమకారం అవినాభాన సంబంధం ఉండదు కనుక స్వయంయాజమాన్యంవల్ల, స్వయంకల్పిత వృత్తివల్ల ప్రస్తుతం రైతులకు లభిస్తున్న కార్యోత్సాహం, శ్రద్ధ, సామర్థ్యం మరొక విధానంలో దుర్లభ మవుతాయి. పైగా మరొక విధానంలో ఈనాటివలె కుటుంబ అనుబంధాలు, అనురాగవాత్సల్యాలు ఉండే అవకాశం లేదు. ఈ అనురాగవాత్సల్యాలు, అనుబంధాలు కుటుంబ వ్యవసాయ విధానంలోనే సహజంగా, పవిత్రంగా ఉండటానికి, వర్ధిల్లటానికి అవకాశం ఉన్నది. అందుచేత వాస్తవానికి ఈ కుటుంబమే

చక్కని నిజమైన సహజమైన గ్రామిక సహకారసంఘం. అందుచేత ఈ కుటుంబ కమతాలు సంఘానికి అత్యంతోపకారులుగా ఉండి అత్యుత్తమ సేవను చేస్తున్నవి. కేవలం సాంఘిక దృక్పథంతో కాక ఆర్థిక దృష్టితో ఆలోచించినప్పుడు ఈ విధానం ఆర్థికంగా లాభదాయకంగా కనిపించక పోయినప్పటికి ఈ కుటుంబ కమతాల విధానంవల్ల లభిస్తున్న సాంఘిక ప్రయోజనాలు విస్మరించ రానివి.

కాబట్టి ప్రస్తుతం ఉన్న చిన్నచిన్న భూకమతాలలో పరిమితంగా లభిస్తున్న వృత్తులవల్ల కలుగుతున్న అనర్థాలను పెద్దగా చిత్రించి ప్రచారం చేయటం మన కర్తవ్యం కాదు. సంవత్సరంలో వ్యవసాయక కార్యకలాపాలలో పనిలభించే కొద్ది కాలంలోనే ఈ చిన్న భూకమతాలు వ్యవసాయ రంగంలో అత్యధికంగా ఉన్న మిగులు మనుష్యులకు పరిమితంగా నైనప్పటికి వృత్తులను ప్రసాదిస్తున్న విషయాన్ని మనం గమనించవలసి ఉన్నది. ఈ చిన్న చిన్న రైతులు తమ వృత్తులభారం సంఘంమీద వేయకుండ తమంతట తామే జీవిస్తున్నారు. కనుక ఈ బాధ్యతను తప్పించి నందుకు సంఘం వీరికి కృతజ్ఞతా బద్ధంగా ఉండాలి. సంఘం తన సభ్యులకు అందరకు పూర్తి పనులను చూపించలేని స్థితిలో ఉన్నది. ఆ స్థితిలో ఏ వ్యక్తికి ఆ వ్యక్తే తన వృత్తిని తానే కల్పించుకొని సంఘానికి ఎట్టి బాధరబందీ కలిగించకుండ తనంతట తాను సుఖంగా స్వేచ్ఛగా బ్రతుకుతు ఉన్నప్పుడు అలాంటి స్వయం కల్పిత వృత్తిదారులను సంఘం ఆహ్వానించి ఆ వ్యవస్థకు సుస్థిరత్వం కల్పించవలసి ఉంటుంది. లేనిపక్షంలో ఈ నిర్వ్యాపారత వలన కలిగే అనర్థకాలు సంఘంమీద తమ ప్రభావాన్ని ప్రసరించి సంఘాన్ని కలుషితం చేయ గలవు. ఈ నిరుద్యోగులు సంఘానికి తీరని భారంగా తయారు కావటమేకాక సంఘంలోని ఇతరులకు కూడ చెడు మార్గాన్ని చూపి మొత్తం సంఘాన్నే అవినీతి పాలుచేసి నిర్వీర్యం చేయగలరు. నేటి మన సంఘంలో అనేకులు నిరుద్యోగులు ఉన్నప్పటికి మన కుటుంబ వ్యవసాయవిధానం ఈ దోషాలనుంచి సంఘాన్ని రక్షిస్తున్నది. కాబట్టి ఈ స్థితిలో వీరికి లభిస్తున్న కొద్ది పాటి పనులకు తోడు మరికొన్ని అదనపు పనిపాటలను చూపి

వారి ఆదాయం పెరిగే విధం ఏమైనా ఉన్నదేమో ప్రభుత్వం చూడ వలసి ఉన్నది. అంతేకాని ప్రస్తుత వ్యవసాయాన్ని సహకారవ్యవ సాయ విధానంలోకి తీసికొని రావటమో లేక సమిష్టివ్యవసాయాన్ని ప్రవేశపెట్టటమో గురించి ప్రభుత్వం ఆలోచించటం తగనిపని. ఒకవేళ ఈ సహకారవ్యవసాయమో లేక సమిష్టి వ్యవసాయమో ప్రవేశపెట్టినా ఈ విధానాల వల్ల ప్రస్తుతం వ్యవసాయ రంగంలో జీవిస్తున్న వారిలో సగం మందికి మాత్రమే పూర్తిగా పనులు లభించ గలవు. ఆ మిగిలిన సగం మందిని ప్రభుత్వం భరించవలసి ఉంటుంది తప్ప వారికి అన్యాత పనులు లేవు కదా!

కాబట్టి ఆర్థికంగా లాభదాయకాలు కాదని చెప్ప బడుతున్న చిన్నచిన్న భూకమతాలను సరైన దృక్పథంతో పరిశీలించి, నేటి స్థితిలో వాటి విలువను గ్రహించటానికి యత్నించటం అవసరం. ఇలా పరిశీలించి నప్పుడు నేటి సాంఘిక స్థితిగతులలో అవి వహిస్తున్న ప్రధానపాత్రను మనం విస్మరించ లేము. ఎంతో ఉపయోగకరమైన, ఆవశ్యకమైన బాధ్యతను ఈ చిన్న కమతాలు నిర్వహిస్తున్నవి. పైగా ఈ చిన్నకమతాలే లేనిపక్షంలో వీటి స్థానాన్ని ఆక్రమించి ఈ పాత్రను వహించగల ప్రత్యామ్నాయ మార్గాలు గాని, ఆర్థిక సంప్రదాయాలు గాని మనకు లేవు. కాబట్టి ఇలాంటి చిన్నకమతాలు లాభదాయకం కాదని, భారీనిర్వహణలో లభించగల ఆర్థికలాభాలకు వీటిలో అవకాశం లేదని వాదిస్తూ వాటి నిర్మూలనకు కంకణం కట్టుకొనటం అరిష్ట దాయకం. పైగా ఈ చిన్నకమతాలు సంఘజీవితానికి మనుగడకు అందిస్తున్న అత్యంతావశ్యకమైన సాంఘిక ప్రయోజనాలను విస్మ రించిన వారు మాత్రమె ఇలా వీటిపై దుమారం లేప గలరు. వీటికి ప్రత్యామ్నాయంగా స్థాపించాలని చెప్పబడుతున్న ఆర్థిక వ్యవస్థవల్ల లభించగల ఆర్థికావకాశాలను ఆహ్వానించ బోయే ముందు ఈ చిన్న చిన్న కుటుంబకమతాలు సాంఘికంగా నిర్వహిస్తున్న పాత్రను ఆర్థిక సేవలను సక్రమంగా అవగతం చేసికొని పునరాలోచన చేసికోవటం అవసరం.

వ్యాధియొక్క మూలకారణాలను గ్రహించకుండ, పైపై లక్షణాలను చూచి వాటికి మాత్రమె మందులు వాడినంత కాలం వ్యాధి కుదరదు. ఆ పైపై బాధలు మాత్రమె తగ్గుతాయికాని వ్యాధి శాశ్వతంగా నివారణకాదు. మన వ్యవసాయరంగంలో అధికంగా ఉన్న పశువులను తీసివేసినందువల్ల తాత్కాలికంగా ఏదో కొంత ప్రయోజనం లాభం కలుగుతుంది అనటంలో సందేహం లేదు. కాని ఈ అధికంగా ఉన్న పశువులను తీసివేయటం కోసం సహకార వ్యవసాయానికికాని, పెద్ద క్షేత్రాల నిర్మాణానికికాని పూనుకొనవలసిన అవసరం లేదు. కనీసపు భూకమతాలకు తక్కువ కుటుంబకమతాలు ఉన్న చిన్న రైతులకు ఆ విషయం నచ్చచెప్పి వారి వారి భూములను అందరు కలసి సాగుచేసికొనటంవల్ల ఎడ్లు, వ్యవసాయపరికరాలు ఎవరికి వారుగా కాక ఉమ్మడిగా జాయింట్‌గా ఏర్పాటు చేసికొనటంవల్ల సుఖంగా లాభదాయకంగా ఉంటుం దని వారికి వివరించి అలా చేయింప చేస్తే ఈ పనిని తేలికగానే సాధించ వచ్చు. అంతగా అవసరం అనుకొన్న పక్షంలో ఎడ్లు, బళ్ళు మొదలైన వాటికి సంబంధించిన సహకారసంఘాలనుకూడ ఇందుకోసం ఏర్పాటు చేసికొన వచ్చు. ఇలాంటి సహకారసంఘాలను ప్రభుత్వమే ప్రోత్సహించినా అభ్యంతరం ఉండదు. అంతేకాని ఇందుకోసమై వ్యవసాయాన్నే క్రమబద్ధం చేసి బంధించ వలసిన అవసరం లేదు. ఒకవేళ ఈ పశుసంపద వ్యవసాయలోకంలో అవసరానికి మించి అధికంగా ఉన్నప్పటికి దాని వల్ల రైతుల నికరాదాయం తగ్గిపోతుందే తప్ప వ్యావసాయ కోత్పత్తులు దెబ్బతినటం జరగదు. ప్రస్తుతం అదనంగా ఉన్న పశువులను పోషించటంవల్ల కలుగుతున్న అనర్థకాల కంటె పశువుల ఉపయోగం కోసం ఏర్పాటుచేసికొనే సహకారసంఘాల ప్రయోజనాలు అధికంగా ఉంటాయో తక్కువగా ఉంటాయో నిర్ణయించుకొనే బాధ్యత రైతుకే ఉండాలి. ప్రస్తుతం ఉన్న సహకార సంఘాలద్వారా గాని లేక వీటికోసమై ప్రత్యేకంగా నూతనంగా కొన్ని సహకార సంఘాలను ఏర్పరచి కాని ప్రభుత్వం ఈ పశుశక్తి సహకార సంఘాలను ప్రోత్సహించి నిర్వహించ వచ్చు. ఇలాంటి కార్యక్రమం ఏదైనా ఉంటే ప్రజలు కూడ సంతోషంతో సహకరిస్తారు. ప్రక్క ప్రక్కనే పొలాలు

ఉన్న చిన్న చిన్న రైతులలో జాయింట్ వ్యవసాయాన్ని ప్రభుత్వం ప్రోత్సహించ వచ్చు. కుటుంబసంబంధాలు అనుబంధాలు ఉన్నవారిలో ఈ జాయింట్ వ్యవసాయాన్ని ప్రోత్సహించటం శ్రేయస్కరం. వీరికి ఋణసౌకర్యాల విషయంలోను, ఎరువులు విత్తనాలు, వ్యవసాయ పరికరాలు, మార్కెటింగ్ సౌకర్యాలు అందించటంలోను ప్రత్యేకావకాశాలు కల్పించి జాయింట్ వ్యవసాయాన్ని ప్రోత్సహించవచ్చు. అంతేకాక భవిష్యత్తులో ఈ చిన్న భూకమతాలు మరీ చిన్న చిన్నవిగా విభాగింపబడే వీలులేకుండ ఈ కనీస భూకమతాల విభజనను నిషేధిస్తూ శాసనాలు కూడ చేయవచ్చు. జర్మనీలో చేసిన ప్రయోగాలను దృష్టిలో పెట్టుకొని ఇలాంటి శాసనాలను తేలికగా ప్రవేశ పెట్టుకొన వచ్చు. ఇలా చేసికొన్న పక్షంలో మన భూకమతాలు ముక్కలు కాకుండ సాగుకి లాయకిగా కూడ ఉంటాయి.

కనుక ఈ పరిశీలన వలన తేలిన ఈ క్రింది సారాంశంతో ఈ అధ్యాయాన్ని ముగిస్తున్నాము.

బహుళార్థసాధక సహకారసంఘాలుగాని లేక వ్యవసాయ సేవా సహకారసంఘాలు కాని అభివృద్ధి చేసికొన్న పక్షంలో మానవ శ్రమపై ప్రధానంగా ఆధారపడి ఉన్న మన వ్యవసాయరంగంలో చిన్న భూకమతాల సేద్యమె ప్రయోజనకారిగా ఉంటుంది. ఈ చిన్న భూకమతాల సేద్యమే పెద్దపెద్ద భూకమతాల భారీవ్యవసాయం కంటె సమర్థవంతంగా, ఉత్పత్తి దాయకంగా, లాభదాయకంగా ఉంటుంది అనటంలో సందేహం లేదు.

రైతాంగ యాజమాన్యంమీద ఆధారపడిన కుటుంబ వ్యవసాయ విధానమే నిర్వాహకవర్గ విధానం కంటె సాంఘిక ప్రయోజన దృష్ట్యా, ఆర్థిక లాభాలదృష్ట్యా కూడ ఉత్తమంగా ఉంటుంది. ఇలాంటి కుటుంబవ్యవసాయవిధానంలో వ్యవసాయకకార్యకలాపాలు–ఎప్పుడో–అవసరమైన తరుణాలలో కొద్దిగా కూలీలను వినియోగించుకొనటం తప్ప–అన్నీకూడ ఆయా కుటుంబ సభ్యులచేతనే నిర్వహింపబడతాయి.

వ్యవసాయకోత్పత్తులను, సామర్థ్యాన్ని అభివృద్ధి చేయాలన్న పక్షంలో పెద్దపెద్ద భూకమతాలను, పరోక్షవ్యవసాయ విధానాన్ని

వ్యవసాయరంగం నుంచి బహిష్కరించాలి. భూకమతాలకు గరిష్ఠ పరిమితులను నిర్ణయించటంవల్ల కౌలుదారులకు రక్షణ కలిగించే శాసనాల ద్వారాను ఈ పనిని సులభసాధ్యం చేసికొనవచ్చు.

కాని ఈ చిన్న భూకమతాలు సమర్థంగా ఉత్పత్తిదాయకంగా ఉండాలంటే వీటికి కూడ ఒక కనీస పరిమితి ఉన్నది. సాగులోఉన్న భూమికి మించి అత్యధికంగా ప్రజలు వ్యవసాయంలో ఉండటం వల్లనే ప్రస్తుతం భూఖండాలు చాల చిన్నచిన్నముక్కలుగా ఉండటం జరుగుతున్నది. కాబట్టి మన భూకమతాలను ఇలా చిన్నచిన్న ముక్కలు ముక్కలుగా చేయటానికి కారణభూతమైన ఈ విషయమై శ్రద్ధ తీసికొని, భూమిమీద ప్రస్తుతం ఉన్న ఒత్తిడిని తగ్గించటానికి ప్రత్యామ్నాయ వృత్తులను చూపించటానికి ప్రయత్నాలు ఆరంభించుకొనవలసి ఉన్నది.

అధ్యాయం - 8

సహకార సంఘాలు - సహకార వ్యవసాయం

భారీవ్యవసాయనిర్వహణవల్ల లాభాలువస్తాయి కనుక సహకార వ్యవసాయాన్ని మనదేశంలో ప్రవేశపెట్టాలి అనే ప్రధానమైన వాదం ఎంత బలహీనమైనదో, గతఅధ్యాయాలలో గ్రహించాం. కాని ఈ సహకారవ్యవసాయాన్ని ప్రవేశపెట్టాలని అంటున్నవారు మరికొన్ని వాదనలు కారణాలు కూడ చూపుతున్నారు. సహకారవ్యవసాయం ఉన్నప్పుడే ఉత్తమవిధానాలతో సాంకేతికంగా సాగుచేయటం సాధ్యపడుతుందని ఇటీవలి నినాదం. ఈ ఉత్తమ విధానాలు ప్రవేశపెట్టినందువల్ల రైతుల ధనం కూడబెట్టటం పెరిగి, పనిపెరిగి భూముల అభివృద్ధికి శ్రేష్టమైన వ్యవసాయవిధానాలు ప్రవేశపెట్టటానికి అవకాశం దొరుకుతుందని, దీనివల్ల వ్యవసాయోత్పత్తులు పెరిగి వ్యవసాయదారుల రాబడి కూడ అధికం అవుతుందని వీరు చెపుతున్నారు. ఈ ప్రయోజనాలు సిద్ధించాలంటె భూములను కలిపివేసి పెద్దపెద్ద క్షేత్రాలను నిర్మించటం, కుటుంబవ్యవసాయవిధానాన్ని రద్దుచేయటం అవసరమని కూడ వీరు గట్టిగా చెపుతున్నారు. ఈ విషయాలను అన్నింటిని క్రమంగా పరిశీలించి ఈ అభిప్రాయాలు ఎంతవరకు సహేతుకాలో, వాస్తవాలో చూద్దాం.

I

సహకారవ్యవసాయం ఉత్తమమైన, శాస్త్రీయమైన ఉత్పత్తి విధానాలను ప్రవేశపెట్టటానికి మార్గం కాగలదని దానివల్ల వ్యవసాయోత్పత్తులు పెరగగలవని వీరు ఆశిస్తున్నారు. ఉత్తమ పరికరాలు, మంచివిత్తనాలు, బాగాపండగలపంటలను ప్రవేశపెట్టటం, శాస్త్రీయమైన ఎరువులను సక్రమంగా ఉపయోగించటం, అభివృద్ధిదాయకమైన ఉత్తమవ్యవసాయ విధానాలను–అంటే అనేకవిధాలైన పంటలద్వారా ఆర్థికలాభాలు పొందటం–భూమిని దున్నటంలో లోతుగాదున్నటం మొదలైన పనులను, సక్రమంగా విత్తులునాటటం, శాస్త్రీయంగా పంటలను నూర్చుకొనటం, తెగుళ్ళను నివారించుకొనటానికి శాస్త్రీయ

విజ్ఞానంతో కృషిచేయటం ఈ మొదలైనవి సహకారవ్యవసాయంవల్ల బాగాఅభివృద్ధి చేసికొనటానికి వీలుగల ఉత్తమమైన, సాంకేతికవిధానాలని అంటున్నారు. సహకారవ్యవసాయం ఈ కార్యకలాపాలకు కావలసిన సాంకేతిక ప్రవీణులను భరించగలదు కనుక, పైగా నూతన ప్రయోగాలు చేయటానికి సాహసించగలదు కనుక ఈ ప్రయోజనాలు ఆ విధానంలోనే సిద్ధించగలవని అంటున్నారు. మన వ్యవసాయంలో ఈ ఉత్తమవిధానాల ప్రవేశానికి కుటుంబవ్యవసాయ విధానం అవరోధం కలిగించ గలదనికూడ వీరు భావిస్తున్నారు. వ్యక్తిగతంగా రైతులు సాంకేతిక ప్రవీణులను భరించ లేక పోవటమెకాక రైతులు ఆచార దాస్యంలో ఉండి నూతన విధానాలప్రవేశానికి ఇష్టపడక ఎదురు తిరుగుతారని అందువల్ల కుటుంబ వ్యవసాయ విధానంలో పైన చెప్పిన ప్రయోజనాలకు ప్రయోగాలకు అవకాశం లేదని వీరు అంటున్నారు.

భారతదేశంలో ఉన్న ప్రత్యేక స్థితి గతులను బట్టి ఉత్తమ వ్యవసాయవిధానాలు అన్నప్పుడు వాటిలో యాంత్రికీకరణకు మాత్రం చోటు లేదు. మరి మనదేశంలో యాంత్రికీకరణకు అవకాశం లేనప్పుడు పైన వివరించిన ఉత్తమ విధానాలను ప్రవేశపెట్టటానికి పెద్ద పెద్ద క్షేత్రాల అవసరం ఎక్కడ ఉన్నది? నేటి వ్యవసాయదారులు, తమ పశువులతో ఉపయోగించుకొనగల ఉత్తమ వ్యవసాయపరికరాలను వాడుకోవటానికి పెద్దక్షేత్రాల అవసరం ఏమిటి? ఉత్తమమైన వ్యవసాయసంప్రదాయాలుగాని (అంటె రైతులు ఒకే పంటపై ఆధారపడక అనేకమైన పంటలను ఋతువులను బట్టి వేసికొంటు లాభాన్ని పొందగల సంప్రదాయాలు) వ్యవసాయవిధానాలు (భూమిని లోతుగా దున్నటం మొదలైనవి) గాని పెరగాలంటె పెద్ద క్షేత్రాలు ఎందువల్ల అవసరం? మంచి ఎరువులు, విత్తనాలు సక్రమంగా ఉపయోగించుకోవాలంటె వ్యవసాయక్షేత్రాల విస్తీర్ణం పెరగాలా? కాబట్టి ఇలాంటి ఉత్తమ విధానాలకు సంబంధించిన పరికరాలు వస్తువులు చాలవరకు వ్యవసాయ కృషికి సంబంధించిన ఎడ్లు బళ్లు మొదలైన వాటిలోచేరేవి కావు. మన వ్యవసాయంలో ఈకనపడని ఖర్చులకు సంబంధించిన వాటిలో పెద్ద ఖర్చు ఒక ఎడ్ల జత మాత్రమె. కాబట్టి ఉత్తమమైన

వ్యవసాయపద్ధతులను ప్రవేశపెట్టటానికి పెద్ద పెద్ద క్షేత్రాలు కావాలనటంలో అర్థం కనిపించదు.

ఉత్తమ వ్యవసాయ పద్ధతులను ఆచరణలో పెట్టటానికి కావలసినది పెద్దక్షేత్రాల నిర్మాణం కాదు. దీనిని ఆచరణలో పెట్టాలంటే వ్యవసాయదారులలో దానికి సంబంధించిన విషయపరిజ్ఞానం ఉండాలి. ఆ తరువాత ఈ ఉత్తమ వ్యవసాయపద్ధతులకు కావలసిన పరికరాలు వస్తువులు (విద్యుచ్ఛక్తి మొదలైనవి) లభ్యం అవుతుండాలి. ఇవి రెండు ఉన్నా ఈ ఉత్తమ విధానం ఆచరణసాధ్యం కాదు. వీటి తరువాత ఈ విధానాలను అమలులో పెట్టుకొనటానికి తగిన ఆర్థిక సదుపాయాలు రైతుకి అందుబాటులో ఉండాలి. ఈ మూడింటిలో ఏది లోపించినా ఉత్తమ వ్యవసాయ విధానాల ఆచరణ సాధ్యం కాదు. వ్యవసాయ విధానాలలో, పరికరాలలో అత్యంత అధునాతనంగా వచ్చిన శాస్త్రీయవిజ్ఞానం రైతు నేర్చుకొని ఉన్నప్పటికి దాని ఆచరణకు కావలసిన వస్తువులు పరికరాలు – విద్యుచ్ఛక్తి, శాస్త్రీయమైన విత్తనాలు, ఎరువులు, పనిముట్లు – లభ్యం కానప్పుడు ఈ విధానాన్ని ప్రవేశపెట్టటం సాధ్యం కాదు. ఒక వేళ ఈ రెండు–విజ్ఞానం, పరికరాలు–ఉన్నప్పటికి రైతుకి తగినంత ఆర్థికబలం లేని పక్షంలో వీటిని అమలు పెట్టటం సాధ్యం కాదు. కాబట్టి ఈ మూడిండిలో శాస్త్రీయవిజ్ఞానం, పరికరాలు, ఆర్థికసదుపాయాలు–ఏది లోపించినప్పటికి ఉత్తమ వ్యవసాయవిధానాలు ఆచరణలోకి వచ్చే అవకాశం ఉండదు. ప్రధానావశ్యకాలైన ఈ మూడు వసతులు రైతుకి అందుబాటులో ఉన్నప్పుడు వ్యక్తిగత వ్యవసాయ విధానం ఉన్నా, సమిష్టి వ్యవసాయం ఉన్నా వీటి ప్రసక్తిలేకుండానే రైతు వీటిని ఉపయోగించుకొని ఉత్తమ పద్ధతులలో సేద్యాన్ని నిర్వహిస్తాడు.

ఈ ఉత్తమపద్ధతుల నిర్వహణకు కావలసినవిజ్ఞానం, పరికరాలు అందుబాటులో ఉన్నప్పుడు లేదా ప్రభుత్వం అందించినప్పుడు మన దేశంలోని రైతులు వీటిని ఉపయోగించుకొనని సందర్భాలు మన చరిత్రలో ఎక్కడైనా ఎప్పుడైనా ఉన్నవా ? మన రైతులు నూతన విధానాలకు విముఖంగా ఆచారదాస్యంలో ఉన్నారా ? ఉపయోగకర

మైన వ్యవసాయపద్ధతులనుకాని, అభివృద్ధిదాయకమైన నూతన పరికరాలనుకాని మన రైతులు ఉపయోగించుకొనకుండ నిర్లక్ష్యంచేసిన సందర్భాలు మనదేశ రైతాంగచరిత్రలో ఎక్కడా లేవు ఈ నూతన విధానాలు, పరికరాలు ఎలా లాభదాయకాలో ఉత్పత్తిదాయకాలో రైతులకు నచ్చచెప్పిన తరువాత వారు వాటిని వ్యర్థంచేసిన సందర్భాలు మనకు లేవు. ఉత్తమమైన, నూతనమైన వ్యవసాయ విధానాలను స్వీకరించి ఆచరించటంలో ప్రపంచం మొత్తంలో కుటుంబ వ్యవసాయ దారులే ఎంతో ఉత్సాహాన్ని ప్రదర్శించారు. కుటుంబ వ్యవసాయ విధానంలోనే ఈ నూతన విధానాల ఆచరణకు కావలసిన సామరస్య దృక్పథం కాన వచ్చింది. వాస్తవం ఇలా ఉండగా రైతులు ఆచారదాసులనటం ఆశ్చర్యకరం. అధికోత్పత్తులను సాధించటంలో కాని, నూతన విధానాలకు సుముఖత్వం ప్రదర్శించటంలోకాని జపాన్, నెదర్లాండ్స్, స్వీడన్ మొదలైన దేశాలలోని కుటుంబ వ్యవసాయ విధానంకంటె ఉత్తమమైన విధానం మరొకటి ప్రపంచంలో ఇంతవరకు గోచరించటం లేదు. జపాన్, చైనా దేశాల రైతులు పశువుల దొడ్లలోని ఎరువులకు బదులుగా నల్లమట్టినే ఎరువుగా ఉపయోగించటం ఎంతోకాలంనుంచి ఉన్నది. భూసార పరిరక్షణకు చైనా రైతుల విధానాలు ప్రపంచప్రఖ్యాతి గడించినవి. ఎంతోదూరం వెళ్ళ నవసరం లేకుండ మనదేశంలోనే మనరైతులు ప్రదర్శించిన పరిణామాత్మక దృక్పథం గమనించవచ్చు. వర్జీనియాపొగాకు పండించటంలోను, వేరుసెనగ మొదలైన నూనెగింజలను పండించటంలోను, కొత్త కొత్త రకాల వరి, గోధుమ, చెఱుకు, ప్రత్తి పండించటంలోను మన రైతులు ప్రదర్శించిన వైఖరిని గమనించిన వారు కుటుంబవ్యవసాయ విధానం అభివృద్ధి నిరోధకం అని అనగలరా? కృత్రిమ విధానాలద్వారా పశుసంతతిని పెంచటంకూడ మనరైతులు ఆహ్వానించారు గదా! ప్రథమ పంచవర్ష ప్రణాళిక (పుట 252) లోని ఈ క్రింది వాక్యాలను చదివితే మనరైతుల దృక్పథం ఎంత సవ్యమైనదో తేలికగా బోధపడుతుంది.

"మంచి విత్తనాలను ఉపయోగించటం అవసరం అని సాధారణంగా వ్యవసాయదారులకు అందరకు తెలుసు. శ్రమించి వ్యవసాయ

దారులందరు తమకు కావలసిన విత్తనాలను తామే జాగ్రత్తచేసి కొంటున్నారు. కొన్నికొన్ని రకాల విత్తనాలు ఏ ఏ ప్రభుత్వ శాఖల కృషితోను నిమిత్తంలేకుండానే రైతులలోకి పోయి ప్రచారంలో ఉన్నవి. కాబట్టి మంచి విత్తనాలు ప్రజలలో ఆదరణ పొందటం లేదంటే దానికి కారణం రైతులు కారు; ఆ దోషం ఆ విత్తనాల లోనో లేక మరొక చోటనో ఉండాలి కాని రైతులలో మాత్రం కాదు." రాయల్ ఎగ్రికల్చరల్ సొసైటీకి రసాయనిక శాస్త్రజ్ఞుడుగా ఉన్న డాక్టర్ ఎ.జె. వాక్లకర్‌ను ఆ నాటి ప్రభుత్వం 1889 లోనే ఈ దేశంలోని వ్యావసాయక విధానాలను పరిశీలించి, అభివృద్ధి చేయటానికి తగిన సూచనలు ఇయ్యవలసిందిగా చెప్పి పంపించింది. తన నివేదికలో అతడు ఇలా వ్రాశాడు. "భారతదేశంలోని మంచిరైతులు బ్రిటిష్ వ్యవసాయదారులకు ఏ మాత్రం తీసిపోరు; పైగా కొన్ని విషయాలలో మెరుగే అనిపిస్తారు. ఇక దారుణస్థితిలో ఉన్న రైతులను గురించి చెప్పాలంటే చాల ఉన్నది. ముఖ్యంగా ఈ రైతులకు అభివృద్ధికి కావలసిన సౌకర్యాలు లేవు. బహుశా ప్రపంచములోని ఏ దేశంలో కూడ రైతులు ఇంత తక్కువ సౌకర్యాలతో లేరేమో! అయినప్పటికి ఈ దేశంలోని రైతు ఈ దుస్థితికి మరొకరిని దూషించకుండ సహనంతో ఓర్పుతో కష్టాలను ఈడ్చుకొంటు వస్తున్నాడు. ఇంతటి సహనశక్తి ప్రపంచములో మరొకచోట చూడలేము." *

మన దేశంలోని చాలప్రాంతాలలో ఈ ఉత్తమ వ్యవసాయ పద్ధతులు ఇంతవరకు కూడ అమలులోనికి రానిమాట నిజమే. కాని ఈ రాకపోవటానికి కారణం మనకుటుంబవ్యవసాయవిధానం మాత్రమె కాదు. కుటుంబవ్యవసాయవిధానంవల్లనే ఈ ఉత్తమపద్ధతులు అమలు కావటం లేదు అనే వారికి ఒక చిన్న ప్రశ్న. దేశంలోని కొన్ని కొన్ని ప్రాంతాలలో ముఖ్యంగా రైతువారీ ప్రాంతాలలో ఈ ఉత్తమ వ్యవసాయవిధానాలు అమలులో ఉన్నాయి. మంచిపంటలే పండుతున్నాయి. దేశం మొత్తములోని సరాసరి స్థితిగతుల కంటె ఈ ప్రాంతాలలో మంచి పద్ధతులు అమలులో ఉన్నాయికదా! మరి ఇది

* Report on the improvement of Indian Agriculture, P. 10.

ఎలా సాధ్యమైంది ? దీనికి ఏ సమాధానం చెప్పుతారు. కాబట్టి ఈ ఉత్తమ సాంకేతికపద్ధతులు అమలులోనికి రాకపోవటానికి కారణం అందుకు అనువైన పరిస్థితులు సౌకర్యాలు దేశంలో లేక పోవటమె కాని కుటుంబవ్యవసాయంకాదు. ఈ సాంకేతిక పద్ధతులకు అనకాశం కలిగించేటట్లు సాంఘిక పునర్నిర్మాణ బాధ్యతను ప్రభుత్వం వహించాలి. ఆ పని జరిగిననాడు ఈ ఉత్తమ సాంకేతిక పద్ధతులను రైతులు కుటుంబవ్యవసాయవిధానం అడ్డురాకుండానే అమలులో పెట్టగలరు.

ఈ ఉత్తమ సాంకేతిక విధానాలను గురించి రైతులకు ఎరుక పరచి నచ్చచెప్పటం కోసం ఇంతవరకు చెప్పుకొనతగిన కృషి జరగనే లేదు. ప్రారంభించిన కృషి సక్రమంగా శాస్త్రీయంగా సాగటం లేదు. 1952 వ సంవత్సరం నుంచి మాత్రమే ఈ విషయమై శాస్త్రీయ విధానాలద్వారా కొంతకృషి జరుగుతున్నది. జాతీయవికాసకేంద్రాల ద్వారాను, సమాజాభివృద్ధికేంద్రాలద్వారాను ప్రజలలో ఉత్తమమైన సాంకేతికమైన ఉత్పత్తివిధానాలను గురించి వివరించటానికి కొంత ప్రయత్నం జరుగుతున్నది. 1958 వ సంవత్సరంలోనే దేశవ్యాప్తంగా బీజవిస్తృతీకరణ కేంద్రాలను ప్రభుత్వం స్థాపించింది. ఈ యీ విషయాలలో ఎలాంటి కృషిని ప్రారంభించినప్పటికి రైతులు వీటిమెడల అమితోత్సాహాన్ని ప్రదర్శించి అనుకొనినదానికంటె అధిక ఫలితాలను సాధించారు. ఈ ప్రయత్నాలు ప్రోత్సాహకరంగా ఆశాజనకంగా కనిపిస్తున్నవి. ఉదాహరణకు చూడండి : మొదటి పంచవర్ష ప్రణాళిక కాలంలో అమ్మోనియం సల్ఫేటు వాడకం 2,75,000 టన్నులనుంచి 6,00,000 టన్నులవరకు పెరిగింది. ఇంతగా ఎరువుల వాడకం పెరిగినప్పటికి దేశంలో ఇంక ఎరువులు సరిపోను అందటంలేదని మనప్రణాళికాసంఘమే అంటున్నది చూడండి : "తమకు కావలసిన రసాయనిక ఎరువులు తేలికగా సంపాదించుకొనలేక పోతున్నారు, రైతుల అవసరాలకు సరిపోను ఎరువులు అందకపోవటం, అందేవికూడ సరిపోనివి అందకపోవటం చాలతరచుగా కనిపిస్తున్నది." * ఉత్తమ

* The Planning Commission, Government of India, "Review of the First Five Year Plan", P. 92.

మైన నూతన సాంకేతిక విధానాలను స్వీకరించి ప్రయోజనం పొందటంలో మన రైతులు ఎలాంటి అశ్రద్ధను, ఆచారదాస్యాన్ని ప్రదర్శించటం లేదు. పైగా ఎంతో ఉత్సాహంతో ముందుకు వస్తున్నారు. జపాన్ పద్ధతి వరి సాగుకు రైతాంగం కనబరచినశ్రద్ధ, కిర్లోస్కర్ పంపులకు, డీసెల్ ఆయిల్ ఇంజన్లకు మార్కెట్‌లో నేడు కనబడుతున్న గిరాకి చాలకొద్ది కాలంలోనే దేశ వ్యవసాయరంగం ఉత్పత్తిచేస్తున్న అనేక వ్యాపారపుపంటలు దీనికి నిదర్శనం. రైతులలో ఈ విశాల దృక్పథం, నూతనవిధానాలఎడ ఉత్సాహంలేని పక్షంలో పై పనులకు అవకాశం లేదు గదా! రైతులలోని ఉత్సాహానికి మరొక ఉదాహరణనుకూడ చూడవచ్చు. బావులత్రవ్వకాలకు, మరమ్మతులకు ఎగుడు దిగుడు భూములను సమతల ప్రదేశాలుగా సరిచేసే భూసార పరిరక్షణ కార్యక్రమాలకు అయ్యే ఖర్చులలో ప్రభుత్వం నూటికి 50 వంతులు భరిస్తానని రైతులకు ప్రోత్సాహం ఇచ్చింది. ఈప్రోత్సాహాన్ని రైతులు వెంటనే అందుకొని ఉపయోగించుకొన్నారు. రైతుల ఉత్సాహానికి తగినంతగా ప్రభుత్వమే ఈ సబ్సిడీలను ఇయ్యలేక పోయింది. అలాగే అధికాహారోత్పత్తి కార్యక్రమం క్రింద ప్రభుత్వం చూపిన ప్రతి మార్గాన్ని రైతులు అనుసరించి ప్రభుత్వప్రోత్సాహానికి ద్విగుణీకృతోత్సాహం కనబరచారు.

వ్యవసాయ నిర్వహణను గురించిన శాస్త్రీయవిజ్ఞానాన్ని మానవశ్రమ ప్రధానాంశంగా గల వ్యవసాయవిధానాలలోని మంచి పద్ధతులను రైతులకు అందుబాటులోకి తీసికొని వచ్చిన వెంటనే వాటిని ఉపయోగించుకొనటంలో మన రైతులే మొట్టమొదటి వారుగా ముందంజ వేస్తారు. దీనికి కారణం కూడ ఉన్నది. జపాను పద్ధతి వరిసాగు మొదలైన విధానాలవల్ల రైతులకు అధికంగా అయ్యే ఖర్చు ఏమీ లేదు. రైతు కుటుంబంలోని సభ్యులకు చాలీ చాలని పనిపాటలు మాత్రమె ఉండటంచేత ఇలాంటి నూతన విధానాలలో అదనంగా ఖర్చులేకుండా వారే వీటిని నిర్వహించుకొంటారు. అంతే కాక మన రైతులకు వ్యవసాయం అనుశ్రుతంగా వస్తున్న సంప్రదాయక వృత్తి కానటంచేత ఆ వృత్తిలో వారు ఎంతగా శ్రమపడ

టానికైనా వెనుకంజవేయకుండ ఉత్సాహపడతారు. అందుచేతనే మానవశ్రమ ప్రధానాంశంగా గల ఎలాంటి ఉత్తమ విధానాల్నైనా రైతులు అతి త్వరలో అమలులో పెట్టగలుగు తున్నారు.

ఈ ఉత్తమ సాంకేతిక విధానాలను ప్రవేశపెట్టటానికి ప్రచారం ప్రయోగాత్మక ప్రదర్శనలు రైతులకు రైతు బిడ్డలకు ఆ యా విధానాలలో తగిన శిక్షణ గరపటం, రైతులకు కావలసిన పరికరాలను అందేటట్లు చూడటం ఉత్తమవిధానాలు. అంతేకాని కుటుంబ వ్యవసాయాన్ని రద్దుచేసి దాని స్థానంలో సహకారవ్యవసాయాన్నో లేక సమిష్టి వ్యవసాయాన్నో ప్రవేశపెట్టటం మాత్రం దీనికి మార్గం కాదు. ఏ నూతన పద్ధతులు కాని ఎక్కడైనా ఎప్పుడైనా అధికోత్పత్తులను, ఆదాయాలను అందిస్తున్నవని తేలిన వెంటనే ఆ నూతన పద్ధతులను ప్రవేశపెట్టాలని ఆ క్రొత్త పంటలను పండించాలని మన రైతులు ప్రత్యేకశ్రద్ధను ఉత్సాహాన్నికనబరుస్తున్నారు. నియంతృత్వదేశాలలోని వ్యవసాయరంగంలో ఈ నూతన సాంకేతిక విధానాలను ప్రవేశపెట్టటానికి నిరంతరప్రచారం ప్రదర్శనలు ప్రయోగాలు మాత్రమే మార్గంగా అనుసరింపబడుతున్నవి; అంతే కాని ఇవి లేకుండా కేవలం సాంకేతిక ప్రవీణులను వ్యవసాయ రంగంలో నియమించినంత మాత్రాన ఈ పని నెరవేరదు. ఇలాంటి ప్రచార విధానాలను చెప్పుకొన తగినంతగా మనం ఇంతవరకు ప్రయత్నించి చూచింది లేదు. ఎలాంటి ప్రయత్నాలు చేయకుండానే మన ప్రణాళికాకారులు మన రైతులు సంప్రదాయక విధానాలకు ఆచారాలకు దాసులని, నూతన సాంకేతిక విధానాల ప్రవేశానికి కుటుంబ వ్యవసాయం అవరోధం కల్పిస్తుందని భావిస్తున్నారు. మన రైతుల ఆచారదాస్యం సంగతి అలాఉంచి ఈ ప్రణాళికాకారులు మాత్రం హేతురహితమైన అంధవిశ్వాసాలకు, భావాలకు దాసులైపోతున్నారు. ఈ నూతన విధానాలను రైతు ఎందుకు వ్యతిరేకిస్తాడు? రేయింబవళ్ళు రెక్కలు విరిగేటట్లు రైతు శ్రమచేస్తున్నది ఆదాయంకోసం కాదా? అధికాదాయం రాగల విశ్వాసం ఉన్నప్పుడు ఆ అవకాశాలను కాలదన్ని ఈ చాలీచాలని ఆదాయమే నాకు చాలని సంతృప్తి పడేటంత పిచ్చివారెవరైనా ఉంటారా? ఆచార

దాస్యం, సంప్రదాయాల బానిసతనం అనేవి మన రైతులకు సహజ ప్రవృత్తి కనుక అయినపక్షంలో ప్రణాళికాకారులు ప్రతిపాదిస్తున్న సహకార వ్యవసాయం మాత్రం అభ్యుదయదాయకంగా ఎలా కృషి చేయగలదు? ఆ సహకార వ్యవసాయ సంఘ సభ్యులు ఈ రైతులు కారా? వారి సహజప్రవృత్తి ఆనాడు మాత్రం అడ్డురాదా? అలా కాదు. ఈ రైతులమీద ఒక ప్రవీణుణ్ణి నియమించి అతని అదుపు ఆజ్ఞలతో సహకారవ్యవసాయం కొనసాగేటట్లు చూస్తాం అంటారా! అలా చేసిన పక్షంలో సహకార వ్యవసాయ సంఘసభ్యులైన రైతుల ఇష్టానిష్టాలతో సంబంధం లేకుండ ఆ విధానం నడవాలి; అలాంటి దాన్ని సహకారవ్యవసాయం అనగలమా? ఒక అధికారి ఆజ్ఞలకు శాసనాలకు లొంగి పని చేయటమే తప్ప సభ్యుల అభిప్రాయాలకు తావులేని వ్యవసాయ విధానం సహకారవ్యవసాయం ఎలా అవుతుంది? అలాకాక రైతులకు ఆ యా నూతనవిధానాలను వివరించి నచ్చచెప్పటానికి సహకారవ్యవసాయంలో ఒక ఉన్నతోద్యోగినో, సాంకేతిక ప్రవీణునో నియమిస్తాం; అతని కృషివల్ల రైతులే తమ అంధ విశ్వాసాలను, ఆచారదాస్యాన్ని త్యజించి ముందుకు వస్తారు అని సమాధానం చెప్పవచ్చు. కాని ఇక్కడ ఒక ప్రశ్న. ఏ ప్రవీణుడో అధికారో రైతులకు నూతనవిధానాలను గురించి వివరించి నచ్చచెప్పటం అన్నపని ఇప్పుడెందుకు చేయరాదు? ఒక ప్రభుద్యోగి హోదాలో ఇప్పుడు పనిచేయవచ్చుగదా? ప్రభుద్యోగిగా ప్రస్తుతం చేయలేని పనిని, సహకారవ్యవసాయసంఘ ఉద్యోగిగా రేపుమాత్రం ఎలా చేయ సాధ్యమవుతుంది? ఈ నూతన సాంకేతికపద్ధతుల మీద రైతులకు శ్రద్ధ, ఉత్సాహం లేకపోయినపక్షంలో ఏసాంకేతిక ప్రవీణులు నచ్చినా ఈ విధానాలను అమలుచేయటం జరగని పని. ఎవరెన్ని చెప్పినా ఈ నూతనవిధానాలతో నిరంతరం ఒళ్ళు వంచి పొలంలో పనిచేయ వలసినవారు రైతులు; ఈ నూతనపరికరాలను తమచేతులతో ఉపయోగించేవారు రైతులు. కాబట్టి అలాంటి రైతులలో ఈ నూతన విధానాల ఎడల ఉత్సాహం శ్రద్ధ ఉండటం ప్రధానావశ్యకం. వ్యవసాయ కూలీలను వదలినా నిరంతరం వ్యవసాయంలో మెలిగే రైతులకు ఈ నూతనవిధానాలలో తగినంత తరిఫీదు ఇయ్యటం అవసరం.

అలాచేయకుండ అసలు రైతులనే వారినే తీసివేసి రైతులకు బదులుగా అందరిని సాంకేతిక ప్రవీణులనే నియమించి సహకారవ్యవసాయాన్ని నిర్వహించాలని అనుకొన్నపక్షంలో అది ఆచరణ సాధ్యమైన పని అనిపించుకోదు. పైగా ఎంతో ధనవ్యయంతో కూడిన పని అవుతుంది. సహకారవ్యవసాయ సంఘానికి కావలసిన ఇంతమంది సాంకేతిక ప్రవీణులకు శిక్షణఇచ్చి తయారుచేయటంకోసం మనం ఎంతోధనాన్ని, కాలాన్ని వినియోగించి, ఎన్నో శ్రమలు పడవలసి ఉంటుంది. ఇంతకంటె తక్కువఖర్చుతో, తక్కువ శ్రమతో కొద్దికాలంలోనే ఈ శిక్షణను మన రైతులందరకు ఇయ్యవచ్చు; వారినే సాంకేతిక ప్రవీణులుగా తయారు చేయవచ్చు. పైగా ఇది ఇలా ఉంచి వ్యవసాయాన్ని కేవలం సాంకేతిక ప్రవీణులకు వదలి వేయటానికి వీలులేదు. వీరు రైతుల విశ్వాసాన్ని చూరగొనక పోవచ్చు; రైతులతో వీరు కలిసిమెలసి వర్తించలేక కొత్తవారుగా దూరంగా మాత్రమె ఉండవలసి రావచ్చు. అసలు వాస్తవానికి మన రైతులే ఈ నూతన శాస్త్రీయవిధానాలను నేర్చుకొనటానికి చాలభాగం పనికి వస్తారు. వ్యవసాయ రంగంలో వారు చిరకాలంనుంచి ఉంటూ గొప్ప అనుభవాన్ని గడించి ఉండటంచేత, వ్యవసాయంలో వారికి ఉన్న ఉత్సాహం శ్రద్ధాసక్తులవల్ల ఈ నూతన సాంకేతిక విధానాలు నేర్చుకొనటానికి వారికి అట్టేకాలం పట్టదు; అంతగా ఖర్చుపెట్టవలసిన అవసరం కూడ ఉండదు. కాబట్టి ఎంతో తేలికశ్రమతో తక్కువఖర్చుతో రైతులనే సాంకేతికవిజ్ఞానులను చేయవచ్చు. రైతాంగవ్యవసాయవిధానంవల్ల ఈ పనిని చాల తేలికగా నిర్వహించుకొనవచ్చు; రైతులందరు సాంకేతిక విజ్ఞానులు కాగల అవకాశం రైతాంగవిధానంవల్ల తేలికగా సమకూడుతున్నది.

ఉత్తమమైన నూతన సాంకేతికవిధానాలను మనవ్యవసాయ రంగంలో ప్రవేశపెట్టాలి అనుకొంటె కేవలం శాస్త్రీయ విజ్ఞానం ఉన్నంత మాత్రాన చాలదు. ఈ నూతనవిధానానికి కావలసిన వస్తు సామగ్రిని కొనటానికి తగినంత ధనంకూడ మనకు లభ్యం కావాలి. ఈ ధనం సమస్యలో మనం మరొక వాదాన్ని కూడ పరిశీలించవలసి ఉన్నది. ఈ నూతన సాంకేతికవిధానాలను ప్రవేశపెట్టటానికి కావల

సిన ధనం సహకారవ్యవసాయవిధానంవల్ల మాత్రమె లభించగలదని అంటున్నారు. సహకారవ్యవసాయం కావాలనేవారు దీనిని కూడ ఒక ప్రధానమైన వాదంగా చెపుతున్నారు.

II

ఈ వాదాన్ని గురించి వారు ఇలా వివరిస్తున్నారు.

కుటుంబవ్యవసాయవిధానంలో ఆదాయాలు ఆ యా రైతులకు విడివిడిగా వ్యక్తిగతంగా లభిస్తుంటవి. ఎవరి భూకమతంనుండి వచ్చే రాబడి వారిదే. ఈ రాబడులలో ఆ యా రైతులు వ్యక్తిగతంగా కొంత ధనాన్ని పొదుపుచేసి కూడబెట్టుకొంటు ఉంటారు. కాని ఇది కూడ ఎవరికివారే కూడబెట్టుకొంటు ఉంటారు. ఇలా విడివిడిగా ఉన్న ఈ వ్యక్తులు పొదుపుచేసికొన్న ధనాన్ని ఏకం చేసి వ్యానసాయక అభివృద్ధివిధానాలకు, నూతనసాంకేతికవిధానాలకు ఉపయోగపడేట్లు చేయటం అసాధ్యంగా ఉన్నది. విడివిడిగా ఉన్న ఈ వ్యక్తుల ఆదాయాన్ని బట్టి చూస్తే ఎవరికి వారై నూతన సాంకేతికవిధానాలకు అవసరమయ్యే పెట్టుబడులను పెట్టగల స్థితిలో లేరు. అందరి ఆదాయాలను కలిపి ఏకముఖంగా ప్రవహింపచేద్దామంటె వీలుపడకుండ ఉన్నది. కాని సహకారవ్యవసాయవిధానంలో అయితే ఈ చిక్కులు రావు. ఈ విధానంవల్ల వచ్చిన ఆదాయం సంపూర్తిగా సహకార వ్యవసాయసంఘం చేతిలోనే ఉంటుంది. ఈ సంఘం నూతనవ్యవసాయ పరికరాలకు, అభివృద్ధివిధానాలకు సాంకేతికపద్ధతులకు కావలసిన ధనాన్ని ముందుగానే అంచనా వేయవచ్చు. ఆ అంచనాకు కావలసిన ధనాన్ని మొత్తం రాబడినుంచి తీసి ఆ యా అభివృద్ధి కార్యక్రమాలకు దానిని కేటాయించి నిలవ చేసికొనవచ్చు. ఇలా తీయగా మిగిలిన ధనాన్ని మాత్రమే కూలిరూపంగాను భూకామందులకు వాటాల రూపంగాను పంచటానికి వీలుగా నిర్ణయంచేసికొని ఆ విధంగానే చేసికొనటానికి అవకాశం ఉన్నది. ఈ విధంగా నిలవచేసికొన్న ధనాన్ని ఉత్తమమైన నూతనసాంకేతికవిధానాలను ప్రవేశపెట్టటానికి నీటిపారు

దల సౌకర్యాల ఏర్పాట్లు, బావులత్రవ్వకం, భూములను సమతలంగా చేసికొనటం మొదలైన దీర్ఘకాలిక కార్యక్రమాలకు వినియోగించుకొనటానికి అవకాశం కలుగుతుంది. కుటుంబవ్యవసాయవిధానంలో అయితే ఈ సౌకర్యాలకు వీలుండదు. ఆయా రైతులకు వచ్చే ఆదాయాలుకూడసమంగా ఉండవు. ఈ విడీవిడిగా ఉన్న నిలవధనాన్నికూడ ఏకముఖం చేసి సర్వజనోపయోగ కార్యక్రమాలకు వినియోగించుకొనటానికిమార్గాలు కూడ లేవు. ఏ రైతుకూడ వ్యక్తిగతంగా తన నిలవలతోఈ కార్యక్రమాలను సాగించలేడు. సహకారవ్యవసాయవిధానంలోనే వ్యావసాయక ఆదాయాలను ఏకముఖంగా ప్రవహింపచేసి అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించుకొనగల అవకాశం ఉన్నది.

ఈ వాదంలో ఎంతసత్యం ఉన్నదో పరిశీలిద్దాం. విడివిడిగాఉన్న ఆదాయాలను నిలవలను ఏకముఖం చేయటానికి, ఈయీ కార్యక్రమాలకు పూనుకొనవలసి ఉంటుందని నిర్ణయాలు తీసికొనటానికి సహకారవ్యవసాయవిధానం శక్తివంతమైన మార్గం అయితే కావచ్చు. కాని ఈ సహకారవ్యవసాయం నిలవలను సృష్టించి ప్రోత్సహించగలదా? సహకార వ్యవసాయంవల్ల నిలవధనం ఎలా పెరుగుతుంది? వ్యక్తిక ఆదాయాలను సర్వజనోపయోగకారులైన వ్యావసాయక అభివృద్ధి కార్యక్రమాలలోకి ఏకముఖంగా ప్రవహింప చేయటానికి ఇతరమైన ప్రజాస్వామిక విధానాలు లేవా?

అసలు ఈ నిలవధనం అనేది ఎలా ఏర్పడగలదు? ఏ సంఘంలోని ప్రజలకైనా నిలవధనం ఉండటానికి పెరగటానికి ఒకే మార్గం ఉన్నది. ఆయా ప్రజలకు వస్తున్న ఆదాయాల్లో వారిజీవితం గడవగా ఏమైనా మిగిలితే అదే నిలవధనం. భారతదేశంలోని వ్యవసాయదారునికి తన జీవితం గడవగా మిగులుతున్నది ఎంత? ఈ దేశంలో రైతుకి జీవితమే అస్తుబిస్తుగాగడుస్తున్నది గదా! పైగా జీవితం గడవగా మిగిలేది లేశ మాత్రమేకదా! మన రైతు లోకం ఋణగ్రస్తమై ఆర్థికంగా నానాబాధలు పడుతున్న సంగతి మనకు తెలియనిది కాదు. రైతులకు వస్తున్న ఆదాయం వారి మనుగడకే చాలీచాలకుండ ఉన్నది. దీనికి కారణం వ్యవసాయంలోనే ప్రజలలోని అత్యధిక

సంఖ్యాకులు జీవించవలసి ఉండటమే. అందుచేతనే మన గ్రామీణ ప్రాంతాలలో ఋణబాధలు అధికం అవుతున్నవి. నేడు మన వ్యవసాయంలో అవసరానికి మించిఉన్న మిగులు మనుష్యులను మరొక రంగానికి తరలించి భూమిమీద ఉన్న ఒత్తిడిని తగ్గించ నిదే మన వ్యవసాయరంగంలో ఎలాంటి నిలవలకు ఆస్కారం లేదని సర్వులు అంగీకరించిన సంగతె. కాని వ్యవసాయంలోని ఈ మిగులు మనుష్యులను మరొక రంగానికి తరలించాలని మన ప్రణాళికా కారుల ఉద్దేశం కాదు. ఒకవేళ ప్రభుత్వం ఆ పని చేద్దామని తలం చినా అది అంత సులువుగా త్వరగా జరిగే పని కాదు. వ్యవసాయం లోని ప్రజలందరు వ్యవసాయంలోనే ఉండగా వ్యవసాయోత్పత్తులు పెరిగే మార్గం లేకుండా సహకార వ్యవసాయాన్ని ప్రవేశపెట్టినంత మాత్రాన నిలవలు ఎలా పెరగగలవు? సహకార వ్యవసాయ విధా నంలో కూడ ప్రజలకు కనీసమైన జీవితావశ్యకాలు తీరాలి గదా! వారి మనుగడకు సరిపోను ఉత్పత్తులను వ్యయం చేయక ఏ విధానం లోను తప్పదు గదా! మొత్తం ఉత్పత్తులలో, నికరాదాయంలో మార్పులు లేకుండ అంతకు ముందు ఎంత ఆదాయం వస్తున్నదో అదే ఆదాయం వచ్చేటప్పుడు వ్యవసాయనిర్వహణవిధానం మారినంత మాత్రంచేతనే పరిస్థితులు మెరుగై నిలవలు పెరుగుతాయా? ఇది హాస్యాస్పదమైన ఆలోచన. వ్యవసాయవిధానం ఏదైనప్పటికి ప్రజల మనుగడకు చేస్తున్న వ్యయం తగ్గినప్పుడు లేదా ఆదాయం పెరిగి నప్పుడు మాత్రమే నిలవలు పెరగటానికి అవకాశం ఉంటుంది.

మన వ్యవసాయ ప్రజలు ఇప్పటికే కనీస అవసరాలకు చాలీ చాలని అస్తుబిస్తు జీవితం గడుపుతున్నారు. ఈ స్థితిలో నిర్బంధ విధా నాలను అమలు చేయకుండ వారి జీవన వ్యయాన్ని తగ్గించటం సాధ్యం కాదు. ఇలా చేయాలంటె సహకార వ్యవసాయ విధానానికి ఒకటే మార్గం ఉన్నది. సహకార వ్యవసాయంవల్ల లభించగల ఆదాయాలను ఆ సభ్యులకు చేరకముందే గ్రహించి వారికి అందనియ్యకుండ నిలవ చేయాలి. అలాచేయ వసరంలేకుండ రైతులే తమ జీవనవ్యయాన్ని తగ్గించుకొంటారని ఈ నాటి అస్తుబిస్తు జీవితంకంటె ఇంక అధమస్థపు

జీవితం గడపటానికి ఇష్టపడతారని విశ్వసించటం మన అజ్ఞానానికి మాత్రమే నిదర్శనం కాగలదు. కాబట్టి సహకార వ్యవసాయంవల్ల నిలవలు పెరగాలంటే నియంతృత్వవిధానాలను, దొంగదారులను ఆశ్రయించవలసి ఉంటుంది. వాస్తవంగా పరిశీలించినప్పుడు ఈ నిలవలు పెరగటానికి పొదుపరితనం అభివృద్ధి చెందటానికి మన కుటుంబ వ్యవసాయ విధానంలోనే చక్కని అనకాశాలు సంప్రదాయాలు ఉన్నవి. మన రైతులకు ధనాన్ని పొదుపుచేసికోవాలన్న వాంఛ ఇతర రంగాలలోని ప్రజలకంటె అధికంగా ఉన్నది. దీనిని గురించి పెద్ద పెద్ద వాదోపవాదాలకు దిగి చర్చించవలసిన అవసరం లేదు. సంవత్సరానికి ఒక వెయ్యిరూపాయిలు ఆదాయం వచ్చే రైతు ఎంత పొదుపుగా జీవిస్తున్నాడో, అదే వెయ్యిరూపాయిలు సంపాదిస్తున్న ఇతరరంగాలలోని ప్రజలు ఎంత నిలవ చేయగలుగుతున్నారో ఒకసారి ఆలోచిస్తే ఈ సంగతి స్పష్టమవుతుంది. ఇతర రంగాలలోని వారికి రైతులకు ఆదాయాలలో తేడా లేకపోయినా ఆహారవిహారాలలో ఎంత వ్యత్యాసం ఉంటున్నదో పరిశీలించండి. పొదుపరితనం అనేది కుటుంబ వ్యవసాయవిధానానికి సహజలక్షణం. కుటుంబకమతాలపైన వారికి ఉండే శ్రద్ధాసక్తులు, వారికి నృత్తిని ప్రసాదిస్తున్న ఆ భూకమతాలను పెంచుకోవాలన్న వాంఛ, తమ బ్రతుకు తెరువుకు ఆధారభూతంగా ఉన్న తమ తమ భూములను బాగుచేసికోవాలన్న కోరిక బహుశ ఈ సహజ లక్షణమైన పొదుపరితనానికి కారణాలు కావచ్చు. సహకార వ్యవసాయ విధానంలో రైతులకు తమ తమ భూకమతాలమీద ఇలాంటి శ్రద్ధాసక్తులు మమకారం ఉండటానికి వీలు ఉండదు. ఆ మమకారం అవినాభావసంబంధం విచ్ఛిన్నమైపోతాయి. అందుచేత సహకార వ్యవసాయ విధానంలో పొదుపరితనానికి కావలసిన సహజ వాంఛ, శ్రద్ధాసక్తులు లోపించటంలో ఆశ్చర్యం లేదు. పైగా సహకార వ్యవసాయ విధానమె కనుక ప్రవేశపెడితే ఈనాడు లభిస్తున్న కొద్దిపాటి నిలవలుకూడ లభించక పోవచ్చు.

వ్యవసాయదారుల ఆదాయం పెరగటానికి ప్రత్యామ్నాయ మార్గాలు ఏమైనా ఉన్నవేమో చూడటమే దీనికి మార్గం. కాని

మనం ముందటి అధ్యాయాలలో పరిశీలించిన దానిని బట్టి వ్యవసాయ దారుల ఆదాయం పెరగాలంటే ఉత్తమమైన నూతనసాంకేతికవిధానాలను మన వ్యవసాయంలో ప్రవేశపెట్టవలసి ఉన్నది. ప్రస్తుతపరిస్థితులలో మన వ్యవసాయరంగానికి పెట్టుబడులకు కావలసిన ధనం కరువుగా ఉన్నది; మన వ్యవసాయదారులు పొదుపుచేయాలన్నా చేతికి అందేదేమీ కనిపించటం లేదు. కాబట్టి మనవ్యవసాయంలో నూతన విధానాలను ప్రవేశపెట్టటానికి కావలసిన ధనం దొరకటానికి ఒకే ఒక మార్గం ఉన్నది; అది అప్పు. ప్రస్తుతం వ్యవసాయరంగంలో ఉంటున్న ప్రజలందరు వ్యవసాయంలోనే ఇప్పటి భూములతోనే ఉన్నంతకాలం ఈ అప్పులద్వారా తప్ప మరొక విధంగా పెట్టుబడులు సమకూడే అవకాశం లేదు. ఈ ప్రజలఒత్తిడి తగ్గినంతకాలం కుటుంబవ్యవసాయ విధానం ప్రవేశించినా ఈస్థితిలోమాత్రం మార్పురాదు; పెట్టుబడులకై ఋణాలమీద ఆధారపడక తప్పదు. వ్యవసాయరంగానికి కావలసిన ఋణాన్ని ప్రభుత్వం అందించిన పక్షంలో రైతుల నిల్వలు పెరిగి, ఆర్థికనసతులు అభివృద్ధి చెందటానికి అవకాశం ఏర్పడుతుంది.

సాంవత్సరిక వ్యవసాయ కార్యకలాపాలకు భూమిని అభివృద్ధి చేసికొనే కార్యక్రమాలకు కావలసిన ఋణాన్ని రైతులకు అందించటానికి సహకారసూత్రంతో నిర్మించబడిన సెంట్రల్ కో-ఆపరేటివ్ బాంకులు, స్టేట్ కో-ఆపరేటివ్ బాంకులు చక్కగా ఉపయోగపడతాయి. తిరిగిచెల్లించగల పక్షంలో రైతులకు ఎంతవరకైనా అప్పులు మంజూరు చేయవచ్చు. వారు తిరిగి చెల్లించగలరా చెల్లించలేరా అనేదే దానికి ప్రధాన పరిమితి. అధికోత్పత్తిదాయకాలైన కార్యకలాపాలకు ఋణాలు ఇచ్చిన పక్షంలో రైతులు ఆ బాకీలను తేలికగా తీర్చగలుగుతారు. ఈ ఋణాల ఆశయం అధికోత్పత్తిగా ఉండాలి. అలాకాక ఈ అప్పులవల్ల రైతులకు అధికోత్పత్తులు సాధ్యంకాని పక్షంలో వారు ఈ అప్పులు తీర్చలేరు. వారికి మామూలుగా నచ్చే ఆదాయం వారి మనుగడకు వ్యవసాయనిర్వహణకు చాలటమే అంతంత మాత్రం. కనుక ఉత్పత్తి పెరగనిదే ఋణాలు తీర్చలేరు. కేవలం పరిపాలనా సౌలభ్యందృష్టితో పరిశీలించినప్పుడు సహకారవ్యవసాయ

విధానం ఉంటే కొన్ని సౌకర్యాలు లేక పోలేదు. సహకారవ్యవసాయం ఉన్నప్పుడు పరిపాలకులు విడివిడిగా ఉన్న అనేకులు రైతులతో లావాదేవీలు జరుపనవసరం లేకుండా ఆ ఒక్క సంఘంతోనే వ్యవహారాలు నడుపు కోవచ్చు. ఉత్పత్తిదాయకమైన కృషిలోనే ఈ ఋణాలు వినియోగ పడేటట్లు చూడవచ్చు. పంటలురాగానే సభ్యులసంగతి ఎలా ఉన్నా ఆ సంఘంనుంచి రావలసిన ఋణాలనుకూడ తేలికగా రాబట్టు కొనవచ్చు. కాని మనదేశంలో సంఘంలో చరిత్రాత్మకమైన మహోన్నత పాత్రను నిర్వహిస్తు అనేక సాంఘికప్రయోజనాలకు ఆధారంగా ఉన్న మనకుటుంబవ్యవసాయ విధానాన్ని పరిపాలకుల సౌలభ్యంకోసం ఈనాడు తారుమారు చేయగలమా? ప్రభుత్వోద్యోగుల సౌకర్యార్థం మనసాంఘికసంస్థలను రూపుమాపుకొంటామా? రైతులకు సహాయం చేయటానికి అనేకమార్గాలు ఉండగా మనప్రణాళికాకాశలు ఆమార్గాలను ముందు ఆలోచించి ఆచరణలో ఎందుకు పెట్టకూడదు? రైతులకు కావలసిన ఋణాలను కొద్దిపాటి వడ్డీలతో కో-ఆపరేటివ్ బ్యాంకులద్వారా అందేటట్లు చేయవలసి ఉండగా ఆ పనికి పూనుకొనకేమి? రైతులకు ఇలా చౌకగా ఋణాలు లభ్యమైన పక్షంలో వడ్డీల భారం తగ్గి ఉత్పత్తిదాయకమైన పద్ధతులను అమలులో పెట్టటానికి అవకాశం లభిస్తుంది. తద్ద్వారా మొత్తం ఉత్పత్తులు పెరిగి ఆదాయాలు కూడ అభివృద్ధి చెందగలవు. ఇలాంటి నిర్మాణాత్మక కృషికి పూనుకొనటానికి బదులు సాంఘికవ్యవస్థను తారుమారు చేయగల సహకారవ్యవసాయాన్ని ప్రవేశపెట్టాలన్న నినాదాన్ని పట్టుకొని ప్రేలాడటం దేనికో!

రైతుకి సక్రమంగా అందేటట్లు, వినియోగపడేటట్లు ఋణాలు ఇయ్యటానికి అనేక మార్గాలున్నవి. ఈ ఉన్న మార్గాలలో గ్రామీణ ఋణపరిశీలకనివేదికలో ఆ సంఘంవారు సూచించిన మార్గం నేటిపరిస్థితులకు ఉత్తమంగా ఉన్నది. ఋణాలు ఇయ్యటంకోసం ఏర్పడిన సహకారసంఘాలలో ప్రభుత్వంకూడ కొన్ని వాటాలుకొని ఆ సంఘాలు కేవలం ఋణం వరకే పరిమితం కాక ఇతర విషయాలలో కూడ కలిగించుకొని సమోధ్యత నెరపాలి. పంటల అమ్మకం, నిల్వచేసే

విధానం, ఆ యా సహకారసంఘాల పరిపాలన, మొదలైన విషయాలను సమన్వయంచేసి రైతులకు ఎక్కువ ఉత్పత్తులు లాభాలు వచ్చేటట్లు చూడవచ్చు. ఈ పనులు చేయటానికి సమర్థులైన ఉద్యోగులను నియమిస్తే ప్రభుత్వం ఇచ్చే ఋణాలు ఉత్పత్తిదాయకంగా లాభదాయకంగా వినియోగపడి దేశాభ్యుదయానికి తోడ్పడగలవు. ఈ విధానంద్వారానే రైతులకు అవసరమైన ఋణాలు సక్రమంగా వినియోగం కావటానికి అవకాశం ఉన్నది. ఇలా వ్యవసాయ పర్యవేక్షణానంతరం ఋణాలు మంజూరుచేయటం, కొన్నికొన్ని ప్రత్యేక కార్యకలాపాలకోసమే అప్పులియ్యటం మొదలైన మార్గాలు కూడ బాగా వినియోగపడగలవు. దీనిలో ఉన్న కష్టమల్లా పరిపాలనకు సంబంధించిన కొద్దిపాటి చిక్కులే. సహకార వ్యవసాయవిధానంలో అయితే కొన్ని సంఘాలతో ప్రభుత్వోద్యోగులు వ్యవహరించవలసి ఉంటుంది. ఇలా అయితే ఆ యా ప్రభుత్వోద్యోగులసంఖ్య కొంత పెరగవలసిఉంటుంది. వారుచాలమందిరైతులతో సంబంధాలు పెట్టుకొని ఈ కార్యకలాపాల నిర్వహణ సాగించ వలసిఉంటుంది. సహకార సేవాసంఘాల ద్వారా ఈ ఉద్యోగులు విడివిడిగా ఉన్న రైతులతో వ్యవహరించటం మరొక బాధ. దీనిలో ఏమీ లేదు.

III

కాని మరి కొందరు మరొక వాదం కూడ చేస్తున్నారు. వ్యవసాయాన్ని పెద్దఎత్తున ఏకాధిపత్యంక్రింద నిర్వహించిన పక్షంలో పనిపాటలు బాగా లభించటానికి అవకాశం ఉంటుందనీ, తద్ద్వారా ఆదాయం పెరుగుతుందనీ అంటున్నారు. కాని ఈ వాదంలో సత్యం లేదు. వ్యవసాయదారులకు పనిపాటలు పెరిగి చేతినిండ పని దొరకాలంటే వ్యవసాయానికి తోడు పాలపరిశ్రమలు, తేనెటీగల పెంపకం మొదలైన పద్ధతులు రైతులలో బాగా ప్రచారం కావాలి. అందుకు ప్రభుత్వం చేయూతనిచ్చి ప్రోత్సహించాలి. ఈ ఉపవృత్తులకు తోడు నీటి పారుదల సౌకర్యాలు, బావులత్రవ్వకం మొదలైన దీర్ఘకాలిక కార్యక్రమాలు కూడ ఉండాలి. ఇవి ఉన్నప్పుడు రైతుల పనిపాటలు రాబడి పెరగ

టానికి వీలు ఉంటుంది. ఈ కార్య కలాపాలు ఒక్క సహకారవ్యవ సాయంలో మాత్రమే ఆచరణసాధ్యం అవుతాయనుకోవటం మాత్రం పొరపాటు. వీటికోసం సహకార వ్యవసాయం కావాలని వాదించటం వెట్టిచాకిరి.

మన గ్రామీణప్రాంతాలలో వ్యవసాయానికి తోడు అనేకమైన చిన్నచిన్న పరిశ్రమలు నెలకొల్పి పనిపాటలను కల్పించవచ్చు ననటంలో సందేహం లేదు. కాని అలా చేయటానికి మన కుటుంబ వ్యవసాయ విధానం అవరోధంగా ఉన్నదనటం సత్యదూరం. మన దేశంలోని చాలప్రాంతాలలో కోళ్ళ పెంపకం, పాడిపరిశ్రమ వ్యవసాయానికి తోడుగా ఎందువల్ల అభివృద్ధి చెందలేదు? ఈ పాడిపరిశ్రమలవల్ల కోళ్ళ పెంపకంవల్ల రైతులకు పనిదొరికి రాబడి పెరగగల అవకాశం ఉన్నప్పుడు ఇవి ఎందువల్ల అభివృద్ధి చెందటంలేదు? దీనికి కారణాలు చాల ఉన్నవి. పల్లెలలో ఈ గృహపరిశ్రమలలో తయారయ్యే వస్తువులకు పట్టణాలలో గిరాకీ, వాడకం లేదు; ఉన్న వాడకానికి సరిపోను నిర్వహించుకొన వచ్చునుగదా అంటే అందుకు కావలసిన సంఘాలు, పట్టణాలకు వీటిని త్వరగా చేరవేయగల రాకపోకల సౌకర్యాలు లేవు; అన్నింటిని మించి ఈ చిన్న పరిశ్రమల నిర్వహణకు కావలసిన విజ్ఞానం రైతులోకంలో వ్యాప్తం కాలేదు. కాబట్టి ఈ పాడి పరిశ్రమలవంటి చిన్నచిన్న గృహపరిశ్రమలు పెంపొందక పోవటానికి మన సంఘ నిర్మాణంలోనే దోషాలు ఉన్నవి. అంతేకాని కుటుంబ వ్యవసాయ విధానంవల్ల ఇవి పెరగలేదని అనుకోవటం తప్పు. కుటుంబ వ్యవసాయ విధానంలోనిరైతులు ఈ ఉపవృత్తులను పెంపొందించలేరని భావించటం పొరపాటు. పట్టణాలకు సమీపంలో ఉండి ఆ యా వస్తువులను త్వరగా పట్టణాలకు చేర్చుకొనటానికి రాకపోకల సౌకర్యాలు ఉన్న గ్రామాలలో ఈ ఉపవృత్తులు క్రమక్రమంగా అభివృద్ధి చెందుతు ఉన్నవి; పట్టణాలకు ఆ యా వస్తువులను అందిస్తున్నవి. ఈ సౌకర్యాలు లేని మూల గ్రామాలలో కూడ ఈ ఉపవృత్తులు ఉన్నవి; కాని అవి వారి ఇళ్ళలోకి కావలసిన వాడకం వరకు మాత్రమె పరిమితమై ఉన్నవి. ఈ కోళ్ళ పెంపకం పాడిపరిశ్రమలు 1914 వ సంవత్సరంనుంచి రైల్వే

స్టేషన్లకు సమీపంలో ఉన్న గ్రామాలలో క్రమంగా అభివృద్ధి చెందుతున్నవి. అప్పట్లో యుద్ధసైనికులకు సరఫరా చేయగల అవకాశం ఉండటంచేత, ఆ తరువాత క్రమంగా నిర్వహణ సంఘాలు ఏర్పడటం చేత ఈ పరిశ్రమలు ఆ ప్రాంతాలలో దినదినాభివృద్ధి చెందుతున్నవి. ప్రస్తుతం మన పట్టణాలకు చుట్టుపట్ల ఉన్న గ్రామాలలో పాలపరిశ్రమ విరివిగా అభివృద్ధి చెందుతున్నది. పశువులకు కృత్రిమ మార్గాలద్వారా సంతానోత్పత్తిని కలిగించటంకోసం ప్రభుత్వం తలపెట్టిన కేంద్రాలను తమతమ ప్రాంతాలలో గ్రామాలలో స్థాపింపచేసికోవాలని మన రైతులు ఎంతో ఉత్సాహాన్ని కార్యదీక్షను చూపుతున్నారు. ఈ ఉపవృత్తులు పెంపొందటానికి అవకాశాలు ఉండి కూడ అభివృద్ధి చెందని ప్రాంతాలు ఏవైనా ఉంటే ఆయా ప్రాంతాలలో చేయవలసిన పనులు వేరే ఉన్నాయని గమనించాలి. అలాంటిచోట్ల బహుళార్థసాధక సహకార సంఘాల నిర్మాణానికి పూనుకొని, ప్రజలను ప్రోత్సహించి ఆ సంఘాలద్వారా రైతులకు ఋణాలు ఇచ్చి ఈ పాడిపరిశ్రమ, కోళ్ళ పెంపకం మొదలైన ఉపవృత్తుల ప్రయోజనాలను గురించి వారికి వివరించి ఎరుకపరచి, రవాణాసౌకర్యాలను ఏర్పాటు చేయవలసి ఉంటుంది. ఈ కార్యక్రమానికి మనం పూనుకొన్న పక్షంలో రైతులు సహకరించరని, ఈ అవకాశాలను వినియోగించుకొనరని అనుకోవటం పొరపాటు. ఇలా ప్రజలు తమంతట తామే ఏర్పాటుచేసికొన్న సహకార సంఘాలద్వారానే ఈ ఉపవృత్తులు చక్కగా అభివృద్ధి చెందటానికి వీలు ఉంటుంది. కుటుంబవ్యవసాయ విధానంవల్ల రైతులలో సహజంగా ఉండే వ్యక్తిగతశ్రద్ధ ఈ ఉపవృత్తుల అభివృద్ధికి, సహకార సంఘాలలో తగినట్లుగా శ్రద్ధతీసికొనటానికి చక్కగా ఉపయోగపడుతుంది. అందుచేత కుటుంబవ్యవసాయ విధానాలవల్లనే ఈ ఉపవృత్తులు మూడుపూవులు ఆరుకాయలుగా విలసిల్లటానికి అవకాశం ఉంటుంది. ఈ విషయమే అనేక దేశాలలో రుజువు అయింది. కుటుంబ వ్యవసాయ విధానం అమలులో ఉన్న నార్వే, డెన్మార్కు, స్విట్జర్లాండు, జపాన్ మొదలైన దేశాలలో ఈ ఉపవృత్తులు ఎంతో బాగా పెంపొందాయి. అంతదాకా వెళ్ళనవసరం లేకుండ మనదేశాన్ని కూడ ఇందుకు ఉదాహరణగా గ్రహించవచ్చు. ఈ ఉపవృత్తులకు

సంబంధించినంతవరకు సహకారోద్యమం మనదేశంలో కొంత అభివృద్ధిని సాధించింది. ఈ అభివృద్ధివల్ల, కృషివల్ల ఒక విషయం మాత్రం విదితమవుతున్నది. ఈ ఉపవృత్తులను ఏర్పాటు చేసికోవాలని మన రైతులకు ఎంతో ఉత్సాహం ఉన్నది. వారి ఉత్సాహానికి తోడు ప్రభుత్వంగాని, సహకార సంఘాలుగాని వారికి కానలసిన సౌకర్యాలను కలిగిస్తే ఆ అవకాశాలను ఉపయోగించుకొనటానికి వారు సిద్ధంగా ఉన్నారు. ఈ విషయంలో మనదేశంలోని కొన్ని ప్రాంతాలలోని కొన్ని సహకారసంఘాలు చేస్తున్న కృషిని ఉదాహరణగా చూడవచ్చు. ఆనంద్‌లోని కైరా జిల్లా పాల ఉత్పత్తిదారుల సంఘం, మద్రాసు పాల సహకారసంఘం ఈ ఉపవృత్తుల విషయంలో చక్కని కృషిచేస్తూ బాగా అభివృద్ధి చెందుతున్నవి. ఈ సంఘాలు బొంబాయి, మద్రాసు పట్టణాలకు సమీపంలో ఉండటంచేత వాటికి ఈ అవకాశం లభించింది. నిమ్రబోలు వంటి అనేక గ్రామాలలోకూడ స్థానికరైతులు పాల సరఫరా సహకార సంఘాలను ఏర్పాటు చేసికొన్నారు. ఇదే విధంగా చేనేతవారి పనిపాటలకు సంబంధించిన సహకారసంఘాలు, అనేక చేతిపరిశ్రమలకు సంబంధించిన సహకారసంఘాలు మొదటి పంచవర్షప్రణాళికా కాలంలో ప్రభుత్వ ప్రోత్సాహంతో సహాయంతో నెలకొని అత్యుత్తమ సేవచేస్తూ దినదినాభివృద్ధి పొందుతున్నవి. కాని ఇలాంటి సహకారసంఘాలు అన్నీకూడ ఆయా చేతి పరిశ్రమలవారి గృహకృత్యాల జోలికి పోకుండ వారి పనులను వారి గృహాలలోనే ఉండి తమ ఇష్టం వచ్చినట్లుగా నిర్వహించుకొనే స్వాతంత్ర్యం వారికి ఇస్తూ అభివృద్ధి చెందినవి. అంతేకాని వారి పనిపాటలలో ఇళ్ళలో వారికి స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు లేకుండ చేసినట్లయితే ఈ సంఘాలు ఇంతకాలం నిలబడగలిగేవే కాదు. ఈ చేతివృత్తుల కళాకారుల పనిపాటలలో, అవసరాలలో ఆసరాగా నిలిచి సహాయపడటానికి ఈ సహకార సంఘాలు ఏర్పాటు చేశారు కాని ఆ స్వాతంత్ర్యాన్ని హరించటానికి కాదు. ఈ కళాకారుల వ్యవస్థ కుటుంబ నిర్వహణ విధానం మీద ఆధారపడిన విధానమే. కుటుంబవ్యవసాయ విధానం కూడ అలాంటిదే. ఆయా కళాకారులకు సంబంధించిన సహకార సంఘాలు ఏవిధంగా అభివృద్ధిచెందినవో అలాగే రైతుల ఉపవృత్తులకు సంబం

ధించిన సంఘాలుకూడ అభివృద్ధిచెందగలవు. ఆ యా చేతి వృత్తులవారి సహకారసంఘాల నిర్మాణంలో ప్రభుత్వం వహించిన దృక్పథమే ఈ ఉపవృత్తుల విషయంలో కూడ ఉపయోగపడుతుంది. ఆ యా ఉప వృత్తుల నిర్మాణానికి కావలసిన పరిస్థితులను సౌకర్యాలను ఏర్పాటు చేసినప్పుడు మన కుటుంబ వ్యవసాయ విధానంలోనే అవి పెంపొంద గలవు. ఈ ఉపవృత్తులకు రైతాంగంలో ప్రాబల్యం, ప్రవేశం సంపా దించాలంటె బహుళార్థ సాధక సహకారసంఘాల నిర్మాణం ముందు జరగాలి. ఈ ఉపవృత్తుల ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యాలు ఏర్పరచాలి. ప్రస్తుతం ఈ ఉపవృత్తులు రైతులలో అంతగా లేవు. కనుక కుటుంబ వ్యవసాయాన్ని దూషించటం తగదు. కుటుంబ వ్యవ సాయం వల్లనే ఈ ఉపవృత్తులు పెరగటం లేదని ఈ ఉపవృత్తులకు కుటుంబవ్యవసాయ తత్వమే విరుద్ధమని భావించటం ద్రోహం. ఎందు చేతనంటె ఈ ఉపవృత్తులు పెరగకపోవటానికి భారీపరిశ్రమలకు, మధ్యరకం పరిశ్రమలకు ఉన్నచిక్కులే ఉన్నాయి. మనదేశపు ఆర్థిక వ్యవస్థ వెనుకబడి ఉండటం, మన ప్రభుత్వాల పోలీసు మనస్తత్వం కారణంగా మన ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందలేక పోతున్నది.

IV

భూములకు సంబంధించిన కొన్ని కొన్ని అభివృద్ధి కార్యక్రమా లను ప్రథమ దశలలో సమిష్టిగా తప్ప చేయలేము. అలాంటివి కొన్ని మనకు లేక పోలేదు. అలా సమిష్టిగా చేసికొనవలసిన పనులను రైతు వ్యక్తిగతంగా తన భూకమతంమీద చేయలేడు. ఆ యా ప్రాంతా లలోని రైతుల కందరకు ఉపయోగకరాలుగా ఉండే నీటివనరుల ఏర్పాట్లు, బావుల త్రవ్వకం, మరమ్మతులు మొదలైన పెద్ద పెద్ద పను లను సహకార సూత్రంతో నిర్వహించు కొనవచ్చు. కాని ఇలాంటి పెద్ద పెద్ద పనులు దైనందిన వ్యవసాయ కార్యకలాపాలకు సంబంధించి నవి కావు; పైగా ఎల్లప్పుడు ఉండేవికావు. ఇలాంటి పెద్ద పెద్ద పను లలో చాల వాటికి ప్రభుత్వమే అధ్వర్యం వహించి నిర్వహించటం పరిపాటి. దీర్ఘకాలిక ప్రణాళికలలో రైతులే నిర్వహించుకొనవలసిన

పనులకోసం భూమి తనఖా బ్యాంకులద్వారా రైతులకు దీర్ఘకాలిక ఋణాలు ఇచ్చి వాటిని పూర్తిచేయించుకొనటం కూడ కద్దు. ఆయా సందర్భాలలో ఇలాంటి పనులను నిర్వహించుకొనవలసిన అవసరం కలిగినప్పుడు రైతులే వాటికోసం తాత్కాలిక సహకార సంఘాలను ఏర్పాటు చేసికొని ఆ అవసరాలను తీర్చుకొంటున్న సందర్భాలు కూడ మనకు లేకపోలేదు. మన దేశంలోని అన్ని రాష్ట్రాలలోను ప్రజలు గాంధియన్ వర్కర్స్, కిసాన్ సమ్మేళనాలు, జాతీయ వికాస కేంద్రాలు సమాజాభివృద్ధికేంద్రాలు ప్రారంభించిన సామూహిక కృషిలో ఎంతో ఉత్సాహంతో పాల్గొంటున్నారు; తమ సహకారపూరిత కృషితో ఎన్నో చెరువులు, బావులు, రోడ్లు, కాలువలు మొదలైన సమాజావశ్యక కార్యకలాపాలకు పూనుకొని ఏర్పాటు చేసికొంటున్నారు. ఇలాంటి కార్యకలాపాలలో ఎంతో అభివృద్ధిని సాధించటానికి అవకాశం ఉన్నది. ఈ విధమైన ప్రణాళికలతో సహకారసంఘాల ద్వారా ఇంకెన్నో పనులను చేసికొనటానికి అవకాశం ఉన్నది. కాని ఇలాంటి కార్యకలాపాలను నిర్వహించుకొనటానికి కుటుంబవ్యవసాయాన్ని రద్దు చేయ వలసిన అవసరం లేదు. వీటికి కావలసిందల్లా రైతులలో సహకార భావాన్ని పెంపొందించటమే. రైతులలో ఈ సహకారభావం మృగ్యమైనప్పుడు కుటుంబవ్యవసాయాన్ని తీసివేసి సహకార వ్యవసాయాన్ని స్థాపించినా సాధించగలిగింది ఏమీ ఉండదు.

కొన్ని ప్రాంతాల వ్యవసాయంలో వైనందిన వ్యవసాయ కార్యకలాపాలలో కూడ సమిష్టిగా తప్ప నిర్వహించుకొనలేని పనులు కొన్ని ఉన్నవి. ఇలాంటి పనులు వ్యవసాయసేద్యపు కృషిలో అంతర్భాగాలే. రైతులు వ్యక్తిగతంగా వాటిని చేద్దామని పూనుకొన్నప్పటికి వాటికి అయ్యేఖర్చులను చూచి బెదిరి పోక తప్పటం లేదు. సహకారపూరిత కృషి లేనప్పుడు ఇలాంటి పనులకు రైతులు సాధారణంగా పూనుకొనకుండ విడిచిపెడు తున్నారు. కాబట్టి ఇలాంటి పనులు ఉన్న ప్రాంతాలలో సహకార కృషి లేనందువల్ల అంతమేరకు వ్యవసాయసామర్థ్యం ఉత్పత్తులు దెబ్బతింటున్నవి; సంఘం నష్టపడుతున్నది. ఉదాహరణకు చూడండి: మన వ్యవసాయంలోని మనుష్యులకు

సంబంధించిన పనిపాటలను హరించకుండ పశువులకు బదులుగా ఉపయోగపడగల విద్యుచ్ఛక్తితో నడిచే యంత్రాలు, పరికరాలు చాల ఉన్నవి. వీటిని ఉపయోగించుకొన్న పక్షంలో రైతులకు పని పాటలు పోవు; పైగా పశువులతో కంటె వీటితో ఆ యా కార్యాలను బాగాచేసికొనటానికి అవకాశం ఉన్నది. అలాగే కాలువల ద్వారా నీటిపారుదల సౌకర్యాలు లేని ప్రాంతాలలో యంత్రాల ద్వారా నీటిని ఆ యా పొలాలకు చేరవేసికొని సాగుచేసి కొనటం చాల లాభదాయకంగా ఉంటుంది. అభివృద్ధికరంగా వ్యవసాయం కొనసాగాలంటె నీటిపారుదల సౌకర్యాలు లేని ప్రాంతాలలో గొట్టపు బావులను ఏర్పాటు చేసికొనక తప్పదు. అలాగా నీటిసౌకర్యం చాలీ చాలకుండ ఉన్న ప్రాంతాలలోను, అస్సలు ఋతువులలోను నీరు అందని ప్రాంతాలలోను ఈ గొట్టపుబావులను ఏర్పాటు చేసికొనటం, కొత్తగా కొంత భూమిని సాగులోనికి తీసికొనిరానటం మనవ్యవసాయాభివృద్ధికి అత్యంతావశ్యకం. భూమిని సారవంతం చేయగల ఎరువులను చక్కగా ఉపయోగించుకోవాలంటె నీటి సౌకర్యం పుష్కలంగా ఉండాలి. చిన్నచిన్న భూకమతాల రైతులు ఈ పనులకు పూనుకొనలేరు. వ్యావసాయకోత్పత్తులను సాధ్యమైనంతవరకు అధికంచేసి సాధించాలంటే ఇవే కాక సమిష్టికృషితో సాగించవలసిన కార్యకలాపాలు మరికొన్ని కూడ ఉన్నవి. మన గ్రామాలలోని పొలాలలో ఒకరిచేను వెంట మరొకరి చేను ఉండటం సహజం. గ్రామానికి ఒకవైపున పొలాలు ఉన్న రైతులందరు కలసి ఒక్కొక్క యేడు ఆ ప్రాంతంలో ఒక్కొక్క పంటను వేయటానికి అంగీకరించి ఆ భూఖండం మొత్తంలో ఒకేపంట వేస్తే చాల లాభాలు ఉన్నవి. అలాగే పంటల మార్పిడికి కూడా అందరు అంగీకరించి ఒక్కొక్క యేడు ఆ ఖండంలో ఒక్కొక్క పంటను వేయగలగాలి. అలాచేసిన పక్షంలో పెద్దపెద్ద భూఖండాలలో ఒకే పంట పండించటానికి వీలుకలుగుతుంది. ఇలా చేయటంవల్ల ఆ యా ఖండాలలో యంత్రాలను ఉపయోగించుకొనటం సుళువు అవుతుంది; నీరు వృథాపోకుండ ఉపయోగించుకొనవచ్చును; పైగా ఆ భూఖండాన్ని పంటలతో ఉన్నప్పుడు కనిపెట్టుతు ఉండటానికి, తెగుళ్ళను నివారించుకొనటానికి అయ్యే ఖర్చులు కూడ తగ్గిపోతవి. అభ్యు

దయదాయకమైన విధానాలను సేద్యంలో ప్రవేశపెట్టటంకోసం ప్రణాళికలను ఏర్పరచుకొని నిర్వహించుకొనటం కూడ తేలిక అవుతుంది. ఏదో ఒక ప్రత్యేక ప్రయోజనాలకోసం దేశస్థాయిలో ప్రణాళికలను వేసికొనటం మనం చూస్తున్నాం. అలాగే మన వ్యవసాయాభివృద్ధి కోసం దీర్ఘకాలికప్రణాళికలు – ఆ ప్రణాళికలలో కూడ దేనికెంత ప్రాధాన్యం ఇయ్యాలో, దేనిని ముందు చేసికోవాలో నిర్దిష్టంగా చెప్పగల ప్రణాళికలు—మనకు కావాలి. ఇది వరలో యాంత్రీకీకరణము గురించి పరిశీలించిన సందర్భంలో కొన్నికొన్ని వ్యవసాయకార్యాలను –ఆ కొన్నింటిని మాత్రమే—యంత్రాలతో చేసికొనవలసిన అవసరం ఉన్నదని గమనించాం. అలాగే కొన్నికొన్ని వ్యవసాయపు పనులను సమిష్టిగా చేసికొంటేనే ఆ పనులు సమర్థవంతంగా సాగుతాయి. కాబట్టి ఇలాంటి కార్యకలాపాలు మాత్రం ప్రభుత్వసహాయంతో సహకారవిధానంతో మాత్రమే చేసికోవాలి.

కాని ఇలా సమిష్టిగా చేసికొనవలసిన పనులు మనవ్యవసాయంలో చాలకొద్దిగానే ఉన్నవి. ఆ ఉన్నవాటిలో కూడ చాలభాగం ప్రైవేటురంగానికి చెందిన వ్యవసాయకార్యకలాపాలకు సంబంధించినవి కావు. ఇవి కాక మిగిలిన అనేక కార్యకలాపాలను కుటుంబవ్యవసాయవిధానంతోనే ఉత్తమంగా నిర్వహించుకొనగలం. అందుచేత సమిష్టిగా నిర్వహించుకొనవలసిన కొద్దిపాటి పనుల కోసమని మొత్తం వ్యవసాయాన్నే సహకారీకరణ కావించి భూములను ఏకంచేసి కుటుంబవ్యవసాయాన్ని రద్దుచేయవలసిన అవసరం మనకు లేదు. ఇలా మొత్తం వ్యవసాయరంగాన్ని తారుమారు చేసినందువల్ల కొద్దిపాటి ఆర్థికప్రయోజనాలు ఒకవేళ లభించినప్పటికి ఆ కొద్దిపాటి కూడ లభించటానికి అంతగా అవకాశాలు లేవని మేము ఋజువు చేశాం గదా! కుటుంబవ్యవసాయవిధానంవల్ల ప్రస్తుతం సిద్ధిస్తున్న సాంఘిక ఆర్థిక ప్రయోజనాలు అనేకం మటుమాయమై పోతవి. ఈ గగన కుసుమం కోసం అంధవిశ్వాసంతో సాహసంచేశామో మొత్తం సంఘమే తల్లక్రిందులై సాంఘికసంబంధాలు అరాజకంపాలై జీవితమే కలుషితమై, భారమై మానవిలువలు మటుమాయం కాక తప్పదు.

కాబట్టి మనకు కావలసింది సహకారవ్యవసాయం కాదు. దీనికి బదులుగా ప్రతి గ్రామంలోను ఒక సహకార సంఘాన్నో లేక వ్యవసాయ సేవాసహకారసంఘాన్నో ఏర్పాటుచేసి ఏ యే పంటలను వేయటంలో ఎలాంటి పద్ధతులలో వ్యవసాయం చేస్తే ఉత్తమంగా ఉంటుందో మొదలైన విషయాలను ఈ సంఘంద్వారా రైతులు నిర్ణయించుకొనేటట్లు చేయటం మంచిది. గ్రామంలోని మరీ చిన్నచిన్న భూఖండాలను కలిపివేసే పనికూడ ఈ సంఘమే చేయవచ్చు. ఇలాంటి సంఘాలను స్థాపించుకొన్నందువల్ల రైతు తనస్వేచ్ఛను కోల్పోనవలసిన అవసరం కలగదు. తన భూమిని తానే సొంతంగా సేద్యం చేసికొనవచ్చు; తన భూమిని సమిష్టిపరం చేయకుండానే ఆ సమిష్టిసూత్రంవల్ల లభించగల ప్రయోజనాలను రైతుపొందటానికి అవకాశం ఉంటుంది. ఇలాంటి సహకారసంఘాలను ఎలా ఏర్పాటు చేసికొనవలసినది ఎలా నడుపుకొన వలసినది విపులంగా వివరిస్తూ డాక్టర్ అట్టోస్కిల్లర్ ఒక గ్రంథం రచించాడు; ఈయన జర్మన్ దేశస్తుడు. సహకారవ్యవసాయ విషయాలలో మంచి ప్రవీణుడు. ఇతడు రచించిన ఆ గ్రంథం పేరు "సహకారవ్యవసాయం–సహకార పద్ధతులపై కుటుంబవ్యవసాయం" దానిని ఆల్ ఇండియా కోఆపరేటివ్ యూనియన్ వారు ప్రచురించారు.

కుటుంబ వ్యవసాయ స్థానంలో సహకార వ్యవసాయాన్ని ఏర్పాటు చేసినందువల్ల లభించగల ఆర్థిక ప్రయోజనాలు ఈ విధంగా మనం సాధించుకొనవచ్చు. ప్రజలలో సహకార భావాన్ని సక్రమంగా వ్యాప్తంచేసి సహకార సేవాసంఘాలను ఏర్పాటుచేసి వాటిద్వారా రైతుల వ్యవసాయ కార్యకలాపాలను సంఘటిత పరచుకొనగలిగితే, సహకార వ్యవసాయంతో పనిలేకుండానే ఆ లాభాల నన్నింటిని మనం పొందవచ్చు. కాబట్టి వ్యవసాయసామర్థ్యం ఉత్పత్తులు పెరగాలంటే స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు గల రైతులలో సహకారభావం ప్రధానంగా కావాలి. అంతే కాని వ్యవసాయవిధానం మారినందువల్ల అదనంగా ఒరిగేదేమీ ఉండదు. వ్యావసాయక కార్యకలాపాలను సహకార పూరితంగా సంఘటితం చేయగలిగితే వ్యవసాయ సామర్థ్యం తప్పక పెరుగుతుంది. ఇలా సహకారపూరితమైన సయోధ్యత, సంఘటి

తత్వం లేనప్పుడు సహకార వ్యవసాయమైనా కుటుంబ వ్యవసాయమైనా వచ్చే మార్పు ఏమీ ఉండదు; కలిగే లాభం కూడ పూజ్యమే.

V

ఈ నాడు వ్యవసాయరంగంలో కనిపిస్తున్న ఇబ్బందులకు కష్టనష్టాలకు మన రైతులలో సమర్థనంతమైన సహకారసంఘాలు లేకపోవటమే కారణం. మన దేశంలోని సహకారోద్యమ స్థితిగతులను జాగ్రత్తగా పరిశీలించిన వారికి ఈ విషయం స్పష్టంగా బోధపడుతుంది. 50 సంవత్సరాలనుంచి ఈ సహకారోద్యమం మన దేశంలో పాటు పడుతున్నప్పటికి ఒక్క సహకారబుణసంఘాల వరకే ఈ ఉద్యమం పరిమితమై ఉన్నది. ఆ బుణాలుకూడ ప్రజలకు కావలసినంతనరకు అందించలేక పోతున్నది. రైతులకు కావలసిన బుణాలు మొత్తంలో నూటికి 3.1 వంతులు మాత్రమె ఈ సహకారబుణసంఘాలు అందియ్యగలుగుతున్నవి. ఈ ఇస్తున్న బుణాలు పాతబాకీలను తీర్చుకొనటానికో లేక జీవనవ్యయాన్ని భరించటానికో మాత్రమె వినియోగింపబడుతున్నవి. బుణాలకు సంబంధించిన ఇతర రంగాలలో ఈ సహకారోద్యమం ఇంక ప్రాథమిక దశలోనే ఉన్నది. మనకు అప్రియమైన నేటి వాస్తవ స్థితిగతులు ఇవే. అందుచేతనే 'రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా, వారు నియమించిన, 'కమిటీ ఆఫ్ ఫ్లెర్వ్సన్' తన నివేదికలో ఈ సత్యాన్ని అంగీకరించక తప్పలేదు. ఈ సంఘంవారు తమ గ్రామీణ బుణపరిశీలక నివేదికలో ఈ నాటి మన దేశావశ్యకాలను తీర్చలేక సహకారోద్యమం విఫలమైనదని అంగీకరించారు.

మన వ్యావసాయికరంగంలో సహకారోద్యమం ఆరోగ్యవంతంగా అభివృద్ధి చెందలేకపోవటానికి మన కుటుంబవ్యవసాయవిధానమే కారణమా? అలా ఎన్నటికి కాదు. ఆ మాట అనగల సాహసం ఎవరికీ ఈ నాటివరకు లేదు. ఎవరికైనా అలాంటి అభిప్రాయం ఉన్నా ఆ అభిప్రాయాన్ని వారు సహేతుకంగా నిరూపించలేదు. ప్రపంచంలో ఎక్కడ పరిశీలించినప్పటికి రైతాంగప్రాబల్యం అధికంగా ఉన్న

దేశాలలోనే సహకారోద్యమం చక్కగా సమగ్రంగా అభివృద్ధి చెంది నట్లు కనబడుతున్నది. సహకార విధాన ఆచరణలో డెన్మార్క్,స్విట్జర్లాండు దేశాలను మించిన దేశాలు ప్రపంచంలో మరేవైనా ఉన్నవా? భారత దేశంలో కాస్తోకూస్తో అభివృద్ధిచెందిన సహకారోద్యమం కూడ– ఋణాల వరకే పరిమితమైనప్పటికి– రైతులలోనే. సహకారసంఘాలు రిజిస్టరు చేసికొనటానికి మనరైతులు చూపుతున్న ఉత్సాహాన్ని శ్రద్ధాసక్తులను, రాష్ట్రప్రభుత్వాలు, ఆ ప్రభుత్వాల నిర్వాహక వర్గము నిరుత్సాహ పరుస్తున్నవి. మనపరిస్థితులను బట్టి చూచినప్పుడు మన దేశంలో సహకారోద్యమం చాల విస్తృతంగా సమగ్రంగా అభి వృద్ధి చెందవలసిన పరిస్థితులు అవసరం ఉన్నట్లు ద్యోతకం కాకపోదు. కాని అలా అభివృద్ధి చెందక పోవటానికి కారణాలు ఏమిటో భార తీయ సహకారోద్యమ చరిత్రను సూక్ష్మంగా పరిశీలించిన వారికి తేలి కగా అవగతం కాగలవు. దీనికి కారణాలు చాల ప్రాథమికమైనవి. ఈ విషయమై పరిశీలించటానికి రిజర్వ్‌బ్యాంకు ఒక సంఘాన్ని నియ మించింది. భారత సహకారోద్యమాన్ని సునిశితంగా పరిశీలించటానికి అవకాశం కలిగిన ఈ సంఘం ఆ కారణాలను స్పష్టంగా పేర్కొన్నది. మన దేశంలో సహకారోద్యమం తాబేటినడకలు నడుస్తు ఉండటానికి గల కారణాలేమిటో వారి నివేదిక(2వ భాగం) నుంచి ఉదహరిస్తున్నాం.

"ఈ దేశంలోని సహకారోద్యమం గురించి మా పరిశీలన సమ యంలో ఒకసూక్తిని విన్నాం. అదేమంటే సహకారోద్యమం అనే మొక్కను ప్రభుత్వమే తన రెండు చేతులను పట్టుకొని భూమిమీద నిలబెడుతున్నదే కాని ఆ మొక్కప్రేళ్ళు భూమిలోనికి పాతుకొని పోవ టానికి నిరాకరిస్తున్నవి" అని. ఈ అభిప్రాయం కవిత్వంవలె ఉన్నా దీనిలో వాస్తవం లేదని మేము అనలేకుండా ఉన్నాం. అంతేకాక ఈ దేశంలోని గ్రామీణప్రాంతాలు 'వ్యక్తిక ఆర్థికవ్యవస్థ' గుప్పెటలో ఉన్నవి.

"మధ్యరకం ప్రజలు సహకారసూత్రంతో ఏకమై దానివల్ల రాగల ప్రయోజనాలను ఆర్థికంగా బలంఉన్నవారివలెనే వీరు కూడ పొందటానికి వీలున్నది. కాన సాంఘికంగా ఆర్థికంగా బలహీనులుగా

ఉన్న ప్రజలకు ఈ మధ్యరకం వారికి అనేక సంప్రదాయాలు అండగా ఉన్నప్పుడు ఈ బలహీనులస్థితిని గురించి వేరుగా చెప్పనవసరం లేదు. పాశ్చాత్య దేశాలకు మన దేశానికి సహకారబ్యాణసంఘాల నిర్వహణలో కనిపించిన భేదానికి మనసంఘంలోని ఈ వ్యత్యాసాలే కారణం. సహకారబ్యాణసంఘాలకు దానిని వ్యతిరేకించే వ్యక్తికబ్యాణాలకు వ్యక్తిక వ్యాపారాలకు ఉన్న వ్యత్యాసం కొన్ని పరిమితుల వరకే కాని ఆ పరిమితులను దాటి ఉన్నప్పుడు సహకారం అనేది విజయవంతంగా నడవలేదు; నిలబడలేదు. కాని భారతసహకారవ్యవస్థా నిర్మాణశక్తికి దానినివ్యతిరేకించే విరుద్ధశక్తులకు అనంతమైన వ్యత్యాసాలు ఉన్నవి. పైగా సహకారోద్యమం నచ్చని ఈ విరుద్ధశక్తులు ఆ సహకారోద్యమంలో స్థానం సంపాదించి సహకారసంఘాలు బలహీనపడటానికి కారణమైనవి." (పుట 274)

ఎన్నో దశాబ్దాలనుంచి ఈ ప్రాంతాలలో ఒక విధమైన వ్యాపారం, ఆర్థికవ్యవస్థ ఉంటున్నది. ఆ పద్ధతే ఇప్పటికీ అమలులో ఉన్నది. అమలులో ఉన్న ఈ విధానం గ్రామీణప్రజల మేలుకు భిన్నంగా ఉంటున్నది. అందులోను ప్రత్యేకంగా గ్రామీణ ప్రాంతాలలోని ఉత్పత్తిదారులకు ఈ విధానం అరిష్టదాయకంగా ఉన్నది. ఈ విధానం ఫలితంగానే ఈనాడు బస్తీవారి ప్రయోజనాలకు గ్రామీణుల ప్రయోజనాలకు మధ్య సంఘర్షణ ఏర్పడినదని చెప్పవచ్చు. ఇది ఇలా ఉండగా ఈనాటి కొత్తపరిస్థితులలో అధికారస్థానాలు, ఆర్థిక వసతులు, ఆధారాలున్న పదవులు దేశంలోని అధికసంఖ్యాకులైన గ్రామీణులకు అలభ్యమై పట్టణాలవారి కైవస మవుతున్నవి. అధికారం, ఆర్థికబలం ఈనాటికీ పట్టణాలవారి చేతులలోనే ఉన్నవి. అందుచేత ఈ అవకాశాల ఆధారంతో ఏర్పడుతున్న సంస్థలలో ఉన్న వారిలో పట్టణ మనస్తత్వం మాత్రమె కనపడుతున్నది. అంటే వీరు పట్టణాల అవసరాలకు కోర్కెలకు ఇచ్చినంత ప్రాధాన్యాన్ని వాటిని అర్థం చేసికొని సత్వర చర్యలు తీసికొనటానికి చూపుతున్న శ్రద్ధను గ్రామీణసమస్యలయెడ చూపలేకపోతున్నారని మా భావం. ఈ పట్టణ మనస్తత్వమనేది వ్యక్తిక రంగానికి సంబంధించిన సంస్థలలోనే కాక

ప్రభుత్వ సంస్థలలో శాఖలలో కూడ అధికంగానే ఉన్నది. వ్యక్తిక రంగంలోను ప్రభుత్వరంగంలోను ఉన్న ఈ అధికారస్థానాలకు, ఆర్థికాధికారాలు గుప్పెటలో ఉన్నా ఆర్థిక స్థానాలకు ఎల్లప్పుడు సంబంధం ఉంటూనే ఉన్నది. అధికారం ఉన్నవారే ఆర్థిక రంగంలో ఉన్నత స్థానం ఆక్రమించటం ఆర్థికబలం ఉన్నవారే అధికారపదవులు అధిష్ఠించటం జరుగుతున్నదని భావం.) ఈ అధికారం, ఆర్థికబలం అనేది ఒక గొలుసు. ఈగొలుసుకి చివరలో గ్రామాలలో నిగ్రామనాయకులు, పంచాయితీదారులు పట్టేళ్లుఉంటారు.గ్రామంలోనిఋణదాతలుగా వ్యవసాయదారులుగా ఉండి వీరే ఆ గ్రామానికి సంబంధించిన కీలకస్థానాల అధిపతులుగా చలాయిస్తున్నారు. గ్రామాలలో వీరే అధికారులు. ఆర్థికంగా బలవంతులు కావటంచేత వైనుంచి ఏ మైనా ఆర్థిక సహాయంగాని అధికారంగాని లభ్యమయ్యేటప్పుడు అవి ముందుగా వీరిచేతికే చిక్కుతున్నవి. కొన్ని కొన్ని సందర్భాలలో ఒకేవ్యక్తి గ్రామనాయకుడుగా, ఋణదాతగా, వ్యాపారిగా ఉండి గ్రామంలోని మొత్తం కీలకస్థానాలను తనగుప్పెటలో పెట్టుకొనటం కూడకద్దు. ఈ భిన్నభిన్న కీలకస్థానాలు ఒకవ్యక్తి చేతిలోకాక భిన్నవ్యక్తుల చేతులలో ఉన్నప్పుడు కూడ వీరి దృక్పథాలలో తేడా ఉండదు. వీరిలో వీరికి సర్దుబాట్లు కుదురుతూనే ఉంటవి." (పుట 276)

"ఈ పరిస్థితులవల్ల పద్ధతులవల్ల గ్రామాలలోని బలహీనులు, సాంఘికావకాశాలు లేనివారు అనేకబాధలకు గురై నష్టపోతున్నారు. న్యాయానికి వీరికోసమై వీరిఅభివృద్ధిని ఆశించే అనేకవిధానాలను ప్రభుత్వం రూపొందిస్తున్నప్పటికి అవివారికి అందటం లేదు. గ్రామంలో నివసిస్తున్న అధిక సంఖ్యాకులైన బలహీనప్రజలకు వ్యతిరేకంగా ఇన్ని పరిస్థితులు ఉన్నవి. అధికారం, ధనం, నాయకత్వం మొదలైన వాటికి తోడు కులాభిమానాలు ఉండనే ఉన్నవి. వీటిఅన్నిటికంటె ప్రధానమైనది ఈ పరిస్థితులవల్ల గ్రామంలోని కీలకస్థానాలను తమచేతులలో పెట్టుకొన్నవారికి పట్టణాల ఆర్థికవ్యవస్థతోనే ఎక్కువ సంబంధబాంధవ్యాలు ఉండటం. వర్ణాశ్రమధర్మనిర్వహణకు నేటి పరిస్థితులలో అవకాశం ఊడినా కులకక్షలు మాత్రం సంఘాన్ని ఇంక వదలలేదు. ఈ

పరిస్థితులవల్ల భూస్వామే ఋణదాతగా ఉండటం, ఋణదాతలే వ్యాపారస్థులుగా ఉండటం, చదువువచ్చిన వారే ప్రభుత్వోద్యోగులుగా కూడ ఉండటం జరుగుతున్నది. పైగా వీరందరికి పట్టణప్రపంచంతో సన్నిహితసంబంధాలు ఉండటంవల్ల వీరు తమ అధికారాన్ని పలుకుబడిని గ్రామీణులప్రయోజనాలకు వ్యతిరేకంగా వినియోగించటం, కులాభిమానాలతో స్వకులపక్షపాతంతో వ్యవహరించటం, అదీ చాల దన్నట్లు తమతమ బంధువర్గాల ప్రయోజనాలకు పాటుపడటం జరుగుతున్నది; వీరికున్న అధికారాన్ని పలుకుబడిని వీరు ఈ విధంగా గ్రామీణప్రజల శ్రేయస్సుకు విరుద్ధంగా వినియోగిస్తున్నారు." (పుట 278)

"మనగ్రామాలలోని సాంఘిక ఆర్థిక పరిస్థితులలో ఇంతటి వ్యత్యాసాలు ఒక ప్రక్కన ఉన్నవి. మరొక ప్రక్కన గ్రామీణ ప్రయోజనాలు, పట్టణప్రయోజనాలు – వీటిమధ్య అనంత వ్యత్యాసాలు ఉన్నవి. ఇలాంటి క్లిష్టపరిస్థితులమధ్య, అనంతవ్యత్యాసాలమధ్య ఋణసహకారానికి సంబంధించిన సహకారప్రయత్నాలు మనదేశంలో ప్రారంభమైనవి." (పుట 278)

"ఈ సహకార ఋణసంఘాల ప్రయత్నాలు విఫలం కావటానికి గల కారణాలు కూడ ఇవే. బలహీనులకు అతి బలవంతులకు కలిపి ఈ ఋణసహకార సంఘాలు నిర్మించాం. ఈ పోటీలో బలహీనులు నిలబడలేక పోవటం సహజం. ఈ బలహీనులు తమకు తామై తమ దురవస్థనుంచి బయటపడగల పరిస్థితులను కల్పించుకొని తమ ప్రయోజనాలకు అడ్డుగా నిలబడుతున్న వారినుంచి బయట పడాలని అనుకోవటం కుదరదు. అలాగే చారిత్రకంగా ఈ బలహీనులను క్రుంగదీస్తున్న పరిస్థితులనుంచి వారే తమ ప్రయత్నాలతో బయటపడి తమ సాంఘిక ఆర్థిక అభివృద్ధికోసం కృషి చేసికోవాలనటం కూడ పొరపాటు. వీరికి ఆ బలం లేకపోవటం చేతనే ఈ పనులు వీరిచే నిర్వహించుకొనటం కుదరదు. కాబట్టి ఏం చేయాలి? సహకార ఋణసంఘాల నిర్మాణాన్నే ఈ పరిస్థితులకు అనువుగా మార్చి ఏర్పాటుచేసికోవాలి అనేది పరిష్కారం కాదు. ఈ ఉన్న సహకారఋణసంఘాలు

సక్రమంగా పనిచేస్తూ ఈ బలహీనుల శ్రేయస్సుకోసం పాటుపడగల పరిస్థితులు కల్పించాలి. నేటి దారుణ సాంఘికస్థితిగతులను మార్చాలి. ఈ స్థితిగతుల క్రిందపడి నలిగి బలహీనులైన వారే ఈ పరిస్థితులను మార్చుకోవాలని, మార్చాలని అనుకొనటం, ఆచరణను వదిలి ఆలోచించినట్లు ఉంటుంది. అభివృద్ధి కార్యక్రమాలకు అడ్డువస్తున ఈ స్థితిగతులను మార్చే వారికి కనీసం వీటి అంతటి శక్తిఅయినా ఉండాలి. అప్పుడే ఈ అడ్డువస్తున్న స్థితిగతులను మార్చుకోగలం." (పుట 279)

సహకారం చక్కగా నడిచిల్లగల పరిస్థితులను కల్పించటం కోసం ఈ సంఘంవారు తమనివేదికలో అనేక సూచనలు చేశారు. ఆ సూచనలను అమలులో పెట్టి కొంతవరకైనా ఆపరిస్థితులను కల్పించటం కోసం మనద్వితీయ పంచవర్ష ప్రణాళికలో కొన్ని కార్యక్రమాలను చేపట్టారు. పెద్దపెద్ద భూకమతాలకు గరిష్టపరిమితులను నిర్ణయించాలను కొన్నాం. కౌలుదారులకు రక్షణకల్పించటానికి పూను కొన్నాం. సహకారనిర్మాణంలోను మూలధనంలోను ప్రభుత్వం ప్రవేశించి కొన్ని వాటాలను కొనాలని భావిస్తున్నాం. ఉత్పత్తిదాయకమైన కార్యకలాపాలకే ఋణాలు మంజూరు చేయాలని సూత్రీకరించుకొన్నాం. సహకార సంఘాలు సర్వులకు ఉపయోగపడే విధంగా నడపటానికి ఆయా పెత్తందార్ల జేబుసంస్థలుగా కాక ప్రజాసంస్థలుగా పని చేయటానికి ఈ కార్యక్రమాలను చేపట్టాం. ఈ కార్యక్రమాలను సిద్ధాంతాలను అమలులో పెట్టటం కోసం సహకారానికి ప్రత్యేకంగా మంత్రిత్వశాఖను ఏర్పాటు చేశారు; జాతీయసహకారాభివృద్ధికి ప్రత్యేక సంఘాన్ని ఏర్పాటు చేశారు. సహకారం అన్ని రంగాలలోను విలసిల్లచేయటం దీని బాధ్యత. సహకారోద్యమాన్ని గట్టిగా పునాదుల మీద నిలబెట్టటం కోసం రూపొందించుకొన్న ఈ విధానాలను ఆచరణలో పెట్టే కృషిలో మనం కాలయాపన చేయక సత్వర చర్యలను చేపట్టాలి. ఐనా ఈ విధానాలను ఆచరణలో పెట్టటంలో మనకు అనేక అడ్డంకులు వస్తున్నవి; ఎన్నో పరిమితులకు లోబడి పనిచేయవలసి వస్తున్నది. కాబట్టి ఈ

కృషిలో సఫలీ కృతులమైనామని మాత్రం చెప్పలేము. ఈ పరిమితు లను అడ్డంకులను అధిగమించి ఈ సహకారోద్యమాన్ని విజయవంతం చేయగలిగిననాడు సహకార వ్యవసాయం అవసరం లేకుండానే సహకారవ్యవసాయంవల్ల సిద్ధించగలవని చెప్పబడుతున్న ప్రయోజనా లను మనం తేలికగా పొందగలం. కాని సహకారోద్యమాన్ని జాగ్ర త్తగా ప్రయత్నించ కుండానే, అది విజయవంతం అవుతుందో కాదో వేచిచూడకుండానే సహకార వ్యవసాయాన్ని ప్రవేశపెట్టాలని మన ప్రణాళికాకారులు త్వరపడు తున్నారు. సరళంగా నడవగల సహకార సంఘాలే అంతంత మాత్రంగా ఉన్నప్పుడు ఎంతో క్లిష్టమైన సహ కారవ్యవసాయంగురించి ఇక చెప్పాలా? ఏది ముందో ఏది వెనుకో దేనికెంత ప్రాధాన్యమివ్వాలో తెలియకుండ ప్రధానమైన సూత్రాల లోనే తప్పటడుగు వేస్తున్నారు. కాబట్టి ఇప్పుడు మన ప్రణాళికా కారులు ఒక విషయం తేల్చుకోవలసి ఉన్నది. ప్రస్తుతం అమలులో ఉన్న ఋణ సహకార సంఘాలు, మార్కెటింగ్ సంఘాలు బహుళోద్ధ సాధకసంఘాలు ఉంచే సహకార వ్యవసాయాన్ని ప్రవేశపెడతారా? లేక వాటినన్నిటిని రద్దుచేసి వాటి అన్నిటి కార్యకలాపాలను ఇదే తీర్చగలదని సహకార వ్యవసాయాన్ని స్థాపిస్తారా? ఈ విషయం వారే తేల్చుకోవలసి ఉన్నది. సేద్యానికి సంబంధించిన కార్య కలాపాలలో వ్యవసాయ సేవాసహకారసంఘాలు ఉత్తమ వ్యవసాయ విధాన సంఘాలు చక్కని కృషిచేయగలవని, మంచి ఫలితాలను రాబట్టగలవని మేము ఇదివరలో చెప్పి ఉన్నాం. సహకార వ్యవ సాయసంఘం వలె రైతులస్వేచ్ఛను హరించకుండ, వారి స్వయం కల్పిత వృత్తి గౌరవాన్ని మట్టిపాలుచేయకుండ ఇవి సహకార వ్యవ సాయంవల్ల రాగల ప్రయోజనాలను సాధించగలవు. ఈ సంఘాలు రైతుకి సంపూర్ణస్వేచ్ఛను ఇచ్చి రైతులు తమ సృజనాత్మక శక్తిని నిర్వహణసామర్థ్యాన్ని తమ భూకమతాల అభివృద్ధికృషిలో వినియో గించుకొనటానికి, తమకుటుంబకృషిని క్రమబద్ధంగా ఉపయోగించు కొనటానికి తగిన అవకాశాలను కూడ ఇయ్యగలవు. రైతుల కుటుంబ వ్యవసాయానికి, సహకార సేవాసంఘాలకు బదులుగా సహకార వ్యవసాయాన్ని ప్రవేశపెట్టి వాటిని రద్దుచేయటమే మన ప్రణాళికా

కాయల ఆశయం అయిన పక్షంలో దేశం ఏ స్థితిలో పడుతుందో ఊహించలేము. ఈ విధానంవల్ల సంపూర్ణ జాతీయకరణ సిద్ధాంతాన్ని అమలు చేసినట్లవుతుంది; వ్యవసాయక సేద్యాన్ని సమిష్టిపరం చేయటమవుతుంది; రైతులను కూలీలుగా మార్చివేయటం జరుగుతుంది; గ్రామీణ ఆర్థికవ్యవస్థను ఎవరో కొందరు పెత్తందార్లకు, వారి ఆశ్రితులకు, బాధ్యతారహితమైన నిర్వాహకవర్గానికి అప్పచెప్పటం అవుతుంది.

క్రమబద్ధమైన ఆర్థికవ్యవస్థను సాధించాలంటే సహకారవ్యవసాయం కావాలని మరొక వాదం కూడ చేస్తున్నారు. ప్రస్తుతం మన దేశంలో ఆర్థికాభ్యుదయం అత్యంతావశ్యకం; ఈ ఆర్థికాభివృద్ధిని నిర్దిష్టప్రణాళికలద్వారా సాధించాలని మా ఆశయం. ప్రణాళికాధికారులకు దేశ ఆర్థికవ్యవస్థలోని ప్రధానాంశాలపైన కీలకస్థానాలపైన తగినంత అధికారం లేకపోతే ఈ నిర్దిష్ట ప్రణాళికలు ఆచరణ సాధ్యంగాను, సమర్థవంతంగాను పనిచేయలేవు. మన దేశపు ఆర్థికాభివృద్ధిని సాధించటానికి వ్యవసాయరంగంలోని ఆదాయాలే ఆధారం. కాబట్టి ప్రణాళికాబద్ధమైన అభివృద్ధికృషిలో వ్యవసాయం చాల ప్రముఖపాత్ర వహించవలసి ఉన్నది. అంతేకాక మన దేశ జనసంఖ్యలో నూటికి 70 మంది వ్యవసాయం మీదనే ఆధారపడి ఉన్నారు. వీరందరు తమతమ ఉత్పత్తి కార్యకలాపాలను వ్యక్తిగతంగా కొనసాగించుకొంటున్నారు; వీరి పనిపాటలను సంఘటితపరచటం ఇంతవరకు జరగలేదు. వ్యవసాయరంగంలోని వారు తమతమ ఉత్పత్తి కార్యకలాపాలను ఎవరి ఇష్టం వచ్చినట్లు వారే వ్యక్తిగతంగా చేసికొంటు పోయినంతకాలం దేశప్రణాళికావసరాలకు అనుగుణంగా ప్రభుత్వం ఈ వ్యవసాయ రంగాన్ని సరిదిద్దలేదు; వ్యవసాయ కార్యకలాపాలను నిర్దిష్ట మార్గంలో పెట్టలేదు. దేశసంఖ్యలో అత్యధికులైన ఈ రైతుల ఉత్పత్తికార్యకలాపాలను పర్యవేక్షించి సూచనలు ఇయ్యగల పద్ధతి ఏదైనా ఒకటి ఉండటం అవసరం. ఆ పద్ధతి లేనంతకాలం దేశాభివృద్ధికి ప్రణాళికలు వేయటం ప్రణాళికా బద్ధంగా పాటుపడటం సాధ్యం కాదు. కాబట్టి వ్యవసాయదాగులపై పర్యవేక్షణచేసి వ్యవసాయరంగాన్ని అవసరమైన మార్గా

లలో నడపటానికి ప్రణాళికాబద్ధమైన కార్యక్రమాలను అమలుచేయటానికి ఏదో ఒకవిధమైన నిర్వహణపద్ధతి ఉండాలి. ప్రణాళికాబద్ధమైన కృషి సాగాలి అంటే కుటుంబవ్యవసాయంపోయి సహకార వ్యవసాయ విధానం ఇందుకోసమై రావాలని వాదిస్తున్నారు.

మన దేశానికి క్రమబద్ధమైన ఆర్థికవ్యవస్థ రావాలి అనటంలో మాకెలాంటి భేదాభిప్రాయం లేదు. అలాగే సహవ్యవసాయదారులకు నిర్వహణసంఘాలు అవసరం అనటంలోకూడ మాకు అభిప్రాయ భేదం లేదు. కాని ఉన్న భేదాభిప్రాయమల్లా మనకు ఎలాంటి నిర్వహణ పద్ధతి రావాలి అనే విషయంలోనే. మనది ప్రజాస్వామిక దేశం; మన ప్రణాళికలుకూడ ప్రజాస్వామిక విధానాలకు అనుగుణంగానే ఉండాలి. సమిష్టి ఆర్థికవ్యవస్థా నిర్మాణానికి పాటుపడే దేశాల విధానాలు మనకు మార్గం కారాదు. మన ప్రజాస్వామిక ప్రణాళికలకు ఏది అనువైన నిర్వహణ మార్గం అనే విషయంలోనే అభిప్రాయ భేదాలు వస్తున్నవి.

ప్రజాస్వామ్య బద్ధమైన ప్రణాళికల విజయానికి వ్యవసాయ రంగం నిర్వర్తించవలసిన కర్తవ్యాలు ఏమిటి? ఈ కర్తవ్య నిర్వహణకు ప్రజాస్వామిక విధానబద్ధమైన ఉత్తమ విధానం ఏమిటి? మన ప్రజాస్వామిక ప్రణాళికలు విజయవంతం కావటానికి వ్యక్తిగతంగా వ్యవసాయం చేసికొనే రైతులు తమ వ్యవసాయోత్పత్తుల పెంపుదల కోసం ఏర్పాటు చేసికొనే సహకారసంఘాలే ఉత్తమంగా సహాయపడగలవని మా అభిప్రాయం. ప్రజాస్వామిక ఆదర్శాలను చేరుకొనటానికి కూడ ఈ రైతుల సహకారసంఘాలే అవసరమని మా విశ్వాసం. అంతేకాని వ్యావసాయక సేద్యపు పనుల కోసం ఏర్పాటు చేసే సహకారసంఘాలు—అంటే పనిపాటలలో రైతుల స్వేచ్ఛను హరించే సహకారవ్యవసాయం — మన ప్రజాస్వామిక వ్యవస్థకు ఉపకరించవు.

మన దేశం ఆర్థికంగా చాల వెనుకబడి ఉన్నది. మన ఆర్థిక వ్యవస్థ ఇంతవరకు సంపూర్ణ వికాసం పొంద లేదు. ఇలాంటి పరిస్థితులలో మన దేశంలో ప్రణాళికా కారులు వ్యవసాయ రంగంలోని వివిధమైన

పంటలలో ఏ పంట ఎంతకావాలో, రైతులు మిగులు ఉత్పత్తులను దేశ అవసరాలదృష్ట్యా ఎలా వినిమయం చేసికొన వలసి ఉన్నదో నిర్ణయించి అంతవరకు మాత్రమె వ్యవసాయరంగంలో జోక్యం కలుగ చేసికొనటం ప్రథమ కర్తవ్యం. దేశానికి కావలసిన ఆహారోత్పత్తులను అధికం చేయగల విధానాల వరకు మాత్రమే వీరు ఆ రంగంలో జోక్యం కలిగించు కోవాలి.

ఈ పంట ఇంత, ఆ పంట అంత పండించాలి అని వ్యవసాయ రంగంలో మనం ఎలా క్రమబద్ధంచేసి నిర్ణయించగలం? ప్రణాళికల మీద ఉన్న మోజులో పడి వ్యవసాయరంగానికి పారిశ్రామికరంగానికి ఉన్న ప్రధానభేదాలను మనవారు మరచిపోతున్నారు. వ్యవసాయం ప్రధానంగా ప్రకృతి మీద ఆధారపడి ఉంటుంది. ఈ ప్రకృతిని మనం అదుపు చేయలేము; దానికిగూడ ప్రణాళికలు వేసి క్రమబద్ధం చేస్తా మని మనం అనలేము గదా! అందుచేత ప్రకృతి మీద ఆధారపడి పండేపంటలను ఇది ఇంత అది అంత పండించి తీరవలసిందే అని నిర్దిష్టంగా నియమాలను ఏర్పరచే అవకాశం లేదు. ఇంత పెట్టుబడి పెట్టి నప్పుడు ఇంతపంట వస్తుందని వ్యవసాయరంగంలో మనం గట్టిగా చెప్పలేము. అందుచేత పెట్టుబడులను గురించి ఎంతటి ప్రణాళికాబద్ధమైన నిర్దిష్ట నిర్ణయాలను అనుసరించి నప్పటికి మనం అనుకొన్న పంట రాకపోవచ్చు. కాని పరిశ్రమలవిషయం ఇలాంటిది కాదు. పైగా మరొక విషయమేమంటె వ్యవసాయోత్పత్తులను పారిశ్రామికోత్పత్తుల వలె అనంతంగా అధికం చేయటం మన శక్యం కాదు. మార్కెట్‌లో ఆ యా వస్తువులకు ఉన్న గిరాకిని బట్టి అవసరాన్ని బట్టి పారిశ్రామిక వస్తూత్పత్తి పెరుగుతు తరుగుతు ఉంటుంది. పైగా మార్కెట్‌లో ఆ యా వస్తువులకు గిరాకి పెంచి అవసరాన్ని కూడ కల్పించగల అవకాశం పారిశ్రామికోత్పత్తులకు ఉన్నది. పారిశ్రామికుల ప్రధానాశయం లాభసేకరణ. అందుచేత వారు తమ లాభందృష్ట్యా ఆ యా వస్తువులకు మార్కెట్‌లో గిరాకి ఏర్పడేటట్లు ఉత్పత్తిని తగ్గించటం, తమ ఉత్పత్తులను చాలరకాలుగా చేసి ప్రజలను ఆకర్షించటం చేస్తూ ఉంటారు. పరిశ్రమలనుంచి వచ్చే వస్తువులలో ఒక్కొక్క వస్తువుపై

ఒక పారిశ్రామికసంస్థ గుత్త అధికారం సంపాదించటం సహజం. ఈ గుత్త అధికారం ఏర్పడిన తరువాత ఆ వస్తువుకి గిరాకి కలిగించటం కోసం వస్తూత్పత్తిని తగ్గించటం కూడ మనం చూస్తూనే ఉన్నాం. ఇలా ఉత్పత్తిని తగ్గించటం చేత అనేక శక్తియుక్తులు నిరుపయోగమై వృథా ఐపోవటం తప్పదు. ఇలాంటి నష్టాలు లేకుండా చేయాలంటే పరిశ్రమల ఉత్పత్తులకు సంబంధించి ప్రణాళికాబద్ధమైన ఉత్పత్తి కార్యక్రమాలు ఉండటం అవసరమే. కాని వ్యవసాయరంగంలో ఈ గుత్త అధికారం వంటి స్థితిగతు లేమీలేవు. మనది సరిగా అభివృద్ధి చెందని దేశం. అందుచేత ఇలాంటి దేశంలో వ్యవసాయోత్పత్తులు ఒక్కసారిగా పెరగటం అసంభవం; ఒకవేళ పెరిగినా ఇలా పెరిగిన ఈ అధికోత్పత్తులను వినిమయం చేసికొనగల శక్తి, ఆర్థికబలం మనప్రజలలో లేవు. కాబట్టి ఒక్కసారిగా మన వ్యవసాయోత్పత్తులు పెరగటం కాని, వాటి వాడకం పెరిగిపోవటంకాని జరగదు. మన వ్యవసాయం ప్రధానంగా చిన్నచిన్న కుటుంబకమతాలమీద ఆధారపడి ఉన్నది; అందుచేత ఈ వ్యవసాయోత్పత్తుల మీద ఏ ఒక్కరికి గుత్త అధికారం లేదు. పరిశ్రమలలోవలె లాభాలను ఆశించి వ్యవసాయోత్పత్తులను కుంచించటమో లేక పెంపుదలచేయటమో ఏ ఒక్కరి చేతులలోను లేదు. ప్రణాళికాబద్ధమైన విధానాలకు పరిశ్రమలలో ఉన్నంత ప్రాముఖ్యం వ్యవసాయరంగంలో లేదని మేము అభిప్రాయపడుతున్నాం.

అందుచేత ప్రణాళికాబద్ధమైన విధానాలకు పరిశ్రమలలోఉన్న ప్రాధాన్యం వేరు; వ్యవసాయరంగంలో ఉన్నప్రాధాన్యం వేరు. సరిగా అభివృద్ధిచెందని మనదేశం వంటి దేశంలో వ్యవసాయరంగానికి సంబంధించిన ప్రణాళికాబద్ధమైన విధానాల ప్రధానాశయం ఒక్కటే ఉన్నది. వ్యవసాయదారుల మిగులును అధికం చేయటం, వ్యవసాయోత్పత్తులను పెంచటం, వ్యవసాయోత్పత్తుల వినిమయాన్ని పర్యవేక్షించటం, వ్యవసాయరంగంలో ప్రణాళికాబద్ధమైన కృషికి ప్రధానాశయంగా ఉండాలి.

ప్రస్తుతం మనదేశంలోని వ్యవసాయోత్పత్తులను, ఆ ఉత్పత్తుల వినిమయాన్ని దృష్టిలో పెట్టుకొని ఆలోచించినప్పుడు వ్యవసాయ

దారుల మిగులు ఉత్పత్తులను సమీకరించి సక్రమ వినియోగానికి తీసి కొని రావటం ఏమంత పెద్ద కష్టమైన పనికాదు. ఈ పనిచేయటానికి ఉత్పత్తిదారులకు, వినిమయదారులకు మధ్య ప్రస్తుతంఉన్న దళారు లకు అవకాశం లేకుండ చేసి రైతులే తమ మిగులు ఉత్పత్తులను మార్కెట్‌లో అమ్ముకొనగల పరిస్థితులను కల్పించాలి. ఇలాచేసినందు వల్ల రైతులు పంటల నూర్పిడి కాగానే తమకు పండిన పంటలో తమ అవసరాలకు సరిపోను ఉంచుకొని మిగిలిన దానిని మార్కెట్‌కి ఇచ్చివేస్తారు. దానితో ఉత్పత్తిదారుల మిగులు మొత్తం మార్కెట్ లోకి వస్తుంది. ఇలా మార్కెట్‌లోకి వచ్చిన ఉత్పత్తులను సాంఘికా నశ్యకాలదృష్ట్యా, ప్రయోజనాలదృష్ట్యా ఉపయోగించుకొనటానికి అవకాశం ఏర్పడుతుంది. ఇది సాధించబడాలి అంటే ప్రణాళికాధికారు లకు మొత్తం మార్కెట్‌పై అధికారం ఉండాలి; రైతులు పంటలు అమ్ముకొనేటప్పుడు, ఆ పంటలను నిలవ చేసేటప్పుడు ప్రణాళికాధి కారులకు పర్యవేక్షణాధికారం ఉండాలి. ప్రణాళికాధికారులకు ఈ అధి కారం లేనప్పుడు మధ్యదళారులు ఆ విషయాలలో ప్రవేశిస్తారు. ఈ దళారులకు తమ లాభాలదృష్ట్యా పంటలరేట్లను మార్చటానికి, విని మయదారులకు ఆహారపదార్థాలు అందకుండ చేయటానికి అవకాశం దొరుకుతుంది. దీనితో అటు ఉత్పత్తిదారులు ఇటు వినిమయదారులు కూడ దెబ్బతినవలసి వస్తుంది; మొత్తం వ్యవస్థే అరాజకం అవుతుంది. దానితో ప్రణాళికాబద్ధమైన విధానాలకు అనకాశం, అర్థం లేకుండ పోతవి. మన రైతుల దారిద్ర్యాన్ని ఆసరాగా తీసికొని పంటలకు న్యాయంగా ముట్టవలసిన ధరను దళారులు రైతులకు ఇయ్యరు. అదే విధంగా దేశంలోని మిగులు ఉత్పత్తులను మొత్తం తమ చేతు లలో పెట్టుకొని లాభాలే ప్రధానంగా చూచుకొంటు అధికమైన రేట్లు వచ్చేటంతవరకు వినిమయదారులకు సరుకు అందనీయరు. దేశం లోని ప్రధానోత్పత్తుల ధరలకు స్థిరత్వం లేకపోవటం చేతనే ఈ దోపి డికి అవకాశం ఏర్పడు తున్నది. ఈ దోపిడి విధానం ఉండటం చేతనే ధరలలో స్థిరత్వం ఉండటం లేదు. తమ ఉత్పత్తుల ధరలలో స్థిరత్వం లేకపోవటంచేత రైతు నిరుత్సాహపడుతున్నాడు. ఈ నిరుత్సాహం తన మిగులు ఉత్పత్తులను అమ్ముకొనటంలో కూడ కనపడుతున్నది. అందు

చేతనే రైతులు తమ ప్రధానోత్పత్తులకు సహాయకారులుగా ఉండగల చిన్నచిన్న ఇతర పంటల ఉత్పత్తులకు ఉత్సాహం కనబరచక పోవటం జరుగుతున్నది. వ్యవసాయక్షేత్రాలలో లభించగల అనేక ఇతర వస్తువుల ఎడల కూడ రైతు శ్రద్ధ తీసికొనక వాటిని వృథా చేయటానికి కూడ ఇదే కారణం. ఎంత శ్రద్ధ తీసికొన్నప్పటికి ఆ వస్తువులవల్ల అదనంగా చేతికి వచ్చేదేమీ లేనప్పుడు నిరుత్సాహపడటం, అశ్రద్ధచేయటం సహజం గదా! అందుచేతనే వ్యవసాయోత్పత్తులవల్ల రావలసిన అన్నిరకాల వస్తువులు మార్కెట్‌కి రావటం లేదు. వచ్చిన పంటలు కూడ దళారుల చేతులలోనే పడుతున్నవి. ఈ దళారులు మొత్తం మార్కెట్‌నే తమ ప్రయోజనాలదృష్ట్యా ఆడిస్తున్నారు. పరిశ్రమలలో కొన్నికొన్ని వస్తువులపై గుత్త అధికారం గల పారిశ్రామిక సంస్థలెలాగో ఈ దళారులుకూడ అలాగే వ్యవహరిస్తున్నారు. పారిశ్రామికంగా బాగా అభివృద్ధిచెందిన దేశాలలోని పరిశ్రమలలో ప్రణాళికాబద్ధమైన విధానాలకు ఎంత ప్రాముఖ్యం ఉన్నదో అభివృద్ధి చెందని దేశాలలో ఇలా మధ్యఉన్న దళారుల పాత్ర వహించటానికి ప్రణాళికాబద్ధమైన విధానాలకు అంతప్రాముఖ్యం అవసరం ఉన్నవి. కాబట్టి మన ప్రణాళికాకారులు ఈ దళారులను తొలగించటం కోసం ప్రణాళికాబద్ధమైన నిర్దిష్టవిధానాలతో ముందుకు రావాలి కాని వ్యవసాయదారులను పీకివేయటం వారి కర్తవ్యం కారాదు.

ఈ దళారుల ప్రాబల్యంతగ్గి క్రమంగా వారికి స్థానం లేకుండ పోవాలంటె కొన్ని సహకారసంఘాలు ఏర్పాటు కావాలి. ముఖ్యంగా మార్కెటింగ్ సహకారసంఘాలు, వినిమయదారుల సహకార సంఘాలు వెంటనే ఏర్పాటు కావాలి. ఇలాంటి సంఘాలు ఏర్పడి, వ్యవసాయోత్పత్తుల ధరలలో స్థిరత్వం ఏర్పడిన తరువాత వ్యవసాయదారులలో ఉత్సాహం పెరుగుతుంది. రైతులు వారి ఉత్పత్తులను వెంటనే మార్కెట్‌కి అందించటానికి ఉత్సాహపడతారు. ప్రస్తుతం మన వ్యవసాయరంగంలో వృథాగా పోతున్న గడ్డిగాదం మొదలైన వాటివిషయంలో రైతులు శ్రద్ధతీసికొని అనేకమైన స్వల్పకాలిక పంటలను వేయటానికి పూనుకొంటారు. ప్రతివస్తువుని సక్రమంగా వినియో

గించుకొనటానికి ఈ సంఘాలు సహాయపడటంచేత రైతులు ప్రతి వస్తువు విషయంలోను జాగ్రత్త తీసికొని తమ ఆదాయాలను అభివృద్ధి చేసికొనటానికి మార్గాలను వెతుకుతారు. అనేకవిధాలైన పంటలను పండించటానికి రైతులకు ఉత్సాహం లభిస్తుంది. సహకారఋణ సంఘాలకు, మార్కెటింగ్ సహకారసంఘాలకు సయోధ్యత ఏర్పరచి రెండు కలిసి పనిచేసేవిధంగా రూపొందించుకొన్న పక్షాలలో దళారులకు నిలవ నీడ ఉండదు; పైగా రైతులు కక్కుర్తిపడి తమ పంటలను అయినకాడికి తెగనమ్ముకొనవలసిన దుస్థితి తొలగిపోతుంది. ఒక రైతు పంటను నిలవచేయటం, మరొకరైతు అయినకాడికి అమ్ముకొనవలసి రావటం మొదలైన అసమానతలు అడుగంటిపోతవి. వ్యవసాయోత్పత్తులకు ఋణాలకు సంబంధం ఉండేలాగచేసి, మార్కెటింగ్ సౌకర్యాలు, పంటలనిల్వల సౌకర్యాలు కూడ ఆ సంఘమాజమాన్యం క్రిందనే ఉంచినప్పుడు ఈ పని చాలతేలిక అవుతుంది. తన పంట మీద తనకు అవసరమైన ఋణం తెచ్చుకొనగల అవకాశం ఉన్నప్పుడు రైతు మిగులు ఉత్పత్తిని తనదగ్గర దాచుకోడు. వ్యవసాయోత్పత్తులకు కనిష్టధరలు, గరిష్టధరలు నిర్ణయించి ధరలస్థిరీకరణకు ప్రభుత్వం ప్రయత్నించినపక్షంలో అదేమీ అసాధ్యమైన పనికాదు. ఈ విధంగా రైతులే తమతమ మిగులు ఉత్పత్తులను దళారులతో సంబంధం లేకుండా మార్కెట్‌లో అమ్ముకొనటానికి అనువైన పరిస్థితులు కల్పించినప్పుడు వారి మిగులు ఉత్పత్తులన్నా మార్కెట్‌లోకి వస్తవి ; ఇలా వచ్చిన ఈ మిగులు ఉత్పత్తులను కూడ రైతుల సహకారసేవాసంఘాలే సమీకరించి సమాజావసరాలను తీర్చగలవు. ఈ సహకార సేవా సంఘాల వాటాలలో ప్రభుత్వానికి కూడ కొన్ని వాటాలు ఉండటంచేత కేంద్రప్రణాళికాధికారులే ఈ సహకార సేవాసంఘాల కార్యక్రమాలపై ఆధిపత్యం వహించి పర్యవేక్షణ చేయటానికి అవకాశం ఉన్నది. ఈలాంటి కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా సమర్థవంతంగా నిర్వహించుకొనటానికి సహాయపడగల విధంగా ప్రభుత్వం ఇలాంటి విషయాలలోప్రవేశించి జోక్యం కలుగచేసికొనాలని మేము ప్రభుత్వాన్ని ఆహ్వానిస్తున్నాం. సహకార వ్యవసాయం, వ్యవసాయ సేద్యానికి సంబంధించిన పనులలో జోక్యం కల్పించుకొని రైతాంగాభ్యుదయానికి అవసర

మైన స్థితిగతులను స్వేచ్ఛను కల్పించ లేదు; సహకారవ్యవసాయం నిర్బంధవిధానాల ద్వారా మాత్రమే ఆహారోత్పత్తుల సేకరణకు పూనుకొనగలదు.

కాబట్టి ఆర్థికాభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్యావశ్యకమైన ఆహారోత్పత్తులు మార్కెట్‌లోకి బాగారావాలన్నా ఉత్పత్తులు అధికం కావాలన్నా మనకుటుంబ రైతాంగ వ్యవస్థని ఉత్తమంగా సహాయపడగలదు. కాని మన కుటుంబ వ్యవసాయ విధానంలో ఈ ప్రయోజనాలు సిద్ధించటానికి రైతులు మిగులుఉత్పత్తులను సేకరించ గల సహకారసంఘాలు ఉండాలి. ధరల స్థిరీకరణ జరగాలి. ఇవి ఉన్న ప్పుడు రైతు తన ఆహారధాన్యాలు వృథాపోకుండ చూచుకొని, ఉత్ప త్తిని అధికం చేయటంకోసం అత్యంతోత్సాహంతో కృషిచేస్తాడు. వీటి అన్నింటిని సాధించాలంటే రైతులకు బహుళార్థసాధక సహకార సంఘాలుకాని, సహకారసేవాసంఘాలుకాని ఉండాలి. ఈ సంఘాల ద్వారా రైతులను దళారుల దోపిడికి గురికాకుండ రక్షించాలి. ఇవన్నీ ఉన్నప్పుడు వ్యక్తికయాజమాన్యంపై ఆధారపడిన మన కుటుంబ వ్యవ సాయంలోనే అధికోత్పత్తులు, ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతవి.

కాని సరిగా అభివృద్ధి చెందని మనదేశం వంటి దేశాలలో క్రమబద్ధమైన ప్రణాళికలు కేవలం కార్యకలాపాలపై ఆధిపత్యం వహించటానికి, క్రమబద్ధం చేయటానికి మాత్రమె కాదు; కార్యకలా పాలను నిర్దిష్టమార్గంలో నడిపేటట్లు చూడటం కూడ దీనిలక్ష్యం అని మన ప్రణాళికాకారులలో కొందరు అనవచ్చు. మొత్తం మన వ్యవ సాయరంగం వ్యక్తికయాజమాన్యవిధానం మీద ఆధారపడి ఉన్న ప్పుడు ప్రణాళికాధికారులు ఈ భిన్నభిన్న వ్యక్తుల నిర్ణయాలపై తమ ప్రాబల్యాన్ని ప్రసరింపచేయటం, సరైనమార్గంలో పెట్టటం ఎలాసాధ్య మవుతుంది? క్రమబద్ధమైన ఆర్థికవిధానంలో వ్యక్తుల నిర్ణయాలతో ప్రణాళికాధికారులకు ఇలాంటి ప్రవేశం ఉండటం అనవసరం అనే విష యాన్ని ఎవరు విస్మరించలేరు. కాని ప్రణాళికాధికారులకు అలాంటి ప్రవేశావకాశం కలిగించే ముందు రెండు విషయాలను గుర్తుపెట్టు కోవాలి.

మొదటివిషయం : మనవ్యవసాయరంగం సొంతనేద్యం చేసికొని రైతుల కుటుంబవ్యవసాయంమీద ఆధారపడి ఉన్నది. అంతేకాని కేపిటలిస్టు పద్ధతిలోని వ్యక్తికయాజమాన్యం మాత్రం మనకు లేదు. రైతుకి సొంతభూమి అనేది మార్కెట్‌లో అమ్ముకొని ధనం సంపాదించే వస్తువు కాదు. భూమి అతనికి వృత్తిని ప్రసాదిస్తున్న సంప్రదాయకమార్గం; భూమే అతనికొక జీవితవిధానం. తన భూకమతానికి అతడు యజమానే; కాని అతని యాజమాన్యం సాంఘికప్రయోజనాలదృష్ట్యా అత్యంతావశ్యకాలైన కార్యకలాపాలనిర్వహణతో ముడిపడి ఉన్నది. రైతాంగ కుటుంబ వ్యవసాయ విధాన స్వరూపాన్ని ఈ పద్ధతిలోనే అర్థంచేసికోవాలి. అలా అర్థంచేసికొన్నప్పుడు సాంఘికావశ్యకాలదృష్ట్యా ప్రభుత్వం రైతులకు సరైనమార్గాలు చూపి, వారి కార్యకలాపాలకు క్రమత్వం కలిగించటానికి అవకాశం లేదని భావించనవసరం లేదు. వ్యవసాయదారుల నిర్ణయాలలో అనేక నిర్ణయాలపై ప్రభుత్వం ప్రత్యక్షంగానే – ఎలాంటి ఉత్తరువులతోను నిమిత్తంలేకుండానే – తనప్రభావాన్ని ప్రసరింపచేసి తనకు అనుకూలమైన నిర్ణయాలు జరిగేటట్లు చేయవచ్చు. ధరల నిర్ణయాల అధికారం తనచేతులలో ఉంచుకొనటం, ఆ యా విషయాలలో వినిమయతతో పాల్గొనటం, వ్యావసాయక పరికరాను అందించటంద్వారా వ్యావసాయక కార్యకలాపాలను క్రమపరచటం మొదలైన మార్గాలద్వారా వ్యవసాయదారుల నిర్ణయాలను ప్రభుత్వమె ప్రత్యక్షంగా ఒకమార్గంలో పెట్టటానికి వీలున్నది. ఇలాచేయటంతో ప్రభుత్వాశేయాలకు అనుగుణంగా వ్యవసాయ రంగంలోని రైతులు వ్యవహరించక తప్పదు. మనకు కావలసింది కూడ అంతవరకె. వ్యవసాయరంగంలోని ప్రధానసూత్రాలను మార్గాలను దేశానసరాలకు అనువుగా ఉండేటట్లు చూచుకొనటం మనకు చాలు. వ్యవసాయోత్పత్తులకృషికి సంబంధించిన ప్రైవేటుదిన కార్యకలాపాలలో ప్రభుత్వం ప్రవేశించవలసిన అవసరం లేదు.

సాంఘికావసరాలదృష్ట్యా కావలసిన మార్గాలు సూత్రాలు రైతు అనుసరించాలి. అంతేకాని అంతకుమించి ప్రణాళికాధికారుల నిర్ణయాలను, ఆజ్ఞలను రైతు ప్రైవాజ్ఞలవలె తలదాల్చవలసిన అవ

సరం ఏమున్నది ? సాంఘికావసరాలకు కావలసినంతవరకు మాత్రమే అతడు ఇతరుల నిర్ణయాలనుపాటిస్తాడు; ఆ పైన రైతు ఇతరుల ఆజ్ఞలకు ఎందుకు లొంగాలి ? దేశంలో వ్యక్తికంగా ఉన్న రైతులందరు తాము (అంటే ప్రణాళికాకారులు) నిర్ణయాలను అంచనాలను అంగీకరించి అందుకోసమే కృషిచేసే పక్షంలో ప్రణాళికలు తేలికంగా విజయవంతం అవుతాయని, ఆర్థికాభివృద్ధి అతిత్వరగా సాధ్యం అవుతుందని ప్రణాళికాకారులు భావించవచ్చు. కాని అసలు ఈ అభివృద్ధి అనేది ఎవరి కోసం ఉద్దేశింపబడింది ? ప్రణాళికాపద్ధతులు క్రమబద్ధమైన జాతీయాభివృద్ధి అనేవి ప్రజల శ్రేయస్సు కోసమె అయినపక్షంలో వ్యక్తుల స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను, వ్యక్తిత్వాన్ని బలిచేసి వీటిని సాధించవలసిన అవసరం ఏమున్నది ? జాతీయాదాయాలలో అభివృద్ధి పెరుగుదల రావటం కోసమని ప్రజలను బానిసలనలె ప్రవర్తించమని జీవించమని అడగటంలో ఆదేశించటంలో అర్థమేమిటి ? అసలు ప్రణాళికాబద్ధమైన కృషిలోని ప్రతిదశలోను మనం ఒకవిషయాన్ని మరచిపోకుండ చూచుకోవలసి ఉన్నది. ఈ కృషిలో మనం వెచ్చిస్తున్న మూల్యానికి మనం సాధించనున్న ప్రయోజనాలు సరిపోతాయా లేదా అని పరిశీలించుకోవటం అవసరం. ఈ మూల్యం అనేది కేవలం ఆర్థికంగానే ఉండదు. మన అంచనాల సాధన కోసం వెచ్చిస్తున్న సాంఘికమూల్యాలను కూడ ప్రధానంగా తీసికొనవలసి ఉన్నది. ఈ సాంఘికమూల్యాల దృష్ట్యానే ప్రణాళికాబద్ధమైన కృషికి కూడ ఒకపరిమితి దాటిపోకూడదని మేము భావిస్తున్నాం. ఈ ప్రణాళికాబద్ధమైన కృషికి ఆ పరిమితులు అవసరమని విశ్వసిస్తున్నాం. సాంఘికావసరాలదృష్ట్యా రైతులు తమంతతామేతమమీద కొన్నినిర్బంధాలను ఉంచుకొనవలసి ఉన్నది. కాని ఇలాంటి నిర్బంధాలకుకూడ ఒక పరిమితి ఉన్నది.ఈనిర్బంధాలనల్ల సాంఘికంగాలభించేప్రయోజనాలకంటెతాముకోల్పోతున్న దే అధికమయినప్పుడు ఇక ఆ నిర్బంధాలకు స్వస్తిచెప్పక తప్పదు. వ్యవసాయరంగంలో కావలసిన ప్రణాళికాబద్ధమైన కార్యకలాపాలను అనేకమైన పరోక్షవిధానాలద్వారా సాధించుకొనే అవకాశం ఉన్నది; అందుకోసమని రైతాంగ కుటుంబవ్యవసాయవిధానంలోని స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను వ్యక్తిత్వాన్ని విధ్వంసం చేయవలసిన అవసరం లేదు.

అంతేకాని ఈ పరిమితులను దాటి ప్రణాళికలు ప్రజలను బలిగొనటం కూడని పని. ఈ పరిమితులను దాటి పోవలసిన అవసరం ఉన్నదను కొన్నప్పుడు నిర్బంధవిధానాలమీద కాక ఆ యా ప్రాంతాలలోని స్థానికనాయకత్వం మీద మాత్రమే ఆధారపడాలి. ప్రజలు కష్టపడి పనిచేయాలని, అధికోత్పత్తులను సాధించాలని, ఉత్తమవ్యవసాయపద్ధతులను నేర్చుకోవాలని, దేశాభివృద్ధికోసం నిర్ణయింపబడిన అంచనాలను అందుకోవాలని స్థానికనాయకత్వం ప్రచారంచేసి, ప్రజలను ఉత్సాహపరచి కార్యోన్ముఖులను చేయవలసి ఉంటుంది. అలాంటి స్థానిక నాయకత్వం లేనప్పుడు ఏం చేయాలి అని ప్రశ్నించవచ్చు. అప్పుడుకూడ కుటుంబవ్యవసాయవిధానం వల్ల లభిస్తున్న ఆర్థికేతర ప్రయోజనాలను, సాంఘికవిలువలను విధ్వంసంచేసే ప్రణాళికాబద్ధమైన కార్యకలాపాలకంటె ప్రజాస్వామికవిధానాలద్వారానే –మందగమనంతోనే అయినప్పటికి – అభివృద్ధిచెందటం అవసరం. అంతేకాని నిర్బంధ ప్రణాళికావిధానాలద్వారా అతిత్వరలో అభ్యుదయం సాధ్యమైనప్పటికి ఈ ప్రజాస్వామికవిధానాలే శ్రేయస్కరాలు. ఎందుచేతనంటె మానవుడు పుట్టింది కేవలం పొట్టకు బాగాతినటానికే కాదు; అతడు బాగా బ్రతకాలి, సుఖంగా స్వేచ్ఛగా జీవించాలి. అభివృద్ధిపేరుతో, వంకతో రైతాంగకుటుంబవ్యవసాయవిధానాన్ని విధ్వంసంచేయటం న్యాయసమ్మతం కాదు. ప్రజాస్వామికప్రణాళికలకు కృషికి ఈ కుటుంబవ్యవసాయం ఎంతో అవసరం. ప్రజాస్వామ్యపరిరక్షణకు, ప్రణాళికాధికారుల దెబ్బలకు తట్టుకొనటానికి, సంఘాన్ని నియంతృత్వమార్గాలలో పడకుండ కాపాడటానికి స్వేచ్ఛాపూరితులైన ఈ రైతులు ఎంతో అవసరం.

మన ప్రణాళికాకారులు ప్రజాస్వామిక విధానాలను ఆచరించటంలో రూపొందించటంలో విఫలమయ్యారు. సహకార వ్యవసాయం యెడల వారు అవలంబిస్తున్న వైఖరి మాత్రమె కాక ఇంక కొన్ని విషయాలలో కూడ వీరి విధానాలు పునస్తత్వం ఈ విషయాన్ని బుజువు చేస్తున్నవి. కొన్ని రంగాలలోని వారి ప్రమాణాలు ఇతర సహకార సంఘాలలోని ఆచరణలో వారు అవలంబిస్తున్న దృక్పథం ఈ విష

యాన్నే విశదం చేస్తున్నవి. సర్. మాల్కొలమ్ డార్లింగ్, కె. సి. ఐ. ఇ. కూడ ఈ విషయాన్ని గురించి హెచ్చరిక చేశాడు. వీరిని ప్రణాళికాసంఘ సలహాదారు హోదాలో సహకారోద్యమాభివృద్ధిని గురించి పరిశీలించి ఒకనివేదికను సమర్పించవలసిందిగా మన భారత ప్రభుత్వం కోరింది. సర్. డార్లింగ్‌కూడ మన ప్రణాళికాసంఘంలో వ్యక్తమవుతున్న ఈ దృక్పథాన్ని గమనించక తప్పలేదు; పైగా ఆయన ఇలాంటి ప్రజాస్వామిక వ్యతిరేక వాసనలను గురించి హెచ్చరించటం గూడ జరిగింది. ఆయన 'భారతదేశం-సహకారోద్యమంలోని కొన్ని అంశాలు' అన్న పేరుతో సమర్పించిన తన నివేదికలో ఇలా వ్రాశాడు. "ప్రణాళికలో పెట్టుకొన్న అంచనాలను ఎంతటి మూల్యం చెల్లించి అయినాసరే సాధించవలసిన ఆదర్శాలుగా చాలమంది భావిస్తున్నట్లుగా నేను కనుగొన్నాను. అంచనాల సాధన కోసమె గైతు ఉన్నాడు తప్ప అంచనాలు గైతు శ్రేయస్సుకోసం కాదేమో నన్నంతగా నాకు తోచింది. నూతన సంఘ సౌధనిర్మాణం సరైన పునాదుల మీద జరగాలంటె ఈ దృక్పథాన్ని ఎప్పటికప్పుడు ఖండించటం, త్యజించటం అవసరం." (పుట. 2)

VII

సహకార వ్యవసాయంవల్ల మన ప్రణాళికాకారులు సాధించాలనుకొంటున్న ప్రయోజనాలన్నీ స్వయంకల్పితవృత్తితో జీవిస్తున్న గైతాంగపు వ్యవసాయ సేవాసహకారసంఘాలద్వారా ఉత్తమపద్ధతులతో సాధించుకొనటానికి అవకాశాలు ఉన్నవి. ఈ వ్యవసాయసేవా సహకారసంఘాలలో కంటె సహకారవ్యవసాయంలో వీలైనా కొద్దిగా ఆర్థికలాభాలు ఉంటే ఉండవచ్చు. కాని ఈ కొద్దిపాటి ఆర్థికలాభాల కోసం ఎంతటి ఉత్కృష్టమైన ఆర్థికేతర విలువలు, ప్రయోజనాలు కోల్పోవలసి ఉంటుందో గమనించి ఈ ఆర్థిక లాభాలకు విలువలుకట్టటం అవసరం. కుటుంబవ్యవసాయం తీసివేసి దానిస్థానంలో సహకార వ్యవసాయం ప్రవేశపెట్టినప్పుడు ఎన్నో సాంఘికప్రయోజనాలు, స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు రూపుమాసిపోతాయని ఇదివరలో వివరించు

కొన్నాంగదా! కాబట్టి వ్యవసాయంలో మనకు కావలసినది వ్యవసాయ సేవా సహకార సంఘాలేకాని సహకార వ్యవసాయసంఘాలు కాదు.

మనవ్యవసాయం అభివృద్ధిదాయకంగా, సమర్థవంతంగా కొన సాగాలి అంటే భూములపై రైతాంగానికి యాజమాన్యం ఉండాలి; రైతులకు సహకారసంఘాలు ఉండటంకూడ అంత అవసరమే. మన వ్యవసాయంలోని పనిపాటలలో చాలభాగం రైతాంగయాజమాన్య సంప్రదాయంలోనే చక్కగా నిర్వహించబడటానికి అవకాశం ఉన్నది; కాని కొన్నికొన్ని ముఖ్యమైన కార్యకలాపాలకోసం సహకార సంఘాలుకూడ ఉండక తప్పదు. భూములపై రైతులకు వ్యక్తిగత యాజమాన్యం ఉన్నప్పుడు సహకారసంఘాలు ఎలా వర్ధిల్లగలవు అని సందేహించ నవసరంలేదు. ఈ రైతాంగయాజమాన్యం, సహకార సంఘాలు పరస్పర విరుద్ధాలుకావు; పైగా పరస్పరపోషితాలు. ఇవి రెండు ఒకదాని అభివృద్ధికి, మనుగడకు మరొకటి సహాయభూతంగా ఉండి వ్యవసాయసామర్థ్యం పెరగటానికి తోడ్పడగలవు. రైతాంగ యాజమాన్యవిధానాన్ని తీసివేసిన పక్షంలో వ్యక్తిగత శ్రద్ధకు తావు లేకుండ పోతుంది. వ్యవసాయంలో ప్రధానంగా కావలసింది వ్యక్తి గత శ్రద్ధ; వ్యవసాయంలో రైతు పెట్టే పెట్టుబడు లన్నింటిలోకి అదే ముఖ్యమైనది. తమభూములకు తామే యజమానులం అన్న భావం వల్ల, స్వయంకల్పిత వృత్తిగౌరవంవల్ల, వృత్తిభద్రతవల్ల రైతులకు ప్రస్తుతం లభిస్తున్న స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు మటుమాయమై పోతవి; ఇలాంటి మార్పు వ్యవసాయకసామర్థ్యం పడిపోవటానికి, సాంఘిక జీవితంలో సుఖసంతోషాలు మృగ్యమైపోవటానికి దారితీస్తుంది. అనేక మైన సాంఘికవిలువలు విధ్వంసమైపోతవి. అలాగని చెప్పి ఇతర సహ కారసంఘాలద్వారా రైతులకు కావలసిన సౌకర్యాలు అందించటంలో అశ్రద్ధ చూపరాదు. రైతులకు కావలసిన పరికరాలు, ఋణాలు, మార్కెటింగ్ సౌకర్యాలు మొదలైనవి అందించటంకోసం సహకార సేవాసంఘాలను ఏర్పాటుచేయాలి. ఈ సహకార సేవాసంఘాల నిర్మాణం జరగని పక్షంలో వ్యవసాయసామర్థ్యం క్షీణించటం, ఎదుగు బొదుగులేని వ్యవసాయస్థితిగతులు తప్పవు.

భూములపై రైతులకు వ్యక్తిగతయాజమాన్యం ఉండే విధానానికి రైతుల సహకారసంఘాలకు ఉన్న సంబంధం ముఖ్యంగా గమనించవలసి ఉన్నది. సాగులో ఉన్న కాస్త భూమే దేశప్రజలను మొత్తం పోషించవలసిన స్థితిగతులు ఉండి వ్యవసాయదారులకు నాలుగురాళ్లు కూడబెట్టుకొనగల అవకాశాలులేని దేశాలలో-అంటే మన దేశంవలె సరిగా అభివృద్ధిచెందని దేశాలలో – వీటి సంబంధం మరింత అధికంగా కనిపిస్తున్నది. అభివృద్ధి కార్యక్రమాలకు పునాది వ్యవసాయోత్పత్తులే. దేశాభివృద్ధికార్యకలాపాలకు నిలబడాలన్నా, దేశాభివృద్ధికార్యకలాపాలపేరుతో తమకు జరుగనున్న అన్యాయాలను ఎదిరించాలన్నా రైతులకు సహకారసంఘాలు ఉండటం ఎంతో అవసరం. అదేవిధంగా సహకారోద్యమం ఆరోగ్యవంతంగా పెరిగి బలపడాలి అంటే స్వేచ్ఛాపూరితమై ప్రజాస్వామికమార్గాలలో శక్తియుక్తులతో విలసిల్లే రైతాంగం అత్యంతావశ్యకం. తమ సొంతకాళ్ళమీద నిలబడుతున్న రైతాంగం తప్ప సహకారోద్యమానికి కానలసిన ఐచ్ఛికప్రవేశసూత్రాన్ని మరొకరు ఆచరించలేరు. సహకారసంఘాలలో పాల్గొనటమా లేదా అనేది ఆ యా సభ్యుల ఇష్టానిష్టాలమీద ఆధారపడి ఉండాలి; అలా కానప్పుడు దానిని సహకారసంఘం అని ఎలాఅనగలం? కాబట్టి రైతుల శ్రేయస్సుకోసం సహకారోద్యమాన్ని అభివృద్ధిచేసి బలపరచాలి; సహకారోద్యమ విజయంకోసం రైతులను స్వతంత్రులుగా బ్రతకనీయాలి; స్వతంత్రులుగానే అభివృద్ధిచెందటానికి అవకాశాలు కల్పించాలి.

సరిగా అభివృద్ధిచెందని దేశంలో అప్పుడప్పుడే అభినృద్ధి కృషికి పూనుకొంటున్నప్పుడు ప్రజాస్వామ్యానికి, ప్రణాళికాబద్ధ కృషికి ఎలాంటి సంబంధం అవసరం ఉంటాయో ఈ స్వతంత్ర రైతాంగానికి సహకారోద్యమానికి అదే విధమైన సంబంధం ఉన్నది. రైతాంగ యాజమాన్యవిధానం వలెనె ప్రజాస్వామ్యం కూడ ఎన్నిశ్రమలకైన ఓర్చి నిలుపుకొనవలసిన శాశ్వతవిలువలు ప్రయోజనాలుగల సంస్థ. కాని ఆర్థికస్థితిగతులు అస్తుబిస్తుగా ఉండి దేశంలో అభివృద్ధి లేనప్పుడు ఈ ప్రజాస్వామ్యం ప్రణాళికాబద్ధమైన కృషిలేకుండ నిలవలేదు. అదే

విధంగా ప్రణాళికాబద్ధమైన కృషికూడ ప్రజాస్వామికసంప్రదాయాల మీద, ఆచరణమీద ఆధారపడి ఉండాలి. లేనిపక్షంలో ఈ ప్రణాళికా బద్ధమైన కృషికి ప్రజలనుంచి ఉత్సాహప్రోత్సాహాలు, సహకారం లభించక కొంతకాలం గడిచేటప్పటికి ప్రణాళికల ఆశయాలే విఫలమై పోతవి. కాబట్ట మనదేశానికి ప్రజాస్వామికబద్ధమైన ప్రణాళికలు, క్రమ బద్ధమైన ప్రజాస్వామ్యం ఎంతఅవసరమో సహకార సంఘాల సహాయంతో నడిచే రైతాంగకుటుంబవ్యవసాయం అంత అవసరం. ఈ విషయాన్ని గమనించలేక భూములపై వ్యక్తికయాజమాన్యం ఉండటం, కుటుంబ వ్యవసాయం కొనసాగటం దేశాభివృద్ధికి అడ్డు వస్తాయను కోవటం పొరపాటు; పైగా దేశాన్ని సంఘాన్ని నియంతృత్వపు అఘాతంలో త్రోసినట్లు అవుతుంది.

అధ్యాయం - 9

ఆచరణీయత - రాగల పరిణామాలు

ఇంతవరకు మనం సిద్ధాంతదృష్ట్యా మాత్రమే పరిశీలన చేశాము. రైతాంగవ్యవసాయ విధానంవల్ల, సహకార వ్యవసాయ విధానం వల్ల రాగల లాభనష్టాలను సిద్ధాంతదృష్ట్యా పరిశీలించాము. మన ఆదర్శాలకు పరిస్థితులకు వీటి రెంటిలో ఏది సరిపడుతుందో కనుగొనటంకోసం ఈ పరిశీలన చేశాము. కాని అది చాలదు; ఈ సమస్యను ఆచరణ దృష్ట్యాకూడ పరిశీలించి పరిష్కరించ వలసి ఉన్నది. ఆయా ఆదర్శాలకు తగిన స్థితిగతులు ఉన్నప్పుడు ఏ విధానంవల్ల మిగులు ఉత్పత్తి పెరుగుతుంది, లేక ఏ విధానంవల్ల సగటు ఖర్చులు తగ్గిపోతవి అనేది ఒక్కటే మన సమస్యకాదు. మన ఈనాటి సందర్భాన్ని బట్టి వీటిరెంటిలో ఏదో ఒకటి కోరుకొని దానిని ఆచరించటానికి మనకు అవకాశం లేదు. రైతుపద్ధతి కుటుంబ వ్యవసాయాన్ని సహకార వ్యవసాయంగా మార్చివేయ బోతున్నారు. అదే మన సమస్య. పూజారి వ్యవస్థ, స్థితిగతులు పూర్తిగా ధ్వంసమై ప్రత్యామ్నాయంగా మరొకవిధానం అమలులోకి రాని సంధికాలంలో కొన్ని దేశాలు కొన్ని నిర్ణయాలు తీసికొన్నవి; కాని ఆ స్థితిలో అవి ఆచరణ సాధ్యం అవునా కాదా అనే ఆలోచనతో మాత్రం వాటిని నిర్ణయించలేదు. కాని మన దేశంలో మనకు ఈనాడు అలాంటి సంధియుగం లేదు. మన వ్యవసాయం తరతరాలనుంచి కూడ కుటుంబ వ్యవసాయవిధానం మీద ఆధారపడి కొనసాగుతున్నది. ఆయా చిన్న రైతులే ఈ కుటుంబ కమతాలకు యజమానులుగా కూడ ఉంటు వచ్చారు. ఇటీవల మన ప్రభుత్వాలు కౌలుదారులకు రక్షణకల్పించటం కోసం శాసనాలు ప్రవేశపెట్టటంతో ఈ రైతులసంఖ్య పెరిగి వారు బలపడుతున్నారు. పరోక్ష వ్యవసాయకులు తగ్గిపోతున్నారు. ఇలా సొంతరైతుల సంఖ్య పెరగటానికి జమీందారీలరద్దు, భూకమతాలకు గరిష్టపరిమితుల నిర్ణయం మొదలైన విధానాలు సహాయపడ్డాయి.

దీనితో మనవ్యవసాయరంగం ఇంచుమించు పూర్తిగా కుటుంబ వ్యవసాయ విధానంలోనే ఉన్నది.

ఈ కుటుంబ వ్యవసాయ విధానంనుంచి సహకారవ్యవసాయ విధానానికి దేశాన్ని మార్చి ఒకగంతు వేయాలంటె అనేక విషయాలను ముఖ్యంగా ఆచరణదృష్ట్యా పరిశీలించుకోవలసి ఉన్నది. ఈ మార్పు ఆచరణసాధ్యం అవునా కాదా అనే విచారణ లోపించిన పక్షంలో మనవారిప్రణాళికలు ఊహాప్రపంచంలో రాజ్యాలేలటంతప్ప ప్రయోజనం ఉండదు. కాబట్టి ఆచరణసాధ్యతకు అధికప్రాముఖ్యం ఇయ్యవలసి ఉన్నది. దీనికి కారణంకూడ ఉన్నది. భారత దేశపురైతు సొంతభూములపై అనుశృతంగా కొన్ని హక్కులు అనుభవిస్తున్నాడు; పైగా స్వయంకల్పితవృత్తిచేత గౌరవం పొందుతు, తత్ఫలితంగా ఎన్నో స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను అనుభవిస్తున్నాడు. వీటి అన్నింటిని మించి తన ఈ సంప్రదాయాలకు అనుగుణమైన ఒక జీవితవిధానానికి అలవాటు పడ్డాడు. రైతుల ప్రవర్తనలు వారు అనుసరిస్తున్న సంప్రదాయాలు, వారుప్రదర్శించే మానవవిలువలు, కుటుంబాలలో వారికుండె సంబంధాలు, సంఘంలో వారునిర్వహిస్తున్న ఆరోగ్యకరమైన సంబంధాలు, వారిమానసిక స్థితిగతులు, ఆవేశోత్సాహాలు – ఇవన్నీకూడ చాలవరకు రైతులకుటుంబ వ్యవసాయ విధానం చేత ప్రభావితాలు అవుతున్నవి. కాబట్టి కుటుంబవ్యవసాయ విధానం పోయిన తరువాత సాంఘికార్థికరంగాలలో, రైతులమనస్తత్వంలో వచ్చే విపరీతపరిణామాలను ఫలితాలను ముందుగానే ఊహించి గమనించటం చాల అవసరం.

కుటుంబవ్యవసాయానికి ప్రత్యామ్నాయంగా సహకారవ్యవసాయం ప్రవేశపెట్టదలచినప్పుడు ఈ అవసరం చాలఉన్నది. ఈ ఆవశ్యకతను గురించి మేము ఇంతగా నొక్కిచెప్పటానికి కారణాలు ఉన్నవి. కులతత్వాలను నిర్మూలించటంవలె ఏదోఒక సాంఘిక ఆదర్శాన్నో లేక తాత్విక ఆదర్శాన్నో సాధించటంకోసం మాత్రమె మనం పూనుకొన్న పక్షంలో ఈ మార్పుల సాధనలో రాగల ఆర్థికమైన నష్టాలను గురించి అంతగా యోచించవలసిన అవసరంలేదు. కాని మన ఆదర్శం

అదికాదుగదా! ఆర్థికప్రయోజనాలను ఆశించి—అంటే ఉత్పత్తులను పెంచాలని, ఖర్చులను తగ్గించాలని — ఈ సంస్కరణలకు మనం పూను కొంటున్నాము. కాబట్టి ఈ సంస్కరణల వలన అయ్యే వ్యయాన్ని తప్పక గమనించవలసి ఉన్నది.

ఈ సహకారవ్యవసాయ ప్రతిపాదన ఆచరణలోకి రావాలంటే రెండు ప్రధాన సమస్యలు ఉన్నవి :

1. రైతులు తమంతతాము ఎట్టి నిర్బంధము లేకుండ కేవలం ఐచ్ఛికంగా తమ సొంతభూములను సహకారవ్యవసాయ సంఘానికి అప్పచెప్పి, నిర్వాహకవర్గానికిలోబడి ఉంటారా? 2. రైతులు ఐచ్ఛికంగా తమభూములను సహకారసంఘానికి అప్పచెప్పినప్పుడు ఈ సహకారవ్యవసాయంవల్ల ప్రస్తుతం మనవారు అంచనాలువేస్తున్న ప్రయోజనాలు సిద్ధించగలవా? అంటే వ్యవసాయవ్యయంతగ్గి ఉత్పత్తులు అధికం కావటం జరుగుతుందా?

ఈ ప్రశ్నలకు సమాధానాలియ్యటంలో వ్యక్తిగతాభిమతాలు పనిచేస్తవి, కనుక వీటికి వచ్చేసమాధానాలు కూడ భిన్నభిన్నంగా ఉండవచ్చు. కాని ఒక్కవిషయం మాత్రం నిస్సంశయంగా చెప్పవచ్చు. ఆచరణసాధ్యతను భూతవర్తమానకాలాలలోని అనుభవాలను భారత దేశరైతుల మనస్తత్వాన్ని సరిగాగ్రహించి లెక్కకట్టకుండ కేవలం సిద్ధాంతాలకుమాత్రమే అంటిపెట్టుకొని ఆలోచించినవారు మాత్రం దోషభూయిష్టమైన నిర్ణయాలకే వస్తారు.

II

మొదటి ప్రశ్నను గురించి ఆలోచిద్దాం. భారతదేశపురైతు ఇష్టపూర్వకంగా తనసొంతభూములను సహకారవ్యవసాయ సంఘానికి అప్పచెప్పి, సమిష్టినిర్వహణకు అంగీకరించగలడని మనం అనుకొనగలమా? ఇలా చేయటంవల్ల లాభమా నష్టమా అనేది అలాఉంచి, ఆచరణసాధ్యతను బట్టి ఈ ప్రశ్నకు సమాధానం వెతుకుదాం; నిస్పాక్షికంగా దీని ఆచరణసాధ్యతను పరిశీలిద్దాం. ఈ ప్రతిపాదన ఆచరణ

సాధ్యమే అని మన రైతులు ఇష్టపూర్వకంగా దీనిని కొగలించుకొంటారని ఆశించటం కేవలం ఆశాభావం; పైగా రైతాంగాన్ని గురించిన మన అమాయకత్వాన్ని బయటపెట్టుకొనటమె అవుతుందని మావిశ్వాసం. ప్రాథమికమైన వాస్తవికవిషయాన్ని అదిమనకు అయిష్టమైనదే కావచ్చు కాక -విస్మరించినందువల్లవచ్చే ప్రయోజనం ఏమీ ఉండదు. సొంతభూకమతం అనేది మనరైతుకి మార్షల్ సిద్ధాంతాలలో వలె కేవలం ఉత్పత్తిసాధనం మాత్రమే కాదు. మన రైతుకి భూమికి అంతకుమించిన సంబంధం ఉన్నది; ఆ సంబంధం విడదీయరానిది, సజీవప్రకృతి గలది. మన రైతులకు భూమికి ఉన్న అనుబంధం, సొంత భూకమతంవల్ల —ఆ కమతం ఎంత చిన్నదైనప్పటికి—లభిస్తున్న సొంతవృత్తి తద్వారా లభిస్తున్న స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు మన రైతులకు తెలియనివి కావు. వీటిని వదులుకోవటానికి రైతు ఏ పరిస్థితులలోనూ అంగీకరించడు. సొంతభూమిని వదులుకొనేకంటె ఎంతటి దారిద్ర్యాన్ని అయినాసరే అనుభవించటానికే మన రైతులు ఇష్టపడతారని చెప్పటంలో అతిశయోక్తి ఏమీ ఉండదు. ఇది వాస్తవవిషయం; కొన్ని ఉదాహరణలను, సందర్భాలను గమనించిన వారికి ఇది తేలికగా బోధపడుతుంది. కుటుంబంలోని పెద్ద - అంటే తండ్రి - జీవించి ఉండగానే సోదరులు విభాగాలై ఎవరికివారు ప్రత్యేకంగా బ్రతకటం రైతులోకంలో సర్వసాధారణంగా జరిగేదే కదా! మనదేశంలోని భూకమతాలు చిన్నచిన్న ముక్కలు ముక్కలుగా విడిపోవటానికి ఈ సంప్రదాయం కూడ ఒక కారణం. ఈ చిన్నచిన్న భూఖండాలను కలిపి కృషి చేసికొన్నందువల్ల ఆర్థికంగా అనేక ప్రయోజనాలు వస్తాయని వారికి తెలియదా? తెలుసు. కాని తెలిసినప్పటికి సొంతభూములమీద వారికిఉండే అనుబంధంచేత, మమకారం చేత ఆ చిన్నచిన్న భూఖండాలను - ఆర్థిక ప్రయోజనాలు ఎంత కొద్దిపాటిగా వస్తున్నప్పటికి - అలాగే ఉంచుకొని సొంతసేద్యం చేసుకోవటానికే వారు అంగీకరిస్తారు. భూకమతాలను సంఘటితం చేయటం కోసం మనవారు వివిధరాష్ట్రాలలో ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ప్రయత్నాల ఆచరణలో మనకు ఎదురవుతున్న చిక్కులనుబట్టి ఈ విషయం తేలికగా గ్రహించవచ్చుగదా! సంప

దాయంగా, వారసత్వంగా తనకు లభించిన కొద్దిపాటి భూకమతాలను వదులుకోవటానికి రైతులు అంగీకరించరు. అంతకంటె ఎక్కువ ఆదాయం లభించగల పెద్ద భూకమతాన్ని మరొకచోట ఇస్తామని అన్నప్పటికి రైతులు తమ వారసత్వపు భూకమతాలను వదలటానికి ఇష్టపడని సందర్భాలు అనేకం మనం చూస్తున్నాము. చేల సరిహద్దుల గురించి గట్లదగ్గర వచ్చిన తగాదాల వలన ఏకోదరులమధ్య, దాయాదులమధ్య జరుగుతున్న హత్యలు ఈ దేశానికి కొత్తగాదు గదా! అయితే ఇలాంటి విపరీతచర్యలు, దృక్పథాలు, సాంఘిక అనారోగ్య చిహ్నాలని, వ్యాపార నిర్వహణకు తగని మార్గాలని నిస్సందేహంగా చెప్పవచ్చు; కాని అదివేరే విషయం. ఏమైనా వాస్తవవిషయాలను విస్మరించి లాభం లేదుగదా! ఇదే విషయాన్ని శ్రీ చరణసింగ్ ఎంత చక్కగా చెప్పాడో చూడండి. "మానవప్రకృతి అంటు ఒకటున్నది. అది మనకు ఇష్టమైన దయినా కాకపోయినా ఒక తల్లి బిడ్డలే ఇంటిపెద్ద-అంటే తండ్రి-గతించిన తరువాత లేదా తండ్రిమాటకు ప్రాబల్యం తగ్గిన తరువాత విభాగాలై ఎవరికివారు విడివిడిగా జీవించటం సాధారణంగా జరుగుతున్న విషయం. ఈ పరిస్థితులలో రైతులు తమతమ ప్రయోజనాలను ఆ గ్రామంలో గాని లేక ఆ చుట్టుపట్లగాని ఉన్నప్రజల ప్రయోజనాలతో ముడిపెట్టి చూడగలరను కోవటం నిరాధారమైన ఆశ మాత్రమే. పైగా ఈ ప్రజలు రైతుయొక్క జీవితానికి పూర్తిగా కొత్తవారు, అతనిలో పాలు పంచుకొన్న వారు కూడ కాదు." * ఈ సందర్భంలో మేము కేవలం మా వ్యక్తిగతాభిమానంతో ఈ నిర్ణయాలకు వచ్చామని ఎవరైనా మాపై నేరారోపణ చేయవచ్చు. కాని మమ్ములను అలా అనేవారు వారి అభిప్రాయాలకు ఆధారమేమిటో, కారణాలేమిటో చూపవలసి ఉంటుంది.

మొదటి విషయం ఏమంటె ఇలా అనేవారికి చరిత్రలో ఎక్కడ కూడ వారిఅభిప్రాయాన్ని బలపరిచే ఉదాహరణలు లేవు. సంప్రదాయకంగా అనుశ్చతంగా వస్తున్న రైతాంగ యాజమాన్యాధికారాలను

* Charan Singh, Revenue Minister, U. P.—Whither Co-operative Farming," P. 108.

అనుభవిస్తున్న రైతులు ఏదేశంలోను ఏకాలంలోను కూడ సహకార వ్యవసాయంలో ఆర్థిక సాంఘిక ప్రయోజనాల కోసమని తమ భూములను తమంతతామే ఇచ్చికగా ఏకంచేసిన సందర్భం ఎక్కడా లేదు. గత చరిత్రలో కాని, వర్తమానచరిత్రలోకాని ఇలాంటిది ఉదాహరణకైనా మనకు గోచరించదు. సహకారభావము, సహకారోద్యమము కేవలం మాటలలోనేకాక చేతలలో కూడ స్కాండినేవియన్ దేశాలలో ఎంతో ప్రాబల్యం పొందినవి; అందుచే రైతులలో ఈ ఉద్యమం మంచి ప్రచారంలో ఉన్నది. ఐనప్పటికి అక్కడకూడ సహకార వ్యవసాయాన్ని ప్రవేశపెట్టటం జరగలేదు. దానిపైన వారికి మోజుకూడ లేదు. స్వీడన్ దేశంలో సహకారోద్యమానికి ధ్వజస్థంబంవంటివాడైన ఏక్ గులాండర్ ఏమంటున్నాడో చూడండి. "రైతులలో ఉండవలసిన సహకారభావాన్ని గురించి ఎన్నో వ్యాసాలలో ఉపన్యాసాలలో ఎంతగానో చెపుతువచ్చాను; కాని సమిష్టివ్యవసాయం కావాలని చెప్పేటంతవరకు మాత్రం నేను వెళ్ళలేదు. సహకారభావం యొక్క అంతిమ దశే ఈ సమిష్టి వ్యవసాయం. నేను ఇలా ప్రవర్తించటం (అంటే సమిష్టి, సహకార వ్యవసాయాలను అంగీకరించక పోవటం) హేతురహితంగా తోచవచ్చు; నా అభిప్రాయాన్ని నేను తార్కికంగా రుజువుచేసికొనలేక పోవచ్చు. అసలు ఈ విషయం బుద్ధికి కాక మనసుకి సంబంధించినదే నేమో! ఏమైనా మా దేశంలోని అత్యధిక సంఖ్యాకులు బహుశా యూరపులోని రైతులందరు కూడ నాలాగే భావించి నాతో అంగీకరిస్తారని మాత్రం నాకు సంతోషంగా ఉన్నది."*

గత పదిసంవత్సరాలుగా మనదేశంలో మనంకూడ సహకార వ్యవసాయానికి ఎంతో ప్రోత్సాహం ఇచ్చాము. కాని మన అనుభవంకూడ మన ప్రణాళికాకారుల విశ్వాసానికి బలం ఇచ్చేదిగా లేదు. ఇప్పటివరకు ఉన్న సహకారవ్యవసాయ సంఘాలు కొత్తగా సాగులోకి తీసికొని వచ్చిన భూములలోను, ప్రభుత్వ భూములలోను ఉన్నవి; ఇవికూడ సొంతభూములు లేని వ్యవసాయ కూలీలచేత, రైతులు కాని ఇతరులచేత నడపబడుతున్నవి. వివిధరాష్ట్రాలలోని సహకారశాఖల

*Ake Gullander, "Farmers' Co-operatives in Swedan"—1948.

పరిపాలనా నివేదికలను జాగ్రత్తగా పరిశీలించిన వారికి ఈ విషయం స్పష్టంగా విదితం కాగలదు. భారీవ్యవసాయంలోని ఆర్థికలాభాలను సంపాదించటం కోసమని సొంతభూములున్న రైతులు తమ భూములను ఏకంచేసి సేద్యంచేస్తున్న సందర్భం ఎక్కడ కనిపించదు. కమ్యూనిస్టుదేశాలలో వ్యవసాయాన్ని సమిష్టిపరంచేశారు; కాని ఈ చేయటం రైతుల అభిప్రాయాలనుబట్టి జరిగినది కాదని అందరు అంగీకరించే విషయమే. ప్రభుత్వం తలుచుకొన్నది కాబట్టి రైతుల ఇష్టానిష్టాలతో నిమిత్తం లేకుండ ఆదేశాలలో సమిష్టివ్యవసాయం నచ్చింది. ఇటీవల కొంతకాలంనుంచి కమ్యూనిస్టు దేశాలలో కొన్నింటిలో వస్తున్న మార్పులను గమనించిన వారికి ఈ విషయం స్పష్టం కాగలదు. ఇది వరలో ఏకఖండాలుగా చేసిన భూమిని మళ్లీ విడగొట్టి రైతులకు వ్యక్తిగత సేద్యానికిగాను ఇచ్చివేయాలని ఇటీవల కొంతకాలంనుంచి కొన్ని కమ్యూనిస్టు దేశాలలో నూతన సంచలనం బయలు దేరినది.

ఇక రెండవ విషయం ఏమంటె ఈ సహకార వ్యవసాయంవల్ల తప్పక లాభాలు రాగలవని విశ్వసించటానికి తగిన ఆధారాలు లేవు; చరిత్రలో సాక్ష్యాలు కూడ లేవు, కాకపోతే ఒకటిమాత్రం చేయవచ్చు. భారీనిర్వహణలలో రాగల ఆర్థిక ప్రయోజనాల సిద్ధాంతాలను సంప్రదాయక ధోరణిలో వల్లించటం మాత్రం చేయవచ్చు; కాని ఈ సంప్రదాయక సిద్ధాంతాలవల్లింపు రైతులకు అంతుపట్టేదీ కాదు, విదితమయ్యేదీ కాదు. రైతులకే కాక ఆచరణను దృష్టిలో పెట్టుకొని చూచేవారికి ఎవరికికూడ ఈ సిద్ధాంతాలు ఆచరణలో లాభదాయకాలు అవుతాయని విశ్వాసం కుదరదు. వ్యవసాయంలో నిత్యం పాల్గొని పనిచేసే వారు రైతులు; మనం చెపుతున్న సూత్రాలు ఆ రైతులకు వారి అనుభవాల దృష్ట్యా పరిశీలించినపుడు అర్థరహితంగా కనిపించిన పక్షంలో తమ సంప్రదాయక జీవితవిధానానికే అంటి పెట్టుకొని ఉండాలని భావించటానికి వారికి అన్ని విధాలైన నైతికపు హక్కులు ఉన్నవి గదా! సంప్రదాయక ఆర్థికసూత్రాల ననుసరించి అనుశృతంగా వస్తున్న భారీనిర్వహణవల్ల అధికలాభాలు వస్తాయన్న సూత్రాన్ని ప్రశ్నించి పరిశీలించగల స్థితిలో విద్యావేత్తలే లేరు.

అలాంటి పరిస్థితిలో అమాయకులైన సాధారణ రైతులు వారి సంప్రదాయాలనుంచి నమ్మకాలనుంచి బయట పడలేక పోయినా ఆశ్చర్య పడవలసిన అవసరం లేదు.

కాబట్టి తేలిన దేమంటే రైతులు తమంతతాముగా ఇష్టపూర్వకంగా తమభూములను కలిపి ఏకఖండంచేసిన ఉదాహరణ చరిత్రలో ఎక్కడా లేదు. ఒకవేళ భూములను కలిపి ఏకం చేసినప్పటికి అందువల్ల ఇవిగో ఈ ప్రయోజనాలు కలగగలవని, ఈ లాభాలు వస్తాయని నిర్దిష్టంగా చెప్పి రైతులను ఒప్పించగలగటం సహకారవ్యవసాయవాదులకు వీలుపడే పనికాదు. అంటే సహకారవ్యవసాయంవల్ల ఫలాన ప్రయోజనాలు వస్తాయని నిర్దిష్టంగా చెప్పలేము. ఇలాంటి పరిస్థితులలో రైతులు తమ భూములను తమంతతామె ఇష్టపూర్వకంగా ఏకఖండం చేయగలరని – అదికూడ దేశవ్యాప్తంగా జరగగలదని – మనం ఎలా అనుకోగలం? కాబట్టి దేశవ్యాప్తంగా ఈ పని జరగాలంటే పైవారు దీనికి నిర్బంధాలు విధించక తప్పదు.

III

రైతుల ఇష్టానిష్టాలతో నిమిత్తం లేకుండ వారి భూకమతాలను కలిపి ఏకఖండంగా చేయాలంటే రెండే మార్గాలున్నవి. మొదటిది నిర్బంధవిధానాలను అనుసరించటం. రెండవది ప్రభుత్వాశయాలకు విధానాలకు తలబగ్గటం తప్ప రైతుకి మరొకమార్గం లేకుండ చేసే టట్లుగా పరిస్థితులను కల్పించటం. ప్రధానమంత్రి నెహ్రూగారు ఈసహకార వ్యవసాయం రైతుల ఇష్టంతో మాత్రమే ప్రవేశపెట్టబడాలని నిర్వహించబడాలని పదేపదే చెపుతూ ఇలా అన్నారు. "మేము వ్యవసాయ సహకారసంఘాలను మాత్రమె ప్రోత్సహిస్తున్నాము కాని సమిష్టివ్యవసాయం గురించి ఆలోచించటం లేదు." * మన ప్రధాని ఇలా అంటున్నప్పటికి ఈ సహకారవ్యవసాయ సాధనలోని వీదో ఒకదశలో నిర్బంధవిధానాలను ప్రవేశపెట్టటం గురించి ప్రభుత్వం ఆలోచిస్తూనే

* As quoted by V. V. R. Sarma in, "The Future of the Small Farmer", P. 26

ఉన్నది. ఇదంతా సాంఘికప్రయోజనాల పేరుతో ప్రభుత్వం చేయనున్నది. కేంద్రప్రభుత్వంలో మంత్రిగా ఉన్న శ్రీ పి. యస్. దేశముఖ్ గారు 1958 వ సంవత్సరం ఏప్రియల్ నెలలో జరిగిన సహకార మహాసభలో చేసిన ఉపన్యాసంలోనుంచి ఈ క్రింద ఉదహరిస్తున్న వాక్యాలే ఇందుకు తార్కాణం.

"సహకారవ్యవస్థ నిర్మాణంలో ఐచ్ఛిక సహకారం గురించి విస్మరించరాదనటం సత్యమే; ఈ ఐచ్ఛిక సహకారం సహకారవ్యవస్థ నిర్మాణంలో చాల విలువైన దనటం కూడ వాస్తవమే. కాని మన సంఘంవంటి సంఘంలో ఈ ఐచ్ఛికత అనే దానికి భిన్నార్థం ఉన్నది. వ్యక్తుల ప్రయోజనాలను బట్టి కాక సాంఘిక ప్రయోజనాలను మనసులో ఉంచుకొని ప్రభుత్వం మన సంఘంలోని వ్యక్తుల జీవిత స్థితిగతులను, పనిపాటలను క్రమబద్ధం చేస్తుంటుంది." (ఇలాంటిసంఘంలో ఐచ్ఛిక సహకారం అనే దానికి మామూలు అర్థంకాక ఒక భిన్నార్థం విశేషార్థం ఉంటుందని దీని భావం.) ఈ పని చేయగల సామర్థ్యం మనకు ఉన్నదా? అసలు ఇలా చేయటానికి మనకు అధికారం ఉన్నదా? అనేది మన సమస్య.

కమ్యూనిస్టు దేశాలు ఈ పనిని చేయగలిగినవి కనుక మనం కూడ మన దేశంలో చేయగలం అనుకోవటం చాల పొరపాటు; ప్రజాస్వామ్యానికి నియంతృత్వానికి గల ప్రాథమిక సూత్రాలలోని భేదాలను గమనించనివారు, ఆ దేశాలలోని ప్రత్యేక పరిస్థితులను మన దేశంలోని స్థితిగతులను గ్రహించనివారు మాత్రమే అలా అనుకొనగలరు. దేశవ్యాప్తంగా సమిష్టివిధానాలను అనుసరిస్తున్న ఆ దేశాలు నియంతృత్వ విధానాలతో నడుస్తున్నవి; ఆ విధానాలలో స్వతంత్రమైన రైతాంగాన్ని అణచివేయటానికి ప్రభుత్వబలం ప్రయోగింపబడింది. అంతేకాక ఆయా చారిత్రిక స్థితిగతులనుబట్టి ఆ దేశాలు అనేకమైన రాజకీయపు ఎత్తుగడలతో, నిర్బంధ విధానాలతో బాధ్యతారహితంగా ప్రవర్తించి ఈ సమిష్టి విధానాలను ప్రవేశపెట్టటం జరిగింది. ఆ దేశాలలోని చారిత్రక స్థితిగతులలో మొదటి విషయం ఏమంటె అంతవరకు వ్యవసాయరంగంలో ప్రాబల్యంలోఉన్న పూజారి

వర్గాన్ని, కేపిటలిస్టువర్గాన్ని కూలదోచిన సాంఘిక ఆర్థిక విప్లవానంతరం వెంటనే ఈ సమిష్టి విధానాలకు ఆ ప్రభుత్వాలు పూనుకొన్నవి. విప్లవానికిముందు స్వతంత్రంగా బలపడగల అవకాశాలు రైతులకు లేవు; ఇంచుమించు రైతులందరు కూడ ఆ స్థితిలో సొంత భూములులేని వ్యావసాయక కూలీలతో సమానమైన స్థితిగతుల లోనే ఉంటుండే వారు. అంతేకాని ఆ రైతులను ఈనాటి మన దేశంలో మనం అనుకొంటున్న రైతులుగా భావించగల అవకాశం లేదు. ఆ పరిస్థితులలో సగం బానిసతనంలో మగ్గుతున్న రైతులు తమను దోపిడిచేస్తున్న వర్గాలపై విప్లవం సాగించారు; కాని దురదృష్టవశాత్తు సమిష్టివిధానమే పరమసిద్ధాంతంగా విశ్వసించిన నాయకత్వం క్రింద ఆ రైతులు విప్లవంలో పాల్గొనటం జరిగింది. ఈ విధంగా విప్లవానంతరం ఆ దేశాలలోని వ్యావసాయకరంగంలో ఒక అవ్యవస్థ ఏర్పడినట్లుగా మనకు విదిత మవుతున్నది.

ఆ దేశాలలోని ప్రజలందరు వారిని దోచుకొంటున్న జమీందారులను కూలద్రోయాలని కృతనిశ్చయులయ్యారు. అలా కూలద్రోయటానికి విప్లవమే శక్తివంతమైన విధాన మని వారందరు ఏకాభిప్రాయంతో దానిలో పాల్గొన్నారు. ఆ సందర్భంలో వారికి ఆ జమీందారీ వ్యవస్థను కూలద్రోయటంతప్ప మరొక ఆలోచనకే అవకాశం లేక పోయింది. వారు అనుసరిస్తున్న విధానాల మంచి చెడ్డలను గురించి ఆలోచనలో పడితే విప్లవవ్యతిరేకశక్తులు, అభ్యుదయ నిరోధక వర్గాలు బలపడి విప్లవం వీగిపోతుందేమోనన్న భయంతో ఆ రైతులు మరొక ఆలోచనకే అవకాశం కలిగించకుండ విప్లవంలో పాల్గొన్నారు. ఇలా విప్లవ సమయంలో పొడసూపిన జాతీయైక్యతను కృత్రిమంగా బలపరచాలన్న ఉద్దేశంతో దేశంలోని భూమినంతను కూడ విప్లవానంతరం వెంటనే రైతులకందరకు పంచివేయటం జరిగింది. ఇలాచేయటంలో మరొక ఎత్తుకూడ ఉన్నది. ఈ ఫనినల్ల ప్రజలకు నాయకత్వంలో విశ్వాసం ఏర్పడి తరువాత ప్రవేశపెట్టనున్న సమిష్టివిధానాలకుకూడ ప్రజలు గుడ్డిగా సహకరించగలరన్న ముందు చూపుతో ప్రథమంలో భూములను పంచిపెట్టారు. ఈ విప్లవాల పర్యవ

సానం అందరకు తెలిసినదే. జాతీయైక్యత, సోషలిజం అన్న పెద్దపెద్ద ఆదర్శాల పేరుతో రైతులను తప్పుడుమార్గంలోపెట్టారు. రైతులకు ఆర్థిక స్వాతంత్ర్యాన్ని ప్రసాదించగల ఉత్పత్తి సాధనమైన భూమిని రైతులు స్వేచ్ఛగా ప్రశాంతంగా అనుభవించగల అవకాశాలు లేకుండ చేశారు. మామూలుపరిస్థితులలో ఏమాత్రపు దాస్యానికికూడ తలవం చని ప్రజలు జాతికి ప్రమాదం వాటిల్లగల పరిస్థితి ఏర్పడినదని విశ్వసించిన ప్పుడు – లేదావారిని అలా విశ్వసింపచేసినప్పుడు – ఎంతకైనా సిద్ధ పడతారు; జాతికి ప్రమాదం ఏర్పడినది అన్న ముసుగులో ఏకపక్ష నియంతృత్వం ఉండటంచేత నాయకులకు రైతాంగాన్ని తప్పుడు దోవ తొక్కించటం చాలతేలిక. అధికారపక్షంవారు ఉపదేశపెట్టుతున్న ఏ విధానాన్ని గురించైన ఈ యీ కారణాలచేత ఇదిమంచి–ఇదిచెడు అని విమర్శించి వివరించి చెప్పగల అవకాశం ఎవరికి ఉండదు. అందుచేత విద్యావిజ్ఞానాలలో వెనుకబడిఉన్న అమాయకులైన రైతులను మోసంచేయటం నాయకులకు చాలతేలిక. అందులోను ఆ రైతులకు నాయకవర్గంమీద విశ్వాసం కుదిరేటట్లు చేసిన తరువాత మరీ తేలిక. కొంత కాలానికి రైతాంగం విజ్ఞానం సంపాదించి పరిస్థితులను గమనించినప్పటికి సర్వవిధాల బలపడిన ప్రభుత్వానికి ఈ రైతులను అణచివేయటం – అదీ రైతులకు సరైననాయకత్వం లేనప్పుడు అణచివేయటం – చాలతేలిక. ఈ విధంగా కమ్యూనిస్టుదేశాలు ప్రజలకు విప్లవం యెడ ఉన్న విశ్వాసాన్ని, గౌరవాన్ని ఆసరాగా తీసికొని వారినే అణగద్రొక్కటం సాధ్యమైంది. ఆ దేశాలలోని ఏకపక్షనాయకత్వం కారణంగా వారు ప్రజలను మోసం చేయగలిగారు. అన్నింటికి మించి ఆదేశాలలోని ప్రభుత్వాలు బలహీనంగా ఉన్నరైతాంగాన్ని నిర్బంధవిధానాలతో అణచివేసి పైకి రాకుండ చేయటం సాధ్యమైంది.

కాని ఆ తరువాత సంఘటనలు ఆదేశాలలోని ఈ విజయాలు కూడ తాత్కాలికమైనవే అని ఋజువుచేశాయి. ఈ విజయాలు ఎంతోకాలం నిలవలేకపోయినవి. ఈ అరహజమైన అభ్యుదయనిరోధక మైన విధానాలకు సహజశక్తులు అడ్డుపడినవి. పోలెండు, యుగోస్లావియా మొదలైన దేశాలలో సమిష్టిక్షేత్రాలను మళ్ళీ విడగొట్టాలని

ప్రస్తుతం జరుగుతున్న ప్రయత్నాలు రైతులపైన నిర్బంధాలు విధించటం, భూములపై సమిష్టి విధానాలను ప్రవేశపెట్టటం విఫలం కాక తప్పదని రుజువుచేస్తున్నవి. ఈ పరిణామాలను మనస్సులో ఉంచుకొని ఆలోచించినప్పుడు కమ్యూనిస్టు చైనాలో కూడ భవిష్యత్కాలంలో ఇది జరుగదని విశ్వసించటానికి కారణం కనిపించదు.

ఈ కమ్యూనిస్టుదేశాలలో తప్ప మరే ఇతరదేశంలోను కూడ దేశవ్యాప్తంగా భూములను ఇలా ఏక ఖండాలుగా చేయుట మన్నది ఐచ్ఛికంగాగాని, నిర్బంధ విధానాలద్వారాగాని జరిగినట్లు చరిత్రలో ఎక్కడ ఒక్క ఉదాహరణ కూడ లేదు.

మన సమస్య ఒకటి ఉన్నది. ఇలా భూములను ఏక ఖండంగా చేయటమన్నది నిర్బంధ విధానాల ద్వారానైనా సరే మనం చేయగలమా అన్నదే ఆ సమస్య. మన దేశంలోని చారిత్రక వాతావరణం, స్థితిగతులు, సంప్రదాయాలు, సంస్థలు కమ్యూనిస్టు దేశాలలోని విప్లవకారులలో ఉన్నట్లు లేవు. ఆ దేశాలలో విప్లవ కాలంలోఉన్న సంఘానికి నేటి మన సంఘానికి అనంత వ్యత్యాసాలు ఉన్నట్లు మన కందరకు తెలిసిన విషయమె. మొదటి విషయం ఏమంటె మన దేశంలోని జమీందారివ్యవస్థ రక్తపూరితమైన విప్లవాలతోకాక శాసనాల ద్వారానే అంతరించి పోయింది. దీని ఫలితంగా మన రైతులు బాగా అభివృద్ధి చెందారు. మన రైతులు తమ వ్యవస్థలోని విశిష్టగుణగణాలను పూర్తిగా అవగతం చేసికొన్నారు. తమ స్వయంకల్పిత వృత్తిని యాజమాన్యాన్ని విస్తరింపచేసికొని నిలదొక్కుకొన్నారు. మన పరిపాలనావ్యవస్థ ప్రజాస్వామికసూత్రబద్ధమైనది కావటంచేత మన ప్రభుత్వాధికారాలుకూడ అనవసరంగా, అరిష్టదాయకంగా పెరగటం కూడ జరగలేదు. అందుచేత మన ప్రభుత్వ నిర్ణయాలు, ఆ నిర్ణయాలను అమలు చేయటం మన దేశంలోని ప్రజాస్వామిక రాజకీయ నిర్మాణాన్నిబట్టి ఆధారపడి ఉండక తప్పదు. మనది ప్రజాస్వామికదేశం కావటంచేత ఇక్కడ అనేక రాజకీయపక్షాలున్నవి. అందుచేత ఏఒక్క రాజకీయపక్షమో పైనుంచి నిర్ణయించే ఏకపక్ష నాయకత్వానికికూడ ఇక్కడ అవకాశంలేదు. సహకార వ్యవసాయం గురించి ఇప్పటికే

నాయకులలో తీవ్రమైన చీలికలు ఏర్పడినవి. జాతీయ రైతాంగ వ్యవస్థ అయిన భారత కిసాన్ సమ్మేళనం సహకార వ్యవసాయ విధానానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉద్యమం లేవతీసింది. భారతీయ సహకారసంఘం (ఇండియన్ కోఆపరేటివ్ యూనియన్) కూడ ఎంతో ధైర్యంతో ముందుకువచ్చి "సహకార వ్యవసాయ విధానంపై కొన్ని విమర్శనాత్మక పరిశీలనలు" అన్న గ్రంథం వెలువరించింది. జాతీయ ప్రణాళికాసంఘంవారు 1956 వ సంవత్సరం జులై నెలలో చైనాలోని వ్యావసాయక సహకార సంఘాలను పరిశీలించటంకోసం చైనాపంపిన ప్రతినిధివర్గం భిన్నాభిప్రాయాలను వెల్లడించింది. ఆ సంఘంలోని సభ్యులలోని ఇరువురు ప్రధానసభ్యులు తమ అసంతృప్తిని, అనంగీకారాన్ని వ్యక్తం చేశారు. అఖిలభారత సహకార సమాఖ్యకు గౌరవ కార్యదర్శి అయిన బి. జె. పటేల్; బొంబాయి రాష్ట్ర సహకార సంఘాల రిజిస్ట్రారు యల్. యన్. రాణ ఐ. పి. ఎస్ గారలు ఈ ప్రతినిధివర్గంలో వెళ్ళి తమ అసంతృప్తిని వెల్లడించారు. దేశంలో అధికారంలో ఉన్న రాజకీయపక్షంలోనే ఈ సహకార వ్యవసాయవిధానం గురించి తీవ్రమైన భిన్నాభిప్రాయాలు ఉన్నవి. వీటి అన్నింటిని మించి ప్రభుత్వం తలపెట్టిన సహకార వ్యవసాయ విధానానికి తమ అసమ్మతిని సూచిస్తూ దేశంలోని రైతులు ఎన్నో సభలు, ఊరేగింపులు, ఆందోళనలు జరుపుతున్నారు. పరిస్థితులు ఇలా ఉండటంచేత సహకార వ్యవసాయాన్ని ప్రవేశపెట్టటంకోసం నిర్బంధ విధానాలకు పూనుకొనటానికి మన దేశంలో ఎలాంటి అవకాశాలు ఉండరాదని గట్టిగా చెప్పవచ్చు. అలాకాక రైతులపై తన నిర్ణయాలను శాసనాలను రుద్దగలం అనుకొనటం పొరపాటు; మన సంఘంలో రైతులకు ఉన్న బలాన్ని, సాంఘిక రాజకీయ శక్తులను విస్మరించినవారే అలా అనుకొనగలరు.

IV

ఏదో ఒక విధంగా ప్రయత్నించి రైతులకు ఇష్టం లేకుండా భూములను ఏక ఖండాలుగా చేయగలిగామే అని అనుకొందాం. ఇలాంటి మార్పువల్ల రాగల ఆర్థికమైన మార్పులు ఏమిటి? ప్రయో

జనా లేమిటి? రైతుల ఇష్టా నిష్టాలతో సంబంధంలేకుండ భూములను ఏకం చేసి ఏకఖండాలను తయారు చేసినంతమాత్రాన సహకార వ్యవసాయం వల్ల రాగలవని చెప్పబడుతున్న ఆర్థికలాభాలన్నీ నిజంగా వస్తాయా?

ఇలా చేయగలిగిన పక్షంలో ఆశించిన ఆర్థిక లాభాలు తప్పక రాగలవని మన ప్రణాళికాకారులు విశ్వసిస్తున్నారు. ఈ నిశ్వాసానికి ఈ క్రింది రెండు అపోహలు ఆధారం.

1. తమ తమ సొంతభూములను ఏకం చేసి సహకార వ్యవసాయంలో సభ్యులుగా చేరిన రైతులు వ్యవసాయ కార్యకలాపాలలో పెనుకటివలెనే శ్రద్ధతీసుకొంటారని, సొంతసేద్యంలో వలెనే ఉత్సాహ ప్రోత్సాహాలు ప్రదర్శిస్తారని అనుకొంటున్నారు.

2. సహకార వ్యవసాయ సంఘంలో సభ్యులుగా చేరిన సొంత భూములు లేని వ్యవసాయకూలీలు కూడ సొంతభూములున్న రైతుల వలె అంతటి ఉత్సాహాన్ని శ్రద్ధను ప్రదర్శిస్తారని, ఈ విధానంవల్ల భూమి ఉమ్మడి ఆస్తి కావటంచేత బహుశా రైతులకంటె కూడ ఎక్కువ కార్యోత్సాహం ప్రదర్శించవచ్చునని మన ప్రణాళికా కారుల భావన.

మన ప్రణాళికాకారుల ఈ భావాలు, విశ్వాసాలు ఎంతవరకు వాస్తవమో పరిశీలిద్దాం. ఒక వేళ వారి ఆశలు నిరాధారపూరితమైన పక్షంలో ఇలా బలవంతంగా సహకార వ్యవసాయం ప్రవేశపెట్టినందు వల్ల రాగల ఫలితాలేమిటో పరిశీలిద్దాం.

మన దేశంలో ప్రస్తుతం ఉన్న వ్యవసాయకమతాలలో యజమానులే సొంతంగా సాగుచేసికొనే సొంతకమతాలే చాల ఎక్కువగా ఉన్నవి; రైతులు ఇలా సొంతసేద్యంచేసికొనే కమతాలు మొత్తం భూకమతాలలో నూటికి 64 ఉన్నవి. సహకార వ్యవసాయ సంఘంలో సభ్యులుగా చేరి దాని క్రింద ఉద్యోగులుగా పనిచేయటం గురించి ఈ అధిక సంఖ్యాకులైన రైతులు ఎలా భావిస్తారు? సహకార వ్యవసాయంవల్ల వీరిపై ప్రసరించగల ఫలితాలు ఏమిటి? ఈ రైతులు

సహకార వ్యవసాయంలో కూడ ఈనాడు ప్రదర్శిస్తున్న వ్యక్తిగత శ్రద్ధ కార్యోత్సాహం ప్రదర్శించి గట్టిగా మనస్ఫూర్తిగా చేస్తారా?

ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పేటప్పుడు ఈనాటి వాస్తవిక పరిస్థితులను, రైతుల మనోభావాలను గమనించవలసిఉంటుంది. అంతే కాని తార్కికంగా చర్చించి ఈ ప్రశ్నలకు సమాధానం నిప్పన్నం చేస్తా మనటం లాభం లేదు. జీతభత్యాలకు పనిచేసే శ్రామికులకంటె తన సొంత భూమిపైన రైతు ఎక్కువ శ్రద్ధతో ఎక్కువసేపు పొలంలో పాటుపడటానికి అందరు అంగీకరించిన విషయమె. ఈ పాటుపడటంలో తన శ్రమకు తగిన ప్రతిఫలం తానుచేస్తున్న పని వలన వస్తున్నదా లేదా అనే ఆలోచనకూడ లేకుండానే చేస్తాడని అందరకు తెలిసిన విషయమె. రైతు ఇంత ఎక్కువగా, ఇంత శ్రద్ధతో పనిపాటలు నిర్వర్తించటానికి అతనికి ఉత్సాహం ఎక్కడినుంచి వస్తున్నది? ఈ ఉత్సాహానికి కారణం భూమిమీద రైతుకి యాజమాన్యపు హక్కులుండటమే; యాజమాన్యపు హక్కులంటే కేవలం చట్టరీత్యా తనకున్న హక్కులు కాక, ఆ భూమిపై పాటుపడటంలో అతనికున్న స్వేచ్ఛ, ఆ భూమివల్ల లభిస్తున్న స్వయంకల్పితవృత్తి అని అర్థం చేసి కోవలసి ఉంటుంది. సొంత యాజమాన్యంవల్ల ఆర్థిక స్వాతంత్ర్యం వల్ల, స్వయం కల్పిత వృత్తివల్ల రైతుకి మానసికంగా లభిస్తున్న శక్తివల్లనే అతడు నిర్విరామంగా కృషిచేయ గలుగుతున్నాడు; తన పనికి ఎంత ప్రతిఫలం వస్తున్నది అనే ఆలోచన లేకుండానే పాటుపడగలుగు తున్నాడు. ఈ మానసికశక్తి ఉత్సాహం లేని పక్షంలో ఇలా పనిచేయటం సాధ్యపడదు; అప్పుడు అతడు చేస్తున్న ప్రతిపనికి ఆర్థిక లాభాలు చూపించవలసి ఉంటుంది. ఈ మానసిక శక్త్యుత్సాహాల వల్లనే దినభత్యపు కూలీలకంటె రైతు ఉన్నత స్థానాన్ని సంతృప్తిని పొందగలుగుతున్నాడు. ఆర్థిక లాభాలపై దృష్టిలేకుండానే మన సరదాలలో పాల్గొని మనం ఎంతటి ఉత్సాహాన్ని, నైతిక బలాన్ని, సంతృప్తిని పొందగలమో రైతు తన సొంత సేద్యంలో అంతగా వీటిని పొందగలుగుతున్నాడు. అందు చేతనే వ్యవసాయ కూలీలకంటె ఉన్నతమైన సంతృప్తితో శ్రమించ

గలుగుతున్నాడు. అంటే రైతుకి తన కృషివల్ల ఆర్థికలాభాలు రాక పోయినప్పటికి దానికి బదులుగా ఈ ఆర్థికేతర ప్రయోజనాలు అతనికి సిద్ధిస్తున్న వన్నమాట; సరదాలలో పాల్గొనటం వల్ల వ్యక్తికి లభించ గల సంతృప్తి, సంతోషం రైతుకి ఈ విధంగా లభిస్తున్నవన్న మాట. రైతులకు వ్యవసాయకృషిలో ఇలాంటి సహజమైన ఆర్థికేతర ప్రయోజనాలు సిద్ధించకుండ చేసిన పక్షంలో పనిపాటలలో పాల్గొనటానికి కార్యోత్సాహం ఉండదు. ఆ కార్యోత్సాహం వారిలో కలిగించాలంటే వారు చేయుగల ప్రతిపనికి ఆర్థికలాభాలు కనపడుతు ఉండాలి. వారు శ్రమిస్తున్న ప్రతి ఒక్క గంటకు వారికి శ్రమకు మించిన లాభం ముట్టేటట్టుగా ఉండాలి. పనిపాటలలో రైతులకు సహజమైన శ్రద్ధ, ఉత్సాహం లోపించిన తరువాత ఈ స్థితి తప్పదు. ఎక్కువగా పని చేయటానికి ఇది తప్ప మరొక మార్గం ఉండదు.

మరొక విషయం ఏమంటే రైతులు ఎంతో కాలంనుంచి స్వయం కల్పితవృత్తి గౌరవాన్ని అనుభవిస్తూ రైతాంగ యాజమాన్య విధానంవల్ల లభించే ఇతరమైన స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను కూడ పొందుతున్నారు. మన రైతులు వీటి అన్నింటికి అలవాటు పడ్డవారు. సహకార వ్యవసాయంవల్ల ఇప్పుడు కొత్తగా వారు ఆ సంఘంయొక్క నిర్వాహకవర్గానికి లోబడి, నిర్వాహకవర్గం చెప్పుచేతులకు నియమ నిబంధనలకు అంగీకరించి పనిచేయవలసి ఉంటుంది. ఇదివరలో అనుభవిస్తున్న స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లేకపోగా ఈ బానిసతనం కూడ వారికి తప్పదు. భూములను ఏకం చేసి సహకార వ్యవసాయం సాగించటం అంటే భూములతోపాటు ఇతర సాధన సంపత్తులను వ్యవసాయ వేద్యాన్నికూడ ఆ సంఘానికి అప్పగింత పెట్టక తప్పదు. సహకార పరిశ్రమలలో అయినపక్షంలో కేవలం ధనాన్నో లేక యంత్రాలనో సహకారసంఘపరంచేస్తే సరిపోతుంది కాని సహకార వ్యవసాయంలో వ్యవసాయవేద్యానికి ప్రధానావశ్యకమైన మానవకృషిని కూడ సహకారసంఘపరం చేయవలసి ఉంటుంది. కాబట్టి సహకార వ్యవసాయం వచ్చినపుడు రైతులు ఇతరుల అదుపు ఆజ్ఞలలో పనిచేయవలసిన స్థితి తప్పదు. కనీసపు జీవితావశ్యకాలతో బ్రతుకు వెళ్ళబుచ్చుతున్న వారు

కూడ స్వయంకల్పితవృత్తిగౌరవం, దానివల్ల లభించే ఆర్థికేతరప్రయోజనాలు ఎంతగానో అవగతం చేసికొన్నారు; వీటినే వారు కోరుకొంటూరానటం కూడ నిస్సందేహమే. సొంతభూములు లేని వ్యవసాయకూలీలలోకూడ ఇదేవిషయం కనపడుతుంది. మా పరిశీలనలో మాకు ఈ విషయం స్పష్టంగా గోచరించింది. వ్యవసాయకూలీలు సాంవత్సరికపు పాలేరులుగా ఉండే దినభత్యపు కూలీలుగా ఉండేకంటె వారికి అధికాదాయం వస్తున్నది. అయినప్పటికి వారు పాలేరులుగా ఉండేకంటే రోజువారికూలీలుగా ఉండటానికే అభిలషిస్తున్నారు. మేముపరిశీలించిన ప్రాంతంలోని కొలుదారులలో కూడ ఇదే ధోరణి కనిపించింది. సొంతభూములులేని వ్యవసాయకూలీలు పెద్ద రైతులనుంచి చిన్నచిన్న భూఖండాలను కౌలుకి తీసికొని సొంతంగా జీవించటానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. వాస్తవానికి ఈ చిన్న చిన్న కౌలుభూముల మీద వారికి వచ్చే ఆదాయంకంటె ఏ రైతు దగ్గరైనా పాలేరుగా ఉంటేనే అధికాదాయం వస్తుంది. అయినా వారు ఈ కౌలు విధానానికే మొగ్గుచూపుతున్నారు. ఈ కౌలుభూములు వారిసొంతం కాకపోయినప్పటికి కౌలు సేద్యంవల్ల వీరికి స్వయం కల్పిత వృత్తి గౌరవం లభిస్తున్నది. వారి పనిపాటలలో వారికి స్వేచ్ఛఉంటున్నది. స్వయంగా కొన్ని నిర్ణయాలు తీసికొని తదనుగుణంగా సాహసోపేతంగా కృషి చేయగల అవకాశం వీరికి లభిస్తున్నది. దీని అర్థమేమిటి? సొంతభూమి లేని వ్యవసాయకూలీకూడ స్వయం కల్పిత వృత్తి గౌరవాన్ని స్థితిని సంతోషాన్ని పొందటం కోసం కొంత నష్టానికికూడ సిద్ధపడుతున్నాడన్నమాట.

సొంతభూములులేని వారు సైతం ఈ స్వయంకల్పితవృత్తికోసం, తద్వారా లభించగల నిర్వహణాధిపత్యం కోసం కొంతనష్టానికైనా అంగీకరించి ఇంత ఆసక్తి ప్రదర్శిస్తున్నారు కదా! అయినప్పుడు వీటిని ఎంతోకాలంనుంచి అనుభవిస్తూ, ఆ ఆనందానికి అలవాటుపడ్డ రైతులకు సొంతయాజమాన్యంపై ఎంతటిమక్కువ ఉంటుందో వేరే చెప్పవలెనా? ఇట్టి ఆర్థికేతర ప్రయోజనాలన్నీ మృగ్యం కావటమేకాక నిర్వాహకవర్గాధికార దాస్యంతో పనిచేయవలసి వచ్చినప్పుడు దీనివల్ల

రైతులుచేసే పనిపాటలపై ఎట్టిపరిణామాలు, ఫలితాలుకలుగుతాయో తేలికగా ఊహించుకొనవచ్చు. సొంతయాజమాన్య విధానంలో చేసినంతపనిని, అంతఉత్తమంగా సహకారవ్యవసాయంలో రైతులు చేయరు, చేయలేరు అని ఈ అనుభవాలనుబట్టి గట్టిగా చెప్పవచ్చు. వ్యావసాయకసేద్యం కాయకష్టంతో చేయవలసి ఉండటంచేత రైతుల పనిపాటలు, ఆ పని విలువ సహకారవ్యవసాయంలో తగ్గిపోవటం తథ్యం. సహకారవ్యవసాయంవల్ల తమ భూముల వాటాలకుగాను వచ్చేరాబడి కుటుంబవ్యవసాయానికి సరిపోయే రైతులు ఆవిధానంలో అసలు పనే చేయరు. మిగిలినవారికి పనిచేస్తే తప్ప గడనదు కనుక చేస్తారు. కాని ఆ పనిలోవారికి శ్రద్ధ, ఉత్సాహం మాత్రం ఉండవు.

ఈ విధంగా రైతులకు పనిఅంటే ఉత్సాహం నశించిపోయిన ఫలితంగా వ్యక్తిగత శ్రద్ధకూడ ఉండదు; అందుచేత తాను చేస్తున్న పనికి ప్రతిఫలంగా ఎంతడబ్బు ముట్టుతుంది అన్న ఆలోచనతోనే రైతు పనిచేస్తాడు. ఆర్థికలాభం ఆశించినంతగా లేనప్పుడు మానివేస్తాడు. రైతులు సొంతవ్యవసాయంలో చేసినంత ఎక్కువపని చేయాలంటే వారికి అధికమైన వేతనాలు చెల్లించి ఆకర్షించవలసి ఉంటుంది. ఆర్థికేతరమైన ప్రయోజనాలు మృగ్యమైన తరువాత రైతు ఆర్థికలాభం మీదనే దృష్టిని కేంద్రీకరించటం సహజం కనుక నానాటికి అధికవేతనాలు చెల్లిస్తుంటే తప్ప సహకారవ్యవసాయంలో ప్రజలు బాగాపనులు చేయరు. ఇలాచేస్తూ పోతే ఉత్పత్తి కోసమైన వ్యయంకూడ పెరగక తప్పదు. అయినా నానాటికి అధికవేతనాలు ఇస్తూ ఎంతకాలం పనివారిని సంతృప్తి పరచగలం? ఇలా ఎంతవరకు అధికవేతనాలు ఇయ్యగలం? కనుక ఏదో ఒకదశకు వచ్చిన తరువాత ఇక అంతకుమించి అధికవేతనాలు ఇయ్యలేనిస్థితి తప్పదు. దానితో పనివారిని ఆకర్షించే మార్గం ఆగిపోతుంది; ఇక అప్పుడు ఉత్పత్తులు పడిపోవటం సహజం. సహకారవ్యవసాయ విధానంలో పనివారిని ఆకర్షించేటట్లుగా ఎప్పటికప్పుడు అధికవేతనాలు ఇయ్యలేము; రైతుస్వామ్యంలోవలె పనివారికి వ్యక్తిగతశ్రద్ధ, కార్యోత్సాహం ఉండవు. అందుచేత మానవశ్రమ

పైపైనే ప్రధానంగా ఆధారపడిఉన్న మనవ్యవసాయంలో ప్రతిఎకరాకు వచ్చే సగటు ఉత్పత్తులు దిగజారిపోయే అవకాశం ఉన్నది.

ఇక ఇప్పుడు రెండవ అంశానికి వద్దాం. భూములపై సొంత యాజమాన్యం కోల్పోయి నిరాశపడి పనిపాటలలో ఉత్సాహం, శ్రద్ధ నశించి రైతులవల్ల వ్యవసాయరంగంలో రాగల నష్టాలను సహకార వ్యవసాయంలో చేరిన వ్యవసాయకూలీలు పూడ్చగలరా? రైతులు కోల్పోయిన కార్యోత్సాహం వ్యవసాయ కూలీలు తీర్చగలరా? సహకారవ్యవసాయంలో భూములున్న రైతులు ఇలా నిరుత్సాహపడటం వల్ల సంఘానికి రాగల అరిష్టాలు చాల ఉన్నవి గదా! వ్యవసాయ కూలీలు ఈ అరిష్టాలను తీర్చగలరా? రైతుస్వామ్యాన్ని రద్దు చేసి సహకారవ్యవసాయానికి మారటం లాభదాయకమే అని ఈవ్యవసాయ కూలీల నూతనోత్సాహాన్ని బట్టి చెప్పగలమా? సహకార వ్యవసాయం వచ్చిన తరువాత భూములు వ్యక్తిగత ఆస్తులుగా కాక సర్వుల ఆస్తిగా ఉంటాయి. కనుక ప్రస్తుతం భూములున్నవారికి లేని వారికి మధ్యఉన్న అంతరాలు నశించిపోతాయనీ, తత్ఫలితంగా వ్యవసాయకూలీలు ఎక్కువ శ్రద్ధాసక్తులతో కార్యోత్సాహంతో సొంత భూములున్న రైతులవలె కష్టపడి పనిచేయగలరనీ అనుకోబడుతున్నది.

కాని ఈ అనుకోవటం ఆశావాదమే తప్ప వాస్తవిక పరిస్థితులను గమనించి అనుకోవటం కాదు. దీనికి కారణం ఉన్నది. ప్రస్తుత వ్యవస్థలో రైతులకు శ్రద్ధాసక్తులు కార్యోత్సాహం ఉండటానికి కారణం ఇతరులకు భూమిలేకుండ తమకు మాత్రమె ఉండటం కాదు. సొంతభూముల మూలంగా రైతులకు లభిస్తున్న స్వయం కల్పితవృత్తి, స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు తాముగా స్వతంత్రంగా నిర్ణయాలు తీసికొని అమలుచేయగల అవకాశాలు లభిస్తుండటం చేతనే రైతులు తమపనికి తగిన ఆర్థికలాభాలునచ్చినా రాకపోయినా వ్యక్తిగత శ్రద్ధను ప్రదర్శించి కార్యోత్సాహంతో వ్యవసాయంలో పాల్గొంటున్నారు. కాబట్టి వ్యవసాయకూలీలకు కూడ ఇవి ఉన్నప్పుడే కార్యోత్సాహం, వ్యక్తిగతశ్రద్ధ ఉంటాయి. కాని సహకారవ్యవసాయంవల్ల

వీరికి ఈ స్వయంకల్పితవృత్తి, యాజమాన్యాధికారం లభించవనేది అందరకు తెలిసిన విషయమె. సహకారవ్యవసాయంలో కూడ వీరు దినభత్యంతోనే పనిచేయవలసి ఉంటుంది; మరొకరికి లోబడి పరుల ఆజ్ఞలతో డబ్బుకోసమై తమ కాయకష్టం అమ్ముకోవలసి ఉంటుంది. ఆ అధికారి పేరు మారటం తప్ప ఈ నూతన విధానంలో వీరికి ఒరిగేది ఏమీ ఉండదు. ఉమ్మడి ఆస్తి అనేది సిద్ధాంతరీత్యా చూచినపుడు ప్రతిఒక్కరి ఆస్తి అని చెప్పినప్పటికి వాస్తవానికి అది ఎవరి ఆస్తి కాదన్నట్లు ప్రవర్తించటం అనుభవగోచరమే గదా! ఒకవ్యక్తి డబ్బు కోసమై పనిచేస్తున్నంతకాలం ఆ ఆస్తి వ్యక్తులదైనా లేక ఉమ్మడి ఆస్తి అయినా ఆ విషయం ఆ వ్యక్తికి పట్టదు. కేవలం భూస్వామ్య మనస్తత్వంతో తన ఇష్టానిష్టాలతో అదేమని అనేవాళ్లు లేకుండా సంచరించే జమీందారు దగ్గర పనిచేయటంలోను కొన్ని నియమ నిబంధనలను అనుసరించి ప్రవర్తించె ప్రభుత్వోద్యోగి క్రింద పనిచేయటంలోను చాలభేదం ఉన్నదనటం సత్యమే. ఈ ప్రభుత్వోద్యోగిక్రింద పనిచేసే వారికి కొన్ని రక్షణలు లభిస్తాయనటం కూడ వాస్తవమే. తనమూలే శాసనంగా చెల్లుబడి అయ్యే ప్రభుత్వ నియంత్రాధికారికి లొంగి పనిచేయటంలోను సొంతసేవ్యం చేసికొంటున్న రైతు సూచనలననుసరించి పనిచేయటంలోను ఈ భేదమే ఉంటుంది. నియంత్రాధికారులు పనివారిని ఎంతగా దోచుకోవాలన్నా అడ్డేవారుండరు. కాని సొంతసేవ్యం చేసికొనే చిన్నచిన్న రైతులకు అలాదోపిడిచేయటానికి అవకాశం ఉండదు. ఆస్తి ఉమ్మడిగాఉన్నా లేక వ్యక్తిగతంగా ఉన్నా పైనఅనుకొన్న నియంత్రత్వ విధానాలకు లోబడి పనిచేస్తున్న వారికి మరొకపద్ధతి ఏది వచ్చినప్పటికి వారిపరిస్థితులను కొంత చక్కబఱచవచ్చు; ఆ నియంత్రత్వం తగ్గటం చేత పనిపాటలలో శ్రద్ధ, ఉత్సాహం కలగవచ్చు; కాని ఈ శ్రద్ధ ఉత్సాహం సహజమైనవి కావు. నియంత్రత్వం తగ్గినదన్న సంతోషం తప్ప స్వయం వ్యక్తీకరణకు అవకాశాలుండవు అందుచేత ఇలా కలిగే ఉత్సాహ ప్రోత్సాహాలు తాత్కాలికాలు మాత్రమే. మనదేశంలోని రైతులకు ప్రస్తుతం ఉన్న ఉత్సాహ ప్రోత్సాహాలకు వీటికి పోలికే ఉండదు. మనం పోల్చి చూడవలసినది ఇదికాదు; మరొక విషయం ఉన్నది. వ్యక్తిక రంగంలోను, ప్రభుత్వ

రంగంలోను కూడ వ్యవసాయ కూలీలకు ఒకే విధంగా కనీసపు భద్రతలు, పనిని గురించిన నియమాలు ఉన్నవని అనుకొందాం. అలాంటి భద్రతలు, నియమాలు ఉన్నప్పుడు వ్యక్తిక రంగంలోను ప్రభుత్వ రంగంలోను లభించగల ఉత్సాహ ప్రోత్సాహాలను పోల్చిచూడవలసి ఉన్నది. ప్రభుత్వం క్రింద పనిచేస్తున్నవారు మనకు చాలమంది ఉన్నారు; పైగా వీరిసంఖ్య దినదినం పెరిగిపోతూనే ఉన్నది. అయినప్పటికి వీరి సామర్థ్యంలోగాని, పనిలోగాని పెంపుదల కనిపించటం లేదు, ఉత్తమంగా పనిని నిర్వహించటం మృగ్యంగానే ఉన్నది. కాని ఇది అన్ని సందర్భాలకు, అందరకు వర్తిస్తుందని మాభావం కాదు. కొన్ని కొన్ని సందర్భాలలో అభివృద్ధి, సామర్థ్యం కనపడుతున్నవి. కాబట్టి చేసేపనిలో ఉత్సాహప్రోత్సాహాలు లభించటం అనేది ఆయా పనుల నియమ నిబంధనలమీద పనివారిని జాగ్రత్తగా ఆదరించటం మీద ఆధారపడి ఉంటుంది. అంతేకాని వ్యక్తికరంగాన్ని బట్టి, ప్రభుత్వరంగాన్నిబట్టి మాత్రం ఈ ఉత్సాహ ప్రోత్సాహాలు రావు. వ్యక్తికరంగంలో కూడ వ్యవసాయకూలీకి ఉత్సాహప్రోత్సాహాలు ఉంటున్నవి. దీనికి కారణం అతని యజమానికూడ అతనితోపాటు కలిసి మెలిసి పనిచేస్తూ అతని అవసరాలను కనిపెట్టి ఆదరిస్తూ ఉండటమే. సొంతనేద్యం చేసికొనే రైతు ఒకరిద్దరు పాలేరులతోనే వ్యవసాయం నిర్వహిస్తుండటంచేత వ్యవసాయ కూలీలను ఇలా ఆదరించటం సాధ్యమవుతున్నది. భారీనిర్వహణలతో నడిచే పరిశ్రమలలో ఇలాంటి సంబంధానికి అవకాశం ఉండదు. కాబట్టి భూములను సహకార వ్యవసాయసంఘపరం చేసినంతమాత్రాన, లేదా ప్రభుత్వ పరం చేసినంత మాత్రాన వ్యవసాయ కూలీలకు పనిపాటల ఎడల ఉత్సాహ ప్రోత్సాహాలు పెరగవు. అందుచేత సహకార వ్యవసాయం వచ్చిన తరువాత వ్యవసాయ కూలీలకు ఒక్క మానసిక సంతృప్తి మాత్రం ఉండవచ్చు. రైతులకుకూడ స్వయంకల్పితవృత్తి ఊడి, వారుకూడ వీరిలో కలిశారన్న సంతృప్తి మాత్రం కలిగితే కలగవచ్చు. కాని ఇది సహజమైన సంతృప్తికాదు; ఎంతోకాలం నిలిచేది కూడ కాదు. అయినప్పటికి మరొకరి నష్టం చూచినందువల్ల కలిగే సంతోషంతో అధికంగాను, సమర్థవంతంగాను పనిపాటలు చేయటం ఎక్కడా జరగదు.

అసలు ఇలా ఒకరి నష్టానికి సంతోషపడటం అనేగుణం ప్రోత్సహించ వలసినది కాదు.

సహకారవ్యవసాయంలో వ్యవసాయకూలీలకు అధికవేతనాలు ఆర్థికలాభాలు లభించటం కూడ జరగదు. గత అధ్యాయాలలో మనం పరిశీలించిన దానినిబట్టి మధ్యరకపు భూకమతాలవరకు ఉన్నభూకమ తాలలో ఆ యా కుటుంబ సభ్యుల శ్రమకు కూడ వేతనాలు ఇచ్చి నప్పుడు ఉత్పత్తిదారుల మిగులు అంతగా ఉండదని తేలినది. గరిష్ఠ పరిమితులు నిర్ణయించి అమలు పరచటంవల్ల పెద్దపెద్ద భూకమతాలు ఉండబోవటం లేదుగదా! భూకమతాల విస్తీర్ణంలోని వ్యత్యాసాలను తగ్గించి ఇంచుమించు సమాన విస్తీర్ణంగల భూకమతాలను ఏర్పరచిన తరువాత ప్రస్తుతం భూమిమీద ఉన్న ఒత్తిడి ఇలాగే ఉండి ప్రతి ఎక రాకు సగటు ఉత్పత్తికూడ పెరగని పక్షంలో వ్యవసాయ కూలీల సగటు ఆదాయం పెరిగే అవకాశం మాత్రం ఉండదు. సహకార వ్యవసాయంలో కంటె రైతాంగపు వ్యక్తికేద్యంలోనే ఉత్పత్తి అధికంగా లభిస్తుందని మనం గత అధ్యాయాలలో తేల్చుకొన్నాం. అందుచేత వ్యవసాయ ఆదాయాలపై ఆధిపత్యం వహించటంలో కొత్త విధానం—అదీ అధికవ్యయంతో కూడిన విధానం— వచ్చినంత మాత్రం చేతనే వ్యవసాయ కూలీలకు అధికవేతనాలు లభిస్తాయను కోవటం పొరపాటు; వ్యవసాయ స్థితిగతులను సరిగా అర్థంచేసికొనలేని వారు మాత్రమే అలా భావించగలరు. వీరి వేతనాలు పెరగకపోగా ఇప్పటికంటె తగ్గిపోయే అవకాశం కూడ ఉన్నది. దానికి ఈ క్రింది రెండు హేతువులే కారణం. మొదటిదేమంటె ఇప్పటివరకు వ్యవసాయ కూలీల వేతనాల క్రింద రైతుల ఆదాయాలక్రింద పోతున్న ధనంలో చాలభాగం పరిపాలనావ్యయం క్రిందికి పోతుంది. సహకారవ్యవసాయం అనగానే ఎవరెన్ని చెప్పినా ఎంతోమంది సూపర్‌వైజర్లు, మేనేజర్లు, ఆడిటర్లు, అకౌంటెంట్లు ఉండక తప్పదు. వీరందరికి జీతాలు ఇయ్యనవల సినది సహకారవ్యవసాయ సంఘమె. మధ్యతరగతి రైతులకు వస్తున్న ఆదాయం కంటె వీరిలో ప్రతి ఒక్కరికి అధికవేతనాలు చెల్లించవలసి ఉంటుంది. మన సహజ వ్యవసాయ నిర్వహణ విధానాన్ని—అంటె రైతు

సేద్యాన్ని - మార్చి కృత్రిమమైన వ్యవసాయనిర్వహణను – అంటే సహకారవ్యవసాయాన్ని–ప్రవేశపెట్టినప్పుడు ఈ అదనపు ఖర్చుల నన్నింటిని భరించక తప్పదు. రష్యా సమిష్టి వ్యవసాయ విధానంలోని వ్యవసాయపు ఖర్చులలో మూటికి 41 వంతులు పరిపాలనా వ్యయం క్రిందనే ఖర్చు అవుతున్నట్లు తెలియ వస్తున్నది. ఇక రెండవ కారణం కూడ చూద్దాం. ఆదాయాలు పడిపోవటంచేత, ఖర్చులు పెరిగిపోవటంచేత సహకార వ్యవసాయసంఘం తనకు కావలసిన పెట్టుబడులను తానే సేకరించుకోనవలసి ఉంటుంది. సహకార వ్యవసాయసంఘం ఆదాయాలను నిలవ చేసికోవాలంటే దానికి ఉన్న మార్గం వ్యవసాయోత్పత్తులను నిలవచేసి కొనటం మాత్రమే. అంటే పండిన పంటలో కొంత భాగాన్ని రైతులకు కూలీలకు అందకుండ దాచుకోవాలన్నమాట. అలా దాచినపుడు ఆ మేరకు కూలీల వేతనాలు, రైతుల ఆదాయాలు పడిపోవటం సహజం. కాబట్టి పరిపాలనావ్యయం పెరగటంచేత, బలవంతంగా ధాన్యాదులను కూడబెట్టుకొనటంచేత సహకార వ్యవసాయసంఘం తన కూలీలకు అధిక వేతనాలు ఇయ్యటం సాధ్యపడదు. అందుచేత ఏ దృష్ట్యా పరిశీలించినప్పటికి వ్యవసాయ కూలీలకు సహకార వ్యవసాయంలో అదనంగా ఆర్థిక లాభాలు ఉండే అవకాశం ఏ మాత్రం ఉండదు.

కాబట్టి సహకార వ్యవసాయక్షేత్రంలో పనిచేసే రైతులమీద వ్యవసాయ కూలీల మీద పరోక్షంగా ప్రసరించే ఫలితాలేమంటే ఉత్పత్తుల కయ్యేవ్యయం పెరగనప్పుడు ఉత్పత్తి తగ్గిపోవటమో లేక ఉత్పత్తుల తగ్గకుండ ఉండాలంటే పూర్వంకంటే ఎక్కువఖర్చులు కావటమో జరుగుతుంది; కొన్ని కొన్ని సందర్భాలలో రెండు కూడ జరగవచ్చు. ప్రస్తుతం అవుతున్న ఖర్చుతో సహకారవ్యవసాయం సాగదు; దానిలో ఖర్చులు పెరగక తప్పదు. సహకార వ్యవసాయంలో పనిచేసే వారికి సొంతరైతులకు తమ భూములమీద పనిచేసి కొంటున్నప్పుడు ఉన్నంత వ్యక్తిగత శ్రద్ధ, కార్యోత్సాహం ఉండవు; అంత ఎక్కువగా పని కూడ చేయలేరు. అందుచేత వ్యవసాయోత్పత్తి తగ్గిపోతుంది. ఉత్పత్తి పడిపోవటానికి మనం అంగీకరించని పక్షంలో ఖర్చులు పెరిగిపోతవి. వ్యవసాయ కూలీలు రైతులు ఇప్పటివలె వ్యక్తిగత శ్రద్ధవల్ల

కాక వేతనాలకోసమే పనిచేయటంచేత నియమితకాలానికి మించి ఒక నిముసం కూడ ఎక్కువ పనిచేయరు; పైగా నిర్వహణకు పరిపాలనకు అదనంగా ప్రస్తుతం లేని వ్యయంకూడ అవుతుంది. అందుచేత ప్రస్తుత వ్యయానికి సహకార వ్యవసాయంలో ఇప్పుడు వస్తున్నంత ఉత్పత్తి రాదు. ఉత్పత్తి నిలబడాలంటే ఖర్చు పెరుగుతుంది. ఖర్చులు ఇలా పెరిగిపోవటంచేత సహకార వ్యవసాయంలో కూలీలను ఎక్కువమందిని వినియోగించుకొనటానికి, ఎక్కువగా మానవశ్రమపై ఆధారపడటానికి అవకాశం ఉండదు. కాబట్టి సిద్ధాంతరీత్యా చూచి సహకార వ్యవసాయంవల్ల భారీనిర్వహణచేత ఖర్చులు తగ్గి ఉత్పత్తి అధికం అవుతుందని చెప్పబడుతున్నప్పటికి వాస్తవ పరిస్థితులను పరికించినప్పుడు దానికి భిన్నంగా జరిగే అవకాశం ఎక్కువ ఉన్నట్లు తేలుతున్నది. సహకార వ్యవసాయంవల్ల ఆ సంఘంలోని పనివారిమీద పరోక్షంగా ప్రసరించే ఫలితాలవల్ల ఉత్పత్తి పడిపోవటం, ఖర్చులు పెరగటం మాత్రం జరుగుతుంది.

V

కాని ఇది కేవలం మా వ్యక్తిగతాభిప్రాయం మాత్రమే అని ఎవరైనా మన్నింపులను విమర్శించవచ్చు. సహకార సమిష్టి వ్యవసాయాలవల్ల రష్యాలో వచ్చిన ఫలితాలు, ప్రయోజనాలు భారత దేశంలో రాకపోవటానికి కారణం ఏమిటి అని అమాయకంగా ప్రశ్నించవచ్చు. ఆ దేశాలలో సహకార వ్యవసాయాన్నో లేక సమిష్టి వ్యవసాయాన్నో ప్రవేశపెట్టిన వెంటనే ఉత్పత్తి పెరిగినదని చెప్పబడుతున్నది.

ఈ సందర్భంలో ప్రధాన సందేహం ఒకటి ఉన్నది. ఆ చెప్పబడుతున్న అధికోత్పత్తులకు సమిష్టినిర్వహణకు ఎంతవరకు సంబంధం ఉన్నది అని మనం ప్రశ్నించవచ్చు. కేవలం సమిష్టి నిర్వహణవల్లనే ఆ అధికోత్పత్తి సాధ్యమైనదనటం వివాదాస్పదం. ఆ దేశాలలో సాధించబడిన అధికోత్పత్తికి అనేక కారణాలున్నవి. మనకు లేనటువంటి భిన్నభిన్న పరిస్థితులు దానికి సహాయపడినవి. ఇవన్నీ సమిష్టి

నిర్వహణకు మాత్రమె సంబంధించినవి కావు. సమిష్టినిర్వహణకు వెలిగాఉన్న అనేక కారణాలవల్ల ఆ అధికోత్పత్తి సాధ్యమైంది. మొదటి విషయం ఏమంటె ఆ దేశాలలో సమిష్టి, సహకార వ్యవసాయాలను ప్రవేశపెట్టిన పరిస్థితులే వేరు. అలాంటి పరిస్థితులు ప్రస్తుతం ఎక్కడాలేవు; ముఖ్యంగా మనదేశంలో అసలే లేవు. మన దేశంలో సహకారవ్యవసాయం ప్రవేశపెట్టాలంటె మనస్వతంత్ర జీవను లైన రైతులవలన చాలచిక్కులు, క్లిష్టపరిస్థితులు ఎదురవుతున్నవి. అలాంటివి ఆయా దేశాలలో మొదటిదశలలో వారికిలేవు. దీనికి కారణం ఉన్నది విప్లవాలకు ముందు ఆ దేశాలలోని చిన్నచిన్న రైతులను, వ్యవసాయ కూలీలను పూజారివర్గాలు, జమీందారీవర్గాలు దోచుకొంటు ఉండేవి. వారి దోపిడిలోపడి రాక్షస కొగిలిలోచిక్కి సామాన్యరైతాంగం ఉక్కిరి బిక్కిరి అవుతుండేది. ఆస్థితిలో ఆ దేశాల లోని సామాన్య రైతాంగానికి దోపిడివర్గాలను అంతరించటమె పర మానందం అయింది; ఆ ఆనందంలో వారికి ముందుముందు రానున్న సమిష్టినిర్వహణ విధానాలను అవగతం చేసికొనగల శక్తి అవకాశం లేకపోయింది. క్రూరమైన బాధలకు గురిఅవటంచేత ఆ దోపిడివర్గాలు పతనం కానటమే చాలు ననిపించింది. పైగా విప్లవానంతరం చాల మంది రైతులకు భూములమీద నామమాత్రపు యాజమాన్యపు హక్కులుకూడ ఇచ్చారు. అందుచేత రైతులు తమ శక్తియుక్తుల నన్నింటిని ఉపయోగించి హృదయ పూర్వకంగా కృషిచేసి ఉత్తమ వ్యవసాయ విధానాలద్వారా అధికోత్పత్తులను సాధించసాగారు. వ్యావసాయకులకు తమతమ వృత్తులలో ఇంతటి శ్రద్ధాసక్తులు ప్రబలిన ఆ దశలో కమ్యూనిస్టు ప్రభుత్వాలు రైతులకు కావలసిన సర్వసదు పాయాలు కలిగించి వారిని ప్రోత్సహించినవి. రైతులకు కావలసిన ఋణాలు, వ్యవసాయ పరికరాలు, రసాయనిక ఎరువులు, సాంకేతిక నిపుణులను, ఇంక మరెన్నో సౌకర్యాలను ఇచ్చి ప్రోత్సాహం ఇచ్చినవి. ఆ సమయంలోనే ఆ దేశాలలో ఎన్నో రవాణా సౌకర్యాలు, నీటి పారుదల పథకాలు, వరదనివారణ పథకాలు మొదలైన నిర్మాణాత్మక కార్యకలాపాలు కొనసాగినవి. అందుచేత అంతవరకు దోపిడివర్గాల క్రింద బంధింపబడిన రైతుల సృజనశక్తులను విముక్తంచేసి, వారికి

ఈ విధంగా కావలసిన సర్వసదుపాయాలను అందించటంచేత ఆ దేశాలలో వ్యావసాయకాభివృద్ధి సాధ్యమై అధికోత్పత్తి లభించింది.

దీనిని బట్టి ఒక విషయం మాత్రం మనం గట్టిగా చెప్పవచ్చు. అదేమంటే ఆ అనుకూలపరిస్థితులలో సంపూర్ణ రైతాంగ యాజమాన్యమే కనుక అమలులో ఉన్నట్లయితే, లేక రైతు స్వామ్యాన్ని అంగీకరించి ప్రోత్సహించినట్లయితే, ఇంతకంటె ఎన్నో అధిక ప్రయోజనాలు ఫలితాలు లభించి ఉండేవి. కాని విచిత్రమైన స్థితిగతులవల్ల రైతులలో కలిగిన శ్రద్ధాసక్తులు కేవలం తాత్కాలికాలు మాత్రమే. వాటిని కలకాలం ఉండేటట్లు చేయాలంటె ఆ విచిత్ర స్థితిగతులను కృత్రిమంగా సృష్టిస్తూ ఉండవలసి ఉంటుంది. మామూలు పరిస్థితులు ఏర్పడగానే ఆ శ్రద్ధాసక్తులు అంతరించక తప్పదు; ఆ కమ్యూనిస్టు దేశాలలోనే ఇలాంటి పరిణామం స్పష్టంగా గోచరించినది గదా! యుగోస్లావియా, పోలెండ్, బల్గేరియా మొదలైన దేశాలలో ఇటీవల కొంతకాలం నుంచి వ్యవసాయరంగంలో కనిపిస్తున్న పరిణామాలు ఆ కృత్రిమ పరిస్థితులు అంతరించినవని సూచిస్తున్నవి. కాని కమ్యూనిస్టు చైనాలోని పరిస్థితులు మాత్రం ఇంకా ఆ కృత్రిమ పరిస్థితులే ఉన్నట్లు తెలుపుతున్నవి.

మన దేశంలో ప్రవేశపెట్టబోతున్న భూసంస్కరణల ఫలితంగా కమ్యూనిస్టు దేశాలలోవలె విచిత్ర స్థితిగతులు ఏర్పడతాయని మన ప్రణాళికాకారులకు నమ్మకం ఉండి ఉండాలి. ఆ నమ్మకం చేతనే సహకార వ్యవసాయంలో రైతులు, కూలీలు కూడ సమానమైన శ్రద్ధాసక్తులను ఉత్సాహప్రోత్సాహాలను ప్రదర్శిస్తున్నారని వారు భావించి ఉండవచ్చు. కాని ఈ సందర్భంలో ఒక విషయంమాత్రం మరిచిపోకూడదు. మన దేశంలో సొంత భూకమతాలున్న వారిలో మధ్యతరగతి రైతులు నూటికి 50 మంది ఉన్నారు. ఆ కారణంచేత మన దేశ వ్యవసాయరంగంలో వర్గపోరాటాలు, ప్రయోజనాలు అంతగా లేవు. మనం ప్రవేశపెట్టనున్న భూసంస్కరణలు కూడ విపరీత పరిస్థితులను సృష్టించే విధంగా మనం చేయబోవటంలేదు. కాబట్టి మామూలు పరిస్థితులలో రైతులు ఎలా భావిస్తుంటారో అలాంటి స్థితిగతులు

మాత్రమె ఈ దేశంలో మనకు లభిస్తాయి కాని కృత్రిమంగా సృష్టింప బడ్డ విపరీత పరిస్థితులు ఉండవు. రైతులు మామూలు రైతులుగానే సహకార వ్యవసాయాన్ని పరికించి పరిశీలిస్తుంటారు.

ప్రస్తుత రైతాంగ వ్యవసాయ విధానాన్ని మార్చివేయటం కోసం దేశవ్యాప్తంగా ఒక ఉద్యమాన్ని లేవదీసి సహకార వ్యవసాయాన్ని స్థాపించాలంటె అలాంటి ప్రయత్నం వల్ల ఆర్థికంగా అనేక అనర్థకాలు, విషఫలితాలు కలుగుతాయి ; అంతటితో ఆగక సాంఘికంగా అభివృద్ధినిరోధకత్వం ఆవరిస్తుంది. అసలు ఈ సహకార వ్యవసాయం అనే దానిని రాజకీయంగా ప్రజాస్వామ్యం ఉన్న దేశంలో ప్రవేశపెట్టనున్నా మని గుర్తించటం అవసరం. రాజకీయ ప్రజాస్వామ్యం ఉన్నప్పుడు భిన్నాభిప్రాయాలు, అనేక రాజకీయపక్షాలు, సాంఘికపక్షాలు, వాక్స్వాతంత్రం ఆదిగాగల స్వేచ్ఛ లుంటూనే ఉంటాయి. ఇలాంటి సంఘంలో సహకారవ్యవసాయం కొనసాగనలసి ఉంటుందని గమనించటం అవసరం. ఇలాంటి వాతావరణంలో సహకారవ్యవసాయం కొనసాగాలంటె నియంతృత్వదేశాలలో కనిపించని అనేకమైన పరిపాలనాసమస్యలు, చిక్కులు ఎదురుకాక తప్పదు. పనిపాటల తీరుతీయాలను నిర్ణయించటం చాల క్లిష్టసమస్య. దీనికి నిర్దిష్టపరిష్కారమార్గం లభించదు. సహకార వ్యవసాయం నిజంగా సమర్థవంతంగా సాగాలంటె ప్రజలలో పరస్పరసహకారం, సౌభ్రాతృత్వం ఎంతగా కలిసి ఉంటవో తెలిసికొనటానికి ఇది ఒక్క ఉదాహరణ మాత్రమే. ఇలాంటి చిక్కులు అనేకం ఎదురవుతవి. ఎవరికి ఏ యే పనులను అప్పచెప్పటం మొదలైన చిక్కులనేకం ఉన్నవి. మానవ ప్రవృత్తిలో ఎన్ని బలహీనతలు ఉన్నవో మనకు తెలియనిది కాదు. సహకారవ్యవసాయం ప్రస్తుతం మానవ ప్రవృత్తులమధ్య నడవవలసి ఉన్నది. అంతేకాని మానవ ప్రవృత్తే మారిపోతుందని, ఆ మారినప్రవృత్తిలో ఇది పనిచేయనున్న దని భావించే వీలులేదుకదా ! సహకార వ్యవసాయంవల్ల దానిలో ఉన్న పరిపాలనాసమస్యలు, ఇతరచిక్కులు కారణంగా రాజకీయాధికార దాహం, కులద్వేషాలు, ముఠాతత్వాలు ప్రబలం కాకుండ ఉంటవా ?

ఇలాంటి అవాంఛనీయ పరిణామాలకు సహకారవ్యవసాయం దోహద కారికాకుండ ఉంటుందా? సహకారవ్యవసాయంలో ఆయా పనులను వారివారికి అప్పచెప్పే పనినే ఉదాహరణగా తీసికొని చూడండి. సహకార వ్యవసాయసంఘసభ్యులను కొన్ని చిన్నచిన్న సంఘాలుగా విభజించి ఒక్కొక్క సంఘానికి ఒకనాయకుని నియమింపవలసి వస్తుంది. ఆ సభ్యులందరు ఆ నాయకుని అదుపాజ్ఞలలో పనిచేయవలసి ఉంటుంది కదా! ఆతని ఆదరాభిమానాలు సంపాదించటం కోసం నానాయాతనలు పడాలి. ఇలాంటి అవకాశాలు ఉండటంచేత వ్యక్తిద్వేషాలు, అధికారదాహాలు మొదలైన అవాంఛనీయ పరిణామాలు పెరగటం సహజం. ఒకరి ఆజ్ఞలకు లోబడటమో లేక ఒకరిని ఆజ్ఞాపించటమో ప్రతివ్యక్తికి తప్పనిస్థితి ఏర్పడుతుంది. తమకాళ్ళమీద తాముని లబడగల ఆర్థికబలం అందించగల రైతుస్వామ్యం అంతర్థానం కావటంచేత ఆ సంఘంలోని వ్యక్తికి, సభ్యులకు ఇలాంటి విషపరిణామాలను వ్యతిరేకించి నిలబడగలశక్తి ఉండదు. జీవికకోసం, బ్రతుకుతెరువుకోసం ఈ సభ్యులు తమనాయకుల ఆజ్ఞలకు కిమ్మనకుండ దాస్యం చేస్తూ జీవించవలసివస్తుంది. అలాంటి పరిస్థితులలో ఒకరితో ఒకరు సహకరించటానికి ప్రజలకు స్వేచ్ఛ ఉండదు. సహకరించటం తప్పనిసరి అవుతుందే తప్ప అది ఐచ్ఛికసహకారం అనిపించుకోదు.

VI

సహకార వ్యవసాయంవల్ల రాగల పరిణామా లన్నింటిని పరిశీలించగా వాటిఫలితాలు ఈ క్రింది రెండు విధాలలో ఏదో విధంగా ఉంటాయని తేలుతుంది.

1. సహకారవ్యవసాయం చివరకు సమిష్టివ్యవసాయానికి దారి తీయవచ్చు. ప్రస్తుతపరిస్థితులను సహకారవ్యవసాయ తత్వాన్నిబట్టి చూచినప్పుడు ఇదే తార్కికపరిణామంగా తోస్తున్నది. సహకారవ్యవసాయసంఘాలు ఆర్థికంగా ప్రభుత్వం మీదనే ఎక్కువగా ఆధారపడుతుంటవి; ఋణ సౌకర్యాలకోసం మార్కెటింగ్ వసతుల కోసం

ప్రభుత్వం వంకకే ఎదురు చూస్తూ ఉంటవి. సాంఘికంగా పరిశీలించినపుడు ఆ సంఘంలోని సభ్యులలో విచ్చిక సహకారం ఉండదు. అందుచేత సహకారవ్యవసాయ సంఘాలు విఫలమై విచ్ఛిన్నం కాకుండ ఉండటం కోసం ప్రభుత్వం కల్పించుకొని వీటిని రక్షించవలసి ఉంటుంది. ఋణ సహకారసంఘాలలో ప్రభుత్వభాగస్వామ్యం అనివార్యం అయినట్లుగానే వ్యావసాయక సామర్థ్యాన్ని అభివృద్ధిచేయటం కోసమన్న వంకతో సహకారవ్యవసాయంలో కూడ ప్రభుత్వభాగస్వామ్యం, అధికార నిర్వహణ ప్రవేశించవచ్చు. ఈ విధంగా ఈ సంఘాలలో ప్రభుత్వప్రాబల్యం, పలుకుబడిఅధికారం ఒకప్రక్క అధికమవుతూ మరొకప్రక్క ఆ సంఘసభ్యుల వ్యక్తిత్వం క్రమంగా అంతరించిపోయి, క్రమంగా వ్యవసాయం కూడ ఒక ప్రభుత్వశాఖగా మారిపోవచ్చు.

2. కేపిటలిస్టువర్గమో లేక బూర్జువావర్గమో ప్రభుత్వాన్నే తనపలుకుబడిలో పెట్టుకొన్న, లేక సొంతసేద్యంచేయని భూస్వాములు సహకారవ్యవసాయవిధానాన్ని తమ ప్రాబల్యానికి లోనుచేసికొని ప్రభుత్వానికి ప్రవేశం లేకుండ చేసినా చివరకు దీని ఫలితంగా సహకార వ్యవసాయక్షేత్రాలు కేపిటలిస్టు క్షేత్రాలుగా మారిపోతవి. అలాజరిగినప్పుడు సహకారవ్యవసాయ సంఘాలలో భూములరూపంగానో, ధనరూపంగానో వాటాలున్నవారు మిగిలినవారిని తమ అదుపాజ్ఞలలో పెట్టుకొని వ్యవహరిస్తారు. అలాంటప్పుడు దినభత్యపుకూలీలకు వీరి ఆజ్ఞలను శిరసావహించి పనిచేయవలసి వస్తుంది తప్ప సమాన ప్రతిపత్తిగల సభ్యులుగా ఉండేవీలుండదు. సహకారవ్యవసాయసంఘంలో అధికభాగం పేర్లు (ధనరూపంలోను భూములరూపంలోను) ఉండటం మూలంగా భూస్వాముల పలుకుబడి దానిలో అధికంగా ఉంటుంది. ఆ పలుకుబడిని వినియోగించుకొని ఈ కొత్తభూస్వాములు సహకారవ్యవసాయసంఘం నుంచి తమపేర్లకు కావలసిన లాభాలను పొందటమే కాక మేనేజర్లుగా మరితర ఉద్యోగులుగా కూడ ఉండి ఆ పదవుల క్రింద నెలసరి జీతాలు కూడ గుంజుతారు. భారతదేశంలో సొంత భూకమతాలున్నవారు ఏర్పాటు చేసిన అనేక సహకారసంఘాలలో ఈ పరిణామాలు ద్యోతకమైనవి. భూవసతులపై రానున్న గరిష్ఠపరి

మితులనుంచి తప్పించుకొని పోవటం కోసం పెద్దపెద్ద భూస్వాములు ఇలాంటి సంఘాలను ఇటీనల చాల స్థాపించారు. ఈ సంఘాలలో చాల వాటిలో వాస్తవంగా శ్రమించి సేద్యం చేస్తున్నది కూలీలు పాలేరులే గాని సంఘసభ్యులుగాదు. సర్. మాల్కొలమ్ డార్లింగ్ అంతటివాడు 'భారత దేశంలోని సహకారోద్యమంలోని కొన్ని విషయాలపై తన నివేదిక'లో ఈ సత్యాన్నే బట్టబయలు చేశాడు. కొన్ని రాష్ట్రాలలోని సహకారవ్యవసాయ సంఘాలను గురించి పరిశీలిస్తూ ఆయన ఇలా వ్రాశాడు. "ఈ సంఘాలలో జీతభత్యాలతో ఎల్లప్పుడు కూలీలతో పనిపాటలు చేయించటం సాధారణమై పోయినట్లున్నది. ఇలా కూలీలతో పనిపాటలను నిర్వహించే సంఘాలు భూస్వాములవలె తయారు కావటం తప్ప అంతకు మించి చేసేది పెద్దగా కనిపించదు....కాలానికి వ్యతిరేకంగా పై పై అలంకారాలకు అవకాశం ఇయ్యటం ప్రణాళికలలోని ప్రమాదం ఒకటి. (పుట 20)

స్వయంకల్పిత వృత్తితో సొంతభూములను సేద్యం చేసికొనే రైతులు ఈ రెండు సందర్భాలలోను అదృశ్య మవుతారు. వారితో పాటు ప్రజాస్వామిక విధానం కూడ సంఘం నుంచి అంతరిస్తుంది.

అధ్యాయం - 10

పునస్సమీక్ష

ఇది చివరి అధ్యాయం. సహకారవ్యవసాయంలోని సాధకబాధకాలను, ఫలితాలను, పరిణామాలను ఇదివరలో విపులంగా పరిశీలించాము. సహకారవ్యవసాయంవల్ల తార్కికంగా నిష్పన్నం కానున్న స్థితిగతులను వివరించాము. పాఠకుల సౌకర్యార్థం వీటినన్నిటిని ఒక చోట చేర్చితే బాగుంటుందని ఈ అధ్యాయంలో ఆ పని చేస్తున్నాము.

I

విడివిడిగా ఉన్న భూకమతాలను కలిపి ఏక ఖండం చేయటంతో సహకారవ్యవసాయక్షేత్రాలు ఏర్పడతాయి. ప్రస్తుతం సొంతభూకమతాలను స్వయంగా సేద్యంచేసికొంటున్న చిన్నచిన్న భూకమతాల రైతులను తీసివేయటం కోసం ఈ సహకారవ్యవసాయం ఉద్దేశింపబడింది. వ్యవసాయరంగంలో ప్రస్తుతం కనిపిస్తున్న సాంఘిక ఆర్థిక అనర్థకాలను తొలగించటానికి సోషలిస్టు పద్ధతి సమాజ వ్యవస్థను స్థాపించటానికి ఈ నూతన విధానం సహాయకారి అవుతుందని అంటున్నారు. కాని ఈ సమస్యను గురించి ఇలా ఆలోచించటానికి కొన్ని అపోహలు, అవాస్తవికాదర్శాలు ఆధారంగా ఉన్నట్లు అనిపిస్తున్నవి. ఈ అపోహలకు అవాస్తవికాదర్శాలకు వాటివాటి చారిత్రక పరిణామాలు, ఫలితాలు ఉన్నవి.

భారీనిర్వహణవలన లాభాలు లభించగలవన్న సూత్రము వ్యవసాయాన్ని సంఘపరం చేయాలన్న సూత్రం – అంటే సొంత ఆస్తులను బహిష్కరించాలన్న సిద్ధాంతం – సహకారవ్యవసాయ సిద్ధాంతానికి ఆధారాలు. ఈ రెండు సూత్రాలలోను వ్యవసాయం అనేది కేవలం ఒక ఆర్థికవ్యవహారమే అన్న అపోహ మూలసూత్రం. ఇలా వ్యవసాయాన్ని ఆర్థికవ్యవహారంగా మాత్రమే చూచే చారిత్రక సంబంధం

తెలిసికొనవలసి ఉంటుంది; భారీ నిర్వహణవలన ప్రతి రంగలోను లాభాలు సిద్ధించగల వన్న ఈ సిద్ధాంతం ఉన్నస్థితిగతులలో మార్పులు అనావశ్యకాలుగా భావించే కేపిటలిస్టు ఆర్థికవేత్తలు సృష్టించి పెంపొందించారు. ఈ కేపిటలిస్టు ఆర్థికవేత్తలు తమసిద్ధాంతాన్ని నిర్మించటంలో మానవునిలోని ఆర్థికాంశాన్ని మాత్రమే ప్రధానంగా గణించారుకాని మానవునికి కావలసిన ఇతరవిషయాలను వీరు గమనంలోకి తీసికొన లేదు. ఈ కేపిటలిజం అంతర్ధానమైన తరువాత దశను ఊహించి రూపొందించటం కోసం యత్నించిన మార్క్సుకూడ వీరి సిద్ధాంతలో ఉన్న ఈ అంశాన్ని పరిశీలించకుండానే గ్రహించాడు. తాత్విక రంగంలో 'హెగెల్' ప్రతిపాదించిన గతితర్కాన్ని స్వీకరించినట్లుగానే కేపిటలిస్టుల ఈ ఆర్థికసూత్రాన్ని కూడ మార్క్సు స్వీకరించాడు. తాను రూపొందించ దలచిన విలువను గురించిన శ్రామికసిద్ధాంతాన్ని అభివృద్ధిచేయటానికి ఈ సూత్రం తార్కికంగా సహాయపడటంచేత 'మార్క్సు' దీన్ని స్వీకరించటం జరిగింది. ఈ రెండు (కేపిటలిస్టు, కమ్యూనిస్టు) సిద్ధాంతాల ప్రవక్తలు కూడ మానవుడు కేవలం ఆర్థిక జీవి అన్న సూత్రంతోనో తమసిద్ధాంతాలను ప్రారంభిస్తా రని గుర్తించటం అవసరం. అందుచేతనే వీరిరువురు కూడ వ్యవసాయాన్ని కేవలం ఆర్థిక వ్యవహారంగా మాత్రమే పరిగణిస్తారు. కాని వారి అంతిమాశయాలు మాత్రం దీనికి భిన్నంగానే ఉంటవి. వీరిరువురికి కూడ వ్యవసాయమనేది దానిలో పనిచేస్తున్న వారికి ఆర్థికాదాయం లభింపచేసే మార్గం మాత్రమే. ఇతర విధాలైన ఉత్పత్తి సాధనాలకు – ముఖ్యంగా ధనమె ఉత్పత్తి సాధనం – భూకమతానికి వీరిదృష్టిలో ఎలాంటి భేదము ఉండదు. వీరికి ఇలాంటి విశ్వాసాలుండటం చేత ఈ రెండుసిద్ధాంతాలవారు కూడ పైకాంగ కుటుంబ ఆర్థికవ్యవసాయానికి ముడివడిఉన్న సాంఘికవిలువలను ఆర్థికేతర ప్రయోజనాలను పూర్తిగా విస్మరిస్తారు. అందుచేత సంప్రదాయక కేపిటలిస్టు – ఆర్థికవేత్తలు వారి విశ్వాసాలను గురించి పరిశీలించుకోకుండ, ఆ విశ్వాసాలు అపోహలను గమనించకుండ వాటిని విచక్షణారహితంగా దేశకాలాలను, స్థితిగతులను కూడ గమనించకుండ ఆచరణలో పెట్టటానికి యత్నిస్తుంటారు. కమ్యూనిస్టు ఆర్థికవేత్తలు, కేపిటలిస్టు ఆర్థికవేత్తలు భిన్న

భిన్న ప్రయోజనాలకోసం రైతులను భూములనుంచి వెళ్ళగొట్టటంలో మాత్రం ఏకీభవిస్తారు. భారీనిర్వహణలోని లాభాలకోసమని కేపిటలిస్టులు, ఈ లాభాలకోసం పైగా కొన్ని రాజకీయ ఆదర్శాలకోసం కమ్యూనిస్టులు రైతులకు మాత్రం భూములమీద ఆధిపత్యం లేకుండా చేస్తారు. భారతదేశంలో సహకారవ్యవసాయాన్ని ప్రవేశపెట్టా లనటానికి ఇలాంటి వారే, ఇలాంటి అపోహలే కారణం.

సహకారవ్యవసాయాన్ని ప్రవేశపెట్టాలనుకొంటున్నవారు తమ విశ్వాసాలను సహేతుకంగా పరిశీలించి రుజువు చేసికొన్న పక్షంలో సహకారవ్యవసాయం అంటె తాము అనుకొంటున్న స్వర్గం కాదని దాని వెనుకవైపు మరొకటి ఉన్నదని గ్రహించగలరు; అలా గ్రహించినపుడు దేశప్రజలకు ముఖ్యంగా రైతులకు ఇంతటి అన్యాయం చేయ సాహసించలేరు. రైతాంగకుటుంబ ఆర్థికవ్యవస్థలోని అభ్యుదయ ప్రవృత్తిని, బలాన్ని పరిశీలనాపూర్వకంగా సూచించటమే ఈ గ్రంథం ఉద్దేశం. దేశప్రజలు, జాతీయప్రణాళికాకారులు వ్యవసాయం గురించి మరొకసారి జాగ్రత్తగా ఆలోచించటానికి సహాయకారులు కాగలరని ఈ సూచనలతో గ్రంథం ప్రారంభమయింది.

II

ఈ వ్యవసాయవృత్తితో రెండు ప్రధానాంశాలు ముడివడి ఉన్నవి. ఆర్థిక, ఆర్థికేతర అంశాలు రెండు కూడ సమానప్రాధాన్యం గలవె. వ్యవసాయవృత్తిలో ఇవి రెండు ఉన్నవి. కాని దీనిలోని ఆర్థికేతరాంశాన్ని మనవారు చాల ఎక్కువగా విస్మరిస్తున్నారు; గత అధ్యాయంలో ఈ విషయమె చూచాం. నిజానికి ఒకవ్యక్తి ఎంత ఉత్పత్తి చేస్తున్నాడు అనేదే కాక ఎలా ఉత్పత్తి చేస్తున్నాడు అనే రకం కూడ ప్రధానంగానే ఆలోచించవలసినదె. రైతాంగకుటుంబ సేవ్యంలో సాగులో ఉన్న వ్యవసాయంవల్ల ఆర్థికాదాయాలే కాక వ్యవసాయజీవులకు మరెన్నో ఆర్థికేతరప్రయోజనాలు కూడ లభిస్తున్నవి. స్వయంకల్పితవృత్తిగౌరవం, నిర్వాహకవర్గానికి లోబడ

నవసరం లేకుండ స్వేచ్ఛాస్వాతంత్రాల్యాలు, దినభత్యపుకూలితనం తప్పి పోవటం లభిస్తున్నవి. భూములమీద కుటుంబయాజమాన్యం ఉండటం కారణంగా మానసికసంతోషం, సంతృప్తి సాధ్యమవుతున్నవి. ఇలాంటి ఆర్థికేతర ప్రయోజనాలు ఇంతగా లభిస్తుండటం చేతనే రైతాంగ వ్యవసాయం ఒక జీవిత విధానంగా ఉంటున్నది. ఆర్థిక దృష్టి ఉన్నప్పటికి అంతకంటె అధికంగా జీవిత విధానంగానే బలపడుతు వచ్చింది. ఇటువంటి సాంఘిక ఆర్థిక సమ్మిళిత కృషివల్ల రైతుల మానసిక కృషికి, శారీరక శ్రమకు సామరస్యం కుదురు తున్నది; ప్రజల శరీరాలు, మనసులు కూడ సుఖసంతోషాలుపొంది వికసించ గలుగుతున్నవి. నానాటికి కేంద్రీకృతమై పోతున్న ఆధునిక సంఘంలో ఇలాంటి విశిష్ట విధానాలుండటం ఎంతఅవసరమో పరిశీలకులు తేలికగాగమనించగలరు. కాని దురదృష్టవశాత్తు కమ్యూనిస్టు కేపిటలిస్టు సిద్ధాంత కారులిరువురు కూడ రైతాంగ వ్యవసాయంలోని విశిష్టమైన ఆర్థికేతర ప్రయోజనాలను గమనించకుండ త్రోసివేశారు.

అలా త్రోసివేయటంలో కుటుంబవ్యవసాయంవల్ల లభించగల సాంఘికప్రయోజనాలు, జాతీయ ఉత్పత్తులుకూడ విస్మరించబడినవి. ఇలా చేసినందువల్ల రాగల ఫలితాలు ఎలాఉంటాయో కమ్యూనిస్టు, కేపిటలిస్టు దేశాలలో బాగా తలకెక్కినవి. ఆ దేశాలలో సాంఘిక శక్తులలో ఉన్నఅసమానత, ఆర్థిక విషమస్థితి, ఆ దేశాల ప్రజల మానసిక అశాంతి, అసంతృప్తి అన్నీకూడ వారి తప్పుడు విధానం ఫలితాలే. స్వయంకల్పిత వృత్తిలో శ్రమిస్తున్న ప్రజలకు ఆ అవకాశం లేకుండ చేసి, రైతులకు, చిన్నచిన్న చేతివృత్తుల వారికి ఉన్న కుటుంబ ఆర్థికవ్యవస్థను విచ్ఛిన్నం చేయటం వల్లనే ఆ దేశాలలో ఇలాంటి నష్టాలు వాటిల్లినవి. కాబట్టి వ్యవసాయరంగంలో ప్రతిపాదించనున్న ప్రతి సంస్కరణ ఈ విషయాన్ని గమనించి తీరాలి; వ్యవసాయంలో ఆర్థిక, ఆర్థికేతర అంశాలు సమ ప్రాధాన్యంతో ఉన్నవని ముందు గమనించి తదనుగుణంగా సంస్కరణ పూనుకోవాలి. మనదేశంలో సహకారవ్యవసాయం ప్రవేశపెట్టాలంటున్నారుగదా! ఈ ప్రవేశపెట్టనున్న సహకారవ్యవసాయం ప్రస్తుతం

వస్తున్నదానికంటె అధికమైన ఆర్థికలాభాలను రైతులకు అందించే టట్లుగా ఉండాలి. ప్రస్తుతం స్వయంకల్పిత వృత్తివల్ల లభిస్తున్న దానికంటె ఎక్కువ సాంఘిక ప్రయోజనాలను అందించేదిగా ఉండాలి. ఈ రెంటిలో ఏది లోపించినా సహకారవ్యవసాయం నూతన అనర్థ కాలకు మాత్రమే ఆశ్రయమిచ్చినది అవుతుంది.

రెండవ విషయమేమంటె వ్యవసాయాన్ని సాంఘికరించటం అంటె వ్యక్తిగత ఆస్తిని రద్దుచేయటమే అని భావించటం సంప్ర దాయక సోషలిస్టుల సిద్ధాంతాలను అంధంగా అనుసరించటం అవుతుంది. ఇలాంటి భావాలు యూరప్ దేశాలలో అక్కడి చారిత్రక పరిస్థితులను బట్టి పుట్టినవి. మనం కూడ ఇలాగే భావించాలనుకోవటం పొరపాటు; ఒకవేళ అలా చేసినా అది వారి సిద్ధాంతాలను అక్ష రాలతో అర్థం చేసికొన్నట్లే అవుతుంది గాని సోషలిజం యొక్క ఉద్దేశాన్ని గ్రహించినట్లు కాదు. సోషలిజం యొక్క సారాంశం ఏమిటి? ఒక మానవుని మరొక మానవుడు దోపిడిచేసే వీలులేకుండా చేయటం, వారి వారి వ్యక్తిత్వాలను పెంపొందించు కోవటానికై వారివారి సాంఘిక ఆర్థిక స్థితిగతులతో నిమిత్తం లేకుండా సర్వులకు సమానావకాశాలు కలిగించటం సోషలిజం ముఖ్యోద్దేశం. చారిత్ర కంగా వీటిరెంటికి సంబంధం ఉన్నప్పటికి దోపిడి అనేది వ్యక్తిగత ఆస్తికి ప్రత్యేక లక్షణం కాదు. ఒక మానవుని మరొక మానవుడు దోపిడిచేయటానికి వీలులేని కుటుంబ కమతాల వంటి వ్యక్తిగత ఆస్తులు కొన్ని ఉన్నవి; పైగా వీటిలో ఆయా వ్యక్తులు తమ వ్యక్తి త్వాన్ని వికసింప చేసికోవటానికి ఎన్నో అవకాశాలున్నవి. కాబట్టి ఒక మానవుని మరొక మానవుడు దోచుకోవటానికి కొన్ని సాంఘిక స్థితిగతుల ప్రాబల్యమె కారణం. ఆ స్థితిగతులను తొలగించుకొన్న పక్షంలో దోపిడికి అవకాశం లేకుండ చేయవచ్చు.

సొంతయజమానులుకాని వ్యవసాయకూలీలను దోపిడిచేయటం ఈ దేశంలో కొంతఉన్నది. ఈ ఉండటానికి అనేక కారణాలు కూడ ఉన్నవి. జమిందారీవిధానం, భూవసతులు ఎచ్చులొచ్చులతో ఉండ టం, ఇతరత్రా పనులు దొరకకపోవటం, జనసంఖ్య అధికం అవుతున్న

ప్పటికి పనులు పెరగకపోవటం ఇందుకు కారణాలు. ఈ ఉన్న దోపిడిని కూడ అంతం చేయటానికి అనేక మార్గాలు మన కున్నవి. శాసనాలద్వారా భూమిని పంపకం చేయటం, భూవసతులకు గరిష్ఠ పరిమితులను నిర్ణయించి అమలుచేయటం, వ్యవసాయకూలీలకు కనీస వేతనాలు నిర్ణయించటం, గ్రామికులకు ప్రతిఫలం ముట్టచెప్పటం, సాంఘిక భీమా వసతి కలిగించటం, కుటీరపరిశ్రమలు పెంపొందించటం, ఇతర రంగాలలో కూలీలకు పనిపాటలు దొరికేటట్లు చేయటం మొద లైన కార్యక్రమాలాపాలను చేపట్టి పది లేక పదిహేను సంవత్సరాలలో వ్యవసాయరంగంలో దోపిడికి అవకాశం లేకుండ చేయవచ్చు. నిర్వర్తించే సాంఘిక కార్యక్రమాలాపాలను బట్టి భూముల మీద యాజమాన్యముండేలాగ స్థితిగతులను సృష్టించిన పక్షంలో భవిష్యత్తులో కూడ దోపిడికి అవకాశం లేకుండా చేయవచ్చు. భూముల మీద సొంతంగా పనిచేయకుండ వాటిని కౌలుకిచ్చి ఎక్కడో కూర్చుని ఫలితం అనుభవించే వారు ఎక్కువవుతున్నారు. ఇలాంటి వారే వ్యవసాయకూలీల శ్రమను దోపిడిచేస్తున్నారు. కాబట్టి సాధ్యమైనంత వరకు యజమానులే వారి భూములను సొంతంగా సేద్యంచేసికొనే టట్లు సంఘం చూడాలి. ఇది సాధ్యంకానప్పుడు కౌలుదారులే వారు సాగుచేస్తున్న భూములకు యజమానులు కావటానికి అవకాశం కల్పించాలి. విధవలు, ముసలివారు, బాలురు, ఇతర విధాల వికలాంగులైన వారుతప్ప మిలిగిన వారు సొంతసేద్యం చేయటం గాని లేక కౌలుదారులకు భూములను అమ్మివేయటంగాని జరిగేటట్లు చూడాలి. వ్యక్తిగత ఆస్తి విధానంలోనే ఇలాంటి న్యాయసమ్మతమైన సంబంధం ఏర్పరచే అవకాశ మున్నది.

భూమిని కొద్దిమంది చేతులలో కేంద్రీకృతం గాకుండ ఇలా పంచి, సొంత సేద్యం చేసికొనే వారికే యాజమాన్యపు హక్కు లేర్పరచినపుడు ప్రస్తుతం ప్రతిపాదింపబడుతున్న సహకార, సమిష్టి గ్రామదాన, పంచాయతీ విధానాలకంటె మన రైతాంగ విధానం లోనే మంచి ఫలితాలు కలుగుతాయి; వ్యక్తిత్వ వికాసానికి సంఘీ మానికి ఈ విధానంలోనే చక్కని అవకాశాలు లభిస్తవి; జాతి అభి

వృద్ధికి కూడ ఇదే ఉత్తమ మార్గం. దీనికి కారణం ఏమంటె సొంత యాజమాన్య విధానంవల్ల సాంఘి కావశ్యకాలు తీరటమెకాక వ్యక్తి గతావసరాలు వాంఛలు తీరుతాయి. అసలు సాంఘిక సంక్షేమం సాధించట మంటె సంఘంలో సభ్యులైన వ్యక్తుల అవసరాలు కోర్కెలు తీర్చటమె. అలాగే వ్యక్తుల కోరికలు కూడ సంఘానికి వ్యతిరేకంగా ఉండరాదు. సహకార వ్యవసాయంలో కంటె కుటుంబ వ్యవసాయంలోనే వీటిని సాధించటానికి అధికమైన అవకాశాలున్నవి. కుటుంబ వ్యవసాయ విధానంలో స్వయం కల్పిత వృత్తివల్ల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లభించి, వ్యక్తుల సృజనశక్తికి, నిర్వహణ సామర్థ్యానికి స్వయం నిర్ణయాలకు, ధైర్య సాహసోత్సాహాలకు అవకాశం లభించటం చేత ఇవి సాధ్యమవుతవి.

ఆర్థికేతర ప్రయోజనాలను గమనించలేక పొరపాటు పడ్డట్లుగానే భారీనిర్వహణలోని ఆర్థిక లాభాల విషయంలో కూడ పొరపాటు పడ్డవాళ్ళం కాకూడదు. భారీనిర్వహణవల్ల ఆర్థిక లాభాలు సిద్ధించగలవన్న సిద్ధాంతమే తప్పు అని మా ఉద్దేశం కాదు. దానిని తప్పుగా అన్వయిస్తున్నారని మాత్రమే మా అభిప్రాయం. ఈ సిద్ధాంతంలోని మూలభావాన్ని గ్రహించకుండ విచక్షణారహితంగా అంగీకరించి అక్షరాల తు. చ. తప్పకుండ వ్యవసాయానికి అనువర్తింప చేస్తున్నారు. ఇలా చేస్తున్నంతవరకు మాత్రం మన ప్రణాళికాకారులు ఆ సూత్రాల భావాన్నే విస్మరిస్తున్నారు.

వ్యవసాయ సేద్య కార్యకలాపాలకు బహిరంగంగా ఉండె ఋణసౌకర్యాలు, పరికరాలు, ఎరువులు, మార్కెట్ వసతులు మొదలైన వాటిని సహకార సేవాసంఘాలద్వారా ఏర్పరచుకొన్నప్పుడు భారీనిర్వహణవల్ల వ్యవసాయంలో పరిశ్రమలలో కనిపించినంతటి ప్రయోజనాలుండవని ఇదివరలో వివరించి ఉన్నాం. దీనికి కారణం వ్యవసాయం సజీవప్రకృతికల కృషికావటమె అని కూడ గమనించాం. వ్యవసాయక్షేత్రాల విస్తీర్ణాన్ని నిర్ణయించటంలో వ్యవసాయవిధానాలు, పరికరాలు ప్రధానపాత్ర వహిస్తాయని లోగడ తెలిసికొన్నాం. మనవ్యవసాయాన్ని యాంత్రికీకరణ చేయటం ఆచరణసాధ్యం కానంత

కాలం, మానవశ్రమకే ప్రధానాంశంగా ఉంచి మనవ్యవసాయం కొన సాగించాలని మనం ఆశించినంతకాలం భారీ వ్యవసాయక్షేత్రాల నిర్మాణం అన్న ప్రశ్నే ఉదయించదు. మానవశ్రమ ప్రధానాంశంగా సాగే వ్యవసాయంలో భారీనిర్వహణవల్ల న్యూనాలు అధికం కావటం సహజం. అందుచేత చిన్నచిన్న కమతాలమీదనే వ్యవసాయం లాభ దాయకంగా, సమర్థవంతంగా సాగుతుంది. సాధ్యమైనంత తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు తీయగల విధంగా వ్యవసాయరంగంలోని కార్యకలాపాల నిర్వహణను ఏర్పాటు చేసికోవలసి ఉంటుంది. ఇందుకు అనువైన తగుమాత్రపు భూకమతం ఉంటే చాలు. ఈ తగుమాత్రపు భూకమతం విస్తీర్ణం నిర్ణయించటం ఎలా? వ్యవసాయసేద్య కార్య కలాపాలకు భిన్నంగా బహిరంగంగా ఉండే వ్యవహారాలను భారీఎత్తున సహకార సేవాసంఘాలద్వారా నిర్వహించుకొంటు వ్యవసాయపు పనులను మాత్రం చిన్నచిన్న కమతాలమీద చేసికోవటమె లాభ దాయకంగా ఉంటుంది. ప్రపంచానుభవం కూడ ఈ విషయాన్నె రుజువు చేస్తున్నది.

మూడవ విషయం ఏమంటె వ్యవసాయసామర్థ్యం, ఆర్థిక లాభాలు కేవలం భూకమతాల విస్తీర్ణంమీదనే కాక సాంఘిక స్థితి గతులమీద కూడ ఆధారపడి ఉంటవి. సాంఘికస్థితిగతులు నిర్వహణ ఏకాలంలోనైనా సాధ్యమైనంత తక్కువఖర్చుతో అధికోత్పత్తిని సాధించేదిగా ఉండాలి. ఈ విషయాలను మనసులో పెట్టుకొని చూచి నప్పుడు వ్యవసాయరంగంలో రైతాంగ యాజమాన్యమె ఉత్తమ వ్యవస్థ అని తేలుతుంది. దీనికి కారణం ఉన్నది. సజీవ ప్రకృతిగల వ్యవసాయానికి కావలసిన వ్యక్తిగత శ్రద్ధ, పని రైతాంగయాజ మాన్యం ఉన్నప్పుడె లభ్యమవుతవి; పైగా ఆర్థికలాభాలను ఫలితా లను ప్రధానంగా ఎంచకుండ కార్యోత్సాహం ప్రదర్శించటం కూడ ఈ వ్యవస్థలో సాధ్యమవుతుంది. సహకారవ్యవసాయ విధానంలో ఇవి లోపించటంచేత వ్యవసాయోత్పత్తులు తగ్గటం, ఖర్చులు పెరగటం జరుగుతుంది.

సహకారసంఘాలను వ్యవసాయసేద్యానికి కూడ అనువర్తింప చేయాలనటంలో మన ప్రణాళికాకారులు ఈ తప్పునే చేశారు. దిన దినాభివృద్ధి చెందుతున్న మన ఆర్థికరంగావశ్యకాలను తీర్చటానికి తమ సొంతకాళ్ళమీద నిలబడటానికి మన రైతులకు ఆర్థికస్తోమత లేదు; అందుచేత వ్యవసాయరంగానికి సహకారసంఘాలు అత్యంతావశ్యకం అనటంలో ఎలాంటి సందేహం లేదు. కాని స్వయంకల్పిత నృత్తితో జీవిస్తూ స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను ఆశిస్తున్న రైతాంగానికి భూములను ఏకఖండాలుగా చేసి కుటుంబవ్యవసాయాన్ని రద్దుచేయవలసిన స్థితిని తీసికొని వచ్చే సహకారవ్యవసాయం మాత్రం తగిన మందు కాదు. ఇలాంటి సహకారవ్యవసాయం కొన్ని ఆర్థిక ప్రయోజనాలను సాధించ గలిగినప్పటికి ఆ సంఘ సభ్యుల ఆర్థికేతర ప్రయోజనాలను విలువలను విధ్వంసం చేస్తుంది. అందుచేత ఈ మందు మన రైతులకు పనికి వచ్చేది కాదు. భూములను ఏకం చేయవలసిన అవసరం లేకుండా కుటుంబవ్యవసాయం తీసివేయవలసిన అవసరం కూడ లేకుండానే సహకారసేవాసంఘాలవల్లనే సహకారవ్యవసాయంలో రాగల ప్రయోజనాలను సిద్ధింప చేసికొనవచ్చునని గత అధ్యాయాలలో గమనించాం. ఒకవేళ సహకారసేవాసంఘాలకంటె సహకారవ్యవసాయంలో ఏమైనా కొద్దిగా అధికంగా ఆర్థికలాభాలు రాగల అవకాశం ఉన్నప్పటికి ఈ నూతన విధానంవల్ల విధ్వంసమైపోగల స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను, స్వయంకల్పితవృత్తిగౌరవాన్ని మనసులో ఉంచుకొని ఆ కొద్దిపాటి లాభాలకు విలువ కట్టవలసిఉంటుంది. దీనినే ఆచార్య రాజకృష్ణ ప్రభృతులు ఎంత చక్కగా వర్ణించారో చూడండి. "ఈ సహకారం అన్నది ఎక్కడ ఆగాలో ప్రభుత్వం ఎక్కడవరకు వెళ్ళిఆగాలో సహకారవాదులు ధైర్యంతో చెప్పవలసిన సమయం వచ్చింది. లేని పక్షంలో సహకారంపేరుతో, చక్కని పదజాలంతో ప్రభుత్వం క్రమక్రమంగా రైతుల స్వేచ్ఛను హరించి బానిసతనంలోకి దింపుతుంది."*

కాబట్టి రైతాంగ యాజమాన్యం మీద ఆధారపడిన చిన్న చిన్న భూకమతాల వ్యవసాయమే — సహకార సేవాసంఘాల

* Raj Krishna, L. C. Jain and Gopi Krishnan, 'Co-operative Farming—Some Critical Reflections," 1956.

సహాయం ఉన్నప్పుడు – సహకార వ్యవసాయం కంటె ఆర్థికంగాను సాంఘికంగాను కూడ ఉత్కృష్టమైనది. ప్రస్తుత స్థితిగతులలో రైతులు ఇష్ట పూర్వకంగా తమ భూములను ఏకం చేయటానికి అంగీకరించరు. రైతులకు ఇష్టం లేనప్పుడు ఇతర విధానాలను అవలంబించి ఈ భూములను ఏకఖండాలుగా చేయించినప్పుడు ఈ నిర్బంధ విధానాల వల్ల సహకార వ్యవసాయంలో పనిచేసే సభ్యులకు మానసికంగా అసంతృప్తి కలగటం దానితో పనిపాటలలో పాటవం లోపించటం ఆర్థికంగాను సాంఘికంగాను అనేక అనర్థకాలు కలుగటం తప్పదు. కనుక ఆచరణ సాధ్యత దృష్ట్యా పరిశీలించినప్పుడు కూడ కుటుంబ వ్యవసాయమే ఉన్నత స్థానం పొందుతుంది. ఉత్పత్తి పెరగటం కోసం సాంఘిక న్యాయం సాధించటంకోసం భవిష్యత్తులో భారత వ్యవసాయ విధానాలు ఈ క్రింది విధంగా ఉండాలి. 1 ఆర్థికంగా స్వయం పోషకంగా ఉండగల చిన్న భూకమతాలను ఏర్పరచటం. 2 సేద్యం చేసే వారికే భూమిమీద యాజమాన్యం ఏర్పరచటం 3 ఇలా ఉన్న రైతులందరిని కూడ వ్యవసాయ సేవా సహకారసంఘాలక్రిందికి తేవటం.

రైతాంగవ్యవస్థకు వారి కుటుంబవ్యవసాయం మూలం. ఈ రైతాంగ ఆర్థికవ్యవస్థ పైపైవేటురంగంలో ఒక భాగమనో లేక పైపైవేటురంగం యొక్క పొడిగింపు అనో మన జాతీయనాయకులలో అనేకులకు ఒక ప్రమాదపూరితమైన ఆపోహ ఉన్నది. భూకమతాలు రైతుల సొంతం కావటమె దీనికి కారణం కావచ్చు. కాని కేపిటలిస్టు పరిభాషలోని పైపైవేటురంగ కృషికి, రైతుపద్ధతి ఆర్థికవ్యవస్థకు సంబంధమే లేనంత తేడా ఉన్నది. పైపైవేటురంగలోని వ్యాపారస్తులు మొదలైనవారు యజమానులు, కార్మికులు అన్న భేదదృష్టి ధోరణిని అవలంభించి పరులను దోపిడిచేసి లాభం సంపాదించటమె ప్రధానంగా పెట్టుకొంటారు. కాని రైతుపద్ధతి ఆర్థికవ్యవస్థలో దోపిడిక ఆస్కారం లేదు; కుటుంబసభ్యులమధ్య పరస్పర సహకారమె దీనికి మూలం. ఈ సహకారంతోనే రైతుపద్ధతి ఆర్థికవ్యవస్థ నడుస్తుంటుంది. పైపైవేటురంగం, కేపిటలిస్టు విధానం కాని రైతులది కుటుంబఆర్థిక విధానం. పైపైవేటురంగంలో ధనము, భూమి కేవలం లాభసంపాదనకు

మార్గాలుగా మాత్రమె ఉంటవి. కాని కుటుంబ ఆర్థికవిధానంలో ఇవి ప్రధాన గుణాలుకావు; కుటుంబఆర్థికవిధానంవల్ల లభించగల స్వయం కల్పితవృత్తికి, ఆత్మగౌరవంగల జీవితానికి, స్వేచ్ఛాస్వాతంత్ర్యాలకు ఇవి సహాయకారులుగా మాత్రమె ఉంటవి. స్వలాభదృష్టితో నడిచే పై్రవేటురంగం ఆత్మాతిశయంతో సాంఘికంగా చూచినపుడు-బాధ్యతారహితంగా వ్యవహరిస్తుంది. కుటుంబఆర్థిక విధానం అలాంటిది కాదు; ఇది సాంఘికబాధ్యత నిర్వర్తిస్తు సోషలిస్టు పద్ధతితో సాగిపోతుంటుంది. కాబట్టి ఆర్థికవేత్తలు, జాతీయనాయకులు జాతీయ ప్రణాళికాసంఘంవారు మనఆర్థికవ్యవస్థలోని ఈ రంగాన్ని ప్రత్యేకంగా గుర్తించటం అవసరం. ఇప్పటికే చాల ఆలస్యమైనప్పటికి సహకార సేవాసంఘాల సహాయంతో సంపూర్ణంగా వికసించగల ఈ స్వయం కల్పితవృత్తిదారుల కుటుంబఆర్థికవ్యవస్థను ఇప్పుడైనా గుర్తించవలసి ఉన్నది. ఇతర పై్రవేటురంగంకంటె ఈ కుటుంబఆర్థికవ్యవస్థ అభ్యుదయదాయకమైనదని నిస్సందేహంగా చెప్పనచ్చు. ప్రభుత్వరంగం కంటెకూడ ఉపయోగకరమైనది, అభ్యుదయదాయకమైనది అనటంలో కూడ సందేహించ నవసరంలేదు. ఈ కుటుంబఆర్థికవ్యవస్థలో వికేంద్రీకరణకు సంపూర్ణావకాశం ఉన్నది; నిర్వాహకవర్గబాధలకు దీనిలో ఏమాత్రం చోటులేదు. ఇటువంటిరంగాన్ని తప్పక ప్రోత్సహించాలి, అభివృద్ధిచేయాలి.

III

ఇంచు మించు పూర్తిగా పై్రవేటురంగ యాజమాన్యం మీదనే ఆధారపడి ఉన్నప్పటికి మన వ్యవసాయం చాల విషయాలలో మన ఆదర్శాలకు దూరంగా ఉన్నదన్న విషయం మీకు పూర్తిగా తెలుసు. సొంతంగా కష్టించి సేద్యంచేసే పై్రవేటురంగం అభివృద్ధి చెందటానికి భూ ఆస్తులలో ఉన్న అనంత వ్యత్యాసాలు భూములను కౌలుకిచ్చే పరోక్ష వ్యవసాయ విధానం అడ్డు వస్తున్నవి. వ్యవసాయోత్పత్తి కార్యకలాపాలకు సహాయకారులు ఉండగల సహకారసంఘాలు పై్రవేటు లోకంలో అభివృద్ధి చెందవలసినంత త్వరగా పెంపొంద వీలున్నంతటి

సంప్రదాయ దాస్యం బద్ధకం వ్యవసాయరంగంలో ప్రబలి ఉండటం కూడ కారణమే. కాని ఇవి మన వ్యవసాయరంగానికి సహజ లక్షణాలుకావు. రైతాంగంలో తగినంత విద్యావిజ్ఞానాలు లేక పోవటం, సంఘంలో కనీసపు సాంఘిక, ఆర్థిక స్థితిగతులు కూడ లేక పోవటం దీనికి కారణాలు. వ్యవసాయ సేవా సహకారసంఘాలు లేక పోవటంచేత, ప్రభుత్వ సహాయం పూజ్యం కావటంచేత రైతులు ఆర్థికంగా సాంఘికంగా బలహీనపడి పోయారు. ఈ కారణం చేతనే ఋణదాతలు, మధ్యదళారులు వ్యాపారులు మొదలైనవారు కీలక స్థానాలలో ఉండి రైతులను దోపిడి చేస్తున్నారు. వీటి అన్నింటికి మించి వ్యవసాయంలో అవసరాలకుమించి అత్యధికంగా ప్రజలుండటం చేత నిరర్థకవ్యాపారత పెరిగి చాలీ చాలని పనిపాటలతో కాలం వెళ్ళ బుచ్చవలసి ఉండటం ప్రబల ప్రతిబంధకం అయింది. అలాగే వ్యవసాయానికి కావలసిన నీటి సౌకర్యాలు మొదలైనవి లేక పోవటం ఒక అడ్డంకు అయింది. ఈ అన్ని లోపాలు కారణంగా ఉత్పత్తులు అల్పమై పోయినవి; ఉత్పత్తి తగ్గటంవల్ల దారిద్ర్యం ఏర్పడుతుంది. ఈ దారిద్ర్యం తిరిగి ఉత్పత్తులు పడిపోవటానికి హేతువవుతుంది. ఈ విషచక్రంతో వ్యవసాయ వృత్తి ఆర్థికంగా, సాంఘికంగా బలహీనమై పోతున్నది. ఈ దారిద్ర్య విషచక్రాన్ని ముందు అంతమొందించాలి. దీనికి అనువుగా రైతాంగాన్ని పునర్నిర్మించ వలసి ఉన్నది.

రైతులు, ప్రభుత్వం కృషిచేసి దీనిని సాధించాలి. ఇలాంటి ప్రతిబంధకాల నన్నింటిని తొలగించి రైతాంగం సంపూర్ణ వికాసం పొంది, సాంఘిక సంక్షేమానికి సాధ్యమైనంత అధికకృషి చేసే వాతావరణం కల్పించటం ప్రభుత్వానికి నైతికధర్మం. రైతాంగం ప్రస్తుతం ఉన్న దోషాలను సవరించ వలసి ఉన్నది. భూకమతాలకు గరిష్ఠపరిమితులను విధించి తద్వారా రైతాంగంలో సమంజసమైన దృక్పథానికి వీలుకలిగించాలి. కౌలుదారుల రక్షణకు శాసనాలు ప్రవేశపెట్టాలి. భూములు మరీ చిన్న చిన్న ముక్కలుగా చీలిపోకుండ శాసనాలు చేయాలి. రైతాంగాన్ని విద్యావంతం చేసి,అనేక విధాల ప్రోత్సహించి వారిని సహకార సంఘాలలోకి తీసికొని రావలసిన బాధ్యత

ప్రభుత్వం మీద ఉన్నది. వ్యవసాయంలో వస్తున్న అత్యంత అధునాతన విధానాలలో కూడ రైతులకు పరిజ్ఞానం ఏర్పడాలి. ఈ నూతన విధానాలను అనుసరించటానికి రైతులకుకావలసిన సహాయంప్రభుత్వం అందిస్తూ ఉండాలి. అంతేకాక ప్రస్తుతం భూమిమీద ఉన్న ఒత్తిడిని తగ్గించి, వ్యవసాయానికి కావలసిన నీటి సౌకర్యం మొదలైన అవసరాలను తీర్చటానికి కూడ ప్రభుత్వం పూనిక వహించాలి. ప్రభుత్వం ఇలాంటి బాధ్యతలను నిర్వహించటంలో విఫలమైనంతకాలం రైతుల ఉత్పత్తి అల్పంగా ఉంటున్నదని, ఆ విధానమె దోషభూయిష్ఠమైనదని నేరారోపణ చేయటానికి ప్రభుత్వానికి నైతికంగా ఎలాంటి హక్కు లేదు.

వర్షాభావం, వరదలు, తెగుళ్లు మొదలైన వాటినుంచి తట్టుకోవటానికి పంటలను భీమాసౌకర్యం కలిగించటంలోను, సహకార సంఘాలను ఏర్పాటుచేసి రైతుల అవసరాలను తీర్చటంలోను ప్రభుత్వం ముందుకు వచ్చి తన బాధ్యతలను నిర్వర్తించనంతకాలం రైతులు సహకార వ్యవసాయ సంఘంలో ఉన్నా విడిగా ఉన్నా ఉత్పత్తి పెరగటంమాత్రం అసంభవం అని స్పష్టంగా గ్రహించటం అవసరం. ఇక్కడ ఉత్పత్తి పెరగటం అంటె సాలుకి ఒకమనిషి సాధించగల ఉత్పత్తి గాని, ఒక ఎకరాకు రాగల ఉత్పత్తిగాని పెరగదని భావం. కొత్తగా భూమిసాగులోకి వస్తే ఉత్పత్తి పెరగవచ్చు. అది వేరే విషయం. ప్రకృతి విలంబానికి గురైన వ్యవసాయం చితికి పోతున్నప్పటికి శీతకన్ను వేసే ప్రభుత్వ ప్రస్తుత స్థితిగతులలో కుటుంబ వ్యవసాయంకంటె సహకార వ్యవసాయంవల్ల వ్యావసాయ కోత్పత్తులు మరీ దెబ్బతినగల ప్రమాదం ఉన్నది. భూములు మీటలు వేసినా, వరదదెబ్బలు తగిలినా రక్షించకపోవటం, నివారణోపాయాలను చూచి కావలసిన కార్యక్రమాలను చేపట్టకపోవటం అనేది ఎన్నో శతాబ్దాలనుంచి నడుస్తున్న కథ. ప్రాజెక్టులు నిర్మించటానికి అయ్యే ఖర్చులు వచ్చి పైగా లాభం కూడ రావాలన్న వ్యాపార దృక్పథ విధానంవల్ల ఎన్నో శతాబ్దాల నుంచి నీటిపారుదల పథకాలు కూడ నిర్లక్ష్యం చేయబడు తున్నవి. పశుసంపదను

రక్షించటం, పెంపొందించటం, పేదరికంలో మగ్గుతున్న రైతుల బాధ్యతగా భావించబడు తున్నది. ఇటువంటి సౌకర్యాలు రక్షణలు కలిగించిననాడు రైతులు ఎంతో ఎక్కువ ఉత్పత్తిని చూపించగలరు; అధికోత్పత్తి కృషిలో ఎంతో శ్రద్ధాసక్తులను ఉత్సాహాన్ని ప్రదర్శించి తమ భూములను అభివృద్ధి చేయగలరు. అలాంటి అవకాశాలు లభించిననాడు సహకార వ్యవసాయం కుటుంబవ్యవసాయానికి ఏ విషయంలోను సాటిరాలేదు. అలాంటి స్థితి గతులు ఏర్పడినప్పుడు జాతికే ఒక అండగా, అత్యంతావశ్యక భాగంగా రైతులు రుజువు పరుచుకోగలరు.

పైగా బావులను, చెరువులను, చిన్న చిన్న ఉపనదులను, వాన నీటిని ఎక్కడికక్కడే వ్యవసాయానికి ఉపయోగపడే విధంగా నిలవచేసికొని వినియోగించుకొని కొత్తగా ఎంతో భూమిని సాగులోకి తీసికొని రావచ్చు. ఇప్పుడు సాగులోఉన్న భూమిమీద నూటికి 30 పాళ్లు ఇలా పెంపు చేసికొనగల అవకాశాలున్నవి. ప్రభుత్వ ధనంతో సంఘధనంతో రైతుల ధనంతో ఈ విధంగా కొత్త భూమిని సాగులోనికి తీసికొని వచ్చినపుడు ఉత్పత్తి పెరగటమే కాక అనేక అనర్థకాలు అంతరించి పోగలవు. అప్పుడు భూమిమీద ఎక్కువమంది ఉండటానికి అవకాశం ఏర్పడుతుంది; వ్యవసాయానికి సంబంధించిన ప్రాజెక్టులు మొదలైనవాటి నిర్మాణ కార్యకలాపాలలో ఎంతోమందికి వృత్తులు లభిస్తవి; సాంఘిక ఆర్థిక సౌకర్యాలెన్నో ఏర్పడతవి. ఈ విధంగా నిరుద్యోగాన్ని చాలీచాలని పని పాటల బాధలను నివారించవచ్చు. అలాగే డెల్టాప్రాంతాలలోనే కాక వర్షాధార ప్రాంతాలలో కూడ రెండవ పంట వేయటానికి కావలసిన ధనసౌకర్యం, పంటల రక్షణకు భీమా సౌకర్యాలు కలిగించి రైతులను ప్రోత్సహించాలి; తోటలు వేయటాన్ని ప్రోత్సహించాలి; ఇవన్నీ చేయగలిగితే నిరుద్యోగబాధ ఇంకొంత తీరుతుంది. ఇలాంటి పనులకు కావలసిన ఋణ సౌకర్యాలను ప్రభుత్వం మాత్రమే కలిగించగలదు గనుక వ్యావసాయక ఆర్థిక వ్యవస్థలోని ఇలాంటి అభివృద్ధి పథకాలను ప్రభుత్వం, సంఘం మాత్రమే చేపట్టగలవు. వ్యవసాయాన్ని ఇలా అభి

వృద్ధి చేసి అన్ని రకాల పంటలను పండించగలిగిన పక్షంలో నిరుద్యోగ్యం తగ్గి, ఆదాయం పెరుగుతుందనటానికి డెల్టాప్రాంతాలే సాక్ష్యం. మెట్టప్రాంతాలలోకంటె డెల్టాప్రాంతాలలో వ్యవసాయకూలీ జీవన ప్రమాణం అధికంగా ఉండటానికి ఇదేకారణం. ప్రణాళికా సంఘం వారు విధ్వంసకరమైన సహకారవ్యవసాయం గురించి పట్టుపట్టి రైతు పద్ధతి వ్యవస్థపై ఉద్యమం లేవదీయటం కంటె ఈ బాధ్యతలను నిర్వర్తించటంలో తనదృష్టిని ఎందుకు కేంద్రీకృతం చేయరాదు?

ప్రస్తుతం సాగులోఉన్న భూవిస్తీర్ణంలో మూడవవంతుభూమి బీళ్ళుగా, అడవులుగా ఉండి సాగుకి పనికివచ్చే భూమిఉన్నది. రైతుల క్రింద నామమాత్రపు సాగులోఉన్న భూమి కూడ చాల ఉన్నది. నామమాత్రపు సాగు అనటానికి కారణం అది వృద్ధిచెందకపోనటమె; చాలతక్కువరేట్లకు భూమిని కొనటం అమ్మటమె దానికి సాక్ష్యం. ఇలా అభివృద్ధిచెందకుండా ఉన్నభూములను, సాగుకియోగ్యమయ్యే బీళ్లు మొదలైన వాటిని తీసికొని బాగా అభివృద్ధిచేసి భూములు లేనివ్యవసాయకూలీలతో ఆ భూములమీద సహకారవ్యవసాయం ఏర్పాటుచేసి ప్రభుత్వం సంఘం వీరికి ఇయ్యదలచిన సహాయాన్ని అంతా ఇయ్యవచ్చు. ప్రభుత్వము సంఘము ఇలాంటి పరిశోధనలు చేయాలంటె ఈ విధంగాచేయటానికి ఎన్నో అవకాశాలున్నవి. తాము అనుకొంటున్న అనంతమైన సాంఘిక ఆర్థికప్రయోజనాలు, లాభాలు సహకార వ్యవసాయంలో సిద్ధించగలవని వారు విశ్వసిస్తున్నారు. గనుక ఇలాంటి ప్రయోగాలలో వాటిని సాధించి రుజువుచేసి రైతులను ఆకర్షించి మార్గం చూపవచ్చు.

IV

రైతాంగంకూడ తనకర్తవ్యాన్ని గుర్తించాలి; శక్తివంతంగా తయారు కావాలి. దేశకాలాలను గమనించి ఆయా అవసరాలను తీరుస్తూ న్యాయబద్ధమైన సంఘప్రయోజనాలకై కృషిచేయాలి. తను ఆర్థిక వ్యవస్థలో ఇలాంటి సశక్తిక లక్షణాలను ప్రవేశపెట్టుకొని పయనించలేక వెనుకపడిన పక్షంలో సాంఘికాభ్యుదయ సాధనకృషిలో

రైతులు తమ పాత్రను నిర్వహించలేక విఫల మవుతారు. జాతీయ వికాస కేంద్రాలు, కిసాన్ సమ్మేళనాలు ఇచ్చిన అనుభవం దృష్ట్యా చూస్తే రైతులు ఈ నూతన పరిస్థితులను గమనించి మారగలరన్న ఆశమాత్రం ఉన్నది. ప్రభుత్వం ఏలాంటి సహాయం చేసినా సలహా ఇచ్చినా రైతులు ఎంతో ఆనందంతో వాటిని స్వీకరించి వినియోగించుకొంటున్నారు. కనుక మార్పులకు మన రైతాంగం సిద్ధమేనన్న ఆశ కలగటంలో అసహజమేమీ లేదు. కాని రైతులు నూతన విధానాల గురించిన సలహాలను స్వీకరించి నంత మాత్రాన చాలదు. వారిలో శ్రద్ధాసక్తులు ప్రబలి శక్తివంతంగా సజీవంగా కృషిచేయగల కార్యోత్సాహం కావాలి. క్రమబద్ధంగా మన సంఘం పరిణామం చెందటానికి రైతులలో ఈ ఉత్సాహ ప్రోత్సాహాలు కార్యదీక్ష అవసరం.

దేశ ప్రణాళికలు విజయవంతంకావాలంటే రైతులలో పై రెండు విధాల మార్పులు జరగటం అవసరం. వారి దృక్పథాలలో విలువలలో మార్పులు రావాలి. అభ్యుదయసాధనకు అడ్డుగోడలుగా ఉన్న తమ సంప్రదాయాలనుంచి పాతవ్యవసాయ పద్ధతులనుంచి బయటపడటానికి యత్నం చేయాలి. ఉత్తమమైన, శాస్త్రీయమైన తన వ్యవసాయవిధానాలను అవలంబించి నేటి పారిశ్రామికాభివృద్ధి వల్ల ఆవశ్యకమవుతున్న అధికోత్పత్తిని సాధించటానికి కంకణ ధారులు కావాలి. పారిశ్రామికాభివృద్ధిలో తమ మిగులు ఉత్పత్తులే ప్రధాన పాత్ర వహించుతాయి కనుక జాతీయ ఆర్థికాభ్యుదయకృషిలో రైతులు ప్రధానమైన కీలకస్థానంలో ఉన్నారు. ఇలాంటి తరుణంలో తమ బాధ్యతలలో విఫలమైన పక్షంలో రైతు క్షీణించి పోక తప్పదు.

మన రైతులు మరొక విషయం కూడ గమనించ వలసి ఉన్నది. ప్రణాళికాబద్ధమైన మన ఆర్థిక వ్యవస్థలో ఇమడగల విధంగా వారు మారాలి. క్రమబద్ధమైన అభ్యుదయసాధనకు కావలసిన నిర్బంధాలను కూడ గమనిస్తూ ఉండాలి. ప్రభుత్వము, రైతులు పరస్పర సహకారంతో సాహచర్యంతో కృషిచేయాలని దీని తాత్పర్యం. రైతులు ఇలా అభ్యుదయ సాధనకృషిలో పాల్గొనాలంటే ప్రభుత్వ సాధన సంపదలు సంఘ సహకారం రైతులకు లభ్యం కావాలి. అలాగే

రైతులకృషి ప్రభుత్వానికి అందుతూ ఉండాలి. వీరందరు ఏకాకులుగా ఉండటానికి ఇక వీలులేదు. పరస్పరాధార పూరితమైన ఆర్థికవ్యవస్థలో వీరందరు పరస్పరం అర్థం చేసికొంటు పరస్పరం ప్రభావితమవుతు పాటుపడవలసి ఉన్నది. రైతులు ఆస్తిని గురించి తమకున్న సంప్రదాయ దృక్పథాన్ని మరొకసారి పరిశీలించుకొని పునర్నిర్మించుకోవాలి. మారిపోతున్న తమ అవసరాలకు, సంఘావసరాలకు తగినట్లుగా తమ విధానాలను, సంప్రదాయాలను, సంస్థలను నిర్మించుకోవాలి. ఈ నూతనమైన మార్పులను సాధిస్తూనే తమవ్యవస్థవల్ల లభిస్తున్న దోపిడికి ఆస్కారంలేని స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను, భద్రతను నిలుపుకోవాలి. రైతాంగవ్యవస్థలోని ప్రధానలక్షణాలు, లాభాలు ఇవే కనుక ఈ భద్రతను స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను మాత్రం పోగొట్టుకొనకుండ నిలుపుకోవటం అత్యంతావశ్యకం.

V

సోషలిజం, ఆర్థికాభ్యుదయం ఒక్క వ్యవసాయరంగంలో మాత్రమె అవసరమన్నట్లుగా ఇంతవరకు మనం ఒక్క వ్యవసాయరంగాన్ని గురించిమాత్రమె — అది కూడ ఇతరరంగాలతో దానికున్న సంబంధబాంధవ్యాలకు వెలిగా – చర్చిస్తున్నాము. సర్వరంగాలలోను ఆర్థికాభ్యుదయం సాధించాలి. ఇలా సాధించాలంటె వ్యవసాయేతర రంగాలు పెరగాలి. సోషలిస్టు సంఘ ప్రథమ ధర్మం ధనాన్ని సంఘపరం చేయటం. కాబట్టి మన ఆర్థికవ్యవస్థ సమర్థవంతంగా పరిణామం చెందాలంటె సంఘంలోని అన్నిరంగాలను కూడ క్రమబద్ధంగా, సంఘటితంగా మార్పుచేయవలసి ఉన్నది. అలా అన్నిరంగాలకు అనువర్తింపగల విధానంలేని పక్షంలో ఈ మార్పు కేవలం ఒకప్రక్కకు ఒరిగిపోయి మన ఆదర్శానికే వ్యతిరేకమైన ఫలితాలు సిద్ధించగల ప్రమాదం ఉన్నది.

ఇలాంటి సామరస్యపూర్వకదృష్టి, సమన్వయకృషి అవసరమని గమనించలేకపోవటమెకాక మన ప్రణాళికాకారులు రెండునాలుకలతో

మాట్లాడుతున్నారు. ఒకచోట ఒకసూత్రం మరొకచోట ఇంకొక విధానం ప్రతిపాదిస్తున్నారు. ఏవిధమైన దోపిడికి కూడ ఆస్కారం లేని కుటుంబవ్యవసాయ ఆర్థికవ్యవస్థను నిరుత్సాహపరచి, రూపు మాపటంకోసం వ్యవసాయరంగంలో సహకార, సమిష్టి విధానాలను ప్రతిపాదిస్తున్నారు. కాని పరిశ్రమలలో మిశ్రమఆర్థికవిధానాన్ని ప్రోత్సహిస్తున్న దోపిడికి అవకాశం అలవాటు ఉన్న వ్యక్తికి కృషికి గౌరవమర్యాదలుగల ఉన్నతస్థానం ఇస్తున్నారు. సహకారవ్యవసాయంలో అంతర్భూతమైఉన్న సహకారీకరణవిధానాన్ని వ్యవసాయేతరరంగాలలో అమలుచేయాలన్న ఆలోచన కూడ వీరికి లేకపోవటం ప్రత్యేకంగా గమనార్హం. అనేక వ్యవసాయేతరరంగాలకు సహకారాన్ని అనువర్తింపచేయాలని అనుకొన్నారు. కాని ఆ వ్యవసాయేతరరంగాలలోని వారు వ్యక్తికంగా కొనసాగించుకొనె ఉత్పత్తి కార్యకలాపాలకు సహాయపడేవరకు మాత్రమె సహకారాన్ని ప్రవేశపెట్టాలని వీరి ఊహ. వ్యవసాయంలో ప్రతిపాదిస్తున్నట్లుగా వ్యవసాయేతరరంగాలలో వ్యక్తిగత ఉత్పత్తిదారులను తీసివేయాలని కాని, వారి స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను హరించాలనికాని ప్రణాళికాకారులు తలపెట్టటం లేదు. పైగా ఆయా పారిశ్రామికరంగాలలో వ్యక్తిగత శ్రేద్ధకు, పెట్టుబడులకు, కృషికి మన ప్రణాళికాకారులు ఎంతో అవకాశం కల్పిస్తున్నారు. ఇలాంటి పరస్పరవిరుద్ధవిధానాలు ఎలా సహేతుకం అవుతాయో ఎవరికి అర్థం కాదు.

వ్యవసాయరంగాన్ని గురించిన వీరి ఇతరప్రతిపాదనలు కూడ – అంటె భూసంస్కరణలు – ఇలాగే ఉన్నవి. సంవత్సరానికి 3600 రూపాయలకు మించిన వ్యావసాయకాదాయాలపై గరిష్ఠపరిమితులు పెట్టాలని అంటున్నారు. కాని ఇలాగే ఇతర ఆదాయాలమీదకూడ గరిష్ఠపరిమితులు పెట్టాలి అంటె పెట్టటం సంగతి వదలి కనీసం ఆ సూత్రంకూడ వీరు అంగీకరించ లేదు. సంవత్సరానికి 30,000 రూపాయలను మించినప్పుడు పట్టణాలలోని ఆదాయాలకు గరిష్ఠపరిమితి పెట్టాలన్న ప్రతిపాదనను అందుచేతనే ప్రభుత్వం అంగీకరించ లేదు. అభివృద్ధి పథకాలకు ధనం కేటాయించటంలోను, పంచవర్ష ప్రణాళికల

ఫలితాలను అందియ్యటంలోను కూడ రైతులకు ఇలాంటి అన్యాయాలే జరిగినవి. ఈ విషయాన్ని మేము ప్రచురించిన 'ప్రణాళికలు-రైతు' అన్న మరొక గ్రంథంలో సవివరంగా చర్చించాం. సాంఘిక అన్యాయాన్ని అంతమొందించే ప్రయత్నాలలో కూడ కొంతన్యాయం సమన్యాయం తప్పక ఉంటే తీరాలి.

మన ప్రణాళికాకారులు సోషలిస్టు సంస్కరణల విషయమై కేవలం ఒక్క-వ్యవసాయంమీాదనే దృష్టిని కేంద్రీకరించటం వల్ల ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తమై ఏకపక్షాభివృద్ధిమాత్రం జరిగి రైతుల ఆర్థిక స్వాతంత్ర్యం, స్వయంకల్పిత వృత్తిగౌరవం, ఉన్నతస్థానం, సాంఘిక శక్తి అంతర్థానమై పోతవి. ఇలాంటి విధానం సోషలిజానికి మార్గం కాదు; నిర్వాహకులతో పెత్తందారులతో కూడిన ఒక నూతనవర్గం పుట్టుకొనివచ్చి కొత్తరకం దోపిడి చేయటానికి మాత్రమె ఈ విధానం మార్గం వేస్తుంది.

సంపూర్ణము

ది ఓరియన్ట్ పవర్ ప్రెస్, తెనాలి